

# మనకు తెలియని యం.ఎస్

## దేవదాసీ పుత్రిక నుంచి సంగీత సామ్రాజ్ఞి వరకు

టి.జె.ఎస్. జార్జ్

# మనకు తెలియని యం.ఎస్.

## దేవదాసీ పుత్రిక నుంచి సంగీత సామ్రాజ్ఞి వరకు


**టి. జె. యస్.  జార్జ్**


అనువాదం

**ఓల్గా**


హైదరాబాద్ బుక్ ట్రస్టు

| | | |
|---|---|---|
| ధర | : | రూ. 150/- |
| ఆంగ్ల మూలం | : | M.S. Subbulakshmi : The Definitive Biography,<br>TJS George © TJS George 2004, 2016<br>First published in 2004 by Harper Collins India as<br>MS : A Life in Music.<br>Published in 2016 by Aleph Book Company as<br>MS Subbulakshmi : The Definitive Biography |
| కవర్ ఫోటో | : | అవినాష్ పస్రిచ |
| మొదటి ముద్రణ | : | 2017 |
| ప్రతులకు, వివరాలకు | : | హైదరాబాద్ బుక్ ట్రస్ట్,<br>ప్లాట్ నెం. 85, బాలాజీ నగర్,<br>గుడిమల్కాపూర్, హైదరాబాద్ - 500 006.<br>ఫోన్ : 23521849<br>www.hyderabadbooktrust.blogspot.com |

---

| | | |
|---|---|---|
| ముద్రణ | : | అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ, 126 శాంతినగర్,<br>హైదరాబాద్ - 28 ఫోన్ : 23391364, 23304194<br>Email: anupamaprinters@yahoo.co.in |

# మూర్తిత్రయానికి, సగౌరవంగా

ఈ అధ్యయనం చేస్తున్న క్రమంలో ముగ్గురు శక్తివంతులైన వ్యక్తులు, ఈ పుస్తకంలోని చర్చించిన అంశాలైన – దోపిడీకి గురైన కులాలవారు తమ గౌరవం కోసం తపన చెందటం – సంగీతంలో సమాన స్థానం కోసం పోరాడటం – వీటికి వుదాహరణలుగా నిలవగలిగినవారు పరిచయమయ్యారు. వ్యక్తిత్వంలోని బలం, ఆత్మగౌరవం, కళా సౌందర్య స్థాయిన పొందటంలో యిరవయ్యవ శతాబ్దంలో కర్ణాటక కళా రంగంలో వీరిని అధిగమించినవారు లేరు. వాళ్ళు వీణ ధనమ్మ, బెంగళూరు నాగరత్నమ్మ, నాట్యకళాకారిణి బాలసరస్వతి.

ఈ పుస్తకం ఆ మూర్తిత్రయానికి, గౌరవ పురస్కారాలతో
అంకితం.

## ముందుమాట

# కొత్త తరానికి అంకురార్పణ

యం.యస్. సుబ్బులక్ష్మి గురించి అధ్యయనం 2004వ సంవత్సరంలో ఒక "వెలుపలి వ్యక్తి" నుంచి, అదీ తన క్రైస్తవ తల్లిదండ్రులు పెట్టిన పేరుగల వ్యక్తి నుంచి రావటం, కర్ణాటక సంగీత సామ్రాజ్యపు కంచుకోటలో కలవరం రేపింది. నేను తమిళనాట పెరగలేదనే విషయం దానిని మరింత అనుమానాస్పదం చేసింది. ఐతే తొందరలోనే క్షమాభిక్ష వచ్చింది, కొంత మెచ్చుకోలు కూడా దొరికింది. ఐతే మొదట వచ్చిన అభ్యంతరాలు, ఇటీవలి కాలం వరకూ కర్ణాటక సంగీత ప్రపంచాన్ని పరిపాలించిన కొన్ని బృందాలకున్న సెంటిమెంట్లను ఎత్తిచూపాయి. యమ్.యస్. సుబ్బులక్ష్మికి మతం, భాషా ఎలాంటి సమస్యలనూ తెచ్చిపెట్టలేదు. ఒక బాల మేధావిగా ఇరవయ్యవ శతాబ్ద ప్రారంభంలో సంగీతాకాశంలో ఉదయించినప్పుడు ఆమె సాంఘిక నేపథ్యం ఆమెపై నిర్హేతుకమైన అయిష్టతను కల్పించి బాధించింది. భారతదేశపు సంప్రదాయ పరాయణ సాంఘిక వాతావరణంలో ఆచారాల కట్టుబాట్ల బిగింపు చూసినప్పుడు వందేళ్ళ క్రితం ఉన్న అపోహలు, అభిప్రాయభేదాలు ఇప్పటికీ సజీవంగా ఉండటంలో ఎలాంటి ఆశ్చర్యమూ లేదు. సంగీతంలోనూ, రాజకీయ జీవితంలోనూ ప్రజాస్వామ్యాన్ని కోరుతూ కొత్తతరం కళాకారులు ప్రవేశించారు. శ్రోతల దృక్కోణాలలో, వారాశించేదానిలో కొత్త పద్ధతులు వచ్చాయి. వర్తమానాన్ని ఉత్సాహవంతంగా చేసి, భవిష్యత్తుని మార్చేవిగా వున్న సవాళ్ళు కర్ణాటక సంగీత సంస్కృతిలో భాగంగా ఉన్నాయి.

16వ శతాబ్దంలో పురందరదాసు ప్రపంచంలోనే అతి కఠినమైన గణిత పూర్వక సంగీత నిర్మాణానికి పునాదులు వేసినప్పటి నుంచీ ఈ సంగీతం ఒక నిరంతరాయపు తేజస్సును తనలో శాశ్వతంగా ముద్రించుకున్నది. రెండు శతాబ్దాల తర్వాత ముగ్గురు అత్యంత ప్రతిభావంతులు, కర్ణాటక సంగీత త్రిమూర్తులుగా మనకు తెలిసినవారు ఒకే గ్రామంలో సమకాలీనులుగా పుట్టటంతో శాస్త్రీయ యుగోదయం జరిగింది. త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రిలు ఏర్పరిచిన ఉన్నత ప్రమాణాలు కర్ణాటక సంగీతోత్సవ సంవత్సరాలకూ, ఇరవయ్యవ శతాబ్దపు స్వర్ణయుగానికీ దారితీశాయి. ఈ కాలంలో నైపుణ్యత ఎంతగా పెరుగుతూపోయిందంటే, ఈ కాలంలోనే మహిళా సంగీతకారులలోనే 'త్రిమూర్తులు' అనే పేరుతో రెండు జట్లు రావటం మనం చూశాం. ఈ పుస్తకం ఏ సాహసవంతులకు అంకితమయిందో వారు ఒక జట్టయితే, తర్వాత అందరితో ఆరాధింపబడిన యమ్.యస్. సుబ్బులక్ష్మి, డి.కె. పట్టమ్మాళ్, ఎమ్.ఎల్. వసంతకుమారిలు మరొక జట్టు. స్వర్ణయుగాన్ని కొనసాగిస్తూ ఆధునిక యుగం ప్రారంభమైంది. అద్భుతమైన గాయకులు ప్రతి ఇంటా

చెప్పుకునే పేర్లయ్యారు. ఇరవయ్యవ శతాబ్దానికి, ఇరవయ్యొకటవ శతాబ్దానికీ మధ్యకాలంలో సంచరించే కొత్త తరం – ప్రతిభ కలిగిన విద్యావంతులైన స్త్రీ పురుషులతో కర్ణాటక సంప్రదాయానికి వారి పద్ధతులలోనే న్యాయంచేస్తూ ప్రవేశించింది. వాళ్ళు మన చుట్టూ, ఒకే సమయంలో ప్రేరణనీ, భయాన్నీ కలిగిస్తూ, వారి మార్గాలలో సౌకర్యవంతంగా ఉంటూ, భిన్నంగా ఉన్నందుకు భయపడకుండా ఉన్నారు. సంజయ్ సుబ్రమణ్యన్, పి. ఉన్నికృష్ణన్, అభిషేక్ రఘురామ్ అటువంటి వాళ్ళలో కొద్దిమంది మాత్రమే. ఈ సోదరుల జాబితాలోంచి ఒక పేరుని విడిగా తీసి చెప్పాలంటే, అది టి.యమ్. కృష్ణ, గాయకుడు, పండితుడు, సామాన్య ప్రజానీకపు విశ్వాసాలపై, విలువలపై దాడిచేసినవాడు. మూడు గుణాలు ముప్పేటగా కలిగినవాడు. సామాజిక వాతావరణంలోకి అతను బలవంతంగా ప్రవేశపెట్టిన విషయాలు, యమ్.యస్. సుబ్బులక్ష్మి తన పదవ యేట మొదటి రికార్డు ఇచ్చినప్పుడు ఆమెను వెంటాడిన భయాలే.

ఆ కాలంలో ఆందోళన, చిరాకు కలిగించే సమస్యలు లేవంటే – తక్కువ కులాలకు చెందిన కళాకారులను, ఉన్నత కులాలవాళ్ళు అంగీకరించకపోవటం, మహిళా గాయకుల పట్ల పురుషులకున్న అభ్యంతరాలు. యమ్మెస్ ఈ రెండింటినీ అధిగమించింది. అందుకు ఆమె సంగీతపు మహా ఔన్నత్యానికి ఆమెను సంస్కృతీకరించటంలో ఆమె భర్త చేసిన తెలివైన నిర్వహణకు మనం ధన్యవాదాలు చెప్పాలి. కానీ సమస్యలు అంతటితో తీరిపోలేదు. యమ్మెస్ సుబ్బులక్ష్మి “మీరా” సినిమా (1945) విడుదలయ్యేనాటికి టి.యమ్. కృష్ణన్ పుట్టలేదు. ఇంకా చెప్పాలంటే మొదటి కొత్తతరపు విప్లవం తెచ్చిన ఫ్లవర్ చిల్డ్రన్, సమ్మర్ ఆఫ్ లవ్ (1967) సమయంలో కూడా ఆయనలేడు. దాదాపు ఒక దశాబ్దం గడిచాక, ఇందిరాగాంధీ అత్యవసర పరిస్థితి విధించి ఆరునెలలు గడిచాక ఆయన వచ్చాడు. కానీ అప్పుడాయన కర్ణాటక సంగీతాన్ని “బ్రాహ్మణాధిపత్యంతో, పురుషాధిపత్య నిరంకుశ ధోరణి”లో ఉందని, దానికి “సాంఘిక పునర్నిర్మాణం” అవసరమని వర్ణించాడు. కొన్ని విషయాలు ఎప్పటికీ మారవు.

కృష్ణను తేలిగ్గా తీసిపారెయ్యలేము. అయన తమిళనాడులోని 2.75% బ్రాహ్మణ వర్గంలో భాగమని మాత్రమే కాదు; అతని చర్యలు అతని మాటలను బలపరిచాయి. మద్రాసులో వందేళ్ళ నుంచీ జరుగుతున్న మార్గళి సంగీత సీజన్ నుంచి అతను బైటికి వచ్చేసి, కళలలో ఉన్న వివక్షను ప్రతిఘటించాడు. నగరంలోనే ప్రముఖమైన సభా మంటపాలలో కచేరీలు జరుగుతున్నప్పుడు ఆయన సముద్రతీరంలో జాలర్లకోసం కచేరీ ఏర్పాటు చేశాడు.

కృష్ణ చేసే కొన్ని వాదనలు నిజానికి అతి అనిపిస్తాయి. బహుశ తమిళ బ్రాహ్మణ ఆధిపత్యం సంస్థాగత స్థాయిలో మాత్రమే ఉండేమో. కళాస్థాయిలో తమిళులు కానివాళ్ళు, బ్రాహ్మణేతరులు కూడా ప్రతిభతో ఉన్నతస్థాయికి ఎదిగారు. “శాస్త్రీయ” అనే పదం

అంటేనే, "మరీ ఉన్నతులది"గా పేర్కొనటాన్ని అనుమానించాలి. కళ, సాహిత్యం వీటన్నిటినీ వర్గీకరించేటప్పుడు 'శాస్త్రీయ' అనేమాట వాటిలో ఒక ఉన్నతస్థాయికి చేరాలనే ఆశను ఎత్తిచూపుతుంది. కానీ "సంగీతాన్ని ఆనందించాలన్నా, నేర్చుకోవాలన్నా కొన్ని సాంఘిక, మతపరమైన అవసరాలను సృష్టించటం" గురించి అతను చేస్తున్నదాడి గురించి కూడా ఆలోచించవలసిందే. కర్ణాటక సంగీతం "మతపరమైన హిందూ అనుభవంగా కనిపించేలా" ఉండకూడదనే అతని వాదనలోనూ విషయముంది.

హిందూస్తానీ సంగీతంలో మతపరంగా కనిపించే ఛాయలు కనిపించవు. (ముస్లింల కారణంగానూ, వారున్నప్పటికి – మనం చూసే దృష్టి కోణాన్నిబట్టి). కొన్ని అంచనాల ప్రకారం ఉత్తర భారత సంగీతానికి దక్షిణాదిన విపుల ప్రజాదరణ పెరుగుతోంది. కర్ణాటకలో ఆ ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది; కర్ణాటక సంగీత వ్యాకరణాన్ని పురందాసు ఎక్కడ శ్రమించి ఏర్పరిచాడో, అక్కడ భీమ్‌సేన్ జోషి, గంగూబాయ్ హంగల్ హిందూస్థానీ సంగీత ఇంద్రజాలాన్ని వ్యాపింపజేశారు. ఆ ఇంద్ర మాయాజాలం కొనసాగితే దానికి ఒక కారణం, ఉత్తరాది సంప్రదాయం సాపేక్షంగా చూస్తే తేలికగా అందుకునేందుకు వీలుగా ఉండటమే. దక్షిణాది పద్ధతి చాలా కఠినం కావటంతో గొప్పవాళ్ళెవరూ శిష్యులను మిగిల్చి వెళ్ళరు. కర్ణాటక శుద్ధ సంగీత సారమైన వీణ ధనమ్మాళ్‌కి ఆమె బాణీలో ఆమె శైలిలో పాడేందుకు ప్రయత్నించేవారసలు లేరు. బాల సరస్వతి, బెంగుళూరు నాగరత్నమ్మకి కూడా అంతే. ఆధునిక సంగీత పండితులు చెంబై వైద్యనాథ భాగవతార్ నుంచి జి.యన్. బాలసుబ్రహ్మణ్యం వరకూ – వారందరినీ సంగీతజ్ఞులైన శ్రోతలు విని ఆనందించారు గానీ వారి సంఖ్య ఊగిసలాడుతూ ఉంటుంది. కారణం వివరించలేనిది కాదు. యమ్మెస్ సుబ్బులక్ష్మి ఒక్కతే ప్రజాదరణ ఏమాత్రం తగ్గని కర్ణాటక గాయని. నిజానికి ఆమెకు ప్రజాదరణ పెరుగుతూ వస్తోంది. ఆమె పాడిన 'సుప్రభాతం' క్యాసెట్ల అమ్మకాన్ని లెక్కలోకి తీసుకుంటే –

సుప్రభాతం గాఢమైన భక్తి విషయంలోనూ, పాడే పద్ధతిలోనూ, యమ్మెస్ భక్తి సంగీతం అందంగా, ఉన్నతంగా మరువలేనిదిగా ఉంటుందని ఒప్పుకుంటూనే, టి.యమ్. కృష్ణ తను రాసిన "దక్షిణాది సంగీతం" అనే పాఠకాదరణ పొందిన పుస్తకంలో ఇలా రాశాడు "కఠినమైన సంగీత కళలోని గాంభీర్యాన్నంతా కలిగిన మరో "యమ్మెస్ సంగీతం" ఉండగలిగేది, నిజంగా తయారయ్యేది. దానిని "దైవత్వ యమ్మెస్" అనే లెజెండ్ వల్ల కోల్పోయాం."

విషాదగీతంలా కనిపించే పైమాట నిజానికి ఉత్సవ గీతమనే చెప్పాలి. ఎందుకంటే ఆ దైవత్వపు లెజెండ్ సంగీత కళలోని శృతిలయబద్ధతను తగ్గించలేదు. యమ్మెస్ సంగీతం తన సమకాలీనులెవరలోనూ లేనంతగా అన్నిటినీ కలుపుకుని కాంతిని కాపాడుకుంది. ఆమె పాడటం మొదలుపెట్టిన తొంభై సంవత్సరాలలోనూ ఆ కాంతి ఎన్నడూ తగ్గలేదు. 2016లో ఆమె శతజయంతి ఒక చరిత్రాత్మక గుర్తుగా మారుతుంది. భారత ప్రభుత్వం

సాంస్కృతిక సంపదతో దేశాన్ని మానవాతీతంగా చేసిన ఏడుగురు ఐకాన్స్‌ని ఎంచుకున్నప్పుడు ఆ ఏడుగురిలో సుబ్బులక్ష్మి బిస్మిల్లాఖాన్‌తోపాటు ఉంది. బహుశ, ఇంకా ప్రముఖంగా, యమ్మెస్ వందవ పుట్టినరోజు సందర్భంగా ఆమె జన్మస్థలమైన మధురైలో ఒక ప్రత్యేక సంగీత నివాళిని మునిమనవరాలైన యస్. ఐశ్వర్య (టి. సదాశివం కూతురు, అర్ధ శతాబ్దం పాటు యమ్మెస్‌కి గాత్ర సహకారం అందించిన రాధా విశ్వానాధన్ మనవరాలే ఐశ్వర్య) అర్పించటం జరుగుతుంది. యమ్మెస్ బాణి కొనసాగుతుందనేందుకు అంతకంటే ఉచితమైన నిదర్శనం ఉండదు. దాని గురించి రాధ ఇలా వివరించారు. “కేవలం పాడటం కాదు, జీవితంలోనూ సంగీతంలోనూ భక్తి, వినమ్రతలుండటం”. శాస్త్రీయ కళలు కాలంతోపాటు నడుస్తూ తమ శాస్త్రీయతను నిలుపుకుంటున్నప్పుడు, యమ్మెస్ సంగీతం తాను సంకేతంగా ఉన్న విశ్వజనీన సుగుణాలతో కాలానుగుణంగా నిలిచి ఉంటుంది. నెమ్మదిగా కానీ చాలా గట్టిగా యమ్మెస్ కాలాతీతమైన విలువలను ఎత్తిపట్టి, ఆ క్రమంలో తను కూడా కాలతీత మయ్యారు. యమ్మెస్ జీవిస్తున్నారు.

బెంగళూరు
జులై 2016

**టి. జె. యస్. జార్జి**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | ఎందరో మహానుభావులు | 9 |
| 1. | యమ్ అంటే చరిత్ర, యస్ అంటే కళ | 13 |
| 2. | కొత్త పద్ధతులు – చాదస్తపు రీతులు | 32 |
| 3. | సరస్వతి పుత్రికలు | 51 |
| 4. | కుటుంబం, కులం, జండర్ | 65 |
| 5. | నళిన లోచన | 82 |
| 6. | సినిమా రంగంలో | 97 |
| 7. | నమ్మకంలోని భద్రతా సౌకర్యం | 120 |
| 8. | సినీరంగ నిష్క్రమణ | 133 |
| 9. | సుస్వర లక్ష్మి సుబ్బులక్ష్మి | 150 |
| 10. | భావజాలంగా భక్తి | 166 |
| 11. | గార్డెన్ పార్టీల కాలం | 182 |
| 12. | సదాశివం ఘరానా | 197 |
| 13. | సంగీత కళాకారిణిగా, స్త్రీగా... | 212 |
| | అనుబంధం – ప్రేమతో యమ్మెస్ | 236 |

## మొదటి ముద్రణకు ముందుమాట

# ఎందరో మహానుభావులు

1990లో మొదలుపెట్టిన ఈ అధ్యయనానికి ఐదు సంవత్సరాలపాటు సమాచార సామగ్రినంతా సేకరించి, ఆ పనిని ఆపేశాను. పరిశోధనను నిజంగా అసాధ్యం చేసే సమస్యలున్నాయి – యమ్మెస్ సుబ్బులక్ష్మి జీవితం గురించి ఏవిధమైన రికార్డులు లేకపోవటం ఒకటైతే ఆమె భర్త త్యాగరాజు సదాశివం ఆమె చుట్టూ కట్టిన కోట మరొకటి. మొదటిది అందరికీ తెలిసే సమస్యే : కాగితాలేవీ దాచకపోవటం, ఏ రికార్డులూ భద్రపరచకపోవటం, చరిత్ర గురించిన ఆలోచన లేకపోవటం యివన్నీ దురదృష్టవశాత్తు భారతీయతలో భాగం. ఇక రెండవదానిలో చెప్పేందుకేమీ లేదు : సదాశివం సమాచారాన్నంతా అందుబాటులో లేకుండా అన్ని వైపుల నుండీ గట్టిగా కట్టడి చేయటంతో సదాశివం తెలియపరచకూడదనుకున్న వాటిలోంచి తెలుసుకోగలిగినవి ఏవీలేవు.

2002 వరకూ ఈ ప్రాజెక్టు గురించి మర్చిపోయాను. 2002లో అనుకోకుండా యమ్మెస్ ఇంటికి వెళ్ళటంతో ఆమెను కలిసే అవకాశం దొరికింది. ఆ మధ్యాహ్నం నా పని ఆమెకు వాద్య సహకారం అందించే వారితో కలిసి ఆమె ఇంట్లో చుక్కు (మసాలా) కాఫీ తాగటమే. ఈ ప్రాజెక్టుని మళ్ళీ మొదలుపెట్టటం సాధ్యమా అనేది చర్చించలేదు. కానీ ఒక గంట సంభాషణ జరిగాక, పక్కనుంచి ఒక తలుపు కొద్దిగా, నిశ్శబ్దంగా తెరుచుకుంది. ఆ తలుపు నుంచి కర్రని వూతంగా పట్టుకుని యమ్మెస్ నడిచివచ్చింది. ఆమె వేసుకున్న ఊలు మేజోళ్ళు మద్రాసు ఉక్కపోతను ఎగతాళి చేస్తున్నాయి. ఆమె కళ్ళు మెరుస్తున్నాయి. ఆమె ముఖాన్ని అందమైన చిరునవ్వు ఆవరించి ఉంది. 'ఒక శక్తి' ఆ గదిలోకి ప్రవేశించినట్లయింది. ఇంటర్వ్యూ ఏమీలేదు. ఆమెకు 86 ఏళ్ళ వయసు, కంఠం స్పష్టంగా పలుకుతోంది, ఆమె జ్ఞాపకశక్తి తగ్గిపోతోంది. కానీ ఏదో కుదిరింది. ఆ రాత్రి పాతనోట్సులు బయటకు తీశాను. దుమ్ము దులిపాను. కొత్త ఇంటర్వ్యూల కార్యక్రమం రాసుకున్నాను. హఠాత్తుగా ఎదురుచూడని చోట్ల నుండి ఎదురుచూడని సమాచారం బైటి కొచ్చింది. పుస్తకం తనకు తానే రాసుకుంది.

ఒక దేవదూతల గుంపు గనక నాకు సహాయాన్ని అందించకపోతే కర్ణాటక కళలలో శిక్షణలేని నేను ఈ మహా కార్యాన్ని పూర్తిచేయలేకపోయేవాడిని. బహిరంగంగా చెప్పుకో గలిగిన వారిలో కె.ఆర్. ఆత్మనాథన్ ఒకరు. సదాశివం సామాజిక జీవితంలో చురుకుగా ఉన్న రోజుల్లో 'దత్తత' తీసుకున్న యువకులలో జీవితాంతం ఆయనకు నమ్మకస్తుడిగా ఉండేలా ప్రభావితులైన యువకులకు నిలువెత్తు నిదర్శనం కె.ఆర్. ఆత్మనాథన్. సదాశివం

వెళ్ళిపోయిన చాలాకాలం వరకూ సదాశివం ప్రియమైన ఆదర్శాలకు, ఆత్మ తన జీవితాన్ని అంకితం చేశాడు. ముఖ్యంగా ఆయన ప్రియమైన యమ్మెస్, కంచి పరమాచార్య స్మారక చిహ్నంగా శతాబ్ది మణి మంటపాన్ని నిర్మించటం ఆయన ఆశయాలు. ఇంకా వివరాలను అందించిన సదాశివం శిష్యులలో బొంబాయికి చెందిన కల్కి కన్నన్, మద్రాసుకు చెందిన కె. వేదమూర్తి ఉన్నారు. ప్రస్తుతం 'కల్కి' పత్రిక నడుపుతున్న సదాశివం కుటుంబసభ్యులు కొన్ని ఫోటోలు దయతో అందజేశారు. దినమణి సంపాదకులైన ఆర్‌యమ్‌టి సంబంధం అవసరానికి అన్నివేళలా అన్ని విధాల ఆదుకున్న స్నేహితుడు. సదాశివం మొదటి భార్య బంధువుల ఆచూకి కనుగొనటంలో అతని సహాయం అమూల్యమైనది. కొచ్చి నివాసుడైన వి. జయరామన్ నాకు కర్ణాటక సంగీతంలో ప్రాథమిక శిక్షణతోపాటు కొన్ని పిట్టకథలను అందించారు. అవి ఆయన పెట్టె నిండుగా ఉండేవి. త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రిల చిత్రాలు, చిత్రకారుడు నంబూద్రి కలం నుంచి వచ్చాయి. కర్ణాటక సంగీత భౌగోళిక పటాన్ని గీసింది బెంగుళూరుకు చెందిన సుధాకర్ దర్వే.

రెండవ శీర్షిక పేజీలో యమ్మెస్ చిత్రపటం, ఈ పుస్తకం కోసం ప్రత్యేకంగా చిత్రించింది మనోహర్ దేవదాస్. 1970వ దశాబ్దంలో ఆయన అద్భుతమైన రేఖాచిత్రాలు ఆలయాలకు ప్రకృతి దృశ్యాలకు పేరెన్నికగన్నవి. ఆయన, ఆయన భార్య మహిమ – వీళ్ళిద్దరికీ యమ్మెస్ జీవితంలో ముఖ్యమైన స్థానం ఉంది. కీళ్ళనొప్పులు, మధుమేహ సమస్యలతో బాధపడే యమ్మెస్ తనపట్ల విధి చూసే క్రూరత్వాన్ని గురించి సదాశివంతో చాలా తీవ్రంగా ఆరోపణలు చేసేవారు. సదాశివం ప్రశాంతంగా ఆమెతో, మహిమ, మనోహర్‌ల గురించి ఆలోచించమని చెప్పేవారు – యమ్మెస్ వెంటనే నిశ్శబ్దమై, ప్రార్థనలో మునిగేవారు.

1972లో ఒక లారీ, కారు గుద్దుకోవటంలో ముప్పైమూడేళ్ళ వయసున్న మహిమ మెడక్రింది భాగమంతా చచ్చుబడిపోయింది. తమ ప్రేమ వ్యవహారం గురించి రాసిన పుస్తకంలో మనోహర్ హాస్పిటల్‌లో దృశ్యాన్నిలా రాస్తాడు. "ఆమె తల గుండు చేశారు, ఆమె పుచ్చె మీద రెండుచోట్ల చీల్చి, చెవులకు పైభాగాన పుర్రెమీద రెండు చిల్లులు పొడిచి, ట్రాక్షన్ బరువును వేలాడదీశారు." ఆమె శరీర విధులన్నిటిమీదా అదుపు కోల్పోయింది. నిరంతరం అంటువ్యాధులు, నొప్పితెరల ప్రమాదంలో ఉండేది. ఇరవై నాలుగు గంటలూ ఆమెను ఎవరో ఒకరు చూసుకోవలసిందే. ఆమె కాసిన మంచినీళ్ళు తాగాలంటే ఎవరో ఒకరు గ్లాసుని ఆమె పెదవులకు దగ్గరగా పట్టుకోవాలి. దానికి తగినట్లు, సహాయం చేసేందుకు మనోహర్ శక్తి మాయమవుతోంది. ఆయన 'రెటినిటిస్ పిగ్మంటోసా' అనే నేత్ర వ్యాధితో దీర్ఘకాలంగా పోరాడుతున్నాడు. ఆ జబ్బు కంటిచూపుని తగ్గిస్తూపోయి చివరికి పూర్తిగా అంధుడిని చేస్తుంది. 2002లో అతడిని కలిసినప్పుడు ఆయన నన్ను

చూడలేకపోయాడు. పుస్తకానికి మొదలేదో తుది యేదో చెప్పలేకపోయాడు. అందువల్ల ఆయన తన పుస్తకం వెనక పేజీలో తలకిందులుగా రాసి నాకిచ్చాడు. ఈ భయంకరమైన విషాదం మధ్యలో ఈ దంపతులు సంతోషాన్ని, ఆశావాదాన్ని, జీవితంపై మమకారాన్ని నిలుపుకొని, వాళ్ళ దగ్గరకొచ్చిన వారిని ఆశ్చర్యపరిచేవారు.

శంకర నేత్రాలయ, మద్రాస్‌లోని డాక్టర్ యస్.యస్. బద్రీనాథ్ మనోహర్‌కి ప్రత్యేకంగా తయారుచేసిన ఆస్ట్రేలియా కళ్ళద్దాల జోడుని ఇచ్చారు. ఆ జోడు పెట్టుకుంటే, కాగితాన్ని అతని కళ్ళకు అతి దగ్గరగా పట్టుకుంటే, ఇరుకుగా, మసకగా, ఒక చిన్న చుక్క పట్టే స్థలంలో రేఖామాత్రపు చూపు వస్తుంది. కానీ అతను ఆ కళ్ళజోడుని ప్రతి నిముషం తీయాల్సి వస్తుంది. అలా తీసేస్తే అతని కంట్లో తడి ఆవిరి అయిపోతుంది. కొన్ని వందలసార్లు కళ్ళజోడు పెట్టుకుంటూ తీసివేస్తూ, కలంగీసే ప్రతి గీతకూ కాగితాన్ని పైకెత్తి కళ్ళకు దగ్గరగా పెట్టుకుంటూ, ఒక్కసారి మూడు లేక నాలుగు చదరపు మిల్లీమీటర్లు మాత్రమే చూడగలుగుతూ ఆయన తన "యమ్మెస్ అమ్మ" చిత్రాన్ని పూర్తి చేశాడు. మనం ప్రేమించే పని చేయగలగటం జీవితానందాన్ని ఆశను కల్పించే కారణాలలో ఒకటి. ఈయన, ఈయన భార్యా, ధైర్య సాహసాల కోసం ఇచ్చే ప్రతి అవార్డుకూ అర్హులు.

ముగ్గురు వ్యక్తుల ఋణం నేనెన్నటికీ తీర్చుకోలేనిది. యస్. థియొడర్ భాస్కరన్ తమిళ కులతత్త్వ సంస్కృతిలోని చిక్కుముడులకి నా కళ్ళు తెరిపించాడు. ఆయన స్వయంగా నిశిత పరిశోధకుడు, రచయిత కావటంతో ఆయన యిచ్చే చిన్న చిన్న సమాచారాలు ఖాళీలను పూరించేవి, లేదా లోచూపును అందించేవి. ఆయన మద్రాసులోని రోజా ముత్తయ్య పరిశోధక గ్రంథాలయానికి డైరెక్టరు కావటం, ఆ గ్రంథాలయం విలువైన వనరుల కేంద్రం కావటం నాకెంతో సహాయపడింది. నేనింతకు ముందు రాసిన కొన్ని పుస్తకాలకు, జర్నలిస్టు, అనేక రంగాలలో పండితుడు అయిన ఎన్.యస్. జగన్నాథన్ ఎంతో సహాయం చేశాడు. ఈసారి ఆయన నేను ముందు రాసిన తొలి అధ్యాయాలను చింపి పోగులుపెట్టి రక్షించాడు. ఆ నిర్మాణాత్మక విధ్వంస చర్య నన్ను సరైనదారిలో పెట్టింది. కె.వి. రామనాథన్ విశ్రాంత ఐ.ఎ.యస్ అధికారి, కర్ణాటక సంగీతంలో నిఘంటువనదగిన ఒకే ఒక వ్యక్తి. పేర్లు, తారీఖులు, యితర వివరాలు ఎప్పటికీ అతని మునివేళ్ళమీదే ఉంటాయి. అతని తీర్పుని గౌరవించడం నేను నేర్చుకున్నాను, ఆ తీర్పు అన్ని విషయాలనూ పరిగణించినదిగా, న్యాయమైనదిగా ఉంటుంది. అతని మేధస్సు ఎంత అపారమైనదంటే ఈ పుస్తకానికి అతనే రచయిత కావలసింది – ఇంకా చాలా పుస్తకాలకు కూడా. ఆ పని నాకు వదిలేయటం వల్ల నాకెంతో మేలు జరిగింది గానీ యమ్మెస్ సుబ్బులక్ష్మికి జరగలేదు. ఆమె మరింత ఖచ్చితమైన చరిత్రకారుడిని కోల్పోయింది.

ప్రతి అధ్యాయం మొదలయ్యే ముందు ఎపిగ్రాఫ్స్‌గా వాడినవి త్యాగరాజ కృతుల

నుండి తీసుకున్నాను. ఈ కృతులను సి. రామానుజాచారి గ్రంథస్థం చేసిన "ది స్పిరిచ్యువల్ హెరిటేజ్ ఆఫ్ త్యాగరాజ (శ్రీ రామకృష్ణమఠ్, మద్రాస్, 1981) నుంచి తీసుకున్నాను. రామానుజాచారి చేసిన అనువాదాలు అక్షరానువాదాలు గానీ యధాతథానువాదాలు గానీ కాదు. అని ఒక సాధారణ అవగాహననిస్తాయి. కానీ అతని పుస్తకం త్యాగరాజకవి పైన వచ్చిన ప్రామాణిక పుస్తకం. ఆ పుస్తకానికి ఎంతో గుర్తింపు ఉంది. చాలా సులభంగా దొరుకుతుంది.

ఈ మొత్తం కథనంలో 'చెన్నై' బదులుగా 'మద్రాసు' అనే పేరునే వాడటం జరిగింది. ఈ పుస్తకంలో వచ్చే మనుషులు, వర్ణించిన సంఘటనలు, అన్నీ ఈ నగరం మద్రాసుగా ఉన్నప్పుడే జరిగాయి. కాలానుక్రమణిక దృష్టితో చూసినట్లయితే మద్రాసు అనే పేరే ఈ గ్రంథస్ఫూర్తికి సరిగ్గా సరిపోతుంది. బొంబాయి, కలకత్తాల వలే.

# 1. యమ్ అంటే చరిత్ర, యస్ అంటే కళ

*స్వరరాగసుధా రసయుత భక్తి*
*స్వర్గాపవర్గమురా...ఓ మనసా॥*
*పరమానందమనే – కమలముపై*
*బక భేకముల చెలగేమి మనసా॥*
*మూలాధారజనాద మెరుగుటే*
*ముదమగు మోక్షమురా...*
*కోలాహల సప్తస్వర గృహముల*
*గురుతు మోక్షమురా – ఓ మనసా॥*

యమ్మెస్ సుబ్బులక్ష్మి ఇద్దరు తల్లులకు పుట్టిన బిడ్డ. మధురై నగరం, షణ్ముగవదివు. ఇద్దరూ తమిళ సాంస్కృతిక చైతన్య హృదయ స్పందనకు, ఆత్మకు ప్రాతినిధ్యం వహించే వారే. మద్రాసు బ్రిటీష్‌వారి కళ్ళలో మెరుపులా పడకముందు, మధురాపురి, 'తియ్యని మకరంద నగరం' అనే అర్థం కలిగిన నగరం, ఒక రాజ్యానికి పరిపాలనా రాజధాని, అనేక జాతుల సంస్కృతుల కలయికతో విశాలమైనది. అక్కడ కళలు, సాహిత్యమూ వికసించి వర్ధిల్లాయి. దక్షిణ భారతదేశాన్నంతా వశపరచుకున్న దేవాలయ నాగరికతకు ముఖ్యకేంద్రంగా ఉంది. షణ్ముగవదిపు, శరీరాన్నిబట్టి చూస్తే బక్కగా ఉన్నప్పటికీ, సంకల్ప బలంవల్ల, సాంఘిక దోపిడీ జరుగుతున్నా కళా నైపుణ్యాన్ని ముందుకు తీసుకెళ్ళే వారసత్వం కలిగిన వ్యక్తి. సుబ్బులక్ష్మి మధురలో ఎమ్. షణ్ముగదివులో యస్ అనే అక్షరాలను, ఎవరికీ లొంగని ఆత్మశక్తులకు ప్రతీకలుగా ధరించి, 1916 సెప్టెంబర్ 16వ తారీఖున ఆ కాలాతీత నగరంలోని అసంఖ్యాకమైన వీధులలోని వరుస ఇండ్లలో ఒక ఇంట్లో జన్మించింది.

ఆమె ఒకే సమయంలో చరిత్రకు, కళకూ పుట్టినబిడ్డ. శతాబ్దాల తరబడి ఈ రెండింటి కలయికవల్ల ఒక వాతావరణం ఏర్పడటమే కాదు, ఆమె జీవితాన్ని తీర్చిదిద్దే ఒక పూర్వరంగం స్థాపితమై ఉంది. ఇప్పుడు స్వాగతించ లేనట్లుగా, ఒకోసారి మనసుకి తెలియకుండానే తాకుతున్నట్లుగా! ఆమె వ్యక్తిత్వానికి కనిపించని పొరలను అందించిన ఆ చరిత్ర సంక్లిష్టమైన మడతలతో సుదీర్ఘమైనది. గొప్ప విజయాలతో, గొప్ప ఓటములతో ఆ చరిత్ర నిండి ఉంది. కల్లోలాలు లేకుండానూ, నాటకీయ పరిణామాలతోనూ: అతి పవిత్ర సంప్రదాయ పర్వతంతో, అత్యుద్రేకమైన రాడికలిజంతో నిండిన నగరమది. మతాల మధ్య ఘర్షణ, సంస్కృతుల మధ్య పరస్పరదాడులు, భాషాధిపత్యం కోసం పోరు; వీటన్నిటిలో భౌగోళికత ఒక ప్రముఖపాత్ర నిర్వహించింది. తరాలు వచ్చాయి, వెళ్ళాయి. ఒకటి తరువాత

మరొకటి దాన్ని ప్రభావితం చేసింది. నిన్న ఎప్పుడూ నేటిలో భాగమైపోయింది. వర్తమానంలో పొదిగిన కళలు సాటిలేని విధంగా గతాన్ని ప్రతిబింబించాయి.

సుబ్బులక్ష్మి జన్మస్థలం ఆమెను కేవలం దక్షిణ భారతీయురాలిగా మాత్రమే ఉంచ లేదు. అది ఉత్తర భారతదేశం నుంచి దక్షిణానికి చొచ్చుకొచ్చిన ద్రవిడ ప్రజల ప్రాంతమే కాదు. దక్షిణ భారతంలో మరింత దక్షిణాన ద్రవిడత్వాన్ని బాగా పుణికి పుచ్చుకున్న తత్త్వానికి మూలమైనది ఆ ప్రాంతం. ద్రవిడ సాంస్కృతిక చైతన్యం తమిళ భాష నుండి అభివృద్ధి చెందింది. తమిళ భాష భారతదేశంలో అతి ప్రాచీన సాహిత్య భాష. అందువల్ల నాలుగు జాతి – భాషా కుటుంబాలైన, తమిళ, తెలుగు, కన్నడ, మళయాలకు పునాదిగా ఉంది. ఉత్తర భారతదేశపు ప్రజల నుండి ద్రవిడులను వేరుచేసినది భాషను మించినది. అదే సంగీతం ప్రత్యేకంగా అభివృద్ధి చెందేందుకూ దోహదం చేసింది. తమిళ సాంఘిక నిర్మాణం కులంమీద కంటే వర్గం మీద ఆధారపడింది. సామాన్య ప్రజలైన వెల్లలార్ల, రాజవంశీకులైన అరసర్ల మధ్య కొంతవరకూ సాంఘిక కలయికలు జరిగాయి. ఇద్దరూ ఆడపిల్లలను యిచ్చిపుచ్చుకునేవారు. దర్బారుల్లో వెల్లలార్లకు యితరులతోపాటు సమ ప్రాధాన్యత ఉండేది. తాత్త్వికుడు, మన దేశాధ్యక్షుడు అయిన సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పినట్లు, (సమాజం, సామాజిక నిర్మాణం మారాయి) ఆర్యులు వచ్చి “భారతదేశ నివాసులను, వారు దస్యులని పిలిచినవారిని, తాము స్వేచ్ఛగా లోపలికి చొచ్చుకు రావటాన్ని అడ్డుకున్న వారిని చూశారు. ఈ దస్యులు నల్లని రంగులో, పశుమాంసం తింటూ, అల్ప ప్రాణులను పూజిస్తూ ఉన్నారు. ఆర్యులు వాళ్ళ దగ్గరికి వెళ్ళినప్పుడు, ఆర్యులకు దూరంగా తమ ఆవాసాల్లో ఉండాలనుకున్నారు. ఈ ఒంటరిగా, విడిగా ఉండటమనేది ఆ జాతి గర్వం నుంచీ, ఆధిక్య సంస్కృతిగలవారమనే భావన నుంచీ పుట్టి తర్వాత కులతత్త్వంగా మారింది’.

శైవమత ఛాయలు (విష్ణువు కాకుండా శివుడిని పూజించుట) వారి ఆధిపత్య మనోవికారాలను ఏర్పరిచాయి. ప్రాచీన రాజ్యాలలో పాలకులు వాళ్ళ అధికారాన్ని గుర్తించ టానికి బ్రాహ్మణ – క్షత్రియ భావనలోకి వచ్చారు. కానీ ద్రవిడ దేశంలో ప్రజలు కులాధి పత్యానికి బైటే ఉన్నారు. పధ్నాలుగవ శతాబ్దపు తొలి దశాబ్దాలలో దక్కన్‌లో ముస్లిం పరి పాలకులు ఉచ్ఛస్థితిలో ఉన్నప్పుడు, హిందూ రాజ్యాలను మరింత శక్తివంతమైన “హిందూ” రాజ్యాలుగా చేశాయి. బ్రాహ్మణులు భూమిమీద యాజమాన్యాన్ని సంపాదించుకున్నారు. దానితో వాళ్ళు, చలాయించే ఆధ్యాత్మిక ఆధిపత్యంతోపాటు తాము, ఆర్థికంగా పైకి ఎగబాకారు. సాంస్కృతిక – ఆర్య పాలకవర్గంగా తయారైన బ్రాహ్మణులకు, మూలాలలో తమ ద్రవిడత్వాన్ని నిలుపుకున్న బ్రాహ్మణేతరులకు మధ్య సాంస్కృతికమైన, సాంఘికమైన విభజన జరిగి పెరిగింది. ఈ ‘పరాయితనం’ దక్షిణ భారత చరిత్రను, ముఖ్యంగా తమిళ చరిత్రను ప్రాథమికంగా ప్రభావితం చేసింది. ప్రత్యేకంగా ఈ మార్పు సంగీత, నృత్య

రీతుల పరిణామాన్ని రూపుదిద్దటంతోపాటు, కళాకారుల సాంఘిక వాతావరణాన్ని కూడా రూపొందించింది. దానికి సమర్థన ఉన్నా లేకపోయినా. సంగీత సంస్కృతిలోని ప్రతి దశలో కుల ప్రశ్న చొరబడుతూనే ఉంది. మధురైలో షణ్ముగవదివు, ఆమె కుటుంబమూ ఈ కులవర్గీకరణ యొక్క స్పష్టమైన ప్రభావాన్ని అనుభవించారు. దాని మూలంగా వచ్చిన అనేక సమస్యలతో సర్దుబాటు చేసుకుంటూ వచ్చారు.

దక్షిణాదిన అతి పురాతన జనావాసమైన మధురైలో ఈ అంశాలు, వారి జీవితాలను మిగిలిన కోణాలవలే, సంప్రదాయం అవిచ్ఛిన్నంగా మచ్చలేకుండా సాగటంవల్ల నియంత్రించాయి. ప్రచారంలో వున్న పురాణకథ ప్రకారం, ఈ దేవాలయ నగరం అగస్త్య మునితోటి సంబంధంవల్ల తమిళ నాగరికతా కేంద్రం అయింది. ఆ మహర్షి ఇప్పటి తమిళనాడులోని తిరునల్వేలి జిల్లాలోని పొదిగై కొండలలో నివాసం ఏర్పరచుకోటానికి ముందు ఈ నేలంతా ప్రయాణం చేశాడు. మదురైలో జరిగిన మూడు సాహిత్య సంగమాలలో రెండింటికి హాజరైన అగస్త్యుడు బహుమతిగా ఇచ్చిన అందమైన వనిత తమిళం అని జానపద సాహిత్యం చెబుతుంది. ప్రాచీన తమిళ సంస్కృతి సారాంశంలో ముత్‌తామిళ్ అనే భావన ఉండేది. మూడు ముఖాలున్న తమిళం. అవి సాహిత్య, సంగీతం, నాటకం – (ఇయాల్, ఇసై, నాలుకం) దానిలో నృత్యమూ కలగలిసి ఉండేది. అగస్త్యుడు ఈ విషయాల మీద శాస్త్రగ్రంథాలు రాశాడని విశ్వసిస్తారు. చోళులు, విజయనగర రాజులు, మరాఠాలు, ముస్లిం రాజులు, జయించాలనే కోరికతో దండయాత్రలు చేసేంత సుసంపన్నంగా ఉండే మధురైని స్థానికులైన పాండ్య రాజులు నిర్మించారు. ఈ రాజవంశ ప్రారంభమెప్పుడో కచ్చితంగా తెలియదు గానీ క్రీస్తుపూర్వం 4వ శతాబ్దంలో ప్రారంభమై క్రీస్తు తర్వాత 14వ శతాబ్దం వరకూ పాలించిందనే విశ్వాసం కూడా ఉంది. సరిహద్దులు మారుతూ వచ్చినప్పటికీ వైగై నదీ తీరానున్న మధురాపురే ఆ రాజ్యానికి రాజధాని. పాండ్య రాజులు ఒకవైపు జావా, కాండీ ద్వీపాలతో, మరొకవైపు అరేబియా, రోమ్ దేశాలతో వ్యాపార సంబంధాలు పెట్టుకున్నారు. వాళ్ళు తమ రాజధానిని ఒక విద్యానిలయంగా, కళాకేంద్రంగా మార్చుకుని సంగం సాహిత్యపు ముఖద్వారంగా తయారైన సుప్రసిద్ధ సాహిత్య సంఘాలను యేర్పరిచారు.

మదురైకి కేంద్రం మీనాక్షి దేవాలయం. ఇప్పటికి కూడా అంతే. బహుశా ఈ ఆలయం ఎవరో పేరు తెలియని రాజుచేత మొదటగా నిర్మించబడి ఉండవచ్చు. కానీ అద్భుతమైన గోపురాలు, ఆ ఆలయాన్ని ఇంత ప్రసిద్ధిలోకి తెచ్చిన గోపురాలు, బహుశ క్రీస్తు తర్వాత 13వ శతాబ్దం నుండీ నిర్మించబడుతూ వచ్చాయని చెప్పవచ్చు. ఐతే యే కాలంలో కచ్చితంగా నిర్మించారనేది చెప్పటానికి, 16వ శతాబ్దంలోనూ ఆ తర్వాతా జరిగిన ప్రధాన పునర్నిర్మాణ కార్యక్రమాలు అడ్డువస్తాయి. దేవాలయపు వెలుపలి గోడలపై ప్రతి

చదరపు మీటరులోనూ చెక్కిన శిల్పాలు ఔత్సాహికులను ఈ ఆలయం ప్రపంచపు అద్భుతాలలో ఒకటని చెప్పేలా చేస్తాయి. నిజానికి గొప్ప నిర్మాణాలుగా ప్రసిద్ధి చెందినవి మహాబలిపురంలో పల్లవులు నిర్మించిన ఆలయాలు (ఏడు, ఎనిమిది శతాబ్దాల నాటివి) తంజావూరులో చోళులు నిర్మించిన మహోన్నతమైన దేవాలయాలు. పాండ్యుల ప్రాముఖ్యత ఆలంకారిక నిర్మాణాలనే భావనకు కొత్త కోణాలను అందించటం. వీరు నిర్మించిన గోపురాలకు తమదైన ఘనతను సంపాదించుకున్నారు. కానీ ఆ అద్భుత గోపురాలుగానీ, ఆ శిల్పాలు చెక్కటంలో ఉన్న గొప్ప సంక్లిష్టతగానీ మధురై మీనాక్షి సుందరేశ్వర దేవాలయానికి ఆ ప్రత్యేకతను తీసుకురాలేదు. ఆ భావనే, ఆ ఆలోచనే ప్రత్యేకతకు కారణం. అనేకంగా ఉన్న హిందూ దేవాలయాలలో ఇది శివపార్వతులకు వారి చిరపరిచిత రూపాలైన లయ కారుడు, ఆదిశక్తి ఆయనలో సగభాగమైన సతివలే కాకుండా, ప్రేమాధిదేవుడైన సుంద రేశ్వరుడుగా, ఆయన చేపకన్నుల సుందరాంగి మీనాక్షిగా కొలువుదీరారు. ఈ దేవాలయపు అధికారికంగా ఉన్న పేరులోనే దేవుడికంటే ఆయన భార్యకున్న ప్రాధాన్యతవల్ల భక్తులు అనివార్యంగా ముందు మీనాక్షిని పూజించటానికి వెళ్తారు. హిందూ విశ్వంలో పురుషత్వానికి ప్రతీకగా నిలిచే దేవుడైన శివుడు సంతోషంగా రెండవ స్థానానికి, తన అందమైన భార్య వెనుకకు వెళ్ళటమనేది మదురై ఒక్కచోటే జరుగుతుంది. ఈ విశేషం మదురై గురించి ఉన్న గాథలను ప్రోత్సహిస్తుంది. విషయ పరిజ్ఞానం కలిగిన తమిళులు మదురై ప్రజలు ఎదురైనప్పుడు సగం వెక్కిరింతగా, సగం అసూయతో, తమ భార్యలను ఉత్తములుగా గుర్తించేవారిగా సంబోధించటం తరచు జరుగుతుంది. మదురైలో జీవితము, కళ అంతా ఆలయం చుట్టూనే జరుగుతాయి. కళాకారులంతా ఆలయం నీడపట్టునే పనిచేస్తారు. షణ్ముగవడివుకి, సుబ్బులక్ష్మికి, పేరు ముందు ఉన్న యమ్ అనే అక్షరం కేవలం భౌగోళికమైన గుర్తింపు మాత్రమే కాదు, అది బొడ్డుతాడు వంటి బంధం.

సంగీత కళాకారులు ఆలయంతో విడదీయలేని విధంగా కలిసి ఉంటారు. ఎందు కంటే వారి కళలోని విశేషాలు, పూజా విధి విధానాలతో చాలా దగ్గర సంబంధాన్ని కలిగి ఉంటాయి. నిజానికి ప్రతి కార్యక్రమమూ దేవాలయ కేంద్రంగా, ఆలయం కోసం జరిగేదే. – పెద్ద ఎత్తున ఆహారం వండి వార్చటం, పూలదండలు కట్టటం దగ్గరనుంచి ఆర్థిక విషయాల నిర్వహణ, ఉద్యోగుల నియామకం వరకూ ఆ గొప్ప ఆలయ సముదాయాలు వాటిలోపల గోడల మధ్య నగరాలను కలిగి ఉంటాయి. ఆ నగరాలు ఆలయాలను దాటి కొనసాగుతుంటాయి. ఆ గోడల మధ్య ప్రధాన, ఉప ఆలయాలు ఉంటాయి, కోనేరు లుంటాయి, చిన్న, పెద్ద భోజనశాలలుంటాయి, నిర్వహణ కార్యాలయాలు, ప్రజా సంబంధిత కార్యాలయాలు, బజార్లు, వివిధ రకాలైన నివాస గృహాలు అన్నీ ఉంటాయి. దేవస్థానానికే

ఎప్పుడూ ఎక్కువ భూమి ఉండటంతో, ఆ ప్రాంతంలో ఎక్కువమందికి ఉపాధి కల్పించటంతో, స్థానిక ఆర్థిక రంగానికి మూలస్థంభంగా ఉండేది. వంటవాళ్ళు, గోసంరక్షకులు, గుమాస్తాలు, నిర్మాణ ఇంజనీర్లు ఎలాగైతే ఆలయానికి అనుబంధంగా ఉంటారో, సంగీత విద్వాంసులూ అలాగే ఉంటారు. దేవతలకు సంబంధించిన పండుగలు వచ్చినప్పుడు గాయకులు, నర్తకులు ప్రదర్శనలు ఇస్తారు. ఇది దక్షిణాదిన సంప్రదాయ ప్రదర్శన కళలకున్న బలమైన మతపరమైన భావనలకు గుర్తు. ప్రత్యేకంగా సంగీతం దేవతల కోసం చదివే స్తోత్ర రూపంగా ఎదిగింది.

కచ్చితంగా ఈ పద్ధతి ఎప్పుడు మొదలైందనేది జానపద కథా ప్రాంతంలో దొరుకుతుంది. మిగిలిన కళలతోపాటు సంగీతం కూడా వేదాలతో అనుసంధానింపబడుతుంది. వేదాలు క్రీస్తుపూర్వం 2000 సంవత్సరాల నాటివి. (ఋగ్వేదం క్రీస్తుపూర్వం 3000 కాలంనాటిది. అంత ప్రాచీనం) నాటకం, నాట్యం, సంగీతం ఇవన్నీ భరతముని రాసిన నాట్యశాస్త్రంలో భాగంగా ఉన్నాయి. నాట్యశాస్త్రం క్రీస్తుపూర్వం 400 నుండి క్రీస్తు తర్వాత 500 సంవత్సరాల మధ్యకాలంలో ఉండేదంటారు; అందరూ సామాన్యంగా అంగీకరించే కాలం క్రీస్తు తర్వాత 100 నుంచి 200 సంవత్సరాల మధ్యకాలాన్ని. నాట్యశాస్త్రంలో ఈ కళలన్నీ కలిసిపోవటం గందరగోళాన్ని కల్పించింది. అతి కీలకమైన ప్రశ్న యేంటంటే: భరతుని ఆలోచనలో సంగీతం కేవలం నాటకం కోసం వచ్చినదేనా? నాట్యశాస్త్రంలో నాటకం మొదలయ్యే ముందు పూర్వరంగంలో భేరీలనూ ఇతర సంగీత వాయిద్యాలనూ మ్రోగించటం అందరి దృష్టినీ ఆకర్షించటానికే. ఎందుకంటే ప్రేక్షకుల్లో కుదురులేని "స్త్రీలు, పిల్లలు, మూర్ఖులు" కూడా ఉంటారు. మళ్ళీ ఆ గ్రంథం కొన్ని ప్రతుల్లో ముగింపులో సంగీత పుస్తకం అనే శీర్షిక పద్ధతి ప్రకారం ఉంటుంది. ఈ గ్రంథాన్నంతా భరతుడే రాశాడా? లేక ఈ పుస్తకంలో ఇతరులు రాసినవి కూడా చేరాయా?

వేదాలతో కళలను అనుసంధానం చేయటం భారతీయ స్వాభావిక విధానం. మానవుల నిత్య జీవితంలో ప్రధానమైన వాటన్నిటినీ నొక్కి చెబుతాయి వేదాలు. అది మొక్కల గురించి కావచ్చు (తులసి వంటివి) జీవనాధార జంతువులు కావొచ్చు (ఆవులు). ప్రాచీన తమిళ దేశంలో సంచార సాధు గాయకుల ప్రభావంవల్ల సంగీతం ప్రజల నిత్య జీవితంలో మరింతగా కలిసిపోయింది. ప్రసిద్ధ వ్యక్తులైన తిరుజ్ఞాన సంబందార్, తిరునవుక్కరసర్, సుందరమూర్తి నయనార్ (ఏడు నుంచి తొమ్మిదవ శతాబ్దాలు) దేవరమ్ (దేవుని స్తుతించే స్తోత్ర పాఠం) అనేను సుస్థాపితం చేయటంతో ఒక ప్రజా పునాదిని సంపాదించుకుంది. దేవరమ్ తమిళ వేదంగా పరిగణింపబడుతూ దక్షిణ భారతదేశంలో శైవమతాన్ని నాటుతూ, అనేక గొప్ప దైవ స్తోత్ర శ్లోక పాఠాలను కలిగి ఉంటూ ప్రజాదరణ పొందింది. అలాంటి సంగ్రహాన్ని సంగీత కృతిగా మాత్రమే కాకుండా కవిత్వంగా కూడా చూస్తారు;

పాడటం కాకుండా పఠిస్తారు. కానీ ఆకృతులు రాగ, తాళబద్ధంగా కూర్చబడి ఉంటాయి. వాటిని ముషవు (డోలు) యాష్జ్, కుష్జల్ (వేణువు) అనుసరిస్తాయి. ఇలాంటి రాగబద్ధ కృతులు దేవాలయాల్లో మొదటి గానానికి తప్పకుండా దోహదపడి ఉంటాయి. సంబందార్ మనకివాళ కృతులుగా తెలిసిన వాటిని స్వరపరచిన మొదటి కవి.

ఆది తమిళ సంగీత ప్రాచీన రూపాన్ని, చివరకు కర్ణాటక సంగీతంగా మారిన రూపంతో అనుసంధానం చేయటంలోని విలువను గురించి పండితులు విబేధిస్తారు. కొందరు ఈ రెండిటి సంబంధం చాలా దగ్గరిదనీ, సజీవమైనదనీ అంటారు. ఈ వాదనను సమర్థించేవారి ప్రకారం తమిళదేశంలో ప్రాచీన కాలంలోనే స్వప్త స్వరాలపై ఆధారపడిన నిర్మాణంతో, శ్రుతి, రాగం, పాటలతో బాగా అభివృద్ధి చెందిన ద్రవిడ సంగీతం ఉండేది. వారి రాగాలలో అనేకం, తర్వాతి రోజులలో కర్ణాటక సంగీత మూలధనాలని చెప్పదగిన రాగాలకు అతి దగ్గరి పోలికలతో ఉన్నాయి. ఇంకా ముందుకు వెళితే, ఈ వాదన సమర్థించే వారు తేవరమ్ పాటలే తమిళనాడు సంగీత సారాంశమని గట్టిగా చెబుతారు. దానితోబాటు అలాంటి సంగీతమే కర్ణాటక సంగీతానికి పునాది అని కూడా అంటారు.

ఐతే, మరికొందరు ఆది తమిళ సంప్రదాయానికీ పందొమ్మిదివ శతాబ్దానికి ఏ మాత్రపు కొనసాగింపు సూత్రంలేదనే వాదంవైపు మొగ్గుచూపుతారు. వీరి ప్రకారం కర్ణాటక సంగీతపు పురాతనత్వాన్ని మరీ అంత వెనక్కు తీసికెళ్ళలేమనీ, ఎందుకంటే ప్రాచీనయుగపు రికార్డులు భద్రపరచలేదు లేదా పోయాయి గనుక సాంస్కృతికపరమైన సుదీర్ఘ విరామం, మరపు ఉంది. అందువల్ల సంఘం కాలాన్ని గానీ, తేవరం సంప్రదాయాన్నిగానీ కర్ణాటక సంగీత ప్రవాహపు తొలి ఊట బావులుగా భావించలేము. మధురై కూడా కర్ణాటక సంగీతపు అభివృద్ధిలో ప్రాధాన్యతలేనిదే అవుతుంది. మనకీరోజు తెలిసిన దాని ప్రకారం కర్ణాటక సంగీతానికి 500 లేదా 600 సంవత్సరాలకంటే ఎక్కువ వయసులేదు.

పండితుల మధ్య ఈ భిన్నాభిప్రాయాలకు సిద్ధాంతరీత్యా కులపరమైన కోణం వుండి వుండవచ్చు. చరిత్రలో ద్రవిడ, సంస్కృత భాగాల మధ్య ఒక గీత గీయాలనీ, అలాగే బ్రాహ్మణేతర మూలాలకూ, బ్రాహ్మణీయ ఫలాలకూ మధ్య విభజన రేఖ గీయాలనే సహజ సిద్ధమైన కోరిక ఆ అభిప్రాయం భేదాలకు కారణం కావచ్చు. తేవరం ఆచార్యులలో ఇద్దరు, కాదంటే కనీసం ఒకరు బ్రాహ్మణులు. అంతేగాక దక్షిణ భారతదేశపు దక్షిణ భాగంలో శివ సిద్ధాంతం బలంగా ఉంది. ఈ సిద్ధాంతం మౌలికమైన తమిళ తాత్విక చింతనాధార. వేద, వేదాంత పద్ధతులకు వ్యతిరేకంగా అభివృద్ధిచెందింది. ఈ శైవ సిద్ధాంతం బ్రాహ్మణేతర అగ్రవర్ణ ఉద్యమం నుండి పుట్టింది. బ్రాహ్మణీకరించబడిన శివుడి చుట్టూ కేంద్రీకరించబడింది. ఐతే ఈ సిద్ధాంతానికి వైదిక బ్రాహ్మణులపట్ల ఎంత వ్యతిరేకత ఉంటుందో, నిమ్నజాతులపట్ల అసహ్యం కూడా అంతగానే ఉంటుంది.

ఏమైతేనేం, కర్ణాటక సంగీతపు ఆధునిక దశ పురందరదాసు (1484–1564)తో మొదలైందని అందరూ అంగీకరిస్తారు. విజయనగర సామ్రాజ్యపు రాజధాని అయిన హంపిలో (ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలో ఉంది) పుట్టిన పురందరదాసు సంపన్నుడైన వజ్రాల వ్యాపారి. ఆయన జీవితపు తొలిదశలో భయంకరమైన పిసినారిగా ప్రసిద్ధికెక్కాడు. ఐతే భార్య ప్రభావంతో ఆయన హృదయంలో ఆధ్యాత్మికమైన మార్పుని అనుభవించాడు. ఆ తర్వాత జీవితమంతా తంబూర వాయించుకుంటూ, భగవంతుని కీర్తిస్తూ పాటలు పాడుకుంటూ, వాగ్గేయకారుడిగా, గాయకుడిగా తిరుగుతూ సంచారిగా బతికాడు. ఐతే అతను అంతకు ముందటి భక్తులకంటే భిన్నమైనవాడు. ఆయన తన సంగీతానికి ఒక రూపాన్ని, పలుకుబడిని సాధించాడు. మాయామాళవగౌళ రాగాన్ని ప్రాథమిక రాగంగా మార్చటంతోనూ (ఆ రాగ స్వరాలు పొరపాటుపడలేనంత ప్రత్యేకమైనవి) ఆ రాగానికి ఆది తాళాన్ని వినియోగించటంతోనూ ఆయన సంగీతాన్ని నేర్చుకునేందుకు ఒక శాస్త్రీయ చట్రాన్ని తయారుచేశాడు. ఈరకమైన శాస్త్రీయత 17వ శతాబ్దపు సంగీతకారుడైన వెంకటమఖి "చతురదండి ప్రకాశిక"ను రాయటంతో సంపూర్ణమైంది. అంతకుముందు ఎవరూ ఆలోచించనిది ఆయన సాధించాడు. మేళాలలో సంపూర్ణ సిద్ధాంత పద్ధతినీ, రాగ ప్రస్తారాన్నీ ఏర్పరిచాడు. మేళకర్తలుగా పిలవబడే (72 ప్రాథమిక మూల రాగాలు) యివి ఒక కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరింపజేశాయి. ఒక జనకరాగం నుంచి వందల జన్య రాగాలు ఆవిర్భవిస్తాయి. దక్షిణ భారతీయ సంగీతంలో మొదటిసారిగా కళకు సైన్సు ఒక పునాదిని ఏర్పరచింది.

అనేక మంది సిద్ధాంతకర్తల రచనల నుండి అనేక లక్షణాలు ప్రత్యేకంగా భారతీయమని, మరిన్ని లక్షణాలు దక్షిణ భారతానికి ప్రత్యేకమనీ గుర్తింపబడ్డాయి. ఉదాహరణకు రాగం ప్రత్యేకంగా భారతీయమైనది. సప్తస్వరాలను 22 శ్రుతుల కొలబద్ధగా విభజించటం అనేది విశ్వవ్యాప్తంగా ఉన్న 12 సెమిటోన్ పద్ధతి నుంచి విడిపోయేలా చేసింది. దానివల్ల ఒనగూడిన ప్రయోజనం ఏమిటంటే భారతీయమైన ఈ పద్ధతి మిగిలిన పద్ధతులకంటే మరిన్ని వైవిధ్యాలకు అవకాశాన్ని, అనుమతినీ ఇస్తుంది. లయకీ, దాని సాంకేతికతలకీ భారతీయ సంగీతం ఇచ్చిన ప్రాధాన్యత, దానిని మిగిలిన వాటికంటే భిన్నంగా చేయటమే కాదు, సంపన్నంగా కూడా చేసింది. వాయిద్యాలకంటే కంఠస్వరానికి ప్రాధాన్యం వచ్చింది. కచేరి కంటే సంగీతకారుడికి ప్రాధాన్యం వచ్చింది.

ఏదేమైనా 16వ శతాబ్దపు మధ్యకాలానికి దక్షిణ భారత సంగీతానికి, ఉత్తర భారత సంగీతానికి భౌగోళికమైన విభజన జరిగింది. దక్షిణాది సంగీతం తన స్వచ్ఛతను నిలబెట్టుకుంది. దానికి కారణం దూరప్రాంతాల వారి దండయాత్రల తాకిడికి గురికాకపోవటమే. ఉత్తర ప్రాంతాలు మొఘల్, పర్షియన్, ఈజిప్షియన్, అరేబియన్ ప్రభావాలకు లోనయ్యాయి.

దక్షిణ భారత సంగీతం మాత్రం తనదైన ముద్రల, ప్రభావాలతో సంపూర్ణమై సుసంపన్న మైంది. అనేక పోలికలు, సామ్యాలూ ఉన్నప్పటికీ ఎన్నో భేదాలు కూడా తలెత్తాయి. ముఖ్యంగా రాగాల అమరికలో, అల్లికలో వాటి ఆలాపనలో ఉన్న సాంకేతికలకు సంబంధించిన భేదాలే అనేకం ఉన్నాయి. సాధారణంగా హిందూస్తానీ సంగీతకారులు రాగ భావాన్ని సృష్టించటంపై దృష్టి నిలుపుతారు. శ్రోతలలో ఆ భావాన్ని కలిగించేందుకు మూల స్వరాలమీద మూల శృతి మీదా ఎక్కువసేపు నిలబడతారు. ఇంకోవైపు కర్ణాటక సంగీత విద్వాంసులు రాగభావాన్ని వేగంగా కలిగించేందుకు సంక్లిష్టమైన స్వర సంగతుల వైవిధ్యాన్ని, ఇతర పద్ధతులను ఉపయోగిస్తారు. శాస్త్రం, పద్ధతి కర్ణాటక సంగీతంలో అత్యంత ప్రధానం. హిందూస్తానీలో అలాకాదు. కర్ణాటక సంగీతం పాడేటప్పుడు కీర్తనలోని పదాలు కేంద్రంగా ఉంటాయి. హిందూస్తానీలో పదాలు సంగీతాన్ని మోసే సాధనాలుగా ఉంటాయి.

చాలావరకు దక్షిణ భారతం విదేశీ ప్రభావాల నుంచి తప్పించుకోగలిగినా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిపడే ఆక్రమణల ఒత్తిళ్ళనూ, సాంస్కృతికమైన సవాళ్ళను తట్టుకుని నిలబడగలగాలి. భాషాపరంగా నాలుగు గట్టి ప్రాంతాలుగా విభజింపబడి ఉండటం దక్షిణ భారత సాంస్కృతిక భిన్నత్వాన్ని మౌలికంగా నిర్ణయించింది. అనేక ప్రాంతాలలో ఈ విభేదాలు రాజీపడకుండా మిగిలిపోయాయి. ఐతే సంగీత రంగంలో మాత్రం మొదటి నుంచీ అందరి ఆసక్తులూ ఒక నిర్మాణ రూపం తీసుకున్నాయి. ఇరవయ్యవ శతాబ్దపు మొదటి భాగంలో కొంత విభేదాలు వచ్చినా, ప్రారంభవత్సరాలలో కర్ణాటక సంగీతం ఒకే రూపాన్ని, సారాన్ని – ఒక కాథలిక్ పద్ధతిలో, దేనిని ఒదలకుండా, అందరికీ దగ్గరవుతూ వచ్చింది. ఆ సంగీత కళను సామూహికంగా ఆరాధించటంలో అంతర్గతమైన ఆటంకాలు మాయమైపోయాయి.

ఈ సంగీత ప్రియుల ఆరాధకుల ఐక్యతకు నిదర్శనంగా ఇంగ్లీషుపదమైన "కర్నాటిక్" అనే పేరు నిలబడిపోయింది. ఆ పదం వలస పాలకుల అక్రమ సృష్టి కావచ్చు గానీ దానిని మొదట పోర్చుగీసువారు ప్రారంభించి ప్రచారంలో పెట్టారు. తర్వాత బ్రిటీష్‌వారు కొనసాగించారు. వాళ్ళిద్దరూ "కర్ణాటక" అనే పదంలోని ధ్వన్యాక్షరాలతో ఇబ్బందిపడ్డారు. ఈ పదం పుట్టుకను భౌగోళికంగా కెనరాకు, కెనరాప్రాంత ప్రజలకు ఆపాదించవచ్చు. ఐతే యూరోపియన్ పాలనా కాలంలో కెనరా భాషాపరమైన గోడలను దాటి విస్తరించి, మలయాళ భాషా ప్రాంతమైన మలబార్‌ని కూడా కలుపుకుంది. విజయ నగర సామ్రాజ్యం కర్ణాటక ప్రాంతంలో తన అధికారాన్ని సుస్థిరం చేసుకున్నప్పుడు తెలుగు భాష మాట్లాడే ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలను కూడా కలుపుకుంది. తర్వాత ఆర్కాట్ నవాబు (ఇప్పుడు తమిళనాడులో ఉంది) విజయనగర సామ్రాజ్యంలో కొన్ని భాగాలను

ఆక్రమించి తనకు "కర్ణాటక నవాబు"గా తానే బిరుదునిచ్చుకున్నాడు. అతని పాలనా కేంద్రం తమిళనాడు నడిగడ్డలో ఉండేది. ఇట్లా కర్ణాటక అనేది దక్షిణాది అంతటా మాట్లాడే అన్ని భాషా ప్రవాహాల సంగమ సంకేతంగా మిగిలిపోయింది. 1947వ సంవత్సరంలో భారతదేశం స్వతంత్రమైనప్పుడు పాశ్చాత్యీకరణకు గురైన భారతీయ పేర్లు చెల్లుబాటు కాకుండా పోయినప్పటికీ ఇంగ్లీషు భాషలో జరిగే చర్చలలో దక్షిణాది సంగీత రీతిని "కర్నాటిక్" అని ప్రస్తావించటం కొనసాగుతూనే ఉంది. భారతీయ భాషలలో దీనిని "కర్ణాటక సంగీతం" అంటారు. కొంతమంది కర్ణాటక అనే పదానికి "ప్రాచీనమైన, అప్పటికే ఉనికిలో ఉన్న" అనే అర్థం ఉందని చెబుతారు. మరింత విస్తృతంగా చూస్తే ఆ పదం ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలో ఉన్న బళ్ళారి ప్రాంతం వాడైన పురందరదాసు చేసిన అపూర్వమైన కృషికి గుర్తింపుగా ఉంది. పుట్టుక ఏదైనప్పటికీ ఆ పదం కర్ణాటక రాష్ట్ర భౌగోళిక రాజకీయ ప్రాంతానికే పరిమితమై ఎప్పుడూ లేదు. మిగిలిన వారిని అవతలికి నెట్టలేదు. కర్ణాటక పదానికున్న అసలైన విలువ ముఖ్యంగా ఇదే. ఇంగ్లీషులో రచనచేసే ఆధునికులు కొందరు Carnatic అని రాయటానికి బదులు Karnatak అని రాస్తారు. వారు బహుశ Carnaticను వలస పాలకులు కూర్చిన అక్షర క్రమంగా అనుకుని ఇక అది వాడుకలో ఉండరాదని అభిప్రాయపడతారు. కానీ భాషాపరంగా గుర్తించబడిన భారతదేశంలో "Karnatak music" అంటే అది కర్ణాటక రాష్ట్రానికి చెందిన సంగీతంగా పొరబడే అవకాశం ఉంది. "Carnatic" అన్నప్పుడు ఆ ప్రమాదపు వలలోంచి నేర్పుగా బయటపడవచ్చు.

❖ ❖ ❖ ❖

చారిత్రక వాస్తవం ఏమిటంటే కర్ణాటక సంగీత పిత్రు పితామహులు దక్షిణ భారత దేశపు నాలుగు భాషా ప్రాంతాల నుంచీ వచ్చారు. అపూర్వంగా సాగిన పురందరదాసు, ఆయన తరువాత దీనిని అందుకున్న వెంకటమఖి కన్నడీగులు. "కీర్తన రూపానికి జనకుడు" అని కీర్తించబడే అన్నమాచార్యుడు (1408–1503) తెలుగు ప్రాంతానికి చెందినవాడు. 108 తాళరీతులను పరిపూర్ణం చేసిన అరుణగిరినాధర్ (15వ శతాబ్ది) తమిళుడు. 15 నుంచి 17వ శతాబ్దం వరకూ వున్న కాలంలోని సృజనాత్మకత ఆధారంగా ఒక పునాది యేర్పడిన తర్వాత, ఆధునిక కర్ణాటక సంగీత మహత్తర నిర్మాణాన్ని అమోఘ సృజనశీలురైన ముగ్గురు మహానుభావులు సృష్టించారు. వారికి తగిన గౌరవవాచకంతో "త్రిమూర్తులు"గా గుర్తింపు పొందారా సంగీతవేత్తలు. ఈ త్రిమూర్తులలో, మొదటివాడైన అగ్రగణ్యుడని ప్రజలతో కీర్తింపబడ్డ త్యాగరాజు (1767–1847) తెలుగువాడు. మిగిలిన ఇద్దరూ, ముత్తుస్వామి దీక్షితార్ (1776–1835), శ్యామశాస్త్రి (1762–1827) తమిళులు. అత్యంత ఆశ్చర్య కరంగా, కాకతాళీయంగా వారు ముగ్గురూ తిరువారూర్ అనే గ్రామంలో జన్మించారు.

తిరువారూర్ తంజావూరు జిల్లాలో ఉంది. ఆ గ్రామంవల్ల తంజావూరు జిల్లా ఈ భూమి మీదవున్న పవిత్ర స్థలమైంది. కారణం కర్ణాటక సంగీతం.

మలయాళంలో సంగీతపు అల్లిక (అమరిక) సాధారణ రీతిలో ఉంచి సోపాన సంగీతం అన్నారు. ఈ సంగీతాన్ని దేవాలయంలో దేవుని దగ్గరకు చేరే మెట్లముందు నిలబడి పాడతారు గాబట్టి పోసాన సంగీతమని పిల్చారు. 18వ శతాబ్దంలో సోపానం, కథాకళి సంగీతం రెండూ కర్ణాటక రాగాలను సంగ్రహిస్తున్నాయి. కర్ణాటక సంగీతానికి మలయాళం నుంచి ప్రత్యక్షంగా సంగీత సంపద అందటం ట్రావన్కూర్ మహారాజైన స్వాతి తిరునాళ్ (1813– 47)తో ప్రారంభమైంది. ఆయన తన జీవితాన్ని సంగీతానికే అంకితం చేశాడు. కవి, గాయకుడు, సంగీతకారుడు అయిన స్వాతి తిరునాళ్ సంస్కృతంలో, మలయాళంలో, తెలుగులో కీర్తనలు రాశాడు. తను రాసిన కొన్ని కీర్తనలకు హిందూస్తానీ రాగాలలో సంగీతాన్ని సమకూర్చాడు. కర్ణాటక సంగీత చరిత్రలో ట్రావన్కూర్ ఒక వ్యూహాత్మక పాత్రను నిర్వహించింది. ఒకవైపు త్రిమూర్తులుగా పేరొందిన వారి సృజనాత్మకత వికసిస్తున్నప్పుడే దక్షిణ భారతం యూరోపియన్లు ప్రేరేపించిన, కల్పించిన యుద్ధాలకు ఎరగా మారింది. ఒక సాధికారిక ఆధారం ప్రకారం: "యుద్ధాల భీకరత్వాన్నుంచి తప్పించుకో గలిగిన ఒకే ఒక్క దక్షిణ భారత స్వదేశీ రాజ్యం ట్రావన్కూర్. అందువల్ల అక్కడ సంగీతం వెల్లివిరిసి వర్ధిల్లింది. మైసూరు, తంజావూర్లలోని సంగీత విద్వాంసులు, తమ రాజ్యాలు పతనమయ్యాక, నెమ్మదిగా మరింత దక్షిణాన ఉన్న రాజ్యానికి వెళ్ళి, మిగిలిన అన్ని ప్రాంతాల కంటే అక్కడ ఉండటం క్షేమమని భావించారు.

ఇలా దక్షిణ ప్రాంతం అంతటా జరుగుతున్న బహుభాషా సంగీతాభివృద్ధికి ఒక గంభీరమైన సెంటిమెంటుతో కూడిన చీలిక వచ్చింది. 1941లో చిదంబరంలో (తమిళ నాడులో ప్రసిద్ధ దేవాలయ పట్టణం) జరిగిన సభలో ఒక తీర్మానం చేశారు. ఆ తీర్మానంలో "తమిళనాడులో సంగీత విద్వాంసులు కచేరి ప్రారంభంలోనూ, సమాపనంలోనూ తమిళ కీర్తనలే పాడాలని కోరుతున్నాం. సంగీత కచేరీల నిర్వాహకులు కచేరీలో తమిళ కీర్తనలు ప్రముఖంగా ఉండేలా హామీ పడాలి." ఈ తీర్మానం చేసినప్పటి నుంచీ తమిళ ఇసై ఉద్యమం మొదలయింది. దాదాపు ఐదారు సంవత్సరాలు ఈ ఉద్యమం కర్ణాటక సంగీత ప్రపంచంలో ఆపలేని క్రోధాన్ని రేపింది. ఈ సభ నిర్వహించినవారు ఆ రోజుల్లోని బ్రాహ్మణేతర ప్రముఖులు. రాజా సర్ అన్నామలై చెట్టియార్, రత్నసభాపతి మొదలియార్, శ్రీ షణ్ముఖం చెట్టి, టి.కె. చిదంబరనాథ మొదలియార్ వంటి ప్రముఖులు ఆ సభా నిర్వహణలో ఉన్నారు. జస్టిస్ పార్టీ నాయకులు కొందరు కూడా ఈ సభలో భాగస్వాములుగా ఉన్నారు. దీనిని చూసి సహజంగానే తమిళ ఇసై కూడా శక్తివంతమైన బ్రాహ్మణ వ్యతిరేక పవనాలలో భాగమని అనుకోవచ్చు కానీ ఆ విషయం అంత సామాన్యమైనది కాదు.

తమిళ ఇసైకి మద్దతిచ్చే వారిలో సంప్రదాయ బ్రాహ్మణుడు, అగ్రశ్రేణి రాజకీయ నాయకులలో ఒకడు అయిన సి. రాజగోపాలాచారి, ప్రముఖ రచయిత, పాత్రికేయుడు, బ్రాహ్మణుడు అయిన కల్కి కృష్ణమూర్తి కూడా ఉన్నారు. ఈ సందర్భంలో తమిళ భాషా సెంటిమెంట్లు కులాన్ని కూడా అధిగమించాయి.

కర్ణాటక సంగీత సంస్కృతి తెలుగు, సంస్కృత కీర్తనలతో కలిసి వాటి కీలక ప్రభావంతో వృద్ధిచెందిందనేది వాస్తవం. అందరూ ఆ రోజుల్లో సాధారణంగా చేసే ఆరోపణ యేమిటంటే తమిళ పాటలు సంగీత కచేరి చివరలో పాడే చిన్న ముక్కలుగా ఉన్నాయనీ, ప్రేక్షకుల్లోని పాటక జనాల వినోదం కోసం విసిరేసే చిన్న ముక్కలుగా ఉన్నాయనీ. బహుశ ఈ ఆరోపణకు కొంత విలువ వుండవచ్చు. కానీ తమిళ సంగీతకారులు తమిళ పాటలే పాడాలనే సూచన అనేకమంది సంగీత ప్రియులకు అతివాదమని అనిపించింది. కర్ణాటక సంగీతంలో ఉద్దండ పండితులు, తమిళ బ్రాహ్మణులు అయిన ముగ్గురు, అరైకుడి రామానుజ అయ్యంగార్, సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్, ముసిరి సుబ్రహ్మణ్య అయ్యర్‌లు తమిళ ఇసైకు అనుకూలంగా లేరు. ఈ ముగ్గురు అనేక తమిళ కృతులకు ప్రజాదరణ కల్పించారు. వాళ్ళా పని ఈ ఉద్యమం మొదలవకముందే చేశారు. వాస్తవంగా అరైకుడి తను ఎప్పుడూ అనుసరించే పద్ధతి నుంచి వైదొలగటానికి నిరాకరించాడు. ఆయన తన కచేరీని తెలుగు వర్ణంతో ప్రారంభిస్తాడు. సంగీతజ్ఞుల ప్రపంచాన్ని దాటి వెళ్తే, ఈ వ్యతిరేకత మరింత గట్టిగా ఉంది. హిందూ దినపత్రిక, రాజగోపాలాచారి వంటి బ్రాహ్మణ ప్రముఖులతో ఏకీభావంతో ఉన్నప్పటికీ ఈ ఉద్యమాన్ని వ్యతిరేకించి ఇలా హెచ్చరించింది. “విశ్వ జనీనమూ, విశ్వవ్యాప్తమూ అయిన సంగీతంలో ఇరుకు బుర్రల ఆధిపత్యం చొరబడు తున్నది. “బ్రాహ్మణ వర్గా మూలస్తంభమూ ప్రముఖుడు అయిన టి.టి. కృష్ణమాచారి (తర్వాత జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో ఆర్థికమంత్రి) ఇలా అన్నాడు. “ధ్వన్యా లోకంలో సౌందర్యం కోసం పదరహితంగా జరిగే అన్వేషణే సంగీతం.” మరికొందరు కూడా ఉద్యమాన్ని తమ వ్యంగ్యపూరిత నిరసన వ్యాఖ్యాలతో విమర్శించారు: “మృదంగం కూడా తమిళంలో వాయిస్తారా?” చివరికి ఆ ఉద్యమం కర్ణాటక సంగీత సంస్కృతికి ఎలాంటి ప్రమాదమూ తెచ్చిపెట్టకుండానే చల్లారిపోయింది. త్యాగరాజు, ఆయన భాషైన తెలుగూ లేకుండా శాస్త్రీయ సంగీతాన్ని ఎవరూ ఊహించనైనా లేరనేది స్పష్టం. పండితుడు, విమర్శకుడు అయిన కె.యస్. రామస్వామిశాస్త్రి తెలుగును “భారతీయ భాషలలో అత్యంత సంగీతవంతమైనది” అని వర్ణించాడు. అజంత పదాలున్న భాష కాబట్టి తెలుగును “ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్” అని కూడా అంటారు. కర్ణాటక సంగీతాన్ని, దాని విడి విడి భాగాల మొత్తంగా కాకుండా, దానిని మించిన వ్యక్తీకరణగా భావిస్తారు. ప్రముఖ సంగీత విద్వాంసులు దానినలాగే అర్థం చేసుకున్నారు. యస్.వి. రామమూర్తి పరిశీలన వారి

దృక్పథానికి ఒక కచ్చితమైన ఉదాహరణ "త్యాగరాజు సంగీతం దక్షిణ భారత సంస్కృతి యొక్క సమ్మేళనం. దాని వ్యాకరణం కర్ణాటక, అంటే, దక్షిణ భారతం."

ఐతే పునరాలోచిస్తే తమిళ ఇసై ఉద్యమం ఆ రోజుల్లోని తెలుగు – సంస్కృత ఆధిపత్యానికి ఒక చారిత్రక వివరణ. సంస్కృతం అప్పటికే జ్ఞానానికి, సంస్కృతికి నిలయమైన భాషగా సుస్థిరంగా ఉంది. ముత్తుస్వామి దీక్షితార్ వంటి విద్వాంసుడు, పండితుడు తను రాసే పాటలను అచ్చ తమిళంలో రాయడు. అతను అనివార్యంగా తన పాండిత్యానికి తగినదని భావించే సంస్కృతంలోనే రాస్తాడు. మరోవైపు తెలుగు, పాలకుల ఆస్థాన భాషగా మారింది. తంజావూరుని మధురను పాలించిన నాయకరాజులు తెలుగు వారు. తెలుగు భాష హోదాకు చిహ్నంగా మారింది. తరువాతి కాలంలో ఇంగ్లీషువలే. ఇది సంగీతం సమకూర్చేవారికి తెలుగును ప్రముఖంగా వాడటానికి బలమైన ఆకర్షణగా మారింది. అదనంగా, ఆ భాషలో సహజంగా ఉన్న సంగీతతత్త్వాన్ని వాళ్ళు గుర్తించారు. దానికితోడు స్వాతి తిరునాళ్ సంస్కృతాన్ని, తెలుగుని వాడటం అతను కర్ణాటక సమూహంలో కలిసిపోయేందుకు దోహదం చేసింది.

రాజకీయంగా ఉద్రిక్తంగా ఉన్న ఆ కాలంలో తమిళ ఇసై ఉద్యమం జాతీయ ఆకాంక్షలనే ప్రతిఫలించింది గానీ, ఆ కాలంపు బ్రాహ్మణ వ్యతిరేక భావనలను ప్రతిబింబించ లేదు. కాంగ్రెస్ ఉద్యమం భాషా రాష్ట్రాల ఆలోచన ప్రారంభించి దానికి దేశభక్తి భావనను జతగలిపింది. స్థానిక భాషలను, సంస్కృతులను అభివృద్ధిచేసే ఏ ప్రయత్నమైనా మంచిదనీ, తగినదనీ భావించేవారు. దీనినిబట్టి చూసినప్పుడు రాజగోపాలాచారి వంటి కాంగ్రెస్ నాయకులు తమిళ ఇసై ఉద్యమంలోకి ఉత్సాహంగా యెందుకు దూకారో అర్థమవుతుంది. ఆ ఉద్యమం ఎంతో ప్రభావితం చేసింది. శాస్త్రీయ సంగీతం పాడే మధురై మణి అయ్యర్ నుంచి, దండపాణి దేశిగర్ వరకూ, ఎస్.సి. వసంత కోకిలమ్ నుంచి డి.కె. పట్టమ్మాళ్ వరకూ అచ్చ తమిళ పాటలు తమ సంగీత కచేరీలలో ప్రముఖంగా పాడసాగారు. యమ్.యస్. సుబ్బులక్ష్మి విషయం తీసుకుంటే, ఆమె ఉద్యమానికి మూలస్తంభంగా నిల బడింది. ఆమె భర్త సదాశివం రాజగోపాలాచారి అనుచరులలో అతిముఖ్యుడు గనుక తమిళ ఇసైకి మద్దతిచ్చే కార్యకర్త అయ్యాడు. ఆ కాలంలో యమ్మెస్ అన్నీ తమిళ పాటలే పాడింది. ఆమె తమిళ సంగీత వారసత్వాన్ని సంపూర్ణంగా తీసుకుని తను తప్పకుండా పాడే పాటల జాబితాను విస్తృతపరుచుకుంది. శిలప్పదిగారం (సిర్కా రెండవ శతాబ్దం క్రీస్తుపూర్వం) నుండి తేవరమ్ కవిత్వం నుండీ, తొలి పండితులైన ముత్తు తాండవర్, అరుణగిరినాధర్ వరకూ గల పాటలను పాడింది. అసలు విషయాన్ని మరింత స్పష్టంగా చెప్పటానికి, ఆమె తను పడే పాటలలో కల్కి కృష్ణమూర్తి రాసి స్వరపరచిన పాటలను కూడా చేర్చుకుంది. కల్కి కృష్ణమూర్తి ప్రధానంగా వచన రచయిత.

చివరికి తమిళ ఇసై విషయంలో రాజకీయాలదే పైచేయి అయింది. తమిళుల మొదటి నగరం అయిన మద్రాసు, దక్షిణ భారతదేశంలో బ్రిటీష్ పరిపాలనకు ప్రధాన కేంద్రంగా కూడా అయింది. నిజానికి మద్రాసు ప్రెసిడెన్సీ మొత్తం దక్షిణాదినంతా పొందు పరుచుకుంది. ప్రస్తుతపు ఆంధ్ర, కర్ణాటక, మలబారు ప్రాంతాలలో అధికభాగం మద్రాసు ప్రెసిడెన్సీలో ఉండేవి. మద్రాసు దక్షిణ భారతదేశపు అధికార కేంద్రం. అక్కడి నుంచే నిర్ణయాలన్నీ జరిగి నలుదిక్కులకూ వెళ్ళేవి. ఈ ప్రాధాన్యతలవల్ల మద్రాసు దక్షిణాదిన సాంస్కృతిక, మేధోపరమైన కార్యకలాపాలకు ప్రధానమైన ప్రథమ కేంద్రపు స్థాయికి ఎదిగింది. విద్య, నృత్యం, చిత్రలేఖనం మొదలన రంగాలలో అభివృద్ధికి మద్రాసు ప్రమాణాలే గీటురాళ్ళయ్యాయి. కర్ణాటక సంగీతంలో కూడా మద్రాసు అధికార కేంద్రంగా అభివృద్ధి చెందింది. 19వ శతాబ్దపు చివరి సంవత్సరాలలో ఒక సంగీత విద్వాంసునికి తంజావూరు లోనో, మధురైలోనో, మైసూరులోనో, తిరుపతిలోనో గుర్తింపు, గౌరవం, స్థానం దొరికితే సరిపోలేదు. నిజమైన, అసలైన గుర్తింపు కావాలంటే అతను లేక ఆమె మద్రాసు వెళ్ళి అక్కడ గుర్తింపు పొందవలసిందే. బ్రాహ్మణుల కంచుకోట అయిన మైలాపూర్‌లో నివసించే ప్రముఖుల చేత 1928లో మద్రాసు మ్యూజిక్ అకాడమి స్థాపించబడిన తర్వాత, కర్ణాటక సంగీతం తన “వాటికన్ కౌన్సిల్”ను వెంటనే తానే సంపాదించుకుంది. అది అధిష్టానపు అధికారానికి తిరుగులేని చిహ్నమైంది. రోమ్ నగరం లోపల వాటికన్ నగరం సార్వభౌమత్వం కలిగివున్నట్లుగానే, మైలాపూర్ మద్రాసు నగరంలోపల సర్వాధికారాలు కలిగి ఆర్థికంగా స్వతంత్రమైన కేంద్రమయింది. మ్యూజిక్ ఎకాడమి ఆమోదం పండితులను తయారుచేయ గలదు, అనంగీకారం వారిని నాశనం చేయగలదు. రాజకీయ, పాలనాపరమైన వొత్తిళ్ళు ఇసై ఉద్యమం సాధించలేని దానిని సాధించాయి. కర్ణాటక సంగీత సంస్కృతికి తమిళ కమ్యూనిటి నిర్ణాయకమైనదిగా, ప్రభావితం చేసేదిగా, తీర్పునిచ్చేదిగా తయారైంది.

యదార్థంగా దీనంతటికీ జీవశక్తినిచ్చింది, కదలిక తెచ్చింది కేవలం తమిళులు కాదు. తమిళ బ్రాహ్మణత్వం. తమిళ బ్రాహ్మణిజానికి మైలాపూర్ నాగరికతా కేంద్రం. ఆ ప్రాంతపు మూలస్తంభాలు తామే సమస్త కర్ణాటక సంస్కృతినీ అందించేవారమని, దానికి వారసులమనీ, అది అత్యంత సహజమైన విషయమనీ భావించేవి. కొందరు పాశ్చాత్య పరిశీలకులు చెప్పినట్లు మద్రాసు బ్రాహ్మణులు తమ అస్తిత్వాన్ని ఉత్తరాదినున్న తమ సోదర బ్రాహ్మణులకంటే మరింత తీవ్రమైన పద్ధతిలో సంరక్షించుకున్నారు. అందువల్ల వారి స్థితి దక్షిణాఫ్రికాలో తెల్లవారితో పోల్చదగినదిగా ఉంది. అది కొంచెం అతిగా ఆలోచించటమే గానీ తామే ప్రత్యేకం అనుకునే ధోరణి మైలాపూర్ స్వభావంగా వృద్ధి పొందింది. తమిళ ఇసై ఉద్యమం తమిళ సంగీతకారులకు కొంతవరకూ ప్రాధాన్యత కలిగించాలని మాత్రమే కోరితే, మైలాపూర్ బృందం తమిళము, తమిళ బ్రాహ్మణులు

ఇతరులకంటే సహజంగానే అధికులనే భావాన్ని పైకి తెచ్చింది. తమిళులు కాని సంగీత విద్వాంసులకు అతి ముఖ్యమైన మైలాపూర్ అంగీకార ముద్రలు సంపాదించుకోవటంలో సమస్యలు తీవ్రం కాసాగాయి. ప్రత్యేకంగా ఆంధ్రుల నైపుణ్యాన్ని అణచివేస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. వ్యవస్థాపకులు ఈ వ్యవహారాన్నంతా అంగీకరించారు గానీ అందులో ఇతరులకు హానిచేసే ఉద్దేశాలేమీ లేవని తిరస్కరించారు. కానీ హానిచేసే ఉద్దేశం లేకుండా జరిగిన పనుల ఫలితాన్ని అనుభవించిన ప్రముఖులలో ద్వారం వెంకటస్వామి నాయుడు వంటి భారతీయ వయొలిన్ విద్వాంసుడు ఉన్నాడు. ద్వారం తాను ఏ గాయకులకూ పక్క వాయిద్యంగా ఉండననీ, తన వీణావాదనను మాత్రమే వినిపిస్తాననీ తన తిరస్కారాన్ని ప్రకటించాడు. అసామాన్య వయొలిన్ విద్వాంసుడు మైసూరు చౌడయ్యను కూడా పక్కన పెట్టేశారు. ఐతే ఆయన అధిష్టానపు అమోదాన్ని పొందేందుకు రాజీ ప్రయత్నాలు చేశారు. మద్రాసు 'పోప్'ల నుండి తమిళ సంగీత పండితులు పొందినంత ప్రశంసలను పొందిన మొదటి ఆంధ్రుడు బాలమురళీకృష్ణ. అప్పటి నుంచీ కొత్త గాయకులైన నేదునూరి కృష్ణమూర్తి, ఓలేటి వెంకటేశ్వర్లు మొదలైనవారు తమిళ పట్టుని ఛేదించగలిగారు. చెంబై వైద్యనాథ భాగవతార్‌ని కూడా ఆయన పాల్ఘాట్ బ్రాహ్మణుడవటంవల్ల, విధిలేక కోపంతోనే అంగీక రించారనేది చిన్న విషయంగా తీసివేయవలసింది కాదు. పాల్ఘాట్ బ్రాహ్మణుడంటే అతను మలయాళంతో పలుచనైన బ్రాహ్మణుడన్నమాట.

❖ ❖ ❖ ❖

అదృష్టవశాత్తూ కర్ణాటక సంగీతంలో యిమిడి ఉన్న సహజసిద్ధమైన బలాలు, మౌలికమైన విలువలు ఈ సంకుచిత భాషా దురభిమానాల గాలి సోకకుండా వుండి పోయాయి. ఒక చెంబై గానీ, ఒక ద్వారం గానీ ఈ పోషకులను లెక్కచెయ్యకుండా ఉండ గలిగారు. దానికి కారణం వారి వ్యక్తిగత శైలి, ఈ పక్కకులాగే వాళ్ళకు అందనంత ఎత్తులో ఉంది – ఈ వ్యక్తిగత శైలి వారి కళకు కీలక కేంద్రంగా ఉంది. కర్ణాటక సంగీత సంప్రదాయం ఉదారమైనది. అందులో సంగీతం పాడేవాళ్ళకు పొగడ్తలు దక్కుతాయి. సంగీతాన్ని సమకూర్చినవారు అందరికంటే గొప్పవారయ్యే పాశ్చాత్య సంగీతంలా కాకుండా (మొజార్ట్, బీథోవెన్) కర్ణాటక సంగీతంలో సంగీతాన్ని పాడేవారే, వినిపించేవారే గొప్ప వారిగా గుర్తింపబడతారు. ఎప్పుడైనా కర్ణాటక సంగీతపు నిపుణత, కలిగించే స్పందన త్యాగరాజు కృతి గొప్పదనం మీద తక్కువ ఆధారపడుతూ, దానిని పాడుతున్న సుబ్బులక్ష్మి శైలి మీద ఎక్కువ ఆధారపడుతుంది. అంటే సంగీత ప్రదర్శనకు వచ్చిన స్పందన చూసినప్పుడు సంగీతం సమకూర్చినవారి మాతృభాష పెద్ద విషయం కాదు. గాయకుల వ్యక్తిగత శైలీ, వ్యక్తీకరణ అన్నిటిని మించిపోతుంది.

పాశ్చాత్య సౌందర్య సిద్ధాంతాలు సంగీతానికి, ఇతర కళలకూ మధ్య ఒక వ్యత్యాసాన్ని చూపెడతాయి. రచన, చిత్రలేఖనం, నృత్యం వంటి కళలలో వ్యక్తి తనశైలిని ఎలా చూపాడనే దాన్ని గుర్తిస్తారు. ఆ విమర్శకులు రచనలోకి అమానుషత్వం, మృగత్వాలు కూడా చొరబడ వచ్చని అంటారు. ఎందుకంటే ఒక వస్తువుపై అధికారం సంపాదించాలంటే విధ్వంసకరంగా ఉండవలసి వుంటుంది. దానిలోనని సారాంశాన్ని బైటికి తీసే క్రమంలో అది అందంగా, ప్రకృతిగా మారుతుంది. పాశ్చాత్య దేశాలను ప్రభావితం చేసిన విమర్శకులలో ఒకడైన రిచర్డ్ పయొరియల్ ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పాడు. "ప్రదర్శన అనేది అధికారాన్ని అమలుచేయటం, చాలా చాలా అలజడితో ఆందోళనతో కూడినది. కుతూహలాన్ని కలిగించేది. ఎందుకంటే ముందుగా అది భీకర స్వీయ పరిశీలనతో కూడినది. కాబట్టి స్వీయ ప్రేమాసక్తులతో కూడా కలిసి ఉంటుంది. తరవాత ప్రచారం గురించిన ప్రేమ గురించిన ఆతృత ఉంటుంది. చారిత్రక కోణాలు కూడా ఉంటాయి. రహస్య చర్యలను పోగుచేసుకోవటం ద్వారా చివరకు ఒక రూపం బైటికి వస్తుంది. అది తనకు తెలిసిన జ్ఞానం మీద అధికారం కోసం వాస్తవంతో పోటీపడుతున్నట్లుగా భావిస్తుంది." రచయితల గురించి చేసిన ఈ పరిశీలన పాశ్చాత్య సంగీతకారులకు కూడా వర్తిస్తుంది. ఎంతవరకంటే ఒక సంగీత ప్రదర్శన కూడా సంగీత దర్శకుడు, గాయకుడు ఇద్దరూ చేసిన ఒక వ్యక్తిగత సాధనగా చూసినంతవరకూ – కానీ పాశ్చాత్య పలుకుబడిలో గాయకుడు, సంగీత దర్శకుడు కూడా తనతోపాటు రంగస్థలం మీద ఉన్నట్లుగా భ్రమ కల్పించినప్పుడే అత్యుత్తమంగా పాడినట్లు భావిస్తారు. కర్ణాటక సంగీతాన్ని వినిపించే గాయకుడు అలాంటి భ్రమ కల్పించనవసరంలేదు. అతను సంగీతాన్ని అనువదిస్తాడు, తన మనోధర్మానికి కళ్ళాలు తీసివేస్తాడు. కానీ అతని ఉద్దేశం అతని స్వంత వాస్తవాన్ని సృష్టించడం. సంగీత దర్శకుడు ఉద్దేశించిన దానిని సృష్టించటంకాదు. ఈ అర్థంలో, కర్ణాటక సంగీతం పాశ్చాత్య సంగీతం కంటే, రచనకు దగ్గర పోలికతో ఉంటుంది. ఎందుకంటే గానం శ్రోతల మనసులను నియంత్రించటానికి ఒక గాయకుడు ఎలాంటి దాపరికాలూ లేకుండా చేసే అధికార విన్యాసం. ఒక తరపు గాయకులకు, సంగీత దర్శకులకు శిక్షణ ఇచ్చిన పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ దీనిని భిన్నంగా వివరించారు. "అంతవరకూ వారు వినని ఒక కొత్త రాగాన్ని గానీ కీర్తనను గానీ పాడి శ్రోతలను గెల్చుకోవటం చాలా తేలిక. కానీ కళాకారుడి నిజమైన నైపుణ్యం అందరికీ చిరపరిచితమై రాగాన్ని గానీ కీర్తనను గానీ తీసుకుని దానికి ప్రత్యేకమైన స్వల్ప వ్యత్యాసాలతో, సౌందర్య ఛాయలతో, ఎప్పుడో ఏర్పడిన దారిలో పాడేవారు పాడనట్లుగా పాడటంలో ఉంటుంది."

ఒక కీర్తనలో వున్న భిన్న సౌందర్య ఛాయలను మచ్చిక చేసుకునే ప్రయత్నంలో గాయకులు కొన్నిసార్లు విపరీతమైన నాటకీయ హావభావాలను, బలమైన శారీరక

విన్యాసాలనూ చేస్తుంటారు. ఒకోసారి అవి వారికి తెలియకుండానే జరుగుతాయి. కొన్ని సార్లు కావాలనే చేస్తారు. కర్ణాటక సంగీతాభిమానుల బృందాలలో ఇలాంటి వ్యాయామ ప్రదర్శనల గురించి తీవ్రమైన చర్చలు జరుగుతుంటాయి. చాలామంది నాటకీయ ప్రదర్శనను వ్యతిరేకిస్తూ మాట్లాడతారు. గాయకుడి లోలోపలి సంగీతం మేధోతనంతో, సౌందర్యంతో ఆవిష్కరించుకునే సందర్భంలో, ఎలాంటి శారీరకమైన శైలులనూ పద్ధతులనూ ప్రదర్శించాల్సిన పనిలేదని అంటారు. ముఖాన్ని అసహజంగా వంకరలు తిప్పటం, శరీరాన్ని అనవసరంగా కదిలించిటంవల్ల సంగీతపు ప్రశాంతత, పవిత్రతలకు భంగంకలిగి ఏకాగ్రతను పాడు చేస్తుందంటారు. సంగీతంపైనే ధ్యానముంచి, బైటినుంచి వచ్చే, జొరబడే వాటినన్నిటినీ వదిలేయగల అత్యుత్తమ గాయనిగా వారు సుబ్బులక్ష్మిని ఉదహరిస్తారు. ఆమె శారీరక విన్యాసాలను ప్రదర్శించదు. లోలోతుల నుంచి వచ్చే సంగీత శక్తిని సహజంగా ప్రవహించ నిస్తుందంతే.

"నిజమే – కానీ ఆమె కళ్ళు చూడండి" అంటారు కొందరు వ్యక్తులు. వాళ్ళు చాలా అతిశయంగా కనిపించే శారీరక కదలికలతో పాడేవాళ్ళను కూడా తప్పుపట్టరు. వాళ్ళ ప్రకారం, ఆమె కన్నుల భాష, ఇతర గాయకుల చేతి విసురులు చేసే పనినే చేస్తుంది. ఈ హావభావాలన్నీ తమ గానంతో గాయకులు ఎంతగా లీనమవుతున్నారనే దానిని తెలియజేస్తాయని వాళ్ళు గట్టిగా వాదిస్తారు. దానితోపాటు ఆ శారీరక విన్యాసాలు ఒక గాయకుని కళని, మరొకరి కళతో బేరీజు వేయటానికి ఆధారంగా ఉపయోగపడతాయని వారి భావన. ఎమ్.డి. రామనాథన్ రంగస్థలం మీద ప్రదర్శించే హావభావాలు తన గానాన్ని అతనెంత ఆనందిస్తున్నాడో తెలియజేస్తాయి; ఆ రకంగా అవి శ్రోతల ఆనందంలో భాగమవుతాయి. ఆయన శైలి ఆయన సంగీతంలో ఒక భాగం – డి.కె. పట్టమ్మాళ్ నిశ్చలనంగా పాడటం ఆమె సంగీతంలో భాగమయినట్లుగానే.

గాయకులు ప్రదర్శించే హావభావాల గురించిన వాదోపవాదాలలో శ్రోతల గురించి చాలా తక్కువ చర్చ జరుగుతుంది. మర్యాదస్తులైన కర్ణాటక సంగీత శ్రోతలు సంగీత సభ జరుగుతున్నప్పుడు పక్కవారితో సంభాషించే స్వేచ్ఛ ఉందనుకుంటారు. అదే పాశ్చాత్య సంగీత సభలలో అయితే దానిని సహించకూడని పనిగా భావిస్తారు. కర్ణాటక సంగీత శ్రోతలు తాళానికనుగుణంగా వేళ్ళను కదుపుతూ ఉంటారు. ఇది కూడా పాశ్చాత్యులకు నిషిద్ధమే. శ్రోతలను అలరించేందుకు కృషిచేసిన గాయకులు, తమ అభిమానులు వారి అనుభూతులను ముందే ఊహించిన పద్ధతిలో వ్యక్తీకరించాలని ఆశిస్తారు. గాయకుడు లేదా గాయని తమ గానంలో చివరిస్థాయికి చేరుకుంటున్నప్పుడు, శ్రోతలలో జరిగే సంభాషణలన్నీ ఆగిపోతాయి. తాళానికి అనుగుణమైన కదలికలు కూడా ఆగిపోతాయి.

ఆ ప్రాంగణంలో ఒక నిశ్శబ్దం ఆవరిస్తుంది. గాయకుడు లేదా గాయని ప్రశాంతమైన ఆత్మస్థైర్యంతో తారాస్థాయికి చేరుకోగానే శ్రోతలందరూ ఒక్కసారిగా కరతాళధ్వనులను ఆ ఆవరణలో మారుమ్రోగిస్తారు. కర్ణాటక సంగీతానుభవానికి శ్రోతల భాగస్వామ్యం, కాస్తంత కలకలంతో కూడుకున్నదైనప్పటికీ అత్యంత అవసరం. ప్రపంచ ప్రఖ్యాత వయొలినిస్టు, ఎహుది మెనుహిన్, దక్షిణ భారతీయ కళారంగంలోని ఈ విశిష్ట లక్షణాన్ని చూసి అద్భుతమని భావించాడు.

శ్రోతల స్వభావాలు, సంగీతకారుల హావభావాలు కూడా కర్ణాటక సంగీత సారాంశం లోంచి రూపొందిన లక్షణాలు. కానీ ఈ అంశాలు పరిశోధకులను అంతగా ప్రభావితం చేయవు. ప్రస్తుతం కర్ణాటక సంగీతం గురించిన రచనలు నిజంగా చాలా వస్తున్నాయి. పి. సాంబమూర్తి రచించిన అనేక గ్రంథాలున్నాయి. మరీ ముఖ్యంగా డిక్షనరీ ఆఫ్ సౌత్ ఇండియన్ మ్యూజిక్ అండ్ మ్యూజీషియన్స్ (ది ఇండియన్ మ్యూజిక్ పబ్లిషింగ్ హౌస్, మద్రాసు, 1984) హిస్టరీ ఆఫ్ ఇండియన్ మ్యూజిక్ (ది ఇండియన్ మ్యూజిక్ పబ్లిషింగ్ హౌస్, మద్రాసు, 1982) అనే గ్రంథాలు ప్రామాణికమైనవి. అలాగే రంగరామానుజ అయ్యంగార్ రచించిన "హిస్టరీ ఆఫ్ సౌత్ ఇండియన్ (కర్ణాటక) మ్యూజిక్ (పబ్లిషిడ్ బైది ఆథర్, మద్రాసు, 1972). కూడా ప్రామాణికమే. ఇతర గ్రంథాలు చాలా విస్తృతమైన విషయాలను వివరిస్తాయి. ఉదాహరణకు, విద్యాశంకర్ రచించిన ది ఆర్ట్ అండ్ సైన్స్ ఆఫ్ కర్ణాటిక్ మ్యూజిక్ (ది మ్యూజిక్ అకాడమి ఆఫ్ మద్రాసు, మద్రాసు, 1983); యస్. భాగ్యలక్ష్మి రాసిన రాగాస్ ఇన్ కర్ణాటిక్ మ్యూజిక్ (సిబిహెచ్ పబ్లికేషన్స్, త్రివేంద్రమ్, 1990) సి. రామానుజాచారి రాసిన ది స్పిరిట్యువల్ హెరిటేజ్ ఆఫ్ త్యాగరాజ శ్రీ రామకృష్ణ మఠ్, మద్రాసు, 1981) లలితా రామకృష్ణ రాసిన వర్ణం: ఎ స్పెషల్ ఫాం ఇన్ కర్ణాటిక్ మ్యూజిక్ (హార్మన్ పబ్లిషింగ్ హౌస్, న్యూఢిల్లీ, 1991): జాన్ హెగిన్స్ రాసినది మ్యూజిక్ ఆఫ్ భరతనాట్యం (ఆక్స్‌ఫర్డ్ & ఐబిహెచ్ పబ్లిషింగ్ హౌస్, న్యూఢిల్లీ, 1993) రాబర్ట్ బ్రౌన్ రాసిన ది మృదంగమ్: ఎ స్టడీ ఆఫ్ డ్రమ్మింగ్ ఇన్ సౌత్ ఇండియా (మిచిగన్ యూనివర్సిటీ, ఎన్ ఆర్బర్, 1965) ముఖ్యమైన గ్రంథాలుగా పేర్కొనవచ్చు.

కానీ సంగీతాన్ని, సంగీతకారులనూ విద్యా విషయక సందర్భంలో చూసినప్పుడు యెంతో ఖాళీ కనిపిస్తుంది. విశ్వవిద్యాలయాల్లో సంగీతపు కోర్సులు యేర్పరిచిన విధానాన్ని చూస్తే, అవి సంగీతం ఎట్లా జీవితాన్ని ప్రభావితం చేస్తుంది, తనచుట్టూ ఉన్న జీవితంవల్ల ఎట్లా ప్రభావితమవుతుంది అనే విషయాలమీద అధ్యయనాన్ని ప్రోత్సహించటం లేదు. సామాజికశాస్త్రం, నైతికత, సంగీతపు ఆర్థిక రాజకీయాలు ఈ విషయాలన్నీ పరిశోధనకూ, నిరంతరంగా అంచనా వేసేందుకూ చాలా కాలంగా ఎదురుచూస్తున్నాయి. సంగీతాన్ని

తెలుసుకుని అర్థం చేసుకోవటం, పరిశోధనా చారిత్రాత్మకతలకు మద్దతిచ్చే సంస్కృతి ఉన్నప్పుడే సాధ్యపడుతుంది. అలాంటి సంస్కృతికి ప్రోత్సాహకాలు పాశ్చాత్య ప్రపంచంలో పుష్కలంగా ఉన్నాయి. సంగీత జ్ఞానులైన రచయితలు అనేక ద్వారాలు తెరిచారు. ఉదాహరణకు ఫ్రెంచి రాజకీయాలను పారిస్ ఓపెరాలు ఎలా రూపొందించాయనే విషయం గురించి (జేన్ ఫ్లచర్, ది నేషన్స్ ఇమేజ్: ఫ్రెంచ్ గ్రాండ్ ఓపెరా యాజ్ పాలిటిక్స్ అండ్ పొలిటిసైజ్‌డ్ ఆర్ట్ (కేంబ్రిడ్జి యూనవర్సిటీ ప్రెస్, కేంబ్రిడ్జి, 1987); సాంఘికవర్గ పద్ధతిని, పురుషాధిపత్యాన్ని అమలుచేయటంలో సంగీతపు పాత్ర అనే విషయం గురించి పుస్తకం వచ్చింది. (రిచర్ట్ లెప్పర్ట్, మ్యూజిక్ అండ్ ఇమేజ్: డొమెస్టిక్ సిటీ, ఐడియాలజీ అండ్ సోషియో – కల్చరల్ ఫార్మేషన్ ఇన్ 18th సెంచరీ ఇంగ్లండ్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్, కేంబ్రిడ్జ్, 1988) ఆస్ట్రియాకు ఉన్నత సంస్కృతీ అస్తిత్వాన్ని ఇవ్వటంలో సంగీతపు పాత్ర అన్న విషయం గురించి ఒక పుస్తకం వెలువడింది. (మైఖేల్ స్టెయిన్‌బర్గ్, ది మీనింగ్ ఆఫ్ ది సల్జ్‌బర్గ్ ఫెస్టివల్: ఆస్ట్రియా యాజ్ థియేటర్ అండ్ ఐడియాలజి; 1890–1938 (కార్నెల్ యూనివర్సిటీ ప్రెస్, కార్నెల్, 1990).

భరతనాట్య పారంగతురాలు బాలసరస్వతి గురించి ఒక పుస్తకం ప్రచురించబడింది. ఆమె గురించి డాక్యుమెటరీ చిత్రం కూడా తీశారు. ఐతే బాలసరస్వతి గానీ, వీణ ధనమ్మ గానీ, బెంగళూరు నాగరత్నమ్మ గానీ ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త అయిన ఎమ్.ఎస్. శ్రీనివాస్ దృష్టిని ఆకర్షించలేదు. మళ్ళీ సంస్కృతీకరణ గురించిన ఆయన సిద్ధాంతాలు సంగీత ప్రపంచం గురించి ఎంతో ప్రముఖంగా ప్రస్తావిస్తాయి (7వ అధ్యాయంలో చూడండి) 1980వ దశాబ్దపు తొలి సంవత్సరాలలో భారత ప్రభుత్వం సుబ్బులక్ష్మి గురించి ఒక డాక్యుమెంటరీ తీయాలని ప్రయత్నించింది. ఐతే ఈ పని సదాశివం పెట్టే కఠిన నియమాలు, నిబంధనలవల్ల అనేక ఆటంకాలలో చిక్కులలో పడింది. చివరికి వచ్చిన ఫలితం చెత్త అవక తప్పలేదు. నిజానికి సుబ్బులక్ష్మి సంగీతాన్ని అధిగమించి మన ఆసక్తిని డిమాండ్ చేస్తుంది. నిజానికి ఆమె తమిళ సంస్కృతిలో ఒక ప్రత్యేకమైన ముఖ్యమైన వ్యక్తి. ద్రవిడ వారసత్వపు బలానికి, సంస్కృత సంప్రదాయ ప్రతిధ్వనులను జతగలిపిన వ్యక్తి సుబ్బులక్ష్మి. కర్ణాటక సంగీతాకాశంలో ఆమెవలే ఒక ఠీవీతో, తేజస్సుతో కుల వ్యతిరేకతను దాటినవారు మరెవరూ లేరు. ఆమె పరిణితస్థాయికి చేరే సమయానికి సౌందర్య శాస్త్రాల గురించి నీషే చెప్పినట్లు "జీవితానికి గొప్ప దివ్యత్వాన్ని అందించింది." ఇంత ముఖ్యమైన వ్యక్తి గురించి నిర్దుష్టమైన అధ్యయనాలు లేకపోవటంవల్ల సంగీత విద్యార్థులకు ఎడ్వర్ట్ సయిద్ చెప్పినట్లు "సంగీతం నిరంతరం తన చుట్టుపక్కల ప్రాంతాలైన – కుటుంబం, పాఠశాల, వర్గం, లైంగిక సంబంధాలు, జాతీయత, ఇంకా అనేక ప్రజా

సంబంధ విషయాలలోకి తన పరిధులను దాటి ఎలా చొచ్చుకుపోతుందో అర్థం చేసుకునే అవకాశం లేకుండా పోయింది. కానీ తన సహజ స్వభావంవల్ల సంగీతం సంగీతేతర ప్రాంతాలపై ఎలా ఆక్రమణచేస్తుందో మనం తెలుసుకోవచ్చు. అది మిగిలిన దేశాలలో లాగానే భారతదేశంలోనూ జరిగింది. కర్ణాటక సంగీత రంగంలో సంగీతానికి జీవితానికి మధ్యనున్న పరస్పర సంబంధం చాలా గాఢమైనది, సమగ్రమైనది. సంగీతము, ప్రజాభిరుచీ ఒకదానినొకటి బలంగా ప్రభావితం చేసుకుంటాయి. ఈ విధానానికి సుబ్బులక్ష్మి కొంత ఇచ్చింది, దానివలన తానూ కొంత పొందింది. సంప్రదాయంలోని ప్రాచీనతను గౌరవించింది. తన కళను ఆధ్యాత్మిక పునాదిపై నిలిపింది. ఇతరులలోని ఉత్తమ లక్షణాలను తనలో జీర్ణించుకుంది. ఇవన్నీ చేస్తూ తన విలక్షణతను అభివృద్ధి చేసుకుంది. సంగీతాన్ని వీలైనంత విశాల ప్రపంచంలోకి తీసుకువెళ్ళవలసిన అవసరాన్ని గురించిన మెలకువతోనే ఆమె ఎప్పుడూ ఉంది. తన సమకాలీనులందరికంటే ఆమె తన స్వస్థలం దాటింది. స్వరాష్ట్రాన్ని, స్వదేశాన్ని కూడా దాటి కర్ణాటక సంగీతానికి విశ్వరాయబారిగా మారింది. నిజంగా పాఠశాల ముఖం చూడని, తన మాతృభాష తప్ప మరే భాషలోనూ ధైర్యంగా మాట్లాడటం చేతగాని ఒక స్త్రీ, సంప్రదాయ ప్రకారం అధిగమించలేనివని చెప్పబడే సాంఘిక ఆటంకాలచేత కట్టివేయబడిన స్త్రీ, ఇదంతా సాధించిందంటే అది చిన్న విషయం కాదు. ఆమె తను ఎలా ఉండాలనుకుందో అలా ఉండటంవల్లే నిలిచి గెలిచింది.

# 2. కొత్త పద్ధతులు - చాదస్తపు రీతులు

అపరాధముల మాన్పి - ఆదుకోవయ్యా ॥
కృపజూచి బ్రోచితే - కీర్తి కలదిక నీకు
అత్యంత మత్సరమ - దాంధుడై సజ్జనుల
నిత్య కర్మములవలె - నిందించుకొన్ననా ॥
చూచువారల కెదుట - సొక్కి జపితుడనైతి
యోచించ నీపాద - యుగళ ధ్యానములేని ॥

కర్ణాటక సంగీతానికున్న గొప్ప బలాన్ని ఒక్కమాటలో చెప్పమంటే మనోధర్మం అని చెప్పవచ్చు. మనోధర్మం అంటే "మనసుకి తన లక్ష్యాన్ని చేరుకునే స్వేచ్ఛనివ్వడం". ఈ భావన భారతీయ సంగీతానికి ఒక విలక్షణ కారణాన్ని అందించింది. మనోధర్మం గాయకులకు వారి సృజనాత్మకతకు రెక్కలనిచ్చి స్వేచ్ఛగా విహరించేలా, తమవైన ప్రత్యేక శక్తులను ప్రదర్శించుకునేలా చేస్తుంది. తమదైన స్వీయత్వపు ఉత్సవం అది. ఒక రాగాన్ని లేదా భావాన్ని మనోధర్మ పద్ధతిలోకి అనువదించుకున్నప్పుడు ఒక గాయకుడు ఆ రాగాన్ని పాడేతీరు మరొక గాయకుడు పాడే తీరుకంటే భిన్నంగా ఉంటుంది. పద్ధతి ప్రకారమైతే రసికులు అన్నిటిని వినాలి. వినేటప్పుడు కలిగే ఆనందానికి మూల కారణం ఆయా గాయకుల సంగీతంలో వినిపించే భిన్నరీతుల నుంచి కలిగే అబ్బురమే! ఎంత సంప్రదాయ పరత్వంతో నిండివున్నప్పటికీ ఈ భిన్నత్వ స్వభావమే కర్ణాటక సంగీతాన్ని అనేకమందికి అనేక విధాలైన ఆనందాన్నిచ్చేదిగా చేసింది. అది సనాతన సంప్రదాయమే. కానీ నిలవ నీరుకాదు. దానికి మారి, మార్చుకుని, పరిణామం చెందే శక్తి ఉంది. అది కొన్నిసార్లు గుర్తింపబడుతుంది. కొన్నిసార్లు మనకు తెలియకుండానే జరుగుతుంది. సమాజంలో మారే పద్ధతులకు, సంగీతం లోపలే ఉన్న స్వీయశక్తికి ఈ సంగీతం స్పందించగలదు. అది కొత్త విషయాలను కలుపుకోగలదు, కొత్త రీతులను లీనం చేసుకోగలదు, కొత్త వాస్తవాలను సర్దుబాటు చేసుకోగలదు. కర్ణాటక సంగీతపు కథలో ఈ బలం, చురుకుదనం, సంయమనాలకు సంబంధించిన ఉదాహరణలెన్నో చుక్కల్లా కనపడుతుంటాయి. మనం వాటన్నిటిలోంచి ప్రత్యేకించి చెప్పుకోటానికి తగినవి రెండున్నాయి. ఒకటి గమకాల తీరు తెన్నులు అభివృద్ధి చెందటం. రెండవది వయొలిన్‌ని చేర్చుకోవటం.

గమకం అంటే మానవ కంఠస్వరం అసాధారణమనిపించే, అసాధ్యంగా తోచే ఫీట్లను చేసే టెక్నిక్. సంగీత పదకోశంలో దానిని ఆలంకారికత అంటారు. ముఖ్యంగా సమర్థులైన ప్రఖ్యాత కళాకారుల నుండి అత్యున్నత స్థాయి కళావిర్భావం జరిగేందుకు

వివిధ స్థాయిలలో, శ్రుతులలో, నిపుణతను, బలాన్ని కలగలిపి సంగీత ధ్వనిలో లయబద్ధంగా ఉయ్యాలలూపే నేర్పిరితనాన్ని సాధించేందుకు గమకం ప్రయత్నిస్తుంది. పి. సాంబమూర్తి రాసిన "డిక్షనరీ ఆఫ్ సౌత్ ఇండియన్ మ్యూజిక్ అండ్ మ్యూజిషియన్స్" అనే గ్రంథంలో గమకాన్ని ఇలా నిర్వహించారు. "భారతీయ సంగీతంలో ఉపయోగించే అనేక తూగులకు, కాంతులకు, ఆభరణాలకు అతిశయ అలంకారాలకు అన్నిటికి కలిపి సామూహిక నామం గమకం. ప్రాచీన గ్రంథాలు గమకాలు లేకుండా పాడిన రాగాన్ని పూలు లేని తీగగా, నీరు లేని నదిగా వర్ణించారు."

అంతగా పట్టించుకోని ఒక సిద్ధాంతపు కథ కూడా ఉంది గమకం గురించి. 8వ శతాబ్దానికి చెందిన శైవయోగి తిరుజ్ఞాన సంబందార్ కర్ణాట సంగీతానికి జనకుడనీ, ఎందుకంటే ఆయనే ఈ గమకాన్ని యేర్పరిచాడనీ. మదురైకి చెందిన కమలై త్యాగరాజన్ ప్రచారం చేసిన ఈ సిద్ధాంతానికి ఆధారం ప్రాచీన తమిషగమల శైవయోగుల జీవితాలను కథలుగా చెబుతూ సెక్కిలార్ రాసిన పెరియ పురాణంలో ఉంది. ఆ యోగులు ఊరూరా తిరిగేటప్పుడు పాడే పాటలకు తోడుగా వాయించే వాయిద్యం యాళ్జ్. తంబూరా వంటిది. ఒక్కో స్వరానికి ఒక్కో తీగ కలిగి ఉంటుంది. అందువల్ల అది సున్నిత స్వరాలను మళ్ళీ ప్రకంపించేలా చేయలేదు. ఆ రోజుల్లో యాళ్జ్ వాయిద్యకారులలో ప్రముఖుడైన తిరు నీలకంఠ యషప్పనార్, సంబందార్‌కి ఎప్పుడూ పక్కనే వాయిస్తూ ఉండేవాడు. యాళ్జ్ వాద్యగాళ్ళున్న గ్రామంలో కొందరు ఒకసారి సంబందార్ నైపుణ్యంవల్లనే ఆ సంగీతం గొప్పగా ఉందని ప్రచారం చేశారు. దాంతో యాళ్జ్ వాయిద్యకారుడు కలతచెంది ఆ యోగిని, వాయిద్యం కంటే గొప్పగా పాడి చూపించమని అడిగాడు. ఆ యోగి సరేనని తను పాడే చరణాలలో గమకాలను కలగలిపి పాడాడు. వాయిద్యంలో ఆ వేగాన్ని అందుకో లేని తిరు నీలకంఠన్ తన వాయిద్యాన్ని విరగ్గొట్టి ముక్కలు చేయాలనుకున్నాడు. సంబందార్ అతన్ని ఓదార్చి యాళ్జ్ లాంటి వాయిద్యాలను మనిషి తయారుచేస్తే, మానవుల కంఠ స్వరాలను భగవంతుడు గొప్ప సాధనాలుగా కానుక ఇచ్చాడని చెప్పాడు. ఆ విధంగా అప్పుడు సంబందార్ గమకాలతో కూడిన సంగీత పద్ధతికి పునాదివేసి, మానవుల కంఠస్వరం మిగిలిన అన్నిటికంటే ఉన్నతమైనదనే విషయాన్ని నొక్కి చెప్పటం ద్వారా కర్ణాటక సంగీతానికి పునాదులు వేశాడని త్యాగరాజన్ వాదించాడు. కర్ణాటక సంగీతం ప్రాథమికంగా గాత్ర సంగీతమనటంలో ఏ సందేహమూ లేదు; మిగిలినదంతా గానానికి సహకారాన్ని అందించేవే. గమకం కర్ణాటక సంగీతానికి హృదయంగా ఉందనేది కూడా స్పష్టమే. గాయకుడి, వాయిద్యకారుడి నైపుణ్యాలకు గమకం ఒక పరీక్ష. శ్రోతల ఆనందానికి నెలవు.

గమకం పుట్టుకా, యాళ్జ్ మరణం నిజానికి సంగీత వాయిద్యాల వర్గీకరణలో ఉన్న లోపాలను ఎత్తి చూపుతుంది. తీగతో వాయించేవి, గాలివల్ల ధ్వని కలిగించేవిగా గమకంతో

పరిచయంలేని పాశ్చాత్య సంప్రదాయ ప్రకారం వాయిద్యాలను వర్గీకరించటమంటే అది లోపభూయిష్టమే. 1992లో మద్రాసు మ్యూజిక్ ఎకాడెమిలో ఒక పత్ర సమర్పణ చేస్తూ త్యాగరాజన్ తీగ – గాలి వర్గీకరణ తప్పుదారి పట్టిస్తుందన్నాడు. వయొలిన్, వీణ, పియానో ఇవన్నీ తీగతో కూడిన వాయిద్యాలుగానే పరిగణిస్తున్నారు. కానీ వయొలిన్‌కి, వీణకు పియానోతో ప్రాథమిక వ్యత్యాసం ఉంది. ఈ వాయిద్యాల వర్గీకరణను ధ్వని యెట్లా వస్తోందనే దానినిబట్టి చేయకూడదని – తీగను కదిలించటం ద్వారా వస్తోందా, గాలిని కదిలించటం ద్వారా వస్తోందా అనే దానినిబట్టి కాక, ఏరకమైన ధ్వని వస్తోందని ఆధారంగా తీసుకోవాలని: ధ్వని ఒక స్వరం నుంచి మరొక స్వరానికి తెగకుండా కొనసాగుతోందా లేదా ధ్వని ఒక స్వరం నుంచి మరొక స్వరానికి 'గెంతినట్లు'గా వెళ్తున్నదా అనే దానిని పట్టించుకోవాలనీ త్యాగరాజన్ చెబుతారు. "పాత వర్గీకరణ మనకు పైకి కనిపించే దానిని చెబుతుంది. ఇప్పుడు చెబుతున్న కొత్త వర్గీకరణ ఆయా వాయిద్యాల సంగీత సామర్థ్యాలను అంచనా వేస్తుంది" అని సకారణంగా వివరించాడాయన. ఆయన ఇంకా ఎత్తి చూపినట్టు వీణ, నాగస్వరం వంటి వాయిద్యాలు తెంపులేని ధ్వనినిస్తూ కర్ణాటక గమకాలను తట్టుకోగలవు. పియానో వంటి వాయిద్యాలు "డిజిటల్" కాబట్టి అవి ఎప్పటికీ కర్ణాటక సంగీత ప్రపంచం లోకి ప్రవేశించలేవు. హిందూస్థానీ సంగీతంలో వలే కాకుండా, హార్మోనియం కూడా కర్ణాటక సంగీతానికి సరిపడనంత 'డిజిటల్'. డిజిటల్ కాని వాయిద్యాలు కర్ణాటక సంస్కృతి అభివృద్ధి చెందే క్రమంలో తమంతట తాము ప్రవేశించాయి. ఒక్క తీగమీద పైకి కిందకు కదిలే ఒక వేలు వీణమీద అనేక స్వరాల సముదాయాన్ని పలికించి, మానవ కంఠస్వరం సృష్టించగలిగిన క్లిష్టమైన గమకాలతో సరితూగగలదు. కర్ణాటక సంగీతం కచేరి పద్ధతిలో అభివృద్ధి చెందుతున్న 19వ శతాబ్ది రెండవ భాగంలో సహజంగానే వీణ అందరి అభిమానం పొందిన పక్క వాయిద్యమైంది. కానీ తొందరలోనే వీణ నిరాడంబరమైన వేణువుకి చోటిచ్చింది. ఆ దశ కూడా ఎక్కువ కాలం కొనసాగలేదు: వీణ వేదికమీద ఆటంకపరిచేంత స్థానం ఆక్రమిస్తే వేణువు ఎవరూ చూడనంత అప్రధానంగా ఉంది. సంగీతకారులు వేరే దారికోసం వెతుకుతున్నప్పుడు, అదృష్టవశాత్తు కొన్ని సందర్భాలు కలిసివచ్చి విధి ముత్తుస్వామి దీక్షితారును, ఆయన సోదరుడు బాలుస్వామిలను ఫోర్ట్ సెయింట్ జార్జి దగ్గరకు చేర్చింది. అది మద్రాసు బ్రిటీష్ పరిపాలనా స్థానం. అది ఇంకొక పరిణామం జరిగేందుకు ప్రారంభ మయింది.

❖ ❖ ❖ ❖

సంగీత లోకపు త్రిమూర్తులలో మిగిలినవారి కంటే ముత్తుస్వామి దీక్షితార్ ఎక్కువ పాండిత్యం గలవాడు. ఆయన వారణాసిలో తన గురువుగారి దగ్గర ఆరేళ్ళపాటు హిందూస్థానీ సంగీతం నేర్చుకున్నాడు. ఆయన తన పోషకుడూ, ఈస్ట్ ఇండియా కంపెనీ

దుబాసి అయిన వ్యక్తితో కలిసి ఫోర్ట్ సెయింట్ జార్జి వెళ్ళినప్పుడు యూరోపియన్ సంగీతపు పలుకుబడి మీద ఆసక్తి పెంచుకున్నాడు. వైణిక ప్రముఖుడు, సంగీతకర్త అవటంతో, ఆయన బ్రిటీష్ సంగీతపు ఔత్సాహికులతో ప్రయోగాలు చేశాడు. ఒక ప్రయోగంలో ఇంగ్లీషు బాణీలకు సంస్కృత పదాలను సమకూర్చాడు. ఫ్యూజన్ సంగీతంలోకి ఆ మొదటి ప్రయాణం యెంతో దూరం వెళ్ళలేదు. కానీ ఇంగ్లీషు వాళ్ళు అద్భుతమైన సంగీత ధ్వనులను పలికిస్తున్న అందమైన చిన్న వాయిద్యం దీక్షితార్‌ని సమ్మోహపరిచింది. అది వయొలిన్. అది ఎంత నమ్మకంగా, విశ్వసనీయంగా రాగాల సంగీతాన్ని వినిపించగలదో చూసిన దీక్షితార్ దిగ్భ్రమ చెందాడు. ఆయన సోదరుడైన బాలుస్వామిని వయొలిన్ నేర్చుకొమ్మని అడిగాడు. ఒక బ్రిటీష్ అధ్యాపకుడి శిక్షణలో బాలుస్వామి ఆ వాయిద్య వాదనలో నిపుడయ్యాడు. ఇద్దరూ కలిసి కొంతకాలం అభ్యాసం చేశాక, ఒక కచేరీలో ముత్తుస్వామి వీణను అనుసరిస్తూ బాలుస్వామి వయొలిన్ జతగా పలికింది. ఆ కచేరీ విజయవంతమైంది. ఆ తర్వాత వయొలిన్ మృదంగం లాగానే కర్ణాటక సంగీతంలో స్థిరపడిపోయింది. ఇంకా యితర పాశ్చాత్య వాయిద్యాలు కూడా ఇటీవలి కాలంలో కర్ణాటక సంగీత సరిహద్దులలోకి విజయ వంతంగా చొచ్చుకువచ్చాయి. మదురైకి చెందిన ఎ.కె.సి. నటరాజన్ క్లారినెట్‌ని చేపడితే, కద్రీ గోపాలనాథ్ సాక్సోఫోన్‌ని, యు. శ్రీనివాస్ మాండలిన్‌ని తీసుకొచ్చారు. ఇవన్నీ కర్ణాటక రాగాల అవసరాలకు సరిగ్గా సరిపోయాయి. కానీ పూర్తిగా పాశ్చాత్య వాయిద్యమైన వయొలిన్ ఆనందకరంగా గుర్తుపట్టలేనంతగా దక్షిణ భారత వాయిద్యంగా మారటం తమిళ సృజనాత్మకతకు ఒక కితాబు. నిపుణులు వయొలిన్ విజయానికి రెండు కారణాలు చెప్పారు. వయొలిన్‌కి శృతిపరంగా ఉన్న సరళత, అతి సున్నితమైన గమకాలను పలికించ గలగటం.

అదే సమయంలో దాని సున్నితమైన గుణం మానవ కంఠస్వరానికి అతి దగ్గరగా ఉంది. ప్రధానంగా గాత్ర సంగీతమైన కర్ణాటక సంగీతానికి ఆ లక్షణం చాలా ముఖ్యం. చేతిలో సులభంగా అమరిపోయే వయొలిన్ పరిమాణం కూడా ఒక కారణం కావచ్చు కచేరీలలో దానికి వేగంగా ఆమోదం దొరకటానికి. పక్క వాయిద్యకారులు సులభంగా దానిని తమ చేతులకింద పెట్టుకుని ప్రయాణం చేయవచ్చు. కానీ వీణను తీసుకెళ్ళాలంటే మోసేందుకు మనిషి కావాలి. భుజంమీద వయొలిన్ పెట్టుకుని దానికి గడ్డంతో ఊతం ఇచ్చే పాశ్చాత్య పద్ధతి కూడా చాలా తెలివిగా దేశీయమైంది. తెలివైన దక్షిణ భారతీయుడు హాయిగా కొంచెం మారిన పద్మాసనంలో కూర్చుని, వయొలిన్‌ని అత్యంత అనుకూలమైన ఒడిలో వుంచుకునే వాయిద్యంగా మార్చుకున్నాడు. ధ్వని అంతే మధురంగా ఉంది.

సంగీత కచేరీ వాయిద్యంగా వీణకు తన స్థానం ఉండనే ఉంది. ఈ వాయిద్యం ఎప్పుడూ సంగీతానికి ఉదాత్తమైన తేజోవంతమైన సుపరిచితమైన గుర్తుగా ఉంది. దక్షిణ

భారతీయ వాయిద్యాలలో వీణకే ఎంతో విస్తృత స్వర ప్రస్థారం ఉంది – మూడున్నర స్వరాలు. (కర్ణాటక సంగీతానికి సామాన్యంగా అవసరమయ్యేది రెండు స్వరాలు. ఎమ్మెస్ సుబ్బులక్ష్మి కంఠస్వరం మూడు స్వరాల వరకూ వెళ్తుంది.) మానవ కంఠస్వరాన్ని గాత్రవీణ అంటారు. అది గాత్రానికున్న శక్తులను తెలియజేస్తుంది. వీణలో విద్వాంసులు, విదుషీమణులు అయిన సంగీతకారుల అవసరం ఎప్పుడూ ఉంటుంది. కేవలం కచేరీలకు మాత్రమే కాదు సంపన్న కుటుంబాల పిల్లలకు శిక్షణ ఇచ్చేందుకు కూడా వారికి ప్రాధాన్యత ఉంటుంది.

షణ్ముగవడివు వీణ వల్లనే గుర్తింపు పొందింది. ఆదాయాన్నీ సంపాదించుకుంది. సుబ్బులక్ష్మి కూడా వీణ వాయించటం నేర్చుకుంది. కానీ ఆమె ముఖ్యంగా గాత్ర సంగీతం అవటంతో ఆమెకు గమకాలను వృద్ధిచేసుకోవటంతోనూ, వయొలిన్‌కి కర్ణాటక సంగీతంతో ఉన్న స్థానంతోనూ ప్రత్యక్ష సంబంధం ఏర్పడింది. వీణను ఆమె తన పాటలో ప్రదర్శించే స్వచ్ఛతను సాధించేందుకు వినియోగిస్తే, కర్ణాటక సంగీతంలో పక్క వాయిద్యంగా ఎంతో ప్రాచుర్యాన్ని పొందిన వయొలిన్‌ను తన కచేరీలను మరింత ఆకర్షణీయంగా చేసేందుకు వినియోగించుకుంది. కానీ ఈ వాయిద్యాలు ఆమెకు, ఇతర గాత్ర సంగీత విద్వాంసులకు శిక్షణ భూములుగా మాత్రమే పనిచేశాయి.

వారందరూ తమ శక్తిసామర్థ్యాలను పూర్తిస్థాయిలో తెలుసుకుని ప్రదర్శించేందుకు, తమ తరాన్ని ఒక స్వర్ణయుగంగా మలుచుకునేందుకు ఇరవయ్యవ శతాబ్దంలోని మొదటి దశాబ్దాలలో జరిగిన కొన్ని చారిత్రక ఘటనల కలయిక కారణమయింది. కర్ణాటక సంగీతాన్ని ఆవిష్కరించేందుకు కొత్త సమీకరణం కనుగొన్నారు. కచేరీల సంస్కృతి ఇంతకు ముందుకంటే అధిక సంఖ్యలో ప్రజలను ఆకర్షిస్తోంది. ఈ కళలకు మద్దతిచ్చేందుకు గత కాలపు భూస్వామ్య ఆధిపత్య స్థానంలో కొత్త సాంఘిక శక్తులు ముందుకొచ్చాయి. అంతే కాకుండా సంప్రదాయ సంగీతానికి ప్రజాదరణ దొరకి అది పెరగటానికి సాంకేతికాభివృద్ధి ప్రత్యక్షంగా దోహదం చేసింది.

❖ ❖ ❖ ❖

మొదట పురందరదాసు అతని సమకాలికుల ప్రభావంవల్ల ప్రారంభమై వర్ధిల్లి తర్వాత మూర్తిత్రయంవల్ల వ్యాప్తిచెందిన ఆ కళ, సామాన్య జనబాహుళ్యాన్ని ఆకర్షించటానికి వీలులేనంత సాంకేతికతతో కూడి వుంది. త్యాగరాజు ఒక్కడు మాత్రం ప్రజా వాగ్గేయ కారుడిగా, తేలికగా అర్థమయ్యే, సంక్లిష్టంకాని సంగీతాన్ని సమకూర్చాడు. ముత్తుస్వామి దీక్షితార్ సంగీతం పాండిత్య ప్రకర్షతో నిండి అర్థం చేసుకుని ఆనందించాలంటే శ్రోతలకు కూడా సంగీత జ్ఞానం బాగా ఉండితీరాలి. శ్యామశాస్త్రి సాంకేతికతపై గొప్ప అధికారంతో సంగీతం కూర్చాడు. అదెంతో గొప్పగా ఉంటుంది. కానీ సామాన్య శ్రోతలకు అందుబాటులో

ఉండదు. సామాన్య ప్రజల అంచనాలో త్యాగరాజుది ద్రాక్షాపాకం అయితే, దీక్షితార్‌ది నారికేళపాకం. ద్రాక్షపండు తీసుకుని నోట్లో వేసుకున్నంత మాత్రానే ఆ మాధుర్యం అనుభవంలోకి వస్తుంది. కొబ్బరికాయ పీచు తీసి పగలగొట్టి తింటే తప్ప ఆ రుచి తెలియదు. శ్యామశాస్త్రిది కదళీపాకం. అరటిపండు తొక్కతీయాలి గానీ తీయటమూ, తినటమూ కూడా మరీ కష్టంకాదు. ఐతే ద్రాక్షపళ్ళను ఇష్టపడేవారికి కూడా అరటిపళ్ళ, కొబ్బరికాయల రుచి గురించి ఎలాంటి సందేహమూ ఉండదు. వృత్తి సంగీత కళాకారుల కచేరీలలో మూర్తిత్రయం రచించి స్వరపరచిన సంగీతమే ప్రధానంగా ఉండేది. కానీ కచేరీల తరహా మాత్రం సంగీత కళాజ్ఞానం కలిగినవారి కోసమేనన్నట్లు కనపించేవి. దక్షిణ భారతీయులు కర్ణాటక సంగీతాన్ని చాలా సహజంగా, ఆఫ్రికన్లు లయబద్ధమైన బీట్‌ని తీసుకున్నట్లుగా తీసుకుంటారనే దాన్లో సందేహం లేదు గానీ, వారందరూ అందులో నిపుణులు కారు. మహా అయితే ఆ కళను ఊరికే ఆనందించే రసికులు అవుతారు. వాళ్ళకు గొప్ప పాండిత్యంతో, లోతైన సాంకేతికతో నిండిన నాలుగుగంటల కచేరి, తలకు మించిన భారమవుతుంది.

సామాన్యులకు ఆ భారాన్ని దించి రక్షించేందుకు మారుమూల గ్రామమైన అరియ కుడి నుంచి ఒక రక్షకుడు వచ్చాడు. ఆ గ్రామం ప్రస్తుతం దక్షిణ తమిళనాడులోని రామనాథపురం జిల్లాలో ఉంది. మూర్తిత్రయం తర్వాత అతి ప్రధానమైన సంగీతకారుడు అరియకుడి రామానుజ అయ్యర్ (1890–1967). కేవలం గాయకుడే కాదు పరిశోధకుడు కూడా. సంప్రదాయ సంగీతమంటే చాలాప్రాంతాల్లో ఆసక్తి ఉందని అర్థం చేసుకున్నాడు. దాంతోబాటు మామూలు ప్రజలు గాయకుడు తాను అలిసిపోయేవరకూ పాడటాన్ని అంతు లేకుండా కొనసాగించటం, తర్వాత వయొలిన్ విద్వాంసుడు అతనలసిపోయే వరకూ వాయించటం, తర్వాత మృదంగం విద్వాంసుడు అలసట వచ్చేదాకా వాయించటం, తర్వాత, అంతలోపల కోలుకున్న గాయకుడు మళ్ళీ అందుకొని ముందుకొచ్చే సాహసం చేయటం వీటన్నిటితో విసిగి నిరుత్సాహానికి గురవుతున్నారని కూడా గమనించాడు. ఇలాంటి పరిస్థితి ఎంతో కాలం సాగదని అనుకున్నాడు. కర్ణాటక సంగీతాన్ని సాంకేతికతా సంకెళ్ళ నుంచి విడిపించి, సామాన్య ప్రజలు ఆనందించి మెచ్చుకునే పద్ధతిల్లో రూపొందించాలనే ఆలోచనను అంగీకరించాడు. ఈ పని చేయటానికి కావలసిన ప్రతిభావ్యుత్పత్తులు, స్థాయి కూడా ఆయనకున్నాయి. ఆయనను "కర్ణాటక సంగీతపు రాజు"గా పేర్కొంటారు. ఆయన కచేరీలకు పూర్తిగా కొత్త చట్రాన్ని తయారుచేశాడు. ముఖ్యంగా ఆయన మరింత వైవిధ్యాన్ని ప్రవేశపెట్టి, మూడు వరుసల నిర్మాణంలో అన్నింటిని అమర్చగలిగాడు. మొదటి భాగంలో వర్ణం ఉంటుంది. ఒక రాగపు భావాన్ని కల్పించటంలో వర్ణం గొప్పగా రాణిస్తుంది వర్ణం, తర్వాత వెంటవెంటనే కొన్ని కీర్తనలు పాడితే కచేరీ రక్తికట్టటానికి బీజం పడుతుంది.

రెండవ భాగంలో కొంత సంక్లిష్టమైన పాటలు, విస్తృత రాగ ప్రస్తారం, అన్నిటికంటే ముఖ్యంగా రాగం – తానం – పల్లవి ఉంటాయి. ఈ దశలో గాయకుల మనోధర్మం బయటకు వస్తుంది. గాయనీ గాయకులు ఒకే రాగాన్ని మూడు శైలులలో సమగ్రంగా పాడతారు. స్వచ్ఛమైన రాగ విస్తారం, స్వేచ్ఛాయుత శైలిలో తానం, ఆ తర్వాత లయబద్ధమైన పల్లవి ఉంటాయి. ఇక మూడో భాగంలో సరళమైన కీర్తనలు లేదా రకరకాల భావాలను రేకెత్తించే తుకడాలు ఉంటాయి. ఇది మంగళం వరకూ కొనసాగుతుంది. మంగళం అంటే ప్రశాంతతనిచ్చే పవిత్రమైన హితకరమైన ముగింపు.

అరియకుడి ఈ పద్ధతిలో తనే స్వయంగా ఒకటి, రెండు కచేరీలు ఇవ్వగానే, శ్రోతలు, ఇతర సంగీతకారులూ కూడా ఈ పద్ధతిలోని విశిష్టతను, వివేకాన్ని గుర్తించి ఆశ్చర్యచకితులయ్యారు. ఈ కొత్త నిర్మాణం సంగీతజ్ఞులను, సామాన్యులను ఒకేరకంగా అలరించింది. ఈ పద్ధతి మొత్తంగా చూస్తే పండితులను మెప్పించే గాంభీర్యం కనపడు తుంది. అదే సమయంలో ఈ పద్ధతి వైవిధ్యంతో, సరళమైన తుకడాలతో కర్ణాటక సంగీత సాగర జలాలలోకి అప్పుడే అడుగుపెడుతున్న వారిని కూడా ఆకర్షిస్తుంది. కర్ణాటక సంగీతాన్ని పూర్తిగా ఆనందించాలంటే రసికులు రాగాలను మరింతగా అర్థంచేసుకోవాలి. పెద్దగా పాండిత్యం లేకుండానే ఆ పని చేయగలుగుతారు. బాగా విరామం గలిగిన పెద్ద మనుషులు ఐదారు గంటలసేపు కచేరీ హాలులో గడపగలుగుతారు. అరియకుడి పద్ధతి అన్ని సంగీత కచేరీకలకూ ప్రామాణిక పద్ధతి అయింది. దాంతో సంప్రదాయ సంగీతానికి ప్రజాదరణ, ప్రాచుర్యం కూడా పెరిగాయి.

కొందరు పరిశీలకులు ఈ కొత్త పద్ధతి "సంగీత కళను ప్రజాస్వామికీకరించింది" అనేంతవరకూ వెళ్ళారు. ఆ మాటను ఒక దృక్పథం నుంచి చూడాలి. లేకపోతే సంగీతం తానేమిటో అది కాకుండా పోతుంది. కర్ణాటక సంగీతంలో నిజమైన అర్థంలో ప్రజాస్వామ్యీ కరణలేదు. వాటి స్వభావాలలో విశ్వజనీన ప్రజాస్వామ్యీకరణ కుదరదేమో. ఎడ్వర్డ్ సయిద్ చెప్పినట్లు "సంగీతం, సాహిత్యం లాగానే ఒక సాంఘిక, సాంస్కృతిక వాతావరణంలో వ్యాప్తిచెందుతుంది... సంగీతానికి, సంఘంలో అనుకూల అవకాశాలున్న వారికి మధ్యనున్న సంబంధం గురించి ఆలోచించండి, లేదా సంగీతానికీ, మతపరమైన గౌరవానికి మధ్యనున్న సంబంధం గురించి ఆలోచించండి. నా భావం స్పష్టంగా అర్థమవుతుంది." సయిద్‌లోని సంగీత శాస్త్రజ్ఞుడు తన సాంఘిక రాజకీయ విశ్వాసాలను ప్రతిధ్వనించేలా మాట్లాడటంలో ఆశ్చర్యంలేదు. కానీ అతని విశ్వాసాలలో అతను ఒంటరికాడు. పాశ్చాత్య దేశాలలో యితర సంగీత శాస్త్రజ్ఞులు కూడా అవే భావాలను వ్యక్తపరిచారు. భారతదేశంలో ఆధునిక దళిత భావజాలానికి చెందినవారూ అలాగే అన్నారు. దళితుల కోణం కులం మీద ఆధారపడితే సయిద్ వర్గపరంగా మొత్తం విషయాన్ని చూశాడు. రెండు దృక్పథాలూ సంగీతాన్ని ఉన్నత

వర్గ కుల సాంఘిక శక్తులతో కలిపి చూశాయి. ఇద్దరికీ విలువైన, నిజమైన అంశాలుండ వచ్చు. కానీ ఇద్దరిలో ఎవరూ కూడా ఈ కుల, వర్గ సంబంధమైన కలయికవల్ల సంగీతాభి వృద్ధి కుంటుపడిందని అనలేదు. చెప్పాలంటే కళల అభివృద్ధికి మొదట్లో రాజుల జమీందారుల ప్రాపకమే సహాయపడింది. కుల – వర్ణ చర్చలకు వాళ్ళు సమాధానం ఇచ్చుకోలేదు. కాని సిద్ధాంతాల ప్రమేయం లేకుండా మాట్లాడాలంటే కర్ణాటక సంగీతం ఎన్నడూ ప్రజా స్వామ్య లక్షణాలతో లేదనేది స్పష్టంగా కనపడుతుంది. బీథోవెన్ కంటే ఎక్కువేమీ కాదు, సంప్రదాయ పద్ధతులను అగ్రవర్ణ పద్ధతుల్లో అర్థంచేసుకునేవారు కూడా అలా అనుకోరు. అరియకుడి చేసిన, తెచ్చిన కొత్తదనం సాధించిందేమిటంటే – అది ప్రజాస్వామ్యీకరణ కాదు, కర్ణాటక సంగీతాన్ని విశాలమైన ప్రజానీకానికి అందుబాటులోకి తేవటం. అది చారిత్రక ప్రాధాన్యం గల విషయం.

అరియకుడి శూన్యంలోంచి ఈ పని చేయలేదు. తనచుట్టూ వృద్ధిచెందుతున్న కొత్త విధానాలను అర్థంచేసుకున్నాడు. పరిస్థితులు మారుతున్నాయనే దాని మొట్టమొదటి గుర్తుగా సంగీత సభల రూపంలో దక్షిణ భారతానికే ప్రత్యేకమైన ప్రక్రియ మొదలయింది. ఇంతకుముందు ఈ కళలకున్న రాజపోషణకు మారుగా ఈ సభలు సకాలంలో యేర్పడ్డాయి. శ్రీ పార్థసారథి స్వామి సభ (మద్రాసు, 1900) జ్ఞాన సమాజం (బెంగళూరు, 1906) ఇవి మొదటి ప్రముఖ సంస్థలు. త్వరలో ఇవి ఆ ప్రాంతంలోని నగరాలలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. కొంత పద్ధతులను తెచ్చినవిగా గొప్ప ప్రభావం చూపించాయి. ఆ సభల నిర్వాహకులు సంగీత, నాట్యకళలకు సంబంధించి వ్యవహారవేత్తలుగా, ప్రముఖులుగా పేరొందారు. ఈ సభలలో సభ్యత్వం ఉండటమనేది గౌరవ మర్యాదలకు, హోదాకు సంకేత మైంది. ఉదయపు కాఫీ అంత అత్యవసరమైంది. అధికారం అనేది నగరాలలో కేంద్రీకృతమై ఉంటుంది గనుక నగరాలలోనే ఏర్పడిన ఈ సభల ప్రభావం, అధికారం కూడా ఎక్కువైంది. కానీ కళలను సుదూరమైన మారుమూల ప్రాంతాలకు తీసుకెళ్ళిన సంస్థలు వేరే ఉన్నాయి.

తమిళ నాటకరంగం ఈ దిశలో అగ్రగామిగా ఉంది. 19వ శతాబ్దపు చివరి రోజులలో గుర్తించవలసిన సాంఘిక శక్తిగా తయారైంది. 'నటీ'నటులందరూ మగవాళ్ళే వున్న పేరెక్కిన బాయిస్' కంపెనీల స్థాపనతో ఇది జరిగింది. తమిళ నాటకానికి పిత్రు తుల్యుడైన శంకర్‌దాస్ స్వామిగారు (1867–1922) ఈ సంస్కరణను ప్రారంభించారు. చాలామంది ప్రజలవలే ఆయన కూడా రంగస్థలంమీద పెద్దవాళ్ళైన నటీనటులు ఔచిత్యం, విచక్షణ లేకుండా, నాటకంలో ఉన్న సంభాషణలు చెప్పకుండా, అనవసరమైన మాటలు చొప్పించటం చూసి ఆగ్రహం చెందాడు. ఇలాంటి అఘాయిత్యాలు జరగకుండా అందరూ బాలురే వుండే బాల మీన రంజని సంగీత సభను స్థాపించాడు. ఈ సభకు ఎంత విస్తృతమైన ఆమోదం దొరికిందంటే, ఇతర నాటక బృందాలన్నీ తమ పేర్లకు ముందు 'బాల' పదాన్ని

చేర్చుకోవటం మొదలుపెట్టాయి. స్త్రీ పాత్రలు వేసే అబ్బాయిలకు కంఠస్వరం మారే వయసు వచ్చేసరికి వాళ్ళను నిరాదరించి బైటికి పంపుతారు. ఐతే దీనిలో కూడా ఆ మగ పిల్లలను వేధించటమనేది బయల్దేరింది. వాటి అంతాన్ని అవి కొనితెచ్చుకున్నాయి. కాని ప్రజా బాహుళ్యంలో ప్రచారం పొందిన సంస్కృతిని, సంగీతాన్ని అభివృద్ధి చేయటంలో పెద్ద పాత్రనివి నిర్వహించాయి. (తర్వాతి రోజుల్లో వెండితెర కథానాయకులైన ఎమ్.జి. రామచంద్రన్, శివాజీ గణేశన్‌లు ఈ బాయిస్ కంపెనీలలోనే నటజీవితం ప్రారంభించారంటే చరిత్రలో ఈ సంస్థల స్థానాన్ని గుర్తించవచ్చు.) ఆ నాటకాలకు విపరీతమైన జనాదరణ ఉండేది. ఆ నాటకాల పేర్లే అయస్కాంతాల్లా ప్రజల్ని ఆకర్షించేవి – కృష్ణలీల, దశావతారం, కన్నగి, వల్లి తిరుమనమ్. వాటిలో సంగీతం తప్పనిసరిగా సంప్రదాయ సంగీతమే అయ్యుండేది. ఈ నాటక బృందాలను సాధారణంగా కింది తరగతి వారివిగా గుర్తించినా, ప్రముఖ నటులు, గాయకులు అయిన ఎస్.జి. కిట్టప్ప, కె.బి. సుందరాంబాల్ వంటివారి ప్రభావం అధికంగా ఉండేది. శ్రోతలలో సంగీత అక్షరజ్ఞానం కలగటానికి నాటకరంగ తారలు చాలా దోహదం చేశారు. సుబ్బులక్ష్మి వాళ్ళ పాటలు పాడుతూనే తనకు తాను శిక్షణ ఇచ్చుకుంది.

❖ ❖ ❖ ❖

కొత్త సాంకేతిక విధానం వచ్చినప్పుడు, అది సంగీత సభలను, నాటకరంగాన్నీ అధిగమించి శాస్త్రీయ సంగీతాన్ని విస్తృతంగా, సుదూరంగా తీసుకువెళ్ళింది. గ్రామఫోను రేడియో వంటి సాధనాలు, ముఖ్యంగా రేడియో, కర్ణాటక సంగీతాన్ని ఎంతో ప్రజారంజకం చేసిందని చెప్పటంలో ఎలాంటి అతిశయోక్తులకూ చోటులేదు. ఆ సంగీతం 'మాస్'లోకి వెళ్ళిపోవటానికి అక్షరాలా రేడియో కారణం. గ్రామఫోన్ కంపెనీ ఆఫ్ ఇండియా తన హిజ్ మాస్టర్స్ వాయిస్ గుర్తుతో, ఫ్యాక్టరీని 1919వ సంవత్సరంలో కలకత్తాలో ప్రారంభించింది. ఆ రోజుల్లో జపాన్ నుంచి దిగుమతి అయిన గ్రామఫోన్ ధర పది రూపాయలే ఉండేది.

ఈ కొత్త సంగీతపు పెట్టెమీద యువత తామూహించిననంత ఆసక్తి చూపిస్తున్నదని గ్రహించిన HMV 'ట్విన్' అనే మరొక బ్రాండ్ సంగీతాన్ని కిశోర వయస్కులకోసం విడుదల చేసింది. గ్రామఫోన్లు, ప్లేటు అంటే దక్షిణ భారతదేశంలో వేలంవెర్రిగా మారింది. రికార్డు కంపెనీల మీద ప్రజల ఆసక్తి ఎంత పెద్ద ఎత్తున ఉండేదంటే అవి కొన్నిసార్లు ప్రత్యేక సందర్భాలను పురస్కరించుకుని వార్తాపత్రికల లాగా కొత్త సంచికలను తెచ్చేవి. 1931లో మోతీలాల్ నెహ్రూ (జవహర్‌లాల్ నెహ్రూ తండ్రి) మరణించినప్పుడు సరిగ్గా ఆ సమయానికి తగినట్లు పాటతో "మనం ఒక మహాపురుషుని కోల్పోయామంటూ" కె.పి. సుందరాంబాళ్ చేత పాడించి రికార్డు విడుదల చేశారు. అలాగే ఖద్దరు ప్రాశస్త్యాన్ని చెబుతూ వచ్చిన రికార్డులు ఎన్నో ఉన్నాయి. సంప్రదాయ సంగీతానికి గ్రామఫోన్ రికార్డులు ఒక

వరమయ్యాయి. ప్రతిచోటకూ సంగీతం చేరేలా చేయటం మాత్రమే కాదు, కొత్త ప్రతిభ ముందుకు రావటానికి మున్నెన్నడూ లేనన్ని అవకాశాలనవి అందించాయి. మార్కెట్టుకు నిరంతరం రికార్డులు అందించాల్సిన అవసరం ఉండటంతో రికార్డింగ్ కంపెనీలు అన్ని ప్రాంతాలకూ ప్రతిభగల వారిని వెతికే పనిలోపడ్డాయి. ఒక గాయకుడో, వాయిద్యకారుడో ప్రజాదరణ పొందే సూచన కనిపించగానే, కంపెనీలు అతని దగ్గరకు వెళ్ళి అతని పాటను రికార్డుగా చేస్తామని ఒప్పందం చేసుకునేవారు. గాయకుల సంగీతం రికార్డుగా మార్కెట్‌లోకి రాగానే వారికి అప్పటికప్పుడు గుర్తింపు వచ్చేసేది. కొందరు సంగీతకారులకు రికార్డుల వల్ల కీర్తికి సులభమార్గం ఏర్పడింది. తొలిదశలోనే రికార్డు కంపెనీలకు అందివచ్చిన సంప్రదాయం సంగీత కళాకారులలో సుబ్బులక్ష్మి ఒకరు.

గ్రామఫోన్ వచ్చిన పదేళ్ళకు రేడియో రంగంలోకి వచ్చింది. కలకత్తా, బొంబాయి, మద్రాసు, మైసూర్‌ల నుంచి 1923లోనే ఔత్సాహిక రేడియో క్లబ్బులు కార్యక్రమాలను ప్రసారం చేస్తున్నా, (ఆకాశవాణి అనే పేరు మొదట మైసూరులోనే పెట్టారు) 1936లో బ్రిటీష్ పాలనా విభాగం అధికారికంగా ఆల్ ఇండియా రేడియోని ప్రారంభించిన తర్వాత వృత్తి నైపుణ్యంతో ప్రసారాలు ప్రారంభమయ్యాయి. దక్షిణాదిలో మొదటి రేడియో స్టేషన్లు మద్రాసులో, తిరుచిరాపల్లిలో (ట్రిచ్చి) ప్రారంభించారు. మద్రాసు స్టేషన్‌లో షార్ట్‌వేవ్ ప్రసారాలు కూడా ఉండటంతో దక్షిణాది అంతటికీ ఆ ప్రసారాలు చేరేవి. చాలా మొదటి దశలో కూడా AIR పట్టు సంగీతంపైనే ఉండేది. 1947 తర్వాత ఆ సంస్థ మరింత వ్యవస్థీకృతమై మంచి సంగీతాన్ని పైకి తీసుకొచ్చింది. AIR నాణ్యతా ప్రమాణాలను ముగ్గురు దార్శనికులు నిర్దేశించారు. లయినెల్ ఫీల్డెన్ అనే సృజనాత్మక మేధావి మొదటి డైరెక్టర్ జనరల్‌గా ఉన్నాడు. తర్వాత ప్రసారాల నిర్వాహకుడిగా, అద్భుతమైన సంగీత కారునిగా సమానమైన ప్రతిభ ఉన్న విక్టర్ పరంజోతి. మూడో వ్యక్తి స్వతంత్ర భారతదేశపు సమాచార ప్రసారాల శాఖా మంత్రి అయిన బి.వి. కేస్కర్. వృత్తి నిపుణులుగా మొదటి ఇద్దరూ AIR ను ప్రపంచంలోనే చక్కని ప్రసారకులలో ఒకదానిగా తీర్చిదిద్దారు. పాలసీ తయారు చేయటంలో కేస్కర్ దేశాలన్నంతటినీ ఒకటిగా కలిపే కార్యక్రమాలను ఒక చేత్తో ప్రారంభించి, మరొక చేత్తో సంప్రదాయ సంగీతానికి స్పష్టమైన ప్రాధాన్యతను ఇచ్చారు. ఆయన సృష్టించిన "జాతీయ కార్యక్రమం" గొప్ప ప్రతిభావంతులైన సంగీతకారులకు వేదికగా నిలిచింది. ఆ వేదిక ద్వారా వారు దేశమంతటికీ పరిచయమయ్యారు. ఐతే త్రాసులో మరొకవైపు అంత బలంగా, సమానంగా లేదు. AIR తనదైన నియంతృత్వ పోకడలతో నడిచేది. విసుగుపుట్టించేంత బ్యూరోక్రటిక్ పద్ధతులు, పక్షపాత ధోరణులు స్పష్టంగా కనిపించేవి. వేలంపాటలో సరుకుల్లాగా కళాకారులకు విలువకట్టేవి. గ్రేడులుగా వేరేచేసేవి. స్త్రీలు స్త్రీలైనందువల్ల పల్లవులు పాడటాన్నించి నిషేధించబడ్డారు. హార్మోనియం నిషేధించబడింది. ఈ విధమైన ధోరణులున్నప్పటికీ ఆ మాధ్యమంలోని శక్తివంతమైన

స్వభావం వల్ల రేడియో భారతదేశంలో శాస్త్రీయ సంగీతం మీద చెరగని ముద్ర వేసింది. AIR రుణం కర్ణాటక సంగీతం తీర్చగలిగేది కాదు.

సంగీత నిర్మాణంలోనే స్పష్టమైన మార్పుని మూల్యంగా చెల్లించటం వల్లనే గ్రామఫోను, రేడియోలలో సంగీతం ప్రజాదరణ పొందగలిగింది. పది అంగుళాల షెల్లార్ రికార్డులో కేవలం మూడు నిముషాల సంగీతం మాత్రమే యిమిడేది. ఇంకా యెక్కువనుకుంటే మూడు నిముషాల పది సెకండ్ల సంగీతం పట్టేది – అంతే. సాంకేతికత సృష్టించిన అద్భుతాన్ని చూసి కాకపోతే, సంగీత విద్వాంసులు వాళ్ళ ప్రదర్శనను సెకండ్లతో కొలవడమనే మాటకే దెబ్బతిన్నట్లు కోపగించుకునేవారు. ఐనా బెంగళూరు నాగరత్నమ్మ వంటి కఠినమైన అభ్యసనపరురాలు కూడా త్యాగరాజ కృతిని, ఒక కంటిని సెకండ్ల ముల్లు మీద ఉంచి బాధ్యతతో పాడేది. పల్లవి పదిహేను సెకెండ్లు ఉండాలని, చరణం నలభై సెకండ్ల పాటు నడవాలనే ఆలోచనలు సాధారణమైపోయాయి. రేడియో మరింత కఠినతరమయింది. సరైన కర్ణాటక సంగీత కచేరీకి సంప్రదాయపరంగా తీసుకునే సమయం నాలుగుగంటలైతే, ఆకాశవాణి జాతీయ కార్యక్రమం దానిని గంటన్నరకు నరికేసింది, కాదంటే యెప్పుడన్నా రెండు గంటలు చేసేది. ఆ గంటన్నరలోనే ప్రకటనలు కూడా జతచేయబడేవి. సంప్రదాయపరులు తాము వంచింపబడుతున్నామనుకునేవారు. వాళ్ళు తోడి కృష్ణయ్యర్ పాడే ప్రధాన రాగమైన 'తోడి'ని ఒకేసారి ఏడెనిమిది గంటలు వినటానికి అలవాటుపడి ఉన్నారు. అలాగే 'పల్లవి' శేష అయ్యర్ ఒక్క పల్లవిని వైవిధ్యభరిత ఛాయలలో సుదీర్ఘ ప్రస్తారంచేసి ఎనిమిది గంటలపాటు శ్రోతలను మంత్ర ముగ్ధులను చేసేవాడు. కానీ AIR అధికారం గల కొత్త మాధ్యమం. AIR అంటే ప్రభుత్వం – ఆల్ ఇండియా రేడియో కర్ణాటక సంగీత కచేరి రెండు గంటలకు కుదిస్తే ఇక అదంతే. 10 అంగుళాల గ్రామఫోన్ రికార్డు, AIR విధించిన సమయపాలనా దీర్ఘకాలంగా సంప్రదాయ సంగీత విద్వాంసులు బందీలయి వున్న అలవాట్లను మార్చగలిగాయి. వాళ్ళు కోపంతోనైనా క్లుప్తత యొక్క సుగుణాన్ని అంగీకరించక తప్పలేదు. నిజానికి 'రికార్డింగ్ ఆర్టిస్టులు' అనే కొత్త ప్రక్రియ పుట్టింది. వాళ్ళెప్పుడూ కచేరీ వేదికనెక్కలేదు. చూడలేదు. కానీ స్టూడియోలో వాళ్ళే గురువులు. ఎందుకంటే వాళ్ళు సెకండ్ల లెక్కన సంగీతాన్ని పాడగలరు. చివరికి రూపం వస్తువుని నిర్ణయించింది.

❖ ❖ ❖ ❖

అన్నింటా వ్యాపించిన మరొక మాధ్యమం సినిమా, భారతదేశంలో రేడియోతోపాటు అభివృద్ధి చెందింది. 1931లో మొదటిసారి మనదేశపు వెండితెరలమీద 'టాకీ'లు ప్రత్యక్షమయ్యాయి. నాటకాలలో లాగానే సినిమాలలో కూడా నిపుణులైన నటులకంటే గాయకులు కావాలి. సినిమా చరిత్రకారుడైన రాండార్‌గై ఇలా రాశారు "సెట్స్ మీద సంభాషణలతో

పాటు పాటలు కూడా పాడాల్సి రావటం, అప్పుడే కెమెరా తిరగటం, వీటన్నిటితో నిర్మాతలు బాగా పాడగలిగిన వాళ్ళ వెంటపడ్డారు. సంప్రదాయ కర్ణాటక సంగీత విద్వాంసుల కోసం బారులుతీరి నిలబడ్డారు. ప్రముఖ సంగీత విద్వాంసులు అనేకులు వాళ్ళకు నటన తెలియక పోయినా సినిమాల్లోకి ప్రవేశించారు". అలాంటి గాయకులలో జి.యన్. బాలసుబ్రమణియన్ (1934వ సంవత్సరంలో భామా విజయంతో మొదలుపెట్టి మరొక నాలుగు సినిమాలలో నటించాడు. వాటిలో 1940 నాటి అఖండ విజయం సాధించిన 'శకుంతలై' సినిమా ఒకటి. ఆ సినిమాలో యమ్మెస్ సుబ్బులక్ష్మి శకుంతలగా ముఖ్యపాత్ర ధరించింది) మహా రాజపురం విశ్వనాథ అయ్యర్ (నందనార్, 1935), ముసిరి సుబ్రహ్మణ్య అయ్యర్ (తుకారాం, 1937)లు నటనలోకి వచ్చారు. నటించటం బొత్తిగా ఇష్టంలేని చెంబై వైద్యనాథ భాగవతార్, వీణ విద్వాంసులు చిట్టిబాబు, మొదలైన వారిని ఒక్క రీలు వుండే కచేరీలోనైనా కనిపించాలని బలవంతం చేశారు. వయొలిన్ విద్వాంసుడు మైసూర్ చౌడయ్య, నాగస్వర వాయిద్యా విద్వాంసుడైన టి.యన్. రాజరత్నం పిళ్ళై వంటి వారి కోసం సినిమాలలో ప్రత్యేక సన్నివేశాలను కల్పించేవారు. ఐతే సినిమాలలో అత్యంత ప్రతిభావంతమైన ముద్రవేసిన గాయకుడు యమ్.కె. త్యాగరాజ భాగవతార్. ఆయన మహా విద్వాంసుల కోవకు చెందక పోయినా, గొప్ప గాయకుడు. ఆయన గాత్రం, శైలీ విన్యాసాలను లక్షలాది శ్రోతలు ఆరాధించేవారు. తమిళ సినిమాలలో మొదటి సూపర్‌స్టార్ అయిన ఆయన నటించి విజయవంతం చేసిన సినిమాలు సంప్రదాయ సంగీతానికి, సామాన్య ప్రజానీకం నుంచి ఆదరణను సంపాదించి పెట్టాయి.

వెండితెరమీద కనిపించని అతి కొద్దిమందిలో సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్ ఒకరు. అరయకుడి తర్వాత అగ్రశ్రేణి విద్వాంసుడాయన. సినిమాల గురించి ఆయనకేమీ అభ్యంతరం లేదు. మిగిలిన విద్వాంసులకు వచ్చినట్లే ఆయనకూ సినిమారంగం నుంచి పిలుపు వచ్చింది. AVM స్టూడియో వారు పిలిచారు. ఆ రోజుల్లో AVM చాలా పెద్ద సంస్థ. వాళ్ళు తాము తీసే నందనార్‌లో నందనార్ పాత్రలో నటించమని అడిగారు. సెమ్మంగుడి అంగీకరించారు. ఆ వార్త వినగానే ఆయన తండ్రి ఒక పన్నాగం పన్నాడు. తండ్రికి సినిమా నటన అంటే ఒక చెడ్డపని. తన కుమారుడు ఆ సినిమా వాళ్ళతో చేతులు కలిపితే, తను తమ కుటుంబానికి చెందిన బావిలో దూకుతానని బెదిరించాడు. అదృష్టవశాత్తు, ఆ తండ్రిగారికి ఆ బావిలో మునకవేసే అవసరం రాలేదు. సెల్యులాయిడ్ మీద చిరస్థాయిగా నిలబడే అవకాశాన్ని సెమ్మంగుడి ఒదులుకుని కుమారుడిగా బాధ్యత పడ్డాడు. ఇలాంటి మినహాయింపులేవీ సినిమాకు, కర్ణాటక సంగీతానికి ఉన్న అనుబంధాన్ని సడలించలేకపోయాయి. తొలి తమిళ సినిమాలన్నీ గొప్ప సంప్రదాయ సంగీతంతో, గాయకుల స్వర సంపన్న వరాలతో నిండిపోయాయి. నాణ్యతలోనూ, సంఖ్యలోనూ గొప్ప

సంగీతాన్ని సినిమాలకు సమర్పించినవాడు పాపనాశమ్ శివన్. తన పాటలు తనే రాసుకుని, తనే బాణీలు సమకూర్చుకుని, స్వరపరచుకుని, తన మొదటి సినిమా అయిన సీతా కల్యాణం (1933)తోనే సంప్రదాయ కర్ణాటక సంగీతాన్ని సినిమాలో ఒక విడదీయలేని భాగంగా చేసేశాడు. త్యాగరాజు భాగవతార్‌తో కలిసి శివన్ పాటలు రాసి కొన్ని తమిళ సినిమాలు శాస్త్రీయ సంగీత విజయాలను సాధించేంత, గొప్ప సంగీతాన్ని సృష్టించాడు. వాటిలో పవలక్కోడి (1934) చింతామణి (1937) శివకవి (1943)లను ముఖ్యంగా చెప్పుకోవాల్సినవి. అతని పాండిత్య ప్రకర్ష ఎంత గొప్పదంటే మద్రాసు మ్యూజిక్ ఆకాడెమి అధ్యక్ష పీఠం నుంచి శివన్‌కు మూర్తిత్రయం సరసన స్థానం యివ్వాలని 'తమిళ త్యాగ రాజర్'గా గుర్తించాలనీ సూచన వచ్చింది. శాస్త్రీయ సంగీతానికి, సినిమాకు నడుమ విభజన రేఖ ఏదైనా ఉంటే పాపనాశమ్ శివన్ దానిని చెరిపేశాడు. యమ్మెస్ సుబ్బులక్ష్మి, ఎన్.సి. వసంత కోకిల సినిమాలలో ప్రవేశించినప్పుడు వారు చక్కగా, యధార్థంగా నిర్మితమై వున్న ఒక వరస క్రమంలో ఇమిడిపోయారు. అంతే!

ఈ సాంఘిక, సాంకేతిక మార్పుల కలయిక ప్రభావం 1930వ దశాబ్దానికి చాలా నాటకీయంగా తయారైంది. సంగీత సభలు, నాటకరంగం, గ్రామఫోను, రేడియో, సినిమా అన్నీ కలిసి శాస్త్రీయ సంగీతాన్ని ఎలా పుష్పింపజేశాయంటే, ప్రదర్శనార్హమైన కళలలో సంగీతానికి సాటివచ్చేది లేకుండా పోయింది. పైవన్నీ కలిసి సంగీతాన్ని పోషకుల సంస్కృతి నుంచి విముక్తం చేశాయి. పోషక సంస్కృతి తొలి దశలో అత్యవసరంగా కావలసిన కొంత ప్రోత్సాహాన్ని అందించినా, ప్రజా బాహుళ్యాన్ని ఆమడ దూరంలో ఉంచింది. కొందరు సంపన్నుల చేతుల్లో నుండి సంగీతాన్ని లాక్కుని అనేకమందికి అందు బాటులోకి తెచ్చాయి పైన చెప్పిన మార్పులు. జమీందారు స్థానంలోకి మధ్యతరగతి వచ్చి కూర్చుంది.

❖ ❖ ❖ ❖

హఠాత్తుగా ఒక తరం అంతా పట్టలేని ప్రతిభతో ముందుకు దూసుకువచ్చింది. ఈ తరం యవ్వనోత్సాహంతో, సజీవంగా, ఆత్మ విశ్వాసంతో వెలిగిపోతూ, తమ పదునైన కోణాలను ప్రదర్శించేందుకు భయపడకుండా, తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు గర్వ పడుతూ రంగులమయమైంది. విభిన్నమైన శైలులతో, విధానాలతో వ్యతిరేక దిశలకు లాగబడుతున్నట్లు కనిపించినా ఈ కాలంలో శాస్త్రీయ సంగీతం అత్యాశ్చర్యకరంగా 'కర్ణాటక' అనే ఒక గొడుగు (rubric) కిందకి వచ్చి కలిసింది. సజీవమూ, చైతన్యపూరితమూ, అనేక వర్ణాలతో కాంతివంతమూ అయిన ఈ వ్యక్తులు ప్రతి ఒక్కరూ ఇతరుల నుండి తమదైన ప్రత్యేకతను విజయోత్సాహంతో ఉత్సవంలా కొనసాగిస్తూ, తమ అహంభావాలను అద్భుతమైన కోణాలతో ప్రతిధ్వనింపజేస్తూ, సంగీత రంగాన్ని సజీవం చేశారు. విభిన్న

వ్యక్తులతో వైవిధ్యవంతమైన బృందంలా వారున్నారు. వారిలో స్వచ్ఛతను కోరేవారూ, స్వేచ్ఛా విహారులు, సంప్రదాయపరులు, తమదైన ముద్రను వేసినవారు, గుంపులను ఆకర్షించేవారు, గుంపులను తప్పించుకునేవారు, హాస్య చతురులు, విసుగు తెప్పించేవారూ అందరూ ఉన్నారు. కాని వారందరూ సుప్రసిద్ధులైన, గౌరవనీయులైన సంగీత విద్వాంసులు.

వాళ్ళ చాదస్తాలు చాలా ఉన్నాయి. వాళ్ళలో కొందరు కచేరీకి ఒప్పుకుని టిక్కెట్లు అమ్ముడయ్యాక కచేరీ చెయ్యమని నిరాకరించిన వాళ్ళున్నారు. కొందరేమో ఎప్పుడు వాళ్ళకి మూడ్ వస్తే అప్పుడు గొంతు విప్పుతారు – కొన్నిసార్లు రోడ్డుపక్కన, కొన్నిసార్లు దుకాణాల లోను. ఒకసారి పాల్ఘాట్ బ్యాంక్‌లో గుమస్తాకు తన పాట వినాలని వుందని బ్యాంకులో నేలమీద కూర్చుని ఒక గంట పూర్తిగా పాడాడు చెంబై వైద్యనాథ భాగవతార్. కొందరు సంగీతం ఆత్మానందం కోసమనే సూత్రాన్ని పట్టుకుని శ్రోతల కోసం పాడనే పాడరు. సంగీతకారుడి పని లోపలున్న జీవశక్తిని మేల్కొల్పి దానిని పాట రూపంలో వ్యక్తీకరించట మంటాడు టైగర్ వరదాచారి. వీణ ధనమ్మ తన కచేరీలను తన ఇంట్లోనే తన కోసమే పెట్టుకోవటంలో ప్రసిద్ధి పొందింది. కొన్నిసార్లు అతిథులకు అక్కడ కూర్చోటానికి అనుమతి దొరికేది. కానీ ఎవరైనా వస్తున్న దగ్గుని అణుచుకునేంత చిన్నపాటి శబ్దం చేశారా ఆమె మధ్యలోనే వీణావాదన ఆపేసేది. మహారాజపురం విశ్వనాథ అయ్యర్ ఎప్పుడూ నియమాలను ఉల్లంఘించేవాడు. హాస్య వ్యంగాలతో నిండిన వ్యాఖ్యలు చేస్తూ తన అసంప్రదాయ పద్ధతులతో సంప్రదాయపరులైన పవిత్రాత్ములకు కోపం తెప్పించేవాడు. కానీ సంగీతంలో అతని 'జీనియస్'ని ఎవరూ ప్రశ్నించేవారు కాదు. ప్రసిద్ధుడైన అరియకుడి రామానుజ అయ్యంగార్ 'తాగుబోతు'గా తనకున్న ఖ్యాతిని దాచుకోవాలని ఎన్నడూ ప్రయత్నించేవాడు కాదు. తన పేరే తను బహిరంగంగా తాగేందుకు అనుమతినిస్తున్నదని చెప్పేవాడు – ఎల్లోరం అరియకుడి (తాగు, అది అందరూ తెలుసుకుంటారు). మైసూరు మహారాజా ఆస్థాన విద్వాంసుడిగా నియమించిన హరికేశనల్లూర్ భాగవతార్ తానే ఒక మహారాజులా, పట్టుబట్టలతో, ఆభరణాలతో జీవించాడు. తన స్వంత పట్టణంలో సంగీతోత్సవాలు జరిగి నప్పుడు ఆయన, ఆయనతోటి గాయకులు గంధపు పొడిని నీళ్ళతో తడిపి ఒళ్ళంతా పూసుకునేవారు, తర్వాత నదిలో స్నానం చేస్తే, ఆ నీళ్ళు పసుపుపచ్చగా, పరిమళంతో నిండేవి.

వాళ్ళు గొప్ప సంగీత విద్వాంసులు. తప్పకుండా అంతే. కానీ ఆ పదానికున్న సంప్రదాయార్థంలో వాళ్ళు చదువులేనివారు. సెమ్మంగుడి శ్రీనివాసయ్యర్ తన గ్రామంలోని తిన్నయ్ పల్లికూడమ్, వరండా బడిలో కొన్ని సంస్కృత శ్లోకాలు మాత్రమే చదువుకున్నాడు. ఆ బడికి వెళ్ళటం కూడా ఐదో క్లాసులో ఆగిపోయింది. ఇంకో ఊరువెళ్ళి మంచి బడిలో చదవటానికి కావలసిన డబ్బు ఆయనకు దొరకలేదు. ఐనా ఆయన కర్ణాటక సంగీతంలో

అజేయుడైన పండితుడు. వీణ ధనమ్మ మనుమడైన టి. శంకరన్ ఇలా వివరించాడు "నర్తకులు, సంగీతకారులు వారి కళలలో పండితులు గానీ, పాఠశాలల్లో కాదు. వాళ్ళకు ఒక రూపాయిచ్చి చిల్లర ఇవ్వమని అడగండి, వాళ్ళకది చేతకాదు. కానీ వాళ్ళు తాళం – లయల లెక్కలను కంప్యూటర్‌లా చేసెయ్యగలరు." వీళ్ళందరి ప్రపంచంలో జి.యన్. బాలసుబ్రహ్మణ్యం కొంత విడ్డూరంగా కనిపిస్తాడు. ఎందుకంటే అతను 1931లో మద్రాసు క్రిస్టియన్ కాలేజీ నుంచి ఇంగ్లీషు సాహిత్యంలో బి.ఏ. ఆనర్స్ డిగ్రీ తీసుకున్నాడు. ఆ తర్వాతనే సంగీతాన్ని పాడటం ఒక వృత్తిగా చేపట్టాడు. అతనికున్న విద్యా నేపథ్యంవల్ల మేలు జరిగింది. ఆయన రచనలు, ఉపన్యాసాలు, ఆలోచనలలో విశాలత్వం కర్ణాటక సంగీత స్థాయిని పెంచేందుకు సహాయపడ్డాయి. ఆయన విలక్షణ శైలి జి.యన్.బి. తరహా శైలిగా, జి.యన్.బి. బాణిగా మారేందుకు దోహదం చేసింది. ఆయన సంగీత వ్యాకరణాన్ని ఎంత బాగా అర్థం చేసుకున్నాడంటే, అది అర్థం చేసుకునే వారిని చాలా విశ్వాసంతో చేరుకునేవాడు. సంగీతంలో మేధోపరమైన, మాధుర్యపరమైన వర్గాల మధ్య ఒక వారధిని నిర్మించేందుకు అతనికి ఈ శక్తి సహాయపడింది. ఇంగ్లీషు విద్య అతనికి అసాధారణ పదాలను తయారుచేసి వాడే ధైర్యాన్నిచ్చింది. ఒకసారి అతను కాంభోజి రాగాన్ని పాడు తున్నప్పుడు కొందరు శ్రోతలు అతను యదుకుల కాంభోజి, శంకరాభరణం రాగాలలోకి దారితప్పుతున్నాడని భావించారు. కానీ తాను ఆ రాగాల జోలికి వెళ్ళలేదని చూపించేందుకు ఆయన కాంభోజి రాగాన్ని మళ్ళీ పాడాడు.

జి.యన్.బి. తనదైన ఒక ట్రేడ్‌మార్కు బాణీని సృష్టించుకున్నాడు. అది బ్రిగ అంటే వేగమైన, లోతైన స్వరబేధాలు. అచ్చుల రూపంలోనే ఎక్కువ పాడుతూ, రాగం చివరలో ఒక ఆనందాతిశయాన్ని కలిగిస్తాయి. జి.యన్.బి. బ్రిగశైలీ, అతని విశ్వ విద్యాలయపు చదువు అతన్ని మిగిలినవాళ్ళకంటే భిన్నంగా తయారుచేస్తే యమ్.డి. రామనాధన్ శాస్త్రీయతను, దాని నియమాలను గట్టిగా పట్టుకుని తన ప్రత్యేకత నిలబెట్టు కున్నాడు. కొన్ని తలవంచని, ఒంటరి కొలతలతో ఆయన భావసముద్రాన్ని సాధించ గలిగాడు. దానిలో ఆయన తనను తాను పూర్తిగా మర్చిపోయి రసికులకు ఆనందాన్ని కలిగిస్తాడు. ఆలతూర్ బ్రదర్స్ గణితపరంగా తమ పాటను సంగ్రహంగా పాడతారు. శాస్త్ర శుద్ధమైనా సంగీతపరంగా ఉదాత్తంగా ఉంటుంది. స్వర విన్యాసంలో మదురై మణికున్న అధికారం ఎలాంటిదంటే ఆయన పలికే ప్రతి స్వరం శ్రుతితో పరిపూర్ణంగా కలిసిపోతుంది.

ఇంకా సంగీతాకాశంలో మెరిసిన వారిలో అతి పోకడలు పోయేవారు కూడా ఉన్నారు. చాలా హాస్యధోరణి కలిగిన వారి నుంచి అలవగొట్టే వారి వరకూ ఆ వరుస చాలా పెద్దది. తంజావూరులో ప్రసిద్ధి చెందిన మృదంగ కళాకారుడైన నారాయణస్వామి అప్ప తను స్నానంచేసి ఒళ్ళు తుడుచుకున్న తువ్వాలను పిండడు, మెలిదిప్పుడు – ఎందు

కంటే అది తన చేతివేళ్ళకు అనవసరం ఆయాసాన్ని కలిగిస్తుంది. అమూల్యమైన ఆ చేతి వేళ్ళను మృదంగం వాయించేందుకు మాత్రమే కాపాడుకోవాలి. రంగస్థలం మీద కళాకారుడిగా ప్రతిభ చూపి నటన నాయక అని పేరెక్కి గోపాలస్వామి తరచుగా అమితమైన భక్తిలో మునిగి ఆ వరదలో చిక్కుకుపోతాడు. కృష్ణుడి గోపికలాగా స్త్రీల వస్త్రధారణ చేసుకుని నృత్యంచేస్తూ సంగీతాన్ని సమకూరుస్తాడు. వీణ విద్వాంసుడైన కృష్ణమాచారి తన అన్నాన్ని తానే వండుకుంటాడు, అతనికిష్టమైన పులిహోరను ప్రత్యేకంగా చేసుకుంటాడు. అతను పులిహోర కృష్ణమాచారిగా అతని కాలంలోనే ప్రసిద్ధి పొందాడు.

కర్ణాటక సంగీత ప్రపంచంలో అతి పెద్ద స్థాయిలో విపరీత పోకడలు పోయిన వ్యక్తి వేణువాదనా నిపుణుడైన టి.ఆర్. మహలింగమ్. అతను బాలమేధావి. 1930లలో రంగం మీదికి వచ్చాడు. అతనికున్న సంగీత గ్రహణశక్తి ఎలాంటిదంటే, కర్రాబిళ్ళా ఆడుతూ చాలా సంక్లిష్టమైన రాగాన్ని ఒక చెవితో వినేసి, ఆ రోజు రాత్రి దానిని వేణువు మీద నిర్దుష్టంగా తిరిగి వాయించగలడు. అతని మెదడులో టేప్‌రికార్డరు ఉందని ప్రజలు చెప్పుకునేవారు. సామాన్యమైన మనిషి, ఎగుడు దిగుడు చేతలు, భావావేశాలకు తరచు లోనయ్యేవాడు, సీసాకు బానిస. చాలా గంభీరంగా జరిగే శాస్త్రీయ సభలలో కూడా తన ప్రక్కన ఒక ఫ్లాస్క్‌లో మద్యం ఉంచుకునేవాడు – ప్రతిసారీ దానికి కాఫీ అని దాచేవాడు కాదు. కొన్నిసార్లు అతను సభాప్రాంగణానికి తప్పతాగి వచ్చేవాడు. నలుగురు మనుషులతన్ని వేదికమీదికి మోసుకొచ్చేవారు. ఒకసారి తన వాద్యస్థానంలో కూర్చున్న తర్వాత ఆశ్చర్య మనిపించేలా అతను వెదురుతో అద్భుతాలు సృష్టించే ఇంద్రజాలికుడిలా మారిపోయేవాడు. కర్ణాటక సంగీతశాస్త్ర గ్రంథంలోని ప్రతి నియమాన్నీ అతి కఠినంగా పాటిస్తూ వేణువాదన చేసేవాడు. ఈ మానవాతీతమైన కార్యాన్ని వివరించటానికి ఏ వైద్యుడూ, ఏ మానసిక శాస్త్రవేత్తా ముందుకు రాలేదు.

❖ ❖ ❖ ❖

అహంభావులు, హాస్యగాళ్ళు, అతిశయపరులు, తమ వ్యక్తిగత శైలిలో నిష్ణాతులు, విపరీత ధోరణులు గలవారితో నిండిన అనేక కాంతులతో ప్రకాశించే సంగీత ప్రపంచం 1930లలో మధురై గాయక వీధులలోని ఒక సామాన్యురాలైన తల్లి యొక్క సామాన్యురాలైన కూతురిని ప్రోత్సహించి తనవెంట, తమ దారిలో రమ్మని పిలించింది. ఆమె ప్రశాంతంగా ఆత్మవిశ్వాసంతో అడుగుపెట్టింది. నిజాయితీగా, ఉన్న పద్ధతిని ఎవరూ వివరించకుండానే ఆమోదించే తత్త్వం ఉన్న సుబ్బులక్ష్మి నిజానికి తానొక విప్లవాన్ని ప్రారంభిస్తున్నానని తెలుసుకోలేక పోయింది. ఆమె పురుష ప్రపంచంలోకి ప్రవేశించింది. నిజమే, ఆమెకంటే ముందు కీర్తి సంపాదించిన గాయనీమణులు ఉన్నారు. కానీ వారు కె.బి. సుందరంబాళ్ లాగా నాటక రంగానికో, యస్.డి. సుబ్బలక్ష్మి వలే వెండితెరకో పరిమితమయ్యారు.

మొట్టమొదటిగా గంభీరమైన గాత్ర కచేరీ చేసే గాయకురాలిగా యమ్మెస్ సుబ్బులక్ష్మి అందరి దృష్టిని తన వైపు మళ్ళించింది. ఆమె ఒక్కతే కచేరీలు చేసే సమయానికి అరియకుడి, చెంబై, మహా రాజపురం మొదలైన వాళ్ళు 'సీనియర్స్'గా పైస్థాయిలో ఉన్నారు. ఆకాశమంతా తారలతో నిండిపోయి ఉన్నది. రాజైన అరయకుడి వెనుకనే జి.యన్.బి. కర్ణాటక సంగీతపు రాజకుమారుడై తన పాలన మొదలుపెట్టాడు. అప్పుడున్న పరిస్థితి గురించి సునిశిత పరిశీలకుడొకరు ఇలా చెప్పారు. మగటిమిగల కాంచీపుర విధానపు పతకాన్ని పట్టుకుని చిత్తూరు సుబ్రహ్మణ్య పిళ్ళై నడుస్తున్నాడు. మంద్రస్థాయిలో ముసిరి సుబ్రహ్మణ్య అయ్యర్ ఆత్మను కదిలించే విరామాలను యివ్వటంలో అద్భుతాలు చేస్తున్నాడు. ప్రత్యేక అభిమాన బృందాల హృదయాలలో ప్రవేశిస్తున్నాడు. అప్పుడే ఆ సన్నివేశంలోకి ప్రవేశించిన సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్, ధ్వనిపరమైన ఆటంకాన్ని పగలగొట్టి అతి వేగంగా భావాన్ని, శృతిని ఐక్యం చేయటంలో పరిపూర్ణత సాధించాడు. అనితరసాధ్యుడైన మణి అయ్యర్ తన స్వర ప్రస్తారపు జలపాతపు తూగులలో శ్రోతలను ఊయలలూపుతున్నాడు. సినీనటుడు, గాయకుడు యమ్.కె. త్యాగరాజ భాగవతార్ తన శాస్త్రీయ మాధుర్యంతో జనాలను ఆకట్టుకుంటున్నాడు. ఇంకా ప్రాధాన్యతను, గుర్తింపును పొందుతున్న వారిలో టి.కె. రంగాచారి, సాతూర్ సుబ్రహ్మణ్యమ్, తంజావూరు నాను.....యమ్మెస్ తనవైపు దృష్టి మళ్ళించుకునేందుకు వారందరినీ సవాలు చేసింది." సంగీత వ్యవస్థ, శ్రోతలైన ప్రజా సమూహం ఆమె సవాలు చేసే పద్ధతిని కూర్చుని చూడవలసి వచ్చింది. అలా జరుగుతున్నప్పుడు, ఆమె ప్రవేశం ఇతర అగ్రశ్రేణి గాయనీమణుల ప్రవేశంతో అనుకోకుండా కలిసి జరిగింది. వారిలో ప్రతి ఒక్కరు ఎన్నదగిన ప్రతిభా పాటవాలు కలిగినవారు. పురుషులతో సమానస్థాయిలో ఉన్నవారని చెప్పకపోతే వారికే కాదు సంగీతానికే హాని చేసిన వాళ్ళమవుతాము. కర్ణాటక సంగీత స్వర్ణయుగం పురుషులతోపాటు యమ్మెస్ సుబ్బులక్ష్మికి, డి.కె. పట్టమ్మాళ్‌కి, యమ్.యల్. వసంతకుమారి, ఎన్.సి. వసంతకోకిలకు కూడా రుణపడి ఉంది.

ఎన్.సి.వి. కర్ణాటక ఆకాశంలో మెరుపులా మెరిసి కనుమరుగైపోయింది (ఆమె సుమారు ఇరవై ఐదవ యేట మరణించింది) సుబ్బలక్ష్మి కంఠంతో పోటీపడగల కంఠం ఆమెది. కొందరు పాతతరం వాళ్ళు ఆమె మరికొంతకాలం బ్రతికివున్నట్లయితే యమ్మెస్‌కి వచ్చినంత కీర్తి ప్రతిష్టలు సంపాదించుకునేది అంటారు. సుబ్బులక్ష్మి కంటే పన్నెండేళ్ళు చిన్నదైన యమ్.ఎల్. వసంతకుమారి జి.ఎన్.బి. శైలిలో కొద్దిపాటి కంపనతో కూడిన స్వరధారా ప్రవాహాలను తనవిగా చేసుకున్నది. ఆమె ఆలాపనలో, ప్రస్తారాలలో రాణించింది. ఆమె తన బహుముఖీన ప్రజ్ఞవలన, అన్ని దక్షిణ భారత భాషలలో, హిందీలో ఆత్మ విశ్వాసంతో పాడింది. ఆమెది తమిళమైనప్పటికీ పురందరదాసు కన్నడ సంగీతాన్ని,

తెలుగువాడైన త్యాగరాజు సంగీత సృష్టిని ప్రచారం చేయటానికి పూనుకుంది. ఆంధ్ర ప్రాంతంలో ఒకసారి కచేరీ చేస్తున్నప్పుడు కేవలం తెలుగుపాటలే పాడమన్నప్పుడు చాలా బాధపడింది. సంగీతంలో భాషావిభేదాలకు వ్యతిరేకంగా ఉద్యమించింది. సినిమా నేపథ్య సంగీతంలో ప్రవేశించి తన వందలాది సినిమా పాటలతో శాస్త్రీయ శైలికి ప్రజాదరణను సంపాదించిపెట్టింది. విశ్వవిద్యాలయాల్లో పురందరదాసు పీఠాలను నెలకొల్పాలనే స్వప్న సంకల్పాలకు కార్యరూపం ఇవ్వగల సమర్థురాలు. తత్త్వవేత్త అయిన జిడ్డు కృష్ణమూర్తి స్థాపించిన రిషీవ్యాలి స్కూల్‌లో (మదనపల్లి, ఆంధ్రప్రదేశ్) ఉపాధ్యాయినిగా పనిచేసింది. సంగీతాన్ని ప్రభావితం చేసే మౌలిక విషయాల గురించి తన ఆలోచనలను ఎప్పుడూ మాట్లాడేది. అలాంటి పని సుబ్బులక్ష్మి చేయటాన్ని మనం ఊహించలేం. డి.కె. పట్టామ్మాళ్ ఎన్నడూ ఆ పనిచేయలేదు. యమ్.యల్. వసంతకుమారి 1990లో తన అరవై రెండవ యేట కాలధర్మం చెందింది.

డి.కె. పట్టమ్మాళ్ సుబ్బులక్ష్మి కంటే మూడేళ్ళు చిన్నది. ఆమెకు తనదైన ముద్ర ఉంది. మహిళా గాయకులలో చాలా అసాధారణమైన హస్కీ వాయిస్ ఉందనే కాకుండా యన్.సి. వసంత కోకిలం అకాల మరణం తర్వాత మిగిలినవాళ్ళలో ఈమె ఒక్కతే బ్రాహ్మణ కులానికి చెందినది. అది పరిగణించాల్సిన విషయమే. ఎందుకంటే ఆమె కులపరమైన ఆటంకాన్ని మిగిలినవారి కంటే భిన్నంగా అధిగమించాల్సి వచ్చింది. మిగిలినవారు 'వినోద వర్గం' నుంచి రావటంతో జండర్ పరమైన ఆటంకంతో పోరాడితే డి.కె. పట్టమ్మాళ్ స్త్రీలు బహిరంగంగా పాడకూడదనే బ్రాహ్మణ నియమాన్ని ఉల్లంఘించింది. సంప్రదాయ వాదులు భీకరంగా వ్యతిరేకించారు, కానీ ఆమె బ్రాహ్మణ కులానికి చెందినందువల్లనే, డి.కె. పట్టమ్మాళ్ రావటం అనేది మహిళా సంగీత కళాకారులకు సంప్రదాయ సంకెళ్ళ నుండి విముక్తికి కారణమయ్యేంత ప్రభావాన్ని చూపింది. చివరికి ఆమె ప్రతిభా నైపుణ్యాలే కర్ణాటక సంగీత ప్రముఖుల సరసన ఆమెకు ఉచిత స్థానాన్ని సంపాదించిపెట్టాయి. ఆమె సంప్రదాయ సంగీతంలో ఏ కళాకారులూ చేయలేనంత పెద్ద సంగీత సర్వస్వాన్ని నిర్మించింది. పదాలు, జావళీల నుంచి ముత్తుస్వామి దీక్షితార్, త్యాగరాజుల అద్భుత కీర్తనలు, అన్ని కాలాలకు చెందిన తమిళ సంగీతకారులు పాపనాశనమ్ శివమ్, సుబ్రహ్మణ్య భారతి వరకూ అందరి సంగీతాన్నీ పాడింది. ఆమె ఉచ్చారణలో స్పష్టతా, సంగీతపు వంపులు, సంగీత నైపుణ్యం, సాహిత్యం కూడి చాలా గొప్పగా ఉండేది. ఆమె రాగం – తానం – పల్లవిల సంక్లిష్టతలు మహిళలకు అందనివి కావని నిరూపించింది. వారి సంగీతజ్ఞతలో సుబ్బులక్ష్మిని డి.కె. పట్టమ్మాళ్‌ని ఒక తరగతికి చెందినవారిగా పరిగణిస్తారు. వారిద్దరిలో సామాన్యంగా ఉండే అంశాలుగా కనుగొన్నవి సంగీతానికి అంకితమవ్వటంలోని నిబద్ధత, నేర్చుకోవటంలో, విరామంలోని శ్రద్ధాసక్తులు, సంప్రదాయబద్ధమైన సంగీత కళలో

తమ వ్యక్తిగత ముద్రవేయగల సామర్థ్యం, జీవనశైలిలో క్రమశిక్షణ, వినయంతో మితంగా ఉండే ధోరణులు.

ఏ రకమైన సంగీతపు కొలమానం ఉపయోగించినా ఈ స్త్రీలు అగ్రశ్రేణికి చెందుతారు. కానీ వారు స్త్రీలైనందువల్ల మొదటి రోజుల్లో వారిని సంగీత సభలు గానీ, తోటి గాయకులు గానీ ఆమోదించలేదు. గొప్ప వైణికుడైన మైసూరు చౌదయ్య సుబ్బులక్ష్మి గాత్రానికి సహకారంగా వాయించటానికి ఒప్పుకున్నప్పుడు తన స్థానాన్ని తగ్గించుకున్నట్టుగా భావించారు. పాల్ఘాట్ మణి అయ్యర్ (మృదంగ విద్వాంసుడు) పట్టమ్మాళ్ కచేరీకి వాయించేందుకు, ఆయన కూతురికి ఆమె కుమారునితో వివాహం జరిగాకే అంగీకరించాడు. కానీ ప్రతిభ పట్టలేనంత స్పష్టంగా కనిపించేసరికి మితవాత సంప్రదాయ వ్యవస్థ మహిళలకు తలుపులు తెరిచింది. అందరికంటే ముఖ్యమైన శ్రోతల నుంచి తిరుగులేని గుర్తింపు వచ్చింది. రసికులు వసంతకుమారి, పట్టమ్మాల్, సుబ్బులక్ష్మిలను మూర్తిత్రయంగా భావించి మాట్లాడుకునేవారు. అరియకుడి, సెమ్మంగుడి, చెంబైలను ఆధునిక మూర్తిత్రయంగా భావించేవారు. అసలు మూల మూర్తిత్రయం వలే వీరెవరూ సంగీతాన్ని స్వర పరచినవారు కాదు. ప్రతి తరంలోనూ ఒక మూర్తిత్రయాన్ని చూసుకునే బలమైన తమిళ అనుబంధానికి ఇది ఒక గౌరవ సూచకం. ఈ ముగ్గురు మూడు మూర్తిత్రయాలు వారి సామర్థ్యాలను బట్టీ ఆ పిలుపుకు అర్హులే. మరోవైపు ఒక తరపు కళా విలువలను కొలిచేందుకు ఉన్నత ప్రమాణాలను ఏర్పరిచేందుకు ఉన్న సామూహిక ఉత్సాహాన్ని కూడా తెలియజేస్తుంది.

ఇరవయ్యవ శతాబ్దపు ఈ తరం శైలీపరమైన పరీక్షలో నెగ్గింది. కానీ సుబ్బులక్ష్మికి, ఆమె తోటివారికి, వారి కుటుంబాలకూ ఇది కఠోర పరిశ్రమతో కూడిన విషయమే. స్త్రీల పట్ల వివక్ష జీవితంలోని అన్ని కోణాలలోనూ ఉండటమే కాదు, స్త్రీలు అది తమకు సహజమైన విధివ్రాలు అని దానిని ఒప్పుకున్నారు. మధుర మినాక్షి దేవాలయం స్త్రీలకు చేసిన మేలు కేవలం పుక్కిటి పురాణంగా మిగిలిపోయింది. వాస్తవానికి మధురై వంటి దేవాలయ పట్టణాల్లో స్త్రీ గాయకుల, నర్తకీమణులపై సాగే దోపిడి దేవుళ్ళ పేరుమీద వ్యవస్థీకృతమైంది. ఇది నిజంగా విడ్డూరమే. ఎందుకంటే భారతదేశపు సంగీత కళాకారులను రక్షించి పోషించే దేవత స్త్రీనే కదా!

# 3. సరస్వతి పుత్రికలు

*నాదలోలుడై బ్రహ్మా -*
*నందమందవే మనసా*
*స్వాదు ఫల ప్రద సప్త*
*స్వర రాగ నిచయ సహిత (నాద)*
*హరి-హరాత్మ భూ సురపతి*
*శర-జన్మ గణేశాది*
*వర మౌనులుపాసించ రే*
*ధర త్యాగరాజు తెలియు (నాద)*

భారతీయ పౌరాణిక కథలలో ఒకటి సంగీతానికి ప్రతినిధిగా ఒక దేవత ఎలా వెలిసిందో తెలియజేస్తుంది. సృష్టి చేయటంలో కఠోర శ్రమవల్ల కలిగిన నొప్పి తొలగించు కునేందుకు బ్రహ్మ ధ్యానంలో మునిగిపోయాడు. ఆ ధ్యానంలో తనను సత్వగుణాలు ఆవరిస్తున్నట్లుగా అనుభూతి చెందాడు. ఆ సుగుణాల నుండి ఆయన అంతశ్చేతనలోంచి సమ్మోహనకరంగా ఉన్న ఒక బాలికపుట్టి ఆయన ఎదుట నిల్చింది. "ఎవరు నీవు?" అని అడిగాడు బ్రహ్మ. ఆ అందాలరాశి "నేను నీ పవిత్రత నుంచి జన్మించాను. నా స్థానమేమిటో, నా పని, బాధ్యత లేమిటో ఆదేశించు" అన్నది. బ్రహ్మ ఆమెను చూచి "ధన్యురాలివి. నీ పేరు సరస్వతి. సృష్టిలోని సమస్త జీవరాశుల జిహ్వాగ్రాల మీద నివసించు. ముఖ్యంగా జ్ఞానుల మనసులలో నృత్యం చెయ్యి"మని అన్నాడు. అప్పటి నుంచీ సరస్వతి కళలకు అధిదేవత అయింది. ఆమె చేతుల్లో పుస్తకాన్ని, వీణను పట్టుకుని, తెల్లని వస్త్రాలు ధరించి, ధవళ పద్మాసీనురాలై హంసవాహనంపై స్వారీచేస్తున్నట్లు చిత్రించబడింది. ఆ రూపాన్ని అచ్చువేసి పటంకట్టి అనేకచోట్ల పూజిస్తారు. పూజ గదులలో, ఆఫీసులలో, దుకాణాలలో దాదాపు హిందువులందరూ సరస్వతిని పూజిస్తారు. బ్రహ్మతో అనుబంధం ఉన్నప్పటికీ, సరస్వతికి సంగీత సాహిత్యాలను పోషించే దేవతగా తన స్వంత హోదా ఉంది. సంస్కృత భాషను, దేవనాగరి లిపిని సృష్టించిన చరిత్ర ఆమెకుంది. కళలలో ఆశీర్వాదాలు కోరుతూ పూజించవలసిన దేవత సరస్వతి. విద్యాలయాలలో ఆమెను కీర్తిస్తూ "సరస్వతీ వందనం" అనే ప్రార్థన చేసిగాని ఆ రోజుని ప్రారంభించరు. శిశిర ఋతు ప్రారంభ దినాలలో ప్రతి సంవత్సరం ఇళ్ళలోనూ కార్యాలయాల్లోనూ సరస్వతీ పూజ నిర్వహిస్తారు. అన్ని వయసుల వారూ తమ పుస్తకాలను, పరికరాలను, పనిముట్లను ఒకచోట చేర్చి గౌరవాన్ని ప్రకటిస్తూ, ధన్యవాదాలు తెలుపుతూ, అనుగ్రహాన్ని కోరుతూ సరస్వతీ దేవిని పూజిస్తారు. సంగీత

దివ్యత్వాన్ని, అనుగ్రహాన్ని సూచించే సంకేతంగా వీణను తప్ప మరే ఇతర వాయిద్యాన్ని గుర్తించరు. సరస్వతీదేవి సంగీతాన్ని పోషిస్తూ పాలిస్తూ సంగీత కళాకారులను రక్షిస్తుంది.

అది విశ్వాసం. ఆచరణలో అన్ని రంగాలలో వలే సంగీతంలో కూడా పురుషులదే రాజ్యం. చరిత్రలో ఎప్పుడో ఎక్కడో స్త్రీలకు తగిన ఔచిత్యం గురించి కొత్త నిర్వచనాలు బయల్దేరి, మంచి కుటుంబాల నుంచి వచ్చిన కొత్త సరస్వతులు సంగీతాన్ని వాయించటం, పాడటం గౌరవం కాకుండా పోయింది. రాజులు సంగీతాన్ని స్వరకర్తలుగా, గాయకులుగా వాద్యకారులుగా అయిన తర్వాత కూడా రాజుగా ఉండవచ్చు. ఏ రాణీ ఆ బాటలో ప్రయాణం చేసే సాహసం చేయదు. మీరాబాయి (పదహారో శతాబ్దం) శ్రీకృష్ణ పరమాత్మ నుద్దేశించి పాటలు రాసి పాడుతుంటే, ఆమె రాచకుటుంబం ఆమెను వెలివేసింది. ఆమె ప్రాణాలు తీయటానికి రెండుసార్లు ప్రయత్నించింది (8వ అధ్యాయం చూడండి) అక్బర్ ఆస్థానంలో సుప్రసిద్ధ గాయకుడైన తాన్‌సేన్ అధిష్టించినట్లు ఏ మానవ స్త్రీ కూడా రాజా స్థానాలలో గౌరవ స్థానాన్ని అధిష్టించలేదు. శతాబ్దాలు గడుస్తున్నకొద్దీ పురుషాధిపత్యపు బందిఖానాలు మరింత పెరిగి పెద్దవయ్యాయి. సుబ్బులక్ష్మి రంగస్థలం మీద ప్రవేశించి నప్పుడు, అది ఆశ్చర్యకరమైన సజీవమైన అగ్రశ్రేణి సంగీత నైపుణ్యాలతో వర్ధిల్లుతోంది. కానీ ఆ సంగీతరంగమంతా పురుషుల కోసమే ప్రత్యేకించబడింది – మరొకరు చొరకుండా కాపలా కాస్తున్నట్లుంది.

సంగీతానికే అంకితమైన కుటుంబాలలో కూడా స్వేచ్ఛకు అనుమతి దొరకలేదు. సెమ్మంగుడి శ్రీనివాసయ్యర్ తల్లి విద్వాంసురాలైన గాయకురాలు. కానీ ఆమె తన పాటని, తన గదిలో ఒంటరిగా నెమ్మదిగా గుసగుసలాడినట్లు మాత్రమే పాడుకోవాలి. ఎందుకంటే ఇతరుల ముందు గొంతెత్తి పాడటం బ్రాహ్మణ స్త్రీలకు ఉచితం కాదు. ఆ కారణం వల్లనే డి.కె. పట్టమ్మాళ్ తల్లికి తన ఇంట్లో జరిగే వివాహ వేడుకలలో కూడా పాడేందుకు అనుమతి దొరకలేదు. మద్రాసులో అతి పురాతనమైన, గౌరవనీయమైన పార్థసారథి స్వామి సభ తొలి రోజులలో తన నీడలో స్త్రీలను పాడనీయలేదు. అనేక కచేరీ ప్రాంగణాలలో స్త్రీలను శ్రోతలుగా కూడా అనుమతించేవారు కాదు. చాలా అరుదుగా సంపన్నులైన కళాపోషకులు తమ కుటుంబాల స్త్రీలను బహిరంగ కచేరీకి వచ్చేందుకు ఒప్పుకునేవారు. కానీ ఆ స్త్రీలు తెరవెనుకనే సాధారణంగా కూర్చునేవారు. బహిరంగంగా కచేరీ చేసే కొద్దిమంది స్త్రీలు "వినోదాన్నిచ్చే కులాల"కు చెందినవారు. వారి కళను ఆనందించే స్వేచ్ఛ రసికులకుండేది గానీ ఆ స్త్రీలకు మర్యాదస్తుల సమాజంలో చోటుండేది కాదు. 1930లలో ప్రజాదరణ పొందిన హరికథా ఉత్సవాలు చివరి క్షణాలలో రద్దయ్యేవి. ఎందుకంటే పక్క వాయిద్య కారులుగా స్త్రీలున్నారని గాయకులు కోపంతో వెంటనే అక్కడి నుండి నిష్క్రమించేవారు. మద్రాసులో ఇలాంటి సంఘటనలు జరిగినట్లు ఆధారాలున్నాయి. సంగీతంలో గౌరవాన్ని పొందేంత అధికారంగల రంగరామానుజ అయ్యంగార్‌కి గాయకులైన స్త్రీలను 'నెరవల్'

వంటి భాగాలకు దూరంగా ఉండమని అడగటం ఒక విషయంగా అనిపించేది కాదు. నెరవల్‌కి స్వంత మనోధర్మం అవసరం. దానితో స్త్రీల గొంతులో వుండే సహజమైన మాధుర్యంవల్ల శ్రోతలు దానిపై ధ్యాస నిలపలేరని అయిన ఉద్దేశం. ఇది చాలా కఠిన నియమాలతో విభజింపబడిన ప్రపంచం. ఆశలతో, ప్రతిభతో ఈ ప్రపంచంలోకి వచ్చిన స్త్రీలు ఆ పరిధులలో ఒదిగిపోవాలని పురుషులు ఆశిస్తారు. తాము దయదల్చి ఇచ్చిన ప్రతి చిన్న అవకాశానికి స్త్రీలు కృతజ్ఞులుగా ఉండాలని భావిస్తారు.

ఎంతో బాధ్యతాయుతంగా ఈ ప్రపంచంలో ఇమిడిపోవాలని ప్రయత్నించిన వారిలో మధురైకి చెందిన షణ్ముగవదివు, ఆమె శిష్యులూ ఉన్నారు. కాలనియమంలేని ఆ నగరపు ప్రాంతాలలో, అక్కడి ప్రతి సవ్వడితో, వాసనతో, నిజం చెప్పాలంటే ఆ నగరపు గుండె చప్పుళ్ళలో వాళ్ళు తమ అస్తిత్వాన్ని ఏర్పరచుకున్నారు. వారు మధురై సారాంశం. వేలాది మంది వలే వారు ఆ పెద్ద దేవాలయ ప్రాంతానికి ఎంతో చేశారు, జీవనాన్ని పొందారు. ఆ నగరం దేవాలయం కోసమే నిర్మించబడినట్లు ఉంటుంది. మధురాపురి పట్టణపు ప్రణాళికలో ప్రధాన వీధులన్నీ, ఆలయం నుంచి మొదలై అన్ని దిక్కులకూ వెళ్ళాయి. ఈ వీధుల పక్కన చిన్న దోవలు యేర్పడి గుడిచుట్టూ వృత్తాకారంలో కేంద్రీకరించి ఉంటాయి. పశ్చిమ గోపురాన్ని దాటివెళ్ళే వీధిలో ఉండే ఒక చిన్న వీధిని హనుమంతరాయర్ కోవెల వీధి అని పిలుస్తారు. ఏ వాహనాలు ప్రయాణించలేని ఆ వీధి 10 అడుగుల వెడుల్పుతో, రాళ్ళుపరిచి ఉండేది. రెండువైపుల నుంచీ ఏటవాలుగా రాళ్ళుపరవటంవల్ల వీధి మధ్య చిన్నకాలవలా తయారైంది. పశువుల పేడ మూత్రాలు ఈ కాలవలో పడి కొట్టుకుపోయేవి. ఆ వీధి వరసంతా ఆవులు సోమరిగా పడుకుని ఉండేవి. అక్కడ తమకున్న సౌకర్యాలు తెలిసినట్లు భద్రతతో ఉండేవి. వీధికి ఇరువైపులా ఇళ్ళు మధ్యన సందులేకుండా ఒక దానినంటుకుని ఒకటి ఉండేవి. ఆ ఇళ్ళ వాకిళ్ళు సరాసరి వీధిలోకే తెరుచుకునేవి. రెండతస్తులున్న ఈ ఇళ్ళలో ఒకటి వీణ షణ్ముగవదివు ఇల్లు. ఆ ఇంట్లో ఆమె తన కుమారుడైన శక్తి వేల్‌తోనూ, కుమార్తెలు సుబ్బులక్ష్మి, వడివంబాల్‌తోను కలిసి ఉండేది.

షణ్ముగవదివు కాలధర్మం చెందిన (1962) పాతిక సంవత్సరాలకు వీధి మీదకు ఉన్న మూడు గదులను దుకాణదారులు ఆక్రమించారు. పాత రోజుల్లోలాగ, మేడమీద ఉన్న గదులలోకి వీధిలోంచి ఉన్న ఇరుకుగా చీకటిగా ఉన్న మెట్లదారిన ఎక్కివెళ్ళాలి. అక్కడ చల్లగా ఉండే విశాలమైన హాలు ఇప్పటికీ జీవకళతో ఉంటుంది. ఆ హాలు గోడలలో రెండింటి నిండా దేవుళ్ళ, దేవతల పటాలు కిక్కిరిసి ఉంటాయి. ఆ పటాలతోపాటు షణ్ముగవదివు ఆమె పిల్లల పాత్రలో సుబ్బులక్ష్మి, సదాశివంల పెళ్ళి ఫోటో, వివాహం తర్వాత వారి గురువైన రాజగోపాలాచారిది పెద్దగా చేసిన ఫోటో ఇవన్నీ ఉంటాయి. ఆ హాలుకి ఉన్న ఒక ద్వారం గుండా వెళ్ళి ఒక మెట్టుకిందికి దిగితే 10×12 కొలతతో ఒక ప్రైవేట్ గది, విదేశీ టైల్స్‌తో, కలపతో చేసిన కప్పుతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఈ

చిన్ని సౌకర్యవంతమైన గదికున్న ప్రత్యేకత యేమిటంటే, దీనికి వీధిలోంచి నేరుగా మెట్లెక్కి వచ్చే ప్రవేశమార్గం విడిగా ఉంది. ఇది షణ్ముగవదివు పడకగది. ఈ గదిలోనే సుబ్బులక్ష్మి ఆమె తోబుట్టువులూ జన్మించారు. ప్రవేశ ద్వారం విడిగా ఉండటమనేది హోదాకు, వెసులు బాటుకు గుర్తు మాత్రమే గానీ అక్కడికి వచ్చేవారెవరో తెలియకుండా ఉండేందుకు యేర్పరచినది కాదు. అలాంటి అవసరమూ లేదు. అది సాధ్యమూ కాదు. మధురైలో విషయాలు యేర్పడి ఉండే విధానం అలాంటిది.

హనుమంతరాయర్ కోవెల వీధిలోని సంగీత కళాకారుల జీవితాలు ఇరవయ్యవ శతాబ్దపు తొలి సంవత్సరాలలో గట్టిగా విధించబడిన సంప్రదాయ రీతిలో గడిచేవి. ప్రతిదీ మీనాక్షి అమ్మవారి ఆలయ అవసరాల మేరకూ, అక్కడి ఉత్సవాల తేదీల ప్రకారం జరిగేది. కళలకు, ఆ ఆలయానికి ఉన్న ఏకైక సంబంధం ఒక గాథలో legend ప్రతిబింబిస్తుంది. మూడవది, చివరిది అయిన సంగం (సాహిత్యవేత్తల సమావేశం) మధురైలో జరిగినప్పుడు, సాహితీ గ్రంథాలను ఆలయంలోని పవిత్ర కూపంలో పడేశారు. ప్రతిభ గలిగిన గ్రంథాలు పైకి తేలాయి. పనికిరాని సాహిత్యం అడుక్కిపోయింది. ఆ ఆలయం సంగీతాన్ని, నృత్యాన్ని, సాహిత్యాన్ని పోషించేది. ఆలయంలో జరిగే ప్రతి ఉత్సవమూ ఒక సంగీత సందర్భమే. పవిత్రమైన మాఘ మార్గశిర మాసంలో? (డిసెంబరు – జనవరి) దక్షిణాదిన అన్ని దేవాలయాలు వేకువఝామున శాస్త్రీయ రాగాలతో కూడిన పాటలతో చైతన్యవంత మవుతాయి. ఎంత ఉత్సాహంగా సందడిగా ఉండేదంటే అక్కడి గాలి శాస్త్రీయ సంగీత పరిమళంతో నిండిపోయేది.

❖ ❖ ❖ ❖

షణ్ముగవదివు వంటి ప్రసిద్ధ సంగీత కళాకారుల ఇళ్ళలో గాలి నిజంగానే సంగీత సుగంధ భరితమైన ఉండేది. అవి సంగీతశాలలు. తెల్లవారకముందే ఒక్కొక్కరి సంగీతాభ్యా సాలతో రోజుమొదలయ్యేది. విద్యార్థులు ఒకరి తర్వాత ఒకరు నేర్చుకునేందుకు వచ్చేవారు. మధ్యాహ్నాలు స్నేహితులొకచోట చేరి ముచ్చట్లతో, చర్చలతో పొద్దుపుచ్చేవారు. వచ్చిన వారు తరచు పాటలుపాడి లేదా వాయిద్యాలు వాయించి తమ సంగీత చర్చలకు వాడిని వేడిని జతగలిపేవారు.

ప్రతి సంగీత కళాకారునికీ (తీర్థయాత్రికులకూ) మధురై ఎంతో అభిమాన క్షేత్రం. షణ్ముగవదివు ఇంటికి వచ్చేవారిలో మహానుభావులని చెప్పుకునే సుబ్బరామ భాగవతార్, పొన్నుస్వామి పిళ్ళై, కరైకుడి సాంబశివ అయ్యర్ వంటి వారుండేవారు. మృదంగ విద్వాంస శ్రేష్టుడైన దక్షిణామూర్తి పిళ్ళై ఎప్పుడూ వస్తుండేవాడు. చిన్న సుబ్బులక్ష్మి పాట విన్న తర్వాత, ఈ చిన్నపిల్లకు అసాధారణమైన ప్రతిభ ఉన్నదని చెప్పి అరియకుడి రామానుజ అయ్యంగారిని తీసుకొచ్చాడు. అరియకుడి సుబ్బులక్ష్మి పాటవిని తన మిత్రుడి అంచనాను అంగీకరించి, ఆ అమ్మాయికి ఒకటి, రెండు పాటలు నేర్పటానికి పూనుకున్నాడు.

షణ్ముగవడివు తన కుటుంబ సంప్రదాయాన్ని కాపాడుకుంటూ అతిథులకు అందరికీ సకల మర్యాదలూ చేసేది. మజ్జిగో, కాఫీనో సర్వదా సిద్ధంగా ఉండేవి. దానితోబాటు ఆమె తన కుటుంబాన్ని అతి జాగ్రత్తగా కాపాడుకునే కాపలాదారు కూడా. ఆమె నిరంతరమూ తన ముగ్గురు బిడ్డల వృత్తిపరమైన విజయాలను గురించీ, భద్రత గల భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ ఉండేది. నెమ్మదైనా, మృదుభాషిగా, సాధారణ స్త్రీగా వుండే షణ్ముగవడివుని (1889–1962) ఆ చుట్టుపక్కల వారు షణ్ముగమ్మాళ్ అని పిలిచేవారు. ఆమెది ఆలోచన, స్థిరనిశ్చయము కలగలిసి సూటిగా గుచ్చుకునేలా చూసే కన్నులు. బక్కపల్చగా కోలముఖంతో ఉండేది. కుటుంబాన్ని పోషించే రోజులలో ఆమె ప్రత్యేకంగా ఏ జబ్బుతోనూ బాధపడలేదు గానీ, నిత్యం ఒంట్లో బాగోలేని దానిలా కనిపించేది. బలహీనమైన శరీరతత్త్వంగలిగిన ఆమెకు రెండు గంటలకు మించి కచేరీ నిర్వహించగల శక్తి ఉండేది కాదు. పొడవైన ఆమె చేతి వేళ్ళు వీణావాదన కోసమే ఉన్నట్లు ఉండేవి గానీ అవి నిరంతర చలనంలోని శ్రమను ఓర్చుకోలేకపోయేవి. ఆమెకు మధ్యవయసు రాకముందే ఆ వేళ్ళు కాయలుగాసి పోయాయి. పాడేందుకు అనుకూలమైన కంఠస్వరం కాకపోవటంతో వీణ నేర్చుకుంది. ఎప్పుడూ బలహీనంగా ఉండటంతో ఆమె వీణావాదన తరచు మంద్రస్థాయిలో ఉండేది. ఆమె విదుషీమణి కాలేదు. ఐనప్పటికీ ఆమె వీణ వాయిద్యకారులైన మొదటి స్త్రీలలో ఒకరు కావటంవల్ల విస్తృతమైన అభిమానులను సంపాదించుకోగలిగింది.

ఆమె తన బిడ్డలను చూసి గర్వించే తల్లేగానీ వారితో కఠినంగా వ్యవహరించేది. వినోదాన్ని వృత్తిగా చేసుకునే స్త్రీలు తమ దృష్టిని ఎక్కువగా వృత్తిమీద కేంద్రీకరించి, కుటుంబాన్ని మిగిలిన అన్ని పనులలో ఒకటిగా భావిస్తారు. కానీ షణ్ముగవదివుకు కుటుంబమే ముఖ్యం. తన పిల్లలందరూ అందంగా ఉన్నారని ఆనందించేది. మధురైలో చూస్తే పెద్ద కొడుకైన యమ్మెస్ శక్తివేల్ మంచి రంగుతో ఎత్తుగా ఉండేవాడు. అతని ముఖకవళికలు తీర్చిదిద్దినట్లు అందంగా ఉండేవి. విశాలమైన కళ్ళు, బూరెల్లాంటి బుగ్గలు, దట్టమైన జుట్టుతో ఎంతమందిలో ఉన్నా కొట్టొచ్చినట్లు కనపడేవాడు. అతనిది స్నేహ పూరితమైన దయగల స్వభావం. తల్లి అతన్ని ఒక సంగీతకారుడిగా చూడాలనుకోలేదు. బాగా చదువుకుని వృద్ధాప్యంలో తనను చూసుకునేలా తయారుచేయాలనుకుంది. మిగిలిన ఇద్దరు పిల్లలు, సుబ్బులక్ష్మి, వడివంబాల్‌లు నిజంగా సరస్వతి పుత్రికలు. ఇద్దరూ నెమ్మదైన వాళ్ళు. మృదువుగా, వినయంగా ఉండేవారు. పెద్దమ్మాయి సన్నగా, ఆకర్షణీయంగా, నొక్కుల జుట్టుతో, సోగ కళ్ళతో, దక్షిణ భారతదేశపు సామాన్యత వల్ల కలిగిన ప్రత్యేకతతో ఉండేది. ఆమె కిశోరప్రాయంలో ఉన్నప్పుడు కూడా ఆమెకు సంబంధించినవన్నీ సామాన్యంగా ఉండేవి. ఆమె చిరునవ్వులోని ప్రసన్నత, కనుబొమలమధ్యనున్న పెద్ద బొట్టు ఆమెలో ప్రత్యేకంగా కనిపించేవి. కంటికి చాలా అసాధారణమైన సౌలభ్యంతో

కనిపించేది. వడివంబాల్, కుటుంబంలో చిన్నపిల్ల, అందరిలోనూ అందగత్తె కూడా. పిల్లలందరిలో ఆమెది తెలివైన ముఖం. ఆత్రుతనూ కుతూహలాన్ని నింపుకున్న కళ్ళు కళ్ళజోడులో నుంచి చూస్తుండేవి. బాగా నూనె రాసి అణచి దువ్విన జుట్టు ఆమె కోల ముఖాన్ని మరింత పొడవుగా కనిపించేలా చేసేది. ఆమె సమర్థురాలిగా, తెలివైనదిగా, సున్నిత మనస్కురాలుగా కనిపించేది. దీనికి తోడు నాజూకుగా చూపరులను ఆకట్టుకునేది.

కారణం ఏమిటోగానీ ఆ కుటుంబంలో సుబ్బులక్ష్మి కొక్కదానికే ముద్దు పేరుండేది. ఆమెను కుంజమ్మా కుంజు, (చిన్నారి) అని పిల్చేవారు. వడివమ్మాళ్‌కి లేని ముద్దు పేరు ఈమెకెలా వచ్చిందో ఎవరికీ తెలియదు.

❖ ❖ ❖ ❖

సంగీత కళలలో తన కుమార్తెలు వారిదైన ముద్రవేసేలా పెంచాలనే విషయంలో షణ్ముగవడివుకి చిన్నపాటి సందేహం కూడా లేదు. దానితోపాటు కుటుంబాన్ని దగ్గరగా కలిపి ఉంచే బాధ్యతా తనదేనని తెలుసు. ఆ ఇల్లు నిత్యం అతిథులు వస్తూపోతూ ఉండే ఇల్లు. పిల్లలందరూ ఆ ఇంటిని నడిపేందుకు చేయాల్సిన రోజువారీ పనుల్లో భాగం పంచుకుంటారు. కింద గదులలో ఎప్పుడూ అతిథులుంటారు. వారిని చూసుకునేందుకు షణ్ముగవడివుకి ఎవరో ఒకరి సాయం కావాలి. అతిథులెవరూ లేని అరుదైన సందర్భాలలో కుటుంబమంతా కూర్చుని పేక ఆడుకునేది. షణ్ముగవడివు సమీపంలో ఉన్న ఊళ్ళకు వెళ్ళాల్సివస్తే పిల్లలను కూడా తీసుకెళ్ళేది. అప్పుడు తప్ప ఆడపిల్లలు గడపదాటేవారు కాదు. వాళ్ళు ఒక రక్షణలో ఉండేవారనటంలో పొరబాటేమీ లేదు. చాలా మితంగా ఖర్చు పెట్టేవారు. శాఖాహారం మాత్రమే తినేవారు. ఉదయాన్నే లేచి కుటుంబమంతా తాగేది ధనియాల కాఫీ. మరుగుతున్న నీళ్ళలో ధనియాలు వేసి కాచి, పాలు బెల్లం కలిపి చేసేవారు. మధ్యాహ్నానికి ముందు 'టిఫిన్', రాత్రిపూట అన్నం, మజ్జిగలతో రోజు గడిచిపోయేది. దగ్గర్లో ఉన్న బడిలో కొంత వానాకాలపు చదువు సాగింది. ఐదవ తరగతిలో ఉండగా సుబ్బులక్ష్మిని టీచర్ కొట్టటంతో స్పృహతప్పి పడిపోయింది. ఆమెకు తెలివివచ్చాక వదలని దగ్గు పట్టుకుంది. దాంతో చదువు అటకెక్కింది. మగపిల్లల్ని అంత తేలికగా వదలకూడదని షణ్ముగవడివునకు తెలుసు. శక్తివేల్ స్కూలు చదువు పూర్తిచేసుకుని కాలేజీకి వెళ్ళేలా చూసింది. తన కమ్యూనిటీకి చెందిన అనేకమంది మగవాళ్ళలా కాకుండా, ఆ దోవ వదిలి శక్తివేల్ బి.ఎ. డిగ్రీ సంపాదించాడు. మధురై గుంపుల గందరగోళంలో, అంతకంటే కాస్త ప్రశాంతంగా హనుమంతరాయర్ కోవిల్ వీధిలో, తమ ముచ్చటైన రెండంతస్తుల గూడులో, షణ్ముగవడివు కుటుంబసభ్యులు ఒకరికొకరు సహకరించుకుంటూ, తమను తాము కనుకొనుగొంటూ రోజులు గడిపేవారు.

వాళ్ళు సంగీతాన్ని జీవించేవారు. తిండి, బట్టలు, ఇతర సౌకర్యాలు, చదువు వీటిని గురించి పట్టించుకోలేదేమో గానీ, సంగీతం పట్ల విపరీతమైన మక్కువ. సంగీతంతో

ఆ ఇల్లు, ఆ వీధి, ఆ నగరం మొత్తం నిండిపోయేది. వాళ్ళకు స్వంత గ్రామఫోను లేక పోయినా, పిల్లలు తమ పై అంతస్తులోకి వెళ్ళి కిటికీ దగ్గర కూచుంటే చాలు పొరుగింట్లో గ్రామఫోను పెట్టె పాడే పాటలు తమ ఇంట్లోవే అన్నంత మధురంగా వినపడేవి. మొదటి రోజుల్లో షణ్ముగవడివు తన పిల్లలకు పద్ధతి ప్రకారం గురువు వద్ద సంగీతం నేర్పించలేదు. సాధారణమైన ఆదేశాలు, నియమాలు ఇచ్చేది. మిగిలిన పనిచేయటం పిల్లలవంతు. ఆ పని వాళ్ళు చాలా బాగా చేసేవారు. సంగీతాన్ని ప్రాణవాయువులా పీల్చుకునేవారు. ఇంట్లో ఒక మూల ఉన్న తంబూరాలను చూస్తే సుబ్బులక్ష్మికి ఎంతో మోజు. ఉదయాన్నే ఒక తంబూరాని పట్టుకుని శృతిచేస్తూ ఉండేది. ఒక తీగను మీటుతూ, స్వరాన్ని మెల్లిగా పాడుతూ, తంబూరా శృతికి తన కంఠస్వరానికీ తేడా తెలియకుండాపోయేంత వరకూ పాడుతుండేది. తన గొంతుతో, ఆ తంబురాతో ప్రయోగాలు చేస్తుండేది. ఒకసారి తంబూరా వాయించిన తర్వాత తను పాడటం, కలిసి పాడటం, స్థాయిని పెంచటం, తగ్గించటం ఇలాంటివన్నీ చేస్తుండేది. స్వరాలను గమకాలను పలికిస్తూ, పలికించకుండా కూడా పాడేది. తంబూరా లేకుండా పాడి, ఆ తరవాత తీగలను శృతిచేసి, తను వాయిద్యం లేకుండా కూడా శృతిలో పాడిందా లేదా అని పరీక్షించుకునేది. ఈ కార్యక్రమమంతా ఒక చిన్నపిల్ల బొమ్మతో ఆడుకున్నట్లుగా ఉండేది. కానీ ఈ ఆట ఫలితం చాలా భిన్నంగా ఉండేది. తంబూరాతో అన్ని గంటలు గడపటం వల్ల సుబ్బులక్ష్మికి శృతిశుద్ధం అయింది. కంఠస్వరం పరిపూర్ణంగా శృతిలో ఒదిగిపోయింది. దీనివల్లనే తర్వాతి కాలంలో ఆమెకంత కీర్తివచ్చింది. తన కుమార్తె తంబూరా వాయించటంలో అసాధారణమైన ఆసక్తి కనపరుస్తున్నదని, వీణ, మృదంగం అంటే కూడా చాలా ఆసక్తి చూపుతుందని గ్రహించింది. ఆ అమ్మాయి కంఠస్వరంలోని లోతు ఆ తల్లిని మరింత హెచ్చరికగా ఉండేలా చేసింది. ఆ గొంతు అసామాన్యమైనదనటంలో ఆమెకే సందేహమూ లేదు. ఆ తర్వాత కూతురు గ్రామఫోన్ పాటలను వినటం, వాటిని ఒక్క పొరపాటు లేకుండా తిరిగి పాడటం అలవాటుగా మారిందని కూడా షణ్ముగవడివు గ్రహించింది. దారిని వెళ్తున్న నాగస్వర బృందం వాయించే క్లిష్టమైన గమకాలను విని వాటిని తన గొంతులో పలికించేది. అతి కొద్దిమంది మాత్రమే ఈ ఫీట్ చేయగలుగుతారు. తన కూతురుకి కొన్ని అసాధారణ నైపుణ్యాలున్నాయని ఆ తల్లి విశ్వసించింది.

శక్తివేల్ మృదంగం నేర్చుకుని, తన చెల్లెలికి వాయించగలిగేంత నైపుణ్యం సంపాదించాడు. వడివంబాల్ తన తల్లిలా మంచి వైణికురాలయింది. కానీ అందరిలో సుబ్బులక్ష్మి పైనే షణ్ముగవడివుకు ప్రత్యేక శ్రద్ధ. సంపదల దేవత అనే అర్థంగల అసలు పేరున్న కుంజమ్మ వీణలో, మృదంగంలో కూడా విద్వాంసురాలయింది. కూతురిని ఈ సంగీత వాయిద్యాలలో నైపుణ్యం సంపాదించనిచ్చింది షణ్ముగవడివు. ఎందుకంటే సంగీత కళాకారులు అనేక వాయిద్యాలలో నైపుణ్యం కలిగి ఉండటం సంప్రదాయమే. ఒక పరి

శోధకుడు గమనించి చెప్పినట్లు: "కర్ణాటక సంగీతం శైలిలో సమగ్రత అనే భావనను ముందుకు తెచ్చింది. దానికి గాత్రం పాడే విద్వాంసులకు వాయిద్యాల గురించిన కొంత జ్ఞానం ఉండటం అవసరం. దానివల్ల శృతి, గమకాల మీద వారికి అధికారం వస్తుంది. ఇవి రాగంపై ఆధారపడిన సంగీతానికి మాధుర్యం, రాగభావాలను ఇచ్చే ముఖ్యమైన మూలకాలు. ఇంకోవైపు వాయిద్యకారులు గానం చేయటం కూడా నేర్చుకోవాలి." మిగిలిన పిల్లల్లాగా కాకుండా కుంజమ్మ ఎప్పుడూ తనలో తాను పాడుకుంటూనే ఉండేది. కూతురి ఏ అభ్యాసమూ లేకుండా కూతురు తీస్తున్న రాగాలను విని షణ్ముగవడివు తమ కుటుంబంలో గాత్ర సంగీతం సుబ్బులక్ష్మిదేనని గాఢంగా విశ్వసించింది. ఎనిమిదేళ్ళు కూడా నిండని కుంజమ్మను తనతోపాటు కచేరీలకు తీసుకెళ్ళి, వేదికమీద కూర్చోబెట్టి, కచేరీని చూస్తూ, వినేలా ప్రోత్సహించింది. తర్వాత ఆమెను వేదికమీద సహాయకురాలిగా వుండేందుకు అనుమతినిచ్చింది. అంటే రెండవ వీణని వాయించటం, వీణతోపాటు గాత్రాన్ని జత కలపటం వంటి పనులన్నమాట. పద్ధతి ప్రకారం విద్య నేర్పించటానికి తనకు తెలిసిన గాత్ర సంగీత విద్వాంసుల సహాయం కోరింది. మధురై శ్రీనివాస అయ్యంగార్ అనే స్థానిక సంగీత కుటుంబంలోని విద్వాంసుడు సుబ్బులక్ష్మికి మొదటి గురువు. కొబ్బరికాయ కొట్టి గురుదక్షిణ యిచ్చి పద్ధతి ప్రకారం ఆయనను ఆమెకు గురువుగా నియమించారు. కానీ కొద్దిరోజులలోనే శ్రీనివాస అయ్యంగార్ మరణించాడు. సైతూర్ రాజభవన విద్వాంసుడైన సైతూర్ సుందరేశ భట్టార్ సుబ్బులక్ష్మికి రెండవ గురువు. మాయావరం వి.వి. కృష్ణ అయ్యర్ ఆ రోజుల్లో అందరికీ పరిచితుడైన ఉపాధ్యాయుడు. ఆయనా ఆమెకు బోధించాడు. ఇంటికి వచ్చిపోయే వాళ్ళందరూ అంతో యింతో శిక్షణనిచ్చారు. కొందరు ఆమె పాడుతుంటే విని ఉపదేశాలు యిచ్చేవారు. మరికొందరు తాము పాడే పాటలను పాడించి నేర్పేవారు. వాళ్ళందరూ సుబ్బులక్ష్మిని ఎప్పుడూ ప్రోత్సహిస్తూ ఒక అనుకూల వాతావరణం సృష్టించి సహాయపడ్డారు.

తన కుమార్తె కవచం గాత్ర సంగీతంలో ఉందని ముందుగానే వేసిన అంచనా నిజమని రుజువయింది. తన గురువుల సహాయంతో, మార్గదర్శకత్వంతో, షణ్ముగవడివు ప్రతి అవకాశాన్ని కూతుర్ని పైకి తీసుకురావటానికి వినియోగించటంతో చిన్నతనంలోనే తన నైపుణ్యంతో కచేరీలలో అమ్మ వెనకాల కూర్చొనే స్థితి నుంచి తను స్వయంగా పాడగల స్థితికి ఎదిగింది. తొమ్మిదవ ఏడు దాటుతున్నప్పుడు ఆ చిన్న కుంజమ్మ, తల్లి పాడమని చెబితే మధురైలో అప్పుడప్పుడే పైకి వస్తున్న ఒక సైకిల్ షాపు ఏర్పాటు చేసిన సభలో పాడింది. ఆ షాపు తర్వాత పెద్ద TVS (టి.వి. సుందరం) కంపెనీగా అభివృద్ధి చెందింది. ఆ రోజు రంగు రంగుల పరికిణీ జాకెట్టు నుదుటిమీద పెద్ద బొట్టు, వెనక్కు గట్టిగా దువ్వి అణిచిపెట్టిన జుట్టుతో అందంగా ఉన్న ఆ బాల గాయని పాడింది. ఆమె పాట వెంటనే అందరినీ ఆకట్టుకుంది. ఆమెకు సభాకంపం లేదు. ఆమె కంఠస్వరంలో

ఎలాంటి బెరుకూ లేదు. సహజమైన ఆనందంతో పాడింది. ఆ సభలో ప్రతిభను గుర్తించ గలిగిన వ్యక్తి తర్వాత ఆ కుటుంబాన్ని కలిసి గ్రామఫోను రికార్డులో పాడే అవకాశం ఇస్తానన్నాడు; ఆయన కోరికను వీళ్ళు వెంటనే ఆమోదించారు. HMV తన ట్విన్ బ్రాండు పేరుమీద రికార్డు చేసిన ఆ పాట మధుర మీనాక్షిని కీర్తిస్తూ చెంచురుతి రాగంలో పాడిన "మరకత వదివు" అనే పాట, ఆ గ్రామఫోను రికార్డు మీద "సాంగ్ బై మదురై సుబ్బులక్ష్మి, ఏజ్ టెన్ యియర్స్" (పాడినది మధురై సుబ్బులక్ష్మి, చాలా చిన్నపిల్ల కావటం వల్ల తెలిసిన వాళ్ళందరూ ఆ అమ్మాయిని షణ్ముగవడివు కూతురు సుబ్బులక్ష్మిగా గుర్తించారు. ఆ తర్వాత రికార్డు మీద పేరు సహజంగానే మధురై షణ్ముగవడివు సుబ్బులక్ష్మిగా పెరిగింది. ఎంతోకాలం నుంచీ వస్తున్న తమిళ సంప్రదాయంలో ఆమె MSS గా పరిచితురాలయింది. జనం తరచుగా మాట్లాడుకునే మాటల్లో ఆ చివరి "S" పోయి M.S. మాత్రం మిగిలింది. ఆమె MS అయింది. ఇంకెప్పటికీ ఆమె MS గానే మిగిలింది.

❖ ❖ ❖ ❖

'మరకత వదివు' పాడటంతో యమ్మెస్‌కు ఒక వయోస్థాయి వచ్చినట్లయింది. కేవలం పదేళ్ళ వయసులోనే ఆమె గంభీరమైన శాస్త్రీయ సంగీత లోకంలో పడినందుకు శ్రోతలు ఆశ్చర్యపడి ఉండవచ్చు. అలా చిన్న వయసులో రావటం కర్ణాటక సంగీత రంగంలో అది సుపరిచితమైన విషయమే. పాల్ఘాట్ మణి అయ్యర్ ఎనిమిదేళ్ళ వయసులో రంగప్రవేశం చేశాడు. 'ఫ్లూట్' మహలింగం తొమ్మిదేళ్ళకు, 'వీణ' యస్. బాలచందర్ ఆరేళ్ళకు తమ తొలి ప్రదర్శననిచ్చారు. ఎనిమిదేళ్ళ బాలుడిగా మొదటి కచేరీ చేసినందు వల్ల మురళీకృష్ణ బాలమురళీకృష్ణగా మారాడు. మాండోలిన్ శ్రీనివాస్ మొదటిగా వాయించి నప్పుడు నిండా పదకొండేళ్ళు లేవు. యమ్మెస్ అప్పటికి చీరె ధరించలేదు, కానీ ఆమెను తేలికగా తీసివేయలేమనే విషయాన్ని గుర్తింపజేసింది. షణ్ముగవడివు కూతురిని మధురై దాటి వెళ్ళి యిచ్చే ప్రదర్శనలకు కూడా తీసుకెళ్తోంది. తరచుగా ఆమె వివాహ వేడుకలలో కచేరీలు చేస్తోంది. ఒక కళాకారిణి ప్రజలకు పరిచయం చేయటానికి అవసరమైన పని, గుర్తింపు రావటానికి ముందు కళాకారులు స్వయంగా కచేరీల్లో పాడుతుంటే శ్రోతలు వినాలి. యమ్మెస్‌కింకా కిశోరప్రాయం రాకుండానే మధురై ప్రాంతాలలో ప్రసిద్ధి చెందింది. దానికి కారణమైన గ్రామఫోన్ రికార్డులకు ధన్యవాదాలు చెప్పుకోవాలి. పదమూడేళ్ళకు ఆమె తన స్వంత కచేరీనివ్వటం మొదలుపెట్టింది. ఆనందాన్నిచ్చే ఆమె కంఠస్వరం, సహజమైన ఆమె గానం, ఆమె అందం వీటన్నిటితో ఆమె పెళ్ళిళ్ళు, ఇతర శుభకార్యాలలో పాడటానికి వస్తే బాగుండుననీ, ఎప్పుడొస్తుందా అని శ్రోతలు ఎదురుచూసేలా చేశాయి. ఆమె తల్లితో కలిసి దూరప్రాంతాలు, రాజాస్థానాలు అయిన మైసూరు, ట్రావన్కూర్‌లకు, తమిళనాడు రాజాస్థానాలైన రామనాథపురం వంటిచోట్లకు ప్రయాణం చేసింది. ఆ రోజులలో కళలకు, కళాకారులకూ రాజవంశీయులు పోషకులుగా ఉండేవారు.

తన కూతురు గాన ప్రతిభ శ్రోతలు గుర్తించటంకంటే ఎక్కువ ఆశలే షణ్ముగవడివు మనసులో ఉండేవి. తన ఇద్దరు కూతుళ్ళకు భద్రమైన జీవితం కల్పించటం కూడా ఆమె బాధ్యతే. ఆమె వెనకున్న సాంఘిక ఆర్థిక నేపథ్యాన్ని బట్టి చూస్తే ఆ పని అంత తేలిక కాదు. సంగీతానికి వచ్చే ఆర్థిక పురస్కారాలు అంతంత మాత్రమే, అవి కూడా చాలా కష్టపడితేనే దొరుకుతాయి; ఇక ఆ రంగంలోని స్త్రీల పరిస్థితి గురించి చెప్పనక్కర్లేదు. కర్ణాటక సంగీతం ప్రజల్లోకి ఎంత చొచ్చుకుపోయినా ఆ కళాకారులవి మాత్రం అస్తు బిస్తు బతుకులే. మధురైలో 1920, 30లలో పెద్ద దేవాలయ ప్రాంతాలలో, వారి దయ మీద ఆధారపడి ఆ వీధుల చివర జరిగే వ్యవహారాలు. 1930లలో ఎలక్ట్రికల్ దీపాలు రాకముందు పెట్రొమాక్సు దీపాల కాంతిలోనే జరిగేవి. ఆ దీపాలు మధ్య మధ్య కొట్టే బుస బుసలు కచేరీకి అనుకోని అనుబంధ వాయిద్య ధ్వనులవలే ఉండేవి. సాధారణంగా కచేరీలు జరిగే రాత్రులన్నీ వేడిగా ఉండేవి. వేసవి గాలులే ఆ రాత్రులలో కాస్త ఊరటనిచ్చేవి. కానీ ఆ గాలులవల్ల కూడా ధ్వని తరంగాలు చెల్లాచెదరయ్యేవి. అక్కడి గాలి దుమ్ము, పేడ వాసనతో కలిసి వస్తుంటే దానిని స్త్రీలు తలలో నిండుగా పెట్టుకున్న మల్లెపూల దండల పరిమళం అడ్డుకునేది. ఆ కచేరీలకు ప్రవేశం ఉచితం. అంటే జనం విపరీతంగా వచ్చేవారు. కానీ కళాకారులకు యిచ్చేది నామమాత్రం. బృందంలో కళాకారులందరికీ కలిపి వందరూపాయలు పారితోషికం ఇచ్చారంటే ఆ బృందం మంచి పేరున్నదై ఉంటుంది. మగవాళ్ళకంటే కళాకారిణులకు తక్కువ పారితోషికం ఇస్తారు. ఇతరులకు సంగీత పాఠాలు చెబితే వచ్చే సంపాదన పరిమితమే గాని నిలకడైనది. వేణ్ణీళ్ళకు చన్నీళ్ళుగా ఉండేది. మొత్తంమీద ఆ సంగీత సాంఘిక విధానమంతా చిన్న, పెద్ద సంగీతకారులందరూ రాజాస్థానాలను, సంపన్న కుటుంబాలను ఆశ్రయించి బతకాల్సి వచ్చేది. ఆ ఆశ్రయం పోషణ సాధారణంగా ఆ కళలకు ప్రయోజనకరమే. కళాకారులు జీవనాధారం కోసం వేరే పనులు చేయకుండా తమ కళ మీదనే శక్తియుక్తులన్నీ కేంద్రీకరించవచ్చు. ఐతే అది మహిళా కళాకారులకు హానికలిగే పరిస్థితులోకి నెడుతుంది.

ఆ కాలంలో ఆ సమయంలో, స్త్రీలు ఒక వర్గంగా చెప్పుకోదగిన వ్యతిరేకతకు గురవుతున్నారు. ఇక కళలను నమ్ముకున్న స్త్రీల పరిస్థితి మరింత కఠినతరం. సమాజంలో కిందిస్థాయిలో ఉన్నవారే పాటనూ, నృత్యాన్ని జీవనాధారం చేసుకుంటారనే ఊహ సమాజంలో ఉంది. కేవలం కళా సామర్థ్యమే వారిని ఆ రంగంలో రాణించటానికి సరిపోవు; వాళ్ళకు లైంగికాకర్షణ కూడా ఉండాలి. దాని ఫలితాలు ఏమీ బాగోలేనప్పటికీ, చాలా మంది కళాకారులైన స్త్రీలు ఈ లైంగికార్షణ అనే అవసరాన్ని రంగస్థలం మీదా, బైటా కూడా అవకాశంగా తీసుకునేవారు. వారిలో కళాకారులుగా పైకి వెళ్ళాలనే కోరికతోపాటు ఆర్థికపరమైన తప్పనిసరి అవసరాలు వాళ్ళ జీవితంలో అతి ముఖ్యమయ్యేవి. సంపన్నులైన పోషకుల ఆశ్రయం సంపాదించటం వారికి ఒక పెద్ద బహుమతి సంపాదించుకున్న

దానితో సమానం. ఆర్థికం దేనిని డిమాండ్ చేస్తుందో దానికి సంప్రదాయం అనుమతిస్తుంది గనుక గాయనీమణులకు నృత్య కళాకారిణులకూ, వివాహం ద్వారానో మరొక విధంగానో బాగా ధనవంతులైన సంరక్షకుల అండన ఉండటం సాధారణమైంది. మామూలు సమాజంలో ఆడపిల్లలకు పదేళ్ళకే పెళ్ళి చేసేస్తారు. దానివల్ల కళాకారుల కుటుంబాలలో కూడా తమ కుమార్తెలకు వీలైనంత త్వరగా సరైన సంరక్షకులతో "పెళ్ళి" చేసి పంపటం అలవాటైన పనిగా మారింది. ఈ ఆచారానికి ఎలాంటి సాంఘికపరమైన మచ్చ ఉండేది కాదు. సంఘం దీనిని నీతిబాహ్యమనేది కాదు. భోగం కులాలంటే ఉండే చులకనేదో ఉండేది గానీ ఈ పద్ధతివల్ల కొత్తగా వచ్చే అపకీర్తేమీ లేదు.

ఇరవయ్యవ శతాబ్దపు తొలి సంవత్సరాలలో మధురైలో బాధ్యత గలిగిన ఒక తల్లిగా, తన ఇద్దరు "సరస్వతులకు" సమాజం తనకు చూపించిన పద్ధతిలో తగిన పోషకులను వెతకటం కంటే గొప్ప ఆశయం షణ్ముగవడివుకు లేదు. తన కూతుళ్ళిద్దరూ అందంలో, ప్రతిభలో సాధారణస్థాయి కంటే పైనే ఉన్నారనేది తెలియటంవల్ల ఆమె ఉత్సాహంగానే ఉంది. తగిన వరుల కోసం వెతకటం అనేది ఒక పట్టణం నుంచి మరొక పట్టణానికి, రాజాస్థానాల నుండి, జమీందారీ ఎస్టేటులకు తిరిగే ఆ తల్లికి నిత్య వ్యాపకం అయింది. ఐతే అది తన స్వంత వ్యవహారం. తల్లితోపాటు పదేళ్ళ కూతుళ్ళు కలిసి వెళ్ళటంతో తగిన పురుషుల కోసం అంతరాయం లేకుండా వెతకటమనే పనికి ఒక అనుకోని push నిస్తుంది. కుటుంబ ఖర్చులకు ఈ కచేరీల ద్వారా సంపాదించగలిగినంత సంపాదించి యివ్వాలని షణ్ముగవడివు అభిమతం. కానీ ఉన్నత వర్గాల వారితో, సామాజిక బలం గలవాళ్ళతో పరిచయాలు పెరగటం, డబ్బు సంపాదించటం కంటే మరింత విలువైనది. కోయంబత్తూరులో, మధురైలో లక్షాధికార్ల కుటుంబాలు షణ్ముగవడివుకి తెలుసు. వాళ్ళు తమ పిల్లలను వీణ నేర్చుకోవటానికి షణ్ముగవడివు దగ్గరకు పంపుతారు. ఆ కుటుంబాలలోనూ, రాజాస్థానాలలోనూ ఆమె నిత్యం తన కూతుర్లకు సరిపోయే వాళ్ళ కోసం చూస్తుండేది. కానీ త్వరలోనే ఆమెకు తన కుటుంబ జీవితపు పోగులు తన ప్రయత్నాలకు మించి చిక్కుముళ్ళు పడ్డాయని అర్థమైంది.

❖ ❖ ❖ ❖

మొదట అంతా సరళంగా, సక్రమంగా జరుగుతున్నట్లే కనిపించింది. పిల్లలిద్దరూ వాళ్ళమ్మ ఎక్కడికి వెళ్తే అక్కడికి జతగా వెళ్ళేవారు. వెళ్ళినచోట ప్రతివాళ్ళు వాళ్ళ అందానికీ, సంగీతానికీ వశులయ్యేవాళ్ళు. ఒకసారి, షణ్ముగవడివు దృష్టికి కుంజమ్మకు తగిన ఏర్పాటు దొరికిందని అనిపించింది. రామాంతపురపు రాజవంశానికి చెందిన వ్యక్తి అతను. రాజ కుటుంబీకులందరూ కళలను సంరక్షించే దేవతలుగా సుప్రసిద్ధులు. ఆ కళలలో వారికి అతి ముఖ్యమైనవి సంగీతం, నృత్యం. షణ్ముగవడివు తన కూతుళ్ళిద్దరిలో బాగా నైపుణ్యం గల కుంజమ్మకు ఈ సంబంధం తగినదని భావించింది. సుబ్బులక్ష్మి ముందు తన

అభిప్రాయాన్ని పెట్టింది, కానీ అటు నుంచి వచ్చిన స్పందన ఆమెను ఆశ్చర్యపరిచింది. ఆశ్చర్యపరచటమనేది చాలా చిన్నమాట. యమ్మెస్ ఆకతాయితనంగా చేయలేదు, కన్నీళ్ళు కార్చలేదు. ఎవరినీ నొప్పించని తన ధోరణిలో తనకప్పుడు పెళ్ళిచేసుకునే ఉద్దేశం లేదని తల్లికి స్పష్టం చేసింది. పెళ్ళి గురించి ఆలోచించే ముందుగా తను సంగీత కళలో సాధించ వలసింది ఎంతో ఉందని వివరించింది.

ఆ రోజుల్లో యువతులకు తమ స్వంత అభిప్రాయాలుండటం సాధారణమైన విషయం కాదు. ఆ విధంగా యమ్మెస్ సామాన్యురాలు కాదు. కొందరు పరిశీలకులు, ఆమెను బాగా తెలిసినవారు, సుబ్బులక్ష్మిలో తనదైన స్వంత వ్యక్తిత్వ పోకడలను పసి గట్టారు. కళా విమర్శకులలో అగ్రగణ్యుడైన జి. వెంకటాచలం సుబ్బలక్ష్మికి పదమూడేళ్ళ వయసున్నప్పుడు కలిశాడు. ఆమె గురించి తన అభిప్రాయాన్ని "ఈమె గాజు బొమ్మవంటి పిల్ల కాదు, బలమైన నిశ్శబ్దమైన బాలిక" అని రికార్డు చేశాడు. ఇంకా "పదమూడేళ్ళ ఆ అమ్మాయిలో నలభై ఏళ్ళ స్త్రీకుండే పట్టుదల ఉంది. ఆనందంగా పసి మనసుతో ఒక పాటలా ఉండాల్సిన, ఉన్న ఆ అమ్మాయిలో తనదైన పంతం, మొండితనం...ఆమె తన చుట్టూ వాతావరణంలో ఉన్న ఒక ప్రాణి మాత్రమే కాదు. ఆమెదైన వ్యక్తిత్వం ఆమెకుంది" అనటానికి వెనుకాడలేదు. రామనాధపురం గురించి తల్లి అదేశాలను తిరస్కరించటమంటే తన వ్యక్తిత్వాన్ని గట్టిగా నిలబెట్టుకోవటమే. అందరూ గౌరవంగా చెప్పుకునేటట్టు యమ్మెస్ మెత్తనిదీ కాదు, అమాయకురాలు కాదు. తన తల్లి జీవితం ఎలాంటిదో ఆమెకు తెలిసి నట్లుంది. "జీవిత భద్రత" అంటే ఏమిటో కూడా తెలిసినట్లుంది. ఆమె బాగా పెద్దదయిన తర్వాత, అరుదైన సమయంలో తన బాల్యం వంక చూసుకుని జ్ఞాపకాలను తడుముతూ "నేను చిన్నపిల్లగా ఉన్నప్పుడు, మగవాళ్ళు నన్ను ఎలా పాడుచెయ్యాలా అని మాత్రమే ఆలోచించారు" అన్నదామె. ఇంకా "అదంతా చూసి దాన్ని గురించి భయపడుతూ ఉండే దాన్ని" అని గుర్తుచేసుకుంది. ఆమె పెరిగిన ఆ వాతావరణానికి seamy పక్షం కూడా ఉందనేది స్పష్టమే. తన అనుభవాలన్నింటిని మెదడు నిక్షిప్తం చేసుకుని తన తల్లి మంచి ఉద్దేశంతో ఆలోచించి రాజభవనంలో తనను ఉంచాలనుకున్న పథకాలను అడ్డుకుంది. ఐతే తర్వాతి కాలంలో, ఆమెను ప్రేమించిన వ్యక్తి కల్పించే రక్షణకు బదులుగా తన ప్రతి చిన్న స్వతంత్రాన్నీ అర్పించివేసింది, బాల్యాన్ని కోల్పోవటమనే దాని ప్రభావం, ఆమెకు తెలిసినంత కంటే ఎక్కువ లోతైనదనేది స్పష్టమవుతోంది.

దీనికి విరుద్ధంగా సుబ్బులక్ష్మి చెల్లెలు, చురుకైనదీ తెలివైనదీ అనుకునే అమ్మాయి పూర్తిగా అనుకోని దిశలోకి వెళ్ళిపోయింది. తనవైన అభిప్రాయాలు ఏర్పరుచుకునే అవకాశం ఆ అమ్మాయికి వచ్చిందో లేదో తెలియదు. తన అక్క మనసును గాయపరచిన అనుభవాల నుంచి ఆమె తప్పించుకోగలిగిందని చెప్పలేము. కానీ ఆమె స్పందనలు వేరుగా ఉన్నాయి. బహుశా అక్కా చెల్లెళ్ళు ఆ విషయం చాలా సున్నితమైనది కావటంవల్ల తమలో తాము

మాట్లాడుకున్నట్టు లేరు. దానివల్లనే వడివంబాల్‌కు యమ్మెస్ ఆలోచనలు అర్థం కాలేదు. బహుశా వడివంబాల్ తన యిరుగు పొరుగు అమ్మాయిలను కూడా పరిశీలించి, వారు తమ తల్లుల ఆదేశాలను వినయ విధేయతలతో పాటించటం చూసి, 'ఇదే జీవితం' అను కున్నదేమో. పదిహేనేళ్ళ వయసు వచ్చేసరికి ఆ ప్రాంతంలో అత్యంత ఆకర్షణీయమైన అమ్మాయిలలో ఆమె ఒకతి. షణ్ముగవడివు ఆ అమ్మాయిని సంపన్నులు, పలుకుబడిగల వారి ఆస్థానాల్లోకి తీసుకెళ్ళేందుకు వచ్చిన ఏ అవకాశాన్నీ వదలలేదు. అక్కడ వడివంబాల్ చేయి పట్టుకోవటానికి చాలామంది ఉండటం చూసి సంతోషించింది. చివరకు తల్లి ఒక కోయంబత్తూరు కోటీశ్వరుడిని చూసింది. అతని పేరు భాష్యం అయ్యంగార్, కుటుంబంలో అందరూ పచిన అనేవారు. దీనిలో వడివంబాల్‌కి ఏ అభ్యంతరమైనా ఉండివుంటే దానిని ఆమె తనలోనే దాచుకుంది. సంబంధం కుదిరింది. వివాహం గురించి అతి కొద్ది వివరాలే తెలిశాయి, ఆ కోటీశ్వరుడి గురించి, వారి వివాహ జీవితం గురించి కూడా అంతే! కుటుంబ బంధువులు అతను తన అందమైన చిన్నారి భార్యను చూసుకుని గర్వపడేవాడనీ, బాగా చూసుకున్నాడనీ చెబుతారు. కానీ ఆమె కోసం విషాదం ఎదురు చూస్తోంది. డబల్ న్యూమోనియా బారినపడి మరణించేనాటికి ఆమెకు ఇరవై రెండేళ్ళు. ఆ సమయానికి యమ్మెస్ తన తల్లి పరిధి నుండి బైటపడి మద్రాసులో స్థిరపడింది.

యమ్మెస్ కుటుంబ కథ అంచులలో నిరంతరం ఆందోళన బాధ కలిగించే పుకార్లలో వడివంబాల్ మరణం ఒకటయింది. ఆ రోజుల్లో న్యూమోనియా వల్ల చనిపోవటం మామూలే అయినా, ఆ సంపన్నుడి చిన్న భార్య ఆత్మహత్య చేసుకున్నదన్న పుకార్లు వచ్చాయి. బహుశా అంత చిన్న వయసులో మరణించటంవల్ల న్యూమోనియా అనే కారణంతో సంతృప్తి చెందని కుతూహలం ఎక్కువై ఉండవచ్చు. ఇతర వివరణలు యివ్వటం కష్టం. ముఖ్యంగా వారి నిజాయితీని నిరూపించుకోవాల్సిన అవసరం లేనప్పుడు సంజాయిషీలు ఎందుకు? అక్కడ వచ్చిన పుకార్లు వడివంబాల్ వివాహ సమస్యలను వదిలి గాయకురాలిగా వడివంబాల్ దిగుళ్ళను, బాధలను మాత్రమే పట్టించుకున్నాయి. ఈ గుసగుసల ఉద్యమం ప్రకారం సంగీత ప్రపంచంలో ఆమె ఎదిగే అవకాశం లేదు, అనుమతిలేదు. ఎందుకంటే షణ్ముగ వడివు యమ్మెస్‌ని అభిమానిస్తోంది. ఇది నిజమేమో అనిపించే కథ ఎందుకంటే తల్లి నిజంగానే యమ్మెస్‌ని ప్రత్యేకంగా చూసింది. కానీ అది కొద్దికాలమే. యమ్మెస్ కీర్తి ప్రతిష్టలు మద్రాసు వెళ్ళిన తర్వాతనే, మొదట షణ్ముగవడివు దీవెనలతో, తరువాత ఆమె కోపాలతో పెరిగాయి. మద్రాసులో త్వరత్వరగా వరసగా జరిగిన సంఘటనలు యమ్మెస్‌ని తారాపథానికి ఎగరేశాయి. వడివంబాల్‌కి ఇరవై రెండేళ్ళ వయసు వచ్చేసరికి, ఆమె అక్క ఇంతకుముందు స్త్రీలు అందుకోలేరని చెప్పిన శిఖరాలన్నీ అందుకుంది. సంగీతపు కోటలో గుర్తింపు సాధించి, సినిమాలలో అగ్రభాగాన నిలబడుతోంది. తాను కోయంబత్తూరు లోని బంగళాలో ఎంత సుఖపడుతున్నా పచిన అయ్యంగార్ ఎంత ఉదారుడైనా, సంగీతంలో

గుర్తింపుతో, సినిమా గ్లామర్‌తో వినువీధుల్లో విహరిస్తున్నట్లున్న తన అక్కతో సమానం కాలేననే విషయం వడివంబాల్‌కు స్పష్టంగా తెలిసి ఉండాలి. బాల్యమంతా అక్కకంటే తానెంత అందగత్తో అందరూ చెబుతుంటే వినివున్న వడివంబాల్‌కు, తనకు ఏ కీర్తీ రాలేదని, తన అక్క సినిమాతార అయిందని తెలిసింది. తోబుట్టువు మీద అసూయపడే స్వభావం ఉన్నట్లయితే వడివంబాల్‌కు అక్కమీద అసూయపడటానికి సర్వ కారణాలూ సిద్ధంగా ఉన్నాయి. తను నిర్లక్ష్యానికి గురైందనీ, ఓడిపోయిందనీ అనుకోటానికి కావలసినన్ని కారణాలున్నాయి. ఆమెది అటువంటి స్వభావమని కచ్చితంగా చెప్పగలిగే పరస్థితి లేదు. ఆమె విషాద మరణమే కచ్చితమైన నిజం.

షణ్ముగవడివుకు వడివంబాల్‌ని కోల్పోవటం వ్యక్తిగత పరాజయం. తన చిన్న కూతురికి ఆమె చేయగలిగినదంతా చేసింది. పెద్దకూతురి పట్ల కాస్త అభిమానంగా ఉన్న దంటే అది పక్షపాతం కాదు, సుబ్బులక్ష్మి కంఠానికి మంచి భవిష్యత్తు ఉందని ఆమెకు సంగీతంలో వున్న పరిజ్ఞానం వల్ల తెలియటం. ఇంకోపక్క వడివంబాల్‌కు సంపన్న కుటుంబంలో తగిన భద్రత కల్పించటంలో ఆమె సఫలమైంది. ఇంకొకవైపు సుబ్బులక్ష్మి తనకు కావాల్సినట్టు అగమ్యగోచరమైన భవిష్యత్తును వెతుక్కుంటూ వెళ్ళింది. సుబ్బులక్ష్మితో ఉన్న మద్రాసు మనుషులు ఒక తల్లిగా సరైనవారిగా షణ్ముగవడివుకు తోచలేదు. ఐతే భద్రంగా స్థిరపడిందనుకున్న వడివంబాల్ చనిపోయింది. అమ్మాయిలకు కొన్నిసార్లు ఆర్థిక భద్రత మాత్రమే సరిపోదనేది శాపమా? దూరంగా ఉన్న నగరాల నుండి వచ్చిన మనుషులు ఎంతో ప్రతిభ ఉన్న తన కూతురిని ఎత్తుకుపోవటం తన వర్గానికున్న శాపం వల్లనా? యమ్మెస్‌కు ఎలాంటి కంప్లయింట్లూ లేవు. ఎందుకంటే పరిస్థితులు ఆమెను తన దోవ తాను వెతుక్కునేలా చేశాయి, మొదట్లో కొంత తడబడినా తర్వాతర్వాత ఆమె నిలదొక్కు కుంది. స్థిరమైన నేలమీద అడుగులు మోపింది. కానీ ఆ కుటుంబానికి విధి రావలసిన దాని కంటే ఎక్కువ కష్టాలను కల్పించినట్లనిపిస్తుంది. తన కూతుర్లపట్ల ఒక ఒంటరి తల్లి చూపిన శ్రద్ధాసక్తులు, సమాజం వారిపట్ల విధించిన ద్వంద్వ వివక్షవల్ల వారిని రక్షించలేక పోయాయి – వారు స్త్రీలు గనుక వారిపై జరిగే దోపిడీ, వారు భిన్నకులానికి చెందటం వల్ల కలిగిన వివక్ష. యమ్మెస్ ఈ రెండు ప్రమాదాల నుంచి తప్పించుకుంది. అదృష్టవశాత్తు ఆమె జీవితపు కీలక దశలలో జరిగిన సంఘటనలు ఆమెకిచ్చిన భద్రతను ఆమె తల్లి యొక్క కాల పరీక్షకు నిలిచిన పద్ధతులు ఇవ్వలేకపోయాయి. ఆమె సంగీత కిరీటం కంటే ప్రాధాన్యం కలదని నిరూపించుకున్న అమోఘమైన సాంఘిక మార్పుని సాధించింది.

# 4. కుటుంబం, కులం, జండర్

*బలము కులము యేల రామ – భక్తి కారణము*
*వెలయు సకల సిద్ధులెల్ల – వెంటవచ్చు గాని మేను ॥బల॥*
*నీట కాకి మీను మునుగ – నిరతముదయ స్నానమా*
*తేట కనుల కొంగగూర్ప – దేవతల ధ్యానమా ॥బల॥*

పురుషాధిపత్యం కంటే కులాధిపత్యం ఎక్కువ అణచివేతతో కూడినదా అనే చర్చ రెండింటి బారిన పడినవారి ముందు చేయటం వ్యర్థం. షణ్ముగవడివు జండర్ వివక్షతో పాటు అగ్రవర్ణ ఆధిపత్యాన్ని కూడా ఒకే సమయంలో ఎదుర్కొంది. కేవలం ధైర్య సాహసాలతో, పట్టుదలతో మాత్రమే ఆమె ఘోరమైన ఆటుపోట్లు తన కుటుంబాన్ని ప్రభావితం చేయకుండా చూడగలిగింది. కానీ ఆమె స్మృతుల్లో ఉండిపోయిన అపకారాలు, అపచారాలు ఆమె ముఖంమీది చర్మపు ముడుతలలో కనిపిస్తాయి. ప్రపంచీకరణ చెందిన ప్రపంచంలోని సాంఘిక వాస్తవాలు "ఒంటరితల్లి" అనే పదాన్ని కనిపెట్టటానికి ఎంతో ముందుగానే కుటుంబ బరువు బాధ్యతలనన్నింటిని ఒంటిచేత్తో మోసిన తల్లులలో షణ్ముగవడివు ఒకరు. ఆమె కుటుంబంలో ఎప్పుడూ అలాగే జరిగేది, ఆమె కుటుంబం వంటి లక్షలాది కుటుంబాలలో కూడా అట్లాగే జరిగేది. అది మాతృస్వామ్య విధానమేమీ కాదు. కానీ వంశవృక్షాలన్నీ తల్లుల పేరుమీదే గీయబడేవి. ఎలాంటి రికార్డులూ దాచి వుంచని పద్ధతుల్లో మధురైలో పెద్దలు నాలుగు తరాలను మాత్రం గుర్తుంచుకుంటారు – సుబ్బులక్ష్మి, తల్లి షణ్ముగవదివు, అమ్మమ్మ అక్కమ్మాళ్, ముత్తవ్వ పేరు సామూహిక జ్ఞాపకాల నుంచి ఇప్పటికే చెరిగిపోయింది.

ఆమె ప్రఖ్యాత నర్తకి. ఎంత ప్రఖ్యాతి అంటే 1886లో వైగై నదిమీద ప్రధానమైన అల్బర్ట్ విక్టర్ వారధి వైస్రాయి డఫిరిన్ ప్రారంభించినప్పుడు, ఆ ప్రారంభోత్సవ సభలో నృత్యం చేసేంత ప్రముఖ నర్తకి. అక్కమ్మాళ్ వయొలిన్ విద్వాంసురాలు. ఆ రోజుల్లో ఫిడ్లర్ అనేవాళ్ళు. ఈ క్రమం మాత్రం స్పష్టంగా ఉంది – నర్తకి, ఆ తర్వాత ఫిడ్లర్, తర్వాత వీణ, వీణ నుంచి గాత్రం. ఈ జాబితాలో తండ్రులు కనిపించరు. ఆ విధంగా వ్యవస్థీకృతమైన దేవదాసీ నిర్మాణం షణ్ముగవడివు జీవితాన్ని శాసించి పాలించింది. దేవతల దాసీలు అనే అర్థం ఉన్న వీరు పురాణాల ప్రకారం ఊర్వశి అనే అప్సరస నుంచి వచ్చారు. ఊర్వశి స్వర్గంలోని పదకొండుమంది నర్తకీమణులలో ఒకరు. చారిత్రకంగా చూస్తే దేవ దాసీలు హరప్పా నాగరికతా కాలం నుంచీ ఉన్నారని చెబుతారు. దక్షిణ భారతదేశంలోని అనేక రాజధాని నగరాలలో అద్భుతమైన దేవాలయ నిర్మాణాలు ఆరంభమైనప్పుడు ఆ

మత సంస్కృతిలో అనుబంధంగా దేవదాసీలు కనిపిస్తారు. మొదటి రాజరాజ చోళుడు (985–1016) తంజావూరులో అద్భుతమైన బృహదీశ్వరాలయం కట్టించినప్పుడు ఆ వీధిలో వరుసగా 400 మంది దేవదాసీలను ఉంచాడు. తర్వాతి పాలకులైన నాయకులు, మరాఠాలు, పాండ్యులు కూడా దేవదాసీలను కళలను అభివృద్ధి చేసేందుకు చురుకుగా ప్రోత్సహించారు. 1891వ సంవత్సరపు జనాభా లెక్కల్లో 1.56 మిలియన్ల స్త్రీలు దేవ దాసీలుగా ముద్రపడి ఉన్నారు.

తంజావూరు, మదురైలలోని గొప్ప దేవాలయాల నిర్మాతలు స్థాపించిన పద్ధతి ప్రకారం దేవదాసీలను కులంగా కాకుండా వర్గంగా పరిగణిచేవారు. వారికి ప్రతిష్ట ఉండేది. ఐతే ఒక విషయం చెప్పి తీరాలి, ప్రజలు వారిని గౌరవంగానే చూసేవారు. ఎందుకంటే వారిని దేవుని సేవ కోసం ఆచారం ప్రకారం అంకితమివ్వటమే కాక, శాస్త్ర విధులన్నిటితో వారికి దేవునితో వివాహం జరిగేది. తాళిబొట్టు కట్టించేవారు. ఇంకో కారణం ఏమిటంటే అనేక గొప్ప కులపు కుటుంబాలలో కూడా గుడికి ఒక కూతురిని ఇచ్చేసే ఆచారాన్ని పాటించేవారు. ఉదాహరణకు చేరవంశ రాజైన కులశేఖర పెరుమాళ్ కూతురిని శ్రీరంగంలోని దేవాలయానికి అంకితం చేశారు. దేవాలయాలు ఆ ఆడపిల్లలను చాలా బాధ్యతతో స్వీకరించేవి. వారికి ఏడెనిమిది సంవత్సరాల కఠోర శిక్షణ ఇచ్చేవారు. ఆ శిక్షణ తర్వాత వారు ఏదో ఒక కళలో సాధారణంగా నృత్యంలో నిష్ణాతులయ్యేవారు. చాలాసార్లు ఆ దేవాలయ ప్రాంతంలో ఏ రకమైన విద్యా శిక్షణ పొందిన స్త్రీలున్నారంటే అది దేవదాసీలు మాత్రమే. వారు ఏ దేవాలయానికి అనుబంధంగా కలిసి ఉంటారో ఆ ఆలయాలు రాజుల ప్రాపకంలో సంపద్వంతంగా ఉండేవి కాబట్టి, దేవదాసీల ఆర్థికి స్థితి కూడా సౌకర్యవంతంగా మెరుగ్గానే ఉండేది.

సంగీతానికి, నృత్యానికి అంకితమైన గురువుల నట్టువనార్ల సమూహాన్ని పెంచి పోషించటమనే తన ఆశయాలను సాధించటంలో ఈ విధానం సఫలమైంది. స్త్రీలు వారి దగ్గర లౌకికమైన ఎలాంటి ఆందోళనలూ లేకుండా ఆ కళలను అధ్యయనం చేసేవారు. దాసి ఆట్టం, సదిర్ అనే నృత్య రూపాలు కళను, దృశ్యాన్ని కలిపేవి. వాటి నుంచి సంగీతాన్ని వేరు చేయలేము. ఆ సంగీతం కర్ణాటక శైలిలో శాస్త్రీయ, జానపద సంప్రదాయాల నుండి బలాన్నీ, శక్తినీ పొందేది. దేవదాసీల నుంచి గొప్ప కళాకారులు వచ్చారు. చారిత్రక ఆధారాలుగా రికార్డులను భద్రపరిచే అలవాటు లేకపోవటం భారతీయులకొక శాపం. దానివల్ల తొలితరం తారల గురించి జ్ఞానం అందకుండా పోయింది. కానీ కొందరు ఇరవయ్యవ శతాబ్దానికి చెందిన కళాకారుల సామర్థ్యం, నైపుణ్యం చూస్తే వారి వారసత్వ సంపద ఎంత ఘనమైనదో మనకు తెలిసిపోతుంది. దక్షిణ భారత గాత్ర సంగీతకారులలో ఎంతో కీర్తి పొందిన వారిలో, కోయంబత్తూర్ తాయి, సేలం గోదావరి, మద్రాసు లలితాంగి

(ఎమ్.ఎల్. వసంత కుమారి తల్లి) బెంగళూరు నాగరత్నమ్మలు ఉన్నారు. మహారాష్ట్ర సంప్రదాయంలో హీరాబాయ్ బరొడేకర్, కేసరీ బాయ్ కేల్కర్‌లు ఉన్నారు. వాద్య సంగీతం, నృత్యం వంటి కళలలో చెప్పుకునే గొప్ప పేర్లు వీణ ధనం, బాలసరస్వతి. షణ్ముగవడివు, సుబ్బులక్ష్మి ఇటువంటి ఘనమైన నైపుణ్యాలకు వారసులు.

తమను తాము పోషించుకుని రక్షించుకోవాల్సిన స్థితిలోకి నెట్టబడటంవల్ల ఆ స్త్రీలు స్వతంత్రేచ్ఛతో, బలమైన వ్యక్తిత్వంతో ఉండేవారు. వారి కళల్లో అగ్రగణ్యులైనవారు వివేకంతోనూ, గర్వంతోనూ దీన్ని ప్రదర్శించేవారు. 1930 తొలి సంవత్సరాలలో ప్రఖ్యాత నాట్య కళాకారుడు ఉదయశంకర్, మద్రాసులో ఆయన కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన బాలసరస్వతి నృత్య ప్రదర్శన చూసి హర్షాతిరేకంతో పొంగిపోయాడు. అప్పటికామెకు పదిహేనేళ్ళు నిండలేదు. ఆమెను ఎలాగైనా తన బృందంలో చేర్చుకోవాలనే తహతహతో, ఉన్నతశ్రేణి పౌరులకు, అతి సంపన్నులకు మాత్రమే ప్రత్యేకమైన కన్నెమెరా హోటల్‌లో పెద్ద డిన్నర్ పార్టీ యేర్పాటు చేశాడు. బాలసరస్వతిని, ఆమె తల్లి జయమ్మాళ్‌ని, గురువు కందప్ప పిళ్ళైని మెప్పించటం కోసం అవసరమనుకున్న, సాధ్యమైన అన్ని పనులూ చేశాడు. మంచి వేతనంతో, సకల సౌకర్యాలతో ప్రపంచయాత్ర చేయిస్తాననే ఆశను వారి కళ్ళముందు కదిలించాడు. కానీ ఆ విషయంలో నిర్ణయం ఆకర్షణలకు లొంగటంతో కాక, జయమ్మాళ్ వివేకవంతమైన అంచనా వల్ల జరిగింది. "ఉదయ శంకర్ చేసే నాట్యం భిన్నమైంది" అని ఎత్తి చూపిందామె. "అది బృంద నాట్యం. మన నాట్యం అతని రీతితో కలవదు. బహుశా మనకు డబ్బు రావచ్చు, కానీ మన కళ పాడవుతుంది." కందప్ప పిళ్ళై ఎరకు లొంగాడు. అల్మోరా వరకూ (ఇప్పటి ఉత్తరాంచల్‌లో కొండ ప్రాంతం. ఉదయశంకర్, అతని బృందం అక్కడే ఉండేవారు) వెళ్ళి తిరిగివచ్చాడు. అతనికి ఆ వాతావరణం పడలేదు. భరత నాట్యమూ, వారి నాట్యరూపక సంస్కృతి భిన్నమైనవని తెలిసొచ్చింది.

ఇలా స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే శక్తి బాల సరస్వతి కుటుంబంలోనే ఉన్నట్లుంది. ఆ వంశపు తొలి కళాకారిణి వీణ ధనం (1868–1938) చెప్పుకోదగిన కీర్తివంతురాలు. వీణలోని మెలకువులన్నిటిపై అధికారం సంపాదించి తన శైలిని అనితర సాధ్యంగా మలుచుకుంది. ఐతే ఒకసారి బహిరంగ ప్రదర్శనలో తను ఆడదాన్ని గనుక నిర్వాహకులు తనను తగ్గిస్తున్నట్లు గమనించింది. తర్వాత ఎన్నడూ ఆమె బహిరంగ ప్రదర్శన ఇవ్వలేదు. ఆ సంఘటన తర్వాత మైక్రోఫోన్ ముందు ఒక్కసారి మాత్రమే వీణ వాయించింది. ఐనా సెమ్మంగుడి శ్రీనివాసయ్యర్ చెప్పినట్లు గొప్ప విద్వాంసులందరూ ముక్తకంఠంతో ఆమె కళను కర్ణాటక సంగీత సారాంశమని కీర్తించారు. ఆమె ఇంట్లో ప్రతి శుక్రవారం జరిగే వీణా వాదనకు హాజరవటం ఒక గొప్ప అవకాశంగా భావించారు. ఆ కుటుంబంలోని మరొక సభ్యురాలు, బాలసరస్వతి కజిన్ అయిన బృంద గ్రామఫోన్

కంపెనీలకు పాడనని తిరస్కరించింది. తన సంగీతం టీ దుకాణాల్లో, మంగలి షాపుల్లోంచి వినబడటం తనకిష్టం లేదంది.

బెంగళూరు నాగరత్నమ్మ పరిస్థితులు ప్రాబల్యంవల్ల ఆత్మశక్తికి, స్వయం పోషకత్వానికి ఒక కంచుకోటలా మారింది. ఆమె మైసూరులో పుత్తులక్ష్మికి, స్థానిక ప్లీడరైన సుబ్బారావుకీ జన్మించింది. కానీ బిడ్డ పుట్టిన సంవత్సరంలోపే ఆ లాయరు తల్లి కూతుళ్ళతో తెగదెంపులు చేసుకున్నాడు. అక్షరాలా ఇంట్లోంచి వీధిలోకి గెంటివేయబడిన పరిస్థితిలో, పుత్తులక్ష్మి దృఢ సంకల్పం, మొక్కవోని పట్టుదలతో కూతురుని పెంచి సంగీత శిక్షణ నిప్పించేందుకు సహాయపడ్డాయి. ఆమె విజయాలు, ఆమెను ఒక 'లెజెండ్'గా మార్చాయి. తన తరంలో అత్యంత గౌరవ ప్రతిష్టలు పొందిన శాస్త్రీయ గాయకురాలిగా నాగరత్నమ్మ ముందు కొచ్చింది. త్యాగరాజుకి సంపూర్ణంగా అంకితమైపోవటంలో ఏకైక వ్యక్తిగా నిలబడి, బీడు నేలను దున్ని నాయకురాలి స్థాయికి ఎదిగింది. తిరువయ్యూర్‌లో (తంజావూర్ దగ్గర) త్యాగరాజ సమాధి నిర్మించటంలో కీలక వ్యక్తిగా ప్రధాన సాధనంగా మారింది. ప్రతి సంవత్సరం ఆరాధనోత్సవాలను ప్రారంభించింది. 1941లో జరిగిన త్యాగరాజ ఆరాధనోత్సవంలో ఆమె నటించటాన్ని గాలికొదిలి, తన ఉపన్యాసాన్ని సగర్వంగా ఇలా మొదలెట్టింది. "నేను దేవదాసిని" ఆ మాట చాలా ముఖ్యం. ఎందుకంటే ఆ మాట వెలయాలు అనే మాటతో సమానర్థం కలది. "వ్యభిచారి" అని అర్థం ఆధునిక తమిళంలో శ్రోతలు ఒక్క క్షణం నిశ్చేష్టులయారు. వెంటనే తేరుకుని పదాలకున్న అర్థాలను గ్రహించి కరతాళ ధ్వనులు మారుమోగాయి.

ఇటువంటి గట్టి పట్టుదల, స్థిత ప్రజ్ఞత, నిపుణతగల దేవదాసీల క్రింద కళలు చెప్పుకోదగిన అభ్యుదయాన్ని సాధించాయి. కానీ ఆ సాంఘిక వ్యవస్థకు కొనసాగే బలం లేదు. చాలా బలహీనమైపోయింది. దేవాలయాలను పోషించిన రాజాస్థానాలవల్లే దేవదాసీలు బతకగలిగారు. కానీ ఆ రాజకుటుంబాలే దేవదాసీ భావనకున్న పవిత్రతను దెబ్బదీసే పనులు చేయటంతో ఆ వ్యవస్థ కూలిపోయింది.

ఉత్తరాంధ్ర కర్ణాటక ప్రాంతాలలో, కింది కులాల నుండి పెద్ద సంఖ్యలో అమ్మాయిలు ఈ వర్గంలోకి వచ్చారు. ఈ స్త్రీలపైన జరిగే లైంగిక దోపిడీని మతపరమైన అంగభోగమనే పదంతో సమర్థించుకున్నారు. ఇది తంజావూరు – మధురైలలోని రంగభోగమనే భావనకు వ్యతిరేకం. మొదటిది శరీర పూజ అయితే రెండవది కళారాధన. విజయనగర, మైసూరు రాజవంశాలు దేవదాసీల కళలకంటే రాజదాసీ పద్ధతి అందించే సుఖాలలోనే ఎక్కువ మునిగి తేలేవారు. రాజరికాలు అంతరించటంతో దేవదాసీలకు పెద్ద దెబ్బ తగిలింది. ఉత్తర దక్కన్ ప్రాంతం నుంచి ఆక్రమణదారులు, ఆ తర్వాత యూరప్ వలస పాలకులు దక్షిణాదిన తమ పాదాలను మోపినప్పుడు దక్షిణ రాజ్యాలు పతనమై చిన్నాభిన్నమైపోయాయి.

1853వ సంవత్సరంలో తంజావూరు ఆస్థానాన్ని బ్రిటీష్‌వారు స్వాధీనం చేసుకున్నారు. ఆ స్థానంలోని దేవదాసీలు ఇంగ్లీషులో "గాడ్ సేవ్ ది కింగ్" పాడటం ప్రారంభించారు. కానీ అప్పటికే ఆలస్యమైంది. దేవదాసి సంప్రదాయం యొక్క రాజరికపు చివరి కోటను చరిత్రలో ఒక పాద సూచికగా మారకుండా ఏదీ రక్షించలేకపోయింది.

రాజవంశీకుల మద్దతు పోవటం, దానివల్ల దేవాలయాల మద్దతూ పోవటంతో దేవదాసీ నిర్మాణం ఆధారపడిన ఆర్థిక పునాదులు సర్వనాశనమయ్యాయి. దేవదాసీల కళలకు విలువ యిచ్చే తమిళ సంప్రదాయం ఒక సాంఘిక పునాదినిచ్చినట్లు కనిపిస్తుంది. దానిపైననే ఆ స్త్రీలు ఆధారపడ్డారు. 19వ శతాబ్దపు చివరి భాగానికి వచ్చేసరికి సంపన్నులైన బ్రాహ్మణులు, తమ చట్టబద్ధ భార్యలతోపాటు దేవదాసి 'భార్య'ని చేపట్టటానికి సాంఘిక అనుమతి దొరికింది. రెండవ భార్యకు ఒక తరగతి కేటాయించారు. కాస్త వ్యతిరేకత ఉన్నప్పటికీ ఒక తరగతి అంటూ దొరికింది. మగవాడు ఆ 'భార్య'ను తగుమాత్రపు విశ్వసనీయతతో పోషిస్తాడు. ఆమె అతన్ని 'భర్త'గా ఇతర పురుషులకంటే వేరుగా చూస్తుంది. ఈ రకమైన వ్యవహారాల వల్ల ఆమెకు ఫలానా అయ్యరు లేదా అయ్యంగారు తన భర్త అనీ, తన పిల్లలకు తండ్రి అనీ చెప్పుకునే వీలుంటుంది. మగవాడు కూడా ఔదార్యంతో అలా చెప్పుకోనిస్తాడు. ఈరకమైన గుర్తింపు పురుషాధిక్య సమాజం తనకు అనుకూలంగా ఉండేందుకు ఏర్పరచుకున్నదే అయినప్పటికీ, ఆ స్త్రీలకు కొంత గౌరవాన్నీ దానికి తోడు కాస్త భద్రతను కల్పిస్తుంది.

కొన్ని ప్రాంతాలలో దేవదాసీలకు ఈ ఏర్పాటు తప్పించుకునే hatch గా ఉపయోగపడింది గానీ 19వ శతాబ్దపు చివరిదశలో మార్పుకోసం వీస్తున్న శక్తివంతమైన గాలులను తట్టుకుని నిలబడేంత స్థిరమైన ఏర్పాటు కాకుండా పోయింది. సంప్రదాయంగా సహాయపడే పద్ధతులు కూలిపోవడంతో, సంగీతంలో, నాట్యంలో విద్వాంసులైన స్త్రీలు తమ కళా రూపాలను జీవనాధారాలుగా వాడుకోక తప్పలేదు. తమకు సంగీతకారులుగా, నర్తకులుగా పేరు తెచ్చుకున్న స్త్రీలు రంగస్థల ప్రదర్శనల ద్వారా డబ్బు సంపాదించారు. వీరిలో ఎక్కువమంది ప్రజాకర్షణ సంపాదించటమే ప్రధాన ప్రయోజనంగా తమ కళా ప్రదర్శనలిచ్చే విధంగా ఒత్తిడికి గురయ్యారు. అతి త్వరలోనే దేవదాసీ కమ్యూనిటీ దేవదాసీలుగా అందరికీ పరిచయమయ్యారు. దేవదాసీలు ఇంత నగ్నంగా సరుకులుగా మారటంతో వాళ్ళమీద తెలియని దెబ్బపడింది, దాని వెంటనే ప్రభుత్వ చర్యలు కూడా వచ్చిపడ్డాయి. 1899 నాటికి మైసూరు రాష్ట్ర ప్రభుత్వం నృత్య కళాకారిణులును దేవాలయాల్లో నృత్యం చేయ కూడదని నిషేధించింది. రాజులు వారికిచ్చిన భూములు వెనక్కిలాక్కున్నారు. తమిళనాడులో 'యాంటి నాచ్' ఉద్యమాన్ని జాన్ మర్డోక్ అనే మిషనరీ మొదలుపెడితే, లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యురాలు స్వయంగా దేవదాసీ కుమార్తె అయిన ముత్తులక్ష్మిరెడ్డి ఆ ఉద్యమానికి

శాసనపరమైన కదలికను తెచ్చింది. దేవదాసీ కమ్యూనిటీలో మరికొందరు కూడా రాజకీయ నాయకులతో, సంఘ సంస్కర్తలతో చేతులు కలిపి దేవదాసీ వ్యవస్థను నిషేధించమని అడిగారు. శాసనసభ్యులలో ప్రముఖుడైన యస్. సత్యమూర్తి ఈ ఉద్యమాన్ని వ్యతిరేకించి నిషేధ చట్టం తేవటమంటే కళలను నిషేధించటంతో సమానమని వాదించారు. ఐనప్పటికీ 1947వ సంవత్సరంలో "మద్రాస్ దేవదాసీ ప్రివెన్షన్ ఆఫ్ డెడికేషన్ యాక్టు" అనే చట్టాన్ని ఆమోదించారు. 1954లో బొంబాయి దాన్ని అనుసరించింది. 1984లో కర్ణాటక 1988లో ఆంధ్రప్రదేశ్‌లు నిషేధించాయి. తమిళనాడులో డి.ఎమ్.కె. ప్రభుత్వం దేవదాసిలు అన్న పేరునే నిషేధించి వారికి ఇసై వెల్లలార్ అని కొత్త పేరు (సంగీత వెల్లలార్ కులం) పెట్టారు. ఇది పురుషులకు స్త్రీలకు కూడా వర్తిస్తుంది. చట్టరీత్యా నిషేధించబడినా భారతదేశంలో దాదాపు అన్నిచోట్లా కొనసాగుతున్న వరకట్నం, బాల్య వివాహాల వలే దేవదాసీ వ్యవస్థ కూడా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల కూడలి ప్రాంతంలో కొనసాగుతోంది. అక్కడున్న అనేకమంది స్త్రీలు "షెడ్యూల్ కులాలు" అనే ఇవాళ్టి పేరుతో బీదరికంలో మగ్గుతున్నారు.

ఆలోచిస్తే, సత్యమూర్తి మాట సరైనదని నిరూపితమైంది. దేవదాసీ విధానాన్ని నిషేధించటంవల్ల తమిళనాడులో అభివృద్ధి అయిన నృత్యం, సంగీతం పెద్ద ప్రమాదాన్ని ఎదుర్కొన్నాయి. 1940లో ఇ. కృష్ణ అయ్యర్, మద్రాసు మ్యూజిక్ అకాడమి సెక్రటరీ "నృత్యాన్ని రక్షించండి" అనే ప్రతి ఉద్యమాన్ని ప్రారంభించాడు. ఈ అసాధారణ వ్యక్తి తనను గురించి తాను "నాటకాలలో చెప్పుకోదగిన నటుడి"నని చెప్పుకున్నాడు. స్త్రీ పాత్ర ధారణ ఆయన ప్రత్యేకత, మద్రాసు "సుగుణ విలాస సభ" వారు ప్రదర్శించే "మాళవికాగ్ని మిత్రము" నాటకంలో మాళవికగా నటించాడు. "హామ్లెట్‌లో" గిట్రూడ్‌గాను, "ఆదర్శ పుత్రుడు: రామ" అనే నాటకంలో కైకేయిగానూ నటించాడు. ఆయన శిక్షణ పొందిన నర్తకుడు కూడా. వీటన్నింటికంటే ఆయన సంస్కర్త. దేవదాసీలను, వారి కళలను సాంఘికంగా ఆమోదింప చేసేందుకు పూనుకున్నాడు. తన ఆశ్రయంలో వారిని ప్రదర్శన నిమ్మని పిలిచాడు. ఈ మార్పువల్ల రెండు ముఖ్యమైన సాంఘిక ఫలితాలు కలిగాయి – దేవదాసీ నృత్యానికి బ్రాహ్మణుల గుర్తింపు దొరకటం, దేవాలయ నృత్యాన్ని, రంగస్థల నృత్యంగా మార్చటం. సూటిగా చెప్పాలంటే అతను స్త్రీల దుస్తులు ధరించి కొన్ని ప్రదర్శనలను రంగస్థలంపై ఇచ్చాడు. ప్రజా సంబంధ వ్యవహారాలలో ఒక గొప్ప మార్పుగా "దాసి ఆట్టమ్", సదిర్‌లనే మర్యాదలేని పేర్లను గౌరవనీయమైన శాస్త్రీయ నామం "భరతనాట్యం"ని వాడుకలోకి తెచ్చాడు.

క్రిష్ణ అయ్యర్ అనుకోని, ఎదురుచూడని సహాయం మరొకరకం సంస్కర్త అయిన రుక్మిణీదేవి అరండేల్ నుంచి దొరికింది. ఆమె వ్యక్తిత్వం సంక్లిష్టమైనది. ఒక సనాతన

సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన ఈమె, తన వ్యక్తిగత జీవితంలో విప్లవకారిణి అయ్యే సాహసం చేసి, పదహారేళ్ళ వయసులో, నలభై ఏళ్ళ వయసున్న ఆంగ్లేయుడిని వివాహం చేసుకుంది. సంప్రదాయంతో కరుడుగట్టిన మద్రాసు సమాజం ఆ వివాహాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. ఐతే ఆమె తన వృత్తిరీత్యా ఎంతో పవిత్రతను స్వచ్ఛతను పాటించే వ్యక్తిగా తయారైంది. తాను నృత్యకారిణి అవటంతో బ్రాహ్మణ నియమాలను ఉల్లంఘించింది. కానీ తర్వాత భరత నాట్యాన్ని 'పరిశుద్ధం' చేయటానికి పూనుకుంది. భరత నాట్యంలోని సంప్రదాయ జావళీలు, పదాలలో ఆమె శృంగారపర భావనలను మాత్రమే చూడగలిగింది. భావించగలిగింది. ఆ నృత్యంలో తనకు సభ్య అశ్లీలము, శృంగార సూచకము అనిపించిన హావభావాలన్నిటినీ తీసివేసి, సంప్రదాయంగా దేవాలయాలలో చెక్కిన తీరులో, శిల్పాల ప్రతిరూపాలను, ఆ హావభావాలతో ప్రవేశపెట్టింది. ఇప్పటివలే, అప్పుడు కూడా రసికులున్నారు. "రుక్మిణీదేవి అతిగా చేస్తున్నవాటి"కున్న విలువను వారు ప్రశ్నించారు. కానీ ఆమె కొత్త పుంతలు తొక్కటం వల్లా, ఆమె స్థాపించిన 'కళాక్షేత్రం' అప్పటికే చెప్పుకోదగిన ప్రభావం చూపటంవల్లా, ఆమె ముద్ర స్థిరపడింది. సంప్రదాయ పరులు తమ పట్టు వదలలేదు. దాంతో రుక్మిణీదేవికి భరతనాట్యాన్ని మొత్తంగా పరిశుద్ధం చేసే అవకాశం లేకుండా చేశారు.

ఈ క్రమంలో కీలక సారాంశమేమిటంటే శాస్త్రీయ కళలలో ఒక చారిత్రక పరిణామం జరిగింది. కుల ఆదిపత్యం స్పష్టంగానే ఉంది. భరతనాట్యం అంటే అసలైన అర్థం, కళలను దేవదాసీ స్థితి నుంచి బ్రాహ్మణ స్థాయికి, అంటే పైస్థాయికి చేర్చటం. ఆశ్చర్యకరంగా, రెప్పపాటులో భరతనాట్యం బ్రాహ్మణులలో సాంఘికంగా "ఫాషనబుల్" అయింది. ఇక్కడ మరో మూర్తిత్రయం పనిచేసింది. ఈ క్రమాన్ని మొదలుపెట్టిన కృష్ణ అయ్యర్, దానికి సాంకేతిక పునాదులు వేసిన రుక్మిణీదేవి, దానికి ప్రజాదరణను, ఒక శైలీ స్థాయిని అందించిన నాట్యకోవిదురాలు "బేబి కమల". ఈ ముగ్గురి ప్రభావాల కలయికతో ప్రతి బ్రాహ్మణ కుటుంబమూ తమ కుమార్తెలను, బేబీ కమలను మించిపోవాలనే ఆదేశాలతో భరతనాట్యం నేర్చుకోటానికి పంపటం తప్పనిసరైంది. అరంగేట్రం త్వరలోనే సాంఘిక క్యాలెండర్‌కి ఎక్కి కూర్చుంది. తిల్లానా చేయగలిగిన సామర్థ్యం ఉంటే పెళ్ళి మార్కెట్‌లో కావలసిన అర్హత ఉన్నట్లే.

❖ ❖ ❖ ❖

సంగీతరంగంలో కులం అంతే పట్టుతో ఉంది గానీ కొంత తక్కువ నాటకీయతతో మార్పులు వచ్చాయి. నాగస్వరం వాయించేది ఎప్పుడూ కింది కులాలవాళ్ళే. ముఖ్యంగా దేవదాసీల కొడుకులై ఉంటారు. లేడి కొమ్ములా ఉండే ఈ వాయిద్యాన్ని మంగళ వాయిద్యమని పిలిచినా బ్రాహ్మణులు ఎప్పుడూ ఇదంటే అరిష్టమనే భావిస్తారు. ఒక

సమయంలో మృదంగాన్ని కూడా సనాతన బ్రాహ్మణులు నిషేధించారు. ఆ మృదంగం రెండు చివరలా జంతు చర్మాన్ని వాడతారనే కారణంతో. తొలిరోజుల్లో తమిళ పిళ్ళైలు, (కేరళ నాయర్ పిళ్ళైలు కాదు) మేటి వాద్యకారులు. కుంభకోణం దక్షిణామూర్తి పిళ్ళై, పుదుక్కోటై మన్పూందియా పిళ్ళైలు చాలా ప్రసిద్ధులు. కానీ ఈ వాయిద్యాల ఆకర్షణ నుంచి తప్పించుకోవటం చాలా కష్టం. 1900 సంవత్సరానికి మృదంగ వాద్యగాళ్ళుగా ద్విజులే బ్రాహ్మణులే తయారయ్యారు. అతి వేగంగా ఈ రంగం బ్రాహ్మణ మృదంగవాద్య కారులతో నిండిపోయింది. మెరుపు వేగంతో చలించే వేళ్ళతో మైలత్తూర్ కృష్ణ అయ్యర్, తంజావూర్ వైద్యనాథ అయ్యర్, పాల్ఘాట్ మణి అయ్యర్‌లు, మృదంగాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఇంకోవైపు గాత్ర సంగీతం అంతో యింతో ఎప్పుడూ అయ్యర్‌ల, అయ్యంగార్‌ల అధీనంలోనే వుంది. 19వ శతాబ్దపు తిరుగులేని రాడికల్ ప్రభావాలు వారి అవకాశాలను విస్తృతం చేశాయి. యూరోపియన్ వలస పాలకులు తమకున్న కళాభిరుచితో చూపిన మార్గదర్శకత్వం బ్రాహ్మణులమీద చెప్పలేనంత ప్రభావాన్ని చూపింది. విద్యా, పాలనా రంగాలలో వలసపాలకులతో అతి దగ్గరగా సంబంధం ఉన్నది వారికేగదా. వేగంగా విస్తరిస్తున్న జాతీయోద్యమం మరింత ప్రభావాన్ని చూపింది. సంప్రదాయ భారతీయ సంస్కృతికి సంబంధించిన దేనినైనా ప్రకాశింపచేయటం దేశభక్తికి నిదర్శనమయింది. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ వార్షిక సభలు ఆల్ ఇండియా మ్యూజిక్ కాన్ఫరెన్స్ ఒకదాని నొకటి అనుసరించేవి. కాంగ్రెస్‌లో అగ్రవర్ణాలదే ఆధిపత్యం. ఆ ఆధిపత్యం కళల వరకూ వ్యాపిస్తూ వచ్చింది.

బహుశా ఈ ప్రభావాలన్నీ కాకతాళీయాలే కావచ్చు. దక్షిణ భారతదేశ బ్రాహ్మణులకు సంగీత నృత్యాలను పోషించే గుణం సహజంగా ఉన్నదేమో. తమిళ బ్రాహ్మణుడైన టి.జి. వైద్యనాథన్ అనే జిజ్ఞాసి ప్రకారం "మౌలికంగా బ్రాహ్మణులు అంకెలతో సంబంధం గలవారు – ఎక్కవుటెంట్లు, సంఖ్యా శాస్త్రజ్ఞులు, జ్యోతిష్య పండితులువారే. కర్ణాటక సంగీతం అంటే గణితం. మృదంగం అచ్చమైన గణితం. భరతనాట్యం కూడా గణితమే. కచేరిలో తాళాన్ని చాలా సరిగ్గా నానో సెకండ్లలో ఉంచవచ్చు. ఐతే ఈయనే నాణాన్ని మరోవైపుకి తిప్పినట్లుగా మరొక వ్యాఖ్యానం కూడా చేశాడు "ఇవాళ తమిళనాడులో బ్రాహ్మిణిజం సంగీతం ద్వారానే బతుకుతోంది."

యదార్థవాదులనూ, సామాజిక విమర్శకులనూ పక్కనబెడితే సంగీత నృత్యకళలు బ్రాహ్మణీకరణ చెందినందుకు మెప్పుదలతో కూడిన స్పందనే వచ్చింది. ఈరకమైన మార్పుని – నృత్య సంగీతాలు దేవాలయాల నుంచి విడివడి సంగీత సభావేదికలకు బదిలీ కావటాన్ని సానుకూల పరిణామంగానే భావించారు. ఈ పనులిప్పుడు భోగం కులాలతో సంబంధం

లేనివి. నిజానికి అవి ఇంకెంత మాత్రము కేవలం వినోదాలుగా పక్కకు నెట్టబడకుండా కళారూపాల గుర్తింపుని పొందాయి. ఐతే పరిణామానికి యితర భిన్న కోణాలున్నాయి. కర్ణాటక సంగీత నృత్యాల పట్ల తమిళ బ్రాహ్మణులలో ప్రాంతీయ దృక్పథం పెరిగింది. అవుట్‌లుక్ పత్రికలో ఒక పరుషమైన, పూర్తిగా పాక్షికమైన వ్యాసంలో ఇలా రాశారు: "దక్షిణాదిలోని సుసంపన్న శాస్త్రీయ కళలు పూర్తిగా హైజాక్ చేయబడ్డాయి, బ్రాహ్మణుల గుత్తాధిపత్యం వాటి సమగ్ర వికాసానికి ఎదుగుదలకు ఆటంకంగా ఉంది." ఇరుకైపోయిన ప్రాంతీయతత్త్వం వల్ల కర్ణాటక సంగీతం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అందరినీ ఆకర్షించటంలో విఫలమైంది. ఆర్థికపరమైన విలువను కూడా కోల్పోయింది. ఆ వ్యాసం 'శృతి' అనే పత్రిక సంపాదకుడైన సి.యన్. పట్టాభిరామన్ విషాద వ్యాఖ్యానాన్ని ప్రస్తావిస్తూ "ఒక అంజాద్ ఆలీఖాన్ (సరోద్ వాద్య నిపుణుడు – ఉత్తర భారతానికి చెందినవాడు) చెన్నైలో ప్రదర్శన యివ్వాలంటే 50,000 రూపాయలు తీసుకుంటాడు. కానీ అగ్రశ్రేణి దక్షిణాది సంగీతకారులు వారి కంచుకోటలోనే ఎంతో చౌకగా దొరుకుతారు. సెమ్మంగుడికి అకాడమి 2,000 రూపాయలు ఇచ్చింది. "ఐతే పట్టాభిరామన్ యిచ్చిన ఉదాహరణ బ్రాహ్మణుల గుత్తాధిపత్యాన్ని నిరూపించేది కాదు. కర్ణాటక కళలను తమిళ బ్రాహ్మణులు దురాక్రమించారనేది నిజమే గానీ ఆ పరిస్థితిని "ఘోట్టోమైజెషన్"గా చెప్పటం అతిశయోక్తి. అలాగే బ్రాహ్మణాధిపత్యం కళల అభివృద్ధిని ఆటంకపరిచిందనే మాటకూడా అతిశయోక్తే. నిజానికి, బ్రాహ్మణుల ప్రభావంవల్ల కళలకు ప్రజా సమూహాలలో ఆదరణ పెరిగింది. కళలు ఒక క్రమపద్ధతిలో అభివృద్ధి చెందాయి.

కళలచుట్టూ బ్రాహ్మణులు అబేధ్యమైన గోడలు కట్టి యితరులను ప్రవేశించనీయ లేదనటం పెద్దగా పట్టించుకోనవసరం లేనంత పైపై మాట. కానీ ఈ కళల వస్తుగత కేంద్రానికి సంబంధించిన బ్రాహ్మణీకరణ క్రమానికి మరొక కోణం ఉంది. వాస్తవంగా గొప్ప నృత్య కళాకారిణులైన బాలసరస్వతి (1918–84) వంటి వాళ్ళు పునాది నుంచీ జరిగిన ఈ మార్పుని అర్థం చేసుకున్నట్లున్నారు. 1960లలో ఢిల్లీలో జరిగిన ఒక సెమినార్‌లో, రుక్మిణీదేవి తాను నాట్యంలో నుంచి పాత అసభ్యతను తొలగించి, శుద్ధ కళాత్మక సారాంశాన్ని తీసుకురావటానికి ఎంత కష్టపడి పనిచేసిందో సుదీర్ఘంగా ఉపన్యసించింది. బాల సరస్వతి తనవంతు వచ్చినప్పుడు ఇలా అన్నది: "రుక్మిణీదేవి చెప్పినది ఎంతో సత్యం. ఈ అగ్రవర్ణ మహిళలు మా వృత్తిని తాము తీసుకుని మాకు మా కళనొక్కదాన్ని మిగిల్చారు. "ఈ వ్యాఖ్య కులపరమైన ద్వేషంతో కూడినది కాదు. దానిలో సౌందర్యపరమైన అంశం ఉంది. రుక్మిణీదేవి సభ్య నీతి చీపురుకట్ట సాలెగూళ్ళను చిమ్మివేసి ఉండవచ్చు, భరతనాట్యాన్ని సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబాలలోని పెద్ద గదులలో ఒక సాంఘిక సంపదగా చేసి ఉండవచ్చు. కానీ సంప్రదాయంగా అభ్యాసం చేయబడిన ఆ

నాట్యాన్ని లేకి మనుషులకు చెందినదిగా పరోక్షంగా సూచించటం ఎవరూ చేయకూడని పని. బాల సరస్వతి తరచు తనకు అభిమానపాత్రమైన విషయానికి వచ్చేది. రుక్మిణీదేవితో తలపడిన కొన్ని దశాబ్దాలకు ఆ విషయానికి ఆమె ఒక దృక్పథాన్ని ఇచ్చింది: "మనం భరతనాట్యాన్ని వినమ్రతతో చూస్తున్నామంటే, అంకితభావంతో నేర్చుకుంటున్నామంటే, భగవంతుని ఆరాధనగా అభ్యసిస్తున్నామంటే, శృంగారరసం తన పవిత్ర శక్తితో ఈ నాట్యంలోని గొప్ప సౌందర్యాలను చిత్రించగలగటం వల్లనే. మాంసం, ఆత్మకు శత్రువుగా పరిగణించబడే, శరీరం, నాట్యశాస్త్రంలో తనను దివ్యత్వానికి వాహికగా చేసుకుంటుంది, శృంగారం నర్తకిని దైవత్వంతో ఐక్యంచేసే సాధనమవుతుంది." కళకు అంకితమైన నర్తికిలో ఆమె పదాన్ని అభినయించేటప్పుడు లైంగిక అపసవ్యతలుండవనే విషయాలన్ని నొక్కి చెప్పటానికి బాల సరస్వతి అంతటి నర్తకి కావలసి వచ్చింది. కళ, సౌందర్యము, రెండింటినీ "స్వచ్ఛమైన  ఆధ్యాత్మిక స్థితి"గా ఆమె వర్ణించింది. నిజమైన కళాకారులకు "సంప్రదాయ భరతనాట్యం లోని ఏ అంశాన్నీ పరిశుద్ధం చేసే అవసరముందని అనిపించదు." అని కూడా సూటిగా చెప్పింది. ఇంకో విధంగా చెప్పాలంటే అసభ్యత, అశ్లీలాలనేవి పరిశుద్ధం చేసేవారి కళ్ళల్లో ఉన్నాయి. బాలసరస్వతికి రుక్మిణీదేవికీ ఉన్న బేధాభిప్రాయాలు, ఘర్షణ ఆ రోజుల్లో గొప్ప తగవు. బహిరంగంగా నాగరిక పద్ధతిలో జరిగేది. ప్రైవేటుగా తప్పనిసరిగా అలా జరిగేది కాదు.

బాలసరస్వతి తన కళను ఎంత పట్టుదలతో శక్తితో సమర్థించుకుంటూ వాదించిందో చెబుతూ నాటక రచయిత, నటుడు అయిన గిరీష్ కర్నాడ్ ఆమె ఎంత కఠోర నిష్టతో దేవదాసి సంప్రదాయానికి కట్టుబడి ఉందో గుర్తుచేశాడు: ప్రముఖంగా బ్రాహ్మణులదైన మద్రాసు మ్యూజిక్ అకాడమి ఆమెను నాట్య ప్రదర్శన ఇవ్వమని ఆహ్వానించింది. తర్వాత ఆమె తన తరగతులను అక్కడ నిర్వహించటానికి చోటు ఇచ్చింది. కానీ ఆమె తన నృత్యాన్ని గ్లామరైజ్ చేసి విస్తృతమైన, ప్రజాదరణను (అంటే బ్రాహ్మణ) ఆశ్రయాన్ని పొంద టానికి నిరాకరించింది. ఆమె జీవిత చరమాంకం వరకూ ఆర్థిక భద్రత ఎండమావిగానే ఉంది. సాంఘికంగా ఆమె ఎలాంటి కష్టాలను ఎదుర్కొన్నదంటే – మద్రాసులోని తల్లిదండ్రులంతా నాట్యం తన కూతుర్లకు అత్యవసరమైన నైపుణ్యంగా భావిస్తున్న కాలంలో, బాలసరస్వతి తన కళను తన కుమార్తెకు నేర్పటానికి ఉత్సాహం చూపించలేదు. గిరీష్ కర్నాడ్ బాలసరస్వతికి, సుబ్బులక్ష్మి, రుక్మిణీదేవికి కొట్టొచ్చినట్లు కనపడే వైరుధ్యాన్ని గమనించి చెప్పాడు. "సుబ్బులక్ష్మి కళ్ళు మిరుమిట్లు గొలిపే కెరియర్‌కి, ఆమె తన దేవదాసీ గతాన్నంతా ఆనవాలు లేకుండా ఒదిలేసి, తనను తాను ఒక తమిళ బ్రాహ్మణ గృహిణికి అచ్చమైన ప్రతిరూపంగా మార్చుకోగలగిన నిర్వహణకి ఎంతో దగ్గర సంబంధం ఉంది. మద్రాసులోని ఇంకో ప్రాంతంలోని తను గూటి నుంచి "రుక్మిణీదేవి సదిర్‌ని

బ్రాహ్మిణీకరించింది. నిజానికి ఆమె నాట్యంతో చేసిన పని సుబ్బులక్ష్మి తన స్వంత వ్యక్తిత్వంతో చేసిందని చెప్పవచ్చు."

❖ ❖ ❖ ❖

మధురైలో తల్లి పంజరంలోనుంచి ఎగిరివచ్చి మద్రాసు బ్రాహ్మణ గూటిలో వాలిని తర్వాత నిశ్శబ్దంగా, క్రమబద్ధంగా ఒక కాలక్రమంలో సుబ్బులక్ష్మి వేష భాషలలో మార్పు చోటు చేసుకుంది. ఆ మార్పు అది పగులగొట్టిన అడ్డంకుల వల్ల మరింత చెప్పుకోదగింది అయింది. పుట్టుక ఆమెను ఒక కుల వ్యవస్థలో ఉంచింది. అది మారదనిపించే వ్యవస్థ. ఐతే సాంఘిక నాయకులు దానిని తమకు అనుకూలంగా చక్కగా మలుచుకున్నారు. వాళ్ళు సరిచేసిన వ్యవస్థ ప్రకారం, ఆ కుటుంబాల పురుష యజమాని చుట్టూ ఉన్న సందేహాలను బట్టి మిగిలిన అమరికలన్నీ పుట్టాయి. ఆచారాలన్నీ కచ్చితంగా పాటించే వారు, కానీ ఆచారాలలేమి కూడా అంతే కచ్చితంగా పాటించేవారు, షణ్ముగవడివి ఒక తెలివైన, క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడిపింది. తన కుటుంబ క్షేమం కంటే ఆవిడ దృష్టిలో మరింకేదీ ముఖ్యం కాదు. ముందు కుటుంబం. తర్వాతే మిగిలినవి. కానీ సమాజం విధించిన వర్గీకరణకు ఆమె గురైంది. అప్పుడమలులో ఉన్న ఆచారం ప్రకారం ఒక మగవాడికి భార్య కాకుండానే అతన్ని భర్తగా అనుకోవచ్చు. అది తెరచివుంచిన సమాజం, అందరికీ తెలిసిన పద్ధతి. ఆ పద్ధతిలో సంబంధాలను స్వేచ్ఛగా గుర్తిస్తారు. దానివల్ల ఇరుపక్షాల మర్యాదకూ ఏ నష్టమూ జరగదు. ఒకే ఒక్క కష్టమేమిటంటే జనం పుట్టించే పుకార్లు గుర్తింపును దాటి వెళ్ళొచ్చు. అది కూడా సంప్రదాయంలో భాగంగానే ఆమోదాన్ని పొందింది.

తన కమ్యూనిటీలో యితర సభ్యులవలే షణ్ముగవడివు ఈ పరిస్థితిని ఎదుర్కోవలసి వచ్చింది. మదురైలోని ఆమె ఇంట్లో నివసించిన బంధువులు మామూలుగా షణ్ముగవడివు భర్తగా, స్థానిక న్యాయవాది అయిన సుబ్రహ్మణ్య అయ్యర్ పేరు చెబుతారు. సుబ్బులక్ష్మి తండ్రిగా కూడా అతని పేరే చెబుతారు. యమ్మెస్ బయోడేటాలో కూడా ఆ పేరే ఉంటుంది. కానీ మదురైలో సంగీతంలో కనీసపు ఆసక్తి ఉన్న ఎవరినడిగినా, అంతే సాధారణంగా, సంగీతంలో ప్రవీణుడైన పుష్పవనం అయ్యర్‌ని యమ్మెస్ తండ్రిగా చెబుతారు. సుబ్రహ్మణ్య అయ్యర్‌కు, పుష్పవన అయ్యర్‌కి వారి స్వంత ఇళ్ళు, అక్కడ చట్టబద్ధంగా వివాహమాడిన భార్యలూ ఉన్నారు. అందువల్ల ఎలా చూసినా షణ్ముగవడివు కులపరమైన పురుషపరమైన వ్యవహారంలో అన్యాయానికి గురవుతూనే ఉంది. అది అన్యాయమని కూడా ఆమె అనుకుని ఉండదు. ఎన్నో తరాల నుంచీ ఆమె కుటుంబం ఆ పద్ధతిలోనే జీవిస్తోంది. అంతకంటె భద్రమైనదని నిరూపించబడిన దారి ఉందని ఆమెకు తెలియకపోవడమే ఆమెకు రక్షణ కవచమైంది.

షణ్ముగవదివుకు చెందిన మధురైలో న్యాయశాస్త్రం కంటే సంగీతం అందరికీ తెలిసిన వృత్తిగా ఉండి ఉంటుంది. గాత్ర సంగీత విద్వాంసుడైన పుష్పవనం అయ్యర్ సుప్రసిద్ధుడు. సుబ్రహ్మణ్య అయ్యర్ కాదు. ఐనా పుష్పవనం ఒక గాయకుడిగా తయారవుదామని ఆలోచించలేదు. అసలాయన ఏదైనా ఒక పద్ధతిగా ఆలోచించేంత పద్ధతిగల మనిషి కాదు. స్థానిక దేవాలయంలో వారసత్వంగా వచ్చిన అర్చకత్వం చేస్తున్నాడు. అతని కంఠస్వరం అతనికెంత వరమంటే, అది విన్న ప్రజలు నిలబడిపోయి అతన్ని చూడవలసిందే. అతన్ని పాడమని ఒత్తిడి చేయటంవల్ల కొంతకాలం హరికథ బృందంలో సహకార గాయకుడిగా పనిచేశాడు. ఆ వ్యాపకం అతన్ని ఆ కాలంలో ప్రసిద్ధుల సరసన కూచునేలా చేసింది. పుష్పవనంతోపాటు పాడే గాయకులలో నయన పిళ్ళై. ఆ హరికథా బృంద నాయకుడు హరికథా గానంలో రాజని చెప్పుకునే ఎట్టాయపురం రామచంద్ర భాగవతార్. పుష్పవనం త్వరలోనే కచేరీలో పాడే స్థాయికి వచ్చాడు. ఎప్పుడూ నిషాలోనే ఉండటంవల్ల, కచేరీని పూర్తిగా నిర్వహించటానికి కావలసిన శక్తిలేకుండా పోయింది గానీ అతని చుట్టూ ఎవరూ కాదనలేని సంగీతపు వెలుగు ఆవరించి ఉండేది. అతన్ని తన చిన్నతనపు హీరోగా వర్ణిస్తూ సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్ ఇలా రాశాడు: “మధురై పుష్పవనం అయ్యర్ అందమైన ముఖం అతని సంగీతంతో సరిపోలుతుంది. ప్రభాత సమయంలో పుష్పవర్షం కురిసినట్లుగా అతని కంఠంలోంచి మాధుర్య మధువులు కురుస్తాయి. అతని స్వరాలు మెరుస్తాయి. అతను మధ్యమ స్థాయిలో శ్రుతితో పరిపూర్ణమైన ఐక్యతతో పాడతాడు. అతను పాడిన తర్వాత ఇంకెవరు పాడినా కుప్పయి పోతారు.” సెమ్మంగుడి వంటి సంగీత నిపుణులే పుష్పవనం గుణానికి ముగ్ధులయ్యారంటే, మామూలు ప్రజలు కేవలం అతని కంఠస్వరంతో పరవశించటానికి గుంపులుగా వచ్చేవారు. అతని గొంతుని యస్.జి. కిట్టప్ప గొంతుతో పోల్చేవారు. కిట్టప్ప రంగస్థల నటుడు. గాయకుడు తర్వాతి సంవత్సరాలలో పోలిక పుష్పవనం, సుబ్బులక్ష్మిల కంఠస్వరాల మధ్య చూసేవారు. వాళ్ళిద్దరి గొంతులూ చెప్పలేనంత మాధుర్య గుణాన్ని నింపుకున్నవి. మధురై మణి అయ్యర్ గొంతుతో కూడా తరచు సుబ్బులక్ష్మి గొంతుని పోల్చేవారు. ఇద్దరి గొంతుల్లో పోలిక చాలా ఉండేది. అతను పుష్పవనం మేనల్లుడు. ఈ ముగ్గురి విషయంలో వారి కంఠస్వరాలను “దైవం ప్రసాదించిన వరం”గా వర్ణించేవారు. కానీ ఆ వరాన్ని సద్వినియోగం చేసుకోకముందే, కుదురులేని పుష్పవనం జీవిత విధానం అతన్ని కాటేసింది. అతను ముప్ఫై ఎనిమిదేళ్ళకే మరణించాడు. అప్పటికి అతనికి అధికారిక బ్రాహ్మణ భార్య ద్వారా రాజం అనే కూతురుంది.

పుష్పవనంకు షణ్ముగవడివుతో సంబంధం ఉందనటానికి యిలాంటి పుకార్లు తప్ప మరేమీ లేవు. ఆ మాటకొస్తే సుబ్రహ్మణ్య అయ్యర్ గురించినవి కూడా పుకార్లే. సుబ్రహ్మణ్య అయ్యర్ విషయంలో కుటుంబంలోని వారు ఔనన్నారు. అలా అనటంలో

వారు ఏమాత్రం ఆసక్తిలేని పక్షంవారని కూడా చెప్పలేము. అన్నింటికంటే ముఖ్యమైన అంశం యేమిటంటే, ఈ విషయం ఊరికే, రికార్డుల కోసం గమనంలోకి వస్తుంది తప్ప అంతకంటే ఎక్కువ విలువగలది కాదు. యమ్మెస్ వ్యక్తిత్వం గానీ, ఆమె సంగీతంగానీ ఈ అంశంవల్ల ప్రభావితంకావు. ఈ విషయంవల్ల షణ్ముగవడివు తన కుటుంబాన్ని పోషిస్తున్న సమయంలో ఉన్న సాంఘిక పరిస్థితులు మీద కాస్త వెలుగు ప్రసరిస్తుంది. యమ్మెస్ తను స్వయంగా చెప్పుకున్నది, రికార్డయినది ఆమె తండ్రి సుబ్రహ్మణ్య అయ్యర్ అని. విషయం అక్కడ ఆగిపోవాలి. అక్కడే ఆగాలి. కొందరు ఔత్సాహికులు యమ్మెస్‌కు మధురై సుబ్రహ్మణ్య అయ్యర్ సుబ్బులక్ష్మి అని పేరు మార్చేంత దూరం వెళ్ళనవసరం లేదు.

షణ్ముగవడివుకి ఇంట్లో ఒక మగవాడు లేకపోవటం ఒక సమస్యగా ఎప్పుడూ లేదు. వాళ్ళ అమ్మకూ లేదు, అమ్మమ్మకూ లేదు. ఆమె కాలంలో పనిచేసే కుల–వర్గ పరిమితుల్లో చూస్తే, ఆమె తన పరిస్థితిపట్ల సంతృప్తిగానే ఉంది. ఆమె తగినంత కీర్తి, స్థిరత్వం సంపాదించుకుంది. మధురై మీదుగా వెళ్ళే ప్రతి సంగీతకారుడు ఆమె ఇంటికి వచ్చి వెళ్తాడు. ఆమె ఇంటిని సంగీత దేవాలయం. సంగీత ప్రేమికులు కలిసేచోటు. హనుమంతరాయర్ వీధిలో, పడమటి గోపురం వీధిలో నుంచి వెళ్ళే నాగస్వర బృందాలు ఆగి ఆమె ఇంటివైపు తిరిగి ఆమె గౌరవార్థం గట్టిగా రెండు మూడు స్వరాలు పాడి ఆ తర్వాతే ముందుకి సాగేవారు. ఆమె పద్ధతిలో ఆమె కూడా నియమాలను ఉల్లంఘించింది. ఉదాహరణకు దేవదాసీ కుటుంబ సంప్రదాయ ప్రకారం కూతుళ్ళకు సంగీతం, నాట్యం నేర్పించాలి. కొడుకులను నాగస్వరంలో పెట్టాలి. కానీ షణ్ముగవడివు కొడుకు నాగస్వరం జోలికెన్నడూ వెళ్ళలేదు. అతను మృదంగాన్ని ఎంచుకున్నాడు. ఇంకా సంప్రదాయాలకు దూరంగా వెళ్ళి ఒక విశ్వవిద్యాలయ పట్టా సంపాదించేలా కొడుకుని ఆమె ప్రోత్సహించింది. షణ్ముగవడివు గురించిన చిన్న చిన్న విశేషాలలో గుర్తున్నది ఆమెకు "బ్రాహ్మణ భోజనం" అంటే ఇష్టం అనేది. బహుశా ఆమెకు కూడా అంతరాంతరాల్లో తనకే తెలియకుండా సాంఘిక నిచ్చెనలో పైకి వెళ్ళాలని ఉందేమో – కానీ కూతురు తనదైన పద్ధతిలో ఆ పని చేసినప్పుడు ఆమె చాలా గాయపడింది.

❖ ❖ ❖ ❖

గాయకురాలిగా యమ్మెస్ తొలి వికసనం షణ్ముగవడివులో గొప్ప ఆశను నింపింది. సంగీత వృత్తిలోనున్న కళాకారిణిగా ఆమె ఉన్నతాశయం తన కూతురు కూడా గుర్తింపు గల కళాకారిణిగా చేయాలనేదే. సుబ్బులక్ష్మి యిచ్చిన గ్రామఫోను రికార్డును ప్రజలు అత్యుత్సాహంగా విని ఆనందించటం, టివియస్ సైకిల్ ఫ్యాక్టరీ ఆవరణలో తొలి సంగీత కచేరి విజయవంతం కావటం, రామనాథపురపు రాజకుటుంబం ఆ విలువైన సంగీత నిలయంలో 'సోలో' ప్రదర్శన ఇవ్వమని ఆహ్వానించటం – ఇవన్నీ యమ్మెస్ ఒక గుర్తింపుని

పొందుతుందనటానికి స్పష్టమైన తొలి సూచికలు. కానీ తిరుగులేని ప్రశంసలంటే, కళాకారులు మద్రాసు శ్రోతల సమ్మతిని సంపాదించటం అవసరం. కూతురికి పదిహేనేళ్ళ వయసురాగానే షణ్ముగవడివు ఆ అమ్మాయిని నగరంలో ఆవిష్కరించే సమయం వచ్చిందని నిర్ణయించుకుంది. కుటుంబమంతా కలిసి ప్రయాణంచేసి కొన్నిసార్లు తాత్కాలికంగా ఆ నగరానికి వెళ్ళివచ్చారు. కర్ణాటక సంగీత కళాకారులు సంగీత ప్రపంచానికి కేంద్రంగా జార్జిటవున్‌ని భావించేవారు. అక్కడ సభలున్నాయి. వచ్చిపోతుండే విద్వాంసులు ఇష్టంగా బసచేసే చోటు ట్రిప్లికేను. వాళ్ళక్కడి నుంచి జార్జిటౌన్‌కి వచ్చేవారు. ట్రిప్లికేన్ హైరోడ్డు నుండి మొదటి ట్రాము తెల్లవారుఝామున 4 గంటల నుంచి మొదలై రాత్రి ఒంటగంట వరకూ తిరుగుతూనే ఉండేది.

షణ్ముగవడివుకి కలిసొచ్చే కాలమయింది. కుంభకోణంలో జరిగే మహామహంకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మహామహం సాటిలేని ప్రత్యేకమైన తమిళ మత-సాంస్కృతిక ఉత్సవం. అలహాబాదులో కుంభమేళా వలే ఇది కూడా పన్నెండేళ్ళకొకసారి జరుగుతుంది. ఉత్తరాదిన వచ్చినంతమంది జనసందోహం రారుగానీ, ఉత్సవాల స్థాయి మాత్రం కుంభమేళాకు ఏమాత్రం తగ్గదు. కుంభకోణంలోని దేవాలయపు కోనేరులో మునగటం ఒక్కటే మతపరమైన ఆచారాలను తెలిపేది ఆ మునక సందర్భంలో తప్పనిసరి. దానిని దాటితే సంబరాలలో ఎగ్జిబిషన్లు, వ్యాపార ప్రదర్శనలు, చిన్న దుకాణాలు, తినుబండారాల దుకాణాలు, అన్నీ ఉంటాయి. నిజానికి ఆ ఉత్సవంలో ప్రధాన ఆకర్షణగా రోజూ జరిగే సాంస్కృతిక కార్యక్రమాలలో ఆ చుట్టుపక్కల ప్రాంతాలన్నిటి నుండీ వచ్చిన పేరెన్నికగన్న విద్వాంసులచే సంగీత, నృత్య ప్రదర్శనలుంటాయి. ఆ మొత్తం వాతావరణమంతా హుషారుగా, ఆనందంగా మతావేశంతో ఉప్పొంగుతుంది.

బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన కె. సుబ్రహ్మణ్యం 1932లో మహామహమ్‌ను ఏర్పాటు చేయటంలో ప్రధాన బాధ్యుడుగా, నిర్వాహకుడుగా ఉన్నాడు. అతను అప్పుడు తన మొదటి సినిమా 'పవలక్కోడి' తీస్తున్నాడు. ఆయన న్యాయవాది, జాతీయవాది, సాంఘిక ప్రయోజమున్న సినిమా తీసిన మొదటి వ్యక్తి, సంప్రదాయాలకు వ్యతిరేకంగా యుద్ధం చేసేవాడు. పవలక్కోడిలో అగ్రనటి అయిన యస్.డి. సుబ్బులక్ష్మికి దగ్గరగా ఉన్నాడు. తర్వాత ఆమెను రెండవ భార్యగా స్వీకరించాడు. యస్.డి. అని అందరూ పిల్చే ఆ నటిది మదురై కావటంతో షణ్ముగవడివు ఆమె వద్దకు వెళ్ళి మహామహమ్‌లో పాడే అవకాశం తన కుమార్తెకు ఇప్పించమని అడిగింది. యమ్మెస్ పాడిన ఒకటి రెండు గ్రామఫోను రికార్డులు యస్.డి. విని వుండటంచేత అది మంచి సంగతేనని అనుకుంది. సుబ్రహ్మణ్యానికి మొదట అంత ఆసక్తిలేదు. యస్.డి అడిగింది గాబట్టి తర్వాత ఒప్పుకున్నాడు. యమ్మెస్ పాడేందుకు ఒక సమయాన్ని కేటాయించారు. ఐతే అది మంచి సమయం, ఎక్కువమంది శ్రోతలొచ్చే సమయం కాదు.

సుబ్రహ్మణ్యం జాగ్రత్తపడటానికి కారణం ఉంది. కుంభకోణం అంటే దేశపటంలో కనపడే ఒక చుక్కకాదు. ఈ దేవాలయ పట్టణ పౌరులు తమ పట్టణానికి ఉన్న ప్రత్యేకత మీద జీవిస్తుంటారు. మహామహమ్ ఉత్సవాలను ఇంకే ఇతర పట్టణమూ నిర్వహించలేదు. మధురైకిగానీ, మద్రాసుకిగానీ ఏ ప్రత్యేక స్థాయినీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉండని కుంభ కోణం ఊరు ప్రజలు, తాము, పక్కనున్న తంజావూరు ప్రజలు మాత్రమే తమిళ శాస్త్రీయ ప్రమాణాలకు నిజమైన రక్షకులమని భావిస్తారు. వారిని సంతోషపెట్టడం, సంతృప్తిపరచటం అంత తేలిక కాదు. కళాకారులుగా పేరు ప్రఖ్యాతులతో స్థిరపడినవారు కూడా తంజావూరు, కుంభకోణం రసికుల ఆమోదాన్ని పొందడమనేది చాలా కష్టమైన లక్ష్యమనీ, ఒకసారి అది సాధించామంటే ఇక అంతకంటే ఆశించాల్సిన ఉన్నత శిఖరాలు లేవనీ అనుకుంటారు. పదహారేళ్ళ యవ్వనంతో ప్రకాశించే యమ్మెస్ వేదిక మీద కూర్చున్నప్పుడు బహుశా యస్.డి. సుబ్బులక్ష్మి, షణ్ముగవడివు కొంత ఆందోళనకు గురై ఉంటారు. కానీ ఈ యువ గాయకురాలు ఏమీ ఆందోళన పడలేదు. కచేరీ జరిగినంతసేపూ, ఆమె చాలా సహజంగా ఎప్పుడూ ఉండేలా, విశ్వాసంతో, హాయిగా పాడుతూ పోయింది. తర్వాత జరిగినది మాత్రం తంజావూరు – కుంభకోణం ప్రజలలో ఎన్నడూ కనీవినీ ఎరుగనిది. శ్రోతలలో వున్న సభ్యులు తాము కచ్చితంగా ఉంటామనే సంగతిని మర్చిపోయి కరతాళ ధ్వనులు చేశారు. ఆ ఉత్సాహం ఎంత గొప్పగా ఉందంటే నిర్వాహకులు యమ్మెస్ కచేరీ మళ్ళీ యింకొకసారి ఏర్పాటు చేయాల్సిందనే ఒత్తిడికి లొంగక తప్పలేదు. ఈసారి, ఈ కొత్త గాయనికి అందరూ వచ్చి వినే మంచి సమయాన్ని కేటాయించారు. మొదటిరోజు కచేరీకి రావటానికి శ్రద్ధ చూపెట్టని సుబ్రహ్మణ్యం ఈసారి శ్రోతలలో తానుంటానని హామీ యిచ్చాడు. మధురై నుండి వచ్చిన ఈ యువతి కంఠస్వర మాధుర్యానికి, అందానికి ఆత్మవిశ్వాసానికి, ఆయన ముగ్ధుడయ్యాడు. ఆయనలోని సినీ నిర్మాతకు ఆమె ఒక "డిస్కవరి".

మహామహమ్ విజయం అలాంటి విజయాల పరంపరకు దారితీసి షణ్ముగవడివు కన్న ఏ ప్రియమైన కలలోకన్నా యమ్మెస్‌ను ఉన్నత శిఖరాలకు చేర్చింది. తంజావూరు – కుంభకోణం సంగీత విద్వాంసులు స్పందించిన అత్యుత్సాహపు తీరు మద్రాసు సంగీత వ్యవస్థలో తక్షణ ప్రభావాన్ని చూపింది. ఆ సంగీతాధిపతులు ఇంకెంత మాత్రమూ ఈ కొత్త ప్రతిభకు తమ కళ్ళు మూసుకోలేరు. చెవులు మూసుకోలేరు. ఆ వ్యవస్థలో బాగా సనాతనవాదులు స్త్రీలకు గుర్తింపు యివ్వాలనే ఆలోచననే దగ్గరకు రానివ్వరు. కానీ ఆనందపు వెల్లువలా ముంచెత్తే స్పందనలు కుంభకోణం నుంచే కాక మధురై నుంచీ, రామనాథపురం నుంచీ, మైసూరు, ట్రావన్కూర్‌ల నుంచి కూడా రావటంతో యమ్మెస్‌ని ఆహ్వానించాలనే చారిత్రాత్మక నిర్ణయాన్ని మద్రాసు మ్యూజిక్ అకాడమి తీసుకుంది. ఆ

సంవత్సరం (1932) ఆ అకాడమీ సభలు ఉడ్‌లాండ్ హోటల్ మైదానంలో ఒక షామియానా కింద జరిగాయి. ఆ వేదికమీద షణ్ముగవడివు తంబూరా వాయిస్తూ పక్కనే ఉండగా యమ్మెస్, మద్రాసు మ్యూజిక్ అకాడమి అధికారిక ముద్రతో కచేరీ చేసిన మొదటి మహిళ అయింది. ఒక పాతతరపు రసికుని మాటలను ఉటంకిస్తూ హిందూ దినపత్రికలో (29 జులై 1987) గౌరీ జయరామన్ ఇలా రాసింది: "ఆ అమ్మాయి ఒత్తయిన, నొక్కుల జుట్టుతో అతి సాధారణ వస్త్రధారణతో ఉంది. కానీ ఆమె పాడినప్పుడు అందరూ మంత్ర ముగ్ధులయ్యారు. టైగర్ వరదాచారి, ముత్తయ్య భాగవతార్ లాంటి పెద్దలు శ్రోతలలో ఉన్నారు. అలాగే చెంబై వైద్యనాధ భాగవతార్ మనస్ఫూర్తిగా, పెద్ద స్వరంతో అభినందిస్తుంటే పక్కనవాళ్ళు 'నిశ్శబ్దంగా ఉండమనాల్సి వచ్చింది. కరైకుడి సాంబశివ అయ్యర్ యమ్మెస్‌తో "బిడ్డా! నీ గొంతులో వీణను మోస్తున్నావమ్మా" అని చెప్పాడు.

❖ ❖ ❖ ❖

కుంభకోణం మహామహంలో సాధించిన ప్రశంసల తర్వాత వెంటనే మద్రాసు మ్యూజిక్ అకాడమీ సర్టిఫికెట్ కూడా దొరకటమంటే పదిహేడేళ్ళ వయసులోనే యమ్మెస్ సంగీతాకాశంలో నక్షత్రమై మెరిసింది. ఒక్క సంవత్సరంలో ఆమె సాధించిన రెండు విజయాల చారిత్రక ప్రాధాన్యం ఆమెకు సరిగా తెలియను కూడా తెలియదు. ఆ దశలో ఉన్నత అభిరుచులు నాజూకైన పోకడలు తెలియని అమ్మాయి. సంగీతం తప్ప యింక దేనిమీదా ఆసక్తిలేదు. తన చిన్న కుటుంబం లోపల సంతోషంగా ఇమిడిపోతున్నది. అన్ని నిర్ణయాలూ తల్లికే వదిలేస్తున్నది. తారాపథానికి ఎగిసిపోవటంతో ఆమెకు కుటుంబ పోషకురాలిగా కొత్త పాత్ర కూడా వచ్చింది. షణ్ముగవడివుకు తన ఆశలు, ఆలోచనలు తన కళ్ళముందే నిజమవుతున్నాయి. కుటుంబానికి దీర్ఘకాలిక భద్రత, సంఘంలో గుర్తింపు అనే ఆమె ప్రియమైన కలలు చివరకు ఒక స్పష్టమైన రూపాన్ని తీసుకున్నాయి. ఈ కొత్త పరిస్థితికి మొదటి స్పందనగా ఆమె మద్రాసులో ఒక ఇల్లు అద్దెకు తీసుకుని తన కుటుంబానికి అక్కడొక పునాది వేసింది. దానివల్ల యమ్మెస్ ముందుకి రానున్న మరిన్ని అవకాశాలను అన్వేషించే వీలుంటుందనుకుంది.

పరశువాకంలో ఒక ఇల్లు చూసింది. పరశువాకం అనేకమంది కళాకారులు అభిమానించే నివాస ప్రాంతం. ఆ ఇల్లు ఎగ్మూరులోని వీణ ధనమ్మ ఇంటికి ఎంతో దూరంలో లేదు. షణ్ముగవడివు దాని గురించి ఎక్కువ సంతోషపడింది. తన కాలంలో వీణా వాదనలో ప్రవీణురాలిగా, కేవలం ప్రతిభవల్లనే గుర్తింపబడిన మొదటి స్త్రీగా, తన హక్కుల కోసం నిలబడిన బలమైన వ్యక్తిత్వంగల దానిగా ధనమ్మ సాధించిన విజయాల మీద షణ్ముగవడివుకెంతో గౌరవం, ఆ కుటుంబం పరుశువాకంలో ఉండటంవల్ల వచ్చిన అమూల్యమైన బహుమతి ఏమిటంటే, షణ్ముగవడివు, పిల్లలకు ధనమ్మ మనవరాళ్ళ

దగ్గరి స్నేహితులయ్యారు. షణ్ముగవడివులా కాకుండా ధనంది చాలా పెద్ద కుటుంబం. షణ్ముగవడివు నాలుగు తరాల వంశవృక్షం రికార్డయితే ధనంది ఏడుతరాల వంశవృక్షం ఉంది. ధనం అమ్మమ్మకు అమ్మమ్మ అయిన పాపమ్మాళ్ తంజావూరు ఆస్థాన సంగీత, నృత్య విద్వాంసురాలు. అమ్మమ్మ కామాక్షి శ్యామశాస్త్రి శిష్యురాలు. ధనంకు నలుగురు పిల్లలు. అందరూ గాయకులే. అందులో ఒక కూతురైన జయమ్మాళ్ ఐదుగురు కూతుర్లలో బాలసరస్వతి ఒకతి. ఇంకో కూతురు కామాక్షికి ఆరుగురు పిల్లలు. వారిలో బృంద, ముక్త, ప్రసిద్ధ గాయకులు. ధనమ్మ కుటుంబానికున్న పాటలు నిధి సంపదల పేటికలా విలువైనది. అంత ప్రతిభ గలిగిన గాయకుల, నర్తకులతో పరిచయం, స్నేహం యమ్మెస్‌కి కొత్త అనుభవం. వారి సాన్నిహిత్యంతో ఆమె ఎంతో ఆనందాన్ని పొందింది. బృంద, ముక్త, బాలసరస్వతి జీవితాంతం ఆమె స్నేహితులుగా ఉన్నారు. యమ్మెస్ బాలసరస్వతి కంటే రెండేళ్ళు పెద్దది. కానీ వాళ్ళిద్దరూ ప్రత్యేకంగా దగ్గరయ్యారు. బహుశ విరుద్ధమైన వారి వ్యక్తిత్వాలు పరస్పర పూరకాలుగా ఉన్నాయేమో. ఒకరేమో మృదుస్వభావియైన గాయని, అర్పణలో సాఫల్యాన్ని పొందిన వ్యక్తి. ఎప్పుడూ ఇంకొకరిని పల్లెత్తుమాట అనని మనిషి, ఇంకొకరు గట్టి వ్యక్తిత్వం గత నర్తకి, మూర్ఖులవల్ల బాధలు పడటాన్ని తిరస్కరించే, అహంకారులు తమ ఆధిపత్య ధోరణులతో, ప్రవర్తనలతో తప్పించుకుపోదామని చూస్తే సహించని తత్త్వం గల వ్యక్తి.

పరశువాకంలో కళలతో చైతన్యవంతమైన జీవనసరళి, మంచి స్నేహితులు ఒక వ్యక్తిగా యమ్మెస్ ఎంతో భిన్న ప్రపంచాన్ని చూసింది. ఆమె తన సిగ్గరితనాన్ని, మొహ మాటాన్ని వదిలివేసి, పెద్దగా నవ్వటం, స్నేహితులతో సరదాగా గడపటం, తాను ఆనందంగా ఉండటం మొదలుపెట్టింది. ఆ వయసు ప్రభావం కూడా కాదనలేనిది. తన కిశోరదశలోంచి యవ్వనవతి అయిన స్త్రీగా మారింది, కొంత కీర్తి కూడా వచ్చింది. దానివల్ల మద్రాసు మహానగరంలో అనేక రకాల మనుషులను ఆకర్షిస్తోంది. పత్రికలు సహజంగానే ఆమె పట్ల ఆసక్తి కలిగింది. ముఖ్యంగా అప్పటి ప్రముఖ పత్రిక ఆనంద వికటన్‌కు యమ్మెస్ అంటే ఆసక్తి కలిగింది. ఆమెను ప్రజల దృష్టికి తీసుకురావాలనే ఆ తమిళ పత్రిక ఆలోచన పూర్తిగా అనూహ్యమైన పరిణామాలకు దారితీసింది. ఆమె జీవితాన్ని మార్చివేసింది. ఆమె వ్యక్తిత్వాన్ని, కెరియర్‌నూ మార్చివేసింది. ఒక అల్లకల్లోమైన దశలో ప్రవేశించి, దాని తర్వాత మధురైని, తన కుటుంబాన్ని వదిలివేసి ఒక కొత్త వ్యక్తితో కొత్త జీవితంలోకి ప్రవేశించింది.

# 5. నళిన లోచన

*నళిన లోచన నిను గాక అన్యుల నమ్మి*
*నర జన్మ మీడేరునా*

*కొంగవంటి ధ్యానము జేసితే తన*
*కోరిక కొన-సాగునా*
*దొంగ మగని భక్తి మీర నమ్మితే మంచి*
*త్రోవ జూప నేర్చునా*
*గంగలోని యోడను నమ్మి భవ*
*సాగరము దాట వచ్చునా*
*నంగ నాచుల శరణమనుట చేత*
*అనంగుడు జ్ఞానోపదేశము జేసునా (నళిన)*

సుబ్బులక్ష్మి జీవితంలోకి త్యాగరాజ సదాశివన్ 1936వ సంవత్సరం జూన్ నెలలో ప్రవేశించాడు. అప్పుడాయనకు ముప్పై నాలుగేళ్ళు నిండుతున్నాయి. ఆమెకు ఇరవై యేళ్ళు నిండుతున్నాయి. నాలుగేళ్ళు విపరీతమైన గందరగోళాల మధ్య గడిచాయి – తీవ్రమైన ఆగ్రహ తిరస్కారాలతో నిందారోపణలతో, మద్రాసు, మధురైల మధ్య బాధాకరమైన తగవులతో, పుకార్లతో పోలీసు కేసులతో సహా అన్ని రకాల ఉద్రిక్తతలతో ఆ సంవత్సరాలు నిండిపోయాయి. తర్వాత 1940లో వాళ్ళు వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత యాభై ఏడు సంవత్సరాలపాటు, 1997లో 99 ఏళ్ళ వయసులో సదాశివం మరణించేంతవరకూ వాళ్ళు ఆనందంగా జీవించారు. మరే దంపతులూ చేయనంతగా సదాశివం, యమ్మెస్‌లు ఒకరి జీవితాన్ని ఒకరు పరిపూర్ణం చేసుకున్నారు. ఏ భర్తా సదాశివంవలె తన భార్య జీవితపు భవిష్యద్దర్శనం చేసి, తానాశించిన ఫలితం వచ్చేలా సంగీతభరితంచేసి, తన అధీనంలో ఉంచుకోలేదు. సదాశివం యమ్మెస్ జీవితాన్ని మార్చివేసినట్లుగా ఏ పురుషుడూ ఏ స్త్రీ జీవితాన్నీ మార్చివేయలేదు. సదాశివం లేకపోతే, యమ్మెస్ సమూహంలోని ఒక ముఖం, అనేక గొప్ప కంఠస్వరాలలో ఒక గొప్ప కంఠస్వరం. అతనితో కలిసి, ఆమె "సంగీత సామ్రాజ్ఞి" అని జవహర్‌లాల్ నెహ్రూ చేత బిరుదును పొందింది. యమ్మెస్ శ్రుతి సుభగ మధుర సంగీతాన్ని సృష్టిస్తే సదాశివం యమ్మెస్‌ను సృష్టించాడు. సంగీతం యమ్మెస్ వృత్తి అయితే యమ్మెస్ సదాశివం వృత్తి అయింది. సదాశివం, యమ్మెస్‌ల వలే ఏ భార్యా భర్తలు ఒకరికొకరు రుణపడి ఉండలేదు.

ఆ మాటకొస్తే ఒకరి నుండి మరొకరు ఇంత భిన్నంగా ఉండే మరొక ఇద్దరు కూడా లేరు. సదాశివం మనిషి రూపంలో ఉన్న కార్యాచరణ. యమ్మెస్‌ది జరిగేదేదో

జరగనిమ్మనే నిదానత్వపు అవతారం. సదాశివం నిండా ఆధిపత్యమే, నాయకత్వమే. యమ్మెస్ అంతా అణిగి ఉండి, అర్పించుకుని, రక్షణలో ఉండే స్వభావమే. సదాశివం లౌకికుడు. అన్ని వ్యూహాలను, సవాళ్ళకు, అవకాశాలకు సజీవంగా స్పందించే పురుషుడు. యమ్మెస్ దట్టమైన వనాలలో విహరించే అమాయిక. తనచుట్టూ ఉన్న నీడలను కూడా చూడలేని బేల. సదాశివానికి తనకేం కావాలో, దానినెలా సాధించుకోవాలో క్షుణ్ణంగా తెలుసు. యమ్మెస్‌కు సంగీతం, దానికి సంబంధించిన విషయాలు, దాని నుంచి జనించే సంగతులు తప్ప మరింక ఏ విషయం గురించీ ఏమీ తెలియదు. సదాశివం నిత్యం ఏదో సాధించే పనిలో నిమగ్నుడు. యమ్మెస్ నిత్య సంతృప్త జీవి. సదాశివం చాలా శక్తివంతమైన పట్టుదల, కోరిక కలవాడు. తన ఆకాంక్షలకు అనుగుణంగా ఇతరులను ఒంచగలవాడు. యమ్మెస్ చాలా అరుదుగా తన ఆకాంక్షలను చెబుతుంది. ఒంగివుండటాన్ని ఆనందిస్తుంది. సదాశివం కోపం చాలా భీకరం. యమ్మెస్‌కి తన నిగ్రహాన్ని కోల్పోయి కోపం తెచ్చుకోవటం తెలియదు. సదాశివం ఆజ్ఞలు, ఆదేశాలు జారీచేసే నాయకుడు. యమ్మెస్ మూర్తీభవించిన విధేయత. విరుద్ధ ధృవాలు ఎలా ఆకర్షించుకుంటాయో తెలియజేస్తూ ఈ జంట ఒకరి కొకరు వింతైన పూరకాలుగా ఉన్నారు.

1902, సెప్టెంబర్ నాలుగున జన్మించిన సదాశివం ధృవ నక్షత్రంగా వెలిగి అదృష్టాన్ని వెంటబెట్టుకు వచ్చాడు. అతని తల్లిదండ్రులు తిరుచురాపల్లి జిల్లాలో లాల్‌గుడి దగ్గరి గ్రామమైన మనక్కల్ గ్రామవాసులు. ఐతే సదాశివం మద్రాసులో ట్రిప్లికేన్ ప్రాంతంలో మక్కా మదీనా అనే పేరున్న అద్దె ఇంట్లో పుట్టాడు. మైలాపూరు శైవులుండే ప్రాంతమైతే ట్రిప్లికేను వైష్ణవులెక్కువగా ఉండే ప్రదేశం. అక్కడ ముస్లింలు కూడా ఎక్కువ సంఖ్యలోనే ఉంటారు. ఆ రోజుల్లో భిన్న కమ్యూనిటీలకు చెందిన ప్రజలు సామరస్యంతో బతికేవారు. సదాశివం తండ్రి త్యాగరాజయ్యర్, తల్లి మంగళాంబ త్యాగరాజయ్యర్‌కు రెండవ భార్య. ఆమె కన్న పదహారుమంది సంతానంలో సదాశివం ఒకడు. మొదటి భార్యకు మరో ఇద్దరు పిల్లలున్నారు. సదాశివం తర్వాతి రోజుల్లో చెప్పినట్లు ఒకే కప్పుకింద వారంతా పెరుగుతుంటే అది "పెళ్ళివారిల్లు"లా ఉండేది. సదాశివానికి ఎనభై ఏళ్ళ వయసువచ్చేసరికి తోడబుట్టిన వాళ్ళంతా చనిపోయారు. దాన్ని తల్చుకుని "వాళ్ళాయుస్సు కూడా పోసుకుని నన్ను బతకమని వెళ్ళారు" అని దిగులుగా అనేవాడు. జీవితాంతం ఆయన చుట్టూ చిన్న పాటి సైనికదళాల్లా మేనళ్ళుళ్ళూ, మేనగోడళ్ళు, ఇంకా అన్నివైపుల బంధుగణాలు ఆయన అండన, నీడన బతికేవారు. చిన్నతనంలో వెళ్ళిన పాఠశాలల్లో కనీసపు కోర్సులు పూర్తి చేయలేనంత అశాంతిగా ఉండేవాడు. ఆ కాలంలో పైకెగసిన జాతీయోద్యమమూ, మహాత్మా గాంధీ నాయకత్వమూ ఈ బడినొదిలి వచ్చినవారి శక్తియుక్తులను నిర్మాణాత్మకమైన రీతిలో వినియోగించుకునే వాతావరణాన్ని సృష్టించాయి. కిశోరప్రాయంలోని సదాశివం రాజకీయా ల్లోకి దూకాడు. ఐతే ఖద్దరు ధరించి, ఖద్దరు అమ్మే గాంధేయవాదిగా మారటానికి ముందు

వేడిరక్తపు టెర్రరిస్టు దశ కూడా అతనికి అనుభవం ఉంది. అలాంటి హెచ్చుతగ్గుల ఉద్రేకాలు అతనెలాంటి మనిషి కాబోతున్నాడో ఆ స్వభావానికి సరిగా సరిపోయాయి – సంప్రదాయ పద్ధతులపట్ల గొప్ప అసహనం, ఉద్రేకాలకు లోనయ్యే గుణం, తన లక్ష్యాలను తన పద్ధతిలో సాధించగలననే ఆత్మవిశ్వాసం యివన్నీ కలగలిసిన వ్యక్తి. టెర్రరిజం ముద్ర అతని నిర్భయత్వాన్ని చాటితే, జీవితాంతం గాంధేయవాదిగా మిగలటం అతనిలో జాతీయ వాదిని ఎత్తి చూపుతుంది. ఈ దేశభక్తి స్వభావం, తను ఆరాధించటానికి నాయకులుండటాన్ని ఇష్టపడుతూనే, ఆ రంగాలలో తన ఇష్టప్రకారం వ్యవహరించేందుకు నిర్ణయించుకుంటాడని తెలుస్తోంది.

❖ ❖ ❖ ❖

అతను పాఠశాలను మధ్యలోనే వదిలేసి వచ్చినా తిరుచిరాపల్లిలో విద్యార్థి ఉద్యమ కార్యకర్త అయ్యాడు. దేశసేవ అనే కాల్పనిక భావనతో రగిలిపోయాడు. అతని మహోద్రేకం ఇతరులపై ప్రభావాన్ని చూపింది. ఊరేగింపులలో నాయకుడిగా ముందుండి, సుబ్రహ్మణ్య భారతి రాసిన దేశభక్తి గీతాలను పాడుతూ, కాంగ్రెసు జండాలను ఎత్తుగా పట్టుకుని ప్రాధాన్యత సంపాదించాడు. ఆ కాలంవాళ్ళు, సదాశివం తెలిసినవాళ్ళు తమ జ్ఞాపకాలను చెబుతూ సదాశివం వ్యక్తిత్వంతో, పాడే పాటలతో ఉద్రిక్తులై విద్యార్థి సమూహాలు, యువ న్యాయవాదులు కాంగ్రెస్‌లో చేరేందుకు ఆకర్షితులయ్యేవారు. పోలీసులను తప్పించు కునేందుకు రాత్రిళ్ళు నేషనల్ కాలెజి వసతిగృహంలో ఆశ్రయం తీసుకునేవాడు. ఆ రోజుల్లో చట్టాన్ని అమలు చేసే అధికారులు, కాలేజీల ఆవరణలలో, వసతి గృహాలపై దాడులు చేయకూడదనే నియమాన్ని గౌరవించేవారు.

పోలీసులను తప్పించుకోవటం ఉత్సాహంగానే ఉంటుంది గానీ, ప్రత్యక్ష చర్య ఏదైనా చెయ్యాలని ఉవ్విళ్ళూరుతున్న ఒక యువ కాల్పనికవాదికి అది చాలదు. త్వరలోనే సదాశివంకు తన జీవితంలో తొలి 'హీరో'ని అతని అజ్ఞాత చర్యలకు ప్రేరణను కనుగొన్నాడు. ఈ ప్రేరణ సుబ్రహ్మణ్య శివ రూపంలో వచ్చింది. అతను సుబ్రహ్మణ్య భారతి వంటి జాతీయ నాయకుల సహచరుడు. రహస్య విప్లవ పద్ధతులు నేర్పమనీ, అవి నేర్చుకుని ఒక ఇంగ్లీషువాడి మీద బాంబువేసి ఆ హీరోయిక్ చర్యతో ఉరికంబం ఎక్కుతాననీ అడిగాడు. ఈ గురుశిష్యుల మధ్యనున్న స్నేహసహచరత్వం సిద్ధాంతపరమైన దానికంటే ఎక్కువగా భౌతిక ప్రభావాలున్నదయింది. శివకు అప్పటికే కుష్టువ్యాధి ముదిరిపోయింది. సదాశివం ఆరునెలలు అతనితోపాటే ఉండి అమిత శ్రద్ధతో శుశ్రూష చేశాడు. టెర్రరిస్టు కావాలనే సదాశివం కోరకలు తీరకుండానే ముగిసిపోయాయి. శివని చివరకు బ్రిటీష్ పోలీసులు అరెస్టుచేసి దేశద్రోహం కేసు విధించి జైల్లో కఠోర పరిస్థితులలో ఉంచారు. కుష్టువ్యాధి బాధను జైలు వాతావరణంలో భరించలేని శివ జైలు నుంచి విడుదలవటానికి క్షమాభిక్ష

కోరాడు. ఈ పిరికితనపు చర్య సహజంగానే శిష్యుడిని షాక్ చేసి ఉంటుంది. మరితనేమో అచ్చంగా దేశభక్తి నిండిన రక్తంతో ఉరికంబం ఎక్కాలని కలలు కన్నాడయ్యే. శివ తన ధ్యేయం కోసం జైల్లోనే బాధలుపడి మరణించే సాహసం చూపించాలని సదాశివం అను కున్నాడు. ఆ నిరాశ నిస్పృహలలో అతను గాంధీవైపు, అహింసవైపు మళ్ళాడు. కానీ జీవితమంతా ఎక్కడ కుష్టువ్యాధి సోకిన మనిషిని చూసినా చాలా చలించిపోయి జేబులో ఉన్న డబ్బంతా ఇచ్చేసేవాడు.

శివ అతనిని నిరాశపరచిన సంఘటన 1920లో సదాశివం 18వ ఏట జరిగింది. ఆ సంవత్సరం మద్రాసు ప్రావిన్సులోని అగ్రశ్రేణి నాయకుడైన సి. రాజగోపాలాచారి, కాంగ్రెస్ ప్రారంభించాలని యోచిస్తున్న సహాయ నిరాకరణోద్యమంలో చేరవలసిందిగా వలంటీర్లుగా రావలసిందిగా పిలుపునిచ్చాడు. ఇది దేశమంతటినీ ఉద్దేశించి గాంధీ ఇచ్చిన సత్యాగ్రహపు పిలుపు. సదాశివం చాలా ఉత్సాహ ఉద్రేకాలతో ఉద్విగ్నుడయ్యాడు. అందులో చేరిన మొదటి వ్యక్తులలో అతనొకడు. పదిహేను నెలల కఠిన కారాగారశిక్ష అనుభవించాడు. ఇస్తే సంపూర్ణంగా యివ్వాలి, లేకపోతే అసలు లేదు అనే ధోరణితో అతను కాంగ్రెస్ కార్యక్రమాలలో మునిగిపోయాడు. దానివల్ల అతను రాజగోపాలాచారి దృష్టినాకర్షించాడు. 1923లో మళ్ళీ అరెస్టయ్యి సంవత్సరం జైలులో గడిపాడు. జైల్లో అతనున్న సెల్‌లో మరొక కాంగ్రెస్ కార్యకర్త, రాజగోపాలాచారి శిష్యుడు ఉన్నాడు. అతని పేరు ఆర్. కృష్ణ మూర్తి, తర్వాతి రోజులలో కల్కి కృష్ణమూర్తిగా ప్రసిద్ధికెక్కాడు.

❖ ❖ ❖ ❖

మరింకేదీ కలపనంతగా జైలు మనుషుల మధ్య అనుబంధాన్ని కలుపుతుంది. తిరుచి జైలులో సదాశివం, కృష్ణమూర్తి, (1899–1954) స్నేహ బీజాలను నాటుకున్నారు. అది మొలకెత్తి ఎంతో ఎంతో కాలం జీవించాయి. వాళ్ళ అనుబంధంలో ఆటుపోట్లు కొన్ని వచ్చి వుండవచ్చు, కృష్ణమూర్తి జీవితపు చివరి సంవత్సరంలో, ఆ ఇద్దరు స్నేహితులూ దాదాపు వేరు మార్గాలలో విడిపోయారనవచ్చు. కానీ గురువులైన రాజగోపాలాచారి వంటి వారు జోక్యం చేసుకుని, కృష్ణమూర్తి కుమారునికి, సదాశివం కూతురితో వివాహం కుదిర్చి స్నేహాన్ని పునరుద్ధదించారు. వీళ్ళిద్దరి రాజకీయపరమైన, వృత్తిపరమైన ఎదుగుదల చాలా దగ్గరగా ఒకదానితో ఒకటి పెనవేసుకుని వుంది. అనేక సంవత్సరాలు వారిద్దరూ ప్రచురణ కర్తలుగా కలిసి పనిచేశారు. కృష్ణమూర్తి రాజకీయ వ్యక్తిగత విశ్వాసాలు ఇతరులకు వేగంగా అంటుకుంటాయి. కృష్ణమూర్తి తనను తాను పూర్తిగా రాజకీయాలకు అంకితం చేసుకున్నాడని సదాశివం గమనించాడు. కొన్నిసార్లు సాహిత్య చర్చలలో పాల్గొంటూ, కొన్నిసార్లు ఆయన వ్యక్తిగత సేవకుడిగా, నాయకుడు ప్రమాణాలు చేస్తున్నప్పుడు ఆయన సామాన్లు మోస్తూ పూర్తిగా రాజగోపాలాచారి మనిషయ్యాడు. ఒక నాయకుడిగా, దార్శనికుడుగా, సాహితీ మూర్తిగా, స్నేహితుడిగా రాజగోపాలాచారి ఎంత గొప్ప మనిషో కృష్ణమూర్తి వివరించి

చెప్పినప్పుడు సదాశివమ్ తన జీవితానికొక కొత్త హీరోని కనుగొన్నాడు.

కానీ రాజాజీ మనుషుల గురించి లోతుగా విచారించటంలో, సాంఘిక సంప్రదాయ పరత్వంలో కచ్చితమైన ప్రమాణాలు పాటించేవాడు. ఎవరైనా తన ఆంతరంగికుల సమావేశం లోకి రావాలంటే, ముందు ఆ వ్యక్తి పుట్టుపూర్వోత్తరాలను, ఆ కుటుంబానికున్న సాంఘిక సంబంధాలను ధృవపరచుకుని గాని రానిచ్చేవాడు కాదు. ఆయనకు సదాశివం తండ్రి త్యాగరాజయ్యర్ గురించి తెలియదు. సదాశివాన్ని ఆమోదించలంటే ఇంకొక వ్యక్తి ద్వారా ఇతని గురించి తెలుసుకోవాలి. ఐతే తొందరలోనే ఒక లింకు దొరికింది. అది నమ్మదగినదే. రాజాజీ బెంగళూరులోని సెంట్రల్ కాలేజీ హైస్కూల్‌లో చదివాడు. ఆ స్కూలు హెడ్‌మాస్టరైన ఎ. మృత్యుంజయన్ మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో చదివి గణితశాస్త్రంలో స్వర్ణపతకం పొందాడు. ఆ ప్రధానోపాధ్యాయుడంటే విద్యార్థులకు విపరీతమైన ఆరాధన. ఆయనకింకా పాతికేళ్ళు దాటలేదు. గొప్ప మేధావి. మృత్యుంజయన్ సదాశివంకు బాబాయి అవుతాడు. అది చాలు రాజాజీ సదాశివమ్‌ను తన మనిషి అనుకోవటానికి. అప్పటినుంచీ సదాశివం రాజాజీని అన్ని విషయాలలోనూ తన జీవితానికి లంగరుగా, గురువుగా, తీర్పరిగా భావించే వాడు. వీరిద్దరి సంబంధం దక్షిణ భారత చరిత్రలో గుర్తింపదగిన అధ్యాయాల్లో ఒకటిగా అభివృద్ధి చెందింది. రాజాజీ సదాశివంను తన దత్తపుత్రుడిగా చూసేవాడు.

కృష్ణమూర్తి, సదాశివంలిద్దరూ రాజాజీతో కలిసి తమ భవిష్యత్తులోకి ప్రయాణం చేశారు. తమ గురువు పిలిస్తే చాలు పలికేవారు. ఆయన కోరికలు వారికి ఆజ్ఞలు. రాజాజీ కృష్ణమూర్తిని తన పక్కనే ఉంచుకునేవాడు. వాళ్ళిద్దరి మేధోపరమైన సాహిత్యపరమైన అభిరుచులు ఒకటిగా ఉండేవి. సదాశివంలో ఆయన ఒక నిపుణుడైన అమ్మకందారుణ్ణి, ప్రచారకుడిని చూశాడు. ఆ రోజుల్లో చేతితో ఒడికిన ఖద్దరును కాంగ్రెస్ వాళ్ళు స్వాతంత్ర్య సాధనంగా ప్రచారం చేసేవారు. కాంగ్రెస్ పార్టీ తరఫున యువకుడైన సదాశివంకు ఖద్దరును ప్రచారంచేసి అమ్మే పనిని అప్పగించారు.

అతను ఆ పనిలోకి తనకలవాటైన అత్యుత్సాహంతో దూకేశాడు. దేశభక్తి గీతాలు పాడుతూ, ఖద్దరు ప్రచారం చేస్తూ, సుబ్రహ్మణ్య భారతి పాటలను తన అభిమాన గీతాలుగా ఎంచుకుని పాడుతూ కాంగ్రెస్ సమావేశాల్లో సదాశివం కనిపించేవాడు. తను ప్రచారం చేస్తున్న ఖద్దరు గురించి అన్ని విషయాలూ వివరంగా తెలుసుకోటానికి తిరువూరులోని ఖద్దరు ఉత్పత్తి కేంద్రంలో తగినంత సమయం గడిపేవాడు. ట్రిప్లికేన్‌లో ఖద్దరు దుకాణంలో అప్రెంటీస్‌గా చేరి తన ఉపాయాలతో సంచలనం సృష్టించాడు. ఆ దుకాణంలో అమ్మకాని కున్న వాటిలో ఒక అపురూపమైన చీరె ఉండేది. అదెంత నాజూకుగా ఉండేదంటే దానిని ఉంగరం లోపల నుంచి లాగి తీయవచ్చు. దాని ఖరీదు 300 రూపాయలు, బాగా సంపన్నులు మాత్రమే కొనగలరు. ఒకసారి ఉత్తర భారతదేశపు రాజకుమారుడు దుకాణానికి

రావటం చూశాడు సదాశివం. వెంటనే చాలా హడావుడి పనిలో మునిగాడు. అతను దుకాణంలో సరుకులుంచే గదిలోకి వెళ్ళి ఆ చీరెను తీసుకుని మళ్ళీ వచ్చాడు. ఆ రాజ కుమారుడితో అలాంటి చీరెకొనే అవకాశం జీవితంలో ఒకే ఒకసారి వస్తుందని ఒప్పించాడు. రాజకుమారుడు ఆ చీరెకొని దానిపై రాసివున్న 800 రూపాయల ఖరీదును చెల్లించాడు. జరిగిందేమిటంటే సరుకుల గదిలోకి వెళ్ళిన సదాశివం 3 అంకెను 8 లాగా దిద్దివేశాడు.

ఆ రోజుల్లో కూడా కాంగ్రెస్ శ్రేణుల్లో ఇంత గొప్ప నైపుణ్యానికి తగిన గుర్తింపు ఉండేది. సదాశివంను బెంగళూరులోని ఖాదీ వస్త్రాలయానికి మానేజరుగా పంపించారు. అది అఖిల భారత నేత సంఘం నడిపే ప్రధాన విక్రయ కేంద్రంగా ఉండేది. అక్కడ గడిపిన ఐదు సంవత్సరాల గురించి సదాశివమ్ ఇలా వర్ణించాడు "నా విశ్వవిద్యాలయపు విద్య, స్వచ్ఛమైనది, నిరాడంబరమైనది". ఆ దుకాణం కొద్ది సంవత్సరాలలో భారత దేశానికి దారిచూపే దీపాలు కాబోతున్న జాతీయవాదులూ, కాంగ్రెస్ వారు సమావేశమయ్యే స్థలంగా పరిచితమైన ప్రదేశమయింది. ఆ దగ్గరలోని నందిహిల్స్‌కి గాంధీ మహాత్ముడు విశ్రాంతి కోసం వచ్చినప్పుడు రాజాజీచేత నియోగించబడిన సదాశివం గాంధీకి సహాయకుడిగా ఉన్నాడు. ఉన్నతస్థానాలలో ఉన్నవారితో సంబంధాలు పెట్టుకోగల తన సహజ చాతుర్యంతో సదాశివమ్ తన బెంగళూరు ఉద్యోగాన్ని భవిష్యత్తుకు అమూల్యమైన పెట్టుబడిగా మార్చుకున్నాడు.

సదాశివం బెంగళూరులో తన నిజమైన వృత్తిలో స్థిరపడుతున్నానని అనుకుంటు న్నప్పుడే కృష్ణమూర్తి తన వృత్తిని కనుగొన్నాడు. నెమ్మదస్తుడైన ఈ మనిషి రాజకీయాలకు పనికివచ్చేవాడు కాదు. అతను ప్రధానంగా రచయిత. అతను తన జీవితాశయాన్ని నెర వేర్చుకోవటం మొదలుపెట్టింది, ఆయన కీర్తి వేగంగా వ్యాపించింది తమిళ పత్రిక అయిన "ఆనంద వికటన్"తో. ఆయన ఆ పత్రిక పేరునీ తన పేరునీ, తమిళులు నివసించే ప్రతి చోటా ఇంటింటా వినిపించే పేర్లుగా చేశాడు. కొన్ని సంవత్సరాల తర్వాత ఆ పత్రిక నుండి విడిపోయి, సదాశివం, సుబ్బులక్ష్మి, రాజాజీల చురుకైన భాగస్వామ్యంతో కొత్త పత్రికను "కల్కి" అనే పేరుతో ప్రారంభించాడు. ఆనందవికటన్‌లో మరపురాని రచనలు చేసినప్పుడు అతని కలం పేరు "కల్కి".

తమిళ ప్రచురణ రంగంలో ఆనంద వికటన్ ఒక అసాధారణ ఘటన. బుధూర్ విశ్వనాథ అయ్యర్ అనే వ్యక్తి హాస్యప్రియుడు స్థాపించిన ఈ మాసపత్రిక రెండు సంవత్సరాల పాటు కష్టపడి నిలదొక్కుకుంది. 1928లో ప్రకటనల సేల్స్‌మన్ అయిన యస్.యస్. వాసన్ దానిని కొని, కొత్తపుంతలు తొక్కే రీతిలో ప్రచారం చేశాడు. లాటరీ బహుమతులు, పద పూరణాలు వంటి వాటితో ప్రజలకు చేరువ చేశాడు. అతని దగ్గర ఇద్దరు ఉద్యోగులు, ఎడిటర్‌గా కృష్ణమూర్తి, ప్రచార నిర్వాహకుడిగా సదాశివం చేరేనాటికే వాసన్ గురించి, అతని పత్రిక గురించి ప్రజలు చెప్పుకుంటున్నారు. వాళ్ళిద్దరూ కలిసి ఆ పత్రికను ఒక

అద్భుత విజయంగా చేసేశారు. సకల విద్యాపారంగతుడైన కృష్ణమూర్తి రాజకీయ వ్యాఖ్యానాల నుండి, సాహిత్యం గురించిన పాండిత్య అధ్యయనాల వరకూ, సినిమా కబుర్ల నుంచి, పరిశోధనాత్మక సాంఘిక నవలల వరకూ అన్నీ రాసేవాడు. “కల్వనిన్ కథాళి” “త్యాగభూమి” వంటి గొప్ప సీరియల్ నవలలతో ఆయన సాహిత్యాన్ని జర్నలిజంగా, జర్నలిజాన్ని సాహిత్యంగా అందించేవాడు. తమిళ ప్రచురణ రంగంలో ఆయన కళ నైపుణ్యాలు పని తనమూ పూర్తిగా కొత్తవి. ఆనంద వికటన్ ఒక “ఐకాన్” అయింది.

ఆశ్చర్యంగా ఉండొచ్చుగానీ కేవలం ధైర్య సాహసాలతో మేనేజర్ సదాశివం సంపాదకుడైన కృష్ణమూర్తిని మించిపోయాడు. ప్రచుణ రంగంలో ఏమాత్రం అనుభవం లేకుండా, పొంగిపొర్లుతున్న ఆత్మ విశ్వాసమే తన వ్యాపారపు మదుపుగా, సదాశివం ఉద్యోగం కోసం వాసన్ దగ్గరకు వెళ్ళడం. తన స్నేహితుడు వాసన్ దగ్గర చేరటమే కారణం. వాసన్ ఉదారంగా నెలకు 75 రూపాయల జీతంతో మూడు నెలలపాటు అప్రెంటీస్‌గా ఉద్యోగం ఇస్తానన్నాడు. దానికి ప్రతిగా సదాశివం మరొక ప్రతిపాదన చేశాడు. నెలకు 150 రూ॥ చొప్పున ఒక్క నెల ఇచ్చి, అతని పనితీరుని అంచనావేసి అప్పుడు మళ్ళీ ఆ నిర్ణయాన్ని సమీక్షించుకోమన్నాడు. ఈ ప్రతిపాదనవల్ల తనకు 75 రూపాయలు మిగులుతాయని అనుకుని వాసన్ అంగీకరించాడు. దానివల్ల వాసన్ ఆదాయం విపరీతంగా పెరిగింది. తర్వాత ఆసక్తిగా వినేవారి కోసం సదాశివం చెప్పే లెక్కల ప్రకారం, ఆనంద వికటన్‌కు ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయాన్ని సదాశివం ఒక ఏడాదిలో 6,000 నుంచి రూ. 72,000కు పెంచాడు.

తను అవలంబించిన పన్నుగడల గురించిన కథలను ప్రచారం చేయటమంటే సదాశివంకు ఇష్టం. ఒకరి నోటి నుండి మరొకరి నోటికి చేరేసరికి కథలకు మారిపోయే లక్షణం ఉంటుంది. సదాశివం గురించిన కథలు భిన్న కాలాలలో విభిన్న రీతులలో వినిపించేవి. ఉంగరంలో నుంచి దూరిపోగల చీరె అమ్మకం గురించి కావచ్చు; పాష్మినా శాలువా గురించి మరొకటి కావచ్చు. కొందరు ఆయన నెలకు 150 అడిగాడని చెప్పుకుంటే మరికొందరు రెండు నెలలకు నూటయాభై అడిగాడని చెప్పుకుంటారు. తర్వాత సంవత్స రాలలో, తన గురించి యమ్మెస్ గురించి ఏ సమాచారం కావాలన్నా తను తప్ప మరింకే ఆధారమూ లేదని గ్రహించాక, ఆ దంపతులు గురించి ఎన్నో కథలు సమకాలీన సాహిత్యంలో నిండిపోయాయి. ఈ కథలలో విసుగుపుట్టించేంతగా మళ్ళీ మళ్ళీ అవే సంగతులుంటాయి. కానీ ఇంటర్వ్యూ చేసేవారికి మరో గత్యంతరం లేదు. ఇంకెక్కడా ఏ సమాచారమూ దొరకదు. ఆ విధంగా ఖద్దరు అమ్మే రోజులలో నందీహిల్స్‌లో మహాత్మాగాంధీని కలవటం ఒక పెద్ద కథ అయితే, ఆనంద వికటన్‌లోని వైభవపు రోజుల్లో లండన్ ‘టైమ్స్’లో ఆనంద వికటన్‌కు పూర్తి పేజీ ప్రకటన సంపాదించటం మరొకటి. దీనిని చూసి మద్రాసు

లోని మీడియా వర్గాలు, వాసన్‌తో సహా అదిరిపడ్డారు. కానీ త్వరలోనే సదాశివం కార్య దక్షతతో, నిర్వహణతో చేసిన విజయవంతమైన 'కూప్'కి సంబంధించిన ఆధారాలు దొరికాయి. ఇంగ్లండులోని భారతీయ కంపెనీల బ్రిటీష్ నిర్వహణాధికారులు ఎక్కడో దూరాన ఉన్న మద్రాసు నుంచి వచ్చిన ఈ 'నూతన ఘన నామం' గల పత్రికను గుర్తించి, ఆనంద వికటన్ పట్ల శ్రద్ధపెట్టమని ఇండియాలోని స్థానిక మేనేజర్లకు ఆదేశాలు పంపారు. మొత్తం విషయ సారాంశమేమిటంటే సదాశివం పెద్ద ఆలోచనలు చేస్తాడు. పెద్ద ఆచరణలకే పూనుకుంటాడు. చిన్న విషయాలకు అతని జీవితంలో చోటే లేదు. తమిళ భాషలో ప్రకటనా రంగపు మౌలిక సూత్రాలను ఆయన ఎలా విప్లవీకరించాడో చెప్పే కథ, సదాశివం సహజ ప్రతిభను, ధైర్యాన్ని తెలియజేస్తుంది. అప్పటివరకూ ఒక వస్తువు గుణగణాలను గొప్పగా చెప్పాలంటే వ్యాపార ప్రకటనలలో గాలి నింపిన వాగాడంబర పాఠాలు నిడివిగలవిగా రాసేవారు. సదాశివం ప్రకటనలు చిన్న ఆకర్షణీయ వాక్యాలుంటే చాలని ఒప్పించాడు. ఒంటి సబ్బులకు హాలివుడ్ తారల పేర్లతో ఎందుకు అమ్మాలని ప్రశ్నించాడు. వెంటనే భారతీయ సినిమా తారలు ఆ సబ్బుల ప్రకటనలపై కనిపించసాగారు.

నిజం చెప్పాలంటే సదాశివం 'ఆనంద వికటన్' ఊపిరిగా బతికాడు. దానికి అశేష ప్రజాదరణ, లాభాలు సంపాదించటానికి పనిచేస్తున్నప్పుడు ఆయన ప్రాణమంతా దానిలో పెట్టాడు. పదవి చూస్తే ప్రకటనల మేనేజరే గానీ, ఆ పత్రికలో తనకిష్టం వచ్చిన అన్ని విభాగాలలోనూ ప్రవేశించాడు. సంపాదకుడు స్నేహితుడు కావటం వల్ల మరింత ప్రేరణ దొరికింది. రచయితగా కృష్ణమూర్తికున్న మార్కెట్ విలువను సదాశివం అతి త్వరలో గ్రహించాడు. ఆ వనరుని డబ్బు చేసుకోవటానికి సర్వశక్తులతో బయల్దేరాడు. ఆనంద వికటన్‌ని పైకి తీసుకురావటమంటే, కృష్ణమూర్తిని పైకి తీసుకురావటమేననీ, రెండూ ఒకటేనని అనుకున్నాడు. అందులో సినిమా, కలలు అంటే అతనికి ప్రత్యేకమైన ఆసక్తి. సంపాదకుడుగా తనలాగే ఆలోచిస్తాడు. చూస్తుండగానే, శాస్త్రీయ, ప్రజా కళాకారుల గురించిన వ్యాసాలను, చిత్రాలను, ప్రత్యేక కథనాలను ఆనంద వికటన్ క్రమం తప్పకుండా తన శీర్షికలలో భాగం చేసుకుంది. సంపాదక సంబంధ విషయాలలో, ప్రకటనల సహకారంతో సదాశివం తప్పకుండా కావలసినన్ని సమకూర్చేవాడు.

❖ ❖ ❖ ❖

తన పత్రిక పేజీలలో కనిపించేందుకు ప్రముఖ వ్యక్తుల కోసం, విశేష సందర్భాల కోసం, కొత్త పద్ధతుల కోసం ఎప్పుడూ వెతుకుతుండే సదాశివం అప్పుడే ఉదయిస్తున్న సంగీత తార యమ్మెస్ సుబ్బులక్ష్మి మీద దృష్టిసారించాడు. నిజానికి ఆమె ఉదయిస్తున్న తార కాదు – కుంభకోణం మహామహం, మద్రాస్ మ్యూజిక్ అకాడమీల ప్రథమ కచేరీల తర్వాత ఆమె "ఉదయించిన తార" ఆ సమయంలో సుబ్బులక్ష్మి తల్లితో కలిసి పరశు

వాకంలో ఒక చిన్న ఇంట్లో ఉంటోంది. కచేరీ అవకాశాల కోసం ఎదురుచూస్తోంది. ఆయన తన సహజమైన అలవాటు ప్రకారం తన కథనానికి సంపాదకీయ కార్యకలాపాలు, మార్కెటింగ్ పనులు తనే వ్యక్తిగతంగా చూడాలని నిర్ణయించుకున్నాడు. ఇద్దరు అసిస్టెంట్లను తన ఆదేశాల ప్రకారం చిన్న చిన్న పనులు చూడమని నియమించాడు గానీ వివరాలన్నీ తనంతట తానే సేకరించాడు. చేయవలసిన మొదటిపని సుబ్బులక్ష్మితో సంభాషించటం, అది సదాశివం తనంతట తానే చేయాలని అనుకున్నాడు.

కొన్ని ఆధారాల ప్రకారం, తర్వాత జరిగిన పరిణామాల ప్రకారం సుబ్బులక్ష్మిని కలిసిన మొదటిసారే అతను పడిపోయాడు. దానికతన్ని నిందించలేం కూడా. ఇరవైయేళ్ళ అందమైన యువతిలా వికసించింది. ఆమె పరిపూర్ణ యవ్వనాన్ని అతిశయింపజేసే కాంతి వంతమైన కళ్ళు, నల్లగా ఒత్తుగా మెరిసే జుట్టు. ఆమె సాధారణతను, సామాన్యతను, పక్కకు నెట్టేసే మూర్తిమత్వం అది. ఆమె చుట్టూ రక్షణ వలయంగా ఆవరించి వున్న అమాయకత్వంతో నిజానికి ఆమె సౌందర్యం రెట్టింపయింది. సదాశివం మూర్తిమత్వం కూడా అధికారాన్ని ప్రకటించే దర్పంతో కూడినది. ఆయన పొడగరి. వెడల్పాటి భుజాలు, యవ్వనంలో అసాధారణ సౌందర్యవంతుడిగా ఉండేవాడు. ఆయన రూపాన్ని అందగించే గుణాలు అతనిలో కూడా ఉన్నాయి. ఉదాహరణకు అతను ప్రకటించే ఆత్మవిశ్వాసపు ధోరణి. ఆయన చేయలేని పని, చేయించలేని పని ఏదీ ఉండదని తాను నమ్మి ఇతరులను నమ్మించేవాడు. బహుశా ఒక అనుభవజ్ఞుడైన పెద్దాయన, ఆధారపడగలిగిన వ్యక్తి అవసరం ఉందనే భావం అజ్ఞాతంగా సుబ్బులక్ష్మి లోలోపల ఉందేమో. మార్గదర్శి అవసరం ఉందని చూడగానే తెలిసిపోయే ఒక లేత మొగ్గను కనపడగానే సదాశివంలో సహజమైన కార్య దక్షతా గుణం చురుగ్గా పనిచేసి ఉంటుంది.

దీని అర్థం వాళ్ళిద్దరూ కూచుని వాళ్ళ పరస్పర అవసరాలను, సహజ గుణాలనూ సమీక్షించుకున్నారనీ, విశ్లేషించుకున్నారనీ కాదు. మొట్టమొదట చూడగానే ఆ సన్నివేశం ఒక అందమైన పురుషుడు సౌందర్యవతియైన యువతి ఒకరిపట్ల ఒకరు శ్రద్ధాసక్తులు చూపటమే చిత్రీకరిస్తుంది. కానీ ఎక్కడో ఏదో జరిగింది. ఆ ప్రకటనల మేనేజర్ ఆ ఒక్క ఇంటర్వ్యూతో ఆగలేదు. ఆనంద వికటన్‌లో ప్రత్యేక కథనానికి మరిన్ని మెరుగైన అంశాలు రాబట్టటం కోసం మరికొన్ని ఇంటర్వ్యూలు జరిగాయి. ఇంటర్వ్యూలు పూర్తయ్యాయి. ప్రత్యేక కథనాన్ని ప్రచురించారు. కానీ వాళ్ళిద్దరి సమావేశాలు కొనసాగాయి. త్వరలోనే సదాశివం ఆ ఇంటికి రోజూ వచ్చే అతిథి అయ్యాడు. ఏదో ఒక కారణంతో ఆమెతో కాలం గడుపుతున్నాడు. ఆమె కోసం చిన్న చిన్న పనులు చేసిపెట్టేవాడు, ఆమె ప్రోగ్రాంలు ఏర్పాటు చేసేవాడు, అన్ని ఏర్పాట్లు చేసేవాడు. ఇతర వ్యక్తుల గురించి విషయాల గురించి తన అభిప్రాయాలు ఆమెకు చెప్పేవాడు. స్పష్టంగా అతనొక శ్రద్ధ, బాధ్యతగల వరుడయ్యాడు.

ఇదేదో మామూలు వ్యవహారం కాదనే విషయం త్వరలోనే షణ్ముగవడివు కనిపెట్టింది. ఆమె తల్లి హృదయం ప్రమాదాన్ని పసిగట్టింది. సదాశివం స్వభావం గురించి ఆమెకు తెలిసినంతలో అతడు కుటుంబం మీద చెడు ప్రభావం చూపుతాడనే నిర్ణయానికి వచ్చింది. ఆమె తన కూతుర్ని ఎంతో శ్రద్ధగా, పద్ధతిగా, ఓపికగా పెంచుకుంటూ వస్తున్నది. చిన్న తనంలోనే గ్రామఫోను రికార్డు ఇప్పించింది. మహామహంలో విజయం సాధించేలా చేసింది. మద్రాసు మ్యూజిక్ అకాడమీ సింహాసనం తిరుగులేకుండా కైవశమయింది. ఇక మిగిలింది ఆ అమ్మాయికి పెళ్ళి సంబంధం చూడటమే. అప్పుడామె తారగా వెలిగే తన కూతురు కల్పించే ఆశ్రయంలో విశ్రాంతిగా ఆనందంగా బతకొచ్చు. ఇప్పుడీయన తమ మధ్యలో దూరి, తమ వ్యవహారాల్లో జోక్యం చేసుకుని తన కుమార్తెను వలలో వేసుకుని, అతని అధీనంలోకి తీసుకుంటే తన కలలన్నీ చిన్నాభిన్నమైపోతాయి. తనకు సాధ్యమైనంత త్వరగా షణ్ముగవడివు మద్రాసు నివాసాన్ని వదిలి మదురైకి వెళ్ళిపడింది. తనతోపాటు సుబ్బులక్ష్మినీ లాక్కెళ్ళింది. అమ్మకే అన్నీ బాగా తెలుసునని తన కూతురికి చూపించదలుచు కుంది. ఇప్పుడామె ముందున్న అతి ప్రధానమైన విషయం, సుబ్బులక్ష్మికి తగినవాడు, తమ కుటుంబానికి సరైనవాడు అయిన ఒక భర్తను వెతకటం.

షణ్ముగవడివు ప్రపంచంలో అన్ని విషయాలూ ముందే నిర్ణయించబడి ఉంటాయి. అన్ని గీతలూ స్పష్టంగా గీసే ఉంటాయి. మనకు బాగా పరిచయమైనదేదో అదే మంచిది. సంపన్నుడైన భర్తే ఒక తల్లి తన కూతురికి బాగా ఆలోచించి ఇచ్చే కానుక. షణ్ముగవడివు ఉద్దేశంలో, సదాశివంకు కారు ఉన్నప్పటికీ అతను ధనవంతుడు కాదు. పెద్ద పెద్ద మాటలు మాట్లాడతాడు గానీ ఎవరి దగ్గరో పనిచేసే ఉద్యోగే. తన కూతురు మంచి గాయకురాలిగా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకుంటూ, అందగత్తె అయినప్పుడు ఈ సామాన్య వ్యక్తితో ఎందుకు స్థిరపడాలి. వేలమందికి ఉద్యోగాలిచ్చే మిల్లు యజమాని బదులు, వేల ఎకరాల భూమి గలిగిన జమీందారు బదులు ఈ సదాశివంతో ఎందుకుండాలి? ఒకసారి ఆమె తన కూతురి కోసం అందమైన రాజకుమారుడిని చూసింది. అప్పుడా కూతురు తలపొగరుతో తల్లి మాట పెడచెవిన బెట్టింది. అప్పుడా పిల్ల మంచీ చెడూ తెలుసుకోలేనంత చిన్నది. ఇప్పటి పరిస్థితులు వేరు, ఇప్పుడు సుబ్బులక్ష్మి మద్రాసు మహా ప్రపంచాన్నీ, అక్కడ పొంచివున్న ప్రమాదాలనూ స్వయంగా చూసి తెలుసుకుంది. ఈసారి తన సలహా తప్పకుండా వినేందుకు తయారుగా ఉంది. షణ్ముగవడివు కూతురిని పైకి తెచ్చేందుకు ఎంతో శ్రమదమాదులకు ఓర్చుకుంది. కాబట్టి తల్లి తనకు ఉత్తమమైనదేదో అదే ఆలోచిస్తుందని సుబ్బులక్ష్మి తెలుసుకుని ఉంటుంది. షణ్ముగవడివు జీవితం సంక్లిష్టతలు లేని సాదాసీదా జీవితం. అందువల్ల ఒక ధనికుడైన చెట్టియార్‌ని వెతకటానికి ఆమెకు ఎక్కువ సమయం పట్టలేదు. తన కూతురుకది తగిన సంబంధమనుకుంది. ఇంకా ఆలస్యం చేయకుండా అతనితో కలిసుండమని తల్లి సుబ్బులక్ష్మిని అడిగింది.

తనమీద పెరిగిపోతున్న ఈ ఒత్తిడిని సుబ్బులక్ష్మి ఎలా ఎదుర్కోవాలి? ఏం చెయ్యాలి? ఆమెకు తెలిసిన ఆధిపత్యం తల్లి మాత్రమే. అంతేగాకుండా ఈ ఇరవై ఏళ్ళ జీవితాన్నీ ఆమె షణ్ముగవడివు ఆలోచనల ననుసరించే గడిపింది. బైటి అభిప్రాయాల కోసం చూసే ప్రశ్న అంతవరకూ ఎదురు కాలేదు. అలాగే ఆమె వెళ్ళటానికి గురువులు గానీ స్నేహితులు గానీ లేరు. అంతేగాక షణ్ముగవడివు అడిగినదానిలో వింతేమీ లేదు. అది సాధారణ విషయమే. షణ్ముగవడివు ప్రపంచంలో బాగా కోరదగిన పురుషులు నట్టుకోట్టై చెట్టియార్లు. పెద్ద వ్యాపారస్తులు విలాసవంతమైన జీవితం గడిపేవారు. ఒక తల్లి ఏం చెయ్యాలని ఆశిస్తారో ఆ పనే తన తల్లి చేస్తున్నదని సుబ్బులక్ష్మికి తెలుసు. ఆ పని చాలా బాగా చేస్తున్నది. ఏ కారణాన్ని బట్టి చూసినా అన్నీ తల్లికి అనుకూలంగా ఉన్నాయి. కానీ సుబ్బులక్ష్మి మనసంతా వ్యతిరేకంగా ఉంది. చివరికి మనసు హేతువుని జయించింది.

❖ ❖ ❖ ❖

తన తల్లి చేసిన ఈ చొరవకు సుబ్బులక్ష్మి ఎలా సమాధానం ఇచ్చిందనేదాన్ని గురించి భిన్న కథనాలు ప్రచారంలో ఉన్నాయి. మద్రాసులో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కుటుంబంలో ప్రసిద్ధి చెందిన సి.పి. శేషాద్రి చెప్పిన కథనాన్ని ఆధారపడదగినదని అనుకో వచ్చు. మద్రాసు సాంఘిక, రాజకీయ శ్రేణులలో జరిగే విశేషాలన్నీ శేషాద్రికి తెలుస్తూ ఉంటాయి. ఆ నాటకీయ ఘటనలలో భాగస్వాములైన వారందరూ ఆయనకు వ్యక్తిగతంగా తెలుసు. అతను పుకార్ల జోలికి పోయేవాడు కాదు. ఈ రచయితకు ఈ కథను స్వయంగా చెప్పినప్పుడు ఆయనకు ఎనభైఏళ్ళ వయసు. ఆయన ప్రకారం, ఆ చెట్టియార్‌తో కలిసి ఉండటం తనకు ఇష్టంలేదని సుబ్బులక్ష్మి తల్లితో చెప్పింది. తల్లి ఇంకేదైనా చేసే అవకాశం యివ్వకుండా వెంటనే, సుబ్బులక్ష్మి తన నగలన్నీ తీసేసి, ఒక రాత్రివేళ ఇంటి నుంచి బైటపడి, మద్రాసు వెళ్ళే రైలు ఎక్కేసింది. ఆ నగరంలో ఆమెకు నమ్మదగిన వ్యక్తులు ఇద్దరు తెలుసు. ఒకరు ఖద్దరు ప్రచారకుడిగా వున్న కాంగ్రెస్‌కు చెందిన జాతీయవాది. ఇంకొకరు సదాశివం. రైల్వేస్టేషన్ నుండి జట్కా తీసుకుని టి.నగర్‌లో ఉన్న ఖద్దరు ప్రచారకుని ఇంటికి వెళ్ళింది. ఆయన ఆ నగరంలో ప్రముఖుడు, గతంలో ఆమె కచేరీలు ఏర్పాటు చేయటంలో సహాయపడ్డాడు. సుబ్బులక్ష్మి తన గేటు ముందు జట్కా దిగటం చూసి ఆయన ఆశ్చర్యపోయాడు. ఇక తాను తల్లి దగ్గరకు తిరిగి వెళ్ళనని సుబ్బులక్ష్మి చెప్పటంతో మరింత ఆశ్చర్యపోయాడు. ఆమె తన రక్షణ కోరుతూ వచ్చిందని తెలుసుకుని మరింత నిశ్చేష్టుడయ్యాడు. హఠాత్తుగా ఒక యువతి ఇంటిముందు ప్రత్యక్షమై రక్షణ కల్పించమని కోరితే, ఆ విషయాన్ని భార్యకు వివరించటం ఇబ్బందిగా ఉండటంలో అసహజమేమీ లేదు. అతను త్వరగా ఆలోచించాడు. అతను కూడా అదే జట్కా ఎక్కి సుబ్బులక్ష్మిని ట్రిప్లికేన్‌లో ఉన్న సదాశివం ఇంటికి తీసుకెళ్ళాడు. సదాశివం అవసరంలో ఉన్న ఎవరికైనా ఒక మిషనరీ వలే సహాయపడే స్వభావం. వెంటనే సుబ్బులక్ష్మిని తన

అండన చేర్చుకున్నాడు. వాస్తవానికి మదురై నుంచి వచ్చిన ఆ శరణార్థి సదాశివం ఇంట్లో నివసించటం మొదలుపెట్టింది. ఆ రకమైన వ్యవహారాలు అనుకోని చిక్కు సమస్యలను, పుకార్లను, విషాదాన్ని తెచ్చిపెడతాయి. ఎందుకంటే సుబ్బులక్ష్మి వచ్చిన రోజు సదాశివం ఇంట్లో ఎవరూ లేక ఖాళీగా ఉండటం తాత్కాలికమే. అతనికి వివాహమైంది. ఇద్దరు కుమార్తెలు. భార్య తండ్రిగారి ఇంటిదగ్గర ఉదయారపాలియంలో రెండవ ప్రసవాన్నించి కోలుకుంటూ ఉంది. కానీ యివేవి తన ఆశ్రయాన్ని కోరుతూ తన ఇంటికి వచ్చినవారికి ఆశ్రయం యివ్వటానికి సదాశివానికి అడ్డుగా నిలవవు. భయపెట్టవు. అందులోనూ ఆశ్రయం కోరిన వ్యక్తి కొన్ని నెలల క్రితం అతనినెంతో ఆకర్షించిన గాయక నక్షత్రమవటంతో, సహాయపడే సంకల్పానికి మరింత బలాన్ని చేకూర్చింది.

సదాశివంకు సహాయం చేయటమంటే మొత్తంగా ఆ బాధ్యతంతా మోసి సహాయ పడటమే. వెంటనే ఆయన సుబ్బులక్ష్మికి పని చూపించటానికి ప్రతి అవకాశాన్నీ పరిశీలిస్తూ ఆమెను కళాకారిణిగా పైకి తేవాలనుకున్నాడు. ఆనంద వికటన్‌లో సీరియల్‌గా వస్తున్న నవల గురించి వచ్చిన ప్రశ్నతో ఒక అసాధారణ అవకాశం సుబ్బులక్ష్మికి రావొచ్చునే ఆలోచన అతనికి తట్టింది. ఆ నవల పేరు సేవాసదనం. ఆ నవలకు సినిమా హక్కులు కొనాలనుకుంటున్న దర్శకుడు కె. సుబ్రహ్మణ్యం. సదాశివం చాలా సంతోషంగా బేర సారాలలో పాల్గొని దర్శకుడు సినిమా హక్కుల కోసం 4,000 రూపాయల భారీ మొత్తాన్నిచ్చేలా మాట్లాడాడు. ఆ తర్వాత సదాశివం దానికి సంబంధించిన ఇంకో ఆలోచనను సుబ్రహ్మణ్యంకు అమ్మాలనే దానిపైన దృష్టిపెట్టాడు. సినిమాలో కథానాయిక పాత్ర యమ్మెస్ సుబ్బులక్ష్మికి ఎందుకివ్వకూడదు? 1932లో కుంభకోణంలో జరిగిన మహామహంలో ఈ యువ గాయనిని చూసి సుబ్రహ్మణ్యం ముచ్చటపడ్డాడు. కానీ తెరమీద ఆ యువతి ఎలా కనిపిస్తుందో నటిస్తుందో అన్న విషయంలో ఆయనకంత నమ్మకంలేదు అని చెప్పాడు. సదాశివం యమ్మెస్ గురించి ఒత్తిడి చేస్తున్నకొద్దీ సుబ్రహ్మణ్యం మరింత బిగుసుకు పోతున్నాడు. ఇక చివరి సంప్రదింపులు జరిగినప్పుడు సుబ్రహ్మణ్యం సేవాసదనం చిత్ర నిర్మాణంలో ఎంతో కొంత డబ్బు సదాశివం పెట్టాలని అడిగాడు. సుబ్రహ్మణ్యం ఉద్దేశంలో సినిమా హక్కులు పొందే విషయంలో అతను ఎక్కువ డబ్బు నష్టపోతే యమ్మెస్‌ని తీసుకునే ఒప్పందంలో డబ్బు బాగా కలిసివస్తుందని.

సదాశివం ఫలితాన్ని పొందాలనుకున్నాడు గానీ సుబ్రహ్మణ్యం తనకు నష్టం కలిగించాడని అనుకోలేదు. నిజానికి, ఈ మొత్తం ఒప్పందాన్ని ఆయన రెండందాలా గెలుసుగానే భావించాడు. దీనివల్ల అతను యమ్మెస్‌కు మరింత దగ్గర కావొచ్చు. అలాగే యమ్మెస్‌ని ఈ సినిమారంగం మదురైలోని ఆమె కుటుంబాన్నించి మరింత దూరం చేస్తుంది.

కూతురు ఇల్లు వదలి వెళ్ళిపోయిందని తెలియగానే, ఆమె ఎక్కడికి వెళ్ళివుంటుందో షణ్ముగవడివు గ్రహించింది. తక్షణమే శక్తివేలుని మద్రాసు పంపింది. అతను సదాశివం

ఇంట్లో ఆమెను కనిపెట్టాడు. ద్వేషపూరితమైన ఘర్షణలు జరిగాయి. ఆ ఆనంద వికటన్ మనిషి ఆమెను నిలువునా దోచేస్తాడని, ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా అతన్ని, ఆమె జీవితంలోంచి కత్తిరించి పారెయ్యాలనీ శక్తివేలు చెల్లెలితో చెప్పి చెప్పి ఒప్పించాలని ప్రయత్నించాడు. ఇలాంటి ప్రయత్నాలు సదాశివానికి షణ్ముగవడివు మీద శక్తివేలుమీదా ఉన్న శత్రుభావం పెరగటానికి దోహదపడ్డాయి తప్పితే ఫలితం లేకపోయింది. ఇక షణ్ముగవడివు సంగతి చూస్తే, ఆమె సదాశివం అంటే విపరీతమైన అసహ్యాన్ని పెంచుకుంది. కూతురేమవుతుందోనన్న భయాన్ని పెంచుకుంది. ఆమెకు సినిమా ప్రపంచమంటే పడదు. సంగీత లవకుశ (1934) అనే సినిమాలో చాకలామెగా ఒక చిన్న పాత్రలో నటించినప్పటి నుంచీ మరింత కోపం. ఆ కొద్ది పరిచయంతోనే ఆమెకు సినిమా ప్రపంచం చెడ్డ మనుషులతో నిండిపోయిందనే విషయం తగినంతగా అర్థమైంది. ఇంకా ఘోరమేమిటంటే, సినిమా తన కూతురికున్న సంగీత ప్రావిణ్యాన్ని నాశనం చేస్తుందని నమ్మింది. కూతురు తన శాస్త్రీయ సంగీతంలో తనకున్న సదవకాశాలన్నిటినీ నాశనం చేసుకుని ఒక సాధారణ సినిమా గాయనిగా తన స్థాయిని తగ్గించుకుంటుందని షణ్ముగవడివు గట్టిగా నమ్మింది. కోపంతో, నిరాశా నిస్పృహలతో, ఆమె సదాశివం గట్టి పట్టునుంచీ, ప్రమాదాల కోరలు సాచే సినిమాల నుంచీ యమ్మెస్‌ను విడిపించే అవకాశాలన్నింటినీ వెతకసాగింది. తన కూతురు తిరిగి మధురై భద్ర వాతావరణంలోకి, తన చేతులలోకి రావాలని కోరుకుంది. షణ్ముగవడివు, సదాశివంల మధ్య జరిగే ఈ యుద్ధం కొంతకాలం కొనసాగింది.

ఈ మొత్తం నాటకీయ కథలో, అన్నిటికంటే మనకెక్కువ స్పష్టంగా కనిపించేదేమిటంటే, తన జీవితం ఎలా సాగాలి, ఎంత మెరుగ్గా గడవాలి అనేది నిర్ణయించుకోవటంలో – యమ్మెస్‌కు తనకేం కావాలో తనకు తెలుసు – కనీసం తనకేం అక్కర్లేదో తెలుసు. ఆమె మధురైని వదలటం, మద్రాసు రావటం, ఈ రెండు విషయాలూ ఆమెలోని అంతర్గత శక్తిని తెలియజేస్తున్నాయి. ఆ శక్తి ఆమెలో ఉందని కొద్దిమంది కూడా సందేహించలేదు. ఆ సమయంలో సదాశివం ప్రవర్తన ఎలా వుంటుందో కూడా యమ్మెస్‌కు తెలియదు. ఆయన ఊరికే ప్రగల్భాలు పలికేవాడేనా? లేక అతనిలో విషయమేమైనా ఉందా? ఆమె ప్రేమను పొందటానికి అతను చేసే ప్రయత్నాల గాఢతవల్ల ఆమె ఒక సమయంలో పొంగిపోయింది, కలవరపడింది. అతను చాలా గట్టి అనే విషయమూ స్పష్టమైంది. అసాధ్యుడనీ తెలిసింది. ఒకరి అంచనా ప్రకారం "సదాశివం తనను స్వంతం చేసుకోవాలని చూస్తున్నప్పుడు సుబ్బులక్ష్మి ఆ సంబంధం నుంచి వెనక్కు మళ్ళాలని కూడా అనుకుంది" ఇంకోవైపు ఆమెకున్న ప్రత్యామ్నాయం ఏమిటి? మెట్టుమెట్టుగా తన కెరియర్‌ని నిర్మించటంలో తల్లి ఎంత ఓపికగా సహాయపడిందో దానిని ఎంతో అభిమానంగా తలుచుకుంటూనే, తనను సంపన్న పోషకుల దయాదాక్షిణ్యాల భద్రతను కల్పించాలనుకున్న

షణ్ముగవడివు ఆలోచన నుండి తన సహజ ప్రేరణతో స్వతఃసిద్ధ ప్రేరణతో వెనక్కు తిరిగింది. దానికంటే యింకేదైనా ఫరవాలేదనుకుంది.

ఆ ఉద్రిక్త సమస్యా సమయంలో ఆమె జీవితంలో సదాశివం ఉండటమనేది నిస్సందేహంగా వాళ్ళిద్దరి మధ్యా ఒక అనుబంధం కలగటానికి దారితీసింది. ఇతరుల సమస్యలు పరిష్కరించటంలో అతను మేటి. యమ్మెస్ ఏ విషయాలమధ్య ఊగిసలాడు తున్నదో అర్థంచేసుకున్నాడు. అప్పుడే మొలకెత్తిన సంగీత వృత్తి మాత్రమే ఆమె చేతిలో ఉన్న ఆస్తి. ఆమెనింత మంచి స్థితిలోకి తీసుకువచ్చిందేమో తల్లి. యమ్మెస్‌కు లౌకికమైన విషయాలలో ఏమాత్రం అనుభవం లేకపోవటంతో తనంతతాను ముందుకు పోలేదనీ అతనికి తెలుసు. వాళ్ళిద్దరికీ ఉన్న ఒకే దారి – షణ్ముగవడివు స్థానాన్ని సదాశివం తీసుకోవాలి. ఎంతో ఆస్వాదిస్తూ ఆ పాత్ర తను తీసుకున్నాడు. అంత ప్రపంచజ్ఞానం ఉన్న మనిషి ఆసరా దొరికినందుకు యమ్మెస్ కూడా నెమ్మదిని పొందింది.

❖ ❖ ❖ ❖

ఇంతలో 'సేవాసదనం' సినిమా మొదలైంది. యమ్మెస్ అందులో నడిస్తున్నదనే వార్తలు సినిమా పత్రికలలో వస్తున్నాయి. ఇక షణ్ముగవడివు, శక్తివేలు ఎలాగోలా యమ్మెస్‌ను తమకు పన్నాగంలాగా కనిపిస్తున్న ఆ బోను నుంచి బైటికి వచ్చేలా ఒప్పించాలనే ఆశతో తరచు మద్రాసు వస్తున్నారు. వచ్చినప్పుడల్లా పరస్పర ద్వేషాలు పెరుగుతున్నాయి. సంపాదన మీద ఆశ తప్ప వాళ్ళను కదలించేది కుటుంబ సంబంధమైన ప్రేమ కాదని సదాశివం నమ్ముతున్నాడు. యమ్మెస్ సినిమాతార కాబోతోంది, కాబట్టి ఆమె కుటుంబానికి ఆమె తేలికగా డబ్బు సంపాదించే వనరుగా చూస్తున్నారని అతని ఉద్దేశం. ఎప్పటికంటే ఎక్కువగా ఆ "మదురై ముఠా"ని యమ్మెస్ నుంచి దూరంగాపెట్టి ఆమెను కాపాడాలని నిర్ణయించు కున్నాడు. అతను దర్శకుడైన కె. సుబ్రహ్మణ్యం, మరికొందరు స్నేహితులు "మద్రాసు ముఠా"గా చేరి యమ్మెస్‌ని రక్షించేందుకు కంకణం కట్టుకున్నారు.

ఈ ముఠాల మధ్య తగాదాలు వికృతంగా ఉండేవి. అలాంటి పరిస్థితులలో, ముఖ్యంగా సినిమావాళ్ళ జోక్యం ఉన్నప్పుడు, కథలు ఒకరి నుంచి మరొకరి దగ్గరకు ప్రయాణం చేసే క్రమంలో, వాటికి రంగులద్దటం, మసాలా చేర్చటం సాధారణమే. రెండు పక్షాలలో రౌడీలు హడావుడి చేస్తున్నారనీ, బ్లాక్‌మెయిల్ చెయ్యటం, కొట్టించటం వంటి దుర్మార్గపు ఎత్తుగడలు వేస్తున్నారని, చివరకు కిడ్నాపులకు, హత్యకు కూడా పాల్పడేలా ఉన్నారని పుకార్లు జోరందుకున్నాయి. దురదృష్టవశాత్తు వీటికెలాంటి సాక్ష్యాధారాలు లేవు. సాక్షులమనేవారి విశ్వసనీయత అంత గొప్పదేమీకాదు. ఒక సంగతి మాత్రం చెప్పుకోటానికి తగిన అర్హత కలిగి ఉంది. అది యస్.డి. సుబ్బులక్ష్మి చెప్పినది. షణ్ముగవడివు, కె. సుబ్రహ్మణ్యం యిద్దరికీ ఆమె తెలుసు. ఆ సంగతుల గురించి చెప్పటం వల్ల ఆమెకొచ్చే లాభం ఏమీలేదు.

ఏ ఒక్క పక్షాన్నీ సమర్థించకుండా ఆమె చెప్పే కథ 1930లలో మదురై ఫ్రాక్షన్ల స్వభావం మీద కొంత వెలుగుని ప్రసరిస్తుంది. యస్.డి. సుబ్బులక్ష్మి చెప్పినదాని ప్రకారం, ఒక సమయంలో మదురై గ్రూపు పట్టరాని ఆవేశంలో 'సేవాసదనం'లో సుబ్బులక్ష్మిని కనిపించనీయకుండా చేయాలనుకున్నారు. వాళ్ళు చిన్నపాటి దాడిచేసి, యమ్మెస్‌ని ఎత్తుకుపోయి, మద్రాసులోని తైనాంపేటలో ఒక ఇంట్లో బంధించారు. ఆ సినిమా యూనిట్‌లో కొందరి మీద హత్యానేరం మోపి కేసుపెట్టారు. ఈ గందరోళాన్నించి బైటపడటానికి సదాశివం, కె. సుబ్రహ్మణ్యం తమకున్న పరపతినంతా ఉపయోగించాల్సి వచ్చింది. బదులుగా "మద్రాసు ముఠా" షణ్ముగవడివు మీద కిడ్నాపు కేసు పెట్టింది. యమ్మెస్‌ని తైనాంపేటలోని బంధిఖానా నుంచి సురక్షితంగా తీసుకొచ్చి పరశువాకంలో ఒక భద్రమైన స్వర్గంలో ఉంచారు. తర్వాత అచ్చు సినిమా ఫక్కీలో హాస్యపు రిలీఫ్ విరామం వచ్చింది. సుబ్రహ్మణ్యం తన దగ్గర పనిచేసే నటులకు కొందరికి పోలీసుల్లా వేషాలు వేయించి, పరశువాకం ఇంటిముందు నిలబెట్టి, మళ్ళీ కిడ్నాపుకు తలపడేవాళ్ళను భయపెట్టే నాటకం ఆడాడు. ఈ దొంగ పోలీసులు, ఉత్తుత్తి తుపాకులు పట్టుకుని మరింత రక్షణ కల్పించారు. యమ్మెస్ మదురై ముఠా బందీగా ఉండటం కంటే మద్రాసు ముఠా బందీగా ఉండటానికి ఇష్టపడిందని మనం ఊహించవచ్చు.

ఎంత బాగా ప్రయత్నం చేసినా, యమ్మెస్‌ని వెనక్కు రప్పించలేకపోవటం మదురై ముఠాను దెబ్బతీసింది. తన కూతురి కోసం చేసిన యుద్ధంలో షణ్ముగవడివు ఓడిపోవటమే కాదు, తను బతకటానికి కూడా ఏ కారణము కనిపించని స్థితికి చేరింది. తను జీవితాంతం చేసి సాధించినదంతా బూడిదలో పోసిన పన్నీరయినట్లు భావించింది. ఒక కూతురు చని పోయింది. ఒక కూతురు తనను వద్దనుకుని తిరస్కరించింది. ఇక తనకు మదురైలో పూర్వీకుల నుండి సంక్రమించిన వరుస ఇళ్ళల్లోని ఒక ఇల్లు తప్ప మిగిలిందేమీ లేదు. మద్రాసు పోరాటాల దుమ్ము దులుపుకుని మధురై వచ్చి చేరేసరికి ఆమెకు చేసేందుకు పనిలేదు. ఎదురు చూసేందుకు ఏమీలేదు. జరిగినదంతా ప్రమాదకరమైన ఆక్రమణల పరంపర అని తెలుసుకుంది. పరాయి మనుష్యులు తన కూతురిని తీసుకెళ్ళిపోయారు; మదురైని మద్రాసు ఎత్తుకెళ్ళింది. ఇంకా విషాదం సంగీతాన్ని సినిమా ఆక్రమించింది. తన కూతురిని తననుంచి తీసుకుపోయినవాడి మీదే గాక, అన్ని కష్టాలకూ ఓర్చి తల్లి తనకెంత చేసిందో, అదంతా మర్చిపోయిన కూతురి మీద కూడా ఆమె తనలో కోపాన్ని, కసిని నింపుకుంది. షణ్ముగవడివుకు పొట్టలో కేన్సర్ వచ్చిందనుకున్నప్పుడు కూడా ఆమె చికిత్స కోసం మద్రాసు వెళ్ళటానికి నిరాకరించింది. ఆ నగరం ఆమెకు చిత్రహింసల జ్ఞాపకాలనే ఇచ్చింది. ఆమె హనుమంతరాయర్ కోవెల వీధిలో ఇంట్లో ఒంటరిగా బతకటానికి, ఒంటరిగా చావటానికే ఇష్టపడింది. ఆ ఇల్లు అద్భుతమైన జ్ఞాపకాల సంపదల నెలవు. అదే ఆమె లోకం ఆమె ఒక్కదానిదే.

# 6. సినిమా రంగంలో

*నాదుపై బలికేరు। నరులు – శ్రీరామ*
*వేద సన్నుత భవము । వేరు జేసితి ననుచు ॥*
*పంచశరజనక ప్ర। పంచమున గల సుఖము*
*మంచువలె ననుచు మది। నెంచితిని గాని*
*పంచుకొని ధనము లార్జించుకొని సరి యెవ్వ*
*రంచు మరిగతియులే। దంచు బల్కితినా? ॥*

సుబ్బులక్ష్మి కుటుంబాన్ని గురించి బాగా తెలిసినవాళ్ళు ఆమె మీద విసిరే విమర్శ నాస్త్రం ఒకటుంది. సుబ్బులక్ష్మి స్థిరపడి బాగున్న రోజుల్లో తల్లిని నిర్లక్ష్యం చేసిందనేది ఆ విమర్శ. దీనికి నిదర్శనాలు చూపమని అడక్కర్లేదు. నిస్సందేహంగా షణ్ముగవడివుని తన నిస్సహాయపు జీవితదశలో సుబ్బులక్ష్మి పట్టించుకోలేదంటే దానికి బలమైన కారణాలే ఉన్నాయి. కాని 1945వ సంవత్సరానికి ఆమెకు జాతీయస్థాయి హోదా వచ్చింది. తల్లి వైపు నుంచి ఎలాంటి ప్రమాదం వచ్చే అవకాశం బొత్తిగా లేదు. షణ్ముగవడివు మధురైలో ఏ లక్ష్యమూ లేని జీవితం గడుపుతోంది. ఆమె కూతుళ్ళ మీద పెట్టుకున్న ఆశలు, కోరికలూ చెల్లాచెదరయ్యాయి. ఆమె ఆరోగ్యం క్షీణిస్తోంది. యమ్మెస్ ఆమె మీద శ్రద్ధపెట్టి సహాయకులను నియమించవచ్చు. అలా చేయకపోవటానికి కారణం తల్లిమీద కోపాన్ని యింకా నిలుపు కోవటం కాదు. షణ్ముగవడివు తాను చేసిందేదో చేసింది. తన వర్గపు అనుభవంలో ఆ పని ఉత్తమమైనదని ఆమె అనుకోవటంవల్ల అట్లా చేసిందని యమ్మెస్‌కు తెలుసు. తన యిష్టప్రకారమైతే యమ్మెస్ తల్లితో తన సంబంధాలను క్రమంగా పునర్నిర్మించుకుని కొన సాగించేది. కానీ ఆమెకు ఆమె ఇష్టప్రకారం నడిచే అవకాశం లేదు. సదాశివంకు జవాబు దారీగా ఉండాలి. సదాశివం ఇష్టమే తన ఇష్టమని లోబడిపోవటంవల్ల తల్లి పట్ల బాధ్యత లేదనే విమర్శను ఆమోదించవలసి వచ్చింది. తర్వాతి కాలంలో సదాశివం వద్ద పనిచేసే ఉద్యోగుల జ్ఞాపకాల ప్రకారం, ఈ దంపతులు ఎప్పుడు మధురై వెళ్ళినా షణ్ముగవడివు దగ్గరకు వెళ్ళి కొంత సమయం గడిపేవారు. కానీ అది తల్లికి గానీ, ఆమె నెరిగినవారికి గానీ సరిపోలేదు.

తల్లిపట్ల తన బాధ్యతలు నెరవేర్చలేదనే ఆరోపణ సుబ్బులక్ష్మిని గుచ్చుకున్నది గానీ, షణ్ముగవడివు పన్నిన పథకంలో పడకుండా తనను రక్షించకోటానికి సుబ్బులక్ష్మి తీసుకున్న నిర్ణయాన్ని ఎవరూ తప్పుపట్టలేదు. తిరిగి ఇప్పుడు సమీక్షించుకుంటే సుబ్బు లక్ష్మికి తన దారిలో ఎదురైన అవకాశాలను అదృష్టాలను గుర్తించి, అందుకునే శక్తి,

తెలివితేటలు ఉండటం చాలా చెప్పుకోవలసిన విషయంగా కనిపిస్తుంది. సదాశివం అలాంటి ఒక అవకాశం ఇచ్చాడు. సినిమా మరొక అవకాశాన్ని ఇచ్చింది. ఈ రెండింటి గురించీ యమ్మెస్ గందరగోళపడింది, భయపడింది. కానీ బాగా ఆలోచించుకునే అడుగు వేసింది. 'సేవాసదనం' సినిమాలో తను కనిపించటం గురించి సదాశివం చెప్పినప్పుడు అది ఆమెకు నచ్చలేదు. సినిమా ఆమెకు పరాయి రంగం. సహజంగా ఆమె సిగ్గరి. ఎంతో మంది మగవాళ్ళు చూస్తుండగా కెమెరా ముందు నటించటం అనే ఆలోచనే భయాన్నీ, నిస్పృహను కలిగించింది. ఐనా ఆమె అంగీకరించింది. సదాశివం ఒత్తిడి చేయటం ఆమె నిర్ణయాన్ని ప్రభావితం చేసి ఉండవచ్చు. ఈ సినిమా అనే సాహసచర్యలో సదాశివం ప్రతిచోటా తన పక్కనే ఉంటాడని తెలియటంవల్ల కాస్త ఆమెకు ధైర్యం వచ్చి ఉండవచ్చు. కానీ దీనంతటికంటే, సినిమా తనను తల్లికి అందనంత దూరానికి తీసుకు వెళ్తుందనే సంగతి ఆమె అర్థంచేసుకుని ఉండాలి. సినిమా తళతళ మెరిసే ఒక కొత్త ప్రపంచానికి తలుపు తెరిస్తే, తల్లి దృష్టిలో ముందే నిర్ణయించిపెట్టిన అక్రమాలకు తలుపు మూసింది కూడా అదే సినిమా. దర్శకుడైన కె. సుబ్రహ్మణ్యం ఇచ్చిన అవకాశాన్ని అంగీక రించాలని నిర్ణయించుకున్నప్పుడు ఆమె మళ్ళీ వెనక్కు తీసుకోలేని ఒక అడుగు వేసింది.

అదృష్ట చక్రం యమ్మెస్‌కు అనుకూలంగా తిరుగుతోంది. 1936లో ఆమె తన మొదటి చిత్రంలో నటించి, దాదాపు ఒక దశాబ్దంపాటు సినిమారంగంలో మొదటి రెండు చిత్రాలైన 'సేవాసదనం', 'శకుంతలై' ఒక దశకు సబంధించినవి. ఈ దశలో ఆమె ప్రధానంగా శాస్త్రీయ సంగీత గాయకురాలిగా ఉంది. సదాశివం పక్కపక్కనే ఉంటూ ఆమెను నడిపిస్తున్నాడు. శకుంతలై పూర్తయిన తర్వాత ఆమె సదాశివంను వివాహం చేసుకుని, ఏ జీవితపు మౌలిక అంతరార్థం తనకే నచ్చలేదో ఆ జీవిత క్రమంలో స్థిరపడింది. మరొక రెండు సినిమాలలో నటిస్తోంది. 'సావిత్రి', 'మీరా' ఆ తర్వాత పునర్నిర్మించిన హిందీ మీరాలో నటించి సినిమా వృత్తిలో రెండవ దశను పూర్తిచేస్తోంది. ఈ రెండవ దశ మొదటి దానికంటే భిన్నమైంది. ఎందుకంటే ఇప్పుడు సదాశివం అన్ని కార్యకలాపాలకూ కేంద్రంగా ఉన్నాడు. అధికారికంగా, ఫార్మల్‌గా, వర్గీకరణపరంగా తన మనసులో స్పష్టంగా పెట్టుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు ప్రతి అడుగూ ఆచి తూచి వేస్తున్నాడు. నాలుగు సినిమాలు పూర్తయ్యాయి. (హిందీ మీరాను కూడా లెక్కలోకి తీసుకుంటే ఐదు) యమ్మెస్ సినిమాలకు వీడ్కోలు చెప్పబోతున్నది. ఎందుకంటే సదాశివం అట్లా నిర్ణయించాడు. ఆమె మిగిలిన జీవితమంతా గాయకురాలిగా – సాధువుగా మారబోతున్నది. ఎందుకంటే సదాశివం అట్లా నిర్ణయించాడు. ఈ క్రమంలో ఆమె కూడా ఒక కొత్త వ్యక్తిత్వాన్ని అలవర్చుకుని, షణ్ముగవడివు వారసత్వపు ఆనవాళ్ళనన్నింటిని వదలివేసింది. అది కూడా సదాశివమే ఆదేశించి నిర్దేశించాడు. నిర్వహించాడు.

మొదటి దశ యమ్మెస్‌కు, సదాశివంకు కూడా కష్టమే అయింది. యమ్మెస్ తెలియని ప్రాంతంలో దారి వెతుక్కుంటూ వుంది. సదాశివంకు పూర్తిగా ఆ రంగంలో పట్టు చిక్కలేదు. యమ్మెస్‌కు ఒకపక్క తనకు అలవాటులేని సినిమా పనిలోని ఒత్తిళ్ళతో సతమతమవుతుంటే, ఇంకోపక్క నుండి ఆమె జీవితాన్ని చిందర వందర చేయాలనే మధురై గ్రూపు పట్టువదలని ప్రయత్నాలు ఉన్నాయి. సదాశివం, సుబ్రహ్మణ్యం జాగ్రత్తగా కాపాడుతుంటే ఆమె షూటింగులలో పాల్గొన్నది. కెమెరా ముందు నిలబడి నటించటం ఆమె ఊహించినదాని కంటే విసుగ్గా ఉంది. ఆమె సహజ వ్యక్తీకరణ రూపం సంగీతం. మిగిలినవన్నీ ఆమెకు అసౌకర్యాన్ని కలగజేస్తాయి. ఇంతవరకూ ఆమె జీవితంలో ఏది నటించటానికి ఆమెకు ఆమెను తయారుచేయలేదు. తనను దగ్గరగా తెలిసినవాళ్ళ బృందంలో నటులెవరూ లేరు. మధురై నుండి తన తల్లికి స్నేహితురాలైన యస్.డి. సుబ్బులక్ష్మి ఒక్కతే ఆమెకు తెలిసిన సినిమాతార. యస్.డి., యమ్మెస్‌కు బలానీ, ప్రోత్సాహాన్నీ ఇచ్చే ఒకే ఒక ఆధారం. చాలా సంవత్సరాల తర్వాత యస్.డి. తన జ్ఞాపకాలను పంచుకుంటూ "యమ్మెస్‌కు తన నుంచీ, కె. సుబ్రహ్మణ్యం నుంచి నటనలలోని మౌలిక అంశాల గురించి నేర్చుకుని, శిక్షణ పొందటానికి చాలా కాలం పట్టిందని" చెప్పింది. నటన యమ్మెస్ ఎప్పుడూ సుఖంగా ఉండేది కాదు అని చెప్తూ యస్.డి. "మేకప్ వేసుకోవటం దగ్గర నుంచి, తన సంభాషణలు సరిగా ఉచ్చరిస్తున్నానా అనే అనుమానం వరకూ ప్రతి విషయం గురించీ ఆందోళనపడు తుండేది. "ఆమెకు విశ్వాసాన్ని పెంపొందించటానికి నిరంతరం ఒక అండ అవసరం అయ్యేది."

దేవుడు కరుణించి, 1930లలో సినిమాలలో నటనకు తగుమాత్రపు ప్రాముఖ్యతే ఉంది. సినిమాను సాంఘిక ప్రతిఘటనా సాధనంగా వాడుకున్న దర్శకుడు కె.సుబ్రహ్మణ్యం వంటివారు కూడా పాటలే సినిమాకు కేంద్రమని గుర్తించవలసి వచ్చేది. ఆయన మొదటి సినిమా "పవలక్కోడి"లో యాభై పాటలున్నాయి. అది చాలా తక్కువన్నట్లే. మూడేళ్ళ తర్వాత, 1934లో తమిళనాడు టాకీస్ నిర్మించిన 'లవకుశ' హరికేశనల్లూర్ ముత్తయ్యా భాగవతార్ సంగీత దర్శకత్వంలో 72 పాటలతో నిండిపోయింది. ఆ సినిమాలోని అన్ని సినిమాలలో కంటే ఎక్కువ సంఖ్యలో పాటలున్నాయి. జె.జె. మదన్ తీసిన ఇంద్రసభ (1932, సంగీతం: నగర్‌దాస్ నాయక్)లో 69 పాటలున్నాయి. ఈ విషయం హర్మిందర్ సింగ్ హమ్‌రాజ్ అనే ఆయన రాసిన "హిందీ ఫిల్మ్ గీత్ కోశ్"లో అధికారికంగా చెప్పబడింది. ఆ కాలంలో సినిమాలు తీసినవారు నిడివినంతా పాటలతో నింపేశారని నిందించలేము. కొన్ని పాటలు రెండు లైన్లు, నాలుగు లైన్లు మాత్రమే ఉండేవి. ఎందుకంటే ఎ.వి. మెయ్యప్పన్ మొదటి దక్షిణ భారత టాకీ సినిమాను "అండనాళ్ (1954) పాటలు లేకుండా నిర్మించితే, అందులో శివాజీ గణేశన్ విలన్‌గా కనిపించాడనే కొత్తదనం కూడా ఆ సినిమాను విజయ వంతంగా ఆడించలేకపోయింది.

పవలక్కోడి స్టేజి నాటకంగా విజయవంతం కావటంవల్లా, ఆ విజయమంతా పూర్తిగా దానిలోని పాటలకు ఆపాదించటం వల్లా దానిని సినిమాగా తీశారు. సహజంగానే సినిమాలో అన్ని పాటలనూ యధాతథంగా ఉంచి అదనంగా కొన్నిటిని చేర్చారు. స్టేజి మీద పాటలు పాడి ప్రసిద్ధిని పొందిన ఆ నటులనే సినిమాలో తీసుకున్నారు. యమ్.కె. త్యాగరాజ భాగవతారు, యస్.డి. సుబ్బులక్ష్మి మొదలైనవారు. కె. సుబ్రహ్మణ్యం మిగిలిన దర్శక నిర్మాతలు ఎవరూ తీసుకురాని సమస్యలు, బాల్య వివాహాలు, వరకట్నం, అంటరాని తనం, స్త్రీల అణచివేత మొదలైన వాటిని సినిమాలలోకి తెచ్చాడు. కానీ సంగీతం, బోలెడు సంగీతం, ఎప్పుడూ ఆ కథలలో కలిపి తీయవలసిందే. దర్శకుడైన సుబ్రహ్మణ్యం, కవి, సంగీత దర్శకుడైన పాపనాశంతో చిరకాలం గుర్తుండే భాగస్వామ్యం ఉంది. పాపనాశం అమోఘ ప్రతిభ సినిమా సంగీతంలో శాస్త్రీయ పలుకుబడిని స్థాపించేందుకు సహాయపడింది.

సేవాసదనం సుబ్రహ్మణ్య సృజించిన అద్భుత కళాఖండం. ఈ కళాఖండంలో ఒక సినిమాలో ఉండవలసినంత సందేశమూ ఉంది. ఆ రోజుల్లో ప్రేక్షకులు కోరుకునేంత సంగీతమూ ఉంది. సాంఘిక సమస్యల పట్ల అంకితభావంతో తీసిన మూడు సినిమాలలో సేవాసదనం రెండవది. మద్రాసులో చిత్రపరిశ్రమకు నాయకుడైనా తర్వాత సుబ్రహ్మణ్యం తీసిన సినిమాలివి. పవలక్కోడి విజయ ఘంటికలు మోగించిన తర్వాత అతను మరో రెండు సినిమాలు కలకత్తా స్టూడియోలలో తీశాడు. అవి 1936లో తీసిన భక్త కుచేల, నవీన సారంగధర అనే సినిమాలు. భక్త కుచేలలో యస్.డి. సుబ్బులక్ష్మికి స్త్రీ–పురుష పాత్రలు రెండింటినీ ఇస్తూ ప్రత్యేకమైన స్క్రిప్టు రాశాడు. ఆమె కుచేలుడి భార్య సుశీలగానూ, శ్రీకృష్ణుడిగానూ నటించింది. ఆ రోజుల్లో అది కొత్త. ఆ సినిమాలో పాపనాశం శివన్‌ని కుచేలుడిగా పెట్టటంతో మంచి పేరొచ్చింది. శివన్ సన్నగా, ఆకలిగొన్నవాడిలా, సహజంగా కనిపించటంవల్ల అతను ఆ పాత్ర ధరించటానికే పుట్టాడా అనిపించింది.

కలకత్తా విజయాలతో సుబ్రహ్మణ్యం ఇక ఆగకుండా ముందుకు వెళ్ళాడు. ముందు ది మద్రాస్ యునైటెడ్ ఆర్టిస్ట్స్ కార్పొరేషన్ అనే నిర్మాణ సంస్థను తర్వాత ది మోషన్ పిక్చర్ ప్రొడ్యూసర్స్ కంబైన్ అనే స్టూడియోని స్థాపించాడు. సినీ నిర్మాతగా, దర్శకుడిగా, దార్శనికుడైన నిర్వాహకుడిగా గుర్తింపు పొందిన సుబ్రహ్మణ్యం తను ఎప్పుడూ ఏం చెయ్యాలని తపించాడో ఆ పని చేయగలిగాడు. సమాజంలోని చెడుగులను ఎత్తిచూపుతూ, ప్రజల చైతన్యాన్ని పెంచే సినిమాలు తీయాలన్నదే ఆయన తపన. బాలయోగిని (1937) ఆ వరుసలో మొదటిది, వర్గ – కుల వివక్షలను చూపించే సినిమా. తర్వాతి సంవత్సరం సేవాసదనం, ఆ తర్వాత త్యాగభూమి (1939) తీశాడు. అభిరుచిగల ప్రేక్షకులు త్యాగ భూమిని ఆయన తీసిన గొప్ప సినిమాగా, భారతీయ సినిమాలో 'క్లాసిక్'గా పరిగణించారు. ఆ సినిమా హిందూ సమాజంలో భార్య హోదా ఏమిటనే విషయాన్ని ప్రస్తావిస్తుంది.

సేవాసదనంలోని కేంద్ర వస్తువు కూడా అలాంటిదే. కానీ ప్రధానంగా ఆడపిల్లలు ముసలి వాళ్ళను పెళ్ళిచేసుకోవాల్సిన పరిస్థితులు, వారి దుర్గతిపై దృష్టిపెట్టింది. (దీని మూల కథ హిందీలో మున్షీ ప్రేమ్‌చంద్ రాశాడు) ఈ హిందీ నవలను తమిళంలో అనువాదం చేసింది సహోదరి అంబుజం అమ్మాళ్ అవటంతో చాలామందిని ఆకర్షించింది. అంబుజం అమ్మాళ్, యస్. శ్రీనివాస అయ్యంగార్ కుమార్తె. శ్రీనివాస అయ్యంగార్ మహాత్మాగాంధీతో అనేక సమస్యల మీద విభేదించి, వ్యతిరేకించి కూడా కాంగ్రెస్ అధ్యక్షుడి స్థానానికి ఎదిగినవాడు. కె. సుబ్రహ్మణ్యం సేవాసదనం స్క్రీన్‌ప్లేని తన సాంఘిక తాత్వికతకు అనుకూలంగా, తమిళ సినిమా ప్రేక్షకుల అభిరుచుల కనుగుణంగా రాశాడు. చివరకు సినిమాగా తెరమీద ప్రదర్శించబడినప్పుడు అది ఒక బీద బ్రాహ్మణ బాలిక కథ. తల్లిదండ్రులు తగిన వరుడిని తీసుకురావటానికి అవసరమైన కట్నం తేలేక, కూతురిని తండ్రి వయసున్న వాడితో పెళ్ళిచేయటానికి నిశ్చయించుకుంటారు. ఆ నవ వధువు జీవితం దుర్భరమవుతుంది. ఆమె రాత్రింబగళ్ళూ గొడ్డు చాకిరిచేసి ప్రతిఫలంగా తిట్లూ, అవమానాలు పొందుతుంది. ఆ ముసలి మొగుడి విధవ అక్కగారు ఆ అమ్మాయిని అమానుషంగా చూసి ఆ పిల్ల తల రాతనింకా ఘోరంగా మారుస్తుంది. ఇక ఆ బాధ భరించలేని ఆ అమ్మాయి ఇంట్లోంచి పారిపోయి పాటలుపాడి తనను తాను పోషించుకోవాలని ప్రయత్నిస్తుంది. ఆ క్రమంలో భర్త తన తప్పు తెలుసుకుని ఆ అమ్మాయికి స్వేచ్ఛనిస్తాడు. పశ్చాత్తాపంతో దహించుకుపోతూ బ్రాహ్మణ సంప్రదాయానికి చిహ్నమైన జ్యంధ్యాన్ని తీసిపారేస్తాడు.

వర్తమాన సంఘాన్ని ప్రతిబింబిస్తూ తీసిన ఈ సినిమాను ప్రేక్షకులు విపరీతంగా ఆదరించారు. సదాశివంతో వేరే విధంగా వాదించి బేరమాడినప్పటికీ, సుబ్రహ్మణ్యానికి నిస్సహాయురాలైన కథానాయిక పాత్రలో సుబ్బులక్ష్మి చక్కగా ఇమిడిపోతుందనే విషయం తెలుసు. ఆమె పాత్రకు తగిన వయసులో ఉంది. శ్రోతల హృదయాలలోకి సూటిగా ఎక్కేటట్లు పాడే సామర్థ్యం ఉందని నిరూపించుకుంది. వెండితెరకు కొత్త ముఖం. సుబ్రహ్మణ్యం మార్కెట్‌కు అనుకూలంగా ఉన్న ఈ అంశాలన్నిటినీ పరిగణలోకి తీసుకున్నాడు. ఆ సినిమాలోని నటులందరిలో యమ్మెస్‌కు సగర్వమైన స్థానాన్నిచ్చాడు. నటీనటుల పేర్లు ప్రకటించేటప్పుడు ముందు యమ్మెస్ పేరు "కోకిలగాన మధురై సుబ్బులక్ష్మి" అని ప్రక టించాడు. కుంభకోణం మహామహంలో యువకెరటమైన సంచలనం రేకెత్తించిన యమ్మెస్ సినిమాలలో తొలిసారిగా నటిస్తున్నదనే వార్త ప్రతి పత్రికలో పతాక శీర్షికగా వచ్చింది. ఆమె పాటలను వీలైనంత ఎక్కువగా వాడుకోవటానికి అనుకూలంగా సుబ్రహ్మణ్యం కథను మలుచుకున్నాడు. పూర్తిస్థాయి ప్రభావం వచ్చేందుకని సంగీత విభాగానికి నిర్వాహకుడిగా పాపనాశమ్ శివన్‌ని నియమించాడు. ముసలి భర్త పాత్రకు ఎఫ్.జి. నటేశ అయ్యర్‌ని ఎంచుకున్నాడు. ఆ రోజుల్లో అతను నిజజీవితంలో కనిపించే పాత్రగా గుర్తింపు పొందాడు. తిరుచురాపల్లిలో దక్షిణ భారత రైల్వేస్‌లో అధికారిగా పనిచేస్తూ, క్రైస్తవమతంలోకి మారి,

వార్తలలోకి ఎక్కి, ఫ్రెడరిక్ అని పేరు పెట్టుకుని బ్రిటీష్ అధికారుల కింద తన వృత్తి వుద్యోగాల పెరుగుదలను సాధించాడు. కొంతకాలం తర్వాత మళ్ళీ అయ్యర్ తనానికి తిరిగి వచ్చాడు.

దురదృష్టవశాత్తు 'సేవాసదనం' కాపీ ఒక్కటి కూడా మిగలలేదు. పునాలోని నేషనల్ ఫిలిం అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్‌లో కూడా ఈ సినిమా గురించి ఎలాంటి రికార్డూ లేదు. సుబ్రహ్మణ్యం వారసత్వాన్ని కొనసాగించేందుకు ఎన్నో కష్టాలు పడిన అతని కుటుంబం దగ్గర కూడా ఆ సినిమాకి సంబంధించి కొన్ని ఫోటోలు తప్ప మరే ఆధారమూ లేదు. అదృష్టవశాత్తూ 78 rpm గ్రామఫోను రికార్డుల పూర్తి సెట్టు, వాటి మొదటి కవర్లలోనే మద్రాసులో వి.ఎ.కె. రంగారావు (సినిమా సంగీతంలో అధారిటి) దగ్గర మిగిలి ఉన్నాయి. ఈ రికార్డులు, ఒకటి రెండు స్టిల్ ఫోటోగ్రాఫులు, చిరిగిపోయిన పాటల పుస్తకం మద్రాసులోని మరొక గొప్ప సంస్థ అయిన ఫిల్మ్ న్యూస్ ఆనందన్ దగ్గర భద్రంగా ఉన్నాయి. 1938లో సుబ్రహ్మణ్యపు వైభవ యుగానికి గుర్తులుగా మిగిలినవి ఇవే. ఇవాల్టి సినిమా విద్యార్థులు తాముగా "సేవాసదనం"ను అంచనా వేసే అవకాశం లేదు. ఒక యువతి ఖద్దరు రాట్నంపై ఖద్దరు ఒడుకుతున్న (స్వతంత్రోద్యమంలో గాంధీ మహాత్ముడు ప్రచారం చేసినది) దృశ్యం ఉన్న ఒక నిశ్చల ఛాయాచిత్రాన్ని పరిశీలిస్తే పైపైన ఒక అభిప్రాయాన్ని ఏర్పరచుకోగలుగుతాం. ఆ ఫోటోలో మధ్యన ఎత్తుగా ఉన్న వేదికపై యమ్మెస్ కూర్చుని ఉంటుంది. దీనిని చూస్తే చిత్ర ధోరణి నాటకీయంగా, కృత్రిమంగా అనిపించి ఆధునిక ప్రేక్షకులకు ఆకర్షణీయంగా ఉండదనిపిస్తుంది. కానీ జాతీయోద్యమ స్ఫూర్తిని తప్పకుండా గుర్తిస్తారు. బ్రిటీష్ వలస పాలననూ, బ్రాహ్మణీయ అణచివేతనూ ఒకేసారి సవాలు చేసిన దర్శకుని ధైర్య సాహసాలు ప్రజల దృష్టిలో ఆ సినిమాను ఒక సంచలనంగా చేశాయి.

సంగీతం ఈ చిత్రానికి తక్కువ బలాన్ని యివ్వలేదు. పాపనాశం శివన్ తన ప్రత్యేక శైలిలో సేవాసదనం సంగీతం శాస్త్రీయమైనప్పటికీ అత్యంత మధురం. పాటలు ఆ చిత్ర సందేశాన్ని ప్రతిబింబించాయి. శివన్, త్యాగరాజు భాగవతార్ యిద్దరి ప్రతిభా నైపుణ్యాల కలయిక ఒక ప్రత్యేక సంగీత జోడిగా సినీ ప్రేక్షకులు గుర్తించారు. శివన్, యమ్మెస్‌ల జోడీ ఇక యమ్మెస్, శివన్ శాస్త్రీయతతో యమ్మెస్ ఏ సంకోచమూ లేకుండా కలిసిపోతే, ఆమె స్వరం ఆయన సంగీతానికి శరీరాన్ని, ఆత్మను ప్రసాదించింది. ఆ సినిమాలో కొన్ని పాటలు ఎంత ప్రజాదరణ పొందాయంటే, పెళ్ళీడు కొచ్చిన ఆడపిల్లలు వాళ్ళ ఇళ్ళల్లో కట్న కానుకల గురించి సంభాషణలు జరిగే సమయంలో ఈ పాటలు పాడేవారు. పాటల రికార్డులు ఓడియన్ లేబిల్‌తో డిమాండ్‌కు తగినట్లు అధిక సంఖ్యలో విడుదల చేశారు.

❖ ❖ ❖ ❖

సేవాసదనానికి లభించిన ప్రజా ప్రశంసలు, ఆ పాటలకు దొరికిన అశేష ప్రజాదరణవల్ల యమ్మెస్ రాత్రికి రాత్రి 'సినిమాతార'గా కీర్తిని సంపాదించిపెట్టాయి. ఇక ఆ దారిలోనే నడవటం సహజమైన, ప్రలోభపెట్టే విషయమే. సదాశివం సేసదనంలోకి యమ్మెస్‌ను నెట్టటం ఒక దీర్ఘకాలిక ప్రణాళికలో భాగమా, లేక 1936లోని గందరగోళపు పరిస్థితుల ప్రభావమా అనేది తెలుసుకునే దారిలేదు. ఏవిధంగా చూసినా ఆ మొదటి కాలంలో ఆయన తనకు తోచినట్లు చేశాడు గానీ ఒక పద్ధతి, ప్రణాళికతో చేయలేదని అనిపిస్తుంది. యమ్మెస్ అద్భుత గాయని. ఆమె తన రూపం చేత స్వభావంవల్లా తారగా తన సామర్థ్యాన్ని మరింత ప్రకాశింపజేసింది. ఆమె సినిమాలలో కనిపించటం కంటే సహజమైన విషయం మరింకేముంది, ముఖ్యంగా అతను, సదాశివం అలా జరగాలని తానే కాటలిస్టుగా పనిచేసినప్పుడు? బహుశా యమ్మెస్‌కు అంత జనాకర్షణ శక్తి ఉండటం ఆయనకు ఆశ్చర్యపరచి ఉంటుంది. సినిమా విడుదల కాకముందే, బహిరంగ ప్రదేశాలలో చిత్రీకరణ జరుగుతున్నప్పుడే, ఆమెను చూడటానికి, ఆమె పాట వినటానికీ జనం గుంపులుగా రావటాన్ని అతను గమనించి ఉంటాడు. ముఖ్యంగా ఆ గుంపులలో మంచి వస్త్రాలు ధరించి వచ్చిన సంపన్న కుటుంబాల స్త్రీలు, యమ్మెస్‌కి దగ్గరగా రావాలని, ఆమెను తాకాలని, ఆమె తమను చూసి నవ్వాలని అనుకోవటం గమనించదగిన అంశం. ఆ సినిమా చిత్రీకరణ సమయంలో సెట్స్ దగ్గరకు తెలియని వాళ్ళందరూ పెద్ద సంఖ్యలో రావటంవల్ల దర్శకుడు సుబ్రహ్మణ్యంకు చాలా కష్టమయ్యేది. ఆ దశలో, అనుకోకుండా హఠాత్తుగా పెల్లుబికిన ప్రజాదరణలో, మంచిగా ఉపయోగించగల, కనిపించని శక్తి ఉందని, అది ఒక జలపాతంలో దాగివున్న విద్యుత్ శక్తి వంటిదనీ, సదాశివం తప్పకుండా గుర్తించి ఉండాలి. సినిమా ఆ శక్తిలో కొంతభాగాన్ని తట్టిలేపింది. కానీ ఇంకా పెద్ద పనులు తనవల్ల జరగాల్సి ఉన్నాయి. యమ్మెస్ మొదటి సినిమా విజయవంతం అయిన ఆ అత్యుత్సాహంలో, సదాశివం తనే ఒక సినిమా కంపెనీ స్థాపించాడు. చంద్రప్రభా సినీటోన్ ఆ కంపెనీ పేరు. అది యమ్మెస్ కోసమేననేది స్పష్టం. అనుకోకుండా యమ్మెస్‌కి వచ్చిపడిన ప్రజాదరణ పునాది మీద ఒక భవనాన్ని నిర్మించే మార్గాలు వెతుకుతున్న సదాశివం, అదే సమయంలో ఆమెకు తను అత్యంత సన్నిహితంగా దగ్గరవుతున్నాడు.

❖ ❖ ❖ ❖

చంద్రప్రభ సినీటోన్, తన యజమాని స్వభావానికి అనుగుణంగానే సినిమాలను చాలా వైభవోపేతంగా నిర్మించాలనుకుంది. సదాశివం పెట్టుబడిపెట్టేవారినీ, తగిన కథలను, సంగీత దర్శకులను, దర్శకులను, నటులనూ పట్టుకునేందుకు సిద్ధమయ్యాడు. ఒక్క కథానాయికనే వెతకనక్కర్లేదు. ఆమె అప్పటికే దొరికింది. బాక్స్ ఆఫీసుని ఆకర్షించి, ఆర్థిక పుష్టి కలిగించే హామీల పునాదిపైనే నిర్ణయాలన్నీ తీసుకున్నాడు. బాగా డబ్బున్న

వారితో కలిశాడు, ముఖ్యంగా ఆ రోజుల్లో చాలా శక్తిసామర్థ్యాలున్న నిర్మాణ – పంపిణీ కంపెనీలలో ఒకటైన మధురై రాయల్ టాకీస్ డిస్ట్రిబ్యూటర్స్‌తో కలిశాడు. వాళ్ళు ఎంచుకున్న కథ కాళిదాసు రచించిన నిత్య నూతనమైన ప్రేమకథ "శకుంతల". అన్నింటికంటే ముఖ్యమైన సంగీతానికి సదాశివం ఇద్దరిని నియమించుకున్నాడు. పాపనాశం శివంని చేర్చుకోక తప్పదు. ఆ వ్యాపారంలో బాగా చలామణిలో ఉన్న పేరు ఆయనది. ఆయనతో పాటు యస్.వి. వెంకటరామన్‌ని అదనపు సంగీత దర్శకుడిగా నియోగించాడు. ఈయనకు అంత పేరు లేకపోయినా, ప్రసిద్ధుల హోదా లేకపోయినా, తమిళ సినిమా రంగంలో అత్యంత మేలైన సృజనాత్మక సంగీతకారుడు. 'శకుంతలై' సినిమా పాటల విజయానికి, ప్రచారానికి ఆయన దోహదం చేస్తాడు. తమిళ సినిమారంగంలో అద్భుతమైన జీనియస్ అని చెప్పుకునే టి.జి. రాఘవాచారి సంభాషణలు రాశాడు. ఐతే అధికారికంగా తెరమీద ప్రకటించిన పేర్లలో సంభాషణల రచయితగా సదాశివం పేరు ఉంది. టి.జి.ఆర్. తమిళ – సంస్కృత – ఆంగ్ల భాషలలో పండితుడు, ప్రముఖ న్యాయవాది, తర్వాతి రోజులలో యస్.యస్. వాసన్‌కు చెందిన జెమినీ స్టూడియోస్‌కి రచయిత – దర్శకుడిగా బాగా కీర్తి సంపాదించుకున్నాడు. కానీ ఆయన సనాతన సంప్రదానికి చెందిన అయ్యంగార్. ఆయన వేషధారణ చెవి పోగులతో సహా పూర్తి పండిత సంప్రదాయ రీతిలో ఉండేది. ఆయన సినిమా అనేది కింది తరగతికి చెందినదనని భావించేవాడు. అందుకే తన సినిమా రచనను, దర్శకత్వాన్ని మొదట మరుగున ఉంచేవాడు. తర్వాత 'ఆచార్య' అనే మారు పేరు పెట్టుకున్నాడు. బహుశా అందువల్లనే సదాశివం రచయితగా తన పేరు పెట్టుకోవటం సరైనదేనని అనుకుని ఉంటాడు. ఏదేమైనా, సదాశివం ఏది రైటనుకుంటే అదే రైటు.

ఎల్లిస్ ఆర్. దంగన్‌ని దర్శకుడిగా ఎంచుకున్నారు. దంగన్ అమెరికన్ 'వండర్ బాయ్'. ఆయన ఒక్క ముక్క తమిళం రాకుండా తమిళ సినిమాలో గొప్ప శక్తిగా మారాడు. ఆయన కాలిఫోర్నియాలో తన సహ విద్యార్థి అయిన మణిలాల్ టాండన్ బొంబాయిలో పెట్టాలని ఆలోచిస్తున్న స్టూడియోలో చేరేందుకు భారతదేశం వచ్చాడు. స్టూడియో నిర్మాణం జరగలేదు. కానీ టాండన్ కలకత్తాలో ఒక తమిళ సినిమాకు దర్శకుడిగా పనిచేస్తుంటే, అక్కడ 'ఏదో ఒకటి' అనుకున్నది కాస్తా కోయంబత్తూరు (తమిళనాడులో పారిశ్రామిక పట్టణం)లోని ఒక నిర్మాత నుంచి "సతీ లీలావతి" (1936) సినిమాకు దర్శకత్వం వహించమనే పిలుపు రూపంలో వచ్చింది. హాలివుడ్‌లో ప్రాథమికమైనవి, ఇండియాలో కొత్తవి అయిన సాంకేతిక విషయాలతో స్క్రిప్టు విభాగం, షెడ్యూల్ ప్రకారం చిత్రీకరణ, కెమెరా కదలికలు – వీటన్నిటితో దంగన్ సినిమా నిర్మాణంలో కొత్త ఒరవడిని పరిచయం చేశాడు. 'సతీలీలావతి' బాక్సాఫీసు విజయాన్ని సాధించింది. మిగిలిన విజయవంతమైన ప్రయత్నాలు వరసగా "ఇరు సహోదర్‌కల్ (1936) అంబికాపతి (1937) కాలమేఘం

(1940) సినిమాలుగా రూపొందాయి. ఛాయాగ్రహణంలో ప్రయోగాలు, మతలబులు చేయటం దంగన్‌కి కొండగుర్తుగా తయారయింది. కాలమేఘంలో కళ్ళు చెదిరిపోయే ఇసుక తుఫాను సృష్టించి ప్రేక్షకుల నోటమాట లేకుండా అద్భుతం చేశాడు. ఒక తెల్ల అమెరికన్ తమిళ సినిమాలు తీయటమనేది అసాధారణమైన విషయం ఒకటి చాలు దంగన్‌ని సుప్రసిద్ధుడిని చేసేందుకు. 1930లలో అతని జీవిత విధానం మద్రాసు కలని land mark లలో అతనినొకటిగా చేసింది. మౌంట్‌రోడ్‌లోని స్పెన్సర్ హోటల్ ఆవరణలోని కాటేజీలో వుండేవాడు. కారుపైన కెమెరా కోసం ఎత్తుగా గట్టిగా ఉండేది. ఇద్దరు మాత్రమే కూర్చోగలిగిన డాడ్జి కారులో తిరుగుతుండేవాడు.

బాక్సాఫీసు వద్ద విజయం సాధించటం కోసం సదాశివం, పాపనాశనం, ఎల్లిస్ దంగన్‌లతోనే ఆగలేదు. నటీనటవర్గాన్ని ప్రజాకర్షణశక్తి తమకుందని నిరూపించుకున్న వారితో, తమ శారీరక విశేషాలతో వెండితెరని తప్పకుండా వెలిగించగలవారైన స్త్రీ పురుషులతో నింపేశాడు. తమిళ సినిమాలలో గొప్ప హాస్యనటులైన ఎన్.యస్. కృష్ణన్, టి.యస్. దొరైరాజ్ అనే ఇద్దరిని తీసుకొచ్చాడు. తన ఒంపుసొంపులతో, ఒయ్యారాలతో అనేక సినిమాలను బాక్సాఫీసు వద్ద అఖండ విజయాలు పొందేలా చేసిన శ్రీలంక తార తవమని దేవిని ఈ సినిమాలో పెట్టాడు (ఆమె తెరమీద కనిపిస్తే చాలు ప్రేక్షకులు రెచ్చిపోయి ఉత్సాహంతో ఈలలువేసి చప్పట్లు కొట్టేవారని చెప్పేవారు).

తన సినిమా విజయం కోసం ఇంత ఆలోచించి, ఇన్ని ప్రయత్నాలు చేసిన సదాశివం, కథానాయకుడి పాత్ర కోసం నటుడిని ఎన్నుకోవాల్సినప్పుడు చాలా ఆశ్చర్యం కలిగించేంత వింత ధోరణిని కనపరిచాడు. దుష్యంతుడి పాత్రను తిరుగులేని నటుడుగా అగ్రశ్రేణి గాయకుడు, శాస్త్రీయ సంగీత రంగంలో చాలా అందమైన మనిషి అయిన జి.యన్. బాలసుబ్రహ్మణ్యం కనిపిస్తూనే ఉన్నాడు. కానీ అతనికి బదులు ఔత్సాహిక రంగస్థల నటుడైన ఆర్. పార్థసారథి అనే అందమైన వ్యక్తిని, వి.వి. శఠగోపన్ అనే మరో ఆకర్షణీయంగా ఉండే శాస్త్రీయ సంగీత గాయకుడిని తీసుకోవాలని ఒత్తిడి తీసుకొచ్చాడు. ఈ ఇద్దరూ దుష్యంతులుగా పేరుతెచ్చుకోగలవారే కానీ జి.యన్.బి. ముందు వీళ్ళని హనుమంతుడి ముందు కుప్పిగంతుల వలే తేలిపోతారు. ఈ విషయం సదాశివంకు బాగా తెలుసు, ఐనా అతను జి.యన్.బి. ప్రవేశించకుండా ఆపటానికి శక్తివంచన లేకుండా ప్రయత్నించాడు.

ఇంత పిచ్చితనమా అనిపించేలా సదాశివం ప్రవర్తించటానికి ఒకే ఒక్క వివరన కనిపిస్తోంది – అతనికి జి.యన్.బి. అంటే అసూయ. దానికి తగిన కారణం ఉంది. జి.యన్.బి. కేవలం మరొక గాయకుడు మాత్రమే కాదు. అతనొక తిరుగులేని గాయకుడు. అతని అందమైన ముఖ కవళికల వల్ల చూడగానే ప్రజలు అతనిపట్ల ఆకర్షితులవుతారు.

ఆ తర్వాత అతను పెంచి పోషించుకున్న అభిరుచులు: అతని వజ్రపు దిద్దులు, బంగారు హారాలు, పట్టుచొక్కాలు, అంతా రాజసం ఉట్టిపడే ఆకారం. అతని శరీర సౌష్టవాన్ని మరింత మెరిపించే విశిష్టతలు కొన్ని ఉండేవి. అతనికి వ్యక్తిగతంగా సెంట్లు పంపే తంజావూరు అబ్దుల్ రహీమ్ ప్రత్యేకంగా ఉత్తరప్రదేశ్ నుంచి ఎంపికచేసిన కనౌజ్ అత్తరు తెప్పించి పంపేవాడు; జి.యన్.బి.కి. ఏ అత్తరు, ఏ సందర్భంలో, ఎంత పూసుకోవాలో కచ్చితంగా తెలుసు. ఆయన తను విడిచిన దుస్తుల్ని తంజావూరులో కావేరి నదీజాలాలతో ఉతికించేవాడు. ఎన్నో సంప్రదాయాలతో, ఆచారాలతో కట్టివేయబడిన ఆ రోజులలో కూడా స్త్రీలు ఇతని 'గ్లామర్'తో కళ్ళు మిరుమిట్లు గొలిపి అతనివద్దకు వచ్చి పడేవారు. మగవాళ్ళు అసూయతోనే అతన్ని "కర్ణాటక సంగీతపు జవహర్‌లాల్ నెహ్రూ" అనేవారు.

అయితే జి.యన్.వి. నిజమైన ఆకర్షణ కేవలం అతని సమ్మోహనకర సౌందర్యం లోనే లేదు. సంగీతకారుడిగా అతని సహజమైన ప్రతిభ, మేధావిగా అతని వైవిధ్య పాండిత్యాలు కూడా ఆ ప్రజాకర్షణకు కారణాలు. సంగీతాభివృద్ధికి గుర్తించదగినంతగా తనవంతు దోహదం చేసిన కొద్దిమంది గురువులలో ఆయనొకడు. జి.యన్.బి. సంగీతశైలి ఒక ప్రత్యేక కర్ణాటక ప్రక్రియలా అనుచరవర్గాన్ని సంపాదించుకుంది. ఆయన కళకు, జీవితానికీ కూడా ఒక మేధావితనాన్ని తెచ్చిపెట్టాడు. గాయకులు పాడేటప్పుడు చేసే అవసరమైన ముఖ వికార విన్యాసాలు, చేతులూపటాలకు బదులుగా, వాటిని వదిలి తన ఆంగిక భాష కోసం నాట్యశాస్త్రంలోని నాజూకైన సూత్రాలను గాయకులు కూడా వాడుకోవచ్చని ఆయన కొక్కడికే తెలిసింది. ఆంగ్ల సాహిత్యం బాగా చదువుకున్న వాడవటంతోపాటు, ఆయనకు వ్యాసాలు, కవిత్వం రాయగల శక్తి కొంత ఉంది. జ్యోతిష్య శాస్త్రంలో గురువు. మంత్రశాస్త్ర ప్రావీణ్యం ఉంది. (ఆధ్యాత్మిక స్తోత్ర పఠన శాస్త్రం) శ్రీవిద్య తంత్ర శాస్త్రాన్ని అభ్యసించేవాడు. (స్త్రీ దేవతను ఉపాసించే తాంత్రిక సిద్ధాంతం) అలాగే ధ్యానం, తపస్సులలో శిక్షణ పొందిన వాడు.

జి.యన్.బి.లోని ఈ ఆలోచనాపరుడు, తాత్త్వికుడు అయిన గాయకుడే, యమ్మెస్‌పై ఆమె కిశోర ప్రాయంలో గాయనిగా ముద్రవేస్తున్న తొలిరోజులలోనే అతని ప్రభావంపడేలా చేసింది. అతనికి తన కళలోని వైవిధ్యభరిత వ్యక్తీకరణల మీద ఉన్న అధికారం, మనో ధర్మంతో అతనికున్న సౌలభ్యం, ఒక రాగాన్ని ఎంత ఎత్తులకో తీసుకెళ్ళగల నేర్పు – వీటన్నిటితో ఆమె ఉప్పొంగిపోయింది. మంత్రముగ్ధురాలయింది. "నేను ఎప్పటికైనా ఇలా పాడగలనా?" అని అవకాశం వచ్చినప్పుడు ఆమె తనను తాను ప్రశ్నించుకుంది. అతనిని వినాలనే, అతని నుంచి నేర్చుకోవాలనీ తపించిపోయేది. ఒకసారి ఆమె జి.యన్.బి. ఇంటి సమీపంలోకి వెళ్ళి అతని సోదరిని, ఆ సాయంత్రం కచేరీలో అతనే క్రతులు పాడ బోతున్నాడని అడిగింది. సంగీతం కోసం ఆమె ఎవరినైనా ఆరాధించిందంటే అది

జి.యన్.బి.నే! సంగీతంలో ఒకే ఒక్క సత్యసాధకునిగా ఆమె అతన్ని వర్ణించింది. జి.యన్.బి. యమ్మెస్ గురించిన తన వ్యాఖ్యగా తిరుగులేని సంపూర్ణమైన శుద్ధమైన శృతి గలిగిన ఏకైక కర్ణాటక సంగీత గాయని యమ్మెస్ అని అన్నాడు. తమ కళలో అసాధారణ మైన బాంధవ్యాన్ని కనుగొన్న ఇద్దరు గాయకులు వాళ్ళు.

వ్యక్తులుగా కూడా వాళ్ళు ఒకరిపట్ల ఒకరు ఆకర్షితులు కాకపోతే అది అసహజంగా ఉండేది. గాయకుడిగా అతనిమీదున్న గాఢమైన గౌరవాభిమానాలతో యమ్మెస్ అతనిపట్ల విపరీతమైన గాఢమైన ఇష్టాన్ని పెంచుకుంది. అతనికి కవితాత్మకమైన కొన్నిసార్లు వ్యాకరణ తప్పిదాలున్న ఉత్తరాలు రాసే సాహసం చేసింది. ఆ ఉత్తరాలలో ఆమె తన హృదయపు లోతులలోని భావాలను తెలియజెప్పింది. పదే పదే అతనిని 'కన్నా' 'అన్బే' (ప్రియతమ) అని సంబోధిస్తూ రాసిన ఈ ఉత్తరాలు ఏ సంకోచాలు లేకుండా ప్రేమలో మునిగిన ఒక స్త్రీ నుంచి పెల్లుబికినవి. అతను ఆమె జీవితానికి కేంద్రమనీ, అతని నుంచి అనురాగం తప్ప మరేమీ ఆమె ఆశించటం లేదనీ ఈ ఉత్తరాలు తెలియజేస్తాయి. కొన్నిసార్లు ఆమె భావోద్రేకాలు ఆమె చేతివేళ్ళతో పోటీపడి పరిగెత్తుతాయి. అందువల్లే అందంగా ఉండే ఆమె చేతివ్రాత ఒక్కోసారి గజిబిజిగా ఉంటుంది. ఈ ఉత్తరాలు కనీసం వాటిలో చాలా భాగం, 1940లో రాసినవి. 'శకుంతలై' సినిమా రోజులనాటివి. అప్పట్లో యమ్మెస్ సదాశివం ఇంట్లోనే ఉంటోంది గానీ అతనితో వివాహం జరగలేదు. ఆ ఉత్తరాలలో జి.యన్.బి.తో కలిసి గడపాలనుకుంటున్న జీవితం గురించిన ఊహలున్నాయని స్పష్టంగా తెలుస్తోంది. జి.యన్.బి. కూడా ఆమెకు లేఖలు రాశాడు. కానీ అతనిలో ఆమెలోని అదుపులేని ఆనందం కనిపించదు. ఐతే తానందుకున్న లేఖలను ఆయన ప్రేమగా దాచుకున్నాడు. అది అతని అనుభూతులకు ఒక గుర్తుకావచ్చు.

సదాశివంకు ఈ ఉత్తరాల గురించి తెలుసా? చెప్పలేము. అన్ని విధాలుగా పరిశీలించినప్పుడు, వారిద్దరి మధ్యా తాను అనుమతించలేని, ఆమోదించలేని సంబంధ మేదో యేర్పడుతోందని సందేహించాడు. సదాశివం, సుబ్బులక్ష్మిని వదలి బైటికి వెళ్ళేటప్పుడు ఇంటికి తాళంవేసి, కిటికీలు మూసి వెళ్తాడని బాగా ప్రచారమైన పుకార్లు. ఆరోపణల వెనకాల ఉన్నదేమిటో దీనివల్ల మనకర్థమవుతుంది. ఆ పుకార్లలో నిజం ఎంతున్నప్పటికీ, జి.యన్.బి. అంటే అభద్రతగా భావించటానికి కావలసినంత సమాచారం ఆయనకు తెలుసుననుకోవటం మంచిది. జి.యన్.బి. సంగీతం వైదూష్యంవల్ల ఆయనంటే యమ్మెస్ కంత అభిమానం చిగురించింది అనే విషయం సదాశివంకు పట్టలేదు. ఆయనకు పట్టిన దేమిటంటే జి.యన్.బి. శత్రువుగా పెరిగిపోతున్నాడు. సదాశివం ఉద్దేశాలన్నీ వ్యక్తిగత మైనవి, శక్తివంతమైనవి గాబట్టి శకుంతలై నిర్మాణంలో జియన్‌బిని వీలైనంత దూరంగా ఉంచాలని చూశాడు. కెమెరా లైట్ల ధగధఘలాడే వెలుగులో, సినిమా మాయాజాలంలో

కూడా ఆ అందాల రాకుమారుడు యమ్మెస్‌కు బాగా దగ్గరగా వస్తాడనే ఆలోచనే అతను భరించలేకపోయాడు. కానీ ఈ ఒక్క పనిలోనే అతను తననుకున్నట్లు చేయలేక ఓడి పోయాడు. చివరకు జియన్‌బి దుష్యంతుడి పాత్ర ధరించేందుకు సంతకం చేశాడు. సదాశివం వ్యాపార భాగస్వాములు ఇంకే ఇతర కథానాయకులనూ అంగీకరించలేదు. నిజ జీవితపు రొమాన్స్ గురించి కాస్త వాసన తగలటం ఆలస్యం, స్టూడియో గాలిలో శకుంతలై సెట్స్‌లో ఏం జరిగింది, ఏం జరగలేదు అనేవి పలు విధాలుగా ప్రచారమయ్యాయి. యమ్మెస్ తనకంటే పైకి రావాలని జి.యన్.బి. తన సంగీతపు జీనియస్‌ని అదుపులో పెట్టుకున్నాడని అనేవారు. యమ్మెస్ స్క్రిప్టులో లేని మాటలు "రాజంటే అచ్చం మీలాగా ఉంటాడు" అంటూ తన కథానాయకుడిని పొగిడేదనే గుసగుసలు వినబడేవి. పరోక్షంగా సదాశివం గురించి నిందలెన్నో వినబడేవి. అందులో ఒక పుకారు, జియన్‌బి పాడిన రెండు పాటలను పాడుచేయటానికి వాటిలో బైటి నుంచి వచ్చే చప్పుళ్ళను కలిపి రికార్డింగు చేశాడనీ, ఒకసారి పిల్లి మ్యావ్ అనటం, ఇంకోసారి గ్లాసు చప్పుడు చేస్తూ కిందపడటం వంటివి చొప్పించాడని చెప్పుకునేవారు. కెమెరామెన్‌తో కలిసి కుట్రచేశాడనీ ఆరోపిస్తారు. షూటింగులో గుర్రంమీద నుంచి పడిపోయిన తర్వాత జియన్‌బి అతి చిన్నగా, ఎవరూ కనిపెట్టలేనంతగా కుంటాడు. ఆ కుంటినడకను కెమెరామెన్‌తో కలిసి బాగా కనపడేలా చేశాడని అనేవారు.

ఛాయాగ్రాహకుడు ఈ కుట్రలో భాగమయ్యాడనటానికి సినిమాలో ఎలాంటి సాక్ష్యమూ కనిపించదు. అబద్ధం నిజంకంటే వేగంగా బలంగా పరిగెడుతుంది. సదాశివం అసూయాపరుడే కావొచ్చు. కానీ తానీ యజమాని, నిర్మాత అయిన తన సినిమాకి ఒక నటుడి కారణంగా హానికలిగించుకోవటమనేది వేరే విషయం. సంగీతంలో, సినిమా పరిజ్ఞానంలో పండితుడైన వి.ఎ.వి. రంగారావు, సదాశివంని నిర్దాక్షిణ్యంగా విమర్శిస్తాడు, అతన్ని "భరించలేం" అని వర్ణిస్తాడు. అలాంటి రంగారావే శకుంతలై సినిమాలో పాటలను పాడుచేయటానికి సదాశివం గ్లాసులను, పిల్లులను వాడం జరిగే అవకాశం ఎంతమాత్రం లేదని చెప్పాడు. ఐతే జి.యన్.బి. ఒక్కడే పాడిన పాటలు 78 vmp రికార్డులుగా విడుదల చేయలేదని, కావాలనే వాటిని సౌండ్‌ట్రాక్‌లోనే తొక్కిపట్టారనీ ఆయన చెప్పాడు. సమీక్షకులు కూడా ఈ అంశాలను ప్రస్తావించారు. సదాశివం ప్రచార యంత్రాంగం తయారుచేసి పంపిన ప్రచార సామగ్రి ఆ చిత్ర కథానాయకుడిని పూర్తిగా విస్మరించింది. కథానాయిక మీదే మొత్తం కేంద్రీకరించింది. జి.యన్.బి.ని కిందకు దించటానికి ఏమేం చేయగలడో అవి సదాశివం చేశాడనేది స్పష్టం. చివరకు, సదాశివం పోరాటంలో ఓడిపోయినా, యుద్ధంలో విజయం కైవసం చేసుకున్నాడు. శకుంతలై షూటింగ్ సమాప్తమవటం, జియన్‌బి, యమ్మెస్‌ల మధ్యనున్న సమ్మోహన సంబంధం సమాప్తమవటానికి దారితీసింది. జియన్‌బికి సమీప, సన్నిహిత కుటుంబ సభ్యుల ప్రకారం ఒక సమయంలో ఆ గొప్ప

సంగీతజ్ఞుడు యమ్మెస్‌ని వివాహమాడాలనుకున్నాడు. దానికి కుల, సాంఘిక కట్టుబాట్లను ఎదిరించాలనుకున్నాడు. కానీ ఒక సన్నిహిత బంధువు ఇలా చెప్పాడు "యమ్మెస్ ఎట్లా నిశ్శబ్దంగా ఊరుకుందో (సదాశివం పన్నాగాల గురించి) అతను తెలుసుకున్న తర్వాత, అతను ఆమెను క్షమించలేదు."

చాలా మంచి కథతోపాటుగా, అన్ని విభాగాలలోనూ గొప్ప ప్రతిభ కనిపించటంతో సినిమా చాలా లాభపడింది. ఈ కథ మహాభారతంలోనిది. రాజైన దుష్యంతుడి ప్రేమ కథ. మున్యాశ్రమంలోని శకుంతలను ప్రేమించి, గాంధర్వ వివాహం చేసుకుని కొంత కాలానికి తిరిగి తన అంతఃపురానికి వచ్చేస్తాడు. వచ్చేటప్పుడు ఒక ఉంగరాన్ని తన ప్రేమకు గుర్తుగా ఇస్తాడు. ఐతే తొందరలోనే ముని శాపంవల్ల శకుంతలను మర్చిపోతాడు. శకుంతల దుష్యంతుడి కోసం వచ్చినప్పుడు ఉంగరం నదిలోపడితే చేప దానిని మింగి వేస్తుంది. గర్భవతి అయి కడుపులోని బిడ్డతో వెళ్ళిన శకుంతల దుష్యంతుడు తనకామె తెలియదని నిరాకరించటంలో కుప్పకూలిపోతుంది. కొంతకాలానికి ఒక బెస్తవాడికి ఆ ఉంగరం దొరికితే, అది చివరకు దుష్యంతుడి దగ్గరకు చేరటంతో అప్పుడతనికి ముని ఆశ్రమంలోని అందమైన వధువుతోపాటు జరిగినదంతా గుర్తొస్తుంది. అతను బాధతో నలిగిపోతాడు. చాలా సాహసాల తర్వాత, అతను అరణ్యంలో తన కుమారుడిని కలుస్తాడు. అనేక సంవత్సరాల వియోగానంతరం భార్యను కూడా కలుస్తాడు. దర్శకత్వ నైపుణ్యం, ఆకట్టుకునే సంగీతం, హృదయాలను ఉర్రూతలూగించి, కాళ్ళతో తాళం వేయించే సంగీతం, సహ నటీనటుల నటనా వైభవం వంటి విశేషాంశాలన్నీ కలిసి ఆ సినిమాను చిరకాలం గుర్తుండేలా చేశాయి.

ఎల్లిస్ దంగన్ కొత్త పుంతలు తొక్కుతూ చిత్రాన్ని మరింత మెరుగ్గా చిత్రీకరించాడు. అతను చెరువులోని నీళ్ళను ప్రత్యేకంగా శుద్ధిచేయించి, శకుంతల ఉంగరం ఆమె వేలి నుంచి జారిపడటం, నదిలోతులలోకి అది చేసిన ప్రయాణం, చేప నోట్లోకి వెళ్ళటం చిత్రీకరించిన తీరు ప్రేక్షకుల ఆనందాశ్చర్యాలను రెట్టింపు చేసింది. ఎన్.యస్. కృష్ణన్, టి.యస్. దొరైరాజన్‌లు బెస్తవాళ్ళుగా నటిస్తూ చేసిన హాస్య దృశ్యాలు చూసి ప్రేక్షకులు కడుపుబ్బ నవ్వారు. కానీ శకుంతలై జీవం, గొప్పతనం అంతా ప్రేమలో, సంగీతంలో ఉన్నాయి. వెండితెర మీద జి.యన్.బి. యమ్మెస్‌లు ఒకరి కోసం యింకొకరు ఉన్నారా అన్నట్లు కనిపించి శకుంతలా దుష్యంతుల ప్రేమకథకు మరింత ఆకర్షణను సమ్మోహనత్వాన్ని జతగలిపేశారు. ఇద్దరూ మృదుమధురంగా పాడారు. ముఖ్యంగా రెండు యుగళ గీతాలు మన గుండెలను పట్టేస్తాయి. ఊపిరి తీసుకోవటం మర్చిపోతాం. ఎల్లిస్ దంగన్ భాషలో చెప్పాలంటే 'శకుంతలై' ఒక "సింగీ" నిండా పాటలున్న సినిమా (movie full of singing) దక్షిణ భారతదేశపు వెండితెరలన్నీ 'సింగీలకు' పుట్టినిళ్ళే. కానీ ఇంత సౌందర్యం, రాజసం

ఉట్టిపడే 'శకుంతలై' వంటి సింగీలను ఆ వెండితెరలు మహా అరుదుగా ప్రదర్శించాయి. మద్రాసు సినీ ప్రేక్షకులకు 'శకుంతలై' విడుదలైనప్పుడు ఎంచుకోటానికి తమను ప్రలోభ పెట్టే అనేక రకాల సినిమాలు ఉన్నాయి. అశోక్ కుమార్ లీలా చిట్నీస్‌లు నటించిన 'బందన్' సాధన బోస్ నటించిన వాడియా మూవీటోన్ వారి 'రాజనర్తకి' నగరంలో ఆడుతున్నాయి. ఇక ఇంగ్లీషు సినిమాలకొస్తే "రోడ్ టు సింగపూర్" బాబ్ హోప్, బింగ్ క్రాస్‌బి, డోరతి లోమర్ నటించిన నిత్య నూతన సినిమాలున్నాయి. ఐతే ఈ సినిమాలు ప్రదర్శిస్తున్న ఏ ఒక్క హాలు దగ్గరా పెద్ద గుంపులు కనిపించలేదు. ఆ జనం గుంపుల తొక్కిసలాట 'శకుంతలై' ఆడుతున్న ప్రభాత్ టాకీస్ దగ్గర రోజువారీ కనిపించే దృశ్యమై పోయింది.

జనం గుంపులు గుంపులుగా 'శకుంతలై'ని చూసేందుకు వచ్చారు. నిజానికి నటనా రంగంలో జియన్‌బికీ యమ్మెస్‌కి అంత పెద్ద పేరేమీ లేదు. వాళ్ళిద్దరికీ సినిమా అనే భావన, నటనా రీతి గురించి పట్టూ లేదు. ఎందుకంటే వారికి నాటకానుభవం లేదు. త్యాగరాజ భాగవతార్, యస్.డి. సుబ్బులక్ష్మిల వలె నాటకాల అనుభవంలేదు. ఇద్దరూ ఈ సినిమాకు ముందు వేరే సినిమాల్లో నటించినా కెమెరా ముందుకి రాగానే బిగుసుకు పోయేవారు. అంతకుముందు భామా విజయం (మణిలాల్ టాండన్ దర్శకత్వం)లో జియన్‌బి నారదుని వేషంవేసి విజయం సాధించాడు. యమ్మెస్ సేవాసదనం సినిమాలో అదే జరిగింది. ఐతే ఈ సినిమాలు జియన్‌బి. యమ్మెస్‌ల నటదారిద్ర్యం ఉన్నప్పటికీ, దానిని దాటి విజయవంతంగా ఆడగలిగాయి. 'శకుంతలై' సంగతి కూడా అంతే. వార్తాపత్రికలో వివరంగా వచ్చిన ఒక సమీక్ష ఈ అంశాన్ని నొక్కి చెప్పింది గానీ, అది జి.యన్.బి. గురించి మాత్రమే చెప్పింది. యమ్మెస్ నటనకు చాలా నిగ్రహపూర్వకమైన చిన్న ఆమోదాన్ని తెలిపింది. ఈ సమీక్ష మద్రాసులో ప్రతివారం సినిమా వార్తలకూ, సమీక్షలకు పూర్తిగా ఒక పేజీని కేటాయించే ఏకైక వార్తాపత్రికైన ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో అచ్చయింది. ఈ సమీక్ష రాసింది కీ.యస్.ఎన్. (kay.yes.Enn) బహుశ నగరంలో ప్రసిద్ధుడైన సినిమా, క్రికెట్ అభిమాని అయిన కె.యస్. నరసింహన్) అయి వుంటాడు.

"దక్షిణ భారతదేశంలోని అత్యంత ప్రజాదరణ పొందిన గాయనీమణి సంగీతం వీనుల విందుగా" ఉందని పూర్తి మార్కులు వేసిన తరువాత, సమీక్షకుడు నటన గురించి రాస్తూ ఇలా అన్నాడు "మొదట వచ్చిన ప్రేమ సన్నివేశాలలో యమ్మెస్ బాగా చేసేందుకు ప్రయత్నించి బాగానే సఫలీకృతురాలయింది, కానీ కాళిదాసు అజరామరం చేసిన ఒక ప్రేమికురాలైన కన్యగా మనం ఆశించినంత చేయలేదు. దుష్యంతుడిని నిందించే సన్ని వేశంలో ఆమె చాలా బాగా చేసింది. వంచనకు గురైన అమాయక స్త్రీ హృదయాగ్నినీ, బాధను బాగా ప్రదర్శించింది." దీనికి భిన్నంగా ఆ సమీక్షకుడు జియన్‌బి గురించి రాస్తూ

"మొట్టమొదట అతను ఏ ప్రఖ్యాత పాత్ర వేయటానికి, చిత్రించటానికి పిలిచారో ఆ పాత్రకు తగిన శరీరతత్త్వం లేదు. తరువాత దశలో పరిపాలకుడిగా బాగా చేశాడు గానీ మొదటి భాగంలో ప్రేమికుడిగా ఒప్పించలేకపోయాడు. అంత అనుభవమూ, గౌరవమూ ఉన్న కళాకారుడి నుంచి మనం ఆశించే సజీవత్వమైన, ప్రతిభావంతమైన గుణాలు కూడా అతని పాటలలో లేకుండా పోయాయి. అతను 'తెర బెరుకు'తో బాధపడుతున్నాడనేది స్పష్టం. "సూటిగా, పదునుగా ఉన్న ఈ వ్యాఖ్యానం సదాశిం హృదయాన్ని చాలాకాలంపాటు శాంతింపజేసి ఉంటుంది.

సమీక్షకుడు శకుంతల స్నేహితురాలి పాత్ర ధరించిన టి.ఎ. మధురంపై ప్రశంసల వెలుగును గుమ్మరించాడు. ఆమె "బహుముఖ ప్రజ్ఞ" "అతి సుందర సహజ నటన"ను కీర్తించాడు. ఎన్.యస్. కృష్ణన్, టి.యస్. దొరైరాజ్, పి.జి. వెంకటేశన్‌లు మంచి హాస్యాన్ని అందించినందుకు "సాధారణంగా చేసే 'అతి' చేయకుండా మంచి సమర్థత" చూపారని రాశాడు. "దక్షిణ భారతదేశపు సహజ సుందర దృశ్యాల గొప్పదనాన్ని అద్భుతంగా ఛాయా గ్రహణం" చేశారన్నాడు. "భారతీయం ఏమాత్రం పొరబడనీయని అప్సరసలు, అప్రాచ్యమైన అడుగులువేస్తూ చేసిన నాట్యం" గురించి ఘాటుగా దాడిచేశాడు. ప్రత్యేకంగా ఇలా అన్నాడు. "తవమణిదేవి నృత్యం చేసే దృశ్యాన్ని తీసేసి సినిమా నిడివి తగ్గించమనే సలహా యిస్తాను" అతనన్నమాట నిజమే. తవమణి శరీరపు కండలు తప్ప ఏమీలేదు. నాట్యం పేలవంగా ఉంది. తర్వాతి రోజుల్లోని ప్రేక్షకులు శంకరాభరణంలో మంజుభార్గవి నాట్యం (1979 నాటి తెలుగు సినిమా) చూసి 1930ల నాటి ప్రేక్షకుల గురించి జాలిపడి ఉంటారు. సమీక్షకుడు యింకో ముఖ్యమైన పరిశీలన చేశాడు: రికార్డింగు సమర్థవంతంగానే చేశారు గానీ ధ్వని సర్దుబాట్లు, కొన్ని పాటలలో మరింత ఏకీకృతం కావలసి ఉంది". తన విరోధిని బాగా తగ్గించాలని సదాశివం చేసిన ప్రైవేటు వ్యూహాలు మరీ అంత ప్రైవేటుగానే మిగిలి పోలేదు.

చివరికి జరిగినదేమిటంటే "శకుంతలై" సినిమాకు, యమ్మెస్‌కు, విమర్శకులు, విరోధులు యేమనుకున్నా జియన్‌బికి సంగీతం తన ఇంద్రజాలాన్ని ప్రదర్శించింది. ఇట్లా ప్రతి ఒక్కటీ సరిగ్గా సరిపోవటంలో "శకుంతలై"లో నటించిన ఇద్దరు తారలూ సినిమా రంగంలో శిఖరాగ్రాన నిలిచారు. శాస్త్రీయ గాయకులుగా పేరున్నవారు గనుక యిద్దరికీ రసికులలో అభిమానులు ఉన్నారు. ఇప్పుడు వాళ్ళు సామాన్య ప్రజానీకానికి ఆదర్శమూర్తు లయ్యారు. సేవసదనంలో యమ్మెస్ పాడిన పాటలు, శాస్త్రీయ ధోరణిలో ఉండి, ఆమె కచేరీ సభలో పాడినట్లుగానే ఉన్నాయి. "శకుంతలై"లో ఉన్నది సినిమా సంగీతం. అందు వల్లనే అది అన్ని వయసులవారిని, భాషా బేధాలనూ, కాలపరిమితుల ఆటంకాలను దాటి అందరి విశేష ఆదరాభిమానాలను సంపాదించగలిగింది. ఈ వరస మళ్ళీ యింకో సారి యిలాగే సాగింది. 'సావిత్రి' సినిమాలోని యమ్మెస్ పాటలు శాస్త్రీయమనటంలో

పొరపాటేమీ లేదు. 'మీరా' సినిమాలో పాటలు సగం శాస్త్రీయమని అనవచ్చు. చెప్పుకో వలసిన విశేషం ఏమిటంటే ప్రజామోదం కోసం చేసిన మార్పులవల్ల ఆమెలోని శాస్త్రీయత ఏమీ దెబ్బతినలేదు. ఆమె మూలాలు అప్పుడూ, ఎప్పుడూ శాస్త్రీయ సంగీతంలోనే ఉన్నాయి.

❖ ❖ ❖ ❖

'శకుంతలై' కేవలం సినిమారంగంలో పేరు, విజయం సంపాదించటంతో ఆగకుండా, దానిని దాటి యమ్మెస్ సదాశివంలకు ప్రకంపనాలు సృష్టించింది. వాళ్ళు తమ జీవితాలలో సత్యాన్ని చూడవలసిన సమయం వచ్చింది. 'సేవాసదనం' సినిమా మొదలయ్యే సమయానికే వారిద్దరూ ఒకే ఇంట్లో నివసిస్తున్నారు. సహజంగానే అది అనేక రకాల సమస్యలకు దారితీసి వుంటుంది. ముఖ్యంగా సదాశివం మొదటి భార్య, వారి పిల్లలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయి. సదాశివం ఈ సమస్యలను పట్టించు కోకుండా తన స్వభావం ప్రకారం ఆ క్షణం తన పనియేమిటో దానిమీదనే దృష్టి నిలుపుతూ, యమ్మెస్ సినీరంగం ప్రవేశాన్ని ముందుకు తీసుకెళ్ళాడు. అతను పొద్దున్నే ఇంటి నుంచి బైటపడేవాడు. పక్కనే యమ్మెస్ ఉండేది. అతని మారిస్ మైనర్ కారులో ఒక మీటింగు నుంచి మరొక దానికి వెళ్తూ ఉండేవాడు. కొన్నిసార్లు భార్యను చాలాకాలంపాటు సోదరి రాజం వద్ద మలబారులో ఉంచేవాడు. యమ్మెస్ అతని రక్షణలో పక్కనే ఉండేది లేదా భద్రతా కారణాలరీత్యా తాళంపెట్టిన ఇంట్లో ఉండేది. కానీ పద్ధతులేవీ సమస్యను తీర్చలేదు సరిగదా పరిస్థితి రోజురోజుకీ దిగజారుతోంది. 'శకుంతలై' చిత్రీకరణ జరుగుతుండగా ఇంట్లో పరిస్థితి పతాకస్థాయికి చేరింది. ఈ మొత్తం పరిస్థితిని సదాశివం నిర్వహించిన తీరు – యమ్మెస్‌ని 1936లో కలిసినప్పటి నుంచి, 1939లో అతని భార్య మరణం, ఆ తర్వాత కూడా నిర్వహణలో నైపుణ్యంలేనితనం, ప్రజా సంబంధాలలో నిర్లక్ష్యం, ఫలితాల గురించి పట్టించుకోకపోవటం ఇదంతా అతని స్వభావానికి విరుద్ధంగా కనిపిస్తుంది. ఇంకా ఆశ్చర్యం ఏమిటంటే నిర్వహణ, ప్రజా సంబంధాలు – ఈ రెండు శాఖలలో అతను తన సామర్థ్యాన్ని నిరూపించుకున్న వ్యక్తి.

అనేక ఆధారాల నుంచి సేకరించిన సాక్ష్యాలు చెప్పేదేమిటంటే, సదాశివం భార్యను రికార్డుల నుంచి తొలగించే ప్రయత్నాలు కావాలనో, అనుకోకుండానో జరిగాయి. సదాశివంకు సంబంధించిన సమాచారమంతా పదే పదే అతని జాతీయోద్యమ కార్యక్రమాల వివరాలతో నిండివుంటుంది; సుబ్రహ్మణ్య శివ ఎక్కిన జట్కా బండి వెనక అతనెలా పరిగెత్తుతూ విప్లవకారునిగా తనను చేర్చుకొమ్మని ప్రాధేయపడ్డాడో; ఖద్దరు అమ్మటంలో ఎన్ని కొత్త పద్ధతులు తెచ్చాడో; ఇలాంటివెన్నో ఉంటాయి. కానీ ఎక్కడా అతని మొదటి భార్య ప్రస్తావన ఉండదు. వాళ్ళ వివాహం గురించి గానీ, కలిసి గడిపిన జీవితం గురించి గానీ ఏ సమాచారం దొరకదు. ఆ స్త్రీ ఒక మనిషికాకుండా పోయింది. ఊరు పేరులేనిదై పోయింది. సాంఘిక దృష్టితో చూసినా, ప్రాక్టికల్‌గా చూసినా కొట్టొచ్చినట్టు కనపడే ఈ

తీసివేతను వివరించలేరు. ఎందుకంటే ఆ రోజుల్లో బ్రాహ్మణులకు రెండవ భార్య ఉండటం పరిపాటి. మొదటి భార్య చనిపోయినప్పుడది సర్వసాధారణం. సదాశివం తండ్రి, అతని భార్య తండ్రి రెండు వివాహాలు చేసుకున్నారు. మరి సదాశివం తన జీవిత కథ నుంచి ముఖ్యమైన దశాబ్దకాలపు భాగాన్ని అదృశ్యం చేయించటానికి యింకే ఇతర కారణమైనా ఉందా?

ఎసైడ్ అనే పత్రికలో 1986లో జానకీ వెంకట్రామన్ ఒక వ్యాసంరాస్తూ కొంత సమాచారాన్ని పోగుచేసే తాత్కాలిక ప్రయత్నంలోకి దిగింది. ఆ సమాచారం అప్పటికే చిక్కుముడి పడి, రహస్యాల చేత చుట్టబడిన పొడుపుకథ అయింది. కానీ ఆమె ఎంతో దూరం వెళ్ళలేదు. ఆమె సదాశివంకు యమ్మెస్‌పై పెరుగుతున్న శ్రద్ధను గురించి చెప్పే సందర్భంలో "సదాశివం భార్య పార్వతి దీని గురించి ఏమి ఆలోచించిందనేది ఎప్పటికీ తెలియకుండా ఉంది" అని రాసింది. "ఆమె చాలా నెమ్మదైన, అమాయకమైన స్త్రీ" అని ఒక స్నేహితురాలు గుర్తుచేసుకుంది. "ఏం జరుగుతున్నదో ఆమెకు తెలుసా అని కూడా నాకు ఆశ్చర్యం వేస్తుంది." అని జానకీ వెంకట్రామన్ వ్యాసంలో రాసింది. నిజానికి ఆమెకు జరిగేదంతా తెలుసు. ఆ తెలియటం ఆమెను నిరాశా నిస్పృహల్లోకి నెట్టింది. చివరికి ఆమె మరణానికి దారితీసిన పరిస్థితులు కుటుంబ సభ్యుల మధ్యా, సన్నిహిత మిత్రుల మధ్యా ఊహాగానాలుగా తయారయ్యాయి. ఒకరకమైన విషాదం తన భార్యను మింగేసిందనే వాస్తవం, ఆమె గురించి ప్రస్తావనే లేకుండా చేసేందుకు సదాశివం నిర్ణయించుకునేలా ఒత్తిడిచేసి ఉండవచ్చు. అది అవివేకంతో కూడిన నిర్ణయం; అది పుకార్ల అగ్నికి ఆజ్యం పోసినట్లయింది.

❖ ❖ ❖ ❖

ఆమె గురించి చెప్పాలంటే, ముందు ఆమె పేరు పార్వతి కాదు. వివాహం జరిగాక సదాశివం కుటుంబం ఆమెకు ఆ పేరు పెట్టింది. పార్వతి అనే పేరు చెబితే ఆమె కుటుంబ సభ్యులు తెలియక ఆశ్చర్యపోయేవారు. ఆమె వారికి అసలు పేరుతోనే తెలుసు. ఆ పేరు అపితకుచాంబాల్ తిరువణ్ణామలై పట్టణంలోని దేవత పేరుని ఈమెకు పెట్టారు. ఆమెకు బాలకుచాంబాల్ అనే చెల్లెలుంది. వాళ్ళ తల్లి చనిపోయాక తండ్రి గోపాల సుబ్రహ్మణ్య అయ్యర్, లాల్‌గుడి తాలూకా అరియార్‌కి చెందినవాడు, రెండవ భార్యని పెళ్ళాడాడు. ఆమె కొడుకు సుబ్బరామ అయ్యర్. బాల పిల్లలు, సవతి తమ్ముడైన సుబ్బరామ అయ్యర్ పిల్లలు, అపిత పిల్లలు అందరూ మద్రాసు నివాసులయ్యారు. గోపాల సుబ్రహ్మణ్య అయ్యరు ప్రభుత్వ రెవెన్యూ ఇన్‌స్పెక్టరు. ఒక పట్టణం నుంచి మరో పట్టణానికి ఎప్పుడూ బదిలీ అవుతుండేవాడు. చివరికి స్థిరపడింది ఉదయార్ పాల్యంలో అయినప్పటికీ అతనికి తిరువాణ్ణామలైతో ఆధ్యాత్మిక అనుబంధం ఉంది.

అపిత కుచంబాల్ ఆకర్షణీయమైన అమ్మాయి. కుటుంబంలో అందరూ ఆమెను కుందనపు బొమ్మ అంటారు. ఆమెకు కర్ణాటక సంగీతం పాడగలిగే సాధారణ జ్ఞానం ఉంది. తండ్రికి సంగీతమంటే ఆసక్తి గాబట్టి ఇంట్లో కూడా పాడుతూ ఉండేది. ఐతే ఏ ప్రత్యేక విషయంలోనూ ఎలాంటి నైపుణ్యాన్నీ ఆమె పెంపొందించుకోలేదు. ఆమె పరిచయం ఉన్న ప్రతి ఒక్కరూ ఆమె అసాధారణమైన సున్నిత మనస్కురాలని చెబుతారు. ఆమె పదహారో ఏట పెళ్ళిచేసి పంపారు. కొందరు బంధువులు ఆమె పెళ్ళి 1930లోనో 1931 లోనో జరిగిందంటారు. ఆమె పుట్టిన సంవత్సరమేదో సరిగ్గా తెలియదు. ఆ సమయంలో సదాశివంకు ఇరవై ఎనిమిదేళ్ళు, వివాహ వయసు దాటినవాడికిందే లెక్క. ఆయన తొలి యవ్వన సంవత్సరాలన్నీ ఒకటి కాకపోతే మరొక విధమైన రాజకీయ కార్యాచరణలో గడిచాయనేది అందరికీ తెలిసిన విషయమే. వివాహ సంబంధం కోసం ఈ రెండు కుటుంబాలూ ఎలా కలిశాయనేది ఎవరికీ తెలియదు. లాల్‌గుడి తాలూకాలో యిద్దరికీ మూలాలుండటం వారిని ఒక దగ్గరికి చేర్చి ఉండవచ్చు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం చేస్తున్నప్పటికీ గోపాల సుబ్రహ్మణ్య అయ్యర్ అంత మంచి ఆర్థికస్థితిలో లేడు. సదాశివం ఎన్నో ఆలోచనలతో, ఆశలతో వెలిగిపోతున్నా ఎక్కడా ఉద్యోగం చెయ్యటంలేదు. బహుశా ఒకవైపు వారికి డబ్బు లేకపోవటం, మరొక పక్షంవారికి జీవనోపాధికి ఏ దారీ కనిపించక పోవటంవల్ల, రెండువైపుల వారూ సమానంగా ఉన్నామని భావించుకునేలా చేసి ఉంటుంది. ఉద్యోగం ఉన్నా లేకపోయినా సదాశివం డబ్బు ఖర్చుచేయటంలో తక్కువవాడు కాదు. పెళ్ళి ఖర్చులు అతనే భరించాడు. కావలసిన నగలు వధువుకి అతనే చేయించాడు. ఏ సంపాదనా లేని సంవత్సరాలలో కూడా సదాశివంలోని "గుడ్ సమారిటన్" చురుగ్గానే ఉన్నాడు. అతని జేబులో ఒక రూపాయి ఉంటే, అవసరంలో ఉన్న మనిషి అతనికెదురైతే, రెండో ఆలోచన లేకుండా ఆ రూపాయి అతనికిచ్చేవాడు. సదాశివంలో ఉన్న ఈ దాతృత్వ స్వభావపు ఫలాలను మొదట్లో అందుకున్నది భార్య కుటుంబంలోని పిల్లలే. భార్య సవతి తమ్ముడికి, బాలకుచాంబాల్ కొడుకులకు క్రమం తప్పకుండా సదాశివం ఆర్థిక సహాయం చెయ్యటం వల్లే వారు కళాశాలకు వెళ్ళగలిగారు. "ఇవాళ నువ్వు ఉత్తరం రాస్తే, మర్నాడు ఆయన డబ్బు పంపుతాడు" అని వాళ్ళలో ఒకరు కృతజ్ఞతాపూర్వకంగా చెప్పారు. ఐతే దానికి మూల్యం ఉంటుంది. స్త్రీలూ, పిల్లలూ కూడా ఆయనకు హఠాత్తుగా విరుచుకు పడుతూ వచ్చే కోపాన్ని తట్టుకోవాలి. దాంతోపాటు మగపిల్లలు ఆయనతో తమకున్న బంధుత్వాన్ని గురించి మాట్లాడకూడదని నిషేధం ఉండేది. వాళ్ళు ప్రత్యేకంగా అతనికేమీ కారూ, అతనూ వాళ్ళకేమీ ప్రత్యేకంకాదు అనేది అర్థంచేసుకోవాలి. ఆయనకు సహాయం చేయటం ఇష్టంగాబట్టి వారికి సహాయం చేస్తున్నాడు. అంతే. లబ్దిదారులు దానిని పట్టించు కునేవారు. "దాన్దేముంది" అన్నాడొక బంధువు, "కుక్కకు ఎముక కావాలి."

❖ ❖ ❖ ❖

ఒక ఐదేళ్ళపాటు కొంతలో కొంత ప్రశాంతంగానే గడిచిపోయింది. సదాశివం ఎప్పుడూ తిరుగుతూనే ఉంటాడు. ఒకసారి కాంగ్రెస్ పనులు, మరోసారి ఖద్దరు అమ్మకం, ఇంకోసారి ఆనందవికటన్ పత్రికలో ప్రకటనల జాగా అమ్మటం యిలా సరిపోయేది. భార్యవైపు బంధువులను ఎడంగా పెట్టినా వాళ్ళకు సహాయం చేసేవాడు. అపితా అప్పుడప్పుడూ తండ్రిగారింటికి వెళ్ళి వస్తుండేది. 1934లో తొలిబిడ్డ రాధ ప్రసవ సమయంలో అపిత తండ్రి సంరక్షణలో గోబిచెట్టిపాల్యంలో ఉంది. 1936లో సదాశివం యమ్మెస్‌ని కలిసేసరికి ఆయన రెండేళ్ళ కూతురికి తండ్రి. భార్య రెండో బిడ్డను గర్భంలో మోస్తున్నది. యమ్మెస్ గురించి ఆమెకు తెలిసిన వెంటనే అతన్ని రెచ్చగొట్టే మాటలు మాట్లాడింది – దానివల్ల అతని కోపాన్ని, మాయమాటలను, తిట్లు శాపనార్థాలను రుచి చూసింది. రెండో కాన్పుకి తండ్రి దగ్గరకు, ఉదయార్ పాల్యమ్ వెళ్ళినప్పుడు ఆమెకు తిరిగి రావాలనే తొందరలేదు. చివరకు ఆమె మద్రాసు వచ్చేసరికి, ఇంట్లో యమ్మెస్ ఉంది. ఆ ఇల్లు రకరకాల స్వభావాలున్న భిన్నమైన మనుషులతో ఉండేది. అపిత, ఆమె ఇద్దరు కూతుళ్ళు, యమ్మెస్, సదాశివం సోదరి రాజం మలబారు నుంచి వచ్చింది. ఇక వీళ్ళందరి మీదా పెత్తనం చేస్తూ సదాశివం ఉండనే ఉన్నాడు.

ట్రిప్లికేన్ పెద్ద వీధిలోని ఇల్లు ఆ సమయంలో వేరేరకంగా ఉంది. అపిత అణచి వేతకు గురవుతున్నది. ఏం జరుగుతున్నది అని ఒక్కమాట మాట్లాడటానికి లేకపోవటంతో చాలా బలహీనంగా, నిస్సహాయంగా భయంతో ఉండేది. ఆమె తండ్రికి పరిస్థితులలో వచ్చిన మార్పు తెలిసి, మద్రాసు వచ్చాడు. అల్లుడు తన మాట వినటానికి సిద్ధంగా లేడనే సంగతి అర్థమయింది. సదాశివం సోదరి అసలేమీ జరగనట్లు తనపాటికి తను జీవితం గడుపుతోంది. సదాశివంతో కాస్త గొంతెత్తి ధైర్యంగా మాట్లాడగల ఒకే ఒక వ్యక్తి అతని ముసలి తల్లి. వయసులో పెద్దావిడగా ఉండే అధికారం, సదాశివంతోపాటు మరో పదిహేను మందిని కన్నతల్లి గనుక ఆమె నిర్మొహమాటంగా, సూటిగా యమ్మెస్‌తో కొడుకుకున్న సంబంధం తనకిష్టంలేదని తెగేసి చెప్పింది. కానీ ఆమె విమర్శలు, బెదిరింపులు కూడా ప్రయోజనం లేనివని తేలిపోయింది. దాంతో ఆమె నీ యిష్టం వచ్చినట్లు చేసుకొమ్మని, సామాను సర్దుకుని కాశీ వెళ్ళిపోయింది. అక్కడ మంచి మరణాన్ని పొందింది. అది సుగుణమో కాదో గానీ, సదాశివం తన మనసులో ఒకటి అనుకున్నాడంటే, ఒక పనికి పూనుకున్నాడంటే, ఆ పని నుంచి ఏదీ అతన్ని తప్పించలేదు. కన్నతల్లి సెంటిమెంటు కూడా పనిచేయదు.

ఒక సుడిగుండం మధ్యలోకి వెళ్ళి చిక్కుకున్నా యమ్మెస్ ఒక శాంతిద్వీపంలా కనిపించేది. ఆ పరిస్థితిని మొత్తంగా అర్థం చేసుకున్నది ఆమె ఒక్కతే. అన్నిటిని సమ స్థాయిలో సర్దుబాటు చేయటానికి ప్రయత్నించింది. "ఆమె అన్నిటినీ అర్థం చేసుకోగలదు"

అని ఒక బంధువు అన్నాడు. "ఆమె అందరితో స్నేహంగా ఉండటానికి ప్రయత్నించింది. చాలా సర్దుకుపోయే మనిషి" ఆమె కుటుంబ బాధ్యతలు పంచుకోటానికి ప్రయత్నించింది. ముఖ్యంగా పిల్లలను చూసుకోవటంలో సహాయపడింది. ఆ చిన్నపిల్లల మీద చూపిన శ్రద్ధాసక్తులతో ఆమె అందరి నిశ్శబ్ద ఆమోదాన్ని గెలుచుకుంది. ఈ ఇంట్లో ఏర్పాటు చాలా మొహమాటంతో, ఇబ్బందితో కూడినదని గ్రహించింది. కానీ ఆమె అప్పుడే మధురై నుంచి పారిపోయి వచ్చింది. ఆ సమయంలో ట్రిప్లికేన్‌లో ఆమెకు దొరికిన ఆశ్రయం ఆమె జీవితాన్ని రక్షించింది. ఆమె చేయగలిగినదంతా, ఒక విపత్కర పరిస్థితిని మంచి పరిస్థితిగా చేయటమే. దానికి తాను ఆ కుటుంబంలో అందరికీ సహాయంచేస్తూ అందరితో మంచిగా ఉండాలి.

ఐతే ఏంచేసినా అపిత ఎప్పుడూ కుంగిపోయిన మానసిక స్థితిలోనే ఉండిపోయింది. అనుకోకుండా జరిగిన ఈ సంఘటనలను ఆమోదించటం ఆమెకు అసాధ్యమయింది. "ఏ స్త్రీ అయినా అలాంటి జీవితాన్ని ఎలా అంగీకరిస్తుంది?" అన్న బంధువు తాత్త్విక వ్యాఖ్యచేస్తూ "కానీ ఆమె ఒక అచ్చమైన భారతీయ స్త్రీ. అందుకే మాట్లాడకుండా ఊరుకుంది. తన లోపలి కోపాన్ని వ్యక్తపరచలేక, ఇంట్లో యింకొక స్త్రీ ఉనికితో తనను తాను సమాధానపరచుకోలేక ఆమె లోలోపలే దహించుకుపోయింది. మళ్ళీ యింకొకసారి గోపాల సుబ్రహ్మణ్య అయ్యర్ మద్రాసు వచ్చినప్పుడు, ఆయన తన కూతురు ఆత్మహత్యకు తలపడే ధోరణిలో ఉండటం చూసి అశాంతి పాలయ్యాడు. సిద్ధంగా ఉన్న తాడు బల్ల కూడా ఆయన చూశాడు. ఆ సందర్భంలో, ఆ తర్వాత కూడా, అపిత ఉరివేసుకుంటానంటూ మాట్లాడేదని బంధువులు గుర్తుచేసుకున్నారు. ఏమైనా కానీ ఆమె తన మానసిక కుంగుబాటుని వదిలించుకోలేక పోయింది.

ఈ విపరీత పరిణామాలనన్నింటినీ గమనించేంత సమయం సదాశివన్‌కు లేదు. 1937వ సంవత్సరమంతా 'సేవాసదనం" నిర్మాణంలో లోతుగా నిమగ్నమై ఉన్నాడు. దాని తర్వాత 1938లో ఆ సినిమా విడుదల, తర్వాత జరిగిన ఉత్సవాలు యిట్లా అనేక కార్యక్రమాలలో తీరికలేకుండా ఉన్నాడు. షూటింగ్ షెడ్యూల్స్‌వల్ల దాదాపు ఆయన, యమ్మెస్ కలిసే ఉండేవారు. ఇంటి నిర్వహణంతా అపిత కుచంబాల్‌కి వదిలేవారు. ఈ క్రమం చాలాకాలం కొనసాగినట్లుంది. సేవసదనం విజయోత్సవాలు ముగియగానే, సదాశివం, యమ్మెస్ తర్వాతి సినిమా అయిన 'శకుంతలై' పనిలో పడిపోయారు. అపిత కష్టాలకు అంతులేకుండా పోయింది. 1939లో ఒక వివాహ నిమిత్తం ఉదయార్‌పాల్యంకు వెళ్ళే అవకాశం వస్తే దానిని చాలా ఆత్రుతగా ఉపయోగించుకుంది. ఆమె తన తండ్రిగారి ఇంట్లోనే ఉండిపోయింది. అక్కడ, మద్రాసుకి తెలియచేసిన కథనం ప్రకారం, ఆమెను మండ్రగబ్బ కరిచింది. రెండు రోజులు బాధపడి చివరికి చనిపోయింది.

కొద్దిమంది బంధువులే ఈ కథను నమ్ముతారు. చాలామంది ఆమె మరణం మూడేళ్ళ నుండి ఆమె అనుభవిస్తున్న మానసిక చిత్రహింసల ప్రత్యక్ష ఫలితమేనని అనుకుంటారు. ఆ మేరకు, సదాశివంను వేలెత్తి చూపి నిందించటానికి సిద్ధపడతారు. ఐతే కొందరు బంధువులు ఇంట్లో జరిగిన చిన్న విషయంగా తమకు తోచిన సంగతి చెప్పారు. ఐతే ఆ చిన్న విషయమే అపిత సహనానికి పరీక్షపెట్టి అసహనంలోకి తోసివుండవచ్చు. ఉదయార్ పాల్యంలో తన కూతురు చాలాకాలం ఉన్నప్పుడే గోపాల సుబ్రహ్మణ్య అయ్యర్ ఆర్థిక ఇబ్బందులలోపడ్డాడు. తనకు వెంటనే డబ్బు అవసరం కావటంతో, అపితకు చెందిన బంగారు హారాన్ని, చిన్న వజ్రాలసెట్టుని తాకట్టుపెట్టి తన తక్షణ సమస్య తీర్చుకున్నాడు. ఆ నగలను త్వరలోనే విడిపించి తెస్తానని కూతురికి వాగ్దానం చేశాడు. అయితే అవి తన నుంచి శాశ్వతంగా దూరమయ్యాయని ఆమెకు తెలుసు. అవి సదాశివం ఆమెకు చేయించి ఇచ్చిన నగలు. అతనిచ్చిన నగలు లేకుండా అతనింటికి తిరిగివెళ్ళటమనే ఆలోచన అపిత కుచాంబాల్‌లోని సంప్రదాయ బ్రాహ్మణీకానికి అవమానంగా అనిపించింది. ఈ తిరుగులేని అపకీర్తి ఆ నిస్సహాయురాలికి చివరి దెబ్బగా మారింది. ఒక వారంలో ఆమె మద్రాసు వెళ్ళాల్సి ఉంది, ఐతే మంద్రగబ్బ ఆమెను రక్షించటానికి వచ్చినట్లు వచ్చింది – అసలు నిజంగా మంద్రగబ్బ అంటూ ఉంటే!

అనివార్యంగా మద్రాసులో అనేక కథలు వ్యాపించాయి. అన్నిటిలోకీ సున్నితమైనది అమెకేదో అంటువ్యాధి సోకి చనిపోయింది. ఇంకో కథనం ప్రకారం ఆమె ఎలక్ట్రిక్ షాక్ వల్ల చనిపోయింది. కొందరు బావిలో పడిందన్నారు. షాక్ కథకూ, బావి కథకూ మధ్య ఒక ఉపకథ ఉంది. దాని ప్రకారం ఇది స్వయంగా తను చేసుకున్నదే. కనీసం జరిగిన సంఘటనల క్రమం చూసినా రాబోయే సంవత్సరాలలో తప్పు సమాచారమే వస్తోందని తెలుస్తోంది. ప్రచురితమైన కొన్ని రిపోర్టులు "సదాశివం మొదటి భార్య 'సావిత్రి' సినిమా తర్వాత 'మీరా' సినిమాకు ముందు చనిపోయిందని" నొక్కి చెప్పాయి. కొందరు ఆ మరణం "యమ్మెస్ వివాహం జరిగిన తర్వాత సరిగ్గా మూడేళ్ళకు సంభవించిందని" చెప్పారు. ఎంత గందరగోళం నెలకొందంటే చాలామంది అపిత మద్రాసులోనే చనిపోయిందని, దానిలో సదాశివం హస్తం ఉందని నమ్మారు. ఇలా జరగనే లేదు. బంధువులందరూ ఏక గ్రీవంగా ఏ విషయాన్నయినా అంగీకరించారంటే అది, అపిత ఉదయార్‌పాల్యంలో తన తండ్రిగారింట్లో చనిపోయిందనీ, అంత్యక్రియలు చేయటం కోసం సదాశివం మద్రాసు నుంచి వచ్చాడనే విషయం మాత్రమే!

ఈ విపరీమైన పుకార్లు, ఒకదానికొకటి సంబంధంలేని విరుద్ధమైన కథనాలు ఆగి వుండాలంటే సదాశివం సూటిగా మొత్తం వ్యవహారాన్నంతా బైటకు చెప్పి, కుటుంబం బంధుమిత్రులకు తెలియజేసి ఉండాల్సింది. ఆ సమయంలో అతను రహస్య గోపనం

చేయటం, తర్వాత కూడా అది కొనసాగటం ఈ పుకార్లకు విలువనిచ్చేలా చేసింది. ఆయన కూడా చాలా కఠినంగా ఉన్నాడనిపిస్తుంది. అపిత చనిపోయిన కొన్ని నెలల్లోనే యమ్మెస్‌ను వివాహం చేసుకోవటం అనవసరమైన హడావుడిగా తోచింది. "ఆయన మార్గం సుగమం కావటం కోసం కాచుకుని ఉన్నట్లయింది" అని సదాశివమంటే ఈ ఒక్క విషయంలో తప్ప మిగతా విషయాలన్నింటిలో ఎంతో అభిమానించే బంధువొకరు చెప్పారు. పక్కదారి పట్టించే ఆపకీర్తిని తెచ్చే కథలు సదాశివం పదేళ్ళ వివాహం గురించీ, ముఖ్యంగా అతని భార్య మరణం గురించీ వ్యాపించాయంటే దానికి ఆయన ఎవరినీ నిందించలేడు. ఒక ప్రత్యేక పరిస్థితిలో ఏంచెయ్యాలో నిర్ణయించుకునే స్వతంత్రం ఆ సమయంలో సదాశివం స్వరూపంలో భాగం కాకుండా పోయింది.

❖ ❖ ❖ ❖

సదాశివం ఎందుకు యమ్మెస్‌తో తనకున్న సంబంధాన్ని ఇంత త్వరగా వివాహ బంధంగా మార్చుకున్నాడు అనేవి ఎవరికీ తెలియదు. 1937 నుంచీ ఇద్దరూ కలిసే ఉంటున్నారు. అతనామెను ముద్దు పేరుతో కుంజమ్మా అని పిలుస్తున్నాడు. అప్పటివరకూ తల్లీ, తోబుట్టువులు మాత్రమే ఆమెను ఆ పేరుతో పిల్చేవారు. తన కుటుంబాన్ని కూడా నిరాకరించి అతను ఆమెను తన జీవిత కేంద్రంగా స్థానమిచ్చాడు. ఆమె అంతే స్పష్టంగా తన మనసులో నిర్ణయించుకుని ఉంటుంది అతను తన మనిషని. దానికి ఆమె కారణాలు ఆమెకున్నాయి. వారిలో ఎవరికీ ఒకటి రెండేళ్ళు ఆగిన తర్వాత వివాహం చేసుకోవటం వల్ల పెద్ద తేడా ఏమీరాదు. కానీ అలా చేస్తే సంఘంలో ప్రతిష్ట, న్యాయబద్ధత అనే వాటి పరంగా చూసినప్పుడు చాలా తేడా వచ్చేది. మరి వాళ్ళెందుకు వివాహానికి తొందరపడ్డారు?

దీనికి ఒక్క ముక్కలో వివరణ యివ్వాలంటే సదాశివం ఏం చెయ్యాలని అనుకున్నాడో అది చేశారు. కానీ ఈ విషయంలో సాధారణమైన మొండితనం కావాలనుకునే కోరిక సదాశివంలో తారాస్థాయికి చేరింది. ఆ దారిలో ఏ ఆటంకాలనూ భరించటానికతను సిద్ధంగా లేడు. జియన్‌బిని ఒక అవరోధంగా చూశాడు. యమ్మెస్ ఆ గాయకుడిమీద అభిమానం పెంచుకున్నదని అతనికి తెలుసు. యమ్మెస్‌కి జియన్‌బికి సంబంధాన్ని అంట గట్టే పుకార్లు అతని కోపాన్ని పెంచేవి. ఒక పత్రిక "దుష్యంత" "శకుంతల" చేతులు పట్టుకుని ఉన్నట్లు చూపే ఛాయా చిత్రాన్ని ప్రచురించినప్పుడు, అలాంటి అసభ్య చిత్రాలను ప్రచురించటాన్ని వ్యతిరేకించాడు. ఆ పత్రిక వాళ్ళు సదాశివంకు జవాబురాస్తూ ఆ ఛాయా చిత్రాన్ని మీ ఫిలిం కంపెనీ వాళ్ళే మాకు అందజేశారని చెప్పారు. ఇంకెంత మాత్రమూ విషయాలను చేజారనీయకూడదని సదాశివంకు తేటతెల్లమైంది. "శకుంతలై" తెచ్చిన ఆకర్షణ, వైభవమూ యమ్మెస్ జియన్‌బిలకు చెందుతాయేమో గానీ ఆ అధికారం, ఆ ప్రత్యేక హక్కు, ఒక్క సదాశివానికే అతని జీవితంలోని స్త్రీకే చెందుతాయి.

ఐనప్పటికీ వివాహం తప్పనిసరేమీ కాదు. ఆ రోజుల్లోని అనేమంది బ్రాహ్మణుల లాగా సదాశివం యమ్మెస్‌ను తనతో ఉంచుకోవచ్చు. అలా చేయటంవల్ల ఆమెకు బొత్తిగా తెలియనిదాన్ని ఆమె మీద రుద్దుతున్నట్లు అనుకోనవసరం లేదు. బ్రాహ్మణ పురుషులకు, కింది కులాల స్త్రీలకు చారిత్రకంగా ఉన్న సంబంధాన్ని అతను కూడా తిరిగి విధించి నట్లయ్యేది. బ్రాహ్మణుడికి ఈ ఆచారం నిజానికి ఒక విజయ చిహ్నంగా అందరూ ఒప్పు కుంటున్నారు. కానీ అతని కీర్తిని చిరకాలం నిలుపుకునేలా, సదాశివం తన వ్యక్తిగత సౌఖ్యపు దారికి వ్యతిరేకమైన మార్గాన్ని నిర్ణయించుకున్నాడు. వివాహం లేకుండా "కలిసి జీవించే" విధానానికి సి. రాజగోపాలాచారి వ్యతిరేకత కూడా ఇందుకు సహాయపడింది. అలాగే ట్రిప్లికేన్ ఇంట్లో అందరూ కలిసి ఉన్నప్పుడు యమ్మెస్ అతని చిన్నపిల్లలను తనంత తానుగా అక్కున చేర్చుకోవటం కూడా అలాగే సహాయపడి ఉంటుంది. ఆ పిల్లలపై యమ్మెస్ చూపిన ప్రేమ సదాశివంను సంపూర్ణంగా వశపరచుకుని, వివాహ నిర్ణయం తీసుకునేలా చేసింది. కానీ అంత త్వరపడటానికి గట్టి కారణం మాత్రం జియన్‌బి ప్రమాదాన్ని మొగ్గలోనే తుంచెయ్యాల్సిన అవసరమే.

శ్రుతి అనే పత్రిక ఒకసారిలా రాసింది – సదాశివం యమ్మెస్‌ని కలిసి వెంటనే ఆ రోజుల్లో బాగా అమ్ముడుపోయే సంగీతపు ఆస్తికి రూపశిల్పిగా, నిర్మాతగా, నిర్వహకుడిగా – ఒక కొత్త కెరియర్‌ను ప్రారంభించాడు. అది సరైన అంచనానే కానీ ఆ పత్రిక ఆ ఆస్తి గురించి సదాశివంలోని భావోద్వేగపు కోణం ఉండే అవకాశాన్ని పట్టించుకో లేదు. ఆ కోణాన్ని "శకుంతలై" సినిమా షూటింగులో ఉబికి, ప్రవహించిన భావోద్వేగాల తర్వాత ఆ కోణాన్ని ఇంకెంత మాత్రమూ పట్టించుకోకుండా ఉండలేము. అలాగని అపిత కుచంబాల్ మరణంతో రేగిన సున్నిత భావాలను ఈ కోణం మాయం చేయలేదు. యమ్మెస్ మధురైలో తన మూలాలను వదిలి తనను ఆశ్రయించినదాని పూర్తి ఫలితాలు ఆయన గుర్తించాడు. ఆయన ఆమెను ఏం చేస్తే ఆనందం కలుగుతుందో అది చేయగల స్వతంత్రం అతనికుంది. ఆమెను మంచిగా చూసుకోవటం అతనికి ఆనందాన్నిచ్చింది. ఆమెను దోచు కోవటానికి అనువైన వ్యాపారపరమైన ఆస్తిగా ఆయన చూడలేదు. తను ప్రేమించిన స్త్రీగా, తన పిల్లలకు కొత్త అమ్మగా ఆమెను ఉపయోగించుకోగలడు. ఆమె అద్భుత ప్రతిభగల కళాకారిణి, ఆమె ఏ ఎత్తులకు చేరగలదో ఎవరికీ తెలియదు. అతనామెను గౌరవించాలి, ఆ ఎత్తులకు ఆమెను చేరేలా మార్గనిర్దేశం చేయాలి. ఆమెను అయ్యర్ అర్ధాంగిగా తయారుచేసి అయ్యర్లందరూ ఆమె విలువను గుర్తించి మెచ్చుకునేలా చేయ గలగాలి. తన కుంజమ్మకు అతను చేయగల గొప్ప సేవ అది. ఆ సేవను అందుకోవటానికి ఆమెకంటే అర్హతగలవారు లేరు.

# 7. నమ్మకంలోని భద్రతా సౌకర్యం

*మీవల్ల గుణదోష మేమి శ్రీరామా*
*నావల్లన గాని నళినదళ నాయనా*
*బంగారు బాగుగ పదివన్నె గాకుంటే*
*అంగలార్చుచు 1 బత్తునాడుకోనేల (మీవల్ల)*
*తన తనయు ప్రసవ వేదనకోర్వ లేకుంటే*
*అనయయల్లునిపై అహంకార పడనేల (మీవల్ల)*
*ఏ జన్మమున 2 పాత్రమెరిగి దానంబిక*
*పూజించ మరచి వేల్పులనాడుకోనేల (మీవల్ల)*
*నా మనసు నా ప్రేమ నన్నలయజేసిన*
*రాజిల్లు శ్రీ త్యాగరాజ నుత చరణ (మీవల్ల)*

సుబ్బులక్ష్మి వివాహం సదాశివంతో జరగటంవల్ల ఆమెకు పరిపూర్ణత దొరికితే ఆయనకది సవాలయింది. యమ్మెస్ ఒకసారి చెప్పింది "నా ఆశయం పెళ్ళి చేసుకుని పిల్లల్ని పెంచటం" ఆ లక్ష్యంవైపుగా కదిలే అవకాశం ఆమెకు ఇప్పుడు వచ్చింది. ఐతే సదాశివం పరస్థితి పూర్తిగా భిన్నం. ముప్ఫై ఎనిమిదేళ్ళ వయసు. వధువుతో పోల్చి చూసినప్పుడు ఆయన మధ్యవయస్కుడనే వాస్తవం ఎదుట నిలబడుతుంది. ఇరవై నాలుగేళ్ళ వయసులో యమ్మెస్, కాళిదాసు తన అభిజ్ఞాన శాకుంతమ్‌లో అడిగిన ప్రశ్నకు కారణమన్నట్లు కనిపిస్తున్నది. "వెలిగే సూర్యుడు కాంతివంతంగా ప్రకాశిస్తుంటే చీకటి తన ముఖాన్ని చూపగలదా?". ఆ రోజుల్లో వయసు మళ్ళిన మగవాళ్ళు పడుచు పిల్లలను పెళ్ళాడటం మామూలే కానీ ఈ ఆచారం సాంఘిక విమర్శను ఆహ్వానిస్తుంది. సేవాసదనం సినిమాలోలా కన్నీరు పెట్టిస్తుంది. సదాశివం "సేవాసదనం"లోని కథానాయకుడంత ముసలివాడు కాదు. ఐనప్పటికీ వెండితెరమీద యమ్మెస్ వేసిన పాత్రనూ, ఆమె వాస్తవ జీవితాన్నీ విషపూరితంగా పోల్చే ధోరణి ఒకటి బయలుదేరింది.

కులభేదం వ్యతిరేక విమర్శను ఆహ్వానించటానికి మరొక కీలకమైన కారణం. సంపన్నులైన బ్రాహ్మణ పురుషులు చిన్న ఇంటిని ఒక దేవదాసీ "భార్య"తో ఏర్పరుచుకోవటం అందరి ఆమోదాన్నీ పొందిన ఆచారమే. కానీ, ఈ ప్రత్యేకమైన కేసులో, ఈ బ్రాహ్మణుడు ఆ అమ్మాయిని యధార్థంగా పెళ్ళిచేసుకున్నాడనేది అతని గతించిన బ్రాహ్మణ భార్య గురించి ఇబ్బందిరకమైన ప్రశ్నలను రేకెత్తిస్తుంది. సదాశివం తిరిగే వ్యాపార వర్గాలలో అప్పటికే ఈ విమర్శ వినిపిస్తోంది. సదాశివం ఎవరికి విలువ ఇస్తాడో ఆ మత, రాజకీయ నాయకుల నుంచి కూడా వ్యతిరేకతే ఉంది. ఒక్క సి. రాజగోపాలాచారి, కొందరు వేళ్ళమీద లెక్కించగలిగిన స్నేహితులు సమయానికి సహాయాన్ని అందించారు. ఇప్పుడు సదాశివం

ఈ సహాయాన్ని తనమీద వచ్చే విమర్శల తీవ్రతను తగ్గించటానికి, మొద్దుబార్చటానికి ఎలా వాడుకోవాలా అనేది ఆలోచించాలి. చివరకు, అతను గొప్ప విజయాన్ని సాధించాడు. దానికి యమ్మెస్ వ్యక్తిత్వం ఒకవైపు అతని స్వంత ప్రయత్నాలు మరొకవైపు సహాయపడ్డాయి.

సదాశివం యమ్మెస్‌ని వివాహం చేసుకోవాలని రాజగోపాలాచారి సలహా ఇవ్వటం ఒక విడ్డూరంగా కనిపిస్తుంది. ఆయన భార్య కూడా వయసులో ఉండగానే చనిపోయింది. కానీ మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనే ఆలోచనను కూడా అతను మనసులోకి రానివ్వలేదు. ఆయన జీవితాంతం విధురుడిగానే ఉండి ఒంటి చేత్తో పిల్లల్ని పెంచుకున్నాడు. తనకు తన జీవితంలో ఏది సమ్మతం కాలేదో దానిని ఆచరించమని శిష్యుడికి సలహా ఇస్తున్నాడు. సిద్ధాంతపరంగా చూస్తే రాజాజీ యిచ్చిన సలహాలో ఒక సందిగ్ధత ఉంది. ఆయన సినిమాలను, సినిమావాళ్ళను చాలా అసహ్యించుకుంటాడు. మద్రాసులో ఆయన వ్యక్తిగత సంబంధాలు, రాజకీయ జీవితం కూడా ఈ అసహ్యంవల్ల ఉండవలసినంత బాగుండేవి కాదు. మద్రాసు ప్రెసిడెన్సీలో కాంగ్రెస్ ఉద్యమం 1930లలో ఎన్నికల ప్రచారానికి సినిమా నటులను రంగస్థల నటులను ఉపయోగించుకుంది. రాజకీయ నాయకులకు నటులకు మధ్య ఉన్న సంబంధం రాజకీయాల స్వభావాన్ని మార్చేసింది. దానివల్ల తమిళనాడు ప్రజా జీవితంలోనే ఎంతో ఊహించని మార్పులొచ్చాయి. ఈ కలయికకు నాయకత్వం వహించినది యస్. సత్యమూర్తి. ఆ రోజుల్లోని పెద్ద పెద్ద తారలను, నటులను, గాయకులను కాంగ్రెస్ ఉద్యమంలో చేర్చుకున్నాడు. టి.కె. షణ్ముగమ్, వి. నాగయ్య, రాజా శాండో నుంచీ మహారాజపురం విశ్వనాథ అయ్యర్, యమ్.కె. త్యాగరాజ భాగవతార్, కె.బి. సుందరాంబాళ్ వరకూ అందరూ కాంగ్రెస్ కోసం పనిచేశారు. ఇదిలా ఉంటే ఇద్దరూ కాంగ్రెస్‌కి చెందినవారైనప్పటికీ రాజాజీ, సత్యమూర్తులు రాజకీయంగా శత్రువులు. సత్యమూర్తి సినిమా నటులతో కలిసిమెలిసి ఉంటున్నాడనేది చాలు రాజాజీ ఆ సినిమా వాళ్ళను కూడా శత్రువులనుకోటానికి. నిజానికి ఈ అదనపు కవ్వింపు కూడా అవసరం లేదు. రాజాజీ ఎంత పవిత్రాత్ముడంటే ప్రజా వినోదాన్ని పాపమనుకుంటాడు. అతను ప్రజలతో సినిమాలు చూడవద్దని చెప్పేవాడని తెలుస్తోంది. 1953వ సంవత్సరంలో మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా, చలనచిత్ర పరిశ్రమ సభలో మాట్లాడుతూ సినిమా "విషయం" అనీ, దేశానికి ఈ చిత్ర పరిశ్రమ చేయగల అత్యుత్తమ సేవ ఏదైనా వుంటే అది తనను తాను మూసేసుకుని, ఇండియాలో ఇక సినిమా ఉండదనే హామీ ఇవ్వటమేనని అన్నాడు. ఈ రకమైన మొండితనపు ధోరణివల్ల కాంగ్రెస్‌కి, తమిళ సినిమాలోని శక్తివంతమైన నటులకూ మధ్య ఎడంపెరిగింది. త్వరలోనే సినీరంగంలోని సృజనాత్మక వ్యక్తులు, నటులు అప్పుడే పెరుగుతున్న ద్రవిడ ఉద్యమంలో తమ అస్తిత్వాన్ని చూసుకుని తమిళ చరిత్ర గతినే మార్చేశారు. అంత బలంగా సినిమాని వ్యతిరేకించిన రాజాజీ తన శిష్యుని వ్యక్తిగత ఇష్టానిష్టాల దగ్గరకు వచ్చినపుడు హేతుపూర్వకంగా ప్రవర్తించాడు. యమ్మెస్ కులంవల్ల

మాత్రమే వినోద రంగానికి చెందటం కాదు. సినిమాలోకి ప్రవేశించటం ద్వారా మరింత కిందికి దిగజారింది. అప్పటికామె రెండవ సినిమా పూర్తిచేసిందంతే. ఐనప్పటికీ సదాశివంకు సుబ్బులక్ష్మి మీద ఉన్న అనురాగాన్ని రాజాజీ ఆమోదించాడు. అంతేకాకుండా వివాహం చేసుకొమ్మని సలహా ఇచ్చి "విషం" చిమ్మే మనిషికి న్యాయం జరుగుతుందన్నాడు. రాజాజీ చాలా కార్యశీలి. సదాశివంకు అతనికి ఏ సలహా కావాలో అదే యివ్వటం వివేకమని అర్థంచేసుకున్నాడు. తన గురువు చెప్పినమాట అంతే కార్యశీలి అయిన సదా శివం సమస్యను పరిష్కరించింది. ఐతే దానివల్ల సందిగ్ధతకు సమాధానం దొరకలేదు.

❖ ❖ ❖ ❖

వారి వివాహం 1940 జులై 10వ తేదీన జరిగింది. ఆ రోజుల్లో ప్రసిద్ధ సినిమా నటిని, గాయకురాలినీ పెళ్ళాడుతున్నప్పటికీ సదాశివం పెళ్ళి ఏర్పాట్లని అతని స్వభావానికి విరుద్ధంగా అతి తక్కువ ఆర్భాటంతో చేశాడు. వివాహ కార్యక్రమాలకు మైలాపూర్, లేదా ట్రిప్లికేన్‌లోని ప్రసిద్ధ దేవాలయాలను ఎంచుకోలేదు. వాటికి బదులు తన వధువును తీరునీర్‌మలై అనే ఆనాటి మద్రాసు పొలిమేరలలో దూరంగా ఉన్న చిన్న గ్రామానికి తీసుకెళ్ళాడు. అక్కడ చిన్న గుట్టమీద ముగ్గురు దేవతలున్నారు. చాలా సుందరమైన ఆ రంగనాథస్వామి ఆలయం నిరాడంబరంగా అదే సమయంలో ప్రశాంతంగా పవిత్రంగా వివాహాలు చేసుకోవాలనుకునే వారికి నచ్చుతుంది. దూరంగా ఉండటం కూడా సదాశివంకు నచ్చటానికి ఒక కారణమై ఉంటుంది. కలకలం రేపిన తన రెండవ పెళ్ళికి ఎక్కువమందిని ఆహ్వానించాలని అతననుకోలేదు. సినిమా నటుల అభిమానుల గుంపులు రావాలని అసలనుకోలేదు. కానీ బ్రాహ్మణుల గుర్తింపు తప్పనిసరి. గౌరవ అతిథిగా, ఈ ఏర్పాట్లన్నిటి వెనకాల వుండే ప్రధాన వ్యక్తిగా హిందూ పత్రిక యజమాని, సంపాదకుడు అయిన కస్తూరి శ్రీనివాసన్ తప్పక హాజరయ్యేలా చూసుకున్నాడు. చాలా ప్రముఖులైన కొద్దిమంది అతిథుల సమక్షంలో వధూవరులు దండలు మార్చుకున్నారు. పురోహితులు వారిద్దరినీ భార్యభర్తలుగా ప్రకటించారు. అంతా అతి తక్కువ ఖర్చుతో జరిగింది. తర్వాతి కాలంలో సదాశివం తన పెళ్ళి ఖర్చులను చాలా ఆశ్చర్యకరంగా కచ్చితమైన వివరాలతో చెప్పేవాడు. మొత్తం ఖర్చు, అతిథులను తీసుకురావటం, విందు భోజనం పెట్టటం అన్నీ కలిపి 150 రూపాయలైందని అనేవాడు. అంతే అయినా కాకపోయినా చరిత్రలో సొసైటి వివాహాలలో అది కారుచౌక. సదాశివం లెక్కలు అతని రెండవ వివాహం సుబ్బులక్ష్మికి మొదటిది ఒక్కటే అయిన వివాహం జీవితం కంటే చిన్నదనే స్పష్టమైన సూచనను ఇస్తుంది. ఈ వివాహ వార్త పత్రికలలో ఎంత క్లుప్తంగా రావాలో అంత క్లుప్తంగా వచ్చింది. తమిళ దిన పత్రిక దినమణి ఏడవ పేజీలో వార్త ఇలా ప్రచురించింది. "చంద్రప్రభ సినీ స్టూడియో మేనేజింగ్ ప్రొప్రయిటర్ టి. సదాశివం వివాహం యమ్మెస్ సుబ్బులక్ష్మితో 10 జులై

బుధవారం స్పెషల్ మ్యారేజి యాక్టు ప్రకారం లాండన్స్ రోడ్డు కీల్పాకలో జరిగింది. తర్వాత హిందూ సంప్రదాయం ప్రకారం వివాహ తతంగాలు తిరునీర్‌మలై గుడిలో జరిగాయి.”

సుబ్బులక్ష్మి విషయంలో తాను న్యాయంగా వ్యవహరించటం ద్వారా సమస్యలను పరిష్కరిస్తున్నానని సదాశివం అనుకుంటే అతను పొరపాటుపడ్డాడు. వాత్సాయనుడు ‘కామసూత్ర’లో చెప్పిన ప్రాథమిక సూత్రాలలో ఒకదానిని ఆయన ఉల్లంఘించాడు గదా. ఆ ప్రేమ రుషి ఏం ఉపదేశించాడంటే “పురుషుడు తనకంటే చాలా ఉన్నత స్థానంలో ఉన్న సంబంధాన్ని పెళ్ళిచేసుకోకూడదు, అలా చేస్తే ఆ సంబంధీకుల ఎదుట తలవంచాల్సి వస్తుంది. అలాగని మరీ తక్కువస్థాయి సంబంధానికి వెళ్ళకూడదు, దానిని అందరూ ఈసడించుకుని తప్పుగా పరిగణిస్తారు” ఆనంద వికటన్ పత్రిక యజమానైన యస్.యస్. వాసన్ సదాశివం తప్పుచేశాడనే భావించాడు. వివాహం వాస్తవంగా జరగకముందే అలా అనుకున్నాడు. సదాశివం ‘ఆనంద వికటన్’ను ఎప్పుడు వదిలేశాడు, ఎందుకు, ఎట్లా వదిలేశాడనే విషయం మీద కావలసినంత అయోమయం ఉంది. కొన్ని ఆధారాలను బట్టి వాసన్ సదాశివంను తీసివేశాడని తెలుస్తుంది. కొందరు సదాశివం తనంతట తాను రాజీనామా చేశాడంటారు. అసలతను ఆ పత్రికలో ఎంతకాలం ఉన్నాడనే దానిమీద భిన్నమైన అభిప్రాయాలున్నాయి. కొందరు అతను ఆనంద వికటన్‌లో ఒక సంవత్సరమే ఉన్నాడంటారు. కొందరు మూడేళ్ళు పనిచేశాడంటారు. 1936లో యమ్మెస్‌ని కలిసినప్పుడు మాత్రం అతను కచ్చితంగా ‘వికటన్’లోనే ఉన్నాడు. 1938లో చంద్రప్రభా సినీటోన్‌ని పెట్టినప్పుడు అతను ఎక్కడా ఉద్యోగం చేయటంలేదు. అది ‘శకుంతలై’ సినిమా విడుదల కావటానికీ, తిరునీర్‌మలైలో వాళ్ళ వివాహం జరగటానికి కనీసం రెండేళ్ళు ముందు సంగతి. ఐతే ‘ఆనంద వికటన్’ను తను వదిలేయటానికి తన వివాహమే ప్రత్యక్ష కారణమనే అభిప్రాయాన్ని కల్పించేందుకు సదాశివం ఇష్టపడ్డాడు. ఆయన డెబ్బయ్యవ పడిలో ఉండగా ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు “ఒక సామాన్యురాలిని వివాహమాడి ఇంగ్లండ్ రాజే తన సింహాసనాన్ని పోగొట్టుకున్నాడు. నాకు జరిగిన నష్టం చాలా తక్కువ, ఒక ఉద్యోగం. అంతే.”

పైన అనుకున్నట్లు వివాహంతో సంబంధం ఉన్నా లేకపోయినా వాసన్‌తో విడిపోవటం కంటే సాంఘిక అసమ్మతి అనే మచ్చ మరింత ప్రమాదకరమైనది. ఈ తెలివిని సదాశివాన్ని వివాహం చేసుకున్న చాలా సంవత్సరాల తర్వాత, తను ఎదురుచూడని చోటు నుంచి, కంచి కామకోటి పీఠం నుంచి వచ్చింది. సదాశివం తన జీవితంలో చాలా భాగాన్ని ఆధ్యాత్మిక గురువులు, నాయకులను గౌరవించి ఆరాధించటంలో గడిపాడు. వారిలో స్వామి వివేకానంద, రుషీకేష్‌కి చెందిన స్వామి శివానంద, స్వామి చిన్మయానంద

వీళ్ళ నుంచి సత్యసాయిబాబా, మాతా ఆనందమయి వరకూ చాలామందిని ఆరాధించాడు. వీళ్ళందరినీ మించి, అందరిపైకంటే ఎలాంటి ప్రశ్నా లేకుండా ఆయన తనను తాను అర్పించుకునే తిరుగులేని పవిత్రమూర్తి సన్నిధి ఒకటుంది. అది కంచి పరమాచార్యులైన చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామిగళ్ సన్నిది. సదాశివం ఆ పుణ్యవరేణ్యుడైన కంచి స్వామి (మహా పెరియవర్) తనను తన భార్యను వారి జీవితాంతం నడిపించిన తిరుగులేని శక్తి అని పదే పదే ప్రకటించేవాడు. సి. రాజగోపాలాచారిది రెండవ స్థానం.

వాళ్ళ వివాహ సమయానికి సదాశివానికి, యమ్మెస్‌కు కంచి స్వామిజీ తెలియదు. వాళ్ళు ఆయనను మొదటిసారి 1954లో అనుకోని పరిస్థితుల్లో కలిశారు. సదాశివం విపరీతమైన మానసిక వత్తిడిలో ఉన్నాడు. యమ్మెస్ టైఫాయిడ్‌తో బాధపడుతోంది. కూతురు రాధకు తగిన సంబంధం ఎంత వెదికినా దొరకటంలేదు. ఆ సమయంలో ఒక స్నేహితుడు కంచి పీఠాధిపతి ఆశీర్వచనాలుంటే ఈ ఆందోళనలన్నిటి నుంచీ ఉపశమనం దొరుకుతుందని సలహా యిచ్చాడు. సదాశివం ఆ పనిచేశాడు. ఫలితాలు ప్రయోజనకరంగా ఉన్నాయి. యమ్మెస్ ఆరోగ్యం తొందరగా కుదుటపడింది. కంచి వెళ్ళొచ్చిన మూడు నెలల్లోనే రాధ వివాహం నిశ్చయమైంది. సదాశివం అప్పటినుంచీ కంచి పీఠానికి అత్యంత వీర భక్తుడయ్యాడు.

ఐతే మొదట్లో వారి వివాహం గురించి పరమాచార్య అంత సుముఖంగా లేడు. అప్పటికి వాళ్ళ వివాహం జరిగి పదిహేనేళ్ళవుతోంది. అన్ని విధాలైన కార్యక్రమాలలో ఆమె అతని భార్యగా గుర్తింపబడుతూ ఉంది. కానీ ఈ దంపతులు పరమాచార్యుని ఆశీస్సుల కోసం వెళ్ళినప్పుడు, ఆశీర్వదించటానికి ఆయన తటపటాయిస్తున్నాడని వారికి తెలిసింది. ఆ పరమాచార్య ఆలోచన ఏమిటంటే సుబ్బులక్ష్మి తన కులధర్మం ప్రకారం ఒక బ్రాహ్మణునితో సంబంధం కలిగి ఉంది. కానీ సదాశివం అలా చేయటంలో విఫల మయ్యాడు. ఆయన తన బ్రాహ్మణ భార్యను వదిలి ఒక అబ్రాహ్మణురాలిని వివాహం చేసుకున్నాడు. కాబట్టి ఆ వివాహాన్ని formal గా గుర్తించటం కంచిపీఠానికి తగినపని కాదు. ఆశీర్వచనం ఇవ్వటానికి పరమాచార్య ఒక అభ్యంతరం లేవదీశాడు. యమ్మెస్ మడిసరాన్ని ధరించింది. మడిసర అంటే తొమ్మిదిగజాల చీరె అయ్యర్ల శైలిలో, పమిట కొంగును నడుంచుట్టూ తిప్పి ముందుకి తేవాలి. యమ్మెస్ "శకుంతలై" షూటింగ్ రోజుల నుండీ మడిసర పద్ధతిలో చీరెకట్టటం మొదలుపెట్టింది. సదాశివం ప్రోత్సహించి ఉంటాడనటంలో సందేహంలేదు. ఐతే జన్మరీత్యా ఆమె బ్రాహ్మణకులం కాదు గాబట్టి ఆమె అలా చీరె కట్టరాదనేది పరమాచార్య కచ్చితమైన అభిప్రాయం. యమ్మెస్ మామూలు చీరె లోకి మారిన తర్వాత పరమాచార్య దంపతులను ఆశీర్వదించాడంటారు. ఐతే అతి త్వరలో ఆ పరిస్థితంతా మారి పరమాచార్యకున్న అభ్యంతరాల ఛాయలన్నింటినీ తీసివేయగలగటంలో సదాశివం విజయం సాధించాడు. శంకర్ పీఠం యొక్క డొల్ల

సంప్రదాయాల సంరక్షకుడైనప్పటికీ, పరమాచార్య మినహాయింపులు ఇచ్చేంత వివేకం గలవాడు. సదాశివం మొక్కవోని భక్తి ఒత్తిడితో, ఒత్తిడి చేయటంలో అతనికున్న శక్తులతో, పరమాచార్య ఇంతకుముందు తనున్న పట్టు నుంచి మారి, ఆ దంపతులను జీవితాంతం తన భక్తులుగా అంగీకరించాడు. ఒకసారి ఆయన యమ్మెస్‌కు అత్యున్నతమైన వేద సమ్మతమైన విశేషంతో కీర్తించాడు. “ఆమె ఏమైనా కానీ, బృందావన తులసి వంటిది”. సదాశివం దంపతులు ఆయనను దేవుడిలా గౌరవించారు. బహిరంగంగా జరిగిన ఈ గుర్తింపు, సమానస్థాయినివ్వటం, వీటివల్ల బ్రాహ్మణ సమాజం సుబ్బులక్ష్మి ఒక అయ్యర్ ధర్మపత్నిగా మారటానికి ఆమోదించేందుకు ముఖ్యమైన కారణాలలో ఒకటయింది.

ఆమె మార్పుకి గురైందనటంలో సందేహమేమీ లేదు. భర్తతో ఫార్మల్‌గా కలవటమనే దానికంటే మరింత ఎక్కువగా ఒక సాంస్కృతిక మార్పుకి లోనవటమే సుబ్బులక్ష్మి వివాహంలో ఉన్న నిజమైన ప్రాముఖ్యత. ఆమె నేపథ్యంవల్ల తన భార్య ఎదుర్కోవాల్సిన ఎలాంటి ఆందోళనలనైనా పోగొట్టాలనే నిర్ణయంతో సదాశివం ఉన్నట్లు కనిపిస్తాడు. అతని చెవినబడిన విమర్శలు, వివిధ స్థాయిలలో అతనెదుర్కొన ప్రతిఘటనలు అతన్ని ఈ విషయంలో మరింత కఠినం చేశాయి. బ్రాహ్మణీయ పద్ధతులలో అతను నిష్ణాపరుడు కావటంతో, తన భార్య తన సాంఘిక మత అంతస్తులో సమానంగా ఇమిడిపోయేలా, బ్రాహ్మణీయ వ్యవస్థ ఆమెనలాగే స్వీకరించి ఆమోదించేలా ఏ ప్రయత్నాన్నీ వదలకుండా చేశాడు. సంగీతం, సినిమా, మతం, దాతృత్వం, రాజకీయ సంబంధాలు, సాంఘిక సంబంధాలు, పత్రికా రచనా ఈ పనికోసం తనకు తెలిసిన ప్రవేశమున్న ప్రతి ఒక్క ఆవరణనూ వాడుకున్నాడు.

అతని మతంలోని సాధారణ నియమాలు సదాశివం ఆలోచనలను ముందుకు తీసుకెళ్ళేందుకు సహాయపడ్డాయి. వర్ణాశ్రమ ధర్మంలోని అచ్చమైన స్వచ్ఛమైన సారాంశం మహాత్మాగాంధీ వంటి వారిని ఆకర్షించాయి. ఆయన దానిని ఎలా చూశాడంటే “వర్ణం ఏ హక్కును ఇవ్వదు. ఎక్కువ తక్కువలనే హక్కును గానీ ఆలోచనకు గానీ అది పూర్తిగా వ్యతిరేకం”. వర్ణం కాలక్రమంలో అణచివేసే కులవ్యవస్థగా పతనమైంది గానీ మౌలికంగా అది న్యాయంగానే వుందంటూ గాంధీ రాశాడు. “వర్ణం పుట్టుక చేత నిర్ణయింపబడుతుంది. ఐతే దాని ధర్మాలను అనుసరించనంత వరకే అది ఉంటుంది. బ్రాహ్మణ తల్లిదండ్రులకు పుట్టిన వాడిని బ్రాహ్మణుడంటారు, కానీ వయసొచ్చాక అతని జీవితం బ్రాహ్మణ గుణాలను ప్రదర్శించటంలో విఫలమైతే అతనిని బ్రాహ్మణుడని పిలవలేము. ఇంకోవైపు బ్రాహ్మణుడిగా పుట్టని వాడిని బ్రాహ్మణుడిగా గుర్తించవచ్చు. ఆ పేరుని అతనే ఒద్దనుకున్నా.”

హిందూమత గ్రంథాలనిండా హోదాకు కులానికి సంబంధం లేదనే ఉదాహరణ లున్నాయి. వశిష్టుడు అసలైన దేవదాసి ఊర్వశికి జన్మించాడు కానీ మహర్షి బృందంలో

చాలా గౌరవస్థానంలో ఉన్నాడు. విశ్వామిత్రుడు క్షత్రియకులంలో పుట్టినా బ్రాహ్మణత్వాన్ని పొందటానికి రాజ్యాన్ని వదిలేశాడు. రామాయణ, మహాభారత పురాణేతిహాసాలు రాసిన వాల్మీకి, వ్యాసులు కింది కులాల్లో పుట్టినా మహర్షుల హోదాను పొందారు. వర్ణం ఎలా నిర్ణయించబడుతుందని అర్జునుడు ప్రత్యేకించి అడినప్పుడు కృష్ణుడిలా సమాధానం ఇచ్చాడు. "స్నేహితుడా! జన్మ కారణం కాదు. పవిత్రతకు సుగుణాలు కారణం. ఛండాలుడైనా పుణ్యాన్ని ఆచరించినప్పుడు దేవతల చేత బ్రాహ్మణుడుగానే పరిగణింపబడతాడు. "ఐతే ఆ గ్రంథాలలో దీనికి విరుద్ధమైన ఉదాహరణలు కూడా ఉన్నాయి. బాగా ప్రసిద్ధి చెందిన కథ మాతంగునిది. వందల ఏళ్ళపాటు అతి కఠోర తపస్సు చేసినా అతను బ్రాహ్మణత్వాన్ని పొందలేకపోయాడు. ఆ కథ చెప్పే నీతి ప్రకారం ఒక ఛండాలుడెన్నటికీ బ్రాహ్మణుడు కాలేడు. కానీ ఈ కథలో కుతూహలం కలిగించే అంశాలెన్నో ఉన్నాయి. అందులో ఒకటేమిటంటే మాతంగుడు రుషి కాగలిగాడు. రామాయణంలో అతన్ని రుషి అంటే మహాభారతం అతన్ని రాజర్షి అంటుంది. కాని బ్రాహ్మణుడని మాత్రం అనదు. ఈ బిరుదు నిచ్చే సంప్రదాయంవల్ల బ్రాహ్మణత్వ హోదా కంటే రుషిత్వపు హోదా గొప్పదా అనే ప్రశ్న వస్తుంది. మేధావుల చర్చకు ఆస్కారమెక్కడుందంటే – మత గ్రంథాల సారాంశానికి, నిష్టా గరిష్టులైన వారికి మధ్య ఎప్పుడు అనంగీకారంతో కూడిన వాదనలు ఘర్షణలు జరుగుతాయి. ప్రసిద్ధ వేదపండితుడైన కట్టుమడోమ్ నారాయణన్ నంబూద్రిపాద్ ఏదైతే ఒక ఉదార తాత్త్వికతను కలిగి ఉందో దానిని బ్రాహ్మిణీకరించటానికి మనుస్మృతి చాలా స్పష్టమైన ప్రయత్నమని చెప్పటంలో ఒక ప్రాచీన సంప్రదాయాన్ని ముందుకు తీసుకెళ్ళటాన్ని చూడవచ్చు.

వర్ణానికున్న ఉదార వ్యాఖ్యానం సుబ్బులక్ష్మి విషయంలో సఫలమైందంటే దానికి కారణం సుబ్బులక్ష్మే. ఆమె వ్యక్తిగత గుణగణాలు ఆమెను అంతరువులను అధిగమించి పైకి వెళ్ళేలా చేశాయి. బ్రాహ్మణుల సుగుణాలని మనం వేటిని అంటున్నామో అవి ఆమెకు సహజంగా వచ్చాయి. ఆమె భర్తకు, కుటుంబానికి ఆత్మార్పణ చేసుకున్నది. అది బ్రాహ్మణ భార్యకుండవలసిన మొదటి లక్షణం. ఆమె సహజంగా అమాయకురాలు, ఆమెలోని కపటంలేనితనాన్ని నిజాయితీని అందరూ గుర్తిస్తారు. ఆ స్వభావమే ఆమెను అందరికీ ప్రియమైన వ్యక్తిగా దగ్గరచేసింది. ఆమె నేనింతదాన్ననే అనుకోదు. అందరినీ ఆకర్షించాలనే ప్రయత్నం చేయదు. సంప్రదాయక పద్ధతిలో, ఒక అందమైన వినమ్రతతో కొంత సిగ్గరిగా ఉంటుంది. ఈ లక్షణాలన్నీ భార్యాత్వం తర్వాత ఆమె కావాలని అలవరుచుకున్నవి కావు. ఆమె లోపల ఉన్న లక్షణాలే. ఆమె తల్లిగారింట్లోని గదిలో తంబూర శృతి చేయటం నేర్చుకున్నప్పటి నుంచి కృష్ణుడు అర్జునునికి యిచ్చిన సమాధానంలోని "పవిత్రత" వంటిదేదో ఆమెలో వచ్చి చేరినట్లనిపిస్తుంది. ఆమె లోపలి ఆ లక్షణం ఆమెతో ఉండిపోయి,

శుద్ధ సంస్కృతంలో ఉన్న సుప్రభాత శ్లోకాలలో ఆమె సాధించిన ఆశ్చర్యంగొలిపే స్పష్టమైన ఉచ్చారణతో కలగలిసిపోయింది. సంస్కృతం ఉచ్చారణలో ఆమె స్వచ్ఛత, ఏమాత్రం కష్టపడకుండా పలికే విధం సాధారణ శ్రోతలు, పండితులూ ఒకేవిధంగా చర్చించుకునే అంశమయింది. ఈ విషయాలన్నీ కలిసి ఈ అంతరువులతో కూడిన భారతీయ సమాజంలో, గౌరవం గుర్తింపు అనేవి సంస్కృత భాషాంతరీకరణకు రెండవ పేరు అనే సిద్ధాంతానికి బలాన్నిస్తాయి.

ప్రఖ్యాత సామాజిక శాస్త్రవేత్త, ఎమ్.ఎన్. శ్రీనివాసన్ సంస్కృతీకరణ సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ, సాంఘిక అంతస్తులలో పైకి వెళ్ళటానికి ఇది కీలకమైనదని చెప్పాడు. భారతీయ జీవన విధానం అనేది ఉదయించినప్పటి నుంచీ బ్రాహ్మణులు చాలా లోతుగా సంస్కృత భాషాంతరీకరణతో కూడిన సంస్కృతిని ఆదర్శంగా చేశారని చెబుతూ శ్రీనివాస్ సంస్కృత భాషతో కూడిన సాంస్కృతిక భావజాలాలు ఒక వ్యక్తి హోదాను నిర్ణయించే కొలబద్ద అయిందని వాదించాడు. అందువల్ల "వ్యక్తులు చెప్పుకునే హోదాకు, దాచిన హోదాకు మధ్య అంతరం ఉందని" ఆయన ప్రకటించాడు. ఆయన ప్రకారం కుల అంతస్తులలో సంస్కృత భాషాంతరీకరణ ద్వారా ఒకరు పైకి ఎదగాలనుకోవటం కొత్తేమీ కాదు. పైగా సంస్కృత భాషాంతరీకరణ చెందిన కులాల సంప్రదాయాలు, ఆచారాలు, జీవన విధానం ఇదంతా ఎంత బాగా పాటిస్తున్నారనే దాన్నిబట్టే సామాజికంగా పైకి ఎదగటం సాధ్యమవుతుంది. బ్రాహ్మణేతర కులాలు నిరంతరం "సంపదను, పరువు ప్రతిష్టలను కులగణనగా మార్చుకోవాలనే" ప్రయత్నంలో మునిగి ఉంటాయని ఆయన పరిశీలించి చెప్పాడు. మడిసరి చీర నుంచి, దేశంలోని భక్తిపరమైన విధివిధానాలు, ఆచారాలు బాగా పాటించటం వరకూ సుబ్బులక్ష్మి విషయంలో సంస్కృతభాషాంతరీకరణ పనిచేసింది. గౌరవ ప్రతిష్టలను, కులగణనతో సమానం చేయటంలో సహాయపడింది.

కానీ సాంఘిక నిచ్చెన మెట్లెక్కి పైకి వెళ్తున్న వ్యక్తులలో సుబ్బులక్ష్మి ఒకరనుకుంటే అది పొరపాటు. ఆమెను అందరికంటే అత్యున్నతంగా చేసినది, సంస్కృత బ్రాహ్మణ భావజాలాన్ని అందిపుచ్చుకునే మౌలిక స్వభావమే! ఆ క్రమం చాలా కచ్చితమైనది, స్వచ్ఛ మైనది. ఆ క్రమం పాటిస్తే వచ్చే వ్యక్తిగత ప్రయోజనాలనుబట్టి వాటికోసం అలవరచు కున్నది కాదు. బహుశా ఆమె అమ్మ కూతురి కంటే ఎక్కువగా నాన్న కూతురేమో. జరిగిన మార్పులను ఆమె అతి సులభంగా అప్రయత్నంగా తన లోపలికి తీసేసుకోవటంతో ఆమెది బ్రాహ్మణ జన్మకాదని ఎవరూ చెప్పలేరు. ఇంకా చెప్పాలంటే స్మార్తుడు, అహం బ్రహ్మాస్మి అనుకునే అయ్యర్ జన్మ కాదనలేరు. అది సదాశివం మతశాఖ. మూడు అడ్డ గీతల విభూతిని నుదుటిమీద ధరించేశాఖ. ఆ విభూతిధారణను సగర్వంగా తన ట్రేడ్ మార్కుగా ధరించేవాడు. విభూతి లేకుండా కనిపించటం చాలా అరుదు. ముఖ్యంగా

సుబ్బులక్ష్మిని వివాహం చేసుకున్న తర్వాత మరీ అరుదు. అతను వైష్ణవుడు కాకుండా స్మార్తుడవటంతో సుబ్బులక్ష్మి విషయాన్ని కాస్త తేలిక పరిచింది. బ్రాహ్మణిజంలో స్మార్తులు ఒక అసాధారణ శాఖ. దానిలోని వారు సంప్రదాయపరమైన వైష్ణవ – శైవమత విభజన లోకి ఇమడరు. వారు పై రెండు శాఖలలోని అంశాలను కలుపుకున్నారు. వాళ్ళు కొన్ని బ్రాహ్మణేతర ఆచారాలను కూడా తమలో చేర్చుకోవటం వల్ల, భక్తి ఉద్యమానికి తాము దోహదం చేయగలిగారు. ఒక ప్రముఖ రచయిత రాసినట్లు "స్మార్త సంప్రదాయం అద్వైత మైనా, దృక్పథంరీత్యా ఏకేశ్వరమైనా, అద్వైత సిద్ధాంత ప్రదిపాదకుడైన శంకరాచార్యులను అనుసరించినా, సాధారణ స్మార్తులు చాలాకాలం నుంచీ భక్తి సంస్కృతితో కలిసి ఉన్నారు." ఈ వివరణ సదాశివం భక్తిని ఇముడ్చుకున్న తీరుని మనకి తెలియజెబుతుంది. సదాశివంలో తమిళ అయ్యర్ సిద్ధాంతానికి చెందిన ప్రతి చిన్న వివరమూ చాలా విధేయంగా సుబ్బులక్ష్మిలో ప్రతిబింబిస్తుంది. మనసా, వాచా, కర్మణా ఆమె దానిలో లీనమైంది. మనం ఏవిధంగా చూసినా ఆమె వ్యక్తిత్వం ఉన్నతం, భారతీయం, బ్రాహ్మణీయం. అది పైకి కూడా కనిపిస్తుంది.

సుబ్బులక్ష్మి ఆశయాలు సంప్రదాయ సామాజికశాస్త్ర రేఖలను దాటి వెళ్ళాయి. సంస్కృత భాషాంతరీకరణ, శ్రీనివాస్ అర్థం చేసుకున్న రీతిలో, మొత్తం కమ్యూనిటీకి ఈ నిచ్చెనమెట్ల సమాజంలో పైకెదగాలనే కోరికను ప్రతిఫలించే ఒక సామూహిక క్రమం. అగాధమైన సాంఘిక అంతరాలున్న భారతదేశం వంటి దేశంలో ఈ అంశానికి ప్రత్యేకమైన అవసరముంది. సుబ్బులక్ష్మి విషయంలో ఆ సూత్రం వర్తించదు. కమ్యూనిటీ అంతా సామూహికంగా సామాజిక అంతస్తులలో ఉన్నతమైన గుర్తింపు కోసం జరిపే ఉద్యమంలో ఆమె భాగంకాదు. తనను తాను మార్చేసుకోవాలనే పూనికతో వున్న ఒక వ్యక్తికి సంబంధించిన విషయం ఇది. ఆమె కమ్యూనిటీలోని మహిళకుండే సాధారణమైన ఆశ ఎవరైనా సంపన్న పోషకుడి అభిమానం పొందటం, ఆ పోషకుడి కుటుంబం ఈవిడ కుటుంబాన్ని రెండవ కుటుంబంగా ఆమోదించటం. అంతమాత్రమే. సుబ్బలక్ష్మి అలాంటి వ్యవస్థతో, ఆమె దృష్టిలో హీనమైన యేర్పాటుతో సంతృప్తిపడదల్చుకోలేదు. ఆమెకు మరింత ఉన్నత మైన పరిపూర్ణత్వం కావాలి. ఆమె కావాలనుకున్నట్లే జరిగింది. ఎందుకంటే ఆమె హోదాలో వచ్చిన మార్పు ఆమె స్వభావానికి మరింత బాగా సరిపోయింది. ఆమె ఉదాసీనత, సదాశివం కచ్చితమైన ఆధిపత్యం ఒకరికొకరు సరిపోయేలా చేసింది. ఇంకేవిధమైన స్వభావ బేధాలున్నా చాలా క్లిష్టపరిస్థితులు, సర్దుబాటు చేసుకోవటంలో కష్టాలు వ్యక్తిత్వాల మధ్య ఘర్షణలు వచ్చి ఉండేవి. ఈ ప్రత్యేకమైన భార్యాభర్తల మధ్య ఏరకమైన ఘర్షణా ఎన్నడూ రాలేదు.

ఇంకా దృష్టంకాని, అదృష్ట ప్రభావమేదో పనిచేస్తున్నట్లున్నది. చాలా సున్నితంగా సుబ్బులక్ష్మిని 'భారతీయత'కు ఉదాహరణగా మారుస్తున్నది. భారతీయ మనస్తత్వం కొన్ని

లక్షణాలను ఆమోదిస్తుంది. కొన్నిటిని ఆమోదించదు. వాటిని నిర్వచించి ఇలా అని చెప్ప లేము గానీ చాలా శక్తివంతమైన, అనాలోచితంగా అనిపిస్తూ హఠాత్తుగా పుట్టే కొన్ని కోరికలు కలిసి ప్రజల సామూహిక మనస్తత్వాన్ని రూపొందిస్తుంది. అది వారిని ఇతర ప్రజల నుండి ప్రత్యేకమైనవారిగా చేసే ఒక ఆధిపత్య భావజాలానికి దోహదం చేస్తుంది. అలాంటి impulses ని భారతీయ ప్రజా జీవితంలో పనిచేయటం మన చూస్తుంటాం. ముఖ్యంగా వృత్తి విద్యలలో, సృజనాత్మక రంగాలలో యిది జరుగుతుంది. మహాత్మాగాంధీకి, జవహర్‌లాల్ నెహ్రూకి ఉన్న వ్యత్యాసాన్నే ఉదాహరణగా తీసుకోవచ్చు.

గాంధీ ప్రజా సమూహాల హృదయ తంత్రులను మీటగలిగాడు. ఎందుకంటే, అతను భారతీయ భావజాల సాంస్కృతిక స్వభావపు, ఆత్మకు సంపూర్ణ సంకేతంగా నిలిచాడు. నెహ్రూ నిలవలేదు. అతని పాశ్చాత్యీకరణ, భగవంతుని ఉనికిపట్ల తటస్థత వీటన్నిటితో అతను సమూహాలకు దూరంగా ఒక దేశభక్త రాకుమారునిలా నిలబడ్డాడు. కానీ చివరకు అతను కూడా అంతటా వ్యాపించిన ఆ భావజాలానికి వశుడై, తన మరణా నంతరం, చితాభస్మాన్ని భారతదేశపు నదులలో, పర్వతాలపై జల్లమన్నాడు. ఆ రెండూ భారతీయులు పవిత్రంగా భావించేవి.

సినిమా, మిగిలిన అన్ని రంగాలకంటే ఈ ఆధిపత్య భావజాలపు ప్రాముఖ్యతను బైటికి తీసుకొస్తుంది. భారతీయ సంప్రదాయ ఊహలను ఆలోచనలను ఉల్లంఘించే ముగింపును తన సినిమాలో చూపటానికి ఏ రచయిత, దర్శకుడు సాహసించడు. ఇంకో వైపు ఆ ఊహలను బలంగా తిరిగి విధించే కథా వస్తువే చాలా సినిమాలకు పునాది అవుతుంది. ఉదాహరణకు నిజాయితీగా, నిక్కచ్చిగా, నిరంతర త్యాగశీలతతో కూడిన మాతృత్వ భావన అనేక సినిమాలకు ప్రేరణ అయింది. ఒక్క హిందీలోనే బోలెడు విజయ వంతమైన సినిమాలు వచ్చాయి. ఔరత్ (1940), మదర్ ఇండియా (1957), దీవార్ (1975), నామ్ (1988). తమిళంలో 1930, 40 దశాబ్దాలలో వెండితెను యేలిన దేశ భక్తి సినిమాలు అప్పటి దేశపు ముఖ్య భావజాలంలోకి సరిగ్గా అతికిపోయే ధోరణులను ప్రతిబింబించాయి. సినిమా చరిత్రకారుడైన యస్. థియోడర్ భాస్కరన్ రచించిన పుస్తకం "ది ఐ ఆఫ్ ది సర్వెంట్‌లో చెప్పినట్లు" – నిర్మాతైన కె. సుబ్రహ్మణ్యం భారతీయుల మౌలిక మత విశ్వాస విధానానికి విధేయుడై తన విశ్వసనీయతను ప్రతిష్టించుకున్నాడు... శాస్త్రి (త్యాగభూమిలో కథానాయకుడు) దేవతైన అంబిక నిర్ణయించటంవల్లనే తాను జాతీయోద్యంలో చేరానని నమ్ముతాడు. ఆ విధంగా జాతీయత, సంస్కరణవాదం, ఈ రెండింటి సందేశాలనూ, మత వాసనతో కలిపేశాడు. కుల వ్యతిరేకత గురించి ఈ సినిమా ఇచ్చిన సందేశానికి గొప్ప అధికారం, ఈ సినిమాకు పనిచేసినవారంతా బ్రాహ్మణులై నందువల్ల వచ్చింది." శాస్త్రీయ అంచనా ప్రకారం భాస్కరన్ ఈ ప్రక్రియను ఒక మత విశ్వాస విధానంగా వర్ణించటం సరైనదే అయినా, నిజానికి అదింకా విశాలమైన భావజాలం.

అది మతాన్ని తనలో ఇముడ్చుకున్నా, దానిని అధిగమించి భారతదేశపు సాంస్కృతిక విలువల విధానాన్ని ఆలింగనం చేసుకుంటుంది. ఔరత్ నుంచి త్యాగభూమి వరకూ నిర్మాతలు సమాజం ఆమోదించిన నియమాలకే కట్టుబడి ఉన్నారు. గాంధీవలే, చివరి రోజుల నెహ్రూవలే. అవే భారతీయతా సంప్రదాయ భావనలకు కట్టుబడి ఉండటమే సుబ్బులక్ష్మి సాంఘిక విజయానికి కీలకం.

ఆమె సామాన్యమైన వినమ్ర స్వభావంవల్ల కనిపించేదానికంటే యమ్మెస్ విజయం నిజానికి మరింత నాటకీయమైనది. ఈ వాస్తవాన్ని చాలా స్పష్టంగా కేంద్రీకరించి, హిందీ సినీతార అయిన దేవికారాణి జీవితంలో ఎదురుబొదురుగా నిలిపి చూసినప్పుడు అర్థమవుతుంది. దేవికారాణి జీవిత కోణాలు కూడా సుబ్బులక్ష్మి వంటివే గానీ వ్యతిరేక దిశలో పయనించాయి. వాళ్ళిద్దరూ లలితకళలో రాణించారు. తమ తమ రంగాలలో తారాస్థాయికి ఎదిగారు. ఐతే యమ్మెస్ భారతీయ భావజాలాన్ని అలవర్చుకుని ఇంకించుకుని సంతృప్తిని, అంతరంగ శాంతిని పొందితే దేవికారాణి విపరీతంగా పాశ్చాత్యీకరణ చెంది, స్వాతంత్ర్యానంతర భారతదేశంలో మమేకం కాలేకపోయింది. సంప్రదాయంలో కనిపించే సౌకర్యాలతో ఒకరు పూర్తి భద్రతను పొందారు. ఇంకొకరు స్వదేశంలోనే ప్రవాసం అనుభవిస్తూ, చివరి రోజులను ఒక పాశ్చాత్య హోటల్‌లో గడిపారు. తన సంస్కృతి సంప్రదాయాలవల్ల ఒకరు కిందిస్థాయి జీవితంతో మొదలుపెట్టి ఉన్నతస్థాయికి చేరుకున్నారు. వేరొకరు ఉన్నత స్థాయిలో జీవితం ప్రారంభమైనా, ఒక కళాకారిణిగా, భారతీయురాలిగా తన సంస్కృతీ సంప్రదాయాలను వదలి కిందికి దిగారు. సుబ్బులక్ష్మి తన సంగీత కచేరీల కాలం ముగిసిన తర్వాత కూడా దివ్య తేజో ప్రకాశంతో భద్రంగా చరిత్ర గర్భంలో స్థిర నివాసమేర్పరుచుకుంది. దేవికారాణిని మంచి ఇంగ్లీషు వనితగా తీర్చిదిద్దేందుకు తొమ్మిదేళ్ళ వయసులో ఇంగ్లాండు పంపినప్పుడు పరాయీకరణతో బాధ పడింది. కొంతకాలంపాటు సినిమా వెలుగులో మెరిసినప్పటికీ, రష్యన్ చిత్రకారుడైన స్వెత్లోవ్ రోరిచ్ భార్యగా తన వ్యక్తిత్వాన్ని మార్చుకోవాలనే ప్రయత్న సాధనలో తన అస్తిత్వాన్ని కోల్పోయింది. ఆమె ఎప్పుడూ భారతీయతకు కొలమానం కాదు. సుబ్బులక్ష్మి స్వాతంత్ర్యానంతరం భారతదేశం సాధించిన జాతీయ విజయాలలో సంద్రాయానికి కట్టుబడి ఉండటం చొరవను తగ్గిస్తుందని, మెదడును మత్తులో ఉంచుతుందనే తిరస్కారానికి గురవుతుంది. కానీ సుబ్బులక్ష్మి విషయంలో అది బలమైన ఊతం అని నిరూపించబడింది. సంప్రదాయంలో చుట్టివేయబడిన జీవితం ప్రయోజనం ఏమిటంటే దానిలో పూరించవలసిన ఖాళీలేమీ ఉండవు. ఏంచెయ్యాలో వాళ్ళకు తెలుసు, ఏంచెయ్యాలో ఎవరు చేస్తారో తెలుసు. ఒంటరితనానికి చోటులేదు. దిశానిర్దేశానికి లోటులేదు.

సుబ్బులక్ష్మి వలే దేవికారాణి కూడా సంస్కృత భాషాంతరీకరణ సిద్ధాంతంలో ఇమిడిపోతుంది. సామాజిక శాస్త్రవేత్త అయిన ఎమ్.యస్. శ్రీనివాసన్ సంస్కృతీకరణ

చెందిన కులాలలో కూడా పైకెదగాలనే తపన ఉంటుందని గుర్తించాడు. వాళ్ళు ఎక్కడికి వెళ్ళాలి? ఆయన సమాధానం ప్రకారం బ్రాహ్మణేతరులు బ్రాహ్మణాచారాలను అలవరచు కున్నట్లు వాళ్ళు పాశ్చాత్య అలవాట్లను ఆచారాలను నేర్చుకుంటారు. కింది వర్గాల వాళ్ళు ధనాన్ని, పరువు ప్రతిష్టలను సంస్కృతీకరణ హోదా పొందటానికి వాడితే, బ్రాహ్మణులు వారి ధనాన్ని పేరు ప్రతిష్టలను పాశ్చాత్య స్థాయిగా వాళ్ళు నిర్వహించిన హోదానందుకో టానికి వాడతారు. ఎమ్.ఎస్. శ్రీనివాస్ ప్రకారం పాశ్చాత్యీకరణ కూడా కులపరమైన ఆశయమే. దేవికారాణికి తన కెరియర్‌లో సామాజిక కోణాలు తెలియకపోవచ్చు గానీ ఆమె వాటివల్లనే బాధితురాలయింది. యమ్మెస్ కూడా తన అమాయత్వంలో పడి తను చేస్తున్న దానివల్ల వచ్చే అనేకానేక ఫలితాల గురించి తెలియకుండానే ఉండి వుండొచ్చు. కానీ ఆమె తన భర్తను అనుసరించే సంప్రదాయం వరకూ పాటించటంవల్ల లాభం పొందింది.

విమర్శకుడైన టి.జి. వైద్యనాథన్ భారతీయుల జీవితాను, ఆలోచలనలను పాలించే అధిపత్య భావజాలపు భావనను సమర్థిస్తూ ఆ సిద్ధాంత స్వభావంలోని వైవిధ్యాన్ని గురించి చెబుతాడు. పైకి ఎదగటానికి సంస్కృతీకరణ చెందిన బ్రాహ్మణీయ భారతీయుడు ఆదర్శంగా నిలుస్తాడని చెబుతూ, ఇలా అన్నాడు "వాళ్ళ ఆశయం, తెలిసో తెలియకో పాలక భావజాల మైన అద్వైత సిద్ధాంతానికి ఎంత దగ్గరగా వీలైతే అంత దగ్గరగా జరగటం". సుబ్బులక్ష్మి కచేరీలలోని ప్రణాళికను వివరిస్తూ "అన్నిసార్లూ అద్వైత కీర్తనలతోనే ముగుస్తుంది. ఆమె కంచి కామకోటి పీఠపు సంగీత హస్తమేమో అన్నట్లుగా" అంటాడు. ఈ వ్యాఖ్య చాలా అతిశయోక్తి అనే చెప్పాలి. యమ్మెస్ ప్రతిసారీ అద్వైత కీర్తనతోనే కచేరీ ముగించదు. అలాగే అద్వైతం అనేక హిందూ అనంగీకార ధోరణులన్నిటిలో పాలక భావజాలంగా గుర్తింపబడలేదు. కానీ వైద్యనాథన్ మాటలవల్ల ఒక పాలక భావజాలం ఉన్నదని తెలుస్తోంది గానీ దాని సారాంశం యిది అని చెప్పలేమని అర్థమవుతుంది.

ఇంకా కొందరు సుబ్బులక్ష్మి "మార్పు"ని సూటిగా విమర్శించేవారున్నారు. ఎవరంటే వాళ్ళు తాము తలచుకున్నంత మాత్రాన తక్కువ నుండి ఎక్కువ కులానికి ఎగబ్రాకగలరనే ఆలోచనే ఆ విమర్శకులు వ్యతిరేకిస్తారు. మత గ్రంథాలను, ఉదాహరణలను పట్టించుకో కుండా, కులం అనే భావనను పలచన చేయటానికి వారు సిద్ధంగా ఉండరు. వారిలో కఠినంగా విమర్శించే వాళ్ళు తిమ్మిని బమ్మిని చేయగల సదాశివం జీనియస్‌కి చెడు ఉద్దేశాలను ఆపాదించితే, మరికొందరు పైకి కనిపించని సుబ్బులక్ష్మి మనస్తత్వంలోని భిన్న కోణాలను చూసి ఆశ్చర్యపడతారు. ఒక తమిళ బ్రాహ్మణుడు నొక్కి ఇలా చెప్తాడు "ఒక స్మార్తుడి భార్యగా గుర్తింపు పొందాలనే ఒక గొప్ప అవసరం ఉద్రేకపు కోరిక ఆమె మనసులో ఉంది" అని. అతని ప్రకారం సదాశివంలో "కళలను ఆనందించే గుణం, తన ఆచారాలకు కట్టుబడి ఉండాలనే అవసరం, పాత బ్రాహ్మణ అలవాటుని అనుసరిస్తూ

ఒక దేవదాసీతో దగ్గరి సంబంధం పెట్టుకోవాలనుకోవటం, ఆమెను పొందిన తర్వాత ఆమెను విధేయురాలైన అయ్యర్ భార్యగా చేయటం" యివన్నీ ఉన్నాయంటాడు. యమ్మెస్ బ్రాహ్మణీకరణను వ్యతిరేకించే అనేకమందిలో లోలోపల ఉండే అసౌకర్యమేమిటంటే ఆమెను అయ్యర్‌గా అంగీకరిస్తే, ఇక అలా బ్రాహ్మణత్వం కావాలనుకుని వరదలా వచ్చిపడే వారందరినీ అంగీకరించాల్సి వస్తుందనేది. మొత్తం కేంద్రీకరణ అంతా మళ్ళీ నా అస్తిత్వ హోదా ఇదని చెప్పుకోవటంలో, దాచుకోవటంలో ఉన్న అగాధం మీదనే ఉంది. పుట్టుక కాకుండా మరొకటి యేదైనా గుణాలు బ్రాహ్మణత్వాన్ని యిస్తాయనే భూతం భయపెట్టినట్లు బ్రాహ్మణులను మరొకటి భయపెట్టదు.

అవి బ్రాహ్మణీయమైనవా, ఇతరమా అనే విషయం అలా వుంచితే సుబ్బులక్ష్మిలోని ఔన్నత్య గుణగణాలను ఏ విమర్శకుడూ కాదనలేడు. ఆమె ప్రాతినిధ్యం వహించినట్లుగా అతి తక్కువమంది భారతీయ సంప్రదాయాలకూ విలువల సారాంశానికి ప్రాతినిధ్యం వహించారు. ఆమెను ప్రపంచానికి కేవలం మరొక గాయకురాలిగా మాత్రమే ఎత్తి చూపించ లేదు. ఈ దేశపు చిరస్మరణీయ సంస్కృతిని వ్యాపింపజేసే గాయకురాలిగా చూపారు. ఆమె వేష భాషలు, ప్రతినిత్యం పాడే కీర్తనలు, వీటన్నిటీ సాధారణ భారతీయతకు ప్రతి రూపంగా, భారతీయ స్త్రీత్వానికి ప్రత్యేక ప్రతిరూపంగా ఉండే పద్ధతిలో అమర్చారు. అనేక భాషలలో ఆమె పాడటం, ఒక హిందీ సినిమాలో కనిపించటం, ఐక్యరాజ్యసమితిలో కచేరీ చేయటం, ఉత్తర భారతదేశపు గాయకులతో ఆమె స్నేహ సంబంధాలు, జాతీయ, అంతర్జాతీయ నాయకులను కలుసుకోవటం ఎంతో జాగ్రత్తగా స్వర సమ్మేళనంలా ఏర్పరచిన వ్యూహాలు ఆమెను కేవలం కర్ణాటక సంగీత గాయకురాలిగా కాక, మరింత ఎత్తులకు ఎదిగిన వ్యక్తిగా చేశాయి. ఈ వాద్య సమ్మేళనంలో సదాశివం ముఖ్యపాత్ర పోషించాడనటంలో సందేహం లేదు. కానీ ఆయా సందర్భాలకు తగినట్లు తన స్వంత రెక్కలపై ఎదగగలిగిన శక్తి సామర్థ్యాలు తనకున్నాయని యమ్మెస్ నిరూపించుకుంది. సదాశివం నైపుణ్యపు నిర్వహణ లేకపోతే ఆమెకిప్పుడున్నంత గుర్తింపు ఉండేది కాదనేది నిజం. ఐతే సదాశివం ఇంకే ఇతర "సంగీతపు ఆస్తి"ని యిట్లాగే నిర్వహించినా యింత విజయం సాధించేవాడు కాదనేది కూడా అంతే నిజం. ఇద్దరి ప్రయత్నాలు,శక్తులూ సమ్మిళితమైన ఒకే ఒక కేంద్ర బిందువు: వాళ్ళు కేవలం సంగీతకళాకారుని మీద కేంద్రీకరించటంలేదు. సంగీతం మీద కేంద్రీకరించారు. కేవలం కర్ణాటక సంగీత అసాధారణ సౌందర్యం మీద కేంద్రీకరించ లేదు. భారతీయ తాత్త్విక భావజాలం మీద కేంద్రీకరించారు. ఈ విశాల దృక్పథం సుబ్బులక్ష్మి స్థానాన్ని చరిత్రలోనే గాక సంస్కృతీకరణ సంప్రదాయాల జ్ఞానసముదాయంలో భద్ర పరచటంలో విజయం సాధించింది.

# 8. సినీరంగ నిష్క్రమణ

*చక్కని రాజమార్గము లుండగ*
*సందుల దూరనేల? ఓ మనసా!*
*చక్కని పాలు మీగడ యుండగ*
*చీయను గంగాసాగరమేల?* ॥చక్కని॥
*కంటికి సుందరతరమగు రూపమే; ము*
*క్కంటి నోట చెలగెడు నామమే; త్యాగరా*
*జింటనే నెలకొన్నది దైవమే, యిటు*
*వంటి శ్రీ సాకేతరాముని భక్తియను* ॥చక్కని॥

సుబ్బులక్ష్మి సంస్కృతీకరణ, ఇంకా మామూలు భాషలో చెప్పాలంటే అయ్యరీకరణ, అనేది వాళ్ళిద్దరూ భార్యాభర్తలుగా స్థిరపడినప్పుడు సదాశివం ముందున్న కర్తవ్యాల జాబితాలో పైన ఉంది. కానీ సదాశివం ముందుగా, ముఖ్యంగా లౌకికుడు. అతనికి ఆర్థిక వనరులు, వ్యాపారాభివృద్ధి లేకుండా సాంఘిక, ఆధ్యాత్మిక పురోగతి పూర్తిగా సాధించ లేమని తెలుసు. రాజాజీతో, ఇతర బ్రాహ్మణ మూలస్తంభాలతో సంబంధ బాంధవ్యాలు నెరపుతూ ఒక ప్రాంతంలో తన పని సులభం చేసుకున్నాడు. మరి ఇంకో ప్రాంతంలో పురోగమనం సాధించటం ఎట్లా? భౌతిక సంపదలు వనగూడాలంటే తనలోని వ్యాపార వ్యవహార దక్షతలకు పనికల్పించాలి. ఐతే అప్పటివరకూ అతనికి అలవాటైన పరిస్థితుల కంటే భిన్నమైన పరిస్థితులిప్పుడున్నాయనే వాస్తవాన్ని అతను గుర్తించాలి.

వివాహానంతరం సదాశివంకు, సుబ్బులక్ష్మికి అంతవరకూ ఉన్న నియమాలు మారాయి – సదాశివంకు ఇప్పుడు ఉద్యోగం లేదు. సుబ్బులక్ష్మికి యిప్పుడు సదాశివం భర్త. ఆమె ప్రేమ, అంకితభావం అన్నీ ఆయనకే చెందాలి. వాళ్ళిద్దరికీ సంబంధించిన నిర్ణయాలన్నీ ఆయనొక్కడే చేస్తాడు. ఐతే వాళ్ళిద్దరూ తమ తమ రంగాలలో బాగా స్థిరపడి ఉండటం వాళ్ళకు కలిసొచ్చింది. పనిలోకి  ఇద్దరూ జీవితంలో చాలా ముందుగానే దిగ వలసి వచ్చింది. పదేళ్ళ వయసులో మొదలుపెట్టిన కచేరీలతో యమ్మెస్ మరొక పద్నాలు గేళ్ళపాటు నిర్విరామంగా పనిచేశాకే 1940 జులై 10న తిరునీర్మలై గుట్టఎక్కి తాళి కట్టించుకోవటం జరిగింది. ఆ రోజుకి సదాశివానికి పాతికేళ్ళు పనిచేసిన అనుభవం వెనక ఉంది. ఇద్దరూ కీర్తి గడించారు. సదాశివం కంటే యమ్మెస్‌కి ఎక్కువ పేరుంది. కానీ వారిద్దరూ ఇంతకు ముందులా తమ జీవితాలను కొనసాగించలేరు. వాళ్ళకు కొత్త సవాళ్ళు ఎదురయ్యాయి. కొత్త పలక మీద తాజాగా జీవితాక్షరాలు రాయాలి.

యమ్మెస్‌ని మొత్తంగా సినిమాలలోంచి తీసెయ్యటం గురించి సదాశివం ఆలోచించాడు. శకుంతలై సినిమా బాక్సాఫీసు వద్ద ఎంత విజయం సాధించినా, ఆ సినిమా హీరోయిన్‌కి కథానాయకుడితో, దర్శకుడితో సంబంధాలు అంటగడుతూ పుట్టించిన పుకార్లు అతనికి చేదు జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. ప్రేమించే రోజుల్లో పుకార్లు పేజీలలో యమ్మెస్ పేరు చూస్తేనే కోపంతో రెచ్చిపోయే సదాశివంకు వివాహం తర్వాత అది మరింత కోపకారణమైంది. సంగీత కచేరీలు సినిమాకంటే భద్రమైన ప్రాంతమవటంతో పాటు, దానిని నిర్వహించటం, ఆ సినీ ప్రపంచం ఆకర్షించే రాక్షస జంతుజాతి నుంచి దూరంగా ఉండొచ్చు. ఎలాగైనా యమ్మెస్ వంటి ప్రావీణ్యం వున్న గాయని శాస్త్రీయ సంగీతం నుంచి పూర్తిగా ఇవతలకు రావటం కుదరదు. రెండు మంచి విజయవంతమైన సినిమాలు ఆమెను ప్రజలకు దగ్గర చేశాయి. ఆ కీర్తినిప్పుడు కర్ణాటక సంగీతంలో ఉన్నత శిఖరాలను జయించటానికి అనువుగా మలుచుకోవచ్చు.

శ్రీమతి సదాశివంను సినిమాలలో నుంచి బైటికి లాగాలనే వైపుగా వేసే అంచనాలు, సదాశివం అతని స్నేహితుడు, సహోద్యోగి అయిన కృష్ణమూర్తి ఉద్యోగ ప్రయత్నాలు, ఆ ఆలోచనలకు సమాంతరంగా పరిగెత్తసాగాయి. వారి వారి వృత్తులలో ఒక సామ్యమున్నట్లుగా సదాశివం వచ్చేసిన తర్వాత ‘ఆనందవికటన్’లో కృష్ణమూర్తి ఎక్కువకాలం ఉండలేదు. కృష్ణమూర్తి వ్యవహారాలకు రాజగోపాలాచారి, జాతీయోద్యమం కేంద్రమైయ్యాయి. అతను 1940లో వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొందామని నిర్ణయించుకున్నాడు. ఈ సత్యాగ్రహంలో వ్యక్తులు స్వచ్ఛందంగా అరెస్టయ్యి జైలుకి వెళ్తారు. కృష్ణమూర్తి ఆనందవికటన్‌లో తన రచనా వ్యాసంగం ఆగదని యస్.యస్. వాసన్‌కు చెప్పాడు. అతను జైలు నుంచే రాస్తాడు; సదాశివం ఆ కాగితాలను ప్రెస్‌లో ఇచ్చి అచ్చయిన వాటికి అక్షర దోషాలు దిద్దిటానికి మళ్ళీ జైలుకి చేరవేస్తాడు. వాసన్‌కు ఆలోచన నచ్చలేదు. అతనికి అప్పటికే వికటన్‌లో వచ్చే విద్రోహపూరిత సంపాదకీయాలవల్ల ప్రభుత్వం నుంచి కష్టాలు రావటం మొదలయింది. అవన్నీ రాసింది కృష్ణమూర్తే. ఒక సంపాదకుడు బ్రిటీష్ జైలులో ఉండి ఉద్యోగం కొన సాగించటమనే ఆలోచన అతనికెంత మాత్రమూ రుచించలేదు. కృష్ణమూర్తిని పత్రిక కావాలో రాజకీయాలు కావాలో ఎంచుకోమన్నాడు. ఏది ఎంచుకోవాలో కృష్ణమూర్తికి బాగా తెలుసు. అతను జైలు నుంచి వచ్చేనాటికి నిరుద్యోగి.

నిరుద్యోగం నిరాశా నిస్పృహలకు కారణం కాకపోయినా ఉదాహరణల్లో ఇది ఒకటి. నిజానికి ఇది ఒక అవకాశం. దానిని సదాశివం వెంటనే కనిపెట్టాడు. కృష్ణమూర్తి “సాహిత్య ఆస్తి” అలా అతనికి స్థిరమైన మార్కెట్ ఉంది. వేలాదిమంది తమిళ పాఠకులు అతని నవలల ఇంద్రజాలానికి లోనై ఉన్నారు. అతని సంపాదకత్వంలో కొత్త పత్రికపెట్టి అదే రకమైన సాహిత్యాన్ని అందిస్తే అది పాఠక జనాలను ఉర్రూతలూగించటమే కాదు

ప్రభావితం చేస్తుంది కూడా. అలాంటి పత్రిక అతనూ, కృష్ణమూర్తి ఆనందవికటన్ రోజులలో అభివృద్ధి చేసుకుని నిర్మించుకున్న భాగస్వామ్యాన్ని తప్పకుండా కొనసాగిస్తుంది. ఈసారి వాళ్ళిద్దరి ప్రతిభలూ జతగలిసి మరింత విజయం సాధించవచ్చు. దానిలో జోక్యం చేసుకోవటానికి అక్కడ ఏ వాసన్ ఉండదని కూడా ఆలోచించాడు. కానీ ఏ వాసనూ ఉండక పోవటమంటే ఈ ప్రయత్నానికి పెట్టుబడి పెట్టేవారెవరూ లేనట్టే.

❖ ❖ ❖ ❖

ఆ సమయంలో సదాశివం తన అదృష్టాన్ని తనే మెచ్చుకుని ఉంటాడు. అతనికి మార్కెట్ చేయటానికి అనువుగా తనవద్ద అత్యంత విలువైన "సాహిత్య ఆస్తి"తోపాటు అత్యంత విలువైన "సంగీత ఆస్తి" కూడా ఉంది. అతనిలా ఆలోచించి ఉంటాడు: కృష్ణమూర్తికి, సుబ్బులక్ష్మికి ఉన్న జనాకర్షణ శక్తిని తన నిర్వహణ నాయకత్వ నైపుణంలో కలిపి ఒకే చోట చేరిస్తే వాళ్ళు సాధించలేనిదేముంటుంది? రాజగోపాలాచారి ఈ ఆలోచనకు ఆమోదించగానే, ముగ్గురూ కలిసి ముందుకు దూకేందుకు ఉత్సాహంగా సిద్ధపడ్డారు. పత్రిక పేరు దానంతటదే వచ్చేసింది. అంతవరకూ కృష్ణమూర్తి రచనలు 'కల్కి' అనే అతని కలంపేరుతో ప్రచారమయ్యాయి. పత్రిక పేరు కూడా "కల్కి" అయితే వెంటనే అమూల్యమైన గుర్తింపు వచ్చి గొప్ప ప్రయోజనం కలుగుతుంది. నిజంగానే అలాగే జరిగింది. కలంపేరు ఉన్న వ్యక్తే కాక, నిర్వాహకుడు యజమాని అయిన వ్యక్తి కూడా పత్రిక పేరుతో గుర్తింపు పొందాడు. వాళ్ళిద్దరూ కల్కి కృష్ణమూర్తిగా కల్కి సదాశివంగా అందరికీ ఎప్పటికీ పరిచితులయ్యారు.

అతని ఖద్దరు కార్యక్రమాల రోజుల నుండీ సదాశివానికి నిధులను సమీకరించటంలో తగినంత అనుభవం ఉంది. ఆ అనుభవమంతా ఇప్పుడు పెట్టుబడి సంపాదించి కల్కిని పట్టాలెక్కించటానికి వినియోగపడింది. ఆయనకు సగర్వంగా ప్రకటించుకునేందుకు రెండు విలువైన పేర్లున్నాయి. నిజంగా యమ్మెస్ సినిమాల విజయానికి ధన్యవాదాలు చెప్పాలి. ఎందుకంటే ఆమెమీద పెట్టుబడి పెట్టటానికి ఎందరో ధనికులు అతని ఇంటి తలుపులు తడుతున్నారు. కానీ సదాశివం వారి ఆలోచనలను అంగీకరించేందుకు సిద్ధంగా లేడు. వారే అతని ఆలోచనలను అంగీకరించాలి. అలాంటి పరిస్థితి మంచి మదుపరులను చాలా రోజులు దూరంగా ఉంచింది. చివరకు వై.వి. రావు అనే సినీ దర్శకుడు వచ్చాడు. అతని ఆలోచన వింటానికి పూర్తిగా సంచలనాత్మకంగా ఉందిగానీ అతనితో వ్యవహరించటానికి అతనేం సామాన్యుడు కాదు. చేతిలో ఇంద్రజాలం ఉన్న సినిమా వ్యక్తిగా రావు అందరికీ తెలుసు. అతను తీసిన ఒక సినిమా ప్రచారం ఇలా వుంది: "కె. అశ్వత్థామ నటించిన, ఎమ్.కె. త్యాగరాజ భాగవతార్ సహకరించిన" ఆ కాలంలో త్యాగరాజ భాగవతార్ మరీ అంత తెలిసిన వ్యక్తి కాదనటానికి ఈ ప్రకటన ఒక గుర్తు. కానీ రావ్ తీసిన

చింతామణి (1937) సినిమా ఒకసారి విడుదలయ్యాక ఒక క్లాసిక్ అయింది. త్యాగరాజ భాగవతార్ ఒక్కసారిగా స్టార్ అయిపోయాడు. ఆ రోజుల్లో ఒక సినిమాను "ఎ.వై.వి. రావ్ ఫిల్మ్" అని ప్రచారం చేస్తే చాలు సినిమా హాళ్ళకు జనం గుంపులు కట్టేవారు.

రావ్ అందించిన అవకాశం సదాశివం నిరాకరించలేనిదయింది. కల్కి పత్రికకు తక్కువైన పెట్టుబడిని తాను సమకూరుస్తాననీ, దానికి తను తీయబోతున్న 'సావిత్రి' సినిమాలో సుబ్బులక్ష్మి నారదుని పాత్రలో నటించాలని అతని ప్రతిపాదన. సదాశివం హడలిపోయాడు. సుబ్బులక్ష్మి పురుష పాత్రలోనా! రావ్‌కి సరిగ్గా అదే కావాలి. పురుష వేషధారణలో యమ్మెస్ జనాలను అయస్కాంతంలా ఆకర్షిస్తుంది. సదాశివం షాక్‌ని మెల్లిగా తగ్గించి నాటకరంగాన్ని ఏలుతున్న రాణి కె.బి. సుందరంబాళ్ 1935లో నందనార్‌గా నటించింది. దానికామెకు చెల్లించిన మూల్యం ఆకాశాన్నంటింది. ఆ వాదన సదాశివంకు నచ్చింది. ఐనా ఆలోచించుకోవటానికి ఒక వారం గడువు అడిగాడు. ముందుగా తన భార్య సినిమాలలో కొనసాగటం మంచిదా కాదా అనే విషయం తేల్చుకోవాలి. అంతే ముఖ్యంగా పురుష పాత్రధారణ యమ్మెస్‌కున్న పేరుకి, గుర్తింపుకీ, ఆమె ఉన్నతి గురించి తన ఆశలకు తగినదా కాదా నిర్ణయించుకోవాలి. రాజాజీతో కృష్ణమూర్తితో చర్చలు జరిపి, యమ్మెస్‌తో పరిహాసమాడుతున్నట్లుగా సంభాషణల్లో ఈ విషయాన్ని ప్రస్తావించి సదాశివం రావ్‌కి తన అంగీకారాన్ని తెలియజేశాడు. "కల్కి" భవిష్యవాణి ఆపుకోలేనంత బలంగా వినిపిస్తోంది. కానీ సదాశివం తన కండిషన్ తనూ ముందుకు తెచ్చాడు. ఆ సినిమా మద్రాసులో తియ్యగూడదు. కలకత్తా న్యూ థియేటర్స్‌లో ఆ సినిమా తియ్యటానికి రావ్ వెంటనే సిద్ధమయ్యాడు. అది చాలామంది తమిళ సినిమా దర్శకులకు అభిమాన ప్రదేశం. మద్రాసు స్టూడియోల్లో పనిచేసే వాళ్ళు, షూటింగు చూసేవాళ్ళు తన భార్య మగవేషం వేస్తే నోరువెళ్ళబెట్టి చూసే అవకాశం ఉండదనే చిన్న సంతృప్తి సదాశివంకు దక్కింది.

పెద్ద సంతృప్తి 'కల్కి'ని ప్రారంభించటానికి కావలసిన డబ్బు రూపంలో దక్కింది. 'సావిత్రి' సినిమాలో వేషంవేసినందుకు యమ్మెస్ ఎంత డబ్బు తీసుకున్నదో అనే విషయం గురించి సదాశివం ఎవరికీ చెప్పలేదు. దాని గురించి ఏ రికార్డు లేదు. రావ్ తన వాదనలకు పదును పెట్టటానికి సుందరంబాళ్ ఉదాహరణను ప్రస్తావించాడు గాబట్టి యమ్మెస్‌కు కనీసం సుందరంబాళ్‌కు ఇచ్చినంతైనా ఇచ్చి వుంటారని ఊహించవచ్చు. మద్రాసులో సినిమా టిట్‌బిట్స్ సంపాదించి రాసేవాళ్ళు గట్టిగా చెప్పేదాని ప్రకారం 'సావిత్రి' సినిమాలో యమ్మెస్ పాత్రకు లక్షరూపాయలు ముట్టింది. ఆ మొత్తం వాళ్ళు కలగన్న ఆ పత్రిక నిజం కావటానికి సరిపోయింది. ఆ తర్వాతి కాలంలో యమ్మెస్ "కల్కి వ్యవస్థాపకులలో ఒకరు"గా గుర్తింపబడటానికి సరిపోయింది.

1941 ఆగస్టులో "కల్కి" మొదటి సంచిక బైటికి వచ్చింది. రెండు నెలల తర్వాత "సావిత్రి" విడుదలయింది. బహుశా మేనేజర్ – నిర్వాహకుడు అయిన సదాశివం జీవితంలో

అతి వేగవంతమైన దశ అయివుంటుంది. “సావిత్రి” సినిమా షూటింగ్ కోసం భార్యతో కలసి కలకత్తా ప్రయాణం చేయటం అవసరం గనుక నిస్సందేహంగా ‘కల్కి’ ప్రారంభ కాలపు పనులు ఆలస్యమై ఉంటాయి. అదే కారణం, ‘కల్కి’ని ప్రారంభించాల్సిన అవసరం రావుని ‘సావిత్రి’ సినిమాను తొందరగా ముగించేలా ఒత్తిడిచేసి వుంటుంది. ఆ కాలంలోని ప్రమాణాలను బట్టి ఆ సినిమా చాలా తొందరగా తీసిన సినిమా అయింది. 1940 చివరి నెలలో శకుంతలై విడుదలయితే, ఎనిమిది నెలలో యమ్మెస్ మూడవ సినిమా తెరమీదకు వచ్చేసింది. ‘సావిత్రి’ని పంపిణీ చేసింది కూడా శకుంతలైతో అనుబంధం ఉన్న మధురైకి చెందిన రాయల్ టాకీస్ డిస్ట్రిబ్యూటర్స్ కావటంవల్ల కొంత మేలు జరిగి ఉండవచ్చు. ఆ సినిమా మంచి కంపెనీలో ఉంది. ‘సావిత్రి’ సినిమా విడుదలైనప్పుడు మద్రాసు థియేటర్లలో ఆడుతున్న ఇతర సినిమాలలో, చారిత్రక ప్రాధాన్యం కలిగిన గొప్ప సంగీతంతో కూడిన, దాల్‌సుఖ్ పాంచోలి నుండి వచ్చిన ‘కషంచీ’ ఒకటి. పృధ్వీరాజ్ కపూర్ ప్రధాన పాత్ర ధరించిన సొహరాబ్ మోడీ తీసిన సికిందర్ మరొకటి.

భారతీయ పౌరాణిక గాథలలో హృదయాన్ని కరిగించే కథలలోని ఒక కథానాయిక ‘సావిత్రి’. ఆమె ఒక రాజకుమార్తె. సత్యవంతుడు మరొక సంవత్సరమే జీవిస్తాడనే హెచ్చరిక ఉన్నప్పటికీ అతనినే వివాహమాడుతానని పట్టుబడుతుంది. అతనికి విధి మృత్యువుని నిర్ణయించిన రోజు సత్యవంతుడు చనిపోతాడు. యమధర్మరాజు అతని ప్రాణాలు తీసుకు పోవటానికి వస్తాడు. ఐతే యముడు సావిత్రితో తలపడాల్సి వస్తుంది. ఆమె యముడిని అనుసరించి నిర్విరామంగా ప్రయాణం చేస్తుంది. ఏంచేసినా ఆమె వెనుదిరగదు. ఆమె అచంచలమైన భక్తి ఆ రోజు చివరకు గెలుస్తుంది. యముడు ఆమె పడిన కష్టాలకు బదులు ఒక వరం కోరుకోమంటాడు. సావిత్రి తనకు సంతానం కావాలనే వరం కోరు కుంటుంది. యముడు ఆ వరం ఇచ్చిన వెంటనే, సావిత్రికి సంతానం కలగాలంటే సత్య వంతుడు పునర్జీవుడు కావాలని గ్రహిస్తాడు. ఈ కథలో మరింకెన్నో కథలలో నారదుడు నిరంతరం వస్తూ పోతూ ఉంటాడు. కథను నడిపిస్తూంటాడు. చిలిపి పనులు చేస్తుంటాడు. పురాణాలలో అతి సంక్లిష్టమైన అతి కౌతూహలమైన పాత్రగా వుండే నారదుడు ఒక రుషి, కృష్ణ భక్తుడు, తనదైన పద్ధతిలో సర్వ స్వతంత్రుడుగా ఉంటాడు. అతను యేవో కథలు చెప్పి సమస్యలు సృష్టిస్తాడని దేవతలు భయపడతారు, ఐనా ఒక వార్తాహరుడిగా అతని ఉపయోగపడే విధానాన్ని చూసి ప్రేమిస్తారు.

రెండు ప్రధాన పాత్రలకు రావ్ నవీనత్వానికి పెద్దపీట వేసి తారలను ఎంచు కున్నాడు. ‘సావిత్రి’ పాత్ర ప్రఖ్యాత మరాఠీ నటి, బొంబాయి సినీ ప్రపంచంలో తనకంటూ ఒక స్థానాన్ని యేర్పరుచుకున్న శాంతా ఆప్టేను వరించింది. బొంబాయి నుంచి ‘దిగుమతి’ చేసుకున్న తార తమిళ సినిమా అభిమానులలో విస్తృతమైన కుతూహలాన్ని కలిగిస్తుందని

అంచనావేసి వుంటాడు. నారదుడి పాత్రకు యమ్మెస్‌ని ఎంచుకోవటానికున్న కారణాలు స్పష్టమే యమ్మెస్ పురుష పాత్రలో కనపిస్తుందనే కేవల సంచలనంతోపాటు ఆ పాత్ర కేవలం పాటలు పాడే పాత్ర. దేవ గాయకులైన గంధర్వుల గురువు నారదుడు సంగీతంలో సాటిలేని విద్వాంసుడు. అతని మెడకు ఎప్పుడూ వీణ వేలాడుతుంటుంది. తమిళ పౌరాణిక సినిమాలలో అతను తప్పకుండా ఉంటాడు. అతనివల్ల సంగీతాన్ని ప్రవేశపెట్టే అవకాశంతో పాటు కథను రకరకాల మలుపులు తిప్పే అవకాశమూ ఉంటుంది.

నటనలో చూస్తే, శాంతా ఆప్టే, యమ్మెస్ ఇద్దరూ నాసిరకంగానే చేశారు. కొందరు విమర్శకులు శాంతా ఆప్టే ఆ పాత్రకు లావుగా ఉందనీ, తమిళంలో సంభాషణలు పలకటానికీ, పాటలు పాడటానికీ కష్టపడిందనీ అన్నారు. అది సహజమే కానీ కెయస్ఎన్ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో భిన్నమైన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. అతను శాంతా ఆప్టే “గొప్ప నాటకీయ ఆకర్షణనిచ్చింది...భాషా అవరోధాన్ని అధిగమించింది...చివరి దశలో యమునితో ఘర్షణ పడినప్పుడు ఆమె నటన, పాటలు ఆమోఘం” అని రాశాడు.

యమ్మెస్ విషయంలో భాషా సమస్య లేదు గానీ వేషధారణ, నాటకీయత తప్పని సరి సమస్యలయ్యాయి. నారదుడు సంప్రదాయకంగా వక్షస్థలంపై ఏ ఆచ్ఛాదన లేకుండా చిత్రించబడ్డాడు. తలలో మెడలో పూలహారాలు ధరిస్తాడు. యమ్మెస్‌కు పాతికేళ్ళు వస్తున్నాయి. ఆమె తప్పనిసరైన పూలనూ వీణను ధరించింది. కానీ ఆమె అంగీ వేసుకున్న మొదటి నారదుడయింది. తర్వాతి రోజులలో అనేకమంది నటీమణులు ఆ పాత్రను పోషించారు గానీ యమ్మెస్ ఈ సినిమాలో ఇచ్చిన అరుదైన విలువను ఎవరూ ఇవ్వలేదు. ఆమె యవ్వన దశలో సన్నగా, పురుష వేషం కళ్ళకు మరింత అందంగా కనపడుతుండగా నిలిచింది. ఈ అంశం రావ్ ఆలోచన దృష్ట్యా ఉపయోగకరమే. కానీ సమీక్షకులు ఇతర విషయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. 25 అక్టోబర్ 1941న ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో కెఎస్ఎస్ ఇలా రాశాడు : మనం తెరమీద సంగీత వ్యాయామాలు చేస్తూ ముందుకొచ్చే అసాధారణ నారదులకు అలవాటుపడి ఉన్నాం. కానీ ఇక్కడి నారదపాత్ర ఒక ప్రత్యేక శైలిలో ఈ సంగీత రుషి పాత్రకు తగినట్లుంది. ఈ నారదునికి ఒకటే లోపం – చిన్న పిల్లలా సున్నితమైన ముఖం. బ్రహ్మర్షికి త్రిలోక సంచారికి తగిన ఆకారం బొత్తిగా లేదు” ఈ సమీక్షకుడు ఆ లోపాన్ని ఉపేక్షించటానికి సిద్ధంగా ఉన్నాడు. ఎందుకంటే పాటలను అతను గొప్పగా పొగిడాడు: “యమ్మెస్ ఈ పాత్రలో ఇంతకు ముందు తను నటించిన పాత్రలన్నిటినీ మించిపోయింది. ఆమె పాడిన కొన్ని రాగమాలికలలో గొప్ప సంగీత శిఖరాలకు చేరింది.”

‘సావిత్రి’లో యమ్మెస్ పాడిన కొన్ని పాటలు చిరకాలం నిలబడేవి. బహుశా వాటన్నిటిలోకి గొప్పపాట “బృహి ముకుందేతి” అనే కురంజి రాగంలో అది తాళంలో

ఉన్న కీర్తన సదాశివ బ్రహ్మేంద్ర రచన. పాటలన్నీ భక్తి సాహిత్య ప్రేరణతో ఒక పరమ రుషి ఈశ్వరుని పలు పవిత్ర నామాలను కేశవ, మాధవ, గోవింద, కృష్ణ, అనంత అంటూ ఉచ్చరించేవి. ఈ కృతిలో గాయనికి తన ముద్ర, శైలీ చూపించటానికి అసాధారణమైన అవకాశం ఉంటుంది. ముఖ్యంగా కీర్తన ముగింపులో అది ఎంతో ఉంటుంది. సావిత్రిలో యమ్మెస్ ఈ పాట పాడినతీరు ఎంత ప్రజాదరణ, ప్రాచుర్యం పొందిందంటే ఆ పాట ఆమె గంభీరమైన శాస్త్రీయ కచేరీలలో స్థానాన్ని సంపాదించుకుంది. పిట్టకథలను సేకరించటాన్ని, చెప్పటాన్ని ఇష్టపడే సదాశివం, తర్వాతి రోజుల్లో, న్యూ థియేటర్స్‌లోని కళాకారులు, సాంకేతిక నిపుణులు కె.యల్. సైగల్, కానన్ బాల, పంకజ్ మల్లిక్, పహారి సన్యాల్ వంటి దిగ్గందులైన విద్వాంసులు యమ్మెస్ రికార్డింగు ఉన్నప్పుడంతా స్టూడియోలో గుమిగూడేవారని చెప్పేవాడు. వాళ్ళు ఆమెను తమకిష్టమైన మరికొన్ని పాటలు పాడమని అడిగేవారట. ముఖ్యంగా “బృహి ముకుందేతి”ను పాడమనేవారట. ఆ అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ యమ్మెస్ యిలా చెప్పారు: “ఆ రోజుల్లో మాకు పోటీ తత్త్వంలేదు. మంచి సంగీతం ఎక్కడ దొరికినా ఆనందించేవాళ్ళం”. సావిత్రికి రావలసిన గుర్తింపు వచ్చిందనటంలో సందేహం లేదు. దానికి కారణం పాటలు, వాటిని పాడిన గాయని. ఐతే ఆ సినిమా బాక్సాఫీసు వద్ద చరిత్ర సృష్టించలేదు. వై.వి. రావు “చింతామణి” ఎత్తులకు మళ్ళీ ఎన్నడూ చేరుకోలేదు. యమ్మెస్ కెరియర్‌లో సావిత్రి ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచింది గానీ మిగిలిన మూడు సినిమాలు ఇచ్చిన విజయ భావనను యివ్వలేదు. ఒకే ఒక్క విజయం యేమిటంటే ‘సావిత్రి’ సినిమా ‘కల్కి’ పత్రికను వాస్తవం చేసింది.

కల్కి తన ముద్రవేసి చూపటానికి ఎంతో కాలంపట్టలేదు. యూరప్, ఆసియాలలో రెండవ ప్రపంచ యుద్ధం భారతదేశంలో స్వాతంత్ర్యోద్యమం కీలక దశల్లో ఉన్న కారణంగా విపరీతమైన అల్లకల్లోలాలతో కూడి ఉన్న కాలం అది. జర్మనీ దేశం 1941లో రష్యాపైన దాడి చేసింది. బర్మా పైకి జపాన్ దండెత్తి ఇండియా సరిహద్దుల వరకూ వచ్చింది. ఇండియాలో సాహిత్య ప్రియులు జేమ్స్ జాయిస్, వర్జీనియా ఉల్ఫ్, రవీంద్రనాథ్ ఠాగూర్ల మృతికి విచారంలో మునిగిపోయారు. ప్రతిరోజు ఏదో ఒక వార్తతో దేశం అట్టుడుకుతోంది. రాజకీయ వ్యాఖ్యల కోసం, ఉన్నత ప్రమాణాలతో కూడిన సాహిత్య గ్రంథాల కోసం ప్రజలు ఆకలిగొని ఉన్నారు. కల్కి కృష్ణమూర్తి కలం ప్రజాభిరుచిని సంతృప్తిపరుస్తోంది. సదాశివం నిర్వహణ శక్తి సామర్థ్యాలు యాజమాన్య హోదాతో కొత్త ప్రేరణ పొందాయి. సృజనాత్మక విశ్వసనీయత వ్యాపార దక్షత కలిసి ‘కల్కి’ తమిళ చరిత్రలో భాగమై వృద్ధి చెందింది. కృష్ణమూర్తి, సదాశివం, సుబ్బులక్ష్మి, రాజగోపాలాచారి ముందు నడిచే ఉత్సవ మూర్తిగా పెట్టుకుని మద్రాసులో బ్రాహ్మణ ప్రపంచంలో సాంస్కృతిక పునరుజ్జీవన యోధులకు సంకేతంగా నిలిచారు. పత్రికలో సీరియళ్ళ రూపంలో కొత్త చారిత్రక నవలలు

“పొన్నియన్ సెల్వన్” “శివకామియన్ శపథం”లు రావటంతో ఈ పునరుజ్జీవనం పతాక స్థాయికి చేరింది.

❖ ❖ ❖ ❖

ఐతే సదాశివంకు జీవితం ఎప్పుడూ ఒక తాటి మీద నడిచేది కాదు. “కల్కి” ఆవిర్భావానికీ, ఆ పత్రిక సృష్టించిన పత్రికా రచనల - సాహిత్యాల విశ్వానికి, తాను కేంద్రమయినందుకు సంతృప్తితో ఆనందంలో మునిగిపోయాడు. కల్కి ఆఫీసనే తేనెపట్టు నుంచి (మద్రాసులో ఎగ్మూర్ రైల్వే స్టేషన్‌కు ఎదురుగా ఉండేది) ఆ దృశ్యాన్నంతా అవలోకించి, చూసినదాన్నించి సంతోషం పొందేవాడు. ఐతే మిగిలిన ఆసక్తులన్నిటినీ పక్కనబెట్టి పత్రికకు మాత్రమే పరిమితమయ్యే ఉద్దేశం అతనికి లేదు. అంతకంటే మరింత ముఖ్యమైన విషయం తన భార్య కెరియర్. సినిమా కూడా పూర్తయిన తర్వాత ఆమెనెలా రూపుదిద్దాలనే ఆలోచనే ముఖ్యం. సావిత్రి సినిమా ‘శకుంతలై’లాగా లైంగిక సంబంధాలవంటి చిల్లర విషయాల గురించిన పోచుకోలు మాటలను పుట్టించలేదు. కానీ అది విజయ విద్యుత్ తరంగాలనూ పుట్టించలేదు. యమ్మెస్‌కిగానీ, సదాశివంకు గానీ సినిమా పనిమీద అంత ఆసక్తి ఉన్నట్టు ఆకలితో ఉన్నట్టు కనిపించలేదు. యమ్మెస్ క్రమంతప్పకుండా కర్ణాటక సంగత కచేరీలకు వెళ్తూవుంది. ఆమె ఎప్పుడూ కచేరీ వేదిక మీదనే తన సహజమైన రీతిలో వుంటాననీ, సినిమా స్టూడియోలో ఎప్పుడూ అలా ఉండనని గ్రహించింది. సదాశివం కూడా కర్ణాటక సంగీతం చుట్టూ ఆవరించిన దివ్య తేజస్సు వైపే ఆకర్షితుడయ్యాడు. గాన కచేరీల కార్యక్రమాల గురించి అతనికున్న సాధారణ పరిజ్ఞానం ఇప్పుడు గాఢమైన ఆసక్తిగా పరిణమించింది. తన భార్య కచేరీలను చాలా శ్రద్ధగా ఆలకించే శ్రోతగా అయ్యాడు. ప్రతి శబ్దాన్ని, వ్యక్తీకరణలో అతి చిన్న తేడాలను, కచేరీ సమయంలో ఆమె హావభావాలను తనలో యింకించుకుంటూ సంగీతం ఆస్వాదించటం బాగా తెలిసిన రసికుడుగా సాటిలేని నైపుణ్యాన్ని సంపాదించుకున్నాడు. ప్రదర్శనలో తెలివిగా తెలిసీ తెలియనట్లు చేసే సున్నితమైన, క్లుప్తమైన స్వర విన్యాసాలపై అధికారం సంపాదించటంవల్ల అతను యమ్మెస్ సంగీత కచేరీల వృత్తిని రూపుదిద్దటంలో మార్గదర్శకుడు, ప్రేరణ యిచ్చేవాడు అయ్యాడు.

యమ్మెస్, సదాశివం సావిత్రి సినిమా తర్వాత తమకున్న అవకాశాలను గురించి తర్జన భర్జనలు పడినప్పుడు భవిష్యత్తు సంగీతంలోనే ఉంది గాని సినిమాలలో లేదనేది వారికి స్పష్టమైంది. కానీ ముఖ్యమైన ప్రశ్న యేమిటంటే: సంగీతంలో ఏవిధమైన భవిష్యత్తు ఉండబోతుంది? సదాశివం పక్కన ఉన్నాడంటే, అది సామాన్యంగా ఉండటం సాధ్యపడదు. 1940వ దశాబ్దంలో కర్ణాటక సంగీతంలో అత్యున్నత ప్రతిభావంతులు ఎందరో ఉన్నారు. అప్పటికే యమ్మెస్ కూడా అగ్రశ్రేణి గాయకురాలిగా లెక్కింబడుతోంది. కానీ విషయాలన్నిటినీ గమనించినప్పుడు సదాశివంకు ఆ స్థాయిలోని ప్రతిభావంతులైన గాయకులు కూడా

తేనెటీగల గుంపులా ఉన్నారు. యమ్మెస్ వాళ్ళందరి మధ్యలో దూసుకుని ముందుకు వెళ్ళి అసాధారణమైనదేదో సాధించాలంటే ఆమె అందరికంటే భిన్నంగా ఉండాలి. యమ్మెస్ నటించిన సినిమాలవల్ల ఆమెకు ఇతరులతో సాటిలేని ప్రజాదరణ ప్రచారం దొరికిందని సదాశివంకు తెలుసు. ఇప్పుడు ఆ ప్రజాదరణ మీదనే నిర్మాణం జరిపి యమ్మెస్‌కు తన స్వంతదైన తగిన స్థానాన్ని ప్రతిష్ఠించటం యిప్పటి సవాలు.

ప్రణాళికా రచనలో సదాశివం గొప్పగా రాణిస్తాడు. సంగీతమే యమ్మెస్ ప్రధాన వాహనమని నిర్ణయించుకున్న తర్వాత అతను ఉన్న దృశ్యాన్నంతా చాలా సునిశితంగా, శ్రద్ధగా పరిశీలించాడు. కర్ణాటక సంగీతం ప్రధానంగా దక్షిణ భారతదేశం లోపలనే పుట్టి పెరుగుతున్నదనీ, ఎవరైనా దానిలో అందరికంటే భిన్నమైనదేదో చేయాలంటే ద్రవిడ దేశ, ద్రవిడ భాషా సరిహద్దులను దాటి వెళ్ళాలనీ అతనికి తట్టింది. ఇది చాలా స్పష్టంగా అందరికీ తెలిసే ఐడియానే అయినా, అన్ని గొప్ప ఐడియాలలాగానే దీనిని గురించి ఇంతకు ముందెవరూ ఆలోచించలేదు. ఈ ఐడియా సదాశివంకు బాగా నచ్చింది. అతను జీవితమంతా కొందరి ఆరాధనీయులుగా చేస్తూ, ప్రయోజనకరమైన కారణం కోసం ప్రచారకుడిగా పనిచేస్తూ వచ్చాడు. ఇప్పుడు యమ్మెస్సే కారణం. పని ఇంతుకుముందు తను నిర్వహించిన అన్నింటికంటే అత్యుత్తమమైంది. అతనింకా బాగా పనిచెయ్యగలడు ఈ కారణాన్ని బాగా అమ్మగలడు. అతను ఖద్దరుని అసంప్రదాయిక పద్ధతుల్లో అమ్మాడు. ఆనంద వికటన్‌ను సాహసోపేతంగా, భిన్నమైన రీతిలో అమ్మాడు. అంతకుముందు అతను పనిచేసిన హేతువులన్నిటికంటే యమ్మెస్‌లోని సహజమైన మౌలికమైన గుణాలు ఆమెను ఎంతో శక్తివంతమైన హేతువుగా చేశాయి. ఆమె లక్షణాలకు న్యాయం చేయగల మూసలో, అచ్చులో ఆమెను తిరిగి కూర్చోబెట్టగలగాలి. అంతే. కొత్త రూపంతో ఆమె కొత్త ప్రపంచాలను గెలవగలదు. ఆమె కంఠస్వరానికున్న శక్తినీ, నైపుణ్యంతో దానిని వాడగల సామర్థ్యాన్నీ బట్టి చూస్తే – ఆమెను దక్షిణ భారతదేశం ఆమోదించినట్లుగా ఉత్తర భారతదేశం ఎందుకు ఆమోదించదు? ఆమె ప్రపంచమంతా గుర్తించే శాస్త్రీయ సంగీతకారిణిగా ఎందుకు తయారవకూడదు? ఉద్యమానికి, ప్రచారానికి ప్రణాళికవేయాలి. ఒక ప్రభుత్వాధికారాన్ని కూలదోసే విధ్వంసయత్నమంత ప్రయత్నం కొనసాగించాలి.

ఈ ఆశయం సాధించటానికి కావలసిన వ్యూహాలను రచించటానికి కావలసినంత సమయం వుంది. 1940వ దశాబ్దపు తొలి సంవత్సరాలు మద్రాసు నగరవాసులు నిర్వాసితులయిన కాలం. యుద్ధ సమయంలో ఆ నగరం శత్రువులకు గొప్ప ఆకర్షణ అయింది. కారణమేమిటో గానీ వాళ్ళు కలకత్తా, బొంబాయిల కంటే మద్రాసు మీద దాడి చేయటానికి ఇష్టపడ్డారు. మొదటి ప్రపంచయుద్ధ సమయంలో ఎమ్‌డెన్ అనే జర్మన్ నావికాదళ యోధుడు మద్రాసు మీద దాడిచేసి హైకోర్టు భవనపు గోడను మరికొన్ని

నిర్మాణాలను కూలగొట్టాడు. (ఆ నౌక ఇంజనీరుగా జర్మన్ నివాసి అయిన మలయాళీ విప్లవకారుడు చంపకారమన్ పిళ్ళై ఉన్నాడని పుకార్లు ఉన్నాయి) 1942లో, రెండవ ప్రపంచ యుద్ధం ముమ్మరంగా జరుగుతున్నప్పుడు జపాను మిలటరీ మిషన్ ముందుకు రావటంలో నగరం భీతిల్లింది. కాకినాడ విశాఖపట్టణం (ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోని నగరాలు)ల మీద ఏప్రిల్‌లో బాంబులు పడ్డాయి. దాంతో మద్రాసులో భయాందోళనలు రేగాయి. మద్రాసు నగరమంతా ఖాళీ అయ్యేలా కనపడింది. చివరకు అక్టోబర్‌లో ఒక జపాను విమానం మద్రాసు మీదుగా కనిపించి, హైకోర్టు ముందున్న సముద్రతీరంలో రెండు బాంబులు వేసింది. దాని మూలంగా ఎలాంటి నష్టమూ జరగలేదు.

విస్తృతంగా వ్యాపించిన ఈ యుద్ధ భయం సదాశివం వంటి అతి చురుకైన పని మంతులను కూడా బలవంతపు అకర్మణ్యతలోకి నెట్టింది. కానీ అలాంటి వారికి పనిలేక పోవటమంటే కొత్తపనికి తయారయ్యే సమయం అని అర్థం. జపానువాళ్ళు ఇచ్చిన సమయాన్ని సదాశివం యమ్మెస్‌కి, తనకు సంబంధించిన స్పష్టమైన ప్రణాళికలు రచించ టానికి ఉపయోగించాడు. ఆ సమయంలో ఆమెకంత పేరు రావటానికి విజయవంతమైన ఆమె సినిమాలే కారణమని గ్రహించాడు. ఆ పేరుని మరింత పెంచటానికి ఆ సినిమానే మళ్ళీ వాడుకోవటం మంచి మార్గమనుకున్నాడు. కొత్త సినిమా, జాగ్రత్తగా ఆలోచించి, శకుంతలై సృష్టించిన ప్రేమ, రొమాంటిక్ ముద్రలను, సావిత్రిలోని పాటల పక్షినీ తుడిచి వేసేదిగా చూడాలి. ఆ రొమాంటిక్ రూపాన్నితీసి ఒక ఆధ్యాత్మిక రూపాన్ని ప్రతిష్టిస్తే? సరైన ఆదర్శవంతమైన సినిమానే దక్షిణాదిని దాటి ఆమె పేరుని, గౌరవాన్ని వ్యాప్తిలోకి తేగలదు. అదీ పూర్తిగా భిన్న ప్రాంతమైన మతం, నిజాయితీ స్వభావము దీనిలోకి ప్రవేశించాలి. అలాంటి సంఘటన మాత్రమే యమ్మెస్‌ను ఒక సాధారణ సినీ గాయకుల ప్రాంతంలోంచి ఒక ఉన్నతస్థానంపై ఉంచగలదు.

❖ ❖ ❖ ❖

సినిమా రంగంలోకి మరోసారి దూకటమనే ఆలోచన సదాశివంలో చురుకు పుట్టించింది. ఐతే ఇప్పుడు ఆయన దృష్టిపెట్టిన ఒకే ఒక్క ఆశయం, 'సావిత్రి' సినిమా నాడు ఆయనకున్న ఆశయానికంటే చాలా భిన్నమైనది. ఉత్తర దక్షిణ భారతదేశాలను ఆకర్షించగల కథాంశం కావాలి. అది అతని భార్యకున్న ప్రత్యేక ప్రతిభా సామర్థ్యాలను తగినదై ఉండాలి. ఆమె ఎలాంటి రూపగుణాలతో ప్రతిఫలించాలని అనుకుంటున్నాడో దానికీ తగినదై ఉండాలి. అప్పటివరకూ తమిళనాడుని దాటి అవతలికి వెళ్ళనివాడు, స్కూలు చదువు మధ్యలో వదిలేసి వచ్చినవాడు అయిన సదాశివంకు ఉత్తర దక్షిణ బేధాలను అధిగమించే కథాంశాలతో వ్యక్తిగతంగా పరిచయం లేకపోయింది. 'సావిత్రి' సినిమా తియ్యటానికి మూడేళ్ళ ముందు 1938లో వై.వి. రావ్ "భక్త మీరా" అనే సినిమా తీశాడు.

ఐతే ఆ సినిమా విజయం సాధించలేదు. కానీ రాజగోపాలాచారి వంటి విద్యావంతులైన గురువులతో, కల్కి కృష్ణమూర్తి వంటి సాహితీ మూర్తులతో, తనకు తెలిసిన ఉత్తరాది వారితో సదాశివం ప్రాథమిక చర్చలు చేస్తున్నప్పుడు ఆ కథా వస్తువు ఎదురయింది. జపాన్ భయం పోయాక, అతను యమ్మెస్‌తో కొత్త సినిమా తీయటానికి సిద్ధమయ్యాడు. ఆ సినిమా మీరాబాయి జీవితంపై కేంద్రీకరించబడింది. మీరాబాయి రాజస్తానీ రాకుమారి, ప్రతి ఉత్తర భారతీయ వ్యక్తికీ ఆ పాత్ర పరిచితమే. ఆమె భక్తి కవయిత్రి గాబట్టి ప్రాచుర్యంలో వున్న ఆధ్యాత్మికతా చిహ్నంగా ఉంటుంది. మీరాబాయి భక్తితో ప్రేరణ పొందిన మధ్య యుగపు గాయకురాలు. గనుక గాయకురాలైన తన భార్య పోషించటానికి బాగా అనువైన పాత్ర. వీటన్నిటినీ మించి మీరాని ఒక ప్రేమమయి అయిన యోగినిగా భారతదేశం మొత్తం ఆమోదించింది. సదాశివం ప్రణాళిక ప్రకారం తనే ఒక పవిత్ర యోగిని పాత్రగా మారాలనుకునే యమ్మెస్‌కు మీరా పాత్ర కంటే తగినదేముంటుంది?

యమ్మెస్ నటించిన తొలి సినిమాల కథలు గానీ వాటి ప్రయోజనాలు గానీ సంకుచితమైనవేమీ కావు. సేవాసదనం సాంఘిక వాస్తవాలను ప్రతిఫలించి విశ్వజనీనమైన సందర్భానికి సరిపోయేది. ఇక "శకుంతలై" "సావిత్రి" సినిమాలలోని పాత్రలు ఈ దేశపు పౌరాణిక కథానాయకులు భారతీయ జీవనంలో ఎంత భాగమైపోయారంటే, ప్రతి భాషా, ప్రతి ఉప సంస్కృతీ వారిని తమ స్థానికతలో కలిపేసుకుని, ఆ నీతి కథలను తమ జీవితాలలో అంతర్భాగం చేసుకుంటాయి. దీనికి విరుద్ధంగా 'మీరా' ఎలాంటి పొరపాటుకీ ఆస్కారం లేకుండా ఉత్తర భారతీయురాలు. ఆమె భక్తి విశ్వజనీనమైనదిగా గుర్తింపబడినప్పటికీ ఆమె వ్యక్తిత్వం పూర్తిగా రాజస్థానీగానే, కథలో అనేక సందర్భాలలో వచ్చే అంశాలు నిరూపిస్తాయి. ఆ విధంగా ఆమె ఒక దక్షిణ భారతీయురాలికి వింధ్య పర్వతాలను దాటే ఆదర్శ మార్గాన్ని చూపించింది.

ప్రాథమికంగా ఈ కథ చారిత్రకమైనా, కొంత పౌరాణికత్వం చేరింది. మీరాబాయి 16వ శతాబ్దపు రాజపుత్ర రాకుమారి. చిన్నతనంలో అలవడిన కృష్ణభక్తి ఆమె జీవితకాలపు తీవ్రమైన మోహావేశపు ప్రేమగా రూపుదిద్దుకుంది. మేవార్ మహారాజుతో వివాహంగానీ, ఆమె భర్త మరణానంతరం అంతఃపుర కుట్రలు, ఆమెకు విషం ఇచ్చే ప్రయత్నాలు, ఏవీ కూడా మీరాను ఆమె పూర్తిగా మునిగిపోయిన దైవారాధన వ్యాపకాన్నించి దూరం చేయ లేకపోయాయి. ఆమె రాజమహల్‌ని వదిలేసి ద్వారకలో స్థిరపడింది. (ద్వారక గుజరాత్ పశ్చిమ తీరాన ఉంటుంది) ఈ నగరాన్ని శ్రీకృష్ణుడు నిర్మించాడు. అక్కడ మతపరమైన జీవిత విధానం ఉంటుంది. ఆమె జీవితంలోని నాటకీయ ఘట్టాలు, కథాంశానికి సినిమాకు అవసరమైన విషయాన్నివ్వటంతోపాటు, మీరా జీవితంలోని ప్రేరణాత్మక గుణం ఎవరూ కాదనలేనది. భక్తి ఉద్యమంలో శక్తివంతమైన ప్రచారకునిగా, ఆమె కృష్ణప్రేమను కవిత్వంలో

వ్యక్తీకరించింది. ఆ కవిత్వంలో రోజువారీ జీవిత సంబంధాలు, ప్రేమికుల మధ్యనుండే సంబంధాలతో సహా వస్తువులుగా ఉంటాయి. ఆమె తన కవితలను హిందీ మాండలికమైన బ్రిజ్ భాషలో రాసింది. అవి జన సమూహాల హృదయాలలోకి నేరుగా దూసుకెళ్ళాయి. దానికి కారణం ఆమె వాడిన సామాన్య జన వ్యవహారిక భాష, తేలికగా అర్థమయ్యే కల్పనా చిత్రాలు, విశ్వజనీనమైన ఉద్రేకాలు, ఉద్వేగాలు.

సదాశివం 'మీరా' సినిమాను పూర్తిగా తనే నిర్మిద్దామని నిర్ణయించుకున్నాడు. ఏ మదుపరికీ సహ నిర్మాతకు, భాగస్వామికి జవాబుదారీగా ఉండకపోవటం అతనికిదే మొదటిసారి. చంద్రప్రభా సినీటోన్ పతాక మొక్కటే ఆ సినిమామీద వెలుగులు చిమ్ముతూ రెపరెపలాడుతూ ఎగురుతోంది. కెమెరా ముందు వెనకాల కూడా తనకు బాగా యిష్టమైన కళాకారులను కచ్చితమైన బాక్సాఫీసు అప్పీలు ఉన్నవాళ్ళను స్వతంత్రంగా ఎంచుకున్నాడు. సినిమా కథానాయికా ప్రాధాన్యత కలది కాబట్టి, పెద్ద స్థాయి కథానాయకుడి అవసరం లేదు. మిగిలిన నటులలో మంచివాళ్ళు రెండవ శ్రేణికి చెందిన వారైన వి. నాగయ్య, యస్. బాలయ్య, టి.యస్. దొరైరాజ్, సెరుక్కాలతూర్ సామ మొదలైన వారున్నారు. ఒక చిన్న పాత్రలో తలపాగా ధరించి యమ్.జి. రామచంద్రన్ కనిపిస్తాడు. తర్వాతి రోజులలో అతనొక ఆరాధ్యనీయుడైన నటుడిగా, తర్వాత తమిళనాడు ముఖ్యమంత్రిగా అయిన విషయం తెలిసిందే. ఆ కాలంలో దక్షిణ భారతీయ సినిమా రంగంలో సహజమైన హాస్యం పండించటంలో సాటిలేని ఎన్.యస్. కృష్ణన్, టి.ఎ. మధురం కూడా ఈ సినిమాలో నటించారు. (ఐతే కృష్ణన్ నిజ జీవితం విషాదాంతమైంది. 1944 డిసెంబర్‌లో కృష్ణన్ లక్ష్మీకాంతం హత్యకేసులో అరెస్టయ్యాడు. తర్వాత జైలు జీవితం అతని వృత్తిని నాశనం చేసింది) దర్శకుడిని, సంగీత దర్శకుడిని నియమించటంలో సదాశివం ఎలాంటి ఛాన్సూ తీసుకోదల్చుకోలేదు. "శకుంతలై" సినిమాకి పనిచేసిన ఎల్లిస్ డంగన్‌ని, యస్.వి. వెంకట్రామన్‌ను పెట్టాడు. కల్కి కృష్ణమూర్తి సంభాషణలు రాశాడు. కొన్ని పాటలూ రాశాడు. వాటిలో బాగా పేరొచ్చిన పాట "కత్రినిలయె వరుం గీతం" అతను రాసినదే.

మీరా 1945వ సంవత్సరంలో దీపావళినాడు విడుదలయింది. యమ్మెస్ నటించిన నాలుగు సినిమాలలో ఉత్తమమైనదిగా ప్రశంసలు పొందింది. సాధారణంగా సినిమాలు చూడనివారు కూడా దీనిని మంచి సినిమాగా గుర్తించారు. మద్రాసులోని సాగర్, ప్రభాత్ థియేటర్లలో ప్రదర్శించబడినప్పుడు, మొదటి వారంలో గుంపులు గేట్లు తోసుకుంటూ, హాలు లోపలకు వచ్చేశారు. అక్షరాలా వేలాదిమంది థియేటర్ల మీద పడటంతో, వందల పోలీసులు వచ్చిపడ్డారు.

పంపిణీదారులైన నారాయణ & కో వారు పత్రికలలో మొదటి పేజీ ప్రకటన యిస్తూ "మీ స్వప్న సంగీతపు సినిమా" అని శీర్షిక పెట్టారు. అభిమానులందరికీ ప్రత్యేకంగా

ఆ సినిమాలోని హిట్టయిన పాటలు హెచ్‌యమ్‌వి రికార్డులుగా దొరుకుతాయని తెలియజేశారు.

పాటల మీద ఎక్కువ శ్రద్ధ పెట్టటం, కథని ఎంచుకోవటం, వీటి వల్ల "మీరా" సినిమా అంతా యమ్మెస్ గురించే ననేదానిలో ఏ సందేహానికీ తావు లేకుండా పోయింది. ఐతే ఆమె నటనా సామర్థ్యం పెద్దగా ప్రభావం చూపించలేదు. యమ్మెస్ గురించి ఏమాత్రం కఠినంగా చెప్పటానికి మాటలు రాని కె.ఎస్.ఎన్ కూడా ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సమీక్షలో చాలా నిగ్రహంతోనే యిలా రాశాడు : "యమ్మెస్ కొన్ని సన్నివేశాలలో నాటకీయ ఆకర్షణా శిఖరాలను చేరే లక్షణాలను కనుపరిచింది గానీ, మొత్తం మీద, తన పూర్వపు సినిమాలలో చేసిన కృషి కంటే మంచి పురోగతిని చూపించినప్పటికీ, ఉద్వేగ భరిత సన్నివేశాల్లో మరింత బాగా చెయ్యటానికి అవకాశం వుంది." ఐతే రెండు విషయాలు ఆమెకు అనుకూలించాయి. ఆమె ఇంతకు ముందు ధరించిన పాత్రలకంటే మీరా పాత్ర యమ్మెస్‌కు దగ్గరగా అనుకూలంగా ఉంది. చాలా సన్నివేశాలలో, యమ్మెస్ నటించనవసరం లేకపోయింది; ఆమె తనలా ఉంటే సరిపోయింది. రెండవది, ఎప్పటిలాగానే, సంగీత ప్రధానమైన సినిమాలలో ఎలాగైనా నటనకు అతి తక్కువ ప్రాధాన్యం వుంటుంది. గానమే అసలు విషయం. అక్కడ యమ్మెస్ తనను తాను అధిగమించింది. కె.ఎస్.ఎన్ "యమ్మెస్ సంగీతపరంగా అత్యుత్తమ స్థాయిలో ఉంది" అంటూ ఇలా కీర్తించాడు: "మీరా' అందమైన, మృధువైన అత్యున్నత స్థాయి సంగీతోత్సవాన్ని అందించింది..... యమ్మెస్ యింతకుముందెరుగని ఎత్తులకు చేరింది. బృందావనం వెళ్ళే దారిలో ఆమె పాడిన రాగమాలిక "నాదనామక్రియ"తో మొదలైనది అతి సులువుగా ఉత్తమ గీతంగా నిలిచింది."

దర్శకుడైన ఎల్లిస్ దంగన్ నిస్సందేహంగా నిర్మాత సదాశివం ప్రోత్సాహంతోనే, యమ్మెస్ అందాన్ని గొప్పగా చూపించటానికి అసాధారణమైన చర్యలు చేపట్టాడు. మనిషంత ఎత్తున్న ప్లాస్టర్‌ని ఆమె కోసం పోతపోయించినట్లు చేసి దానిని వివిధ కోణాలలో, వివిధ రకాల వెలుగు నీడలు కన్పించేలా విద్యుద్దీపాలు అమర్చి కెమెరాతో చిత్రీకరించాడు. వాటిని అనేక వరుసల ఫ్రేములుగా కత్తిరించి, ఆ షాట్స్‌ని దంగన్, జతిన్ బెనర్జి కలిసి స్లయిడ్ ప్రొజెక్టర్‌లో వేసుకుని అధ్యయనం చేశారు. అన్నింటిలోనూ ఉత్తమంగా ఉన్న కోణాలను, లైటింగును సినిమాలో వాడారు. దానివల్ల క్లోజప్పులలో యమ్మెస్ ముఖంలోని లావణ్యమంతా సినిమాలోకి తీసుకురాగలిగారు. దానివల్ల సినిమాలోకి ఉన్నత స్థాయి దృశ్యాలను తీసుకు రాగలిగారు.

ఆ రోజులనుంచీ సినిమా వాళ్ళందరూ గొప్ప ఫీట్‌గా పరిగణించే దానిని దంగన్ చేశాడు – చిన్ని మీరా ఎదిగిన మీరాగా మారే సన్నివేశాన్ని ఒక పాటలో చిత్రీకరించాడు. ముందు పాటను రికార్డు చేయటమనే మామూలు పద్ధతిని వదిలి దంగన్ ముందు దృశ్యాన్ని

చిత్రీకరించాడు. ఈ మార్పు జరిగే దృశ్యం కోసం, చిన్న మీరా చాలా అనుభూతితో పాడుతున్నట్లు తీసి, ఆ తరువాత ఆమె ముఖం కనిపంచే షాట్లను, కృష్ణుని విగ్రహం షాట్లతో అతివేగంగా కలిపి చూపించి, హఠాత్తుగా యమ్మెస్ విపరీతమైన ఉద్వేగంతో పాడుతున్న క్లోజప్‌ని చూపించాడు. తర్వాత ఆ షాట్లన్నిటినీ ఒక నిర్ణీత వేగంతో వున్న వరసులో కూర్చి అమర్చినపుడు, వెంకటరామన్ ఆ నటనలోని లయకు తగిన నేపథ్య సంగీతాన్ని సమకూర్చాడు. అది కూడా దానంతటికది చిన్న విజయమనే చెప్పాలి. కంప్యూటర్లు లేని ఆ కాలంలో ఈ దృశ్య చిత్రీకరణ ఫలితం మొత్తం మీద తన ప్రభావాన్ని చూపింది.

'మీరా' యమ్మెస్ వ్యక్తిగత విజయం. షూటింగ్‌లో, ద్వారకా నగర వీధులలో ఆమె మీరా భజనలు పాడుకుంటూ నడిచినప్పుడే అది స్పష్టమయింది. అక్కడికొచ్చిన తీర్థ యాత్రికులు అది సినిమా షూటింగంటే నమ్మటానికి ఒప్పుకోలేదు. కృష్ణ భక్తులకు ఆమె పునర్జన్మించిన మీరా. ఆమె భక్తురాలవటంతో ఆ పాత్రకు ఆధ్యాత్మికమైన గాంభీర్యపు లోతుని యివ్వగలిగింది. అందువల్లనే కాబోలు తలబిరుసుతో ఉండే ఎల్లిస్ దంగన్, రాండార్ గైతో ఒక ఇంటర్వ్యూలో ఇలా చెప్పాడు. "యమ్మెస్ నటించలేదు. సినిమాలో ఆమె 'మీరా' అయింది." ఈ సెంటిమెంటే అనేకమంది చేసిన వ్యాఖ్యలలో ప్రతిధ్వనించింది. ప్రసిద్ధ కవయిత్రి, స్వాతంత్ర సమర యోధురాలు అయిన సరోజినీ నాయుడు ఆ మాట సినిమాలోనే చెప్పింది. హిందీ 'మీరా'లో ఆమె తెరమీద కనిపించి ఇలా వ్యాఖ్యానం చేసింది : "మీరా కథ భారతదేశపు కథ. భారతీయ విశ్వాసం, భక్తి, బ్రహ్మానందం – వీటి గురించిన కథ. సుబ్బులక్ష్మి నటనా వైదుష్యం చూస్తే ఆమె 'మీరా'ను ప్రదర్శించలేదు. తానే మీరా అయింది."

తమిళ సినిమా విడుదలైన సంవత్సరం తర్వాత హిందీ 'మీరా' విడుదలైంది. యమ్మెస్‌కు దక్షిణ భారతాన్ని దాటి ఒక పేరుని, ఉనికినీ యివ్వాలని సదాశివం అతిశ్రద్ధతో సమకూర్చిన ప్రణాళికకు ఆ సినిమా ప్రతినిధి అయింది. మొదటి అడుగు "ఇండియా కథ' అయిన 'మీరా' కథ ఎంచుకోవటం అయితే, దానిని ఉత్తర భారతదేశానికి, ఆ దేశానికి అర్థమయ్యే భాషలో తీసుకు వెళ్ళటమనే కీలకమైన మరో అడుగు వెయ్యకపోతే, ఆ ప్రణాళిక అసంపూర్ణమయ్యేది. హిందీ అనువాదంతో ఉత్తర భారతదేశాన్ని తాకటం, అందులో సరోజినీ నాయుడు ప్రత్యేకమైన పరిచయం చేస్తూ తెరమీద కనిపించటం సదాశివం చేసిన మాస్టర్ స్ట్రోక్. ఈ అద్భుతమైన పని ఒక్కసారిగా అతని ఆలోచనలు ఫలించేలా చేసింది. పరిస్థితులు అనుకూలించగానే ఆయన ప్రజా సంబంధాల మెరుపుదాడిని ప్రారంభించి ఆ సినిమా నుంచి యమ్మెస్, తాను పొందగలిగిన ప్రతి ప్రయోజనాన్నీ చివరి బొట్టు వరకూ పొందేలా చేశాడు. ఆ సమయంలో అతను తను

ఆశించినదానిని మించి తన ఆలోచనలు ఫలించటాన్ని చూసి సంతృప్తిని పొందాడు. ఉత్తర భారతదేశం, రాజకీయ సాంస్కృతిక వ్యవస్థలతో కలిసి యమ్మెస్‌ని దక్షిణ భారతదేశం ఆమోదించినట్లే ఆమోదించి గౌరవించింది.

ఉత్తర భారతదేశపు అశేష ప్రజలకు సుబ్బులక్ష్మి పేరు పలకటం కష్టంగా వుండివుండవచ్చు. కానీ వారు తెరమీద ఆమె రూపాన్ని నటనను చూసి మంత్రముగ్ధ లయ్యారు. ఆ సినిమాలోని మతపరమైన ఆధ్యాత్మిక సంగీత ఉరవడి, సినీ మధ్యమాలలో చక్కదనం, దక్షిణాది 'మీరా' ముందుకు రావటానికి, దేశం మొత్తం మీద తన ప్రభావాన్ని చూపటానికి సహాయపడింది. ఐతే స్వగృహపు విమర్శకులు నిశ్శబ్దంగా చూస్తూ ఊరుకోలేదు. కొందరు యమ్మెస్ ఘోరమైన హిందీ ఉచ్చారణ గురించి మాట్లాడారు. బెంగుళూరులో సంగీతంపై సాధికారతతో మాట్లాడగల ప్రముఖ విమర్శకుడు బి.వి.కె. శాస్త్రి కొంత సున్నితంగానే అయిన తను వ్యాఖ్యానంలో యిలా అన్నాడు. యమ్మెస్ 'మీరా' పాటలను, యితర సినిమా పాటలను మరీ అంత సీరియస్‌గా పట్టించుకోకండి. హిందూస్తానీ పాటలను, కర్ణాటక సంగీత విద్వాంసులు పాడినప్పుడు వాళ్ళు అక్కడ ఉండవలసినదానిలో, కావలసినదానిలో కొంత వదిలేస్తారు. యమ్మెస్ అత్యుత్తమ సంగీతాన్ని వినాలంటే ఆమె శాస్త్రీయ సంగీతాన్ని పాడుతున్నప్పుడు వినాల్సిందే." శకుంతలై సినిమాను సమీక్షిస్తూ కె.ఎస్.ఎన్. ఇలా హెచ్చరించాడు : "యమ్మెస్ మనకున్న అత్యుత్తమ గాయకురాలు. కర్ణాటక సంగీతంలో తన పాండిత్య ప్రతిభకు మంచి కీర్తి సంపాదించుకుంది. ఆమె కూడా హిందుస్థానీ బాణీలో పాటలు పాడే మోజులో పడిపోతే, యిక మనకు ముక్తి ఎక్కడ?" ఈ సమీక్షకుడు ఈ విషయం జోలికి నాలుగేళ్ళ తర్వాత గాని తిరిగి రాలేదు. అప్పటికి 'మీరా' సినిమా వచ్చి, యమ్మెస్ హిందుస్తానీ వైపు చాలా విషయాలకు మొగ్గుతోంది. ఉత్తర భారతదేశపు సాధువుల భక్తి పాటలను పాడటం నుంచీ మహాత్మాగాంధీ కోసం ఆల్ ఇండియా రేడియో కోసం, ఎన్నో భజనలను పాడటం వరకూ వచ్చింది. బహుశా ఆ సమీక్షకుడికి జుగల్‌బందీలు, ఫ్యూజన్ సంగీతమూ వేదికల మీదికి రాకముందే ముక్తిమార్గం మీద అన్ని ఆశలనూ ఒదలుకుని ఉంటాడు.

కర్ణాటక సంగీతాన్ని పైన అత్యంత అభిమానం గల భక్తులు, చెప్పేదానిలో విషయముంది. 'మీరా' విజయం సాధించిందనటంలోనూ సందేహం లేదు. ఏ కొలత ప్రకారం చూసినా అది విజయమే. ఆమె స్వీయ సంగీత వ్యక్తిత్వం మీద కూడా ఆ సినిమా ప్రభావం వుంది. అప్పటి నుంచే ఆమె కచేరీలలో భజనలు తప్పనిసరిగా ఉంటున్నాయి. ఆమె కచేరీ సంగీతంలో ఉత్తర భారతదేశంలో ఎంతో గౌరవం పొందిన తులసీదాస్, సూరదాస్, కబీర్, గురునానక్ వంటి కవుల, మత పెద్దల రాసి పాడిన పాటలు భాగమైపోయాయి. టుమ్రీలు, ఖయాల్ (హిందూస్తానీ సంగీత రూపాలు) లను

నేర్చుకోటానికి ఆమె ఎక్కువ సమయమే కేటాయించింది. బెనారస్‌కు చెందిన సిద్ధేశ్వరీ దేవి, కలకత్తాకు చెందిన ద్విజేంద్రలాల్ రాయ్ ఆమెకు గురువులుగా వున్నారు. మొత్తం భారతదేశానికి చెందిన వ్యక్తిగా, భారతీయురాలిగా యమ్మెస్ ప్రయాణానికి 'మీరా' సినిమా పచ్చ జెండా ఊపింది. ఆమె క్రమం తప్పకుండా పాడే పాటలలో ఉన్న విస్తృతి, భారతదేశంలోని అన్ని భాషలనూ పాడే తీరు అతి త్వరలో యమ్మెస్ ఈక్విటి ముద్ర అయింది. జాతీయ రూపకల్పన నిర్మాణానికి ప్రధాన మూలకమయింది. విషయాలన్నీ సదాశివం రచించిన ప్రణాళిక ప్రకారమే నడిచాయి.

ఆ ప్రణాళికలు నిజానికి ఎంత బాగా ఫలించాయంటే, సదాశివంకు ఆ ప్రయోజనాలనన్నీ ఒక దారికి తెచ్చుకోవటమనే కొత్త సమస్య, యింతకుముందెరుగని సమస్య ఎదురయింది. అతను సాధించినది అపూర్వం. ఇంతకు ముందెన్నడూ లేనిది. ఒక కర్ణాటక శాస్త్రీయ సంగీతకారిణిని ఉత్తర భారతదేశం ఆరాధించేలా చేయటమంటే, అయ్యర్ కాని వారిని అయ్యర్ చేయటం కంటే కష్టమైన పని. ఫలితంగా ఆయన జాతి అవరోధాన్ని అధిగమించి ఒక ద్రవిడురాలిని ఆర్య మహిళగా చేశాడు. నీరద్ ఛౌదరి అన్న "రెండు జాతులకు చెందిన నామవాచకాల నైతిక భావన"కు ఆయన వారధి నిర్మించాడు. చౌధరి దృష్టిలో "ఆర్యునిగా ఉండటమంటే ఉన్నత శ్రేణిలో, గౌరవనీయంగా ఉండటం. అనార్యుడంటే కిందిస్థాయిలో, గౌరవం లేకుండా హీనంగా ఉండటం". ఇప్పుడు ఒక అనార్యురాలు ఆర్య సమూహాలన్నీ జయ జయ ధ్వానాలు చేసేంతటి గౌరవాన్ని పొందింది. సంగీతమనే అద్భుతం అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది.

❖ ❖ ❖ ❖

ఇదంతా నిజమయ్యేంత మంచిదేనా? ఈ పాలు తేనె కలిసిన మధురమైన రోజులు కొనసాగుతూ ఉంటాయా? 'మీరా' ఎంత విజయవంతమైనా, అది యమ్మెస్‌కు ఒక ఆవిష్కరణ మాత్రమే. వేరే మాటల్లో చెప్పాలంటే యింతవరకూ సంచరించని ప్రదేశాలలో ప్రవేశించే అవకాశాన్ని అందించిందంతే. మీరాబాయి కున్న మూర్తిమత్వం, భారతదేశపు మతపరమైన వారసత్వ సంపదైన మీరాబాయి మూర్తి యమ్మెస్‌కు బదిలీ అయింది. ఆ స్థితిని రక్షించి, కాలం చేసే విధ్వంసాలకు అవతల భద్రపరచాలి. ఆమె దేవునికి అర్పణ కావాలి. తనను తాను త్యాగం చేసుకునే నిస్వార్థ ప్రేరణతో ఆ పని చేస్తున్నట్లు అందరూ చూడగలగాలి. ప్రజలు ఆమెను మీరా సజీవమై వచ్చిందని అనుకోవాలి – ఆమె మీరాగానే ఉండిపోవాలి. ఆ పరిస్థితిని ఏ వైపు నుండి చూసినా సదాశివంకు భవిష్యత్తంతా భక్తిలోనే ఉందనిపించింది. భారతదేశాన్నంతా కలిపి వుంచే ఆనందకరమైన విశ్వాసమనే దారానికి ప్రాతినిధ్యం వహించేది భక్తిగానే అతనికి తోచింది. అది దేశాన్ని ప్రభావితం చేయగల వారసత్వపు ఆస్తి. దానితో గుర్తించబడితే యమ్మెస్‌కు జాతీయంగా ఒక విలువ ఏర్పడుతుంది. ఆ విలువ తిరుగులేనిది, ఎవరూ ఓడించలేనిదని నిరూపించబడుతుంది. ఆ లోతైన

ఆధ్యాత్మిక కాంతిపొరను సంపాదించటానికి యమ్మెస్ తనదైన మార్గాన్ని వదిలి వెళ్ళలేదు. ఆమె నిజమైన ఆధ్యాత్మిక భావనలు కలిగిన వ్యక్తి. సదాశివం కొత్తగా అందుకుని చేయవలసినది, యమ్మెస్ మరింత బలంగా తనదైన స్వభావంతో ఉండేలా చూడటమే.

నిజానికి సదాశివం కూడా భక్తిని తమ గుర్తుగా చేసుకోటానికి తనదైన మార్గం వదిలి ఎటో వెళ్ళాల్సిన అవసరం లేదు. ఆయన వ్యక్తిగతమైన రోజువారీ ఆచారాలు, అలవాట్లు భక్తి దిశగానే వెళ్తున్నాయి.

ఆయన యవ్వనదశలోకి వచ్చిన కొత్తలో, విప్లవాన్ని తరుముకుంటూ వెళ్ళిన కాలంలో అసంప్రదాయకంగా కనిపించే పొడవాటి జుత్తుతో, మొదటితరం హిప్పీలా కనిపించేవాడు. రాజగోపాలాచారి నాగరికమైన ప్రభావంతో, ఆయన మద్రాసులో బ్రాహ్మణ వ్యవస్థకు మూలస్థంభాలలో ఒక స్థంభంగా పరిణామం చెందాడు. ఆ తర్వాత పరమాచార్య యొక్క మరింత గొప్ప ప్రభావం ఆయనను శైవ, వైష్ణవ మతాల సాధారణ నియమాలు కలగలిసిన కంచి పీఠపు సంప్రదాయాలను కచ్చితంగా అనుసరించేవాడిగా మార్చింది. ఆయన తన సంప్రదాయానికి “సదాశివం టచ్”ని యిచ్చినప్పటికీ, గురువుల పట్ల మనస్సులో విధేయంగా ఉండేవాడు. తన పేరుకి ఆయనెప్పుడూ కులసూచకమైన “అయ్యర్” ని తగిలించుకోలేదు. దాదాపు ముప్పై యేళ్ళ పాటు పొగాకు నమిలిన అలవాటుని రాజాజీ అడిగినదే తడవుగా రాత్రికి రాత్రి వదిలేశాడు. టెలిఫోన్ ఎత్తినప్పుడు “హలో” అని అనేవాడు కాదు. ప్రాచీన స్మార్తలో కొట్టొచ్చేట్టు కనిపించే లక్షణం ఆయన నుదిటి మీద విభూతి రేఖలు. పవిత్రమైన విభూతి గుర్తులు ధరించటమంటే అది అచ్చమైన ఆధ్యాత్మిక చర్య. నిజమైన ఆధ్యాత్మిక కార్యక్రమాలననుసరించేవాడైతే ఆ విభూతి రేఖలను పెట్టుకునేటప్పుడు ఒక భౌతిక పరికరమైన అద్దాన్ని ఉపయోగించడు. కానీ ప్రతి పనిలో పరిపూర్ణత కోరే సదాశింకు అలా చెయ్యటం బాగుండదు. ఆయన చాలా సావధానంగా విభూతిని నీటి చుక్కలతో శ్రద్ధగా మెత్తదనం, బిరుసుదనం సరిగ్గా వచ్చేంతవరకూ కలిపి, ఆ తర్వాత గీతలు సూటిగా, సమాంతరంగా వచ్చేందుకు దారాన్ని వుపయోగించి, ఆ తర్వాత అంచులను వంకరలేకుండా సరిచేసి, శుభ్రపరచటానికి ఒక గుడ్డను ఉపయోగించి, అప్పుడు ఆ రేఖలు తడారేవరకూ సహనంగా వేచివుండి, చివరకు తుది మెరుగులు కోసం పరిక్షించేందుకు అద్దాన్ని సంప్రదించేవాడు. ఆ మొత్త కార్యక్రమం జరగటానికి పదిహేను నిమిషాలపైనే పడుతుంది. ఐతే ఈ అలవాటు క్రమం తప్పకుండా తన జీవితపు చివరి రోజు వరకూ కొనసాగించాడు. యమ్మెస్ విశ్వాసానికి బాహ్య లక్షణాల గురించి చాలా తక్కువ పట్టింపు వుండేది. ఆ విశ్వాసంపై ఆధారపడటంలో ఆమె మరింత లోతుగా వుండేది. సంగీతం వలే భక్తి ఆమెకు సహజంగా అబ్బింది. తన సంగీత శక్తిని భక్తితో జతగలిపినప్పుడు ఆమె ఒక ఇరవయ్యవ శతాబ్దపు గాయకురాలు ఒక పవిత్రమూర్తిమత్వానికి ఎంతో దగ్గరగా వెళ్ళింది. అది సంగీత విదుషిగా, భారతీయురాలిగా ఆమె అవతరించే క్రమ పరిణామంలోని ఘనమైన పతాకస్థాయి.

# 9. సుస్వర లక్ష్మి సుబ్బులక్ష్మి

దాశరథి నీ ఋణము దీర్ప నా
తరమా పరమపావన రామా ॥
ఆశదీర దూర - దేశములను ప్ర
కాశింపజేసిన - రసిక శిరోమణి ॥
భక్తిలేని కవి - జాలవరేణ్యులు
భావ మెరుగలేరని కలలోజని
భక్తి ముక్తి కల్గునని కీర్తనముల
బోధించిన త్యాగరాజకరార్చిత ॥

నిస్సందేహంగా, మీరా సినిమా సుబ్బులక్ష్మిని, ఆమె వృత్తినీ మార్చేసింది. సదాశివం మీరాబాయి వృత్తాంతాన్ని తన భార్య కోసం ఎంచుకున్నప్పటి పరిస్థితులు, ఆయన తన భార్యను భిన్నమైన సంగీత కళాకారిణిగా మార్చే ఉద్దేశంతో వున్నాడని ఎత్తిచూపుతాయి. తమిళ 'మీరా" విడుదలకు సిద్ధంగా వున్నప్పుడు అతని నిర్ణయాన్ని బలపరిచి స్థిరపరిచే సంఘటనొకటి జరిగింది. 1944 వ సంవత్సరపు ప్రారంభంలో మహాత్మాగాంధీకి, రాజాజీకి మధ్య జరిగిన సమావేశంలో కస్తూర్బా మెమోరియల్ ట్రస్టుకి నిధులు సేకరించే విషయం ప్రస్తావనకొచ్చింది. రెండవ ఆలోచన లేకుండా రాజాజీ సుబ్బులక్ష్మి సంగీత కచేరీలను ఏర్పాటు చేసి నిధులు పోగుచేయవచ్చని సలహాయిచ్చాడు. ఇద్దరు నాయకులకూ సుబ్బులక్ష్మికున్న జనాకర్షణ శక్తి తెలుసు గనుక ఆ సూచన వెంటనే ఆమోదించబడింది. రాజాజీ ముందుగానే సదాశివంతోగానీ, సుబ్బులక్ష్మితోగానీ ఈ విషయం సంప్రదించలేదు. వారితో ఆయనకున్న అనుబంధం చాలా దగ్గరిది కనుక కస్తుర్బా ఫండ్ కోసం సుబ్బులక్ష్మి ఐదు కచేరీలు చేస్తుందని మాట యిచ్చే స్వతంత్రం తీసుకున్నాడు. సదాశివంకు ఈ విషయం చెప్పినప్పుడు, ఆయన, సుబ్బులక్ష్మి ఇద్దరూ ఆ కచేరీలు ఏర్పాటు చేయటం తమ బాధ్యతగా భావించారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆ పని ప్రారంభించారు. కార్యక్రమ నిర్వహణలో ఆయనకున్న సామర్థ్యాలనూ, ఆయనకున్న అన్ని సంబంధాలనూ వినియోగించి సదాశివం ఐదు కచేరీలనూ వెంటవెంటనే ఏర్పాటు చేశాడు. మద్రాసులో 1944 జులైలో, ఆగస్టులో ట్రిచీలో, మధురై కోయంబత్తూరు, తంజావూర్లలో సెప్టెంబర్‌లో కచేరీలు జరిగాయి. ఈ కచేరీలు తమిళనాడంతా సంచలనాన్ని సృష్టించాయి. ఇలాంటిది యింతకుముందెన్నడూ జరగలేదు. ఈ ఆలోచనలోని కొత్తదనం, 'మీరా' లో నటించిన

తార ప్రత్యక్షంగా కచేరీ వేదిక మీద, మహాత్మాగాంధీ సంబంధమున్న కార్యక్రమం కోసం వచ్చి పాడుతుందనేది ప్రేక్షకులు తట్టుకోలేనంత విషయమైంది. కచేరీ ఆవరణల వద్ద యింతకు ముందెన్నడూ కనీవినీ ఎరుగనంత ఒత్తిడి. వసూలైన మొత్తం కూడా అందరి అంచనాలనూ మించిపోయింది. అన్నిటికంటే ముఖ్యంగా, ఈ కచేరీలు యమ్మెస్‌కూ, జాతీయోద్యమ జీవిత ప్రధాన స్రవంతికీ మధ్య ఒక ఆనందరకమైన సంబంధాన్ని ఏర్పరిచాయి. యమ్మెస్ వంటి రాజకీయేతర జీవికి, కస్తుర్బా కచేరీల దేశభక్తి కార్యక్రమాలు ఆమెకు ఒక గుర్తింపును, ఆమెకంతవరకూ లేని గుర్తింపును తెచ్చింది. ప్రజల మనస్సుల్లో ఈ కచేరీలు ఆమెకు కొత్త రూపాన్ని ఇచ్చాయి. ఆమె యిప్పుడు ధార్మిక కారణాలకు సాటిలేని పోషకురాలు.

కస్తూర్బా ఫండ్‌కు కచేరీల ఏర్పాటనే ఆలోచన అదృష్టవశాత్తు వచ్చింది. కానీ ఆ కచేరీలు సాధించిన అనన్య విజయం వల్ల, సదాశివం రాజాజీ, యిద్దరూ యమ్మెస్‌ని, ఒక కొత్త వెలుగులో చూశారు. ఆ సమయానికి సదాశివం తన భార్య రొమాంటిక్ పాత్ర ధరించిన 'శకుంతలై' వంటి సినిమాలకు వ్యతిరేకమయ్యాడు. ఇప్పుడు రాజాజీ ఆమె సినిమాలనుంచి పూర్తిగా బైటికి వచ్చేయ్యాలన్నాడు. 'మీరా' ఆమెకు ప్రజలను కొత్తగా ప్రభావితం చేసే వ్యక్తిత్వాన్ని యిచ్చింది. అది సరైన ప్రభావం, సరైన వ్యక్తిత్వం. దానితో యిక సినిమాలనుంచి విరమించవచ్చునని రాజాజీ సలహా యిచ్చాడు. ఆ సలహానే సదాశివం వినాలనుకుంటున్నాడు. సినిమాల నుండి బైటికి వచ్చి, మంచి కారణాల కోసం వితరణ కచేరీలు చేయటమనేది యింతకుముందు ఏ భారతీయ కళాకారులూ తొక్కని మార్గం. సంపూర్ణ స్వార్థత్యాగాన్ని సూచించే మార్గంలో ఈ మార్పుని చేయగలిగితే, యమ్మెస్‌ని ఆధునిక కరుణామయ దేవతగా తయారు చేయటంలో ఎంతో దూరం ప్రయాణం చేయవచ్చు. ఇప్పుడు సదాశివంకు రెట్టింపు ఆనందోత్సహాలు. హిందీ "మీరా"ను భారతదేశ వ్యాప్తంగా, బహుశా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకునేందుకు నడవాల్సిన ద్వారంగా ఉపయోగించుకోవచ్చు.

ఆ ద్వారం విశాలంగానే తెరుచుకుంది గానీ సదాశివం టైమ్‌టేబిల్ ప్రకారం కాదు. 1945వ సంవత్సరం అలాంటి విజయాన్ని సాధించటానికి రాజకీయంగా ఏమాత్రం అనుకూలమైన సంవత్సరం కాదు. 1945 మే నెలలో మిత్రపక్షాలకు జర్మనీ లొంగిపోయింది. జూన్‌లో ఐక్యరాజ్యసమితి యేర్పడింది. జులైలో లేబర్ పార్టీ అఖండ విజయం వల్ల బ్రిటన్ ప్రధానమంత్రిగా విన్‌స్టన్ చర్చిల్ స్థానంలో క్లెమెంట్ అట్‌లీ ఎన్నికయ్యాడు. ఆగస్టులో రెండు జపాన్ నగరాలు అణుబాంబు దాడికి ఆవిరైపోయాయి. "వీలైనంత తొందరలో" స్వంతంత్రాన్నిస్తామనే బ్రిటీష్ ప్రభుత్వ వాగ్దానం సెప్టెంబర్‌లో ఇండియాను ఒక కుదుపు కుదిపి ఉత్సాహపరిచింది. అక్టోబర్‌లో ఇండోనేషియా జాతీయ

వాదులు డచ్‌పై యుద్ధాన్ని ప్రకటించారు. నవంబర్‌లో సదాశివం హిందీ 'మీరా'ను విడుదల చేశాడు.

కుతూహలంతో వున్న ప్రేక్షకులు థియేటర్లను తుఫానులా చుట్టబెట్టేవారేమోగానీ, ఆ సంవత్సరం సదాశివం మనసులోని విస్తృతమైన ఆశయాలకు కాలం కలిసిరాలేదు. అతను సమయం కోసం వేచి వుండాల్సి వచ్చింది. అదృష్టవశాత్తూ అతను శ్రద్ధ పెట్టాల్సిన వ్యాపార విషయాలు ఉన్నాయి. ఆ జాబితాలో మొదటిగా ఉన్నది 'కల్కి'. కృష్ణమూర్తి నవలలు, వ్యాఖ్యానాలు ప్రజల దృష్టిలో ఆ పత్రికను నిలబెట్టినా, ప్రతి సంచికలో 'మీరా' విజయాలు, యమ్మెస్ చేసిన ప్రతి కచేరీ విశేషాలూ వుండేలా సదాశివం జాగ్రత్త వహించాడు. ఆ సినిమా వల్ల కొంత డబ్బు వచ్చింది. దానిని సదాశివం ఉన్నత స్థాయి కోసం ఖర్చుపెట్టాడు. మద్రాసుకి గుండెకాయి వంటి ప్రాంతంలో ఆస్తి సంపాదించాడు, త్వరలోనే ఆ ఆస్తి ఆ నగరపు జానపద కథలలో భాగం అవబోతోంది. డాక్టర్ గురుస్వామి మొదలియార్ రోడ్డు, చెట్‌పట్‌లోని పూనమిల్లి హై రోడ్డు మీది ఆకుపచ్చని ప్రాంతం. ఆ ప్రాంతానికి మొదటి ఆంగ్లేయ యజమాని దానిని అందమైన విడిది గృహంగా మార్చి సాల్టెన్ గార్టెన్స్ అని తన పేరే పెట్టుకున్నాడు. తర్వాత దానిని కేరళలోని ఒక ప్రముఖ కుటుంబం కొనుగోలు చేసింది. 1887లో మద్రాసు కాంగ్రెస్ సభలలో జస్టిస్ బద్రుద్దీన్ త్యాబ్జ్ అనే జాతీయవాది కాంగ్రెస్ అధ్యక్షుడయ్యాడు. అతని అతిథిగా గాంధీ ఈ విడిది గృహంలో వుండటం వల్ల దానికి మరికొంత కీర్తి వచ్చింది. కేరళ కుటుంబం నుంచి ఆ ఆస్తిని సదాశివం కొన్నాడు. దాని పక్కనే వున్న నౌరోజి గార్డెన్స్‌ని కూడా కొని మరింత విశాలం చేశాడు. ఇప్పుడు రెండెకరాలపైగా ఉన్న ఆ ఆవరణకు కల్కి గార్డెన్స్ అని పేరు పెట్టాడు. ఆ తర్వాత ముప్ఫై సంవత్సరాలపాటు కల్కి గార్డెన్స్ సాంస్కృతిక, రాజకీయ కార్యక్రమాలకు నాడీ మండల కేంద్రంగా పనిచేసింది. మద్రాసులో అది ఒక ప్రధానమైన ల్యాండ్ మార్క్ అయింది. సదాశివం తన అనేకరకాల విజయ యాత్రలను ప్రారంభించిన "కమాండ్ హెడ్ క్వార్టర్స్" కూడా అయింది.

❖ ❖ ❖ ❖

అతను ఎదురుచూస్తున్న సరైన ముహూర్తం త్వరలోనే వచ్చేసింది. కల్కి గార్డెన్స్ ఏర్పడిన కొన్ని నెలల్లోనే భారతదేశం స్వతంత్రమైంది. దాంతో అంతా మారిపోయింది. అప్పటివరకూ ఆందోళనకారులుగా వున్నవారు మద్రాసులో, ఢిల్లీలో తిరుగులేని అధికారం చలాయించేవారయ్యారు. వారిలో పైన వున్నవారిలో సి. రాజగోపాలచారి ఒకడు. ఒక సంవత్సరంలో ఆయన గరవ్నర్ జనరల్ ఆఫ్ ఇండియా అయ్యాడు. కొత్త దేశంలో అత్యున్నత వైభవోపేతమైన కార్యాలయం అది. సదాశివంకి ఢిల్లీలో రాజాజీ ఒక ప్రముఖునిగా ఉండటం ఊపిరాడనంత ఉత్సాహాన్నిచ్చింది. అతనూ, యమ్మెస్, రాజాజీని దేవునిగా,

గురువుగా గౌరవిస్తారు. వారి వ్యక్తిగత, వ్యాపార, కుటుంబ విషయాలలో రాజాజీదే ఆఖరిమాట. అలాంటి వ్యక్తి ఢిల్లీలో అధికార కేంద్రంలో ఉంటే సదాశివం ఎంతో ఎత్తుగానే గురిపెడతాడు. ఆ తరువాత జరిగింది దేశం అరుదుగా చూసిన ప్రజా సంబంధాల సంబరాల సందడి. మొదట అది ఉత్తర భారతదేశానికి తీసుకెళ్ళింది. తర్వాత అమెరికాకు, యూరప్‌కు. అది నిర్విరామంగా ముప్పై అయిదు సంవత్సరాల పాటు ఏకైక దృష్టితో యమ్మెస్‌ని ఒకే ఒక ఆశయానికి అంకితమైన వ్యక్తిగా చూపించింది. ఆ ఆశయం ప్రపంచ సంక్షేమం. విశ్వ శ్రేయస్సు. ఇదీ అచ్చమైన సదాశివం.

ఈ ఉద్యమ తొలి దశలో కేంద్రబిందువుగా పనిచేసింది, 1947 నవంబర్‌లో ఢిల్లీలోని ఖరీదైన ప్లాజా సినిమాలో 'మీరా' ప్రివ్యూ చూపించటం. ఆ సినిమా విడుదలై అప్పటికి రెండు సంవత్సరాలైంది. స్వాతంత్ర్యోత్సవ సంబరాలు యింకా ఆగిపోలేదు. దేశ విభజన ఘాతుకాలు ఢిల్లీని మొద్దుబార్చాయి. ఐనా సదాశివం రాజకీయ సంబంధాలు, అతని దూసుకుపోయే తత్త్వం వల్ల వి.ఐ.పిలు ఒక ప్రవాహంలా వచ్చిపడ్డారు. కొత్తగా వచ్చిన గవర్నర్ జనరల్ లార్డ్ మౌంట్ బ్యాటన్, ఆయన భార్య ఎడ్వినా ముఖ్య అతిథులు. కొత్తగా నియమించబడ్డ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ "ఈ సినిమా ప్రివ్యూ గురించి అమితమైన ఆసక్తి" చూపించాడని తర్వాతి రోజుల్లో సదాశివం గుర్తు చేసుకున్నాడు. నిజానికి, నెహ్రూ తలుపు దగ్గర నిలబడి తనే నిర్మాతనన్నట్లు అతిథులకు స్వాగతం పలికాడు. మర్నాడు, ఆ తర్వాత చాలా రోజుల పాటు పత్రికలు ఎన్నో రకాల ఫోటోలను ప్రముఖంగా ప్రచురించాయి. కొన్ని ఫోటోలలో నెహ్రూ అభిమానంతో మెచ్చుకోలుగా యమ్మెస్‌ని చూస్తున్నాడు. కొన్నింటిలో సరోజినీ నాయుడు యమ్మెస్‌ని కళ్ళు విప్పార్చుకకుని ఒక అద్భుతంగా చూస్తున్నది, లూయిస్, ఎడ్వినా మౌంట్ బ్యాటన్‌లు యమ్మెస్‌ని అభినందిస్తూ, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ యమ్మెస్‌ని సత్కరిస్తూ, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ యమ్మెస్‌ని అభినందిస్తూ, ఎన్నో ఫోటోలు.

సదాశివం పెద్ద ఎత్తున ప్రచారం కోసం రాజకీయ నాయకత్వం మీద కేంద్రీకరించాడు. అతని జీవిత ప్రారంభంలో, బెంగుళూరులో ఖద్దరు అమ్ముతున్నప్పుడు అతనికి గాంధీతో పరిచయమైంది. 1941లో అతనూ, యమ్మెస్ 'సావిత్రి' షూటింగ్ కోసం కలకత్తా వెళ్తున్నప్పుడు ఆ పరిచయాన్ని మళ్ళీ ఒకసారి తిరగేశాడు. వాళ్ళు తమ ప్రయాణాన్ని మధ్యలో ఆపి వార్ధా (ప్రస్తుతం మహారాష్ట్రలో ఉంది)లో గాంధీ బసచేసిన చోటికి వెళ్ళారు. ఈసారి పరిచయం స్నేహమైంది. ప్రార్థన సమావేశంలో ప్రేక్షకులలో సుబ్బులక్ష్మి కూర్చునివుందని గాంధీకి ఎవరో తెలియజేశారు. గాంధీ ఆమెను తన వద్దకు పిలిపించి పాడమన్నాడు. ఆ సాయంత్రం వార్ధాలో ఆమె పాడిన భజనతో గాంధీ జీవితకాలం యమ్మెస్‌కు అభిమానిగా మారాడు. కస్తూర్బా ఫండ్ కోసం కచేరీలు ఏర్పాటు చేసినపుడు

ఆయన "డియర్ సుబ్బలక్ష్మి" ధన్యవాదాలంటూ ఆమెకు రాశాడు. ఆ ఉత్తరం ఇంగ్లీషులో రాసినా సంతకం తమిళంలో చేశాడు. "మో. క. కాంతి." మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ. 1947లో గాంధీ తన పుట్టిన రోజునాడు సుబ్బలక్ష్మి ఢిల్లీ వచ్చి పాడాలని, ప్రత్యేకంగా "హరి తుమ హరో జాన్‌కి పీర్" అనే శ్రావ్యమైన మీరా భజన పాడాలని కోరాడు. యమ్మెస్ తన కుటుంబ సభ్యుని ద్వారా ప్రత్యేకంగా తయారుచేసిన రికార్డుని మాత్రం పంపగలిగింది. కొన్ని నెలల తర్వాత గాంధీ హత్యానంతరం ఆల్ ఇండియా రేడియో తన సంతాప ప్రకటనలో భాగంగా యమ్మెస్ రికార్డుని ప్రసారం చేసింది. "దాదాపు సంవత్సరంపాటు ఆమె "హరి తుమ హరో" భజనను పాడటానికి ప్రయత్నం కూడా చేయలేకపోయింది" అని సదాశివం రాశాడు.

గాంధీతో స్థిరమవుతున్న స్నేహం యమ్మెస్‌ని నిర్మించటంలో సదాశివం చూపిన ఒక కోణం మాత్రమే. "మీరా" తర్వాత రాజకీయాకాశంలో వెలిగే దీపాలన్నీ ఆయన హద్దులు లేని శ్రద్ధాసక్తులను అందుకున్నాయి. నెహ్రూ విషయంలో సదాశివం ఒత్తిడి నిజానికి అనవసరం. యమ్మెస్ లావణ్యానికి ప్రధానమంత్రి ఆనందంగా లొంగిపోయాడు. 1947 లో 'మీరా' ప్రివ్యూలో మొదటిసారి ఆమెను కలిసినప్పటినుంచీ నెహ్రూ ఆమెకు తిరుగులేని అభిమానిగా ఉండిపోయాడు. ధార్మిక కారణాల కోసం యమ్మెస్ చేసిన మూడు కచేరీలకు నెహ్రూ ముఖ్య అతిథి. మూడు సందర్భాలలోనూ ఆయన అందరికీ తెలిసిన, "ఈ సంగీత సామ్రాజ్ఞి ముందు నేనొక సామాన్య ప్రధానమంత్రిని" అనే పొగడ్తని ప్రతిసారీ పలికాడు. 1949లో మద్రాస్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ సహాయార్థం సుబ్బులక్ష్మి చేసిన కచేరీలో ఆయనీమాట మొదటిసారి చెప్పినప్పుడు అది విలువైనదిగా, అనుకోకుండా దొర్లి వచ్చినదిగా ధ్వనించింది. ఆయన తన మాటను తనే యిష్టపడి 1953లో మళ్ళీ ఢిల్లీలో, 1953 లో మద్రాసు మ్యూజిక్ ఎకాడమీ లో పునరుక్తి చేశాడు. విసుగు తెప్పించే ఆ పునరుక్తితో పొగడ్త కాస్తా అరిగిపోయిన నిరాసక్తమైన మాటగా మారిపోయింది. కానీ యమ్మెస్‌పై నెహ్రు ఆసక్తి స్థిరంగానే ఉంది. 1955లో మద్రాసు దగ్గరిలోని ఆవడిలో చారిత్రాత్మకమైన విధాన తీర్మానాల గురించి కాంగ్రెస్ సభలలో వాదోపవాదాలు జరుగుతున్నప్పుడు నెహ్రూ ఆ సభా ప్రాంగణంలోంచి కొంతసేపు అదృశ్యమయ్యేవాడు. యమ్మెస్‌ని చూసేందుకు వెళ్ళేవాడు. ఆ సంవత్సరం సదాశివం దంపతులు ఢిల్లీలో ప్రధానమంత్రి గృహమైన తీన్‌మూర్తి భవన్‌లో పదిరోజులపాటు అతిథులుగా ఉన్నారు. వాళ్ళు కమలా నెహ్రూ మెమోరియల్ ఆసుపత్రికి నిధులు సేకరించటానికి కచేరీ చేసేందుకు రాజధానికి వెళ్ళారు. "మేము ఆయన నుంచి, ఆయన ప్రియ కుమార్తె శ్రీమతి ఇందిరాగాంధీ నుంచీ పొందిన అమితమైన ఆదరణ, అద్భుతమైన ఆతిథ్యము" – వర్ణించటానికి తగిన మాటలు వెతుక్కోవటం సదాశివంకు కష్టమైంది.

రాష్ట్రపతి భవన నివాసులు కూడా సదాశివంకు చేతికందే దూరంలోనే ఉన్నారు.

రాజాజీ గవర్నర్ జనరల్‌గా ఉన్నప్పుడు ఆ మహోన్నత భవనం సదాశివంకు తరచూ హెడ్ క్వార్టర్స్‌గా ఉండేది. ఇండియన్ రిపబ్లిక్ ప్రథమ రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌కు యమ్మెస్ అంటే తక్కువ అభిమానం లేదు. ఆమె ఢిల్లీలో ఉందని తెలిసిన రెండు సార్లూ ఆమెను రాష్ట్రపతి భవనానికి ఆహ్వానించి ప్రత్యేక కచేరీలు చేయించాడు. తర్వాతి రోజులలో ఈ కచేరీల గురించి సదాశివం జ్ఞాపకం చేసుకుంటూ “ఇవి రాష్ట్రపతి కోసం, ఆయన కుటుంబ సభ్యుల కోసం జరిగిన ప్రశాంతమైన కచేరీలు. ఒక్క తంబూరా సహకారంతోనే సుబ్బులక్ష్మి పాడింది.” అన్నాడు.

ఢిల్లీలో పేరున్న వారందరితో ఆయన స్నేహం చేశాడు. ఉత్తరప్రదేశ్‌కు అత్యంత శక్తిమంతుడైన ముఖ్యమంత్రి గోవింద వల్లభపంత్ యమ్మెస్ గానాన్ని విని తను పోగొట్టుకున్న ఆత్మను తిరిగి కనుగొన్నానని ప్రకటించాడు. సరోజినీ నాయుడు తన “నైటింగేల్ ఆఫ్ ఇండియా” బిరుదును సగర్వంగా యమ్మెస్‌కు అర్పిస్తానని అన్నది. సరోజినీ నాయుడిని దక్షిణాఫ్రికా వారికి అక్కడి స్థానిక నాయకుడు పరిచయం చేస్తూ ఆవిడ బిరుదును కాస్తా “నాటీ గర్ల్ ఆఫ్ ఇండియా”గా ఉచ్చరించాడనే కథను అదృష్టవశాత్తూ సదాశివం, యమ్మెస్‌లు వినలేదు. ఆ కవయిత్రి ‘మీరా’ సినిమా ముందుమాటలోనూ, ఆ తర్వాత ఈ గాయనిని కీర్తించటంలో ఎక్కడా తడబడలేదు. ప్రశంసలు, పొగడ్తలు ప్రముఖులెందరినుంచో వస్తూనే ఉన్నాయి – డాక్టర్ రాధాకృష్ణన్, సి.డి. దేశ్‌ముఖ్, జి.డి. బిర్లా, రామనాథ్ గోయంకా, ప్రిన్స్ ఫిలిప్, లార్డ్ హేర్‌వుడ్, పోప్ పాల్, మదర్ థెరిసా.

❖ ❖ ❖ ❖

ఈ రాజకీయ చట్రాన్ని దాటితే దానికవతల మరొక ప్రముఖుల సమూహం సదాశివంను చాలా దగ్గరగా ఆకర్షించింది. ఈ సమూహం హిందూస్తానీ సంగీతంలోని గొప్ప ఉస్తాదులతో కూడినది. ఒక దక్షిణాది సంగీత విదుషీమణి కంటే భిన్నంగా, ప్రత్యేకంగా ఒక భారతీయురాలిగా యమ్మెస్‌కు గుర్తింపు తీసుకురావాలనే సదాశివం ప్రణాళికలకు ఈ సంగీతవేత్తలతో స్నేహబాంధవ్యాలు చాలా కీలకమైన ప్రాధాన్యత గలవి. దాని ఫలితంగా వారిద్దరూ ఉత్తరాది గురువులను సందర్శించే అవకాశాన్ని ఎన్నడూ ఒదులుకునేవారు కాదు. చాలా త్వరగానే, యమ్మెస్ హిందూస్తానీ సంస్కృతి, సంగీతాలలో తగినంత ఆసక్తినీ నైపుణ్యాన్ని కూడా అభివృద్ధి చేసుకుని తన అభిమాన విద్వాంసులను గుర్తించింది. షెహనాయ్ విద్వాంసుడైన బిస్మిల్లాఖాన్, సితార వాద్య నిపుణుడు రవిశంకర్, తబలా విద్వాంసుడైన అల్లారఖాలతో ఆమె ప్రత్యేక సాన్నిహిత్యాన్ని పెంపొందించుకుంది. అల్లాదియాఖాన్, గొప్ప గాత్ర సంగీత విద్వాంసుడైన బడే గులాం ఆలిఖాన్‌లు ఆమెకు ఆదర్శవ్యక్తులు. సదాశివం కలిసినప్పుడు అలాదియాఖాన్ తొంభైయేళ్ళ పండు ముదుసలి. యమ్మెస్ ఆయన కోసం, తను ఏ వాద్య సహకారమూ లేకుండా పాడిన అరగంట సమయాన్ని

ఎంతో యిష్టంగా, బెంగతో తల్చుకుంటుంది. ఆయన సంగీతంతో పూర్తిగా మమేకమైపోయిన తీరు ఆమెనెంతో ప్రభావితం చేసింది. ఆ సంగీత గురువుకి తన సంగీతం తప్ప మరో ప్రపంచం లేదు. ఆయన సంగీతానికి తప్ప మరింకదేనికీ లేదు.

ఉత్తర భారతదేశం నుంచి బడేగులాం ఆలీఖాన్ యమ్మెస్‌కు అభిమాన గాయకుడు. యమ్మెస్ తన దక్షిణాది అభిమాన గాయని అని చెప్పటంతో, ఆయన పై ప్రశంసను తిరిగి యిచ్చినట్లయింది. 1960లలో బడేగులాం అలీఖాన్, స్త్రీలు పాడినపుడు దక్షిణ భారతీయ సంగీతం తనకు చాలా బాగా నచ్చుతుందని వ్యాఖ్యానించాడు. ఆ రోజులలోని ప్రముఖ గాయనీమణులను సంగీత వాయిద్యాలతో సరిపోల్చి గుర్తించాడు. డి.కె. పట్టమ్మాళ్ స్వరం వీణకున్న మాధుర్యాన్ని కలిగివుందనీ, యమ్.ఎల్. వసంత కుమారి గాత్రం నాగస్వరం కంటే ఉన్నతమైనదనీ ప్రశంసించాడు. మరి యమ్మెస్? “ఆమె మా షెహనాయ్.” ఆ తర్వాత ఆమె గురించి ఏమీ చెప్పనవసరం లేదు. కానీ ఆయన ఆమె గురించి యింకా ఎక్కువే చెప్పాడు. ఒక గాయకుడు మరొక గాత్ర సంగీతాన్ని ఎన్నడూ వర్ణించని విధంగా, ఎంతో కీర్తనాపాదించే పదంతో వర్ణించాడు. దానికోసం ఆయన ఆలంకారిక సంస్కృతాన్ని ఆశ్రయించి సుబ్బులక్ష్మిని “సుస్వరలక్ష్మి సుబ్బులక్ష్మి” అన్నాడు.

సుస్వరలక్ష్మిగా యమ్మెస్‌కున్న హోదానే సదాశివం నిర్మాణానికి పునాది. తమిళనాడును, కర్ణాటక సంగీత కఠిన సంప్రదాయాలను దాటి ఆమెను ప్రయాణింపచేసిన విధం, ఊహా కళా ప్రావిణ్య ప్రదర్శన తప్ప మరొకటి కాదు. యమ్మెస్ సమకాలికులలో మరొక దక్షిణ భారతదేశ సంగీతవేత్తలెవరూ, స్త్రీ పురుష బేధం లేకుండా, ఉత్తర భారతదేశ సంగీత పండితులతో స్నేహ సంబంధాలు కొనసాగించలేదు. కొన్ని సంబంధాలు, దేశంలో ఒక భాగం నుంచి మరొక భాగంలోని ప్రావిణ్యతకు త్వరగా గుర్తింపు దొరకటం, అసలు లేదని కాదు. జి.యన్. బాలసుబ్రహ్మణ్యం కూడా సుబ్బులక్ష్మిలాగే బడేగులాం ఆలీఖాన్‌ని చాలా ఇష్టపడేవాడు. మద్రాసులో ఉస్తాద్ కచేరీ ముగించిన సమయంలో ఆ గాయకుడి ఎదురుగా జి.యన్.బి ప్రశంసా పూర్వకంగా సాష్టాంగ ప్రణామం చేశాడు. ఈ చర్య కర్ణాటక సంగీతకారులలో కావలిసినంత విమర్శలను రేకెత్తించింది. ఉత్తరాదికి ప్రణమిల్లటంగా వాళ్ళు ఆ చర్యను అర్థం చేసుకున్నారు. ఆ రోజునే, పగటిపూట దీనికి పూర్తిగా వ్యతిరేక దిశలో దాసోహం జరిగింది. జి.యన్.బి. ఉస్తాద్‌ని ఆయన బసచేసిన చోటికి వెళ్ళి కలిసి కొన్ని కర్ణాటక రాగాలను పాడాడు. ఆ హిందూస్తానీ పెద్దాయన జి.యన్.బి పాదాలను గౌరవంతో తాకటానికి కిందకు వంగి, తర్వాత లేవటానికి శ్రమ పడ్డాడు.

తనంతటి వారిని గౌరవించే వినమ్రత కలిగిన మరొక సంగీతకారిణి వీణ ధనమ్మ. ఒకసారి ఆమె అబ్దుల్ కరీం ఖాన్‌ని, సంగీతానికి అంకితమైన ఉస్తాద్‌ని, తనకు పాడాలనే

ఆవేశం కలిగితే దారి పక్కనున్న నీడలోకి వెళ్ళి దీర్ఘమైన ఆలాపనలు చేసేవాడని చెప్పుకునే ఆ సంగీత విద్వాంసుడి పాటను విన్నది. ధనమ్మ ఆయన దర్బారీ కన్నడ రాగాన్ని పాడటం విని, తలమునకలై, ఏం చెయ్యాలో తెలియక, తన దగ్గరున్న పది రూపాయలూ తీసి, ఆ విద్వాంసుడి పాదాల దగ్గరుంచి ఇలా బతిమాలుకుంది. "అయ్యా నేను అడుక్కునే దానిని. దయచేసి దీనిని అంగీకరించండి."

ఉత్తర భారతదేశ విద్వాంసులతో నిలకడైన స్నేహం యమ్మెస్‌కి వుండటం చేత మామూలుగా కర్ణాటక సంగీత విద్వాంసులకు అలవాటైన దానికంటే ఎక్కువ సహాయ సహకారాలు ఆమెకి అందాయి. భారతదేశపుటంచులను దాటి ఆమె ప్రయాణం చేసినప్పుడు కూడా ఈ సహాయసహకారాలు ముందటి వాటికి సహజమైన కొనసాగింపులనే అనిపించింది. ఇవాళ ఒక భారతీయ సంగీత కళాకారుడు విదేశాలలో ప్రదర్శనలివ్వటం మామూలు విషయంలా అనిపిస్తుంది – కానీ స్వాతంత్ర్యానంతరపు రెండు దశాబ్దాలలో అది చాలా పెద్ద విషయం. ఇరవయ్యొకటవ శతాబ్దపు జట్ వేగ కాలంలో భారతీయ సంగీతకారులు, అకాడమిక్ డిప్లొమాలు తప్ప మరేమీ లేకుండా అమెరికాలో తమ స్వంత పాఠశాలలు స్థాపించుకుంటున్నారు లేదా అమెరికన్ యూనివర్సిటీలలో పాఠాలు చెబుతున్నారు. కానీ 1950, 1960 లలో పాశ్చాత్య సమాజాలలో తగిన శ్రోతలు దొరకటమే కష్టంగా ఉండేది. ఒక కర్ణాటక సంగీత విద్వాంసుడు ఎదుర్కొన్న అవరోధాలకు సెమ్మంగుడి శ్రీనివాస అయ్యరే నిలువెత్తు సాక్ష్యం. ఆయన ఎప్పుడూ ఇండియా దాటి వెళ్ళలేదు. ఒకసారి అమెరికా నుంచి అభిమానులు ఆహ్వానించారు గానీ దానినాయన తిరస్కరించాడు. "అది నాకు ఆమోదించదగినదిగా అనిపించలేదు" అంటూ యిలా వివరించాడు, "ఎవరో ఇళ్ళలో పెట్టే కచేరీలో నేను పాడాలి, అక్కడ నిర్వాహకులు పళ్ళెం పట్టుకుని కళాకారుడికివ్వటానికి డబ్బుల కోసం అడుగుతూ తిరుగుతారు. నన్ను రమ్మని పిలిచే ప్రతిపాదన గౌరవనీయమైన పరిస్థితులలో, ముఖ్యంగా ప్రభుత్వం తరఫునుంచి, సంగీత సభలలో సరైన కచేరీలు ఏర్పాటు చేస్తామంటే అప్పుడేమైనా సానుకూలంగా స్పందించేవాడినేమో."

❖ ❖ ❖ ❖

ప్రభుత్వాలు చొరవ తీసుకుంటాయని నిరీక్షించకుండా సదాశివం "గౌరవనీయమైన పరిస్థితు"లను యేర్పాటు చేశాడు. ప్రతిభావంతులైన సంగీత కళాకారులెందరికో అసాధ్యమైన విషయాన్ని సదాశివం వ్యవహార శైలి సాధించగలిగింది. కచేరీ సభలలో సరైన కచేరీలను ఏర్పాటు చేసేవారెవరూ సెమ్మంగుడికి దొరకనపుడే, యమ్మెస్ ప్రపంచంలోనే ప్రఖ్యాతి చెందిన కచేరీ వేదికలు కొన్నింటిపై కనిపించింది. ముందుగానే ఖరీదైన వితరణ టిక్కెట్లను అమ్మటం వల్ల, పాడే చోట పళ్ళాలు పట్టుకుని తిరిగే అవసరం

రాలేదు. 1963లో ఎడింబర్ మ్యూజిక్ ఫెస్టివల్, 1977లో అమెరికాలో ఒక తీరం నుంచి మరొక తీరం వరకూ జరిగిన కచేరీలు, 1982 లో లండన్ రాయల్ ఆల్బర్ట్ హాలులో, పారిస్‌లో జరిగిన ఇండియా ఫెస్టివల్స్‌లో, 1985లో లండన్, మాస్కోలలో జరిగిన కచేరీలు విజయయాత్రలో బాగా గుర్తుండిపోయే మైలు రాళ్ళు.

అసాధ్యంగా కనిపించే దానిని సాధించటంలో సదాశివం బాగా ఆధారపడదగిన రెండు వనరుల నుంచి ప్రయోజనాన్ని పొందాడు. రాజకీయ ప్రభావాలు, మైలాపూర్ బ్రాహ్మణ సంఘ సహకారం. మొదటిది రాజగోపాలచారివల్ల, కాంగ్రెస్ వ్యవస్థ వల్ల పొందగలిగటంతో సదాశివం పని తేలికయింది. రెండవది చాలాసార్లు మొదటి దానితో సమాంతరంగా సాగింది. ఎందుకంటే కాంగ్రెస్‌తో సమానంగా రాజాజీ బ్రాహ్మణీయ సంస్కృతిపై గూడా అధికారం కలిగి వుండేవాడు. ఈ సంస్కృతి వూటబావులను ఆ సంఘ సభ్యులు కావలసినప్పుడల్లా చేదుకునేవారు. తమ చుట్టూ పనిచేస్తున్న హోదాల అంతరువుల పొరల గురించి ఆ సభ్యులు యెరుక గలిగి వుండేవారు. మద్రాసు లోపల మైలాపూర్ దీనికి ప్రాతినిధ్యం వహిస్తే, కపాలి ఆలయ పరిసర ప్రాంతం ఆ ప్రత్యేక ప్రాంతంలో మరింత సౌకర్యవంతమైన ఆవరణకు ప్రతినిధిగా వుండేది. ఇరవయ్యవ శతాబ్దపు తొలి సంవత్సరాలలో మద్రాసులోని ప్రముఖ వ్యక్తుల ప్రజానాయకుల చిరునామాలు మౌబ్రేస్ రోడ్, నార్త్ మద్రాస్ స్ట్రీట్, ఎల్డమ్స్ రోడ్, లజ్ చర్చి రోడ్డులకు చెందివుండేవి. ఇవన్నీ మైలాపూర్ వీధులే. ఈ ప్రముఖులందరూ వారి మేధో విజయాలకు గుర్తింపబడినంతగా, వారి మతాచారాల నియమనిష్ఠలకు గుర్తింపబడలేదు. వాళ్ళకు విద్య ఒక ఫిలాసఫీ. అది పాఠశాలలు స్థాపించటం కావచ్చు, లేదా తమ విద్యార్థులను పరిపాలనాధికారానికి ఉక్కు కవచమైన ఇండియన్ సివిల్ సర్వీసెస్‌కు తయారు చేయటం కావచ్చు. వాళ్ళ ప్రపంచంలో అప్పుడప్పుడూ శత్రుత్వాలు చోటు చేసుకోవచ్చు. కానీ వాళ్ళ అనుబంధం మాత్రం చెక్కు చెదరదు. ఈ విద్వత్ విశ్వంలో సదాశివం తటస్థపౌరుడేమీ కాదు. తన తొలి సంవత్సరాలలో ట్రిప్లికేన్‌లో జీవించటం వల్ల అతనిని పరాయివాడనుకునే అవకాశం వుంది. మైలాపూరు నివాసులు దానిని దిగువ మధ్యతరగతి ప్రాంతంగా తీసిపారేస్తారు. అతను మైలాపూరులో సహజమైన పౌరుడిగా సమానస్థాయిని పొందటం అతని శక్తిమంతమైన వ్యక్తిత్వానికో కలికితురాయి. బ్రాహ్మణ సంస్కృతికి మూల స్తంభాలైన 'ది హిందూ' కస్తూరి కుటుంబం, టివియస్ కుటుంబం, సదాశివంకు, యమ్మెస్‌కు స్నేహితులు, మద్దతిచ్చేవారు అయ్యారు. ఆ సమయంలో ఎప్పుడో ఒకసారి కేంద్రమంత్రి వర్గంలోపల, మైలాపూర్ కేంద్రపు యితర కాంతి పుంజాలు వుంటూ వచ్చాయి. ముఖ్యంగా టి.టి. కృష్ణమాచారి, ఆర్. వెంకటరామన్. వెంకటరామన్ రాష్ట్రపతి స్థాయికి ఎదగటంతో రాష్ట్రపతి భవన్ మరోసారి సదాశివం స్వేచ్ఛగా సంచరించే ప్రాంతమయింది. మైలాపూర్

హస్తాలు ప్రపంచమంతా సాచుకున్నాయి. సదాశివంకు, యమ్మెస్‌కు మంచి ప్రయోజనకారి గౌరవనీయుడు, అందరినీ ప్రభావితం చేయగలవాడైన సి.వి. నరసింహన్ ఐక్యరాజ్య సమితి వద్ద చెఫ్ డి కాబినెట్‌గా వున్నాడు. నిజానికి ఆయన ఐక్యరాజ్యసమితినే సుబ్బులక్ష్మికి వేదికగా చేయగలవాడు. ఇక అసంఖ్యాకులైన గుమాస్తాలు, అకౌంటెంట్లు, స్టెనోగ్రాఫర్లు, ఆఫీసు అసిస్టెంట్లు యింకా ఇతర కీలక ప్రాంతాలలో పట్టువున్నవారూ, మైలాపురూ నుంచి వ్యాపించి ప్రపంచాన్ని నడిపిస్తూ వున్నారు. చాలాసార్లు పనులు జరగటంలో వారి సేవలే నిర్ణయాత్మకమవుతాయి. సదాశివం రాజులతో, వారి పక్కనే నడుస్తూ కూడా, సామాన్య ప్రజల సావాసం కోల్పోని మనుషుల్లో ఒకడు.

విరోధాబాసాలంకారంలాగా, సదాశివం సాధించిన గొప్ప అంతర్జాతీయ సంగీతపు కుట్ర కళాసౌందర్యపరంగా అతి విషాద దృశ్యంగా మారిపోయింది. 1966 లో ఐక్యరాజ్యసమితి కచేరి అనేక రకాలుగా ప్రత్యేకమైనది. ఆమె సంగీతానికి ఆమెను ఒదిలేస్తే యమ్మెస్ అక్కడెంతో రాణించగలిగేది. ఐతే ఆ సందర్భం యొక్క అచ్చమైన వైభవం సదాశివంను, అతని సహచరులనూ చాలా ఉద్వేగోద్రేకాలకు గురిచేసింది. కమలానికి బంగారు పూత పూసే ఉద్దేశంతో, యమ్మెస్ ఒక ఇంగ్లీషు కీర్తన పాడాలనే ఆలోచనతో వాళ్ళక్కడికి వెళ్ళారు. సదాశివం ప్రకారం ఆ ఆలోచన మొదలయింది జనరల్ కె.యమ్. కరియప్ప నుండి. ఆ మంచి సైనికుడు మంచి ఉద్దేశంతోనే ఆ ఆలోచన చేసి వుంటాడు. కానీ సదాశివం దానిలో వుండే ఇబ్బందులను గురించి ఆలోచించి పక్కనపెట్టాల్సింది. దానికి బదులు అతను మితిమీరిన ఉత్సాహం చూపాడు. ఎప్పటిలానే రాజాజీ ఆమోదాన్ని కోరాడు. రాజాజీ అంగీకరించాడు. నిజానికి ఆ కీర్తన రాజాజీనే రాశాడు. ఆ పాటలకు మద్రాసులో పాశ్చాత్య సంగీతంలో ప్రసిద్ధుడైన హండేల్ మాన్యుయల్ సంగీతం సమకూర్చాడు. ఆ ఇంగ్లీష్ హిమ్న్‌ను ఎలా పాడాలో యమ్మెస్ కతనే నేర్పించాడు. కానీ మాన్యుయల్‌కున్న వృత్తి నైపుణ్యం కూడా ఇంగ్లీషులో పాడటంలో యమ్మెస్‌కున్న యిబ్బందిని తొలగించలేకపోయింది. ఆ సందర్భానికి ఎంతో సంచలనాత్మక విలువ వుండటంతో వార్తా పత్రికలు దానికి ఉదారంగా చోటు కేటాయించాయి. కానీ ఐక్యరాజ్యసమితి కారిడార్లలో కచేరీ తర్వాత కలిగిన సంచలనాలు మరోక విధంగా వున్నాయి. మైలాపూరు స్వంత పత్రికైన శృతిలో వచ్చిన రిపోర్టు ఇలా వుంది, “యమ్మెస్, రాధా, నిలబడి, రాజాజీ హిమ్న్‌ని పాఠశాల విద్యార్థినుల్లా పాడటాన్ని చూడటం చాలా విచారకరంగా వుంది.” పేరు చెప్పని న్యూయార్క్ రసికుడొకరు పలికిన మాటను ఆ రిపోర్టు ఉదహరించింది. “చాలామంది భారతీయులు, భారతీయ సంగీత సామ్రాజ్ఞిచేత చేయించిన పనిని చూసి సిగ్గుతో తలలు దించుకున్నారు.”

ఐక్యరాజ్య సమితిలో కలిగిన నిరాశ నిలవలేదు. మిగిలిన అమెరికా యాత్ర అఖండ విజయాన్నిచ్చింది. అమెరికా యాత్రకు యదార్ధమైన ప్రయోజనం న్యూయార్క్‌లో, పిట్స్‌బర్గ్‌లో హిందూ దేవాలయాలకు నిధులు సమీకరించటం. కాల్గెట్ విశ్వవిద్యాలయం వద్ద (హామిల్టన్, న్యూయార్క్) అమెరికాలో యమ్మెస్ మొదటి కచేరీకి అంతకు ముందెన్నడూ లేనంత పెద్ద ఎత్తున జనం గుమిగూడినపుడు, సదాశివం, సహాయకులు, సహచరులు, సహోద్యోగులందరి ముందూ, అందరూ చూసేలా సెంటిమెంటల్ అయ్యాడు. ఉద్రేకంతో ఒణికిపోతూ "ఎంతోకాలం నుంచీ నేను కలలు కంటున్నది దీని కోసమే. ఈమెను ప్రపంచ రంగస్థలం మీద నిలపాలనే నా అతిపెద్ద ఆశ నెరవేరింది."

సాధారణ అమెరికన్లపైన యమ్మెస్ కలిగించిన ఒక వింత మార్మిక ప్రభావం నుంచి కూడా అతను సంతృప్తి పొందగలిగాడు. యునైటెడ్ నేషన్స్ కచేరీ జరిగిన సమయంలో మరో మైలాపూర్ సహచరుడు, ఎస్సో ఆయిల్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ అయిన వ్యక్తి అపార్ట్‌మెంట్‌లో ఈ దంపతులు ఉన్నారు. ఒకరోజు మధ్యాహ్న భోజనం పూర్తయిన తర్వాత, ఆ అపార్ట్‌మెంట్‌కు చేరిన కొందరు స్నేహితుల సమావేశంలో సుబ్బులక్ష్మి పాడుతోంది. వాళ్ళకు నిస్పృహ కలిగిస్తూ ఆ పక్క అపార్ట్‌మెంట్‌లో జరగుతున్న మరమ్మత్తు పనులు నుంచి నిరంతరాయంగా వస్తున్న సుత్తి మోతలు, రంపపు కోతలై పక్క వాద్యాల స్థానాన్ని భర్తీ చేస్తున్నాయి. అపార్ట్‌మెంట్ యజమాని యిబ్బంది కలిగించినందుకు చాలా మొహమాటపడ్డాడు గానీ నిస్సహాయుడనని చెప్పాడు. ఒక్క యమ్మెస్ మాత్రమే దీనినేమీ పట్టించుకోకుండా పాడుతూనే వుంది. కొద్ది నిముషాల అనంతరం, ఆ చప్పుళ్ళు హఠాత్తుగా ఆగిపోయాయి. తలపైన హెల్మెట్లు ధరించిన యిద్దరు అమెరికన్ పనివాళ్ళు అపార్ట్‌మెంట్ తలుపు దగ్గర ప్రత్యక్షమయ్యారు. "మాకిదేం అర్థం కావటం లేదు. కానీ మా హృదయాలను ఎంతో దగ్గరగా తాకింది. మేం కూడా వినొచ్చా?" అన్నారు. బహుశా అమెరికాలో యమ్మెస్‌కు అతి గొప్ప అనుభూతి కలిగించిన సమయం అదే కావచ్చు.

ఆ తర్వాత భారతీయ సంగీత కళాకారులెందరో అమెరికాలో తమ ఇళ్ళు కట్టుకుని నివసించారు. ఉదాహరణకు కాలిఫోర్నియాలో రవిశంకర్, ఫ్లోరిడాలో కె.జె. యేసుదాస్‌లను చెప్పవచ్చు. కాని యమ్మెస్ గెల్చుకున్న గొప్ప గౌరవాన్ని అతి కొద్దిమంది సాధించగలిగారు. దానికి ఒక కారణం, ఆమె తనకంటే గొప్పదైన ఒక మహా కార్యసాధనకై నిలబడిందని కనిపించేలా చేసిన ఒకే ఒకవ్యక్తి. ఆమె సృష్టించిన ప్రజాభిప్రాయాన్ని గురించి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఎంతో బాగా వ్యక్తీకరించి స్పష్టంగా ప్రకటించినట్లు: "ఆమె సంగీతం దేవతలు ప్రసాదించిన వరం. దానినామె దేశసేవకోసం అర్పించింది." యమ్మెస్‌ను ప్రపంచ వేదికల మీద నిలపాలనేది సదాశివం కల అనటంలో సందేహమేమీ లేదు. కానీ వేరే ధార్మిక కార్యాల సహాయార్థం కచేరీలు చేయాలనే ఆలోచన రాజగోపాలచారిది. ఈ ఆలోచనే

ఆమెకు ఆధునిక కాలాల్లో యితర సంగీత కళాకారులకెవరికీ లేని వ్యక్తిత్వాన్ని సంపాదించిపెట్టింది. యమ్మెస్, యమ్మెస్ ఒక్కతి మాత్రమే సంగీతపు మిషనరీగా నిలబడిపోయింది.

❖ ❖ ❖ ❖

1944వ సంవత్సరంలో కస్తూర్బా ట్రస్టు కచేరీల తర్వాత ఆమె సేవల కోసం అభ్యర్థనలు వెల్లువెత్తటం వూహించలేని విషయమేమీ కాదు. సదాశివం తన కాలాన్నంతా వాటినొక పద్ధతిలో పెట్టేందుకే వినియోగించాడు. యమ్మెస్ 'నిధుల సేకరణ వృత్తికారులను' మించిపోయింది. ఆమె కచేరీలిచ్చిన ధార్మిక కార్యక్రమాలలోని వైవిధ్యం అంతులేనిదిగా కనిపిస్తుంది. గాంధీ, నెహ్రూలకు సంబంధించిన స్మారక నిధుల కోసం చేసిన కచేరీలు పైన కనిపించే అలంకారాలు మాత్రమే. వాటిని దాటివెళ్ళి ఎన్నో సంస్థలు, సంఘాలు విశాల ప్రపంచమంతా వ్యాపించాయి. 1980లలో సదాశివం తయారు చేసిన జాబితా ఒక పత్రిక సైజులో మూడు పేజీల నిండా, రెండు వరసలలో, చాలా చిన్న అక్షరాలతో అచ్చువేస్తే సరిపోయేంత పెద్ద జాబితా అది. ఆ జాబితాలో పేర్లు ఎంతో వైవిధ్యమైన పనులు చేసే సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తాయి: రైల్వే మహిళా సంక్షేమ సంఘం నుంచి, మద్రాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి, నుంచి, సెంగిపట్టిలో క్షయవ్యాధి శానిటోరియం, తలైకావేరీలో అతిరుద్ర మహాయాగం వరకూ, మైసూర్ జిల్లా పోలీసు సహాయ నిధి, అలహాబాదులో ఆది శంకర విమాన మండపం నుంచీ అఖిల భారత ఉత్పత్తిదారుల అసోసియేషన్, వెల్లూరు క్రిస్టియన్ మెడికాలేజీ వరకూ ఆమె కచేరీలు విస్తరించాయి. విశ్వహిందూ పరిషత్ సహాయార్థం యమ్మెస్ నాలుగు కచేరీలు చేసింది. ఐతే ఇవి విశ్వహిందూ పరిషత్ తాను మతతత్త్వ ఎజెండాకు నాయకపాత్రను వహిస్తున్నానని తెలియజెప్పిన సమయంకంటే చాలాముందే జరిగాయి. బొంబాయి (1970), నాగపూర్ (1972) కలకత్తా (1973) బెంగుళూరు (1975)లలో జరిగాయి. సదాశివం నిజమైన హిందువే గానీ, మతతత్త్వవాది కాదు. యమ్మెస్‌కు మతపరమైన వివక్షా భావనలు ఏమాత్రం తెలియవు. ఆ విషయంలో ఆమె పూర్తిగా అమాయకురాలు.

మంచి కారణాలు, కేవలం అవి మంచిగా కనిపించినంత మాత్రం చేత ఆటోమేటిగ్గా సదాశివం అనుమతిని, అంగీకారాన్నీ పొందవు. ఆయనను సంతృప్తిపరచటం చాలా కష్టం. ఒక పట్టాన సంతృప్తిపరచలేరు. రాజాజీ కలగజేసుకున్నా, కస్తూర్బా ట్రస్టు కూడా సదాశివం విధించిన నియమ నిబంధనలకు లోబడవలసిందే. నిర్వాహకులతో యిలా చెప్పేవాడు "ఆమె మీ కోసం పాడుతుంది. ఎప్పుడంటే మీరు లక్షరూపాయలు సేకరించగలమనే హామీని కచ్చితంగా యిచ్చినప్పుడే. ఆ డబ్బు మీకే చెందుతుంది." ఇక్కడ విషయమేమిటంటే ప్రతి ప్రదర్శనకు హాలు నిండుగా శ్రోతలుండాలి. దానికి

హామీ యివ్వటం నిర్వాహకుల బాధ్యత అని ఆయన భావించేవాడు. ఆయనకు డబ్బుమీద ఆసక్తేమీ లేదు. యమ్మెస్ స్థాయికి తగినట్లుగా వీలైనంతమంది ఎక్కువ శ్రోతలు హాజరుకావాలి. వచ్చిన డబ్బులలో కొంత, ప్రయాణ ఖర్చుల కోసం, ముఖ్యం సహకార వాయిద్యకారుల కోసం తీసుకునేవాడు. సహకార వాద్యకారులను కిందిస్థాయి సహాయకులుగా, పనివారిగా చూడటం ఆ రోజుల్లో మామూలుగా జరిగేది. కానీ సదాశివం దంపతులు వారిని తమ కుటుంబంలో సభ్యులుగా చూడటంతో వాళ్ళిద్దరూ ట్రూపు సభ్యులందరికీ "మామా" "మామి" లై పోయారు. ఆతిథ్యాన్నిచ్చే సంస్థలు వాళ్ళకు కూడా అతిథి మర్యాదలు ఎందుకు చేయకూడదని సదాశివం దంపతులు ఆలోచించేవారు. వాద్య సహకార నిపుణులకు ఎవరూ వుండలేని ఘోరమైన వసతినిచ్చి, యితర విధాలుగా కూడా మంచిగా చూడకపోతుంటే, సదాశివం కచేరీ ఆపేయించి వెళ్ళిపోయిన సందర్భాలు కూడా మాత్రమే.

కచేరీ సభ నిండుగా శ్రోతలుండే ప్రదర్శనలతో మాత్రమే యమ్మెస్ తన సంగీతాన్ని దేశసేవకు అంకితం చేయలేదు. కొన్నిసార్లు, ఆమె ఒక సభకో, వేడుకకో వెళ్ళి ప్రార్థనా గీతాన్ని పాడి, ఆ ఆశయాలతో తానూ ఏకీభవిస్తున్నానని చూపించేది. 1983లో మద్రాసులో బి.డి. గోయెంకా జర్నలిజం అవార్డుల ప్రదానోత్సవాన్ని, ఆమె కుటుంబ స్నేహితుడైన రామనాథ్ గోయెంకా ఏర్పాటు చేసినపుడు ఆమె తన గౌరవాన్నలా ప్రకటించింది. ఇంకో గొప్ప విషయం, 'తిరుపతి వేంకటేశ్వర సుప్రభాతం' పాడి రికార్డు చేసి దాని మీద వచ్చే రాయల్టీని తిరుమల తిరుపతి దేవస్థానానికి (టిటిడి) విరాళంగా యిచ్చింది. తన జీవితంలో మార్గదర్శకులుగా తాను గౌరవించిన వారి స్మారకార్థం ఆ నిధుల కోసం ఆమె పాడింది. – రాజగోపాలాచారి విగ్రహ ప్రతిష్టాపనను ఢిల్లీలో, మద్రాసులో చేయటానికి, తిరువారూర్‌లో త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రిల యిళ్ళను పునరుద్ధరించటానికి యమ్మెస్ కచేరీలు చేసింది.

యమ్మెస్ కచేరికి ఎంత డబ్బు వస్తుందని అడగటానికి ప్రజలు కొన్నిసార్లు సందేహిస్తారు. ఆ విషయం గురించి ఒక అరుదైన పత్రిక రిపోర్టు కొంత స్పృశించింది. 1948 జనవరి సంచికలో కందూసి పత్రికలో యదార్థంగా ఒక అంకెను ప్రచురించింది. ఆ పత్రిక 1947 డిసెంబర్‌లో బొంబాయిలో, సౌత్ ఇండియన్ ఎడ్యుకేషనల్ సొసైటీ కోసం చేసిన కచేరీకి 98,000 రూపాయల మొత్తం వసూలయిందని ప్రకటించింది. యమ్మెస్ చేసిన ప్రతి ధార్మిక కచేరీ లెక్కలన్నీ సదాశివం అతి చిన్న వివరాలతో సహా – రాసి వుంచుతాడు. ఐతే అవి అందరి కోసం కాదు. ఆయన ఉద్దేశం అనేక ఆశయాలకు, మంచి పనులకు యదార్థంగా ఎంత డబ్బు అందించగలిగామనే సంగతిని కచ్చితంగా తెలుసుకోవటం, మరీ ముఖ్యంగా, ఆ డబ్బు నిజంగా సరైనవారి చేతుల్లోకే వెళ్ళిందని,

స్వార్థపరుల జేబుల్లోకి వెళ్ళలేదని నిరూపించే రికార్డులను రాసి భద్రపరచటం. నిజానికి వేంకటేశ్వర సుప్రభాతం క్యాసెట్లు అమ్మకాలనుంచి వచ్చిన రాయల్టీ మొత్తాలనుంచి కొంత భాగానికి లెక్కలు చూపలేదనే ఆరోపణలు సదాశివం మీదకు ఎక్కుపెట్టారు. దీనికి స్పందిస్తూ, ఆ ఆరోపణలన్నిటినీ తిరస్కరిస్తూ తన పేరు మీద ప్రకటనలు వేయటం బాధ్యతగా ఆయన భావించాడు. ఆ ప్రకటనలు క్యాసెట్ల అమ్మకాల నుంచి వచ్చిన మొత్తం పది లక్షలు దాటిందనే పుకార్లు నిజం కాదనీ, ఐదు లక్షలు మాత్రమే వచ్చిందని, దానిని టి.టి.డికి విరాళంగా యిచ్చారనీ తెలియజేశాయి.

❖ ❖ ❖ ❖

సదాశివం వివాదాలను ప్రశాంతంగానే తీసుకుని వాటిని పట్టించుకోకుండా సాగిపోతుంటాడు. అతను ఒకే ఒక్క విషయాన్ని పట్టించుకుంటాడు, తానింత శ్రమపడిన తర్వాత, యమ్మెస్ తన తరం యొక్క జీవితం, నైతికత, తన స్వాభావిక ప్రవర్తన ప్రభావం యొక్క సారాంశంలో భాగమైందనే విషయమే అతనికి ప్రధానం. ఆమె దేశాధ్యక్షులతో, ప్రధానమంత్రులతో, గుర్తింపబడినంతగా గాంధీతో గుర్తింపబడింది. సమకాలీన ఆదర్శాలు ఆశయాలతో పాటు ఐక్యరాజ్యసమితితోనూ గుర్తింపు పొందింది. ఆ గుర్తింపు అనేది అత్యున్నతమైన తేజస్సు, ఉదారత, దయ, కపటం లేని తత్త్వంతో వచ్చింది. సమకాలీన రాజకీయ ధోరణులకు తన కళను యమ్.యఫ్. హుస్సేన్ వంటి ప్రముఖ చిత్రకారుడు అందించినట్లుగా, యమ్మెస్ ఎన్నడూ తిరస్కారపూర్వకమైన ప్రచారాన్ని ఆకర్శించాలని చూడలేదు. జర్మన్ జాత్యహంకార నాజీ – ఫాసిస్టు భావనలు ప్రచారంచేసి జర్మన్ సంగీతకారుడు రిచర్డ్ వాగ్నర్ సృష్టించిన భావావేశాలను ఆమె సృష్టించలేదు. పాశ్చాత్య ప్రపంచంలో నైతిక, రాజకీయ సంబంధాలు రోజువారీ జీవితంలో ఎలా ఉన్నాయనే దానిని బట్టి అది ఎంత ఉత్తమమైన కళ, ఎలా వ్యాఖ్యానించాలనే వాదోపవాదాలు వెల్లువెత్తుతుంటాయి. "మేధోజనిత కార్యాలు, ముఖ్యంగా ప్రధానంగా కళ, సౌందర్యాలకు, మేధస్సుకి సంబంధించిన విషయాలలో, పనులలో, వాస్తవ విషయాలు పూర్తిగా వ్యతిరేకంగా మాత్రమే సమస్యలవుతాయి." అంటాడు ఎడ్వర్డ్ సయిద్. యమ్మెస్ మేధోపరమైన చర్చలలో భాగమైన సందర్భమే లేదు. హుస్సేన్ – వాగ్నర్ తరహా రాజకీయ పరమైన వాటిలో అసలే లేదు. ఆమెలోని స్వాభావికమైన అమాయకత్వం ఆమె చుట్టూ, ఆమె కళ చుట్టూ రక్షణ వలయాన్ని అల్లింది. ఆ వలయం మీద సదాశివం రాజకీయ, వ్యాపార సంబంధాల వల్ల కూడా చిన్న తూటు పడలేదు. ఆయన వ్యూహాలకు యమ్మెస్ సాధనమైందిగానీ, ఆమెకు వ్యూహాలంటే ఏమిటో, ఆమె విషయంలో వాటి ఆశయాలేమిటో తెలియకుండానే ఉండిపోయింది. ఆమె అమాయక స్వభావం, కళా సౌందర్యాకర్షణకు, ఆమె విజయాల వైభవానికి అదనంగా విలువను తెచ్చింది.

ఆమె సినిమా తారగా వుండిపోయినట్లయితే ఆ వైభవానికి వన్నె తగ్గేది. భారతదేశంలో శాస్త్రీయ సంగీతంతో కలిసివుండే గౌరవం వంటిది సినిమాకు దొరకటం అసాధ్యం. సినిమా వలే కాకుండా సంగీతం భారతీయ సంప్రదాయకళ కావటం వల్ల, భారతదేశపు కీలక సంస్కృతికి ప్రాతినిధ్యం వహించటం ఒక కారణం కావొచ్చు. సినిమాను దీనికి వ్యతిరేకంగా అర్థం చేసుకున్నారు. సినిమాకు 1956లో సత్యజిత్‌రే ఆ రంగంలో ఆవిర్భవించిన తర్వాతనే ఆంక్షలు లేని గుర్తింపు వచ్చింది. సత్యజిత్ రే కున్న అసామాన్య ప్రతిభ, సినిమాలో వాస్తవ జీవిత చిత్రణ చేసిన విధం భారతదేశాన్ని ప్రపంచ సినిమా పటంపై వుంచాయి. కానీ అతనిని సినిమాకు ఒక ప్రతినిధి అని అనలేము. సినిమాను భారతీయులు చూసే దృష్టి ఎలా వుంటుందంటే ఒక సినిమాని సంస్కృతంలో తీశారు గాబట్టి దానికి జాతీయ ఉత్తమ చిత్రంగా అవార్డు యిస్తారు. సదాశివంకు ఆ సినిమారంగంలో చిరకాలం నిలిచే గుణాలేమీ కనిపించలేదు. బహుశా యమ్మె నటించిన 'మీరా' నే ఆరిపోతున్న కొవ్వొత్తి చివరి వెలుగు; సినిమాలలో క్లాసిసిజం స్థానంలో అతివేగంగా రొమాన్సు, హింస, యుద్ధాలతో నిండిపోతున్నది. ఆ ప్రక్రియలు యమ్మెస్‌కి బొత్తిగా తగినవి కాదు. సినిమాల నుండి వైదొలగటమనేది ఆ సమయానికి తగిన నిర్ణయం. ఆ దృశ్యాన్నంతా ఒక్కసారి పరికించి చూసినపుడు సదాశివంకు ముఖ్యంగా సంతృప్తి కలిగించినదేమిటంటే, యమ్మెస్ సినిమాల వల్ల పొందగలిగినదంతా పొందింది. అదే సమయంలో శాస్త్రీయ సంగీతంలో తను సాధించినదేమీ ఆమె కోల్పోలేదు. 'మీరా' కాలంలో ఆమె సంగీతంలో ప్రవేశపెట్టిన ఆధ్యాత్మికాంశం, కర్ణాటక సంగీత కళాకారిణిగా ఆమె సమగ్రతను మరొకసారి మరింత బలంగా చూపింది. ఆధునిక పలుకుబడిలో, ఆధునిక శ్రోతలకు, ఆమె సంగీతపు ఆధ్యాత్మిక సారాంశాన్ని పునరుద్ధరించింది. సంరక్షించింది.

ప్రభుత్వ హిందూస్థానీ గాయకురాలు కిషోరీ అమ్నోకర్, తన తల్లి భారతీయ శాస్త్రీయ సంగీతం ఆధ్యాత్మికతతో కూడినదని చెప్పిన విధానాన్ని ఒక సందర్భంలో గుర్తుచేసుకున్నది. కిషోరీ గీత్ గాయా పథరోనే (1964) సినిమాలో ఆ పేరుమీది పాటను పాడిన తర్వాత ఆమె తల్లి ఆమెను చివాట్లు పెట్టింది; "నువ్వు ఆ పరిశ్రమలో ప్రవేశించదల్చుకుంటే, నేను నీకు నేర్పిన ప్రయోజనం నెరవేరదు. నీకు డబ్బు, పేరూ తొందరగా రావచ్చు. కానీ నువ్వు అంతకంటే ఎక్కువగా కోల్పోతావు." కిషోరీ చేసినది నేపథ్య సంగీతం పాడటం మాత్రమే. యమ్మెస్ కథానాయికగా నటించింది. యమ్మెస్‌కు కీర్తి సులభంగా వచ్చింది, డబ్బూ సంపాదించింది. ఐతే ఆమె సంపాదించినదానికంటే ఎక్కువ పోగొట్టుకోకముందే, ఆమె జీవితపు దిశమార్చుకున్నది. ఆమెకు కర్ణాటక సంప్రదాయానికి ప్రాతినిధ్యం వహించిన అదనపు ప్రయోజనం కలిగింది. ఆ సంప్రదాయంలో ఆధ్యాత్మికత బలంగా వుంది.

హిందూస్తానీ సంప్రదాయానికీ అటువంటి మూలాలే వున్నాయి, కానీ ఆ ఫలాలు అంటుకట్టిన ఫలితాలను చూపిస్తున్నాయి.

సంగీత సిద్ధాంతకారుడైన రాఘవ ఆర్. మీనన్ దానిని సంగ్రహంగా, స్పష్టంగా యిలా చెప్పాడు: "కర్ణాటక సంప్రదాయంలో.... భగవంతుడు నియమబద్ధంగానే ఉన్నాడు. ఆయన తేజోమూర్తి అస్తిత్వాన్ని ఎవరూ కాదని నిరాకరించరు. హిందూస్తానీ శాస్త్రీయ సంగీత సంప్రదాయంలో సూఫీ ప్రభావం వల్ల మతం బైటికి వెళ్లి ఆత్మయొక్క జీవితం దాని స్థానంలో ప్రవేశించింది. దానివల్ల సంగీతం వ్యక్తిగతమైంది. రాగం, అన్వేషణ, సందర్శనల అంతర్గత సముద్రంగా మారింది. సంగీతం కాలానుగుణంగా, ఆ ఋతువులు, పండగలు, ఉత్సవాలను అనుసరించి, వాటన్నిటిలో భగవంతుడు ఎప్పుడూ పేరుపెట్టని వాడుగా మిగిలిపోయాడు ఉండిపోయాడు."

❖ ❖ ❖ ❖

అన్నింటినీ పరిశీలించి, సమీక్షించి చూస్తే, ఆర్థికపరమైన యిబ్బందులున్నప్పటికీ యమ్మెస్‌ను సినిమాల నుంచి బైటకు రప్పించి మీరా వలే భక్తి సంగీత మార్గంలో పెట్టటంలో సదాశివం నిర్ణయంలోని నిర్వాహక సామర్థ్యపు అద్భుత స్పర్శ ఉంది. ఇరవై తొమ్మిదేళ్ళ వయసులో సినిమా ఆకర్షణలు లేకుండా, యమ్మెస్ జీవితకాలపు ప్రయోజనకర సంగీతం వైపు చూపు మళ్లించింది. తగిన సమయంలో తగిన నిర్ణయం. యమ్మెస్ తన సహజ ప్రాంతాన్ని తిరిగి పొందే అవకాశాన్నిచ్చింది. 'మీరా' సినిమా తర్వాతి వ్యక్తిత్వాన్ని బలహీనపరిచే అవకాశం లేకుండా భద్రపరిచింది. సూటిగా చెప్పాలంటే, ఆ వ్యక్తిత్వం, ఆమె ధార్మిక కచేరీల స్థిరమైన భక్తి సంగీతపు పునాది మీద ఆమె అత్యున్నత గౌరవాన్ని పొందే స్థానంలో నిలబెట్టింది. యమ్మెస్ సంగీత జీవితంలో సహకరించిన ప్రధాన పీఠం భక్తి.

# 10. భావజాలంగా భక్తి

*సమయము తెలిసి పుణ్యములార్జించని*
*కుమతి ఉండి యేమి పోయియేమి*
*శమత తోడి ధర్మము జయమే కాని*
*క్రమముతో మనవిని వినవే ఓ మనసా (స)*
*సారమౌ కవితల విని వెర్రివాడు*
*సంతోషపడియేమి పడకేమి*
*చేరెడేసి గుడ్డి కన్నులు బాగుగ*
*తెరచియేమి తెరవకుండిననేమి (స)*

చిరంజీవిత్వపు తెలివిడి సుబ్బులక్ష్మి ప్రయాణ పథంలో, ఆమె చిన్నవయసులోనే వచ్చింది. 'మీరా' సినిమా ఆమెనొక గౌరవనీయురాలిగా మార్చినప్పటికి ఆమెకు ముప్ఫై సంవత్సరాలు రాలేదు. ఆ వయసులో, వికసించే యవ్వనాన్ని యినుమడింపచేసే అనేక వెండితెర విజయాలతో వున్న ఆమెను ఒక ఆకర్షణీమైన తారగా తప్ప మరే విధంగా చూడటం ప్రజలకు కష్టంగానే వుండివుండాలి. కానీ భారతీయ సంప్రదాయం, ఈ ప్రపంచ సుఖాలు పరిత్యజించి, యవ్వనంలోనే దైవం వైపు మరలిన స్త్రీల కథలతో నిండిపోయి వుంది. మీరాబాయి కూడా కృష్ణునికి తన జీవితాన్ని అర్పించినపుడు నవవధువుగా రాజమందిరానికి వచ్చింది. యమ్మెస్‌కున్నది మీరాకు లేనిది – మార్కెట్ లోతుపాతులన్నీ తెలిసిన ఒక పర్సనల్ వ్యక్తిగత మేనేజర్. సదాశివం, యమ్మెస్‌ను అతిసూక్ష్మంగా ప్రామాణిక స్థాయి కొలబద్దతో లెక్కించి, ఒక సంగీతపు కళలో కదిలే వస్తువుగా నిలబెట్టి, తన ముప్ఫయ్యవ దశకంలోనే అత్యున్నత స్థాయినందుకుని, మతానికి, త్యాగానికి ప్రాతినిధ్యం వహించే మూర్తిగా, అందరూ గౌరవించే భక్తి మార్గంలో నడిచే గాయకురాలిగా తయారయ్యేలా చేశాడు.

యమ్మెస్ జీవితాన్ని సినిమాకు ముందర, సినిమాల తర్వాత అని వర్గీకరించటం తేలికకావచ్చు. కానీ ఆ పేర్లు ఆమె కాలక్రమానికి గానీ, ఆమెలో వచ్చిన గుణాత్మక మార్పులకు కానీ న్యాయం చెయ్యవు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుంటే ఆమె జీవితాన్ని మూడు ప్రత్యేక విభాగాలుగా చూడవచ్చు. షణ్ముగవడివు కాలం (1932 లో కుంభకోణం మహామహమ్ తర్వాత వెంటనే ముగిసింది) సినిమా కాలం 1935 నుంచి 1945 వరకు; భక్తి కాలం 1944 లో మీరా సినిమా (తమిళ)తో, 1945 లో మీరాతో మొదలైంది. ఈ ప్రత్యేకమైన విభాగాలు యమ్మెస్ వ్యక్తిగత, కళాత్మక, ఆధ్యాత్మిక అభివృద్ధిలో స్థిరమైన ప్రగతిని చూపిస్తాయి. మదురై నుంచి వచ్చిన నెమ్మదైన, తనకేంకావాలో తెలిసి

సాధించుకోవాలనుకున్న యువతి, ప్రశంసలు పొందిన శాస్త్రీయ సంగీతకారిణిగా, సినిమా తారగా ఎదిగింది. భోగ సంప్రదాయ వారసురాలు, భక్తి సంప్రదాయ ప్రచారకురాలిగా అభివృద్ధి చెందింది.

ఈ మార్పు చాలా సున్నితంగా జరిగిపోయింది. యమ్మెస్‌లో నిబిడంగా వున్న ఆధ్యాత్మికత ఆమెపై పనిచేసిన ప్రభావాలకు స్పందించింది. ఈ ప్రభావాలు మొట్టమొదటి మదురైలో తన స్వంత యింట్లో నిత్య పూజలు జరిపినపుడే మొదలయ్యాయి. మదురైలో మీనాక్షి దేవాలయం అక్కడి జీవితంలో ప్రధాన భాగమై, దేవుళ్ళకు, దేవతలకు దగ్గరగా ఉండటమనేది యమ్మెస్ భౌతిక జీవిత వాస్తవమయింది. ఆమె పెరిగి పెద్దదయ్యే క్రమంలో ఆమె భక్తి బలపడింది. కంచి ప్రధాన ఆకర్షణ కేంద్రం. కానీ అదొక్కటే కాదు. ఈ పవిత్ర ప్రదేశం ఆమె ప్రజా జీవితంలో ఒక భాగం కావొచ్చు గానీ, ఆధ్యాత్మికాన్వేషణ యమ్మెస్‌కు ఎప్పుడూ వ్యక్తిగతమైన ప్రైవేట్ విషయం. 1950లలో ఆమె జాతీయ స్థాయిలో సెలెబ్రిటీ అయినప్పటికీ క్రమం తప్పకుండా మద్రాసులో చైనాబజారులో వున్న చిన్న కాళియమ్మ గుడిలో పూజలు జరిపేది.

సంగీత త్రిమూర్తులు (త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి) అందరు కర్ణాటక సంగీత కళాకారులనూ ప్రభావితం చేసినట్లే యమ్మెస్ పై తమ విశేష ప్రభావాన్ని చూపారు. ఆ గురువుల సంగీతంలోని దైవారాధన, భక్తి, ఆమె చేతనలో భాగమైపోయింది. తమిళ్ ఇసై ఉద్యమం ఫలితంగా ఆమె తొలి తమిళ మార్మిక కవులను కనుగొన్నది. ఆ కాలంలోని మహిళా సాధువులు ఆమె మీద ప్రత్యేకమైన ముద్రవేశారు. దక్షిణ భారతదేశం వెలుపల కొన్ని ఆదర్శాల, ఆశయాల కోసం కచేరీలు చేయటానికి వెళ్ళటం వల్ల భక్తి సంగీతంలో కొత్త రూపాలతో మంచి పరిచయం కలిగింది. ఆ గమనం ఆమెకు శాస్త్రీయ సంస్కృత కీర్తనల మీద వున్న ఆసక్తిని మరింత లోతుగా చేసింది. ఆమె పాడి రికార్డు చేసిన సహస్రనామాలు, సుప్రభాతాలు ప్రతి దక్షిణాది ఇంట్లో ఆమోదాన్ని పొంది, యమ్మెస్ అంతరంగపు ఆధ్యాత్మికతతో పాటు, ఆమె సంస్కృత భాషా పాటవం, ఆ భాష నుడికారంపై ఆమె పట్టును ప్రదర్శించాయి.

❖ ❖ ❖ ❖

కర్ణాటక సంగీతం నిస్సందేహంగా దాని మౌలిక తత్త్వం నుంచీ భక్తి పూరితమైనదే. యమ్మెస్‌లోనూ, కర్ణాటక సంగీతంలోనూ అంతర్గత మూలధాతువు భక్తి అయినందువల్ల, సినిమా అనంతరం యమ్మెస్ సంగీతం భక్తి ఆధారంగా ఉండాలనే సదాశివం నిర్ణయంలో కొత్తదనం ఏమీలేదు. ఈ ఆలోచనను ఒక వ్యూహంగా అభివృద్ధి చేయటంలో ఆయన కొత్తపుంతలు తొక్కాడు. తన సమకాలీనులందరికంటే ముందుకు దూసుకెళ్ళేలా, అప్పటి కచేరీ సంస్కృతిని దాటివెళ్ళేలా యమ్మెస్‌ని ఆయన తయారు చేశాడు. ఈ మార్పు చాలా స్పష్టంగా అందరికీ కనిపించేలా చేసేందుకు ఆయన యమ్మెస్ సంగీతాన్ని నిజంగా ఎడిట్

చేశాడు. ఆమెనొక భక్తితత్త్వ మూర్తిగా చేయటంలో విజయం సాధించాడు. ఆమె సినీలోకపు వలలోంచి మొత్తంగా, శాశ్వతంగా బైటకు లాగటానికి ఈ వ్యూహం సహాయపడింది. ఇంతకు ముందెన్నడూ జరగనంతగా, ఆమె శాస్త్రీయతను గురించిన విశ్వాసాలను, కీర్తిని శాశ్వతంగా సుస్థిరం చేసినట్లయింది.

ఈ పరిణామం యమ్మెస్ జీవిస్తున్న సాంస్కృతిక వాతావరణంలో చాలా ముఖ్యమైంది. తమిళంలో, మరింకే యితర భాషకంటే, సినిమా తన మూసలో పడిన పిల్లలను, ఆ మూస వారి జీవితాంతం ఉండేలా పోతపోస్తుంది. యమ్.జి. రామచంద్రన్ కున్న 'ఎవర్‌గ్రీన్ హీరో' స్థాయి ఆయన ముసలితనంలో జబ్బుపడినప్పుడు కూడా అలాగే వుంది. సినిమా తనను న్యాయం కోసం పోరాడే యోధుడిగా, బీదవారిని, అణగారిన వర్గాలనూ రక్షించేవాడిగా రూపొందించిందని ఆయన చెప్పాడు. ఆ పాత్రలో ఆయన రాజకీయాలలోకి వచ్చినపుడు, ఆయనకున్న సినిమా వ్యక్తిత్వమే ప్రధాన పాత్ర వహించిది తప్ప పరిపాలనా ప్రాధాన్యాలు కాదు. ఆయన నాయకత్వం నుంచి తమిళనాడు రాష్ట్రం పొందింది చాలా తక్కువ. కానీ 1987 లో ఆయన మరణించేంతవరకూ అధికారంలో ఆయననెవరూ సవాలు చేయలేకపోయారు. ఎన్నికలలో ఆయననెవరూ ఓడించలేపోయారు. అదే విధంగా, 'శకుంతలై' విజయం యమ్మెస్‌ని రొమాంటిక్ కథానాయికగా ఒక మూసలోకి నెట్టే ప్రమాదంలో పడేసింది. ఆ ఆలోచనే సదాశివం భరించలేకపోయాడు. దానిని నాశనం చేసి తను అనుకున్నది సాధించటానికి ఆయన మీరాను ముందుకు తెచ్చాడు.

'మీరా' తర్వాత యమ్మెస్ చుట్టూ ఆవరించిన భక్తి అనే కాంతి పుంజం, విషయాన్ని ఒక దారికి తెచ్చింది. ఆ క్రమంలో మీరా ఎలాగైతే దైవంతో ఐక్యంగా నిలిచిందో, యమ్మెస్ కర్ణాటక సంగీత సారంలో లీనమై కలిసిపోయింది. శతాబ్దాలను కలిపి కొనసాగించే కీలకమైన ధాతువుగా మారింది.

భక్తి భావం భారతీయ శాస్త్రీయ సంగీతానికి అతిముఖ్యమైన కేంద్రం కావటం వల్ల విషయాలు యింకో విధంగా జరిగే అవకాశమే లేదు. తొలి భారతీయులు సంగీతాన్ని దేవునితో సంభాషించే సాధనంగా భావించారు. భక్తి సంగీతం కవిత్వ మార్మికత్వంగా ప్రారంభమై, దయామయుడై విశ్వంలో ఎక్కడైనా చూడగలిగే దేవుడిని, కేవలం పూజించటమే కాకుండా ప్రేమించగలిగిన దైవాన్ని కనుగొన్నది. ఆ భావన, సంగీతం, నృత్యం, చిత్రకళల ద్వారా సామాన్య ప్రజలలో అది ప్రచారమైన తీరూ, భక్తికి ఎన్నడూ ఆగిపోని చలనాన్ని కలిగించాయి. భక్తి ముందు బ్రాహ్మణులు నిర్మించిన అడ్డంకులు, కులం, వర్గం, జండర్‌లు కుప్ప కూలిపోయాయి. దేవుడు యిప్పుడు కలవారి సొత్తు కాదు. ప్రముఖ పండితుడైన ఎ.కె. రామానుజన్ ప్రకారం భక్తి ఉద్యమం, "ఎవరైనా ఎప్పుడైనా దైవత్వ భావనను అనుభూతి చెందటానికి అర్హులే. మానవులుగా ఉండటమే అర్హత" అని చెప్పి చూపించింది. భక్తి భారతదేశమంతా విస్తరించిందనటానికి సాక్ష్యులుగా జయదేవుని గీతాగోవిందం (12వ

శతాబ్దం) దక్షిణాది శైవ, వైష్ణవ సాధువుల ప్రార్థనా గీతాలు, శ్లోకాలు, సామాన్య ప్రజల మనుసులపై శక్తిమంతమైన ప్రభావాన్ని చూపించింది. 15వ శతాబ్దానికి ఆ ఉద్యమం భారతదేశంలోని అన్ని భాగాలకూ విస్తరించింది. ఈ భక్తి ఉద్యమం, సూఫీ మార్గంతో సంబంధం వల్ల మధ్య ప్రాచ్య దేశాలకు, మధ్య ఆసియా, కొన్ని యూరోపియన్ దేశాల వరకూ కూడా విశాలంగా, సుదూరంగా వ్యాపించగలిగింది.

భక్తి ముఖ్యంగా ఒక వ్యక్తి జీవన దృక్పథంగా మారే కొద్దీ అది మతాన్ని అధిగమించింది. హిందూ కళాకారులు సహజంగా భక్తి మార్గం పట్టటం, అది వారి పెరుగుదలలో భాగం కావటం వల్లనే. దేవాలయములలో జరిగే అన్ని పూజలూ నృత్య సంగీతాలతో కూడివుంటాయి. ఏ ఉత్సవమూ సంగీత నాట్యాలు లేకుండా జరగదు; నృత్య సంగీత కళాకారులు లేని ఏ రాజాస్థానమూ పరిపూర్ణం కాదు. వారి వృత్తికొక ఆధ్యాత్మిక అంకితభావాన్ని కల్పించే భక్తి, ముస్లిం సంగీతకళాకారుల జీవితాల్లో కూడా భాగమైంది. ఈ విషయం గమనించదగ్గది. ఎందుకంటే ఇస్లాం సంగీతాన్ని దైవంతో సంబంధం లేనిదని నిషేధించింది. ఆ సూత్రం ప్రకారమైతే, నాదోపాసనకున్న సుదీర్ఘ చరిత్ర సృష్టించటంలో భారతదేశంలో ముస్లిముల పాత్ర ఎంతో గొప్పది. ముస్లిం సంగీత కళాకారులు, వారి రాజపోషకులూ సంగీతాన్ని, దైవత్వాన్ని వేరుచేయటం ద్వారా మత నిషేధాలను సున్నితంగా శుభ్రంగా కత్తిరించివేయగలిగారు. కర్ణాటక విశ్వాసాల ప్రకారం ఆధ్యాత్మిక వికాసానికి, దాని ద్వారా మోక్షానికి చేరే మార్గంగా కాకుండా ముస్లిం సంగీతకారులు సంగీతాన్ని వినోదంగా పునఃనిర్వచించారు. కానీ ఒక పరిశోధకుడు చెప్పినట్లు, “ముస్లిం పరిపాలకులకూ, వారి ఛాందస మత సలహాదారులకు మధ్య జరిగే సంఘర్షణలు సాధారణంగా పాలకుల పక్షానికి అనుకూలంగానే ముగుస్తాయి. భారతదేశంలో ముస్లిం పాలకుల ఎప్పుడూ తమ ఆస్థానాల్లో కళలకు విలాసవంతమైన పోషకులుగానే ఉన్నారు. రాజ కుటుంబపు ఆనందం కోసం నాట్యకళాకారులు, సంగీత కళాకారులు, బృందాలుగా ఆస్థానాల్లో ఉండేవారు” 14వ శతాబ్దపు వెర్రి చక్రవర్తి మహమ్మద్ బిన్ తుగ్లక్ తన సేవలో 2,000 మంది సంగీత కాళాకారులుండేవారని గొప్పగా చెప్పుకున్నాడు. దీనితో పోల్చి చూసే, దక్షిణ భారతదేశంలో సంగీతపరంగా సంపన్న వంతమైన ప్రాంతంగా గుర్తించబడిన తంజావూరులో రాజాస్థనపు వైభవ చిహ్నంగా కేవలం300 మంది సంగీత కళాకారులను మాత్రమే నియమించుకున్నారు. అనేకమంది విశ్వాసపరులైన ముస్లింలు అనేక విధాలుగా దేశంలోని అనేక ప్రాంతాలలో సంగీతాన్ని వ్యాప్తి చేయటంలో ప్రధానపాత్ర వహించారు. 15వ శతాబ్దంలో జానుపూర్ (ఇప్పుడు ఉత్తర ప్రదేశ్‌లో ఉంది) కు చెందిన ఇబ్రహం షా ఫారుకి, సంగీత శిరోమణి, అనే ఉత్తమ సంస్కృత గ్రంథాన్ని సంకలనంగా చేయటానికి యేర్పాట్లు చేశాడు. బీజపూర్‌కు చెందిన ఇబ్రహిం అదిల్ షా (16వ శతాబ్దం) హిందూ దేవతలను కీర్తిస్తూ పాటలు రాసి వాటిని

'కితాబ్ – ఎ – నౌరస్' అనే తన గ్రంథంలో ప్రచురించాడు. 1658–1707 వరకూ పాలించిన ఔరంగజేబు వంటి అసహనపరుడు కూడా తన పాలనలో మొదటి దశాబ్దంలో సంగీత కాళాకారులను ప్రోత్సహించి సత్కరించాడు. 1668 తర్వాతనే అతను అసహన పరుడిగా మారాడు. మొత్తం మీద ముస్లిం రాజవంశాల పాలనలో పదిహేను, పదహారు శతాబ్దాలలో "కళలలో హిందూ – ముస్లిం సంగీత ఒప్పందం" ఒకటి వుందనే పండితులు అభిప్రాయానికి న్యాయం జరిగిందనే చెప్పాలి.

శాస్త్రీయ హిందూస్తానీ సంగీతం ముస్లింలకు చాలా రుణపడి ఉంది. వారి కళారాధన వారిని పాక్షిక దృక్పధం లేనివారిగా చేసింది. ఉదాహరణకు 1947లో స్వంతత్రానంతరం బడే గులాం ఆలీఖాన్ భావజాలపరంగా తనకు సురక్షిత ప్రదేశమైన పాకిస్తాన్‌లోని లాహోర్‌ని వీడి, తనను ఆమోదించి గౌరవించిన బొంబాయిలో స్థిరపడాలని నిర్ణయించుకున్నాడు. పండిట్ జస్‌రాజ్ ఒకసారి తాను హిందూ దేవుడిని కీర్తించే మాధవ కీర్తన పాడుతుంటే, ఎదురుగా మొదటి వరసలలో కూర్చున్న ముస్లిం రసికులు కంటతడి పెట్టటం చూశానని గుర్తు చేసుకున్నాడు. అల్లాడీన్ ఖాన్ తన విద్యార్థులను, అభ్యాసానికి ముందు సరస్వతి వందనంతో మొదలు పెట్టాలని వొత్తిడి చేసేవాడు. ఒకసారి జస్‌రాజ్ తను గమనించిన విషయాన్ని చెబుతూ: "ముస్లింగా వుంటూ కూడా, ఆయన (అల్లాడీన్ ఖాన్) రోజుకి రెండుసార్లు ఎత్తైన కొండ మీదకు యెక్కి, అక్కడి దేవత అయిన సరస్వతీ దేవికి ఒంగి నమస్కారం చేసి వచ్చేవాడు." అన్నాడు. బిస్మిల్లా ఖాన్ కూడా సరస్వతీ ఆరాధకుడే. ఆయన మేనమామ, గురువు అయిన ఆలిబక్ష్ విలాయతీ, కాశీ విశ్వనాధుని ఆలయంలో  సేవకోసం షెహనాయ్ వాయించేవాడు. ఈ కళాకారుల ఒప్పందంలోకి యితర మతస్తులను కూడా చేరిస్తే, కె.జె. యేసుదాస్ శబరిమలైలో కొలువైన అయ్యప్ప స్వామి ఆరాధనలో పై ఎవరికీ తీసిపోడు. నిజానికి సంగీతం దేవుడిని పీఠంపై నిలబెడుతుంది. కానీ సంగీత కళాకారులు ఆ దేవుడు పేరు గురించి అంత ప్రత్యేకంగా పట్టించుకోరు.

నాద బ్రహ్మమనే అత్యంత సౌందర్యాత్మకమైన భారతీయ భావన సంగీతంలో దైవత్వముందనే ఊహను యిముడ్చుకుంది. నాదమే బ్రహ్మం. నాదమే విశ్వమంతా వ్యాపించిన సత్యం. అన్నిటినీ యిముడ్చుకున్న ఏకైక మంత్రమైన "ఓం" ఈ సమస్త విశ్వానికీ ఆద్యంతాలలో వున్నది. ఈ నాద బ్రహ్మానికి తమను తాము అంకితం చేసుకున్నవారు మేధో విధంగా దైవత్వానికి ప్రాతినిధ్యం వహిస్తారు. సంగీత కళాకారుల జీవితాలలో "మహిమలు" జరుగుతాయని సర్వత్రా వ్యాపించిన నమ్మకానికి యిది కారణం కావొచ్చు. పెద్ద పెద్ద గాయకులందరి విషయంలోనూ హఠాత్తుగా వారు తమ కంఠ స్వరాన్ని కోల్పోయిన సంఘటనలు జరిగాయి. ఆ కంఠస్వరం అంత హఠాత్తుగా తిరిగి వచ్చింది. అలా జరగటానికి కారణాలు ఎవరూ చెప్పలేనివి.

చెంబై వైద్యనాథ భాగవతార్, పండిట్ జస్‌రాజ్, ఆయన సోదరుడు ప్రతాప్ నారాయణ, కె.యల్ సైగల్, సిద్ధేశ్వరీ దేవి, యమ్మెస్ కూడా ఈ అనుభవం పొందిన వారిలో వున్నారు. ఈ సంగీతకారులు ఆ సంఘటనను మానవతాతీ దైవశక్తుల జోక్యంతో జరిగినవంటారు. యమ్మెస్ కంఠస్వరం 1966లో జరిగిన యునైటెడ్ నేషన్స్ కచేరీ సందర్భంలో పోయింది. ఆమె తన ఆధ్యాత్మిక గురువైన కంచి పరమాచార్యను ప్రార్థించింది. ఆమె వేదిక మీద కూర్చోగానే తన కంఠస్వరం హఠాత్తుగా తిరిగి వచ్చిందని తెలుసుకుంది. ఈ మహిమాన్వితమైన అనుభవ స్వభావం గురించి ఆమె సందేహించలేదు. ఆమె 1974లో మేగసేస్ అవార్డుని అంగీకరిస్తూ యిచ్చిన ఉపన్యాసంలో సంగీతానికి ఒకే ఒక్క ప్రయోజనం వుంది, అది దేవునితో సంభాషించటం అని చెప్పింది. ఆమె దానిని కొనసాగిస్తూ “నేను ఈ విషయంలో ఏమైనా చేశానంటే అది సర్వోన్నతుడైన భగవంతుని కృప వల్లనే. ఆయన నావంటి సామాన్యురాలిని ఒక సాధనంగా ఎంచుకున్నాడు” అని చెప్పింది.

వేరే మాటల్లో చెప్పాలంటే భక్తి అనేది సంగీతకళాకారుల దృష్టిలో మతపరమైన ప్రాంతం కాదు. వారి జీవితాలను ఒక క్రమంలో పెట్టుకునే మార్గం. సంగీతానికి మరింత అంకితభావంతో, బాధ్యతతో, శ్రద్ధతో సేవ చేసే మార్గం. వారి ప్రపంచంలో కళకూ మతానికి మధ్య సంబంధం వుండదు. కళకు జీవితానికి మధ్య వుంటుంది. సంగీత పండితుడైన రాఘవ. ఆర్. మీనన్, కళ తనను అభ్యసించే వారిని మార్చకపోయినట్లయితే అది యాంత్రికమైన కళ అవుతుందని అన్నప్పుడు అతని మనసులో వున్నదీ సంబంధమే అయివుంటుంది. ఈ వెలుగులో ఆయన గమనించిన దాన్నిలా చెప్పాడు “భారతదేశపు సృజనాత్మక వారసత్వపు అన్ని సంక్లిష్టతలలో, శాస్త్రీయ సంగీతమొక్కటే బహుశా కళాకారులను మార్చటంతో ఆగక శ్రోతలను కూడా మార్చేస్తుంది... భారతీయ సంగీతం మన లోపలి ప్రాధాన్యాలను తిరిగి క్రమబద్ధం చేసి, సూర్యుని వైపు కిటికీలను తెరుస్తుంది.” మీనన్ ప్రత్యేకంగా భక్తి గురించే మాట్లాడటం లేదు. సాధారణంగా సంగీతం మన అంతర్గత ప్రాధాన్యతలను మార్చే శక్తి గలిగి వుండడమే భక్తి సంగీత పరమార్థం. బడేగులాం ఆలీఖాన్ ఒకసారిలా అన్నాడని మీనన్ చెప్పాడు. “ప్రతి భారతీయ కుటుంబంలో ఒక్కరు శాస్త్రీయ సంగీతం నేర్చుకుని వున్నా దేశం ఎన్నడూ విభజింపబడేది కాదు.”

దక్షిణ భారతదేశ కర్ణాటక సంగీత సందర్భంలో, తమ అంతర్గత ప్రాధాన్యతలను తిరిగి క్రమబద్ధీకరించుకోవటమనేది సంగీతంలో పరిణితిని సాధించటంలో కీలకమైన విషయం. దక్షిణాదిని కళలన్నీ భక్తితో బలంగా ధ్వనించాయి. ఉదాహరణకు తంజావూరు వర్ణచిత్రకళ కేవలం మతపరమైన చిహ్నాలపై ఆధారపడటమే కాదు (కృష్ణుని వివిధ రూపాలు, శ్రీరామ పట్టాభిషేకం, తన వైభవోపేత రూపంలో లక్ష్మీదేవి) కళాకారులు ఒక చిత్రాన్ని గీయటం మొదలుపెట్టినప్పుడు ప్రార్థనలు, పూజలు చేయటం సంప్రదాయపరంగా తప్పనిసరి ఆచారం. కానీ అన్ని కళల్లోనూ భక్తితో అత్యంత సన్నిహితంగా గుర్తింపబడేది సంగీతం.

ఈ రెండూ మరొకదాని రక్తమాంసాలన్నట్లుంటాయి. ఆళ్వారులు (వైష్ణవ గురువులు) అరవై మూడుమంది నయనార్లు (శైవగురువులు) భక్తిపూరిత సంగీతాన్ని సమకూర్చిన గీతాలు రాసి పాడారు. కర్ణాటక ప్రాంత సంప్రదాయాన్ననుసరించే హరిదాసులు తమ భక్తిపూర్వక సంగీత రూపకాలైన హరికథా కాలక్షేపం అనే ప్రక్రియను సృజించుకుని భగవంతుని కథలను పాటలుగా పాడతారు. ఆధునిక కర్ణాటక సంగీతం ఒక రూపం తీసుకునే సరికే, దానిని తొలిసారి ప్రారంభించిన వారు తమ గాఢమైన భక్తి ముద్రను దానిపై వేసేశారు. పురందరదాసు తన సంపదనంతా వదిలేసి నాదోపాసన ద్వారా ఒక ఆరాధకునిగా మారాడు. ఆయన సమకాలికులు అరుణగిరి నాథర్ తమిళ ధార నుంచీ, తెలుగు ధారనుంచి అన్నమాచార్యుడు కూడా దేవునికి అంకితమవటంలో ఎవరికీ తీసిపోయినవారు కాదు.

ఇక సంగీత మూర్తిత్రయం తమ వంతు కర్తవ్య నిర్వహణలో ఎవరికీ ఏమీ మిగల్చలేదు. వీళ్ళ ముగ్గురిలో ప్రతి ఒక్కరినీ భక్తి మార్గంలో నడిపిచటానికి ఎక్కడనుంచో ఒక యోగి వచ్చాడనే చరిత్ర కథనాలున్నాయి. త్యాగరాజు భక్తి ఎంత తిరుగులేనిదంటే ఆయన స్వయంగా రాముడు పంపిన అవతారమూర్తిగా భావిస్తారు. కొన్ని కథనాల ప్రకారం ఆయనను వాల్మీకి, నారదుడు, శివ అవతారాలుగా భావిస్తారు. ఆయన సంగీతశక్తిని "భక్తి ఔన్నత్యము, సంగీత ఔన్నత్యము" కలగలిసిన మహోన్నత రూపంగా అభివర్ణిస్తారు. సంగీతాభ్యాసం చేసేవాడికి సంగీతమే ఒక ఆరాధనా రూపం. ఈ కళలో మాత్రమే గమ్యమూ (మోక్షము) దానికై చేసే గమనము (గానం) సమానంగా ఆనందాన్ని అందిస్తాయనే ఆలోచనకు ఆయన ప్రతిరూపంగా నిలుస్తాడు. ఆయనకు సంగీతమే మోక్ష సాధనము. చివరి విముక్తిని సాధ్యం చేసే యోగ విధానం. ఆయన సంగీతాన్ని అతి పవిత్ర రూపమైన ఆరాధనగా వర్ణించాడు. సంగీతంలోని వస్తువుగా భగవంతుడొక్కడే వుండాలనీ, సంగీతారాధనను ఆయనే స్వీకరించాలనీ ప్రత్యేకంగా చెప్పాడు. భక్తి సన్మార్గానికి, సత్ప్రవర్తనకు దారి చూపుతుందని, మానవజాతికి శత్రువులైన అరిషడ్వర్గాలను, కామ క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను జయించటానికీ సంగీతమే తగిన సాధనమనీ ఆయన చెప్పాడు. ఆయన సాటిలేని భక్తిని ఒక శాస్త్రీయ సంగీత పల్లవి రూపంలో వర్ణించాడు. ఆయన తన విశ్వాసాన్ని, ఆధ్యాత్మికతను, తన నమ్మకాన్ని, తన జీవిత సర్వస్వాన్ని ఒక తిరుగులేని అధికారిక ప్రకటనగా వెలిబుచ్చాడు "రామా, నేను అనాథను కాను" కర్ణాటక సంగీత సద్గురువునుంచి వచ్చిన ఈ మాటలు, సెంటిమెంట్లు, దక్షిణ భారత సంగీత సంస్కృతికి కొలబద్దలు.

భక్తి భావం హిందూస్తానీ సంగీతంలో కంటే, కర్ణాటక సంగీతంలో ఎక్కువ బలంగా వుందంటే అది సహజమే. ఈ భక్తి ఉద్యమం దక్షిణాదిన కర్ణాటక ప్రాంతంలో మొదలవ్వటమే కాక పవిత్రమైన వాచక కేంద్రంగా వుండటం కూడా భక్తినీ, కర్ణాటక కళలను కలిపివుంచే శక్తిగా పనిచేసింది. భావము, భక్తి కూడా వాచకం మీద ఆధారపడతాయి. సంగీతాన్ని

రాసి సమకూర్చినవారు, దానిని ప్రదర్శించేవారూ కూడా ఆరాధన అనే ఒకే పనిలో నిమగ్నమవుతారు. అందువల్ల యిద్దరూ ఒకే విధమైన ఆరాధనా రీతులను అనుసరిస్తారు. తమను శుభ్రపరచుకోవటం, సరైన వేషధారణ, విభూతీ, లేదా యితర భక్తి సంబంధపు గుర్తులను ధరించటం, చివరిగా దైవ సంకీర్తనలోని ఆ పదాల అర్థాలలో తమను తాము మైమరచి పోవటం, కోల్పోవటం యివన్నీ యిద్దరికీ సమానమే. దీనికి వ్యతిరేకంగా, హిందుస్తానీ సంగీతం వాచకం నుండి స్వతంత్రమైంది. కాబట్టి గాయకుడు రాగాధిరోహణ పై కేంద్రీకరించవచ్చు. దానికంటే ఉన్నతమైన ఆది భౌతిక ఆశయాల గురించి ఆందోళన చెందనవసరం లేదు. కళకళ కోసమే అన్న భావనలో హిందూస్తానీ గాయకుడు లీనమైపోవచ్చు. కానీ కర్ణాటక గాయకుడు ఆధ్యాత్మిక భావనలను పరిగణనలోకి తీసుకోకుండా తనలోని ఉన్నత కళను బైటికి తీసుకురాలేదు.

❖ ❖ ❖ ❖

దైవారాధనతో కళలు చారిత్రకంగా కలిసిపోవటమంటే కర్ణాటక సంగీతంలో భక్తి అతిగా వుందా. అల్లాడీన్ ఖాన్ ప్రతిరోజూ సరస్వతీ వందనం చేయటం వల్ల ఆధ్యాత్మిక శక్తిని పొందివుండవచ్చు గానీ, తన పాటలలో లోతైన భావోద్వేగాలను ప్రకటించాలని చూడలేదు. నమ్మాళ్వార్ వలే 'రాముని ఎరుగకుండా యితరులను ఎరుగుట సాధ్యమా" అనలేదు. త్యాగరాజు రాముని "నీ వాక్కే వాక్కు, నీ వైభవమే వైభవమని" కీర్తించినపుడు ఆయన కవితాగుణాన్ని మాత్రమే ఉపయోగిస్తున్నాడా లేక దేవుని ఆరాధనలో అతిశయమైన విలీనత్వాన్ని పొందుతున్నాడా? నిర్వచనం ప్రకారం భక్తుడు భక్తిలో 'అతి' వుండేందుకు అవకాశం వుందని అంగీకరించడు. త్యాగరాజుని గురించిన కథలలో ఆయన యిరవయ్యొక్క సంవత్సరాలపాటు తపస్సుని ఆరక్షరాల మంత్రాన్ని 960 మిలియన్ల సార్లు పునరుచ్ఛరించాడనీ చెప్పుకుంటారు. త్యాగరాజు గానీ, ఈ కథ చెప్పే భక్తులు గానీ ఆయన తపస్సులో అతి వుందని అనుకోరు. వారికది కనిపించదు. సమస్య ఏమిటంటే సాధారణ ప్రజలు, దైవాన్ని నమ్మినప్పటికీ, వారి భక్తిని తమ శక్తికి తగినంతగానే తమ రోజువారీ కార్యక్రమాలకు అడ్డురాకుండానే ఉంచుకుంటారు. మధ్యయుగాలలో మేవార్ రాజ గృహంలో ఈ సందిగ్ధతే నెలకొన్నది. మీరా చాలా అతిగా చేస్తున్నదని ఆమె కుటుంబసభ్యులు అనుకున్నది ఆమె దృష్టిలో ఆమె తన అధినాథుడైన భగవంతునికి చేయగలిగిన అతి తక్కువ ఆరాధన. కర్ణాటకలో ఎంతో గౌరవించబడే భక్తి ఉద్యమ కవయిత్రి అక్క మహాదేవి (12 వ శతాబ్దం) ఎంతో విశ్వాసంగలిగిన భక్తులకు కూడా మింగుడు పడని చర్యలను చేపట్టింది. ఆమె భర్తను, తన దుస్తులను ఒకే పట్టుదలతో వదిలివేసి శివాన్వేషణకు వెళ్ళింది. ఆమె నిర్భయంగా ప్రకటించింది "మరణించి నశించే ఈ భర్తలను తీసుకుని మీ వంటింట్లోని మంటలకు ఆహారంగా వెయ్యండి." సదాశివం చాలా ప్రాక్టికల్ మనిషి కాబట్టి యమ్మెస్‌ని

అక్క మహాదేవిని మించిపోయేలా ప్రభావితం చేసే ప్రశ్నే లేదు. ఐనప్పటికీ చాలా మంది యమ్మెస్ తన కచేరీలలో భక్తిని అతిగా ప్రదర్శించిందని అభిప్రాయపడతారు.

కొందరు విమర్శకులు దీనిని సున్నితంగా తమ సంభాషణలల్లోనూ, ఒకోసారి అచ్చు రూపంలోనూ ప్రస్తావిస్తారు. శ్రుతి పత్రిక (అక్టోబర్ 1986) లో రాసిన ఉత్తరంలో ఔత్సాహిక సంగీతజ్ఞుడైన ఎన్.ఆర్. రంగనాధన్ యిలా ప్రకటించాడు "అన్ని సంగీత పద్ధతులనూ ఆనందంగా వినవచ్చు, ఐతే మనం సంగీతాన్ని చేరే దారిలో మేఘాల్లా ఆవరించిన మతపరమైన మసకపొరను చీల్చుకుని వెళ్ళే ప్రయత్నం చేయాల్సి వుంటుంది." యమ్.డి. రామసుబ్రహ్మణ్యం అనే మదురైకి చెందిన సంగీత శాస్త్రవేత్త, డి.కె. పట్టమ్మాళ్, యమ్.యల్. వసంత కుమారిల గొప్పతనం, కొంత వారు భక్తినీ, వినోదాన్ని తమ సంగీతంలో న్యాయబద్ధంగా కలపటంలో వుందని అన్నాడు. ఆయనే "యమ్మెస్ ప్రస్తుతం ఎక్కువగా భక్తి మార్గంలో వెళ్తున్నది. 1960ల వరకూ ఆమె సంగీతం మరింత వినోదాత్మకంగా వుండేది. కార్యక్రమంలో ఒకే విషయాన్ని చాలా ఎక్కువగా చొప్పిస్తే అది తేలిపోతుంది" అన్నాడు.

ఇంకా కఠినంగా చూసే విమర్శకులు ఆమెను బ్రాహ్మిణీకరించే ప్రయత్నంలో సదాశివం, యమ్మెస్ సంగీతాన్ని "పరిశుభ్రం" చేశాడని నిందిస్తారు. అది ఆయన ఉద్దేశాన్ని సంకుచితంగా అర్థం చేసుకోవటమే కావచ్చు. అందులో యమ్మెస్ వంటి శక్తి సామర్థ్యాలున్న కళాకారులకు సంబంధించిన విషయంలో అది సంకుచితమే. కాని సదాశివం యమ్మెస్‌కు కొత్త సంగీత మూర్తిమత్వాన్ని కోరుకుని, దానికి తగినట్లుగా కచేరీ రూపాన్ని మార్చాడు. యమ్మెస్‌కు ముందు అరియకుడి రామానుజ అయ్యంగార్ కచేరీలో భక్తి సంగీతాన్ని కొంతా, వినోదాత్మకమైన సంగీతాన్ని కొంతా కలగలిపి పాడే పద్ధతిని ప్రచారం చేశాడు. ఆయన పద్ధతిలో జావళికి, పదానికీ కర్ణాటక సంగీత కచేరీలో సమ్మతి, గౌరవప్రదమైన గుర్తింపు వుండేది. ఆకర్షణీయమైన సౌందర్య దృశ్యాలకు ప్రాతినిధ్యం వహించే జావళి, పదం మొట్టమొదట శాస్త్రీయ నృత్యంలో భాగంగా వుండేవి. జావళి, ప్రేమ కవిత్వంతో కూడి, చెవికింపైన సంగీతంతో వుండే ప్రక్రియ. పదం నాయకీ నాయకుల శృంగార సంబంధ కథకు ప్రాధాన్యతనిస్తుంది. ఈ ప్రజారంజకమైన రెండు దినుసులనూ యమ్మెస్ కచేరీ సంగీతంలోంచి సదాశివం తొలగించివేశాడు. ఆయనకు శృంగారం వచ్చి భక్తి నుంచి శ్రోతలను పక్కకు మరల్చడం ఇష్టం లేదు. రుక్మిణీ అరండేల్ భరతనాట్యాన్ని ఎలా పరిశుభ్రం చేసిందో అలా సదాశివం యమ్మెస్ కచేరీలను 'పరిశుభ్రం' చేశాడు. సాధారణ కర్ణాటక సంగీత కచేరీల రెండవ భాగాన్ని జావళీలు, పదాలు సజీవం చేస్తే, యమ్మెస్ కచేరీలలో ఈ భాగం భజనలకు ప్రసిద్ధి చెందింది.

సదాశివం ఈ పరిశుభ్రతా కార్యక్రమాన్ని తన వ్యూహంలో భాగంగా చూసి వుండవచ్చు. చారిత్రకంగా గానీ, కళాసౌందర్యపరంగా గానీ, శాస్త్రీయ సంగీతకారుల

కార్యక్రమం నుంచి శృంగారాన్ని తొలగించటానికి ఎలాగూ సమర్థించలేము. దక్షిణ భారత సంగీత, నృత్యాలలో భక్తి, శృంగారాలు అతి ప్రధానమైన భావాలు. మిగిలిన అన్ని రసాలు ఈ రెండిటిలో ఏదో ఒకదానితో కలిసిపోతాయి. ఒకదానిని తొలగిస్తే యింకొకటి అసంపూర్ణమవుతుంది. సంప్రదాయ హిందూ తాత్త్విక ఆలోచనలో, ప్రేమించేవారు, ప్రేమించబడేవారు, అధిదైవమైన బ్రహ్మకు ప్రాతినిధ్యం వహించే ఆధ్యాత్మిక ప్రతిరూపాలు. తను ప్రేమించినవారితో ఐక్యమైపోవటమే భక్తి సాహిత్యంలో కేంద్ర వస్తువు. ఇలాంటి సంస్కృతిలో గణనీయమైన సంగీతకారుల స్థాయిని తగ్గించటం వెర్రితనంగా కనిపిస్తుంది. కానీ సదాశివం అదే చేశాడు. భరతనాట్యంలో అట్లాంటి "అవాంఛనీయమైనవి" అనుకున్న వాటిని తొలగించే ప్రయత్నం జరిగినపుడు రుక్మిణీదేవిని సవాలు చేయటానికి బాలసరస్వతి వంటి సామర్థ్యంగల కళాకారిణి ఉంది. సదాశివం చేసిన సవరణలన్నీ యమ్మెస్‌కు మాత్రమే పరిమితమైనవి – యమ్మెస్ బాలసరస్వతి కాదు. ఆమె అతని ఆదేశాలను ఒక భార్యాత్వపు బాధ్యతలానే స్వీకరించింది. జావళిని, పదంని వదిలివేసింది. కానీ అలా వదిలివేయటం వల్ల ఏ నష్టమూ జరగకుండా చూసింది. ఇక్కడే యమ్మెస్‌లోని అంతర్గత స్వాభావిక గుణాలే, ఆమె మేనేజర్ ఆమెపై కనిపించకుండా విధించిన నియమాలను, విధి విధానాలను దాటివచ్చి ఆమెను సంరక్షించాయి.

వ్యూహం సదాశివందే కావచ్చు కానీ సంగీతం మాత్రం సంపూర్ణంగా యమ్మెస్‌దే. ఆమె అభివృద్ధి చేసిన భక్తి ప్రక్రియ ఆమె వ్యక్తిగత ముద్రతో వుంటుంది గానీ మరెవరిదీ కాదు. ఆమెది అక్క మహాదేవిలా విప్లవాత్మకమైన దారి కాదు. యమ్మెస్ మీరా ప్రతిరూపంలా వుందని కొనియాడిన అభిమానులు, యమ్మెస్ యెన్నటికీ మీరాలా తిరుగుబాటు చేయలేదనే విషయాన్ని పట్టించుకోలేదు. మీరా కాలికి గజ్జెలు కట్టుకుని బహిరంగంగా నృత్యం చేసేందుకు ఆనాడు అమలులో వున్న సంప్రదాయాన్ని ఉల్లంఘించింది. వివాహమైన ఐదేళ్ళకు భర్త చనిపోతే ఛాందస రాజపుత్రులు అతి పవిత్రమైన ప్రవర్తనా నియమావళిగా విధించిన సతీ సహగమనాన్ని ఉల్లంఘించింది. వితంతువులు ధరించే తెల్ల వస్త్రాలను ధరించటానికి నిరాకరించింది. యమ్మెస్ తన యవ్వనపు తొలి రోజుల్లో తల్లి ఆమె కోసం యేర్పరిచిన జీవిత ప్రణాళికను తిరస్కరించి వచ్చేసింది. ఇక తర్వాత జీవితమంతా ఆమె ప్రశ్నించకుండా విధేయురాలిగా వుండిపోయింది. ఆమె భక్తి కూడా విధేయతే గాని, అవిధేయత కాదు. చాలా సరళమైన, మమకారపూరితమైనది. ప్రజలు దానితో మమేకమౌతారు. దానిని ఆమోదిస్తారు, ఆదరిస్తారు, ఆ భక్తి కోసం ఆమెను కూడా గౌరవిస్తారు. సంస్కృతీకరణ యొక్క విశాల పరిణామ క్రమంలో ఆమె వారసత్వపు ప్రాచీన భారతీయతతో కలిసిపోవటానికి, ఒదిగి పోవటానికీ భక్తి కూడా ఆమెకు సహాయపడింది. భక్తి సంగీతానికి ఆమె సాక్షాత్తు ప్రతిరూపమైంది గాబట్టి ఆమె భారతదేశానికి కూడా ప్రతిరూపమైంది. ఇక ఆమె గురించి ఎలాంటి వివరణలూ అవసరం లేదు.

చివరికి, ఇది యమ్మెస్ వ్యక్తిగత విజయమే అయింది. సంగీతం చాలా వ్యక్తిగతమైన కళ. ఒక వ్యక్తి తన సాధనతో నిర్మించుకున్న వ్యక్తిగత కళ. ఒక కళాకారుడు లేదా కళాకారిణి తన కళను ఎలా అర్థం చేసుకుని, ఎలా ప్రదర్శించారనేదాని వల్లనే దానికి నాణ్యత, అందమూ సమకూరుతాయి. గాయకుడు లేదా గాయని తన చైతన్య కేంద్రంలో పొదిగిన సంగీతాన్ని అంతర్గత కోణంతో ఎలా అనుభూతి చెందుతారో ఆ అనుభవ స్వచ్ఛతే వారి సంగీతం. ఇది జాజ్, పాప్ సంగీతాల విషయంలో సత్యమే, మొజార్ట్, తాన్‌సేన్‌ల విషయంలో సత్యమే, పవరొట్టి, సుబ్బులక్ష్మిల విషయంలోనూ సత్యమే. ఒక సత్యమైన విషయం మరింత సత్యవంతంగా మారటం సాధ్యమైన పక్షంలో, ఆ విజయంలోని ఆంతరంగిక ఆనందాన్ని యమ్మెస్ విప్పి చూపించింది. ఆమె సంగీతం ఆమె వ్యక్తిగత ఆధ్యాత్మిక ఆవేశంలోంచే బలాన్ని పొందింది. ఆమె భక్తి తత్పరత భర్తచేత విధించబడినది కాదు. తన లోపలి నుంచి పుట్టినది. అది వ్యూహం కాదు. ఆత్మశక్తి. అది ఆమె భక్తికి చాలా కాంతివంతమైన వెలుగును సంగీతం ద్వారా ప్రసరింపజేసింది.

❖ ❖ ❖ ❖

మొదటి సంగీత త్రయంలో ఒకరైన త్యాగరాజు సంగీతారాధకుడికుండవలసిన లక్షణాలను, అర్హతలను ఒక చోట పేర్కొన్నాడు. వీటన్నిటిలో అతి ముఖ్యమైనది సుస్వరం. మంచి గాత్రంతో పుట్టటం ఒక వరం. అదిలేనివాళ్ళు దానిని సాధనతో వీలైనంతగా సమకూర్చుకోవాలి. ఆరాధకుడు నిద్రను వదిలేయాలి (అంటే కష్టపడి సాధన చేసేటపుడు విశ్రాంతి గురించి ఆలోచించకూడదు) జీవితంలో, బాధ్యతల నిర్వహణలో సంప్రదాయ మార్గాలకే అంటిపెట్టుకుని మనసుని స్వచ్ఛంగా వుంచుకోవాలి. యమ్మెస్ ఆ లక్షణాలను తన జీవితాంతం పాటిస్తూనే వుందనే ఎవరైనా నిర్ధారణకు వస్తారు. నిజానికి ఆమె త్యాగరాజు చెప్పినవాటికి తనవైన కొన్ని లక్షణాలు జతచేసింది. కర్ణాటక కచేరీలు సాధారణంగా వర్ణంతో ప్రారంభమవుతాయి. వర్ణం ఆ ప్రత్యేక రాగం యొక్క స్వాభావిక లక్షణాలను, ప్రత్యేకతలను ప్రదర్శిస్తుంది. యమ్మెస్, దక్షిణామూర్తి రూపంలోని శివుడిని కొంతసేపు ధ్యానించటంతో మొదలుపెట్టి దాని తర్వాత సంస్కృతంలో ప్రార్థన శ్లోకాన్ని పాడటంతో తన కచేరీని మొదలుపెట్టటానికి యిష్టపడుతుంది. ఎప్పుడైనా ఆమె కొత్త కృతిని నేర్చుకుని అది కచేరీలో పాడేందుకు సిద్ధమైనప్పుడు, ముందుగా పూజగదిలో తన దైవం సమ్మతిని అడుగుతున్నట్లుగా పాడుతుంది. ఆ తర్వాతనే ఆ కృతిని కచేరీ వేదిక మీద పాడుతుంది. త్యాగరాజుని నాదయోగి అంటారు. దైవాన్ని శుద్ధ ధ్వనిలోనే చూస్తాడు. ఇరవయ్యవ శతాబ్దంలో కర్ణాటక సంగీతంలో నాదయోగి అంటూ వుంటే అది యమ్మెస్. సంగీతానికి భక్తితో అనుసంధానం చేయటమే జీవనవిధానంగా చేసుకున్నవారింకెవరూ లేరు. భక్తి ప్రభావం చేత ఉన్నతీకరించబడిన ఆమె సంగీతం పండిత పామరుల ఆసక్తిని చూరగొంది. 1987లో మద్రాసు మ్యూజిక్ అకాడెమి అధ్యక్షుడు చేసిన విశ్లేషణ, వేసిన అంచనాలోని

ప్రధానాంశం యిది. టి.టి. వాసు యిలా అన్నాడు "ఆమె పరిపూర్ణ గానకళ భక్తిలో మునిగి తేలటంవల్ల కొత్త కోణాన్ని సంపాదించుకుంది. భగవంతుని యెడల గాఢభక్తిని తెలుపుతూ కీర్తననో, శ్లోకాన్నో పాడిన ప్రతిసారీ అది ఆమె హృదయంలోంచి ఉప్పొంగుతుంది. పాడుతున్నప్పుడు ఆమె కృతికర్తతో, కృతితో పూర్తిగా ఐక్యమై, శ్రోతలను వున్నత శిఖరాలకు చేర్చే ప్రశాంతమైన భక్తి తత్పరతను సృష్టిస్తుంచి సదాశివం యిదే విషయాన్ని తన వ్యక్తిగత అనుభవంతో చెప్పిన మాటలు :"కంచి పరమాచార్య ముందు ఆయన పూజా సమయంలో మూడు లేదా నాలుగు శివరాత్రి నాటి రాత్రులు కొన్ని గంటలపాటు పాడుతూనే వున్నపుడు, తన సంగీతం అత్యంత వున్నత నైపుణ్య స్థాయికి చేరిందని ఆమె భావించింది."

స్వయంగా మహాత్మాగాంధీ యమ్మెస్ భక్తిలో నిమగ్నమయ్యే తీరు గురించి మాట్లాడాడు. "ఆమె భజనలో తనను తాను మర్చిపోతుంది." "భజన పాడటం ఒక విషయం; దేవునిలో తనను తాను మర్చి లీనమైపోయేలా పాడటం పూర్తిగా వేరే సంగతి." ఐనప్పటికీ భజనలు యమ్మెస్ భక్తి సంగీతంలో చాలా చిన్న భాగమే. ఈ భాగం మరీ అంత ముఖ్యమైనదేమీ కాదు. భజనలలోని భక్తి సారాంశం ఆమె సహజ స్వభావాన్ని ఆకర్షిస్తుంది గానీ ఆ భాష చాలా అరుదుగా ఆ పని చేస్తుంది. ఆమె హిందీలో తగినంత సామర్థ్యంతో పాడగలుగుతుంది, కానీ దానిని ఆస్వాదిస్తూ కాదు. ఆమె అసలైన సంగీత ప్రావిణ్యం, భక్తిని కూడా కలుపుకుని, ఆమె పాడే దక్షిణ భారతీయ కీర్తనలు కృతుల ఆధారంగా నిర్ణయించాలిగానీ, బాగా ప్రచారమైన ఆమె భజనలను బట్టి కాదు. ఆమె సంస్కృతంలో పాడిన సుప్రభాతాలు ఆమె భక్తి సంగీతానికి యెక్కువ ప్రాతినిధ్యం వహిస్తాయి. ఈ శ్లోకాలను సంప్రదాయంగా పెద్దలు కాపాడి భద్రపరుస్తూ వస్తున్నారు. మెత్తని కంఠస్వరం కలిగిన అమ్మమ్మలు, తమ యిళ్ళల్లో తమ కుటుంబాన్ని దీవించమని కోరుతూ పాడే శ్లోకాలవి. అవి రోజువారి గృహకృత్యాలతో, సాయంత్రం వేళ దీపాలు వెలిగించటం, ఉదయాన్నే శుభ్రంగా కడిగిన వాకిళ్ళముందు చేతితో ముగ్గులు పెట్టటం వంటివాటితో అనుసంధానమై వుంటాయి. శ్లోకాలు రికార్డు చేయటానికి వుద్దేశించబడినవి కావు. పెద్ద ఎత్తున సాంకేతిక సౌలభ్యంతో ఉత్పత్తి చేసి, ప్రజలందరికోసం సంగీతాన్ని క్యాసెట్లుగా, రికార్డులుగా, సి.డి.లుగా ప్యాకేజీ చేయటం కోసం ఉద్దేశించబడినవి కాదు. సుప్రభాతాలకు సంబంధించి అన్ని సంప్రదాయాలనూ, నిషేధాలనూ యమ్మెస్ ఉల్లంఘించింది. ఆమె సంప్రదాయ పద్ధతిలోనే పాడింది. సంగీతం కంటే చదివినట్లుగానే వుంటుంది. ఐనప్పటికీ ఆమె తన పఠనాన్ని ఒక కళాత్మక అనుభవంగా మార్చేసింది. లేశమాత్రం దోషంలేని ఆమె సంస్కృతభాషా వుచ్ఛారణకు ధన్యవాదాలు చెప్పుకోవాలి. సౌలభ్యం కోసం చేసిన ప్యాకేజీల వల్ల ఆ పఠనంలోని పవిత్రత చెదిరిపోలేదని ప్రజలనుకున్నారు. అదే సమయంలో, ఆమె పఠనంలో అమ్మమ్మలు పాడినపుడు లేని

లోతైన అనుభూతి కలిగింది. మనసు లగ్నమై శ్లోకాలపై పనిచేసింది. దక్షిణ భారతదేశంలో ఉదయపు ప్రార్థనల సంస్కృతిని యమ్మెస్ ఒంటి చేత్తో మార్చేసింది. ప్రతి ఉదయం, పూజ చేసే ప్రతి కుటుంబంలో ఆమె సభ్యురాలయింది. ఈ ఎన్నదగిన విజయం ఆమె భక్తికి, నాణ్యమైన సంగీతానికి కీర్తి పతాక, కలికితురాయి.

❖ ❖ ❖ ❖

ఆధ్యాత్మికత వైపు దృష్టి లేనివారు సహితం యమ్మెస్ సుప్రభాతాల ప్రభావాన్ని గుర్తించారు. పండిత, పామరులు ఒకే విధంగా ఆమె తన లోతైన వ్యక్తిగత ఆవేశాన్ని తన గానంలో ఎలా ముంచగలిగిందో, దేవుని మీద తనకున్న భక్తి, సంగీతంపై తనకున్న భక్తి ఒకటయ్యే స్థాయికి ఎలా చేరుకోగలిగిందో గుర్తించగలిగారు. ఈ దశలో భక్తి ఆమెకు సంగీత వనరు అయింది. యమ్మెస్ తన భక్తిని అతిగా ప్రదర్శిస్తుందనే ఆరోపణ అంగీకరిస్తూనే, భక్తిని ఆమె సృజనాత్మకంగా వినియోగించిందనే విషయంతో దానిని సమతుల్యం చేయాలి. ఆ పరిస్థితి ఆమె సంగీతం మీద కొంత పరిమితులను విధించిందనే దానిలో సందేహం లేదు గానీ అది ఆమెను మరింత మెరుగైన సంగీత కళాకారిణిగా చేసింది. ఆమె లోపలనుంచీ వున్న క్రమశిక్షణ, విశ్వాసం వల్ల బలపడింది.

ఆమె గురుకుల పద్ధతిలో సాధన చేయలేదు. ఆ విధమైన సాధనలో భౌతికంగా, మానసికంగా కఠినతర శిక్షణలుంటాయి. ఆమె తొలిరోజుల్లో తల్లి వద్ద శిక్షణ పొందినప్పుడు ఎంతో కఠినత్వాన్ని ఎదుర్కొని వుంటుంది. ఎందుకంటే తల్లి క్రమశిక్షణకు మారుపేరు. ఆమె పరిణిత వయస్కురాలైనప్పుడు, ఆమె స్వంత దీక్షే, గొప్ప కళకు అవసరమైన ఉక్కు క్రమశిక్షణను ఆమెపై విధించింది.

తనంతట తాను విధించుకున్న క్రమశిక్షణ ఆమెకెంతో మేలు చేసింది. ప్రారంభంలోనే ఆమె తన నియంత్రణలో ఉంది ఆమె బాల్యంలో తంబూరాతో చేసిన ప్రయోగాలలో, తన కంఠస్వరాన్ని ఆ వాయిద్యం నుండి వెలువడే ధ్వనితో సరిచూసుకున్నపుడే ఆ నియంత్రణ, క్రమశిక్షణ స్పష్టమయ్యాయి. తనకు తానే శిక్షణనిచ్చుకునే తత్త్వం ఆమె జీవితాంతం కొనసాగింది. ఆమె తన కంఠస్వరంతో ఏం చెయ్యగలదో, ఏం చెయ్యలేదో స్థాయిలో, శృతిలో ఎంత దూరం వెళ్ళగలదోనని నిరంతరం పరిక్షించుకుంటూ వుండేది. ఈ క్రమం తప్పని శిక్షణే ఆమె తన కచేరీలో పాడే ప్రతి కీర్తనకూ తయారయ్యే పద్ధతిలో మనం చూడగలుగుతాం. ఆమె కచేరీలోయెప్పుడూ పుస్తకాన్ని చూస్తూ పాడదు. కానీ ప్రతి పాటకూ ఆమెకు నోటు పుస్తకాలుంటాయి. ఆ పాటం మొత్తంగా ఏ అర్థాన్నిస్తుందో వివరంగా రాసుకుంటుంది. ప్రతి ప్రదానికున్న అర్థం, ఆ పదాన్ని అక్షరాలుగా ఎలా విడగొట్టాలి, ఎలా పదాలను సమూహంగా పలకాలి అనే వివరమైన నోట్సు తయారు చేసుకుంటుంది. ఆ కృతి నిర్మాణాన్ని అధ్యయనం చేస్తుంది. దానినింకా మెరుగుపరచ టానికున్న అవకాశాలను విశ్లేషిస్తుంది. వాక్శుద్ధి కలిగేంతవరకూ అభ్యాసం చేస్తుంది. మిగిలిన

ప్రతి చిన్న వివరంలోకి వెళ్ళి పరిశీలించి, తాను పాడదల్చుకున్న కీర్తనలో కనీకనిపించకుండా వుండే ప్రతి సున్నితత్త్వం మీదా అధికారాన్ని సంపాదించుకుంటుంది. తనపై తాను విధించుకున్న కఠినమైన క్రమశిక్షణలోని కొన్ని లక్షణాలు ఆమెను సమకాలీకులందరిలో ప్రత్యేకంగా నిలబెట్టాయి. కచేరీ గాయకులలో, ప్రారంభంలో కొంత సమయాన్ని కంఠస్వరాన్ని అదుపులోకి తెచ్చుకోటానికి వినియోగించనవసరం లేనిది ఆమెకొక్కతికే. ఆమె పాడటం మొదలుపెట్టిన మరుక్షణం నుంచీ శిఖరం మీదే వుంటుంది. మిగిలిన గాయకులకు వారి వారి మంచిరోజులు, చెడ్డ రోజులూ వుంటాయి. యమ్మెస్‌కి అన్నీ మంచి రోజులే, ఎందుకంటే ప్రతిసారీ ఆమె ఆ "మూడ్" లోనే వుంటుంది. మిగిలినవాళ్ళకు శత్రువులు, స్నేహితులు వుంటారు. యమ్మెస్‌కు ఎప్పుడైనా ఒక విమర్శకుడు తారసపడతాడేమో గానీ శత్రువులెప్పుడూ లేరు. ఆమె తగవులకు, రాజకీయాలకు, స్వంత గ్రూపులకు అతీతంగా వుండటం వల్ల అందరూ యమ్మెస్‌ని ప్రేమిస్తారు. సదాశివంను యిష్టపడనివారు కూడా యమ్మెస్‌ని అభిమానించి మెచ్చుకోవలసిన వ్యక్తిగా భావిస్తారు.

❖ ❖ ❖ ❖

చాలా అరుదైనదేదో వుంది – అది మార్మికమైనదా? ఆమె అందరికీ ఆరాధనీయురాలిగా చేసిన లక్షణం యమ్మెస్‌లో వున్నది. ఆమె తన కళను సమీపించి దగ్గరకు తీసుకునే పద్ధతి, ఆ సంగీతానికి ఆత్మార్పణ గావించుకున్న తీరూ యివే "రహస్యాలుగా" తరచూ చెప్పుకుని చూపించే సంగీత లక్షణం. జాన్ కీట్స్ ఎలాగైతే వినిపించని రాగాలు మరింత తియ్యగా వుంటాయన్నాడో అలాంటి వినిపించని సంగీత స్వరాలు మనసు మాత్రమే గుర్తించగలవి ఆమె సంగీతంలో వున్నాయా? 'అంతరమైన శ్రవణ సంగీతం" అంటూ ఒకటున్నదా? పుట్టెడు చెవుడుతో బీథోవెన్ స్వరపరచిన 'నైన్త్ సింఫనీ' ఆయన సంగీతమంతటిలోనూ అత్యుత్తమం ఎలా కాగలిగింది? అన్ని సంస్కృతుల్లోనూ సంగీతం అధికార నిర్మాణానికి కేంద్రం. అంతేకాదు వ్యక్తిగతమైన, సామూహికమైన, అహానికి కూడా కేంద్రమే. అలాకానట్లయితే సంగీతం స్వీయ చైతన్యం బొత్తిగా లేని సంగీత కళాకారులలో అహంభావాన్ని ఎట్లా పెంపొందించగలుగుతుంది?

ఈ సందర్భంలో పాశ్చాత్య శాస్త్రీయ సంగీతానికీ, కర్ణాటక శాస్త్రీయ సంగీతానికీ మధ్యనున్న తేడాలు చాలా విస్తృతమైనవిగా ముందుకొస్తాయి. ఒక ప్రధాన ఆలోచనా ధోరణి ప్రకారం, పాశ్చాత్య శాస్త్రీయ సంగీతం, మరీ ముఖ్యంగా బీథోవెన్ తర్వాత సాంఘిక జీవితం నుండి విడిపోయి పరాయీకరణ చెందింది. వాస్తవం నుండి వేరు చేయబడి "ప్రైవెటైజ్" అయింది. ఈ పరిస్థితిని ఆధునిక పాశ్చాత్య సంగీతపు ప్రత్యేకమైన తత్త్వం ఒక మార్మికతా ప్రతిబింబంగా, కళారూపంగా తన స్వీయాధికారంతో వుంటున్నదనే వాదనతో సమర్థించవలసి వస్తుంది. కర్ణాటక సంగీతం భిన్నమైన దారిలో ప్రయాణం చేసింది. మార్మికతను ఎన్నడూ కొరత లేకుండా, ఎల్లప్పుడూ ఆ కాలపు సాంఘిక

ప్రవాహాలతో కలసిపోయింది. పాశ్చాత్య సంగీతం వలే కాకుండా, కర్ణాటక సంగీతం అశేష ప్రజానీకపు సాంఘిక మత విశ్వాసాలకు శాశ్వతంగా లోబడివుంది. పాశ్చాత్య సంప్రదాయపు ఉత్తమ పద్ధతిలో, ఒక పక్క సాంఘిక సాంస్కృతిక ప్రాంతాలకు, మరొకపక్క సంగీతపు ఏకైక అస్తిత్వానికీ మధ్య వున్న దూరానికి, కచేరీ ప్రదర్శనలు వారధిగా నిలిచాయి. కర్ణాటక సంప్రదాయంలో సంగీతం ఎన్నడూ ఏకాకి కాదు. అది ఎప్పుడూ ప్రజా ప్రాంతంలోనే ఉంది.

సంగీతంతో అనుబంధం వున్న "మిస్టరి" స్వాధికారం వంటి భావనలు యమ్మెస్‌కు అర్థంకానివి, అనవసరమైనవి. ఆమెకు సంగీతమే జీవితం. కానీ ఆమెకు తెలియకపోయినా, కొన్ని వినిపించని రాగాలు, శ్రవణ కుహరాలలో పనిచేస్తూ వుండి వుంటాయి. అందరూ సాధారణంగా ఆమె సంగీతం గురించి వర్ణిస్తూ "సంగీతపు చెలిమె" అని చెప్పే మాటను బాగా వివరించేది ఆ వినిపించని రాగాలేనేమో. కొలతలు ఏవైనప్పటికీ, ఆమె తన ఉపాసనలో, పూజలో, ధ్యానంలో చూపే వినమ్రత వల్ల మిగిలిన చాలామంది కంటే ముందుకు పోగలిగింది. తన కళకు బదులుగా ఆమెకు ఏమీ రానవసరం లేదు. యమ్మెస్‌లోని ఈ వ్యక్తిగతమైన ప్రత్యేక లక్షణమే, సదాశివం చేసిన పనులన్నిటికంటే ఎక్కువగా, ఆమె భక్తిని అధికారంతో నింపింది. ఆమె ఎన్నడూ చెప్పకపోయినా, లోతుగా అనుభవించిన తన కళా నిర్వచనాలు ఆమె సాధారణ కచేరీ గాయనినుండి ఒక మానవతావాదిగా పరిణమించినపుడూ, ఒక సినిమాతార నుండి ఒక 'మెటఫర్''గా పరిణమించినపుడు విశ్వసనీయతను అందించాయి.

ఈ రకంగా యమ్మెస్, సదాశివంలను విరుద్ధమైన వ్యక్తులుగా అధ్యయనం చేయవచ్చు. ఐతే వారి భాగస్వామ్యం మాత్రం ఒక సాహసోపేత విజయగాథ. సదాశివం ఎప్పుడూ ప్రణాళికలు రచిస్తూ, ఒక ఎత్తు తర్వాత మరొకదానికి వెళ్తూ, కారణాలను, పర్యవసానాలనూ బేరీజు వేస్తూ, అన్ని విధాలుగా వ్యవహారవేత్త. యమ్మెస్ కళాకారిణి. మరింకేమీ కాదు. ఆమె ఆదేశాలను పాటించింది. కానీ కళ మాత్రం ఆమెదే. ఆమెది మాత్రమే. వాళ్ళిద్దరూ చాలా లోతైన మత విశ్వాసాలు గలవారు. ఐతే సదాశివం విశ్వాసం, అతని మొత్తం వ్యవహారశైలిలో భాగమేమో అనిపిస్తుంది. అదే యమ్మెస్ భక్తి పూర్తిగా ఆమె వ్యక్తిగతమనిపిస్తుంది. ఆమె ఒక ధార్మిక ప్రదర్శన నుండి మరొక దానికి ప్రయాణించినపుడు ఆమె శైవసాధువు తిరుమూలార్ ఆలాపించిన "ఓ దైవమా, నేననుభవించిన ఈ బ్రహ్మానందాన్ని ప్రపంచాన్ని కూడా అనుభవించనివ్వు" అనే పాటకు ప్రతిధ్వనిలా అనిపించేది.

ఐతే గతంలో సంగీత గురువులవలే కాక యమ్మెస్ భార్యగా, తల్లిగా సంపూర్ణ జీవితాన్ని జీవించింది. సదాశివం జీవితపు సాంఘిక, వ్యాపార, రాజకీయ సుడిగుండాలలో భాగం కాకుండా ఎప్పుడూ లేదు. నిజానికి ఆమే వాటికి కేంద్రంగా వుండేది. ఆమె

సాంఘిక జీవితంతో గానీ, వ్యాపారంతో గానీ, యిక రాజకీయాలతోగాని బొత్తిగా తనను తాను కలుపుకోలేకపోయేది. తన చుట్టూ వున్న మగవాళ్ళు పూర్తిగా మునిగిపోయిన ఈ వ్యవహారాలు ఆమె యెన్నడూ అర్థం చేసుకోలేదు. కానీ కల్కి గార్డెన్స్‌లో, ఆ ప్రపంచానికి ఆతిధ్యం యిస్తూ, వాళ్ళతో కలిసి మెలుగుతూ, నిజమైన సాన్నిహిత్యాన్ని అందించేది. ఆమె వాళ్ళ వ్యవహారాలలో కలిసివుండేది, ఐనా కలిసి వుండేదికాదు. ఆమె వారికి చెందేది. కానీ చెందినది కాదు. కల్కి-రాజాజీ బృందాల అంతులేని కార్యక్రమాలలో ఆమె పాల్గొనేది. కానీ దూరంగా, విడిగా వుండేది. ఆమె జోక్యం చేసుకోని జోక్యం, బంధరహిత అనుబంధం, ఆమె వ్యక్తిత్వపు అందాన్ని, గాంభీర్యాన్ని పెంచాయి. ఆమె సదాశివం భార్య, రాజాజీ శిష్యురాలు, కల్కి కృష్ణమూర్తి మిత్రురాలు, కానీ ఆమె ఎల్లప్పుడూ యమ్మెస్. చివరాఖరికి ఆమె తన సంగీతం, తన భక్తి. చివరికి ఆమె తన చుట్టూ వున్న మనుషులు కోల్పోయినది తాను పొందగలిగింది. ఒక పరిపూర్ణతా భావం. సదాశివం విజయాలు సాధించాడు, భక్తుడు. కానీ ఆయన పూర్తి పరిపూర్ణత కనుగొన్నాడా? రాజాజి దీర్ఘకాలం రాజకీయ సాంఘిక పిరమిడ్ల పైభాగాన నిలిచాడు. కానీ నిజమైన సాధకుడిగా సంతృప్తిని పొందగలిగాడా?

యమ్మెస్‌ని ఒక్కసారి చూస్తే చాలు ఆమె తనను తాను తెలుసుకున్నదని అంగీకరించటానికి. ఆమె రాజాజీ రాసిన ప్రార్థనా గీతం "నాకు విచారాలేవి లేవు" పాడినపుడు, ఆమె తన గురించి ప్రపంచానికి చెబుతున్నట్లు, దేవుడు తనకిచ్చిన ఆశీస్సులకు కృతజ్ఞతలు చెబుతున్నట్లు వుంటుంది. యమ్మెస్‌ని తరువాతి సంవత్సరాలలో కలిసినవారి భాషలో తరచుగా ఒక పదం వినపడుతుంది. "ప్రకాశం". ప్రతివాళ్ళూ ఆమె లోపలి నుంచి ఎలా ప్రకాశిస్తున్నదో అని మాట్లాడుకునేవాళ్ళు. ఒక పద్మవ్యూహపు జీవితం మధ్యలో ఆమె ప్రశాంతతను కనుగొన్నది. ఒక తేజో వలయం ఆమె చుట్టూ ఆవరించింది.

# 11. గార్డెన్ పార్టీల కాలం

*రూకలు పదివేలున్న చేరెడు*
*నూకలు గతి కాని ఓ మనసా*
*కోకలు వెయ్యున్న*
*కట్టుకొనుటకొకటి కాని ఓ మనసా (రూ)*
*ఊరేలిన తా పండుట మూడు మూర తావు కాని*
*నూరు భక్షణములబ్బిన ఎంతో నోటికంత కాని*
*ఏరు నిండుగ పారిన పాత్రకు తగు నీరు వచ్చు కాని*
*సారతరుని హరిని త్యాగరాజ సన్నుతుని మరవకే మనసా (రూ)*

1944 లో "మీరా" సినిమా విడుదలవటంతో యమ్మెస్ సుబ్బులక్ష్మి జీవితంలో 'భక్తి' దశ ప్రారంభమైందని చెప్పవచ్చు. వింతగా అనిపించవచ్చుగానీ, ఆ సంవత్సరంనుంచే ఆమె సాంఘికంగా స్పష్టంగా కనిపించే జీవితం కూడా ప్రారంభమైంది. 1947లో సదాశివం కల్కిగార్డెన్స్ సంపాదించుకుని దానిని తన కార్యకలాపాల ప్రధాన కేంద్రంగా 1977 వరకూ కొనసాగించాడు. ఆ కాలం యమ్మెస్ యెన్నో విజయాలను సాధించిన సంవత్సరాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అలాగే సంగీతపరంగానూ, ఆధ్యాత్మికంగాను ఎదుగుదలను సూచించే కాలం అది. ముప్పై ఒక్క సంవత్సరాల 'వయస్సు' అరవైయ్యొక్క సంవత్సరాలకు జరిగిన కాలం అది. సదాశివం గురించి చాలాసార్లు, కొంత ఆమోదంతో, కొంత వ్యతిరేకతతో అనేమాట ఒకటుంది. ఆయనే గనక యింకొంత ముందటి కాలంలో జన్మించి వుంటే ఆయన రాజ్యాలేలే మహారాజయ్యేవాడని. కల్కి గార్డెన్స్‌లో నివసించిన మూడు దశాబ్దాలూ ఆయన చక్రవర్తి కాకున్నా రాజులా బతికాడు. యమ్మెస్ రాణి అనటంలో సందేహం లేదు గానీ ఆమె అలా ఆలోచించలేదు. ప్రవర్తించలేదు. విలాసవంతమైన పరిసరాలు ఆమె శైలిని గానీ స్వభావాన్ని గానీ ప్రభావితం చేయలేదు. ఆమె మదురై రోజులలో అలవరుచుకున్న చిన్న పట్టణపు కపటంలేనితనాన్ని, ఆమె జీవితంలోని వివిధ దశలలో అట్లాగే నిలుపుకుంది.

ఆమె పట్ల ప్రజల వైఖరి పూర్తిగా వేరే విషయం. ఆమె యెంత సామాన్యంగావున్నా, 1940 లలో ఆమెకున్న ప్రజాకర్షణ వల్ల ఆమె అసాధారణ ఫ్యాషన్ మోడల్ అయింది. 'శకుంతలై' తోనే ఈ ధోరణి ప్రారంభమైనా, ఆ సమయంలో అది సినిమాతారలపట్ల సామాన్య ప్రజలకుండే వ్యామోహం అనిపించింది. సినిమా షూటింగు జరిగే ప్రదేశాలలో ఆమె కాఫీ తాగిన కప్పులను, కడగకుండా షోకేసుల్లో మెమొంటోల్లాగా, బహుమతుల్లాగా దాచుకున్న సందర్భాలు వున్నాయి. ఒక్క క్షణం వుపయోగించుకోటానికి ఆ సమయంలో

ఆమె పక్కన నిలబడిన వాళ్ళు యిచ్చిన చేతిరుమాలను, అతను యింటికి తీసుకువెళ్ళి వారసత్వ సంపదగా భద్రపరచుకున్న సందర్భాలు వున్నాయి. ఆమెకు తెలియకపోయినా, పట్టించుకోకపోయినా యమ్మెస్ అద్భుతంగా ప్రకాశించేది.

సినిమా సంవత్సరాలు వెనక్కు వెళ్ళిపోయి, రొమాంటిక్ కథనాయికగా ఆమె ఆకర్షణకు పూర్తి వ్యతిరేకంగా భక్తి ఆమెకు గుర్తింపునిస్తున్నప్పుడు ప్రజలకు ఆమె మీది ఆకర్షణ నిజానికి పెరిగింది. ఈ పరిణామానికి కల్కి గార్డెన్స్ మార్మికత దోహదం చేసివుండవచ్చు. ఆ ఎస్టేటుని ప్రజలు ఒక విలాసవంతమైన రాజప్రాసాదమనకున్నారు. అది చాలా ఖరీదైన ప్రదేశం. అక్కడ జరిగే వ్యవహారాలన్నీ పెద్ద ఎత్తున సదాశివం వ్యవహార సరళికి తగినట్లు వుండేవి. కానీ అది సంప్రదాయార్థంలో విలాసవంతమైన చోటు కాదు; ఆ ఆవరణ అనుమానం లేకుండా దక్షిణ భారతీయ – అయ్యర్ – శాఖాహారం. వైభవ ప్రదర్శనేమీ వుండేది కాదు గానీ సౌకర్యవంతమైన జీవనానికి కావలసిన సాధనాలకేమీ కొదవవుండేదికాదు. శాఖాహారం అయినా కాకున్నా రుచికరమైన వంటలు రాజభవనంలోలా అక్కడ వుండేవి. ఒకే సమయంలో అనేక కార్యకలాపాలు జరుగుతుండేవి. ఆ ఆవరణలోని కాంతివంతమైన జీవితం మధ్యలో యమ్మెస్ వుండేదని భావించేవారు. ఆ పెద్ద ద్వారాల గుండా నిరంతరం వచ్చి వెళ్ళే జాతీయ నాయకులతో ఆమె స్నేహంగా వుంటుందని భావించేవారు. ఈ ఆలోచనలవల్ల ఉన్నతస్థాయి సమాజంలో యమ్మెస్‌కు ఒక హోదా వుండేది. యువతులకు, ఉన్నత కుటుంబాలకు చెందిన మహిళలకూ ఆమె ఒక అనుసరించదగిన నమూనాగా వుండేది. ఆమె కూడా మంచి దుస్తులు ధరించి అందంగా మెచ్చుకునేందుకు తగినట్లుగా ఉండేది. కానీ ఆమెలో ఎక్కడా ఫ్యాషన్‌గా వుండాలనే తాపత్రయం కనిపించదు. పాతకాలపు తమిళ సంప్రదాయమే ఆమె శైలి. ఆమె ముక్కుకి, చెవులకూ రవ్వలు పెట్టుకునేది. బంగారు గాజులు, మట్టి గాజులు ఒక వరుసక్రమంలో కలిపి వేసుకునేది. తలలో మల్లెపూలమాలను అలంకరించుకునేది. పసుపుతో కడిగిన నుదుటిమీద పెద్ద ఎర్ర కుంకుమ బొట్టు కొట్టొచ్చినట్లు ప్రకాశించేది. ఇవన్నీ తమిళ బ్రాహ్మణ స్త్రీలందరికీ తప్పకుండా వుండే అలంకార క్రమాలే. ఐతే యమ్మెస్ ధరించినపుడు యివన్నీ ప్రత్యేకంగా కనిపించేవి. స్త్రీత్వానికి ప్రతీకలా ప్రకాశించేది. ఆమె కేశాలంకరణ, పూలు పెట్టుకునే పద్ధతి, ఆమె యిష్టంగా ధరించే దుస్తుల రంగులు, టెలివిజన్ లేని ఆ రోజుల్లో ప్రజాభిరుచిని ప్రభావితం చేసేవి. కళ్ళమీద ఆమె కాటుక పెట్టుకునే తీరు, ఆమె సింపుల్ మేకప్‌లో ముఖ్యాంశంగా చాలామంది అనుకరించేవారు. వివాహితలైన అయ్యర్ మహిళలు ధరించే తొమ్మిదిగజాల మడిసర్ చీరె, సంప్రదాయపరంగానైతే కుడిభుజం మీదుగా పమిటను వేసుకుని, చుట్టూ తిప్పి నడుం దగ్గర దోపుతారు. యమ్మెస్ యెడమ భుజం మీద పమిటను కొంత వదిలి తర్వాత లోపల దోపుతుంది. ఈ పద్ధతిననుసరించిన వారిలో ఈమె మొదటిది కాదు కానీ, యమ్మెస్ దానిని అనుసరించటం వల్ల యిక అదొక

ట్రెండ్ అయిపోయింది. బ్రాహ్మణ స్త్రీలు యమ్మెస్ పద్ధతిలో చీరెలు కట్టడం మొదలుపెట్టారు. ఆమె పట్టు చీరెలకు ఎంచుకునే ముదురు నీలం రంగును "యమ్మెస్ నీలం" గా పిలిచేవారు. ఆ రోజుల్లో అలాటి చీరె కనీసం ఒకటైనా తన బీరువాలోలేని బ్రాహ్మణ గృహిణి మద్రాసులో కనిపించేదికాదు. చాలాకాలంపాటు పట్టుచీరెల వ్యాపారి, సంగీత ప్రియుడు అయిన ముత్తు చెట్టియార్ యమ్మెస్‌కు చీరెలను పంపించేవాడు. ఉన్నత వర్గాలలో ముత్తు చెట్టియార్ అనేది మ్యాజిక్ పేరుగా మారింది. అతనితో స్నేహం వుందని చెప్పుకోగలగటమంటే చాలా పేరు ప్రతిష్టలున్నట్టు లెక్క. అతను తయారు చేసిన చీరెలుండటమంటే యిక దానిని మించినదేమీ లేదు. యమ్మెస్‌కు కానుకలుగా ఎన్నో కంచిపట్టు చీరెలు వచ్చిపడేవి. సామాన్యంగా వాటినామె యెవరికైనా యిచ్చేసేది. చీరెలు అలా పంచెయ్యటం ఉన్నతశ్రేణి సమాజపు అలవాటుగా మారటానికి అదొక కారణం కావొచ్చు.

ఇరవైలలో, ముప్ఫయిలలో అనుసరించదగిన మోడల్‌గా యమ్మెస్ ప్రభావం ఎంతో వుంది. 1940–50 దశాబ్దంలో యమ్మెస్ కచేరీ దగ్గర కనబడటం హోదాకు చిహ్నంగా భావించేవారు. ఆమె ఏదైనా వివాహానికి రావటానికి ఒప్పుకుందంటే, పెళ్ళివారికి అంతకుమించిన గౌరవమేదీ లేదు. ఆమె ఒక కొత్త కీర్తన పాడిందంటే, ఆ సీజన్‌లో అది అందరూ అభిమానించే గీతమయ్యేది. ఒక్క వ్యక్తి సమాజమంతటిమీదా అంత ప్రభావాన్నెలా చూపగలరో యమ్మెస్ యెన్నటికీ అర్థం చేసుకోలేకపోయేది. ఎవరైనా ఆమెతో "యమ్మెస్ నీలం" ఫాషన్‌కు మారుపేరయిదంటే ఆమె మొహమాటంతో కుంచించుకుపోయి వెనక్కుతగ్గేది. ఆమె యుక్త వయసులో ఆమె యిలాంటి ప్రభావాలకు గురికాలేదు. ఒక చిన్న సంఘటన మాత్రం జరిగింది. ఆమె, చెల్లెలు వడివాంబాళ్ కలిసి, బంగారు ఫ్రేమున్న కళ్ళద్దాలు ధరించి ఫోటో తీయించుకోగలిగారు. ఆ కళ్ళద్దాలు అప్పుడు మదురైలో గొప్ప ఫ్యాషన్. సాధారణంగా ఆ ఫ్రేములోపల అద్దాలుండేవి కావు. ఫ్రేమే అందరికీ కావలసింది. ఫోటో స్టూడియోలు అద్దాలు లేని ఫ్రేములను ఫ్యాషన్‌గా వుండాలనుకునే యువతులను ఆకర్షించేందుకు ప్రదర్శిస్తుండేవి. అలాంటి కంటి "ఆభరణం" ధరించిన వడివాంబాళ్ ఫోటో ఒకటి వుంది. ఆ సంఘటన తప్ప, అది కూడా వడివాంబాళ్ ప్రభావం వల్ల కావొచ్చు, యమ్మెస్ ఎవరినీ అనుసరించి తన వ్యక్తిగత శైలిని రూపొందించుకోలేదు.

ఫ్యాషన్ మీద ఆసక్తి లేకపోవటం వల్ల మద్రాసు ఉన్నత వర్గాలు తనమీద కనపరిచే శ్రద్ధాసక్తులు ఆమెనేమీ చేయలేకపోయాయి. ఇతరులు ఆశించినట్లుగా జీవించకపోవటం ఆమెకు సమస్య కాదు గానీ, కల్కి గార్డెన్స్‌లోని జీవితంతో సర్దుబాటు చేసుకోవటం సమస్యే. ఆ వేగానికీ, అందరినీ ఆకర్షించే కేంద్రంలో వుండటానికీ ఆమె అలవాటు పడలేదు. ఈ రెండూ సదాశివంకు ప్రాణవాయువు. ఆ ఆస్తి, దానికి సహకరించే జీవన విధానం ఈ రెండూ ప్రజాసేవంటే ఆయనకున్న భావనను ప్రతిబింబిస్తాయి. తన వ్యక్తిగత సౌకర్యాలకు ఎక్కడా రాజీపడకుండా ప్రజాసేవలో ఉండటం. సదాశివంను ముఖ్యునిగా

గుర్తించినంతకాలం అందరికీ అక్కడ స్వాగతం దొరుకుతుంది. అందరూ అన్ని సౌకర్యాలు అనుభవించవచ్చు. ఆయన నిర్వహణలో కల్కి గార్డెన్స్ పెద్ద ఆతిధ్య కేంద్రమయింది. ఆ ఆవరణ విశాలత్వమే అందరినీ అలరిస్తుంది. ఒక పెద్ద యిల్లు, అనేక చిన్న ఔట్ హౌస్‌లు, కాటేజీలు, గోశాలలు ఉన్నాయందులో. ఒకసారి కల్కి పత్రిక ప్రచురించే ప్రెస్, గొడౌన్ కూడా అక్కడే వున్నాయి. ఒక సమయంలో గోకులం అనే పేరుతో పూర్తిగా పిల్లల కోసం ఒక భవనం ఉండేది. సదాశివంకు వీలైనప్పుడల్లా చుట్టూ పిల్లల్ని చేర్చుకోవటం యిష్టమని అందరికీ తెలుసు. అక్కడి చెట్లను, పొదలను, పూలచెట్లనూ చూసుకోటానికి యిరవైమంది తోటమాలీలు వుండేవారు. సదాశివం తన కోసం ఒక చిన్నగదిని, యమ్మెస్ కోసం ఒక చిన్న గదిని ప్రత్యేకంగా వుంచాడు. మిగిలిన గదులన్నీ అక్కడ నివసించే అతిథులకూ, వచ్చిపోయే సందర్శకులకు. వాళ్ళు ఎప్పుడూ ప్రవాహంలా వస్తూనే వుండేవారు. అనేక రంగాలకు చెందిన ప్రముఖ వ్యక్తులు ఎప్పుడంటే అప్పుడు వచ్చిపడేవారు. ఆరుగురు పెద్ద వంటవాళ్ళు, వారి సహాయకులతో యిరవై నాలుగుగంటలూ వంటింట్లో పొయ్యి ఆరకుండా చూస్తుండేవారు. సదాశివం దంపతులు వూళ్ళో వుంటే దాదాపు ముప్ఫైమందన్నా వారి పంక్తిన కూర్చుని, అరిటాకుల్లో వడ్డించిన పదార్థాలను ఆస్వాదించకుండా భోజన సమయాలు జరగవు. బాదం హల్వా, కుంకుమపువ్వు వేసిన పాలు, పెరుగన్నం కల్కి గార్డెన్‌లో ప్రముఖమైన వంటకాలు. అచ్చమైన తమిళ బ్రాహ్మణ సంప్రదాయ పద్ధతిలో చేసే కాఫీ రుచి మర్చిపోలేనిది. రాజగోపాలచారి వంటి గౌరవనీయ అతిథులకు యమ్మెస్ తనే స్వయంగా డికాక్షన్ కలుపుతుంది. చిక్కగా, సువాసనతో. ఆ కాఫీకీ, తన ప్రభావం చూపే చతురోక్తులకూ అలవాటైన సదాశివం తరచూ “కాఫీ రాత్రిలాగా నల్లగా, నరకంలాగా వేడిగా, ప్రేమలాగా తియ్యగా ఉండాలి” అనేవాడు. కల్కిగార్డెన్స్‌లో కాఫీ అలాగే వుంటుంది.

❖ ❖ ❖ ❖

కల్కి గార్డెన్స్‌లోని మొదటి దశాబ్దంలో సదాశివం యమ్మెస్ వృత్తిమీద కేంద్రీకరించాడు. మీరా సినిమా విజయం యిచ్చిన ఉత్సాహంతో ఆమెను ఆధ్యాత్మిక ప్రేరణ కలిగిన శాస్త్రీయ సంగీతకారిణిగా చూపించాలనే వ్యూహంతో సదాశివం తన చేతులకు పని కల్పించాడు. తగిన మంచి కారణాలు, సందర్భాలు వుంటే యమ్మెస్ పాడుతుందనే మాట వ్యాపించగానే సదాశివం తలుపులు కొట్టే అభ్యర్థులు కుప్పలుతెప్పలు. తనకు అలవాటైన అధికారదర్పంతో తన షరతుల మీద కొన్ని కార్యక్రమాలకు అంగీకరించేవాడు. కొన్నిటిని అక్కడికక్కడే తిరస్కరించేవాడు. తన ఆశయాలు నెరవేరటానికి అవసరమైన వేదికలను గుర్తించి అంగీకరించేవాడు. దాని ఫలితంగా యమ్మెస్ భారతదేశమంతటా, విదేశాల్లోనూ కనిపించింది. నిరంతరం ప్రయాణాలు చేస్తూ సదాశివం దంపతులు కల్కి గార్డెన్స్‌కు తామే అరుదుగా వచ్చే అతిథులయ్యారు. భిన్న స్థలాలు, భిన్నమైన శ్రోతలు, భిన్న సందర్భాలు యమ్మెస్ తన కచేరీని నిరంతరం మెరుగు

పరచుకునేలా చేయటంలో ఉపయోగపడ్డాయి. తన సంగీతపు బంగారు నిధికి, భారతదేశపు భిన్న సంస్కృతుల కృతులను కలపటంతో ఆమె సంగీత స్వరాక్షరాలు తమవైన ప్రత్యేకతను పొందాయి. అలాగే ఆమె భారతీయత కూడా ప్రత్యేకంగా నిలబడింది. కల్కి పత్రికలో ఆమె ప్రయాణ విశేషాలు వివరంగా ప్రచురించేవారు. అలాగే ఆమె కచేరీల గురించిన వ్యాసాలు, ఆ కచేరీలు ఏ మంచి కారణానికి నిర్వహించబడ్డాయి అనే విషయాలు ఆ పత్రికలో తరచూ వచ్చేవి. ప్రచారం మీద సదాశివంకున్న మోజు ఆమె నిత్యం ప్రజల దృష్టిలో వుండేలా చేసేది.

ఐతే ఈ సమయం మరీ ఎక్కువ కాలం సాగలేదు. 1950వ దశాబ్దపు మొదటి భాగం తర్వాత భారతదేశంలో రాజకీయ పవనాలు తమ దిశను మార్చుకున్నాయి. సదాశివం, యమ్మెస్, కల్కిగార్డెన్స్, అంతా రాజగోపాలాచారి లేవదీసిన భావజాలపు తుఫానులో చిక్కుకుపోయారు. 1950లో ఇండియన్ రిపబ్లిక్‌గా దేశం ఆవిష్కరింపబడటంతో రాజాజీ గవర్నర్ – జనరల్ ఆఫ్ ఇండియాగా పదవీ విరమణ చేశాడు. ఆ తర్వాత సంవత్సరం పాటు కేంద్ర మంత్రివర్గంలో హోంమంత్రిగా పనిచేసి, ఆ తర్వాత 1952 నుండి 1954 వరకూ మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నాడు. కానీ ఆయన చాలా వేగంగా జవహర్లాల్ నెహ్రూ ఆలోచనల నుండీ, విధాన నిర్ణయాల నుండి దూరంగా జరుగుతున్నాడు. నెహ్రూయిజంలోని మైలు రాళ్ళు – కేంద్ర ప్రణాళిక, అలీన విధానం, సోషలిస్టు విధానాలను రాజాజీ తిరస్కరించాడు. ఈ విధానాలకు సైద్ధాంతిక వ్యతిరేకత ఆయనలో తీవ్రస్థాయికి చేరుకునే సమయం వచ్చింది. ఆయన “పర్మిట్ – లైసెన్స్, కోటా రాజ్యం”గా పిలిచే సోషలిస్టు విధాన ప్రణాళికల్లో, అవినీతి వ్యవస్థాగత మవుతుందని గ్రహించాక వ్యతిరేకత తీవ్రమైంది. 1959లో ఆయన నెహ్రూతో సంబంధాలు తెగదెంపులు చేసుకుని స్వతంత్ర పార్టీని స్థాపించాడు.

ఆ సమయానికి రాజాజీ, సదాశివంల జీవితాలు కలిసిపోయి ఒకే ఉనికిగా మారిపోయాయి. తన తరపు జాతీయవాదులందరి వలే – ఆ తర్వాతి తరం వారికి పూర్తి భిన్నంగా – రాజాజీ తనకంటూ యే ఆస్తిని వ్యక్తిగతంగా సంపాదించుకోలేదు. సంపాదించుకోగలిగేవాడే. సేలంలో న్యాయవాదిగా పనిచేసిన 1900–10, దశాబ్దంలో ఆయన సంపాదన నెలకు 25,000 రూపాయలకు మించే వుండేది. దేశ సేవ కోసం ఒక సేవకునిగా గాంధీతో చేరినప్పుడు ఆ సంపాదనంతా యిచ్చేశాడు. గవర్నర్–జనరల్ పదవినుంచి దిగిపోయినప్పుడు, మద్రాసులో త్యాగరాయనగర్‌లో ఒక అద్దె యింటికి మారిపోయాడు. కానీ సదాశివంకు, కల్కి గార్డెన్స్‌కు దగ్గరలో వుండాలని కోరుకున్నాడు. సదాశివం యిళ్ళవేట మొదలుపెట్టాడు. పక్కనే వున్న బంగళా, తాజ్‌మహల్ బీడీ వర్క్స్ యజమానికి చెందినది. దానికోసం బేరమాడాడు. అతను ముస్లిం. అతనికి తన బంగళా రాజాజీ కోసం అడుగుతున్నారని తెలియగానే దానిని ఉచితంగా యిచ్చేస్తానని పట్టుబట్టాడు.

భారతదేశానికి, భారతీయ ముస్లింలకూ రాజాజీ చేసిన సేవలు అమూల్యమని అన్నాడు. సదాశివం, రాజాజీ దానిని వ్యతిరేకించారు. ఆ సమస్య చివరకు ఆ బీడీ వ్యాపారవేత్త ఒక ముస్లింగా కానుకలు యివ్వటం తన హక్కు అని గట్టి పట్టు పట్టటంతో పరిష్కారమైంది. కొన్ని క్షణాలు ఆలోచించిన తర్వాత రాజాజీ ఒక బ్రాహ్మణుడిగా కానుకలను స్వీకరించటం తన హక్కని అన్నాడు. రాజాజీ రాజకీయ కార్యకలాపాలు విస్తరించటంతో సదాశివం కల్కి గార్డెన్స్‌లో విడిగా ఒక కాటేజీని "పూజ్య రాజాజీ"కి పూర్తిస్థాయి కార్యనిర్వహణ నిర్వహణకూ, యితర సహాయ సౌకర్యాలకూ నిర్మించి యిచ్చాడు. ప్రతిరోజూ సాయంత్రం కొన్ని గంటలు ఆ కాటేజీ రాజాజీ పిల్చుకున్నట్టు "నా నంబర్ 10, డౌనింగ్ స్ట్రీట్" గా మారిపోయేది. ఆ కాటేజీలోనే, కల్కి గార్డెన్స్ యొక్క ప్రశాంతమైన, నిర్భయమైన ఆవరణలోనే రాజాజీ తన రాజకీయ వ్యూహపు సమావేశాలను, పత్రికా విలేఖరుల సమావేశాలను జరిపేవాడు. ఆయన తన ప్రధాన సాహితీ గ్రంథాలలో కొన్నింటిని యిక్కడే రాశాడు.

1960వ దశాబ్దంలో రాజకీయ పరిణామాలు తీవ్రమైనవిగా కొన్నిసార్లు ద్వేష పూరితంగా ఉండేవి. నెహ్రూ ఆకర్షణతో మధిస్తున్న సోషలిజం పెనుగాలులకు యెదురునిల్చి, స్వతంత్రపార్టీ ఒక మితవాద వేదికను యేర్పాటుచేసే సాహసానికి పూనుకుంది. ఆ పార్టీ నాయకులు తమ పార్టీ కాల పరీక్షకు నిలబడిన పెట్టుబడీదారి విధానపు సూత్రాలకు కట్టుబడి వుంటుందని ప్రకటించారు. స్వేచ్ఛా విపణి, ఆర్థికరంగం నుంచి ప్రభుత్వం వైదొలగటం మొదలైనవి ఆ విధానాల్లో భాగం. ఈ విధానం సంచలనాన్ని సృష్టించింది. చాలామంది నెహ్రూ విధానాలను వ్యతిరేకించే వారున్నారు గానీ ప్రజలలో ఆయనకున్న పలుకుబడి, ఆకర్షణను సవాలు చేయటం అసాధ్యమనుకునేవారు. వారంతా స్వతంత్ర పార్టీ వేదిక మీదకు వచ్చారు. వారిలో ఆనాటి వాణిజ్య వేత్తలలో ప్రముఖులు, పెద్ద భూస్వాములు, కొందరు గతకాలపు రాజకుమారులు వున్నారు. 1964 మే లో నెహ్రూ మరణం తర్వాత, కాంగ్రెస్ పార్టీకి పూర్తిగా భిన్నమైన ఆర్థిక, రాజకీయ ఎజెండాతో వున్న స్వతంత్ర పార్టీ ఒక ప్రత్యామ్నాయంగా కనిపించింది. సిద్ధాంతపరంగా యింత స్పష్టత వున్న మూడవ రాజకీయ శక్తి లేదు. కమ్యూనిజం నెహ్రూ సోషలిజంతో తటస్థమైంది. కమ్యూనిజం యింకా తగినంత రాజకీయ శక్తిగా మారలేదు. ఈ వాస్తవాలు ముందుకు రావటంతో, 1967 సార్వత్రిక ఎన్నికల తర్వాత స్వతంత్రపార్టీ నలభై నాలుగు మంది పార్లమెంటు సభ్యులతో, లోక్‌సభలో అతి పెద్ద ప్రతిపక్ష పార్టీగా అవతరించింది. ఒరిస్సా, రాజస్థాన్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో స్వతంత్ర పార్టీ చాలా మంచిగా పనిచేసి ముందుకొచ్చింది. ఐతే రాజగోపాలచారి, యితర స్వతంత్ర పార్టీ ప్రముఖులు ఇందిరాగాంధీని లెక్కలోకి తీసుకోలేదు. 1966లో ప్రధానమంత్రి పదవి నధిష్టించిన ఇందిరాగాంధీ, 1969లో కాంగ్రెస్ పార్టీని చీల్చి, స్వంతంత్రానంతరం యెన్నడూ చూడనంతగా ప్రజాకర్షణా పథకాల సునామీ సృష్టించింది. స్వతంత్ర పార్టీ నాయకత్వాన్ని

నిరాశా నిస్పృహల్లో ముంచేస్తూ, నెహ్రూ కూడా చేయటానికి సాహసించని పనులు చేసింది – పద్నాలుగు బ్యాంకులను జాతీయం చేసింది. రాజస్థానాల రాకుమారులకు రాజ్యాంగబద్ధమైన ప్రీవీ పర్సులను రద్దు చేసింది. మితవాదులకు ఈ చర్యలన్నీ షాకింగ్‌గా వున్నా, సామాన్య ప్రజల మెప్పుపొందాయి. "ఆమె గరీబ్ హఠావో" నినాదాన్ని కూడా తయారు చేసుకున్న తర్వాత 1971 సార్వత్రిక ఎన్నికలలో ఆమె అఖండ విజయాన్ని సాధించింది. అందులో స్వతంత్ర అభ్యర్థులు పేరులేకుండా మునిగిపోయారు. ఆ తర్వాతి సంవత్సరం రాజాజీ మరణించాడు. స్వతంత్ర పార్టీ కల వేగంగా వెలిసిపోయింది.

ఐతే ఆరిపోకముందు స్వతంత్రపార్టీ దీపాలు చాలా కాంతిమంతంగా వెలిగాయి. 1950 వ దశాబ్దపు చివరినుండి 1972 వరకూ జాతీయ రాజకీయాలలో రాజాజీ యిరుసులాంటివాడు. రచయితలు, మేధావులూ, రాజకీయ నాయకులు, వ్యాపార ప్రముఖులు, యింకా యితరేతర రంగాల కార్యనిర్వాహకులూ ఆయనను కలవటానికి వరుస కట్టేవారు. ఆయన రోజు వారీ కార్యక్రమాలు నిరంతరమైన సభలతో నిండేవి. ఇదంతా కల్కి గార్డెన్స్‌లో జరిగేది. ఆ కాటేజీలో నిరంతరాయంగా, నిరంతరం కాఫీని ప్రవహింప చేయటమనే స్వల్ప కార్యంగా కనిపించే పెద్ద బాధ్యతను శ్రద్ధగా చూసుకోవాల్సిన అవసరం వచ్చింది. అతిథులు గదులు సంవత్సరమంతా పూర్తిగా నిండిపోయి వుండేవి. సదాశివం అతిథేయుడిగా, అన్నీ సమకూర్చేవాడిగా వున్నత శిఖరాలకు చేరాడు. ఆనాటి దానినంతా దగ్గరగా చూసిన ఒక వ్యక్తి కొన్ని సంవత్సరాల తర్వాత యిలా రాశాడు : "కల్కి గార్డెన్స్‌కు వెళ్ళిన ప్రతి ఒక్కరికీ రాజాజీ మేధస్సు కళ్ళు మిరుమిట్లు గొలిపితే, సదాశివం ఆతిథ్యం అబ్బురపరిచేది."

❖ ❖ ❖ ❖

సదాశివం రాజకీయాలు ఆవేశపూరితమే గానీ మేధోజనితం కాదు. ఆయన తరంలోని అందరు యువకులలాగానే వలసవాద వ్యతిరేకోద్యమంలోకి వెళ్ళాడు. ఆయన జాతీయవాదం, ఆయన హీరోలుగా తలచిన నాయకులకు యెంత నిబద్ధంగా వున్నాడనేదానితోనే కొలవాలి – ముందు సుబ్రహ్మణ్య శివ, ఆ తర్వాత రాజాజీ, ఆ తర్వాత కంచి పరమాచార్య. ఒక సమయం తర్వాత యింకొక సమయంలో వీళ్ళే ఆయన ఎజెండాలను నిర్ణయించారు. ఆయన ప్రశ్నించకుండా అనుసరించాడు. ఆయన పెట్టుబడీదారి విధానం × సోషలిజం అనే వివాదపు కోరల మధ్యనున్నవాడు కాదు. అతనికి సిద్ధాంతం విప్పటానికి వీల్లేనంత చిక్కుముడి. రాజాజీ గొప్ప నాయకుడు గాబట్టి ఆయన అభిప్రాయాలు పవిత్రమైనవి. ఐతే సదాశివం నిబద్ధత అతనికి గౌరవాన్ని తెచ్చిపెట్టేది. రాజాజీ, నెహ్రూ నుంచి విడిపోయాక, రాజాజీ తక్కువ స్థానంలో వున్నాడనేది స్పష్టంగానే తెలుస్తోంది. ప్రధానమంత్రిగా నిజమైన అధికారం చలాయించేది నెహ్రూ. ఆయనకున్న ప్రజాకర్షణను యెవరూ సవాలు చేయలేరు. తనను నెహ్రూకి అనుసంధానం

చేసుకుంటే, సదాశివంకు వ్యక్తిగత ప్రయోజనాలు వొనగూడేవి. ఆ పని చేయటం అతనికి సులభమే. యమ్మెస్ అంటే నెహ్రూకి ఎంతో అభిమానం. కానీ ఆ ఆలోచన ఎన్నడూ సదాశివం మనసులోకి రాలేదు. రాజాజీకి విధేయుడుగా వుండటం నుంచి అతనిని మరల్చగలిగినది లేదు. స్వతంత్ర పార్టీ రథం కదులుతున్నపుడు, తన బాధ్యత ఎటు వైపున్నదో తెలుసుకోటానికి అతనికి మేథోపరమైన చర్చలు గానీ, తన స్వీయ ప్రయోజనాల లెక్కింపులుగానీ అవసరం లేదు. అతను పూర్తిగా రాజాజీతోనే తన అస్తిత్వాన్ని ముడివేసుకోవటంతో, స్వతంత్రపార్టీ జగన్నాధ రధానికి యిరుసులాంటి వాడయ్యాడు. ఆయన ఎక్కడంటే అక్కడ కనిపించేవాడు; సందర్శకులకు స్వాగతం పలుకుతూ, వారిని కాపరిలా కాచుకుంటూ; రాజాజీ ప్రతి అవసరాన్నీ కనిపెట్టివుంటూ; వంటిల్లు ఎప్పుడూ నిండుగా వుండేలా చూసుకుంటూ; అతిథుల గదులు నిత్యం కళకళలాడేలా చేస్తూ, ఆయన ప్రతిచోటా ప్రత్యక్షమయ్యేవాడు. కల్కిగార్డెన్ 1960 వ దశాబ్దపు రాజకీయాలలోకి, స్వతంత్రపార్టీ చరిత్రలో తనను తాను భాగం చేసుకుంది. సదాశివంకు అది విరామమెరుగని గార్డెన్ పార్టీ.

యమ్మెస్‌కు ఈ జరిగేవన్నీ పూర్తిగా గందరగోళంగా కనిపించేవి. ఆమె రాజకీయాలకు అతీతంగా వుండటంలో కూడ అందం వుంది. ఏవో పెద్ద సంఘనటలు జరుగుతున్నాయనీ, ప్రపంచమంతటినుంచీ ప్రముఖ వ్యక్తులు కల్కి గార్డెన్స్‌కు వస్తున్నారనీ, చాలా ముఖ్యమైన సమావేశాలు జరుగుతున్నాయనీ ఆమెకు తెలుసు. ఆమె భోజనాల గదిలోనే వాళ్ళు మధ్యాహ్న భోజనాలు, ఫలహారాలు తినేవారు. ప్రతివాళ్ళూ జవహర్‌లాల్ నెహ్రూ గురించి చెడ్డగా మాట్లాడటం ఆమెకు చిక్కు ప్రశ్న అయింది. ఆమెకు తెలిసినంత వరకూ, నెహ్రూ ప్రజలందరిచేతా ఆరాధించబడేవాడు, తనను యిష్టపడతాడు, ప్రధానమంత్రిగా ప్రపంచమంతా ఆయనను గౌరవిస్తోంది. ఐనప్పటికీ యిక్కడికి వచ్చే వారంతా తనెంతో గౌరవించే రాజాజీతో సహా ఆయన మీద చాలా తీవ్రమైన భాషలో దాడి చేస్తున్నారు. ఎడతెగకుండా సాగే ఆ కమిటీ మీటింగులు గమనించాక, రాజాజీ నిర్వహించే పత్రికా విలేఖరుల సమావేశాలు చూశాక, ఆమె స్నేహితులతో గుసగుసగా: "వీళ్ళందరూ తగాదాపడుతున్నారు. ఇదంతా యెక్కడికి దారి తీస్తుందో" అని చెప్పేది.

ఆమెకు తెలియదు గానీ, యమ్మెస్ అక్కడ వుండటమే కల్కి గార్డెన్స్‌కి గొప్ప విలువ. 1960 లలో యింత ఒడిదుడుకులలో కూడా ఆమె స్వదేశీ కచేరీలు ఆగలేదు. వాటికి అవాంతరాలు లేవు. ఈ కాలంలో కొన్ని విదేశీ ప్రయాణాలు కూడా జరిగాయి. స్వదేశంలోనైనా, విదేశంలోనైనా ఆమె యెప్పుడూ వెలుగులోనే వుండేది. అక్కడికి వచ్చే రాజకీయ నాయకులకూ, పారిశ్రామిక వేత్తలకూ ఒకే విధంగా, కల్కి గార్డెన్స్ ఎంతగా రాజాజీ యిల్లో, అంతగా యమ్మెస్ యిల్లు కూడా! ఆమెను కలవటం, ఆమెతో ఓ గ్లాసు కాఫీ తాగటం, ఒకటో రెండో పాటలు కూడా వినటం అనేది వాళ్ళకు స్వతంత్ర పార్టీ

మేధోనిధులతో కలిసి చర్చించే లక్ష్యం వలే విలువైనవి. యమ్మెస్‌ను కల్కి గార్డెన్స్‌ని నడిపే శక్తిగా ప్రపంచానికి చూపటంలో వాళ్ళకు లోపల ఒక రాజకీయ ప్రయోజనం కూడా వుంది. నెహ్రూ యమ్మెస్‌కి వ్యతిరేకంగా నిలబడే పరిస్థితి తెచ్చుకోడు, దానివల్ల రాజాజీకి, స్వతంత్ర పార్టీకీ లాభమే. ఇదంతా రాజకీయమైన పిచ్చి మాటలవలే కనిపించినా, తనకు నలభైయేళ్ళ వయసు వచ్చేసరికి యమ్మెస్ ఎంతటి ప్రాముఖ్యాన్ని సంపాదించుకున్నదో మనం కొంత తెలుసుకోవచ్చు.

ఆ సమయానికి రాజాజీ యెంతగా సదాశివం మీద ఆధారపడుతున్నాడో అందరికీ స్పష్టమే. ఆయన తలపెట్టిన అనేక కార్యక్రమాలు కల్కి గార్డెన్స్ వ్యవస్థ సహకరించకపోతే సాధ్యమయ్యేవికావు. సదాశివం, యమ్మెస్‌లు ఎటువంటివారంటే వారి ధీరత్వాన్ని, నిబద్ధతనూ ఆయన నిస్సందేహంగా తీసుకోవచ్చు. వారినుంచి ఆయన అందుకున్న అతి విలువైన సేవ, సమాచార మాధ్యమాలనూ, ప్రచారాన్ని నిర్వహించటం. వ్యతిరేక వాతావరణంలో తన కాళ్ళపై తాను నిలబడాలనుకుంటున్న కొత్త పార్టీకి కీలకమైన ప్రాధాన్యతగల అంశాలవి. కల్కి పత్రిక చాలా మంచి వేదికే గానీ సంపాదకుడైన కృష్ణమూర్తి 1954లో చనిపోవటంతో దాని ఆత్మ శక్తినది కోల్పోయింది. యాభయ్యవ దశకం రెండవ భాగంలో, అరవయ్యవ దశకంలో స్వరాజ్య అనే ఆంగ్ల వారపత్రిక రాజాజీ జీవనాడి అయింది. ప్రజలనూ, అతనినీ, అతని పార్టీని కలపగలిగింది. ఆ పత్రిక ప్రచురణ సదాశివం ఆర్థిక సహకారం వల్లే సాధ్యపడింది.

ఆ కాలంలో చాలా సమర్థుడైన పత్రికా విలేఖరి, ఖాసా సుబ్బారావు స్వరాజ్య పత్రికను స్వంతంగా ప్రారంభించాడు గానీ అతని ఆరోగ్యం సహకరించలేదు. 1930లో సత్యాగ్రహం చేసినపుడు పోలీసులు విపరీతంగా కొట్టారు. ఆ సంఘటన హౌస్ ఆఫ్ కామన్స్‌లో చర్చకు వచ్చింది. బ్రిటీష్ తరహా మానవ హక్కుల వారి తరఫున బ్రిటీష్ ప్రభుత్వం బ్రిటీష్ తరహా చర్యను చేపట్టింది: భవిష్యత్తులో సత్యాగ్రహులను కొట్టబోయే లాఠీలకు చివరన లోహపు బుడిపెలుండకూడదని వారు ఆదేశించారు. సుబ్బారావు అరవయ్యవ పడిలో ప్రవేశిస్తాడనగా ఆరోగ్యపరమైన సమస్యలు చాలా వచ్చి పక్షవాతంగా పరిణమించింది. సుబ్బారావు రోజుకి ఒకటి రెండు గంటలకంటే పనిచేయటం అసాధ్యమైంది. అతని కంటిచూపు కూడా బాగా తగ్గి చదవలేకపోయాడు. 'స్వరాజ్య' పత్రికను మూసివేయాలను కున్నాడు. కానీ మూయవద్దని రాజాజీ పట్టుబట్టి, తానే సంపాదకత్వ బాధ్యతను తీసేసుకున్నాడు. కల్కి గార్డెన్స్‌లో సదాశివం సుబ్బారావు కోసం కొత్త కాటేజీని కట్టించాడు. దాంతో అతనికి అత్యవసరమైన సహాయం అందుబాటులోకి వచ్చింది. కానీ లాఠీల దీర్ఘకాల ఫలితం చివరకు సమస్యను పరిష్కరించింది. ఖాసా సుబ్బారావు 1961లో తన అరవై ఐదవ యేట మరణించాడు. అప్పటికి స్వతంత్ర పార్టీ పెట్టి రెండేళ్ళు మాత్రమే గడిచాయి. స్నేహితుడి మరణం రాజాజీ ఆశయానికి ఆ కీలక

సమయంలో తీరని నష్టాన్ని కలిగించింది. ఐనప్పటికీ సదాశివం దంపతులు 'స్వరాజ్య' పత్రిక ప్రచురించబడుతుందని హామీ ఇచ్చారు.

రాజాజీ స్వతంత్ర పార్టీ జెండా ఎత్తుగా ఎగిరినంత కాలం 'స్వరాజ్య' పత్రిక బాగా నడిచింది. సార్వత్రిక ఎన్నికలలో స్వతంత్ర పార్టీ ఓటమి, ఆ తర్వాత 1972 లో రాజాజీ మరణంతో కల్కి గార్డెన్స్ మీద నెమ్మదిగా సంధ్య చీకట్లు ముసురుకోవటం మొదలయింది. కల్కి కృష్ణమూర్తి, ఖాసా సుబ్బారావులు చనిపోవటంతో సాహితీ – పత్రికా రచనల కాంతి తగ్గిపోయింది. రాజాజీ మృతితో రాజకీయ ప్రాధాన్యతనూ కోల్పోయింది. యమ్మెస్ ఒకే ఒక్క ఆకర్షణగా మిగిలింది. కానీ వెళ్ళిపోయిన సాహితీ రాజకీయ దిగ్గంతులకు యమ్మెస్ పూర్తిగా భిన్నం. నిజానికి సదాశివం దంపతులకు వారి జీవనశైలే మారిపోయింది. రాజాజీ లేకపోవటంతో వారు లేనట్లయ్యారు. ప్రత్యేకంగా సదాశివం అనాధ అయ్యాడు. రాజాజీ మరణించినపుడు సదాశివంకు డెబ్భయ్యేళ్లు. ఆ వయసులో తన పక్కనే ఉండటానికి అలవాటుపడిన అంత గొప్ప వ్యక్తి యొక్క ఋషిత్వపు అధికారం లేకుండా జీవితాన్ని గడపటం అంత సులభమేమీ కాదు. తన గురువుగా సదాశివంకు యింకా కంచి పరమాచార్య ఉన్నాడు గానీ రాజాజీ స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు. రాజాజీ మరణించిన తర్వాత సదాశివం యిక మునుపటి సదాశివం కాదు.

❖ ❖ ❖ ❖

ఈ మార్పుల వల్ల వచ్చిన ఘోర పర్యవసానాలు కల్కి వ్యవహారాలలో మనకు కనిపిస్తాయి. కల్కి గార్డెన్స్ యొక్క సంపన్నతను సమృద్ధిని నిలిపి వుంచిన ఆ పత్రిక స్వతంత్రపార్టీ కోట బలంగా వున్నప్పుడే అస్థిరతతో ఒరిగిపోటం మొదలయింది. చాలామంది పరిశీలకులు సదాశివంకు గ్రహాలు అనుకూలించక శనిదశ వల్ల సంపదలన్నీ తరిగిపోతున్నాయన్నారు. అదేకాక కొన్ని లౌకిక వ్యవహారాలు కూడా ఆయనకు వ్యతిరేకంగా పని చేశాయి.

ఆ పత్రికను స్వతంత్రం రాకముందటి కాలంలో కృష్ణమూర్తి ఎలా రూపొందించాడో ఆ రూపంలోనే కొనసాగుతోంది. పాఠకుల అభిరుచులు, ప్రాధాన్యతలు మారుతున్నాయి. ఈ కొత్త ధోరణులను ప్రతిబింబించటంలో కల్కి పత్రిక విఫలమైంది. 1946 లో దీనికి పోటీగా "కుముదం" అనే తమిళ పత్రిక ప్రారంభమైంది. ఈ కొత్త పత్రిక సరికొత్త మార్కెట్ ధోరణులను టెలిస్కోపులో పరిశీలించి కనుగొంటూ, పత్రికలోని విషయాలను, శైలినీ ప్రజాభిరుచులకు అనుగుణంగా మార్చుకుంటూ వచ్చింది. కుముదం పత్రికకు ప్రజాదరణ క్రమంగా పెరుగుతూ పోతున్న సమయంలోనే కృష్ణమూర్తి మరణించాడు. సంపాదకత్వ బాధ్యతను సదాశివం తీసుకున్నాడు. ఐతే సదాశివం అనుభవం అంతా, అప్పటివరకూ కార్యనిర్వహణ, ప్రజా సంబంధాల విభాగంలోనే కావటంతో, సదాశివం సంపాదకుడిగా కృష్ణమూర్తి దరిదాపులకు కూడా రాలేకపోయాడు. ఆయన సహజంగానే

సలహాల కోసం, మార్గదర్శకత్వం కోసం రాజాజీ వైపు చూశాడు. రాజాజీ ప్రత్యక్ష ప్రభావం కింద ఆ పత్రిక తిరుగులేని మితవాద పత్రికై కూర్చుంది. సదాశివం తన గురువు గారిని బాగానే సేవించాడు గానీ, ఆయన పాఠకులకు అదేమీ రుచించలేదు.

కల్కి పత్రిక పతనానికి కల్కి గార్డెన్స్‌నూ, అందులోని విశిష్ట వ్యక్తులనూ పోషించటం కోసం, ముందూ వెనకా చూసుకోకుండా చేయవలసిన ఖర్చుల నేపథ్యం కూడా కారణమైంది. చాలా త్వరలోనే ఆ కంపెనీకి బోనస్‌లను చెల్లించటంలో జాప్యం జరిగింది. సంవత్సరాంతపు జీతాలు కూడా ఆలస్యంగా యివ్వాల్సిన పరిస్థితులొచ్చాయి. ప్రెస్ కార్మికులు గొడవ చేస్తున్నారు. ప్రెస్ కార్మికులు స్వతంత్ర పార్టీ వైభవపు రోజుల్నీ చూసి వున్నారు గాబట్టి, కంపెనీ ఆర్థికంగా పెద్ద చిక్కుల్లో పడిందంటే నమ్మలేకపోయారు. కార్మికుల నుంచి వచ్చే సమస్యలు చేయిదాటి పోతున్నాయి. సదాశివం దానిని వ్యక్తిగతంగా తీసుకుని కోపంతో స్పందించాడు. మామూలుగా చూస్తే ఆయన కార్మికులతో వుదారంగానే వ్యవహరిస్తాడు. కొన్నిసార్లు వాళ్ళలో చాలామందికి ప్రత్యేకంగా జీతాలు పెంచటం, బహుమతుల్విటం చేస్తుంటాడు. తను సమస్యలలో చిక్కుకున్నప్పుడు వాళ్ళు తనను విమర్శించటం, సందేహించటం సదాశివంకు కృతఘ్నతగా అనిపించింది. ఆయన కోపం వల్ల పరిస్థితి మరింత క్షీణించింది.

ఆ రోజుల్లో యిదంతా చూసినవారు తర్వాత ఆ పరిస్థితులను గుర్తు తెచ్చుకుంటూ, తర్వాత జరిగిన పతనాన్ని సదాశివం నేర్పుగా ఓర్పుగా వ్యవహరించి వుంటే ఆపగలిగేవాడని అంటారు. సదాశివం తన ఆశయాలకు అంకితమైన పద్ధతి, ఆయన బలమైన వ్యక్తిత్వం, వీటిని మెచ్చుకునేవారు చాలామంది వున్నట్టే, ఆయన ముక్కుసూటి స్వభావం, కోపంతో మండిపడే ధోరణి, ప్రశ్నలను సహించలేని అతని సాధారణ ఆధిపత్య ధోరణి, వీటన్నిటి గురించి బాధపడేవారూ అనేకమంది వున్నారు. అతను కొందరిపట్ల చాలామంచిగాను కొందరిపట్ల దురుసుగానూ వ్యవహరిస్తాడు. మద్రాసు మ్యూజిక్ అకాడమీ పూర్వ కార్యదర్శి టి.యస్. పార్థసారథి దానిని వివరంగా చిత్రించాడు : “అతనికి నువ్వు అవసరమైనంత కాలం, అతను అందంగా, చిరునవ్వులను ఒలికిస్తూ వుంటాడు. ఒకసారి పని పూర్తయిదంటే, అతను నిన్ను కత్తిరించి అవతల పారేస్తాడు. అలాంటి అందాన్ని పుచ్చుకునే స్థితిలో వుండటమేమీ ఆనందదాయకం కాదు గదా.”

వినయంగా వుండాల్సిన సమయంలో అహంభావంతో వుండటం, అందరినీ కలుపుకుపోవాల్సినపుడు అందరిమీదా పెత్తనం చేయబోవటం సదాశివం స్వభావమనటంలో సందేహం లేదు. 1977లో యూనియన్ సమస్యలు పతాక స్థాయికి చేరి పేలటానికి సిద్ధంగా వున్నాయి. అప్పటికి రాజాజీ మరణించి ఐదేళ్ళయింది. అతను కొన్ని ఆస్తులను సంపాదించటం, మార్కెట్‌లో మంచి పరపతి వుండటం, వీటితో ఆ పరిస్థితి నుంచి తనను కాపాడుకోవటానికి కొన్ని అవకాశాలున్నాయి. కానీ అతను యెంచుకోకూడని దారిని

యెంచుకున్నాడు. అది కల్కిని మూసెయ్యటం. అతను ధర్మాగ్రహం చూపే పద్ధతిలో బిగుసుకుపోయి, ప్రతీకారం తీర్చుకుంటున్నట్లు తెలియజేసే చర్యలను చేపట్టాడు. కల్కి ప్రచురణను నిలిపివేస్తున్నానని ప్రకటించిన తర్వాత, ఆయన కల్కి గార్డెన్స్‌ని అమ్మేశాడు. తర్వాత కార్మికులు అడిగినదానికంటే రెట్టింపు మొత్తాలను చెల్లించాడు. తర్వాత అతను అమరజీవి పీఠాన్ని అధిష్టించి, భార్యను కూడా అలాగే చేయమన్నాడు. తనకూ, యమ్మెస్‌కు అనేక చోట్ల నుంచి రావలసిన పెద్ద మొత్తాలను నిరాకరిస్తూ సంతకాలు చేసేశాడు. కల్కి గార్డెన్స్‌లో విలాస జీవితం నుంచి, సదాశివం, యమ్మెస్ చిన్న చౌక అద్దె యింట్లోకి మారారు. యమ్.యస్. సుబ్బులక్ష్మి యింకెన్నడూ డబ్బుకోసం పాడదనే బహిరంగ ప్రకటన చేశాడు. ఆ తర్వాత వాళ్ళిద్దరూ 20 కచేరీలు చేస్తూ 45 రోజులు అమెరికాలో పర్యటించటానికి వెళ్ళారు.

సదాశివం కోపంతో ఈ పనులన్నీ చేస్తున్నాడనేది స్పష్టమే. కానీ తన ప్రవర్తనకు అతనికి తగిన కారణాలున్నాయి. ఒకవైపు తనకు డబ్బు అనేది ముఖ్యం కాదని చూపించదల్చుకున్నాడు. కల్కి గార్డెన్స్ భవనంలో యెంత ఆనందంగా జీవించాడో చిన్న అద్దె యింట్లో కూడా అంతే ఆనందంగా జీవించగలనని చూపదల్చుకున్నాడు. ఇంకోవైపు వాళ్ళడిగిన దానికంటే ఎక్కువ మొత్తం చెల్లించి కార్మికులు సిగ్గుపడేలా చేయాలనుకున్నాడు. దాని ద్వారా తమనిన్నాళ్ళు పోషించి రక్షించిన ఒక మంచి మనిషిని బాధపెట్టామే అని వాళ్ళు విచారించేలా చేయాలనుకున్నాడు. వీటన్నిటి కంటే కల్కిని మూసివేసి, వాళ్ళకు ఉద్యోగాలు లేకుండా చెయ్యటం వల్ల వాళ్ళకు తగిన శిక్ష పడినట్లవుతుందని భావించాడు. అతనితో దగ్గరగా పనిచేసినవాళ్ళు కల్కి గార్డెన్స్‌ని అమ్మకుండా చూడాలని ప్రయత్నించారు. అప్పులు తీర్చటానికి యితర మార్గాలు వెతకొచ్చు అని వాదించారు. కానీ సదాశివం వాళ్ళ మాటలు కొట్టిపారేశాడు. "ఇద్దరు మనుషులకు యింతచోటు కావాలా?" అంటూ తీసేశాడు. వైభవమంతటితో ఆ జ్ఞాపకాలతో కల్కి గార్డెన్స్‌ని అమ్మటంలో సదాశివం వుద్దేశం తన విమర్శకులు తనను మెచ్చుకోకుండా వుండలేని పరిస్థితులలోకి నెట్టటం. వారు తమ ఓటమికి బాధపడుతూ నివ్వెరపోయేలా చేయాలనేదే సదాశివం ఆలోచనలోని కేంద్రబిందువు.

వాళ్ళు నివ్వెరపోయేలా చేశాడు. తన యూనియన్‌లోని వ్యతిరేకులను మాత్రమే కాదు. మద్రాసంతటినీ, అంతకుముందటి స్వతంత్రపార్టీ పరివారాన్నీ, కర్ణాటక సంగీత ప్రపంచాన్ని – వీళ్ళెవరూ కల్కి గార్డెన్స్ అలా మాయమైపోతుందంటే నమ్మలేకపోయారు. 2 లక్షల రూపాయలు పెట్టి కొన్న ఆ ఆస్తి 1977లో 16 లక్షల రూపాయలకు అమ్మేశాడు. అది మంచి లాభంతో కూడిన మొత్తంలాగే కనిపించేది. కానీ రెండేళ్ళలో ఆ ఆస్తి విలువ రెండు కోట్లయింది. సదాశివం నుండి కల్కి గార్డెన్స్‌ని కొనుక్కున్న మహర్షి మహేష్ యోగి వ్యవస్థ, ఆ ఆవరణనుంచి జర్నలిజాన్ని, రాజకీయాలను, సంగీత వైభవాన్నీ

నామరూపాలు లేకుండా తీసేశారు. అది మహర్షి విద్యామందిర్‌గా, జూనియర్ కాలేజీగా మారింది. ఆ ప్రదేశం యిప్పుడు యిరుకైన వ్యాపార కేంద్రంగా, పి.డబ్ల్యూడి భవన శైలి నిర్మాణాలతో కనపడుతుంది. కాటేజ్‌లలో మిగిలినవి ఒక మూలగా, ఆ ఎస్టేటు గతాన్ని గుర్తుచేస్తూ సర్దుకుని కనిపిస్తాయి. కల్కి పత్రిక రెండేళ్ళ తర్వాత పునర్జీవితాన్ని పొందింది. కానీ సదాశివం హృదయం అందులో లేదు. ఆరు నెలల తర్వాత అతనక్కడనుంచి తప్పుకుని కొత్తతరం ఆ బాధ్యతలను తీసుకోవాలని చెప్పాడు. కల్కి కృష్ణమూర్తి కొడుకు, సదాశివం రెండవ కుమార్తె విజయ భర్త అయిన రాజేంద్రన్ ఆ కంపెనీని నడపటం ప్రారంభించాడు.

❖ ❖ ❖ ❖

కల్కి గార్డెన్స్ తర్వాత సదాశివం దంపతుల జీవన సరళిలో హఠాత్తుగా వచ్చిన పెద్ద మార్పులు, మామూలుగా అయితే వారిమీద చాలా ప్రభావాన్ని చూపి వుండాలి. కానీ సదాశివం, యమ్మెస్ మామూలు మనుషులు కాదు. ముప్ఫై సంవత్సరాలు తాము జీవించిన యింటికి వీడ్కోలు పలికిన తర్వాత, వెంటనే అమెరికా ప్రయాణంలో ఎక్కువ కాలం గడపటం వల్ల వాళ్ళు కాస్త వెసులుబాటుని పొందివుండవచ్చు. కానీ నిజమైన ప్రశాంతత, కుదురు వాళ్ళ మనసుల్లోనే వుంది. తన దగ్గర పని చేసిన ఉద్యోగులే తనను తక్కువ చేశారనే భావం, సదాశివం గట్టిగా నిలబడటానికి, మిగిలినవారందరికీ తాను వ్యక్తిగత అసౌకర్యాలను లక్ష్య పెట్టేవాడిని కానని నిరూపించటానికి కావలసిన, అవసరమైన మానసిక స్థైర్యాన్ని, నిర్ణయాత్మక శక్తినీ యిచ్చింది. యమ్మెస్‌కు, ఆమెకు సహజమైన అమాయకత్వపు గూడు రక్షణగా వుంది. ఎందులోనూ జోక్యం చేసుకోని ఆమె తత్త్వం ఆమెను రక్షించింది. కల్కి గార్డెన్ వైభవం ఎన్నడూ ఆమె కళ్ళను మిరుమిట్లు గొలపలేదు. అది మాయమైపోయినపుడు ఆ విషయమూ ఆమెను తాకలేదు. మొత్తం మీద అన్నిటినీ కలిపి చూస్తే, ఆ రాజకీయ విబేధాల వల్ల నిత్యం జరిగే వాదోపవాదాల నుంచి ఆమె బైటపడింది. ఆ మొత్తం వాతావరణాన్ని ఆవరించిన ఆ రాజకీయ ఆందోళన చివరికి ముగిసిపోయి, శాంతి నెలకొన్నది. కల్కి గార్డెన్స్ పార్టీ సంవత్సరాలు గడిచిపోయినందుకు ఆనందించటానికి ఆమెకు ఆమె కారణాలున్నాయి.

ఐతే వాస్తవం అలాగే వుంది. సంగీత సామ్రాజ్ఞి, ధార్మిక ఆశయాలను సంస్థలను దేవతలా ఆదుకునే తల్లి అయిన యమ్.యస్. సుబ్బులక్ష్మికి తనదంటూ ఇల్లు లేదు. ఈ పరిస్థితి అందరికీ యిబ్బందిగానే వుంది. ఎందుకంటే అప్పటికే ఆమె చాలా కీర్తి సంపాదించిన సెలబ్రిటీ. జాతీయ అవార్డుల మొదటి జాబితాలోనే ఆమె పేరు వుంది. 1954లోనే పద్మ భూషణ్ అవార్డుని అందుకుంది. 1956లో రాష్ట్రపతి అవార్డును, 1974లో సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్‌ను పొందింది. ఆ మార్గంలోనే ఆమెకు వివిధ యూనివర్సిటీలు గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేశాయి. రబీంద్ర భారతి యూనివర్సిటీ (1967) శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ (1971) ఢిల్లీ యూనివర్సిటీ (1973) లు తమను

తాము గౌరవించుకున్నాయి. 1974లో అత్యున్నతమైన రామన్‌మెగసేస్ అవార్డు ఆమెకు లభించింది. ఇలాంటి ఉన్నతమైన అవార్డులు రావటం, ఆమె ప్రఖ్యాత 'పబ్లిక్ ఫిగర్' అవటం– వీటితో భారత ప్రభుత్వం గానీ, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వంగానీ ఆమెను పట్టించుకోకుండా వుండటం కుదరదు. ఢిల్లీలోనూ, మద్రాసులో ప్రభుత్వాధి నాయకులు సదాశివం దంపతులు చేసిన సేవలకు గాను వారికొక ఇంటిని యిద్దామనుకున్నారు. సదాశివం ఈ ఆలోచనకు అంగీకరించలేదు. ఆయన సహజ ధోరణిలో జీవితంలో తానెప్పుడూ పదిమందికి పెట్టే స్థితిలోనే వున్నాననీ, చేయిసాచి తీసుకునే స్థితిలో లేనని ప్రకటించాడు. పేరున్న కొందరు నాయకులు ప్రభుత్వం కల్కి గార్డెన్స్‌ని కొని సదాశివం దంపతులకు కానుకగా యివ్వాలని సలహా యిచ్చారు. ఈ ఆలోచన సమర్థించుకోటానికి కష్టమయ్యేంత గొప్ప ఆలోచన గాబట్టి ప్రభుత్వాధికారులు దాని జోలికి పోలేదు. ముఖ్యంగా ఆ ఆస్తిని అమ్మేయటానికి కారణమైన కార్మిక సమస్యలు ముందే అడ్డుగా వున్నాయి. దాంతో ఆ ఆలోచన అక్కడే ఆగిపోయింది.

యమ్మెస్, సదాశివం తమ మార్గాలేవో తాము చూసుకోవటం, ప్రభుత్వాల నుంచి లబ్ధి పొందకపోవటం వల్ల మంచే జరిగింది. ఈ పరిస్థితి వల్ల వాళ్ళకొక గౌరవనీయ హోదా వచ్చింది. అలాంటి గౌరవాన్ని చాలామంది సులభంగా పోగొట్టుకున్నారు. యమ్మెస్ సిద్ధేశ్వరీ దేవి నుంచి చాలా కృతులను నేర్చుకుంది. ఆ సిద్ధేశ్వరీ దేవికి భారత ప్రభుత్వం ఒకసారి ఇంటిని యిచ్చింది. ఒకసారి సిద్ధేశ్వరి బొంబాయిలో కేసర్ బాయ్ కేల్కర్ అనే గొప్ప సంగీత విద్వాంసురాలిని చూసేందుకు వెళ్తే ఆమె చాలా వ్యంగ్యంగా యిలా అన్నది : "ఓ, సిద్ధేశ్వరీ నువ్వు కూడా ఒక దుకాణదారుని స్థితికి దిగజారి, ఢిల్లీలో దుకాణం తెరిచి, ప్రభుత్వ సేవకురాలివయ్యావా?" యమ్మెస్ యెన్నడూ దుకాణదారు కాలేదు. ఆమె, సదాశివం మద్రాసులోని కొట్టూర్‌పురంలోని ఇంటికి మారిపోయారు. ఆ ప్రాంతం నగరంలో ఉన్నతశ్రేణి పౌరులుండే ప్రాంతం. కానీ ఆ యిల్లు అందరూ గుర్తించేంత నిరాడంబరమైనది. ఆ ఇంటికి శివమ్ – శుభమ్ అని పేరు పెట్టారు. సదాశివం, సుబ్బులక్ష్మిల కలయికను గుర్తుచేస్తున్న పేరది. ఈ ఆలోచన ప్రజా సంస్కృతిలోకి చొచ్చుకుపోయి, దర్శకుడు మణిరత్నం, సుహాసినీలు తమ ఇంటికి మణి–హాసిని అని పేరు పెట్టుకున్నారు. తోటలేని, చిన్న గదుల ఇల్లు శివం – శుభంను కల్కి గార్డెన్స్‌లోని పెద్ద యింటితో పోల్చలేము. కానీ యిది ఇల్లు. యమ్మెస్ ఆత్మస్థైర్యంతో ఆ యింటిలో చక్కగా యిమిడిపోయింది.

❖ ❖ ❖ ❖

ఆమె కళే యమ్మెస్‌కు, ప్రశాంతమైన, తేజోవంతమైన వర్చస్సును అన్ని వేళలలోనూ యిచ్చింది. ఆమెకు సంగీతం యెలాంటి అవరోధాలూ లేని నిరంతర వ్యాపకమైంది, దాంతో ఆమెను బైటి వొత్తిడిలు తాకలేకపోయాయి. వారి కుటుంబ మిత్రుడైన హెచ్.వై. సదాశివ ప్రసాద్ (ఇందిరాగాంధీ సమాచార సలహాదారు) ఒకసారి రాసిన దాని ప్రకారం

ఆమె ఎప్పుడూ నేర్చుకునే దృష్టితోనే వుండేది. ఎప్పుడు కొత్తగా నేర్చుకోవలసింది కనిపించినా, ఎవరి దగ్గరనుంచి దానిని నేర్చుకోవాలో ఆ వ్యక్తిని వెతికేది. సంగీతం ఆమెకు వృత్తి కాదు. జీవన విధానం. అమెరికాలో ఆరువారాల ప్రయాణం, ప్రతిచోటా ఆమెకు దొరికిన ప్రశంసల కరతాళధ్వనులూ, వీటితో సంగీతం మళ్ళీ తమ జీవితమయిందనీ తను జీవించాలనుకున్నట్టు జీవించగలననీ ఆమె గ్రహించింది. అన్వేషకురాలికి తానన్వేషించేది దొరికింది.

చుట్టూ వాతావరణాన్ని అవగాహన చేసుకోవటంలో యమ్మెస్‌కు, సదాశివంకూ కొట్టొచ్చినట్టు కనిపించే తేడా వుంది. కచేరీ జరిగే వేదిక, సదాశివంకు చాలా ముఖ్యం. దానితోపాటు శ్రోతల స్వభావం, ఆ కచేరీ జరిగే సందర్భం కూడా ముఖ్యమే. ఆ సభా ప్రాంగణానికి తగినట్లుగా కచేరీని స్వరపచాలని ఆయన నమ్మేవాడు. యమ్మెస్‌కి శ్రోతలందరూ ఒకటే. సందర్భాలన్నీ ఒకటే. సంగీతమొకటే వాస్తవసారం. ఆ సంగీతంలో ఉత్తమమైనదానిని తాను అందించాలి. దానికి శ్రోతలు తమిళనాడు మారుమూలనున్న గ్రామీణులైనా యునైటెడ్ నేషన్స్ వంటి నాగరీకులైనా ఆమె ఉత్తమ సంగీతాన్నే అందించాలి. ఒక శ్రోతలకు గొప్ప స్థాయి సంగీతాన్ని అందించి, మరొక విధమైన శ్రోతలకు ఏదో ఒకటిలే అనిపించే సంగీతాన్ని యివ్వకూడదు. పాడటం ఆమె ఉనికి. సంగీతం ఆమె యెంచుకున్నది, ఆమె ఆనందం, ఆమె హృదయ వేదన, ఆమె అన్వేషణ. సంగీతం కొరకైన ఆమె దాహం నిరంతరం. తన తరంలోని సంగీతకారులందరి కంటే యమ్మెస్, తనకాలపు మహకవులు చర్చకు తెచ్చిన ఆదర్శాంశాలకు అతి దగ్గరగా వచ్చింది. 'మాతృభూమి' వారపత్రికలో (3 మే 1970) ప్రచురితమైన ముఖాముఖి ఇంటర్వ్యూలో మహాకవి అక్కితం అచ్యుతన్ నంబూదిరి, మహాకవి పి. కుంజరీమనే నాయర్‌ను, "కవిత్వం రాయటంలో ఆనందం వుందా" అని అడిగాడు. పి.కె. నాయర్ యిలా సమాధానమిచ్చాడు. "నేనీ ప్రశ్నను తరచుగా ఒక గులాబీ మొగ్గనుద్దేశించి అడుగుతుంటాను. వసంతకాలంలో కోకిలను అడుగుతుంటాను. పున్నమినాడు వెన్నెల వెల్లువలో పొంగుతున్న సముద్రాన్నడుగు తుంటాను. ఇలా వికసించటంలో ఆనందం వుందా? ఆ తీయటి పాటలో సర్వాన్ని మర్చిపోవటంలో ఆనందం వుందా? ప్రేమ తరంగాల మీద వువ్వెత్తున యెగసిపడటంలో ఆనందం వుందా? వారిచ్చిన సమాధానాన్ని మీకు చెబుతాను: "ఇది ఆనందం! ఇదే ఆనందం! ఈ ఆనందాన్ని సాధించటానికి పడే బాధ కూడా ఆనందమే."

# 12. సదాశివం ఘరానా

*ఆదయశ్రీ రఘువర! నేడేల - రాదయ? ఓ దయాంబుధీ ॥*
*మోదముతో సద్భక్తి మర్మమును - బోధనజేసి సదా బ్రోచిననీ ॥*
*నిన్ను తిట్టి కొట్టి హింసబెట్టిన-దన్నియు నన్ననలేదా!*
*ఎన్నరాని నిందలఁ తాళమని-మన్నించగ లేదా!*
*అన్నము తాంబూలమొసగి దేహము-మిన్నఁసేయలేదా?*
*కన్నతల్లి దండ్రి మేమనుచు త్యా-గరాజునికి బరవసమీలేదా॥*

కల్కి గార్డెన్స్‌కి వీడ్కోలు పలికి వచ్చెయ్యటం వల్ల యమ్.యస్. సుబ్బులక్ష్మి సంగీత జీవితానికి చిన్న గీటు కూడా పడలేదు. ఏదైనా జరిగిందంటే అది మంచికే జరిగింది. ఇక యిప్పుడు సదాశివం, యమ్మెస్ యిద్దరూ కచేరీలకు, అవి ఏర్పాటు చేసేవారి మంచి ఆశయాలకూ ఏకాగ్రతతో శ్రద్ధాసక్తులను చూపించవచ్చు. 1977లో, కల్కి గార్డెన్స్ అమ్మినప్పుడు యమ్మెస్ భారతదేశంలో పది ధార్మిక కచేరీలు చేసింది. వాటికి వచ్చిన సొమ్మంతా అనేక రకాలైన సంస్థలకు, గ్వాలియర్‌లో రామకృష్ణాశ్రమం, మదురైలో అమెరికన్ కాలేజీ, మంగుళూరులో మర్‌కారా హాస్పిటల్, మద్రాసులో లిటిల్ సిస్టర్స్ ఆఫ్ పూర్ ఆర్గనైజేషన్ వంటివాటికి వెళ్ళింది. ఈ కార్యక్రమాల మధ్య అమెరికాకు జరిగిన విస్తృత పర్యటనలో ఆమె కచేరీలు న్యూయార్క్, పిట్స్‌బర్గ్ దేవాలయాలకు విరాళాలను వసూలుచేసి పెట్టాయి. 1979లో ఆమె మధ్యప్రదేశ్ విశ్వవిద్యాలయం నుండి, 1980 లో బెనారస్ హిందూ యూనివర్సిటీ నుండి గౌరవడాక్టరేట్‌లను అందుకుంది. ఆ తర్వాతి సంవత్సరం విశ్వభారతి యూనివర్సిటీ ఆమెకు దేశికోత్తమ అవార్డుని ప్రదానం చేసింది. 1982లో లండన్‌లోని రాయల్ ఆల్బర్ట్ హాల్‌లో ఒక గొప్ప కచేరీలో పాడింది. 1985లో పారిస్‌లో జరిగిన ఫెస్టివల్ ఆఫ్ ఇండియాలో పాడింది.

ఫ్రాన్స్ నుంచి తిరిగివచ్చిన తర్వాత యమ్మెస్, సదాశివంలు తామింక కొంత నిదానంగా పనిచేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నిర్ణయం వెనుక రెండు కారణాలున్నాయి. ఒకటి వయసు. సదాశివంకు అప్పుడు ఎనభై మూడేళ్ళు. తనకంటే పదేళ్ళు చిన్నవాళ్ళకున్నంత శక్తి ఆయనకున్నా అది పరిగెత్తి పనులు చేసే సమయం కాదు. నిజానికి ఆయన ఎనభయ్యేళపుడే విశ్రాంతి తీసుకునే ధోరణిలోకి వచ్చాడు. అది 1982 లో, రాయల్ ఆల్బర్ట్ హాల్ ప్రదర్శన జరిగినపుడు. తర్వాత మూడేళ్ళకు పారిస్ వెళ్ళటానికి ఒప్పుకున్నాడు. కారణం ఫెస్టివల్ ఆఫ్ ఇండియాలో భారతీయ సంస్కృతిని

వున్నత స్థాయిలో చూపిస్తారు గాబట్టి, అలాంటి సందర్భంలో కర్ణాటక సంగీతం నుంచి అత్యుత్తమమైనదానిని అక్కడ లేకుండా చెయ్యదల్చుకోలేదు. అప్పుడు యమ్మెస్‌కి అరవై తొమ్మిదేళ్ళు. ఆమె కూడా యెక్కువ అలసిపోకుండా వుండే అవకాశాన్ని స్వాగతించింది.

సదాశివం ఎక్కువ విశ్రాంతితో కూడిన జీవితాన్ని కోరుకోవటానికి మరొక కారణం కుటుంబ వ్యవహారాలు. సదాశివంకు మొదటి భార్య వల్ల కలిగిన యిద్దరు కూతుళ్ళనూ యమ్మెస్ స్వంత బిడ్డల్లా పెంచింది. అనేక దశాబ్దాల వైవాహిక జీవితంలో యమ్మెస్‌కు స్వంత పిల్లలు లేరు. ఆమె చెల్లెలు వడివంబాల్‌కీ పిల్లలు లేరు. ఆమె పెళ్ళయిన కొద్ది రోజులకే చనిపోయింది. యమ్మెస్ అన్న, శక్తివేలు భార్యతో కలిసి అరవయ్యాయిదేళ్ళ వరకు జీవించాడు గానీ వాళ్ళకూ పిల్లలు లేరు. ముగ్గురు తోబుట్టువులకూ సంతానం లేకపోవటం యాధృచ్ఛికం కావొచ్చు. లేదా షణ్ముగవదివు పూర్వీకుల వారసత్వ రేఖల వలనా కావచ్చు. యమ్మెస్ విషయంలో ఈ వారసత్వపు సంగతేమీలేదు. ఆమె సదాశివం కూతుళ్ళతో యెంతో అనుబంధం పెంచుకుంది. రాధ, విజయలతో వారు ఆమె కన్నకూతుళ్ళయితే యెంత ప్రేమగా వుండేదో అంత ప్రేమానురాగాన్ని కలిగివుంది. ఆ అమ్మాయిలు ఆమెను తమ కన్నతల్లి అనే అనుకున్నారు తప్ప వేరుగా ఆలోచించలేదు. ఒకసారి సంగీత నాటక అకాడమీ అధికారి నారాయణ మీనన్ రాధను యమ్మెస్ సవతికూతురని చెబితే ఆమె చాలా బాధపడింది. ఆ మాట మాటగా నిజమే గానీ, భావోద్వేగ బంధాల పరంగా నిజం కాదు. సవతి కూతురు అనే వూహే యమ్మెస్ భరించలేకపోయింది. ఆ గాయం మానటానికి చాలా కాలమే పట్టింది. యమ్మెస్‌ను తల్లిగా కీర్తించటంలో మైలాపూర్ సమాజానిది ముక్తకంఠమే.

1982 లో రాధ తీవ్రంగా జబ్బుపడినప్పుడు యమ్మెస్ కుప్పకూలినట్లయింది. రాధ పసితనం నుంచీ, వారిద్దరి మధ్యా ప్రత్యేక బంధం యేర్పడి బలపడింది. తల్లి కూతురి సంగీత నృత్య శిక్షణలను పర్యవేక్షించేది. ఆ చిన్న పిల్లను యమ్మెస్‌తో పాటు పాడమని ప్రోత్సహించేవారు. ఆ అమ్మాయి చక్కగా పాడటంతో పెద్ద కచేరీలలో యమ్మెస్‌కు సహకార గాత్రంగా వుండేది. 'శకుంతలై' సినిమాలో చిన్ని రాకుమారుడైన భరతునిగా నటించినపుడు రాధకు ఆరేళ్ళు. పదకొండేళ్ళ వయసులో ఆమె మరింత పెద్ద పాత్రలో చిన్నప్పటి మీరాగా కెమెరా ముందుకి వెళ్ళింది. విడదీయలేని తోడు, తన అభిమాన గాత్ర సహకారం అయిన రాధ రాయల్ ఆల్బర్ట్ హాల్ కచేరీలో యమ్మెస్‌తో పాటు వుంది. అప్పుడామె జబ్బుపడింది.

రాధకు చేసిన జబ్బు ట్యూబర్‌క్యులోసిస్ మెనింజిటిస్ అని తెలిసింది. ఆమె కోమాలోకి వెళ్ళి చాలా రోజుల పాటు అలాగే వుండిపోయింది. దాదాపు యెనిమిది నెలలపాటు మంచంలోనే వుంది. సదాశివం నిస్పృహ చెందాడు. ఆయనకు రాధతో ప్రత్యేకమైన అనుబంధం. మొదటి సంతానం. పోలికలు అచ్చుగుద్దినట్లు సదాశివంవే. తన కూతురి

యదార్థ స్థితిని అంగీకరించటానికి ఆయనకు కొంత సమయం పట్టింది. దానిని ఎదుర్కోటానికి సర్వసన్నద్ధుడు కావటానికీ సమయం పట్టింది. పిల్లల విషయం వచ్చేసరికి యమ్మెస్‌కు సదాశివంకు వున్నంత మానసిక బలం లేదు. ఆమెను ఓదార్చటం అసాధ్యమైంది. రాధ గదిని వొదిలి ఆమె రాలేదు. ఏమీ చెయ్యలేక, వూరికే కూతురి మంచం పక్కన కూచుని, ప్రార్థన గీతాలు పాడుతూ, ఆశపడుతూ వుండేది. రాధకు తను ముఖ్యమైన నర్సుగా వుండి ఆ అమ్మాయి ప్రతి అవసరాన్నీ తీర్చాలని చూసేది. నిజంగా, ఆమె జబ్బుపడిన కూతురికి అంతకాలం పాటు చేసిన సేవగురించి, ఆ కుటుంబం గురించి తెలిసినవారందరూ చెప్పుకునేవారు. రాధ ఎలాగైతేనేం కోలుకుంది. కానీ యెన్నటికీ మునుపటి మనిషి కాలేకపోయింది. ఆమె తీసుకున్న మందుల సైడ్ ఎఫెక్టు, ఆమెకు యిచ్చిన అదనపు పోషకాహారం కలిసి ఆమె శరీరపు బరువును పెంచి, శరీర తత్త్వాన్ని బలహీన పరిచాయి. యమ్మెస్, సదాశివంలిద్దరికీ రాధ జీవితంలో నలభై ఎనిమిదేళ్ళకే వచ్చిన మార్పు చూసిన తర్వాత, మార్పు యొక్క అనివార్యతను గుర్తించాల్సిన సమయం వచ్చిందనే ఎరుక కలిగింది.

1982 సంక్షోభం తర్వాత వాళ్ళు తమ బాధ్యతలను తగ్గించుకున్నారు. కచేరీలనుంచి క్రమంగా తప్పుకోవటంతో వాళ్ళ జీవితాలలో కూడా మార్పు వచ్చింది. అప్పటికే భక్తి సంగీతంపైన యమ్మెస్‌కున్న శ్రద్ధ క్రమంగా మరింత దైవారాధనగా మారింది. స్తోత్రాలు, ప్రార్థనలూ దేవుడిని కీర్తిస్తూ పాడటం పెరిగింది. ప్రజలు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, సాంఘిక, మత సంస్థల నాయకులు యింకెంత మాత్రమూ వారి రోజువారీ జీవితాలకు కేంద్రంగా లేరు. కుటుంబం, విశ్వాసం ఈ రెండూ కీలకమైనవయ్యాయి. వారి జీవిత సారాంశం, ఒకరి మీద ఒకరు ఆధారపడటం, వారి నైపుణ్యాలను, వనరులను ఒక జట్టుగా వారేం చేశారనేదీ, యిప్పుడు వారికెంతో నెమ్మదిని, ప్రశాంతతను యిచ్చాయి. యమ్మెస్‌ది తన అదృష్టం గురించో, కుటుంబపు అదృష్టం గురించో విశ్లేషించుకునే తత్త్వం కాదు. సదాశివంది అలాంటి తత్త్వం. ప్రతి అడుగునూ ఆచితూచి వేయటంలోని నేర్పు, నిరంతరం ప్రజలతో సంబంధాలు నెరపటంలో నమ్మకం, వీటితో ఆయన తమ జీవితపు బ్యాలెన్స్ షీట్‌ను అప్పుడప్పుడూ పరిక్షించుకుని, అక్కడ కనిపించినదానిని చూసి చాలా సంతోషపడేవాడు. ఇప్పుడిక ఆయన కాస్త నెమ్మదించవచ్చు. ఆ నెమ్మదిని భరించగలడు.

ఐనా ఆయనెప్పుడూ చూసేది సదాశివం కేంద్రంగా వున్న దృష్టికోణం నుంచి చెప్పగలిగినదానినే. ఆయనకు అతిశయోక్తులపట్ల మోజు. అది ఆయన సంస్థ నుండి క్రమం తప్పకుండా వచ్చే సాహిత్యంలోంచి పైకి వచ్చేది. ఆయననూ, ఆయన భార్యనూ పొగడ్తలతో ముంచెత్తే పదాలతో వర్ణించేవారు. యమ్మెస్ "ఇంద్రజాలం, దివ్యమైన,

గాంధర్వగానం, దేవతలిచ్చిన వరం, భారతదేశపు ఆభరణం, మనదేశపు అమూల్య సంపద, భారతీయ స్త్రీత్వానికి గర్వకారణం.” ఇలాంటి విశేషణాలు సర్వసామాన్యం సదాశివం విషయంలో, ఆయన తన గుణాలలో ముఖ్యమైనదిగా ఎత్తిచూపాలనుకునేది “ఆయన ప్రజలకు అనేక సహాయాలు దానధర్మాలు ప్రతిఫలం ఆశించకుండా చేస్తాడని” చెప్పుకోవటం. అనేక వ్యాసాల శీర్షికలుగా “సదాశివం నిస్వార్థ జీవి” “ఇద్దరు దివ్యమైన వ్యక్తులు” యిలాంటివి పెట్టేవారు.

మొత్తం మీద ఆ దంపతుల జీవితాన్ని, జీవితం కంటే పెద్దవైన ప్రతి రూపాలుగా వున్నతీకరించి, వారు సాధించుకున్న అమోఘమైన విజయాలకు చెల్లించే చిన్న మూల్యంగా సకారణంగా నిరూపించగలిగేవాడు. నిర్వాహకుడిగా, ప్రణాళికా రచయితగా సదాశివం ఘనతను ఎవరూ కాదనలేరు. భార్యమీద ఆయనకున్న విశ్వాసంతో ఎవరికీ పేచీలేదు. మొదటి రోజులనుంచీ ఆయనకు తన చురుకుదనం, ఆమె నిదానం వొకదానికొకటి వన్నెతెచ్చేవని తెలుసు. మీ భార్యలో మీరు బాగా మెచ్చుకునేదేది అని ఎప్పుడడిగినా, ఆయన సమాధానంలో ఈ రెండు పదాలలో యేదో వొకటుంటుంది. శాంతం, వినయం. ఈ రెండు గుణాలు సంగీత కళాకారిణిగా, వ్యక్తిగా ఆమె పరిపూర్ణతను చెబుతాయి. ఆమె తన సంగీతంలో సౌఖ్యాన్ని, భద్రతను కనుగొన్నది. ఈ సంతృప్తికి సదాశివం చాలా విలువ యిచ్చాడు. తన భార్య అలాగే వుండేలా సహాయపడటం తన బాధ్యతగా భావించాడు. ఆమెను రక్షించటానికి, అన్ని విధాలుగా ఆమెను అభివృద్ధిలోకి తేవటానికి ఆయనెంత దూరమైనా వెళ్ళేవాడు. ఆమె కళా గౌరవానికి ఏ చిన్న ఆటంకపు ఛాయ కనిపించినా దాని అంతు చూసేవరకూ అడ్డుకునేవాడు. ఆమెకు రావలసిన కీర్తి ప్రతిష్టలు వున్నాయనుకుంటే దానికి నిర్విరామంగా ప్రచారం చేసేవాడు.

సదాశివం శ్రద్ధను తెలియజెప్పే సంఘటనలు, వారు చురుగ్గా కచేరీలు చేసే రోజులలో ఎన్నో వున్నాయి. 1950లలో కోయంబత్తూరులోని ఒక సంపన్న కుటుంబపు వివాహ మహోత్సవంలో యమ్మెస్ కచేరీ పెట్టేందుకు సదాశివం అంగీకరించాడు. కానీ ఆ కచేరీని ఆ కుటుంబ సభ్యులు టేప్ రికార్డు చేయటానికి ఏర్పాట్లు చేసుకున్నారని గమనించగానే ఆయన కచేరీ కొనసాగాలంటే వేదిక మీద వున్న మైక్రోఫోన్లన్నింటిని తొలగించాల్సిందిగా కోరాడు. ఆ ఘరానా కుటుంబం తమ అధికారం మీదున్న నమ్మకంతో, దానిని నిరాకరించి, కచేరి జరగకపోతే పరిణామాలు తీవ్రంగా వుంటాయని సదాశివంను హెచ్చరించారు. సదాశివం ఏమాత్రం మెత్తబడకుండా, భయపడకుండా యమ్మెస్‌తో కలిసి మద్రాసు తిరిగొచ్చేశాడు. ఆ కుటుంబం నష్టపరిహారం కోరుతూ లాయర్ నోటీసు యిచ్చి సదాశివం పంపిన తిరుగు సమాధానం చూసుకుని ఆ విషయాన్ని అంతటితో వదిలేశారు. నాగపూర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కచేరీలో యమ్మెస్ పక్క వాయిద్యకారులకు చెత్త

వసతిగృహాన్ని యిచ్చారని తెలిసి సదాశివం కచేరీ హాలులోంచి లేచి వచ్చెయ్యటానికి వెనుకాడలేదు. ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా ఆ బృందం తిరుగు ప్రయాణానికి రైలెందుకోటానికి స్టేషన్‌కి చేరింది. రాష్ట్ర గవర్నర్ హడావుడిగా స్టేషన్‌కి వచ్చి తాను వ్యక్తిగతంగా బాధ్యత తీసుకుని అన్నీ చక్కబెడతానని వాగ్దానం చేశాడు. “ఆ క్షణం నుంచి గవర్నర్ మా సదుపాయాల గురించి గంటకొకసారి కనుక్కుంటూనే వున్నాడు” అని మృదంగ విద్వాంసుడు టి.కె. మూర్తి చెప్పాడు.

పురుష వాయిద్య కారులు, మహిళా గాయకులను తక్కువవారిగా తీసిపారేసే అలవాటుని చావుదెబ్బ కొట్టాడు. ఏ ప్రమాణాన్ననుసరించి చూసినా యమ్మెస్ అత్యుత్తమ గాయకురాలని వాదించి, ఆ కాలంలో అగ్రశ్రేణి వయోలిన్ విద్వాంసుడైన మైసూర్ చౌడయ్యను ఆమె కచేరీలో పక్క వాయిద్యకారునిగా వుండేలా ఒప్పించాడు. కర్ణాటక సంగీతకారుల బృందాలు యిదొక సంచలనాత్మక విజయమనీ, సదాశివం కిరీటంలో మరొక కలికితురాయి అని చెప్పుకున్నాయి. ఇంకో సందర్భంలో, వయొలిన్ వాద్య సహకారాన్ని యమ్మెస్‌కు చెంబై వైద్యనాథ భాగవతార్ అందించాడు. ఐతే అనుకున్న వయొలిన్ విద్వాంసుడు సమయానికి రాకపోవటంతో ఆయనలా చేశాడు. మద్రాసులో ప్రఖ్యాత సితార్ విద్వాంసుడు పండిట్ రవిశంకర్ కచేరీ జరుగుతున్నప్పుడు, ఆహ్వానితుల్లో పాకిస్తానీ వార్తా పత్రిక సంపాదకుడు వున్నాడని సదాశివం గమనించాడు. ఆ సంపాదకుడి పక్క సీటులో స్థానం సంపాదించాడు. కచేరీ ముగిసేలోపల, వాళ్ళిద్దరూ కలిసి అక్కడినుంచి వెళ్ళిపోయారు. ఇక ఆ సంపాదకుడు ఆ రోజు నుంచీ సదాశివం అతిథి. యమ్మెస్‌కు పాకిస్థానీ పత్రికలలో ప్రముఖస్థానం దొరికిందని వేరే చెప్పనవసరం లేదు.

యమ్మెస్‌కి అనుకూలంగా మాట్లాడటం, పనులు చేయటం, ఆమె సంగీతాన్ని మరింత ముందుకు తీసుకుపోవటంలో సదాశివం మత ప్రచారకులకేమీ తీసిపోడు. కానీ యమ్మెస్ తన జీవితంలో, పనిలో ప్రతి చిన్ని వివరంలో ఆయన ఆదేశాలను పాటించి తీరవలసిందే. సదాశివంకు తన ఆధిపత్య స్వభావం గురించీ, పాదరసంలాంటి వ్యక్తిత్వం గురించీ తన చుట్టూవారికి తెలిసినంతా తెలుసు. కానీ దానిలో తప్పుపట్టాల్సింది వుందని అతననుకోడు. ఏపనైనా మిగిలినవారికంటే తను బాగా చేస్తానని ఆయనకు తెలుసు. చాలామంది ఈ లక్షణాన్ని భరించలేకపోయేవారు. కానీ చాలాసార్లు ఆయనే విజయం సాధించాడనే వాస్తవాన్ని వారు నిరాకరించలేరు. చాలామంది ఆయన పురుషులలో ఆకర్షణీయమైన నాయకుడని అనుకుని సంతోషంగా ఆయన వలలో పడిపోతారు. యమ్మెస్ మనస్ఫూర్తిగా ఆయన మార్గదర్శకత్వాన్ని అంగీకరించింది. ఆమె స్వభావానికీ, సదాశివం డిమాండ్లకూ మధ్య ఘర్షణ లేదు. ఆమె వ్యక్తిగత జీవితపు, సంగీతపు ప్రమాణాలను నిర్ణయించి శాసించేది అతనే. భార్యాభర్తలిద్దరికీ ఒకే విధంగా యిది అత్యంత సహజమైన

విషయమైపోయింది. ఆ రోజుల్లో ఆచారం కూడా అదే. భార్య జీవితాన్ని భర్త అదుపు చేయకపోవటం అసాధారణంగా వుండే కాలం అది. మగవాళ్ళకు హక్కులు, ఆడవాళ్ళకు బాధ్యతలు వుండే కాలం అది. డి.కె. పట్టమ్మాళ్ తన ఛాందస బ్రాహ్మణ కుల సంఘాన్ని యెదిరించి వృత్తి సంగీత కళాకారిణిగా బహిరంగంగా పాడే ధైర్యం చేసింది. కానీ ఆమె తన భర్త ఆర్. ఈశ్వరన్ తయారు చేసిన తిరుగులేని జాబితా ముందు ("చేయదగినవి, చేయకూడనివి") సాగిలపడవలసిందే. ముఖ్యంగా ఆయన సినిమా వ్యతిరేకతను అంగీకరించింది. ఆమె సినిమాలు చూడటానికి థియేటర్లకు వెళ్ళటం మానేసింది యెంత యిష్టమున్నాసరే. మద్రాసులో 'మీరా' సినిమా థియెటర్లు ప్రేక్షకులతో కిక్కిరిసినప్పుడు ఆమె మనసు ఆ సినిమా చూడాలని కొట్టుకుపోయింది. ముఖ్యంగా తన తోటి సంగీత కళకారులు ఎలా నటించారో చూడాలనే కోరిక ఆమెది. కానీ ఆ సినిమా టెలివిజన్‌లో వచ్చేంతవరకూ ఆమె వేచివుండాల్సి వచ్చింది. దేవుడి దయవల్ల ఆమె యింట్లో వాళ్ళు టెలివిజన్‌ను నిషేధించలేదు.

సదాశివం సినిమాలను నిషేధించలేదు గానీ యమ్మెస్ కోసం ఆయన యితర విధి నిషేధాలను తయారు చేశాడు. యమ్మెస్ ఎలాంటి సాంఘిక జీవితాన్ని గడపాలనేదాని గురించి కఠినంగా వుండేవాడు. ఆమెకు తమ కుమార్తెల యిళ్ళకు మాత్రమే తనంతట తాను వెళ్ళగలిగే స్వేచ్ఛ వుండేది. ఆయన పక్కన లేకుండా ఏ యితర చోట్లకూ, సమావేశాలకు ఆమె వెళ్ళకూడదు. ఆయన ప్రత్యేక అనుమతి లేకుండా వారి యింటికి వెళ్ళే ఆలోచన యెవరూ చెయ్యకూడదు. ఆయన స్నేహింగా వుండే వ్యక్తులతోనే ఆమె స్నేహంగా వుండాలి. ఈ విధి నిషేధాలన్నీ సరైనవేనని, పద్ధతిగా వున్నాయనీ యమ్మెస్ అంగీకరించింది. ఇండియా టుడేలో వాసంతికిచ్చిన ఇంటర్వ్యూలో ఆమె "నేను ఒంటరిగా ఎప్పుడూ బయటికెళ్ళలేదు." "నేనెప్పుడూ చదువుకోలేదు. నేను పెద్దల మాట వింటూ పెరిగిన దానిని. పెద్దల మాట వినాలనే పెంపకంలో పెరిగినదానిని" అని చెప్పింది. సదాశివం ఆర్డర్లను పాటించటంలో కొన్నిసార్లు చిరాకు కలగలేదా అని అడిగినపుడు "ఎప్పుడూ రాలేదు. నా స్వభావం అలాంటిది. ఎలా చెప్పను? నాకు యే విషయంలోనూ ఎవరిమీద కోపం రాలేదు. రాదు." అని సమాధానం ఇచ్చింది.

సదాశివం నిషేధాజ్ఞలు మదురైలోని యమ్మెస్ కుటుంబసభ్యుల వరకూ విస్తరించాయి. వారంటే ఆయనకు బొత్తిగా యిష్టం లేదు. కల్కి గార్డెన్స్‌ను మూసివేసే కాలంలో, మదురై నుంచి యమ్మెస్ అన్న శక్తివేల్ మరణించాడని టెలిగ్రాం వస్తే, ఆ విషయం భార్యకు చెప్పటానికి సదాశివం కొంత సమయం తీసుకున్నాడు. మదురైకి వెంటనే వెళ్ళి వచ్చేద్దామనే అభ్యర్థనకు అవకాశం వుండొచ్చని వూహించి, దానిని రాకుండా చెయ్యాలనుకుని వుండొచ్చు. యమ్మెస్ తల్లి గురించి నిందాపూర్వకమైన మాటలే తరచూ ఆయన నోటివెంట

వచ్చేవి. రెండు బహిరంగ సందర్భాలలో, యమ్మెస్ తన తల్లిని స్మరించుకుంటూ ఆమెకు అంజలి ఘటించింది. ఇండియన్ ఫైన్ ఆర్ట్స్ సొసైటీ నలభై మూడవ సభలలో అధ్యక్షోపన్యాసం చేస్తూ "నా తల్లి, సంగీత గురువు అయిన శ్రీమతి షణ్ముగవడివు ఆత్మకు నేను సాష్టాంగ ప్రణామం చేస్తున్నాను." ఆ తర్వాత ఆమె తన భర్తకు, రాజాజీకి, కంచి పరమాచార్యకూ నమస్కారాలు చెప్పింది. 1998లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన భారతరత్న అవార్డు అందుకునే సమయంలో ఆమె మళ్ళీ "నా ప్రియమైన తల్లి ఆశీర్వచనాలు" అంటూ తల్లిని గుర్తుచేసుకుంది. ఆమెకు మనసులో షణ్ముగవడివు పట్ల చాలా బలమైన ప్రేమాభిమానాలున్నాయి. కానీ అవి చాలా యితర అనుభూతులవలే అణచివేసిపెట్టబడ్డాయి.

ఇక అన్ని కారణాలవల్లా యమ్మెస్ మీడియా ఇంటర్వ్యూలు కూడా నిషేధించ బడ్డాయి. ఆమె ఇంటర్వ్యూలు యిస్తే, సదాశివం పక్కన కూచుని అన్ని ప్రశ్నలకూ ఆయనే సమాధానం చెబుతాడు. వాళ్ళ జీవితాలకు సంబంధించిన అసలైన విషయమేదీ బైటకు రాకుండా జాగ్రత్తపడతాడు. ఆయన సమాధానాలన్నీ ఆమె యిచ్చిన ధార్మిక కచేరీల గురించీ, గొప్ప గొప్ప వాళ్ళంతా ఆమెని ఎలా కీర్తించారనే దాని గురించి వుంటాయి. చాలా కథలను ఆయన మళ్ళీ మళ్లీ చెబుతుంటాడు. పునరుక్తి అవుతుందని ఆలోచించడు. ఎవరైనా కొన్ని ప్రశ్నలకు ఆవిడను సమాధానం చెప్పనివ్వండని అడిగితే, ఆమె అలాంటివాటి కోసం తయారుగా లేదని వెంటనే చెప్పేస్తాడు. అప్పుడప్పుడూ ఈ ధోరణి తన మీద వ్యతిరేక ప్రభావాన్ని చూపుతుందని ఆయనకు అనిపించే వుండాలి. ఒక ఇంటర్వ్యూలో యితరులైతే ఆ సందర్భంలో ఏ మెటఫర్ వాడతారో అలాంటిదే వాడాడు. "మీరు గులాబీ మొగ్గను పువ్వుగా ఎలా వికసిస్తున్నావని అడిగితే, అది సమాధానం చెప్పగలదా? మీరు నా భార్యను మీరంత బాగా ఎలా పాడుతున్నారని అడిగితే ఆమె కూడా వివరించలేదు. ఆమె సాధారణమైన స్త్రీ, అమాయకురాలు."

నిజంగా ఆమె సామాన్యురాలు, అమాయకురాలా? ఎప్పటిలాగానే సదాశివం కూడా తన విషయంలో అతిశయోక్తిగా వుండివుండొచ్చు. నిజంగానే యమ్మెస్ ఒక సాధారణ స్త్రీ. చాలా రకాలుగా ఆమె అమాయకురాలు కూడా. ఆమె చాలా తేలికగా కన్నీళ్ళు పెట్టుకుంటుంది. 'శకుంతలై'లో నటించే రోజులలో జి.యన్. బాలసుబ్రహ్మణ్యం ఆమెను 'ఏడ్చే అందమా' అని పిల్చి ఏడిపించేవాడు. ఆమెకు డబ్బు గురించి ఏమీ తెలియదు. ఎలా నిర్వహించాలో తెలియదు. రామన్ మెగసేస్ అవార్డు వచ్చినప్పుడు మనీలా మేయర్ "కీ టు సిటి" తో గౌరవించినపుడు ఆమె అయోమయంలో పడింది. ఆమె దానిని తనను చూసేందుకు వచ్చినవారికి చూపించి దానితో ఏం చేయాలని అడిగింది. ఆమెకు ఈ లౌకిక ప్రపంచ వ్యవహారాలు అర్థం కావు. ఆమె పక్క వాయిద్యాలవాళ్ళు రోజూ మాట్లాడుకునే హాస్య పరిహాసాలు ఆమె తలమీదుగా వెళ్ళిపోయేవి. తరచు ఆమె వాళ్ళను

ఎందుకు నవ్వుతున్నారని అడిగేది, వాళ్ళు తిరిగి చెప్పేసరికి ఆ హాస్యంలో పదును పోయేది. స్వతంత్రోద్యమంలో సదాశివం, రాజగోపాలాచారీ తలమునకలై వున్నప్పుడు కూడా, ఆ ఉద్యమంలో భాగం పంచుకోకుండా వున్న ప్రముఖ వ్యక్తిగా ఆమె వుండటం అనుకోకుండా జరిగినదేమీ కాదు. ఆమె సమకాలీకులు కె.బి. సుందరంబాల్ నుంచి ఎన్.యస్. కృష్ణన్ వరకూ రాజకీయ ప్రచారం కోసం ప్రయాణాలు చేసేవారు. సుందరంబాల్ లెజిస్లేచర్‌కు ప్రతిపాదించబడిన మొదటి తమిళనాడు మహిళ. కానీ కాంగ్రెస్ గానీ, ప్రభుత్వం గానీ వాళ్ళ ప్రయోజనాల కోసం యమ్మెస్ సేవలను ఎన్నడూ కోరలేదు. కొన్ని సన్మాన సభలలో ఒత్తిడి చేస్తే, ఆమె చేసిన ప్రసంగాలు బొత్తిగా బాగుండవు. 1981లో శాంతినికేతన్‌లో అవార్డు తీసుకుంటూ చేసిన ప్రసంగం యిందుకు ఉదాహరణ. "మీరందరూ నన్ను శిష్యోత్తమురాలని కావాలని దీవించండి. జీవితాంతం విద్యార్థిగా వుండాలని, నాదవిద్య అనే మహా సముద్రం నుండి కొన్ని కుండలనిండుగా నీళ్ళు తెచ్చి మానవత్వమనే ఈ విశాలమైన తోటలో కొన్ని ప్రాంతాలలో చల్లాలి" ఈ వచనం రాసింది ఎవరో అజ్ఞాత రచయిత అయివుంటాడు గానీ, ఈ సంఘటన తనకున్న సామర్థ్యాన్ని మించి వచ్చే సవాళ్ళను ఎదుర్కొనటంలో యమ్మెస్ ఆశక్తతను మనకు ఎత్తి చూపుతుంది.

❖ ❖ ❖ ❖

ఆమె సామర్థ్యపు స్థాయి ఆమె బైటకు చూపించేదానికన్నా చాలా వున్నతం. అది ఎవరూ గుర్తించకుండానే గడచిపోయింది. ఆమె అమాయకురాలని సదాశివం ఘంటాపథంగా చెబుతున్నప్పటికీ, ఒకరో, ఇద్దరో చేసిన ఇంటర్వ్యూలలో, ఆమె ఒంటరిగా దొరికినపుడు ఆమె ఆ ప్రశ్నలను బాగానే అర్థం చేసుకుని సమాధానం చెప్పింది. ఆమె తన కిశోరప్రాయంలో తనకు కావలసిందేమిటో చెప్పి సాధించింది. వివాహానికి ముందు సదాశివంతో వున్న మొదటి సంవత్సరాలలో సదాశివం ఆధిపత్య ధోరణుల స్వభావం, దానివల్ల కలిగే మేలు, కీడులు పర్యవసానాలను తూచి చూసుకుంది. తనను రక్షించేవాడు – పైకి తీసుకొచ్చేవాడు అవసరమని ఆమె అర్థం చేసుకున్నది. తనపై తనకున్నది శ్రద్ధేగానీ అమాయకత్వం కాదు. రోజూ వచ్చే అతిథుల విషయంలో సదాశివం చేసుకునే జోక్యాన్ని ఆమె ఆపిన సందర్భాలు కొన్ని వున్నాయి. విమర్శకుడైన బి.వి.కె. శాస్త్రి అలాంటి అతిథి. ఒకసారి సదాశివం చాలా వివరంగా అతనేం తినాలో, ఎలా తినాలో చెప్పటం మొదలుపెట్టాడు. యమ్మెస్ దానిని మధ్యలో ఆపి సదాశివంతో శాస్త్రిని అతని ఇష్టానికి ఒదలమనీ, అతన్ని అతనికిష్టమైనవాటిని, ఇష్టం వచ్చిన పద్ధతిలో తిననివ్వమని చెప్పింది. యమ్మెస్‌కు తనేంటో తనకు తెలుసు. కానీ వివాహానంతరం ఆమె "సామాన్యురాలిగా, అమాయకురాలిగా" వుండదల్చుకుందేమో.

ఆమె వాసంతికి అదే అభిప్రాయాన్ని కలిగించింది. వాసంతి యమ్మెస్‌తో ఒక్కదానితోనే రెండు రోజుల ఇంటర్వ్యూ చేయటానికి అనుమతి సంపాదించగలిగిన ఒకే ఒక్క రచయిత్రి. వాసంతి తమిళంలో రచయిత్రిగా సుప్రసిద్ధురాలు. ఆమె నవలలు తమిళ బ్రాహ్మణ కుటుంబాల జీవితపు అట్టడుగు వాస్తవాల గురించి మాట్లాడతాయి. ఆమె కొంత స్థాయి వున్న పత్రికా విలేఖరి. కొంతకాలం 'ఇండియా టుడే'లో పని చేసింది. ఇవన్నీ సదాశివంపై అనుకూల ప్రభావాన్ని కలిగించాయి. ఆమె తనను, తన విచక్షణను నమ్మి, యమ్మెస్‌తో ఒంటరిగా మాట్లాడనివ్వమని అడిగినప్పుడు సదాశివం అక్కడి నుంచి అదృశ్యమవటానికి అంగీకరించాడు. యమ్మెస్‌తో ఒక స్త్రీగా, తమిళురాలిగా దగ్గరితనాన్ని సంపాదించటానికి వాసంతికి యెక్కువ సమయం పట్టలేదు. 1996 సెప్టెంబర్‌లో రెండు రోజులపాటు సావకాశంగా మాట్లాడేందుకు దొరికిన సమయంలో, వాసంతి ఆమెను అనేక అంశాల మీద ప్రశ్నించింది; ఆమె ఆశలు, భయాలు, భర్తలను ఎలా కంట్రోల్ చేయాలి (కొంచెం లొంగాలి, ఆ తర్వాత మనకు కావాల్సినట్టు వుండొచ్చు) వజ్రాలు, సువాసనా ద్రవ్యాలు (చాలా బాగుంటాయి). యమ్మెస్ 'తను ఎవరినో ఒకరిని పెళ్ళి చేసుకుని మర్యాదరకమైన జీవితం గడపాలని వుండేదని' చెప్పినప్పుడు వాసంతి ప్రశ్నించింది: "ఎవరో ఒకరిని పెళ్ళాడంతోనే నువ్వు సంతోషంగా వుండగలిగేదానివా?" "సంతోషంగా వుండేదాన్నో లేదో. నేను సురక్షితంగా వుండేదాన్ని" అని యమ్మెస్ బదులిచ్చింది. ఏదైనా విషయంలో ఆమె చాలా విచారపడుతున్నదా అని అడిగినపుడు యమ్మెస్ ఒక్కక్షణం కూడా తటపటాయించకుండా "ప్రజల బీదరికం. స్వతంత్రం వచ్చి యిన్నేళ్ళయినా మనదేశంలో యింతమంది ప్రజలు బీదరికంలో యెందుకున్నారు?" అన్నది. ఆరేళ్ళ తర్వాత తమ సమావేశాన్ని గుర్తు చేసుకుంటూ వాసంతి యమ్మెస్ చాలా తెలివైనదనే తన స్థిరాభిప్రాయాన్ని చెప్పింది. "అతి విధేయురాలైన భార్య పాత్ర పోషించటం ఆమె వైపు నుంచి ఒక వ్యూహమై వుండాలి. ఆమె చాలా భరించింది, కానీ చివరికామె సదాశివం వంటి బలమైన మొండివాడిని, వృషభాన్ని దారిలో పెట్టగలిగింది."

అది ఆమె వ్యక్తిగతమైన విజయం. పైకి మాత్రం, అందరికీ కనిపించేది మాత్రం అంతా సదాశివం కంట్రోలు చేసేవాడు, సుబ్బులక్ష్మి సంగీతంతో సహా. సంగీతకళలో ఆమెకున్న అధికారం, సదాశివం దానిని గుర్తించటం వల్ల ఆ కంట్రోలు కొన్నిసార్లు నిర్మాణాత్మక స్వభావంతోనే వుండేది. ఒక ఇంటర్వ్యూలో ఆయన దానిని అంగీకరించాడు: "సామాజిక జీవితంలో నాకున్న విస్తృతమైన సంబంధాల వల్ల సుబ్బులక్ష్మికి కీర్తి వచ్చిందని కొంతమంది అనుకుంటారు. ఇది పూర్తిగా తప్పు ఆమె సంగీతపు నాణ్యతనూ, ఆమె ప్రతిభను ఒక రూపంలోకి తేవటం వరకే నా పాత్ర పరిమితం. కేవలం తన ప్రతిభ, వ్యక్తిత్వం, తన కఠోరమైన సాధన యివే కుంజమ్మను కీర్తి శిఖరాలకు చేర్చాయి." ఈ

ఒప్పుకోలు చాలా ఔదార్యంతో కూడివున్నట్లే "ఆమె సంగీతపు నాణ్యతను" రూపుదిద్దటంలో ఆయన నిర్వహించిన పాత్ర నిస్సందేహంగా ముఖ్యమైనదే. కొన్నిసార్లు ఆ పాత్ర అతిగా వుండొచ్చు. కానీ మొత్తం మీద ఆమె తన సమకాలీనులందరికంటే ముందుండటానికి సహాయపడింది.

❖ ❖ ❖ ❖

సదాశివంకు సంగీతంలో ఎలాంటి క్రమపద్ధతితో కూడిన శిక్షణా లేదు. అతని విప్లవ దినాలలో వీధుల్లో పాడిన పాటలే అతనికి సంగీతంలో వున్న సంపూర్ణమైన అనుభవం. కానీ వొకసారి యమ్మెస్‌ని తన జీవితాశయంగా చేసుకున్న తర్వాత ఆయన కర్ణాటక సంగీతంలో సాటిలేని ప్రావిణ్యాన్ని సంపాదించాడు. అతని ఆశయం ప్రత్యేకమైనది. ఆయనకు శాస్త్రీయ సంగీతంలో గుర్తింపు కలిగిన విమర్శకుడిగా తయారవటంలో ఏమాత్రం ఆసక్తి లేదు. ఒక అంకిత భావంతో సంగీతాన్ని ఆనందించే రసికుడిగా వుండాలనీ లేదు. ఆయన శ్రద్ధాసక్తులన్నీ కచేరీలలో యమ్మెస్‌కు మార్గదర్శకత్వం వహించి, ఆమె సంగీతపు రికార్డులన్నీటిలో యే చిన్న పొరపాటూ దొర్లకుండా చూసుకోవటం మీదే వున్నాయి. ఈ ఆశయాలను సాధించగలగాలంటే, సంగీతంలోని ప్రతి చిన్న వివరాన్ని పట్టుకోగలిగిన చెవి వుండాలి. ఆ గ్రహణ సామర్థ్యం శ్రవణాలకు ఉండాలి. అతను చేసింది సరిగ్గా ఆ సామర్థ్యాన్ని సంపాదించుకోవటమే. "వీక్" పత్రికలో యమ్మెస్ గురించి ఒక వ్యాసం రాస్తూ (18 సెప్టెంబర్ 1983) మద్రాసు రికార్డింగు స్టూడియోలో జరిగిన ఒక అత్యంత ఆశ్చర్యకమైన దృశ్యాన్ని రుక్మిణి మీనన్ వర్ణించింది: "గాజు తలుపు వెనుక ఒక కుర్చీలో కూర్చుని సదాశివం కళాకారులను గమనిస్తున్నాడు. చాలా లోతైన అనుభూతితో వింటున్నాడు, మనసులోనే విషయాలను గుర్తుపెట్టుకుంటున్నాడు, అంచనా వేసుకుంటూ, సరిపోల్చుకుంటూ వున్నాడు. ఆయనే చేతులు అప్పుడప్పుడూ ఆడిస్తూ తాళాన్ని గుర్తిస్తున్నాడు. అది తప్ప మరే కదలికా లేదు. ఆ పాటనే నాలుగైదు సార్లు రికార్డు చేశారు. ప్రతిసారి పాట పాడటం పూర్తవగానే సౌండ్ ఇంజనీరు కె.యస్. రఘునాధన్‌తో ఆయన వరసగా యెప్పుడు ఏ వాయిద్యాం తప్పుగా వాయించారో, ఎప్పుడు రాధ యమ్మెస్ కంటే కొంచెం పెద్దగా పాడిందో, యింకా యితర సున్నితమైన అంశాలను, యితరులు పట్టించుకోకుండా దాటవేసే విషయాలను చెబుతుండేవాడు." హెచ్.యమ్.వి. కంపెనీలో నిపుణుడైన ఉద్యోగి రఘునాధన్ తన పద్ధతిలో తానిలా చెప్పాడు "సదాశివం తన ఆభరణాన్ని రూపొందించుకుంటున్న ఆభరణాల వ్యాపారిలాంటివాడు."

ఇలా అన్నింటినీ పర్యవేక్షించే ధోరణి వల్ల సదాశివం యమ్మెస్ మీదా, ఆమె సాధారణ ప్రవర్తనా సరళి మీదా, నియమ నిబంధనలను అందరికీ తెలిసేలాగానే విధించేవాడు. కచేరీ చేసేటప్పుడు యే దుస్తులు ధరించాలి, వేదిక దగ్గర తనెలా ప్రవర్తించాలి, శ్రోతల

వద్ద ఎవరెక్కడ కూర్చోవాలి. ఎవరిని ఆమె కలవాలి, ఎవరిని కలవడకూడదు అన్నీ శాసించేవాడు. ఆమె ఏ విధమైన సంగీతంతో గుర్తింపు పొందాలో ముందే నిర్ణయించుకుని వున్నాడు. ఆమెకు తనదైన శైలిని, ఆధ్యాత్మికతను పై స్థాయిలో, ప్రాంతీయతలకు అతీతమైన తీరులో సాధిస్తూ, అదే సమయంలో తమిళ కర్ణాటక సంగీత మూలాలను ఒదలకుండా వుంచుకునే ఒక శైలిని ఆయన రూపొందించాడు. ఆ విధంగా యమ్మెస్ కచేరీలు భక్తి చుట్టూ, భావం చుట్టూ అల్లుకుని, పల్లవులల్లో సాంకేతిక విద్యా ప్రదర్శన చాలా తక్కువగా వుంటూ, రొమాంటిసిజమ్‌ను పూర్తిగా తీసివేస్తూ సాగేవి. యమ్మెస్ గానంలోని అత్యుత్తమత్వాన్ని బైటకు తీసుకురాలేని రాగాలను పరిహరించే తెలివి ఆయనకుంది. దాదాపు అన్ని రాగాలకూ ఆమె కంఠస్వరం అందంగా అనువుగా వొదుగుతుంది. కానీ సదాశివంలోని పరిశీలకుడు ఆమె కొన్ని రాగాలలో కంటే మరికొన్ని రాగాలలో బాగా రాణిస్తుందని కనిపెట్టేవాడు. కల్యాణి, శంకరాభరణం, ఖరహరప్రియ, పంతువరాళి కేదారగౌళ రాగాలను యమ్మెస్ పాడినపుడు మన హృదయాలు పులకిస్తాయి. కానీ కాంభోజి వంటి కొన్ని రాగాలు అంత గొప్పగా వుండవు. శ్రద్ధగా ఎంపిక చేయటమనే పనితో ఆయన, రసికులు యమ్మెస్ నుంచి పరిపూర్ణమైన సంగీతాన్నే అందుకునేలా చేసేవాడు.

సదాశివం చాలా కష్టపడేవాడు. శ్రమపడి ఎన్నో ప్రయత్నాలు చేసేవాడు. ఆ బాధ్యత తీసుకోవటంలోని శ్రద్ధ వల్ల ఆ పనులన్నీ యమ్మెస్‌కు సహాయపడ్డాయి. సమస్య ఏదైనా వుందంటే, అది తనొక్కడు మాత్రమే ఎంతో కఠినంగా వ్యవహరిస్తూ చేసే ఆ పనికి తగినవాడినని, తనవల్లే, తన ప్రయత్నమే యమ్మెస్ కచేరీల విజయాన్ని నిర్ణయిస్తుందనీ, ఆయన భావించటంలో వుంది. దానికి తగినట్లు, ఆ పనిలో ఆయన యెంత సంపూర్ణమైన విధేయతను చూపుతాడంటే అది కర్ణాటక సంగీత జానపద కథలలో భాగమైంది. ప్రతి కచేరీకి యమ్మెస్ ఏం పాడాలో ఎంపిక చేసేది యెప్పుడూ ఆయనే, యమ్మెస్ కాదు. ఆయనే ఫలానా కీర్తనలను, స్వరకర్తలను, ప్రధాన, ఉప రాగాలను పాడాలని ఎంపిక చేస్తాడు. ప్రతి పాట ఎంతసేపు పాడాలి, ఏ వరసలో ఆ కీర్తనలను పాడాలి, ఆ ప్రత్యేక కచేరీలు ఏ ఏ భాషలలో పాడాలి అనేది ఆయనే నిర్ణయిస్తాడు. ఆ ఎంపికలో ప్రతిదీ ఆయా సందర్భాన్ని బట్టీ, ప్రాంతాన్ని బట్టీ జరుగుతాయనేది స్పష్టమే.

తన వంతుగా, యమ్మెస్‌కు ఇలా కచేరీకి ముందు జరిగే ప్రణాళిక, తయారవటం, ఆ ఆదేశాలతో కథ ముగియదని తెలుసు. ఒక కర్ణాటక సంగీత కచేరీని మొదటి వరుసలోని ఒక ప్రత్యేకమైన సీటులో కూర్చుని, ఎలా నియంత్రించాలో ఆ మెలకువలనన్నిటినీ సదాశివం నేర్చుకున్నాడు. పాశ్చాత్య ఫిల్‌హార్మోనిక్ ఆర్కెస్ట్రాను నడుపుతున్న వాడిలాగా తనను తాను భావిస్తున్నాడా అనిపిస్తుంది. కొన్ని సైగలు, చేష్టలతో కూడిన రహస్యభాష ద్వారా ఆయన తన కంట్రోలుని చూపించేవాడు. ఒక రకమైన చేష్ట చేస్తే పాటల వరస

మార్చాలని అర్థం. తలను ప్రత్యేకరీతిలో వూపితే యిక ఆ కచేరీని ముగించెయ్యాలని అర్థం. వేదిక మీద, మధ్యన కూర్చుని యమ్మెస్ ఈయన ఆమోదం కోసం చూసేది. ప్రేక్షకుల స్పందనలు ఆమెకు ఆయన స్పందన తర్వాతే. కర్ణాటక సంగీత దురంధరులకు ప్రతి చిన్న వివరంతో సహా యమ్మెస్ కచేరీలను సదాశివం నడిపిస్తున్నాడని తెలుసు. ప్రేక్షకులలో ఒకడిగా కూర్చుని వేదిక మీది గాయకురాలి వలే, ఆమె మనోధర్మానికి తానూ సహకరించిన ఒకేఒక విశిష్ట వ్యక్తి సదాశివం.

ఆ విధమైన నియంత్రణ వల్ల ప్రయోజనం వుందా లేదా అనేది నిపుణులు నిర్ణయిస్తారు. ఆర్టురో టూస్కానిన్, గొప్ప యిటాలియన్ సంగీత నిర్వాహకుడు స్వయంగా తన మీదా, ఆర్కెస్ట్రాలోని ప్రతి సభ్యుని మీద విధించే వుక్కు క్రమశిక్షణకు పెరెన్నికగన్నవాడు. అతను తయారవ్వటంలోని సంపూర్ణత, గాఢతలు ఆయన కచేరీలను విద్యుత్తేజంలో నింపుతాయి. కానీ సంగీత శాస్త్రవేత్త థియొడర్ అడోర్నో చెప్పిన విషయం కూడా విలువైనదే. ఆయన ప్రకారం టొస్కానిన్ "సంగీతం మీద సాంకేతికత, నిర్వహణ, విజయం సాధించేలా" చేశాడు. యమ్మెస్ కచేరీలలో చాలా వాటిలో సంగీతం మీద సదాశివం విజయం సాధించాడు. యమ్మెస్‌కి తన స్వంతమైన స్వచ్ఛత, క్రమశిక్షణ, కేవలం సంగీతత్వం ఆమె ఆమెగా వుండటానికి సహాయపడేవి. కానీ ఆమెను భావావేశం ఆదేశించినపుడు, సంగీతపు వూటలలోకి ఒక్కసారైనా, ఎలాంటి నియంత్రణా లేకుండా ప్రవహించాలనే కోరిక, దాహం ఆమెకి వుండేదా? ఆమె ఎలాంటి చిక్కులూ లేకుండా సంప్రదాయ పురుషాధిపత్యాన్ని ఆమోదించటం వల్ల, కఠోర నిర్వాహకుడైన సదాశివం ముందు ఆమె విధేయురాలైన సంగీత ప్రదర్శకురాలిగా తయారై వుండవచ్చు. కానీ స్త్రీగా ఆమె తనుగా వుండే స్వేచ్ఛ కోసం తపించిందా? సదాశివం పొరపాట్లు గాకుండా తనవైన పొరపాట్లు తను చేయాలనుకుందా? బాలసరస్వతి, బృందలతో కలిసి చిన్నతనంలో నేర్చుకున్న జావళీలు, పదాలు పాడాలని కోరుకుందా? 'శృతి' పత్రికకు సంబంధించిన విశ్వసనీయులైన స్నేహితుల దగ్గర ఆమె చెప్పుకున్నదాని ప్రకారం సంగీతపరంగా తనను తాను మరింత వ్యక్తీకరించుకునే అవకాశాలు మరికొన్ని దొరికితే బాగుండుననుకున్నది. తానేం చెయ్యాలో, ఎలా చెయ్యాలో ఎప్పుడూ చెప్పించుకునే పరిస్థితి తనదని చెప్పింది. సంగీతానికి తనదైన మార్గంలో తాను యివ్వగలిగేవి యిచ్చేందుకు మరింత విస్తృతికి అనుమతించి వుండాల్సిందని అనుకుంది. డి.కె. పట్టమ్మాళ్‌తో సమాన స్థానంలో వుండటానికి గంభీరమైన శాస్త్రీయ సంగీతంలో తనకు కావలసినంత ఎరుక కలిగి వుండే అవకాశం లేదని అనుకున్నది.

తన ప్రైవేటు సంభాషణలలో ఆమె వెలిబుచ్చిన ఈ సెంటిమెంట్లను, అవకాశం దొరికినప్పుడల్లా బహిరంగ విధేయతా ప్రకటనల సందర్భాలతో పోల్చి చూడాలి. మద్రాసు

మ్యూజిక్ అకాడమి వంటి అతి గౌరవ ప్రదమైన వేదిక మీది నుంచి అన్నిటికంటే భిన్నమైన కృతజ్ఞతా ప్రకటనను  చేసిందామె. 1968 లో తన అధ్యక్షోపన్యాసంలో ఆమె యిలా చదివింది: "ఈ సందర్భంలో నా భర్తపైన నా మనసులోని కృతజ్ఞతా భావాన్ని తెలియజేసుకునే అవకాశం కలిగినందుకు ఆనందిస్తున్నాను. ఆయన నాకు తల్లి, తండ్రి. నాకు మార్గం చూపిన గురువు, నన్ను ప్రోత్సహించిన స్నేహితుడు, ఆయనే నా దైవం.... నా భర్తకు నేనంత రుణపడివున్నానో మాటల్లో వర్ణించి చెప్పలేను. తన సుఖ సౌఖ్యాలను పట్టించుకోకుండా, విరామం లేకుండా నా విజయాల కోసం, కీర్తి కోసం పనిచేశాడు. సమాజంలో, సంగీత ప్రపంచంలో నన్ను పై స్థాయిలో నిలబెట్టాడు. నాకు లభించిన అన్ని గౌరవాలను ఆయన పాదాల వద్ద వుంచి సాష్టాంగంగా ప్రణమిల్లుతున్నాను."

చాలామంది యమ్మెస్ సాష్టాంగా నమస్కారాన్ని ఒక విధేయురాలైన భార్య చేసినదిగా భావించి, ఆ విధేయత ఆమెకున్న సంగీతశక్తి నుండి ఆమెను పక్కకు లాగిందా అని ఆశ్చర్యపోయారు. సదాశివం తన పనిని కాస్త అతిగా చేశాడు, యమ్మెస్‌కు సంగీతంలో మరింత స్వేచ్ఛ దొరికితే ఆమె యింకా కాంతిమంతంగా వెలిగేదా అనే చర్చ ఎప్పుడూ జరుగుతూనే వుంటుంది. యమ్మెస్‌కు జన్మతః వచ్చిన ప్రతిభను సదాశివం పూర్తిగా గుర్తించాడు. కానీ ఆమె ఒక సంప్రదాయ భార్యగా భర్త అవసరాలను తీర్చటానికి నిత్యం పక్కనే వుండాలని కోరుకున్నాడు. ఈ జంట రామన్ మెగసేస్ అవార్డు కోసం మనీలా వెళ్ళినపుడు వాళ్ళు పోర్చే పార్క్‌లో ఒక బ్రహ్మాండమైన కాలనీలో, ఒక బెంగాలి కుటుంబంతో వున్నారు – వాళ్ళకు ఆతిథ్యం యిచ్చిన యజమాని ప్రతి రాత్రి యమ్మెస్ సదాశివం పాదాలను వెచ్చని నీటితో కడిగేదని గుర్తు చేసుకున్నాడు. ఇది అయ్యర్ సంప్రదాయమేమీ కాదు. బహుశా ప్రయాణంలో సదాశివం అలసిపోయి వుంటాడు. ఆ సమయంలో అతనికి డెబ్భై రెండేళ్ళు. ఈ సంఘటన వల్ల యమ్మెస్ భార్యగా, శిష్యురాలిగా తన బాధ్యతలను సంతోషంగా అంగీకరించటం వల్ల వాళ్ళు ఆదర్శదంపతులు కాగలిగారు. ఆమెకు తనను తాను నిరూపించుకోవాలనే తాపత్రయం వుండివుంటే కథ వేరే విధంగా వుండేది. వాళ్ళ వివాహం "చాలా సాధారణం, చాలా సంక్లిష్టం" అని చెబుతూ శారదా ప్రసాద్ "ఆమె గనుక తనను భద్రంగా రక్షించగలవాడిని పెళ్ళాడకపోయివుంటే తనను దోపిడీ చేసేవాడిని పెళ్ళిచేసుకునేది" అన్నది. అని కూడా అన్నది. "సదాశివం ఆమెను నిధిని కాపాడే సర్పరాజం వలే కాపాడాడు."

మిగిలిన అంచనాలు మరింత కఠోరంగా వున్నాయి. మదురై కుటుంబానికి స్నేహితుడు పత్రికా విలేఖరి అయిన యమ్.ఎన్. సుబ్రహ్మణ్యం "వెన్నలా కరిగే గొంతు, ఎక్కడో దాగిన సహృదయ ఆత్మను కట్టిపడేసిన సంకెళ్ళను విడిపించేది" అంటూ ఘనమైన మిల్టన్ తరహా పదబంధాలతో యమ్మెస్‌ను కీర్తిస్తూ వుంటాడు. కాని సదాశివంను ఒక

నియంత అంటూ తీసిపారేస్తాడు. 'ఎపైడ్'' అనే పత్రికలో జానకి వెంకట్రామన్ రాసిన వ్యాసంలో (1–16 నవంబర్ 86) ఆమె పరిశీలనలో చెప్పిందేమిటంటే చాలామంది "యమ్మెస్ తన సహజ స్వచ్ఛదారను, వ్యక్తిత్వాన్ని సదాశివం ప్రభావం వల్ల కోల్పోయిందని విచారంగా చెబుతారు." అని. యమ్మెస్ స్నేహితురాలు యిలా అన్నదని కోట్ చేస్తుంటారు. "ఆమెలో ఏదైనా ఆనందోత్సాహం, అల్లరి వుందంటే అదంతా వివాహానంతరం ఆమెవున్న కఠోర క్రమశిక్షణలో తుడిచిపెట్టుకుపోయింది." యమ్మెస్ యుగానికి సదాశివం చేసిన సహాయ సహకారాల ప్రాముఖ్యతను గుర్తించిన వాళ్ళు కూడా సదాశివం ఒక్కడే మార్గమా అనుకుంటారు. ఒక కళాకారునిలో ఉత్తమ కళకు బైటికి రప్పించాలంటే వాళ్ళను సానబెట్టాలి, ముందుకు నెట్టాలి, నిరంతరం ఒత్తిడిలో వుంచాలి. ఇదంతా అవసరమే. ప్రాచీన కాలపు గురువులందరూ తమ శిష్యులమీద ఈ ప్రయోగాలన్నీ చేసినవారే. కానీ ఆ శిష్యులు తమ వ్యక్తిగతమైన పద్ధతిలో, వారెంచుకున్న రీతిలో, వారి ప్రత్యేక శైలిలో సంగీతకారులుగా అభివృద్ధి చెందేలా శిక్షణను పొందేవారు. కానీ యిక్కడ యమ్మెస్ దురదృష్టవశాత్తూ, సదాశివం ఘరానాకు ఒంటరి శిష్యురాలిగా వచ్చింది. వింత ఏమిటంటే యమ్మెస్ సంగీతాన్ని గురించి సీరియస్‌గా అంచనా వేయాలంటే, వాళ్ళు ఆమె జీవితాన్ని నిర్మిస్తూ, ఆమె సంగీతాన్ని రూపొందిస్తూ వుండిన ఆయనను దాటి వెళ్ళి చూడాలి.

❖ ❖ ❖ ❖

యమ్మెస్ కొన్నిసార్లు తన సంభాషణల్లో తనదైన శైలిలో తన సంగీతాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం వుంటే బాగుండేదని సూచించి వుండవచ్చు. కానీ సదాశివం ఆమెకేమిటి అన్న విషయంలో ఆమెకు అణుమాత్రం సందేహం లేదు. తాను పెద్ద తార అవుదామనే ఆశను పెంచ పోషించుకోలేదని ఆమె వాసంతికిచ్చిన ఇంటర్వ్యూలో చెప్పింది. ఎక్కడో ఒక చిన్న ప్రదేశంలో పాడుకుంటూ కాలం గడిపితే చాలనుకుంది. కానీ సదాశివం ఆలోచనలు ఒక్కొక్కటే రేకులు విప్పుకున్నాయి. వాటి ప్రాముఖ్యతను ఆమె అర్థం చేసుకుంది. "నా స్వతంత్రం మీద వున్న ఆంక్షలను నేను లక్ష్యపెట్టను" అన్నదామె. "ఎందుకంటే నాకాయన మీద పూర్తి నమ్మకం వుంది. ఆయనకు శ్రోతల నాడి సరిగ్గా, సంపూర్ణంగా తెలుసు." దానిని గమనించటంలో ఆమె ఓడిపోలేదు. 1940 తర్వాత సదాశివంకు యమ్మెస్ తప్ప, ఆమె సంగీతం తప్ప వేరే జీవితం లేదు. రాజాజీకి అంకితమై చేసిన సేవలు, కల్కి వంటి వ్యాపార కార్యకలపాలు కూడా, యమ్మెస్‌తో ఆయన జీవితానికి కొనసాగింపులే. వాళ్ళిద్దరూ కలిసి ఎదుర్కొన్నారు, 1980వ దశాబ్దపు మధ్యనుంచీ తప్పనిసరిగా మీదపడిన వయసు ప్రభావానికి కలిసే తలవంచారు.

యమ్మెస్ కంటే వేగంగా సదాశివం వృద్ధుడయ్యాడు. ఇద్దరికీ పదిహేనేళ్ళ తేడా ఉన్నప్పటికీ సదాశివం గట్టిగా చుట్టిన డైనమోలా, ఉద్రిక్తతతో, అతిచురుకుతనంతో

వుండేవాడు. యమ్మెస్ శాంతంలో ఎప్పుడూ ఒయాసిస్సే. పని ఒత్తిడి సదాశివం శరీరం మీద ప్రభావం చూస్తే, అంతరంగ శాంతి యమ్మెస్ కాంతిని తగ్గకుండా చూసింది. 60వ దశకం చివరికే సదాశివం వయసు మీదబడినట్లు కనిపించేవాడు. కానీ ఆయన జీవన విధానం క్రమశిక్షణతో కూడినది, అతని అలవాట్లు మంచివి, క్రమబద్ధమైనవి అవటంతో డెబ్బయ్యి, ఎనభై ఏళ్ళ వయసులో కూడా అతను కనిపించేదానికంటే మెరుగైన ఆరోగ్యంతోనే జీవించాడు. 1997 లో యమ్మెస్ పుట్టిన రోజు పండుగ జరుగుతున్నప్పుడు "పుట్టినరోజు అమ్మాయి" ఎంత వెలుగులో వుందో ఆయనా అంత వెలుగులో వున్నాడు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, కలిసి పనిచేసిన వారు, యింకా విశాలమైన కర్ణాటక సంగీత ప్రపంచమూ అందరూ ఆయనను "శతమానం భవతి" కావాలని కోరుకుంటున్నారు. చురుగ్గా 95 ఏళ్ళ వయసులోవున్న సదాశివంకు ఆ లక్ష్యం కనిపిస్తూనే ఉంది.

1997, నవంబర్ 19న సదాశివం తనకు యింతకు ముందెన్నడూ లేని అసౌకర్యాన్ని అనుభవించాడు – వస్తూ పోతూ ఉన్న జ్వరం, ఊపిరాడని స్థితి. బలవంతం మీద పరీక్ష చేయించుకోటానికి నర్సింగ్ హోంకి వెళ్ళాడు. మూడు రోజుల్లో తిరిగివచ్చేస్తానని కుటుంబానికి హామీ యిచ్చాడు. ఆసుపత్రి వాళ్లు అతని పరిస్థితిని న్యూమోనియాగా గుర్తించారు. నవంబర్ 21వ తారీకు ఉదయం ఆయన మూడు విభూతి రేఖల కోసం అడిగి, వాటిని నుదుటి మీద తనకు అలవాటైన పద్ధతి ప్రకారం పెట్టమని అడిగాడు. ఆయన చెప్పినట్లు చేసిన కాఫీ యింటినుండి వచ్చింది. చిక్కగా, వేడిగా, తియ్యగా, కానీ ఆ కాఫీ తాగటం తేలిక కాదు. ఆక్సిజన్ సిలిండర్ నుంచి వచ్చిన సన్నని గొట్టాలు ముక్కుకి నోటికి దగ్గరగా వుంటున్నాయి. ఆ యిబ్బందితో కూడిన గంటలు నీరసంగా, నిరుత్సాహంగా గడుస్తున్నప్పుడు, పక్కనున్న సహాయకుడు ఆయన కళ్ళు గాజు కళ్ళలా మారటం గమనించాడు. యమ్మెస్‌ని పిలిపించారు. ఆమె గదిలో ప్రవేశించగానే, సదాశివం ఆమెను చూశాడు. చిరునవ్వు నవ్వాడు. ఆమె చేతిని పట్టుకున్నాడు. చూస్తూ, నవ్వుతూ, చేతులు పట్టుకుంటూ ఆయన కళ్ళు మూతపడ్డాయి. ఊపిరి ఆగిపోయింది. ఇదంతా ఎంత నిదానంగా జరిగిందంటే ఆయన చుట్టూ వున్నవాళ్ళు ఇక త్యాగరాజు సదాశివం లేడని గుర్తించటానికి కొంత సమయం పట్టింది.

# 13. సంగీత కళాకారిణిగా, స్త్రీగా...

*ఆనంద మానంద మాయెనే - బ్ర*
*హ్మానంద మానంద మాయెనే - బ్ర॥*
*శ్రీరామ నేధన్యుడనైతి-నానంద*
*నీ రధిలో నీద నైతిని ॥*
*ఆనాటి మొదలు నిన్నే-వేడితి - దుష్ట*
*మానవుల చెలిమి - వీడితి నా*
*మానము నీదు భార-మనుచునే దెలిసితి ॥*

యమ్.యస్. సుబ్బులక్ష్మి యెన్నడైనా ఒక కోరికను గాఢంగా కోరుకుందంటే అది సుమంగళిగా మరణించాలనేదే. భర్త సజీవంగా వుండగానే మరణించే అదృష్టంగల భార్య కావాలనే. ఇది భారతీయ సంప్రదాయంలో లోతుగా పాతుకుపోయిన భావం. దాన్ని ఫెమినిస్టులు, అభ్యుదయ ఆలోచనాపరులూ నిరసిస్తారు. మిగిలినవాళ్ళకూ కొన్ని అభ్యంతరాలుంటాయి. మనకు యేది ప్రాప్తమో దానిని స్వీకరించాలని వాళ్ళామెతో చెప్తారు. కొందరు ఆమె భర్త ఆమె కంటే పద్నాలుగేళ్ళు పెద్దవాడని గుర్తుచేస్తారు. ఆమె సుమంగళిగా దాటిపోతే అతను మిగిలిన యేళ్ళన్నీ యెలా గడుస్తాయంటారు? దగ్గరి కుటుంబ సభ్యులు యమ్మెస్‌కు భర్తలేకపోయినా బతకగలిగిన ఆత్మశక్తి, ఆ బలం వుందిగానీ సదాశివం భార్య చనిపోతే తట్టుకోలేడంటారు. 1997 సెప్టెంబరులో ఆమెకు ఎనభై రెండు యేళ్ళొచ్చిన రెండు నెలలకు యమ్మెస్ సుమంగళి స్వప్నం చెల్లాచెదరయింది. సదాశివం వంటి శక్తిమంతుడు, శాసకుడు రెండు రోజుల వ్యవధిలో వెళ్ళిపోగలడని ఆవిడెన్నడూ వూహించి కూడా వుండదు. ఆమె గుండెలు పగిలేలా యేడుస్తుంటే యేడవనివ్వటమే ఆ కుటుంబ సభ్యులు చేసిన మంచిపని. వాళ్ళు ఆమెకు తెలియకుండా ఆమె చుట్టూ తిరుగుతుండేవారు. ఆమె దుఃఖాన్నీ, ఆక్రందనలనూ ఆపాలని ప్రయత్నించేవారు కాదు. ఆమె వెక్కిళ్ళు చాలా రోజులలానే వుండి బైబిల్ దుఃఖాన్ని ప్రతిబింబిస్తూ "ఆగండి, చూడండి నా విషాదం లాంటిది యెక్కడైనా వుందేమో చూడండి" అన్నట్లుండేది. ఆమె లోపలి శూన్యం యొక్క వెలుపలి ఫలితమేమోనన్నట్టుగా ఆమె తనకు ప్రియమైన పట్టు చీరెలు కట్టటం మాని నేత చీరెలు కట్టుకోసాగింది.

అరవై సంవత్సరాల పరాధీనత తర్వాత, తన ప్రతి అవసరాన్నీ కనిపెట్టి చూసే అతను లేకుండా జీవితాన్ని సర్దుబాటు చేసుకోవటం యమ్మెస్‌కు కష్టమే అయింది. ఆమె బాగుంది గానీ నిజంగా ఒంటరయింది. ఆమె మధురై కుటుంబ సభ్యులందరూ మరణించారు.

ఇద్దరు కూతుళ్ళూ, రాధ, విజయ వాళ్ళ వాళ్ళ జీవితాల్లోకి వెళ్ళిపోయారు. వాళ్ళ బరువు బాధ్యతలు వాళ్ళకున్నాయి. రాధకు ఆరోగ్యం బాగోదు. కదలలేదు కూడా. ఓ గుప్పెడు మంది కుటుంబ స్నేహితులు పలకరిస్తున్నారు. సదాశివంతో అనుబంధం వున్న ఒకరిద్దరు సహాయకులు కొట్టూరుపురంలోని శివం – శుభంలో ఆమె అవసరాలను కనిపెట్టి చూస్తున్నారు. ఆమె రోజువారీ కార్యక్రమాలు, ఉదయాన్నే స్నానం, పూజ, ధ్యానం, ప్రార్థనలతో ఆమెను ఒక లయలో వుంచుతున్నాయి. కానీ ఒంటరితనం దుర్భరంగా వుంది. ఏ మూల చూసినా, ఇంట్లో యే దిక్కు చూసినా, ప్రతి అతిథి, ప్రతి సంభాషణ, ప్రతి పని ఆమెకు ఆ శూన్యాన్ని, హఠాత్తుగా ఆమె జీవితంలో కేంద్రస్థానమై పోయిన శూన్యాన్ని గుర్తుచేస్తుంటాయి. కన్నీటి ప్రవాహం ఆగదు.

ఒకటి రెండు మనసు మళ్ళించే సంఘటనలు యెదురయ్యాయి. ఆమె శ్రేయోభిలాషులు ప్రపంచం యింకా ఆమెను గురించి శ్రద్ధ తీసుకుంటుందని ఆమెకు తెలియజేసేందుకు చేసిన పనులు కావచ్చు. సదాశివం మరణించిన మూడు నెలల తర్వాత, ఢిల్లీ నుంచి గోపాలకృష్ణ గాంధి ఫోన్ చేశాడు. రాజాజీకి, మహాత్మా గాంధీకి ఆయన మనవడు. ఒకరి కూతురు యింకొకరి కొడుకును పెళ్ళాడింది – మద్రాసులో యమ్మెస్ గృహ జీవితంలో గోపాల్ కూడా భాగమే. “మా ప్రియమైన బిడ్డడు” అని ఒకసారి ఆమె చెప్పింది. అతను తర్వాత రాష్ట్రపతి కె.ఆర్. నారాయణన్‌కు ప్రత్యేక కార్యదర్శిగా పనిచేశాడు. యమ్మెస్ ఫోన్‌లో తనను పిలిచింది గోపాల్ అని తెలియగానే, విపరీతంగా యేవడటం మొదలుపెట్టింది. ఆమె అది కూడా సానుభూతి తెలియజేయటానికి చేసిన ఫోన్‌కాల్ అనుకుంది. గోపాల్ ఆమెను ఓదార్చి చెప్పాడు: అమ్మా, యేడవకు. నీ కోసం నా దగ్గర మంచి వార్త వుంది.” మరుక్షణం రాష్ట్రపతి నారాయణన్ లైన్లోకి వచ్చాడు. ఆయన ఆమెతో భారత ప్రభుత్వం ఆమెకు 1998 సం॥లో భారతరత్న బిరుదుతో గౌరవించేందుకు నిర్ణయించిందని తెలియ జేశాడు. ఆమె తను విన్న వార్తలోని ప్రాముఖ్యాన్ని యేమంతగా మనసుకు పట్టించుకోలేదు. ఎలాగో ప్రయత్నం మీద ధన్యవాదాలు తెలియజేసే కొన్ని మాటలు వెక్కిళ్ళ మధ్య నుండి మాట్లాడింది. కొన్ని నెలల తర్వాత, మొదటిసారి ఇల్లు వొదిలి బైటకువచ్చేలా వొత్తిడి చేయబడి, మద్రాసు మ్యూజిక్ అకాడమీ వారి స్వర లయ అవార్డు తీసుకుంది.

❖ ❖ ❖ ❖

ఎనభై రెండేళ్ళ వయసులో ఆమెకు తన వయసు ప్రభావం తెలిసింది. యమ్మెస్ తన జీవితంలో యెన్నడూ వయసుకంటే చిన్నగా కనిపించాలనే ప్రయత్నం చెయ్యలేదు. ఆమె జుట్టుకు రంగులు వేయటం, యింకా యితర కృత్రిమమైన సాధనలతో వయసుని తెలియకుండా చెయ్యాలని చూడలేదు. ఆమెకు తెలియకపోయినా, ఆమెకొక సహాయక సంపద వుంది – ఆమె గదిలోకి వచ్చిన వెంటనే అక్కడివాళ్ళు గొప్ప వెలుగు వచ్చినట్లు

అనుభూతి చెందేవారు. అధ్యాత్మిక సిద్ధిపొందిన యోగులతో కలిసివుండే కాంతి యమ్మెస్ భౌతిక రూపంలో భాగమైంది. వయసు తెచ్చే బలహీనతలన్నీ ఆవరించిన తర్వాత కూడా ఆ ప్రకాశించే గుణం ఆమెతోనే వుండిపోయింది. సయాటికా, ఆర్త్రైటిస్, డయాబిటిస్ ఆమె సహచరులు. ఆమె యిరమై వొకటో శతాబ్దంలోకి ప్రవేశించినప్పుడు, ఆమె జ్ఞాపకశక్తి కూడా సన్నగిల్లసాగింది. ఆమె సంభాషించేటప్పుడు గొంతు యెప్పటిలానే ఖంగుమంటోంది కానీ ఆమె కొన్ని క్షణాల క్రితం విన్న విషయాలను మర్చిపోతున్నది. 2002వ సంవత్సర ప్రారంభంలో స్నానాలగదిలో పడితే ఎముక విరిగింది. ఆసుపత్రిలో రెండు వారాలపాటు వుండాల్సి వచ్చింది. ఎముక చివరికి అతుక్కుంది గానీ, చక్రాల కుర్చీ, వాకర్ శివం – శుభంలో ప్రవేశించాయి. ఆమె ఆసుపత్రిలో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో వున్నప్పుడు కొన్నిసార్లు భ్రమలకు గురయ్యేది. ఒక సందర్భంలో కుటుంబ సభ్యుడితో తాను కచేరీకి వెళ్ళాలనీ, తనకు తోడుగా అతన్ని రమ్మనీ అడిగింది.

ఆమె చురుగ్గా మెసిలే రోజులు ముగిసిపోతున్నాయి. అది స్పష్టం. అలాగే ఆమె సాక్షాత్కరింపజేసిన కాలం కూడా. ఆమె స్వర్ణయుగపు తరం 1960వ దశాబ్దంలో అత్యుత్తమ కచేరీలను నిర్వహించారు. ఆ తర్వాత కర్ణాటక సంగీతావరణంలో గాలి తన దిశను మార్చుకుంది. మార్పులెన్నో చోటుచేసుకున్నాయి. 1970, 80 దశాబ్దాలలో ఒక తిరోగమనం మొదలయింది. సాంకేతికత తెచ్చిన వొత్తిడి, వాణిజ్యం యివన్నీ కలిసి వుల్లంఘించలేని సంప్రదాయాల కట్టడాలను దాటి, కొత్త జీవన విధానపు ఆలోచనలను తెచ్చాయి. ఇరవయ్యవ శతాబ్దపు ముగింపులో, పునరుజ్జీవనం వొకటి మొదలయింది గానీ ఆ వాతావరణంలోని విలువలనూ, ప్రమాణాలనూ యమ్మెస్‌గానీ, ఆమె తరంగానీ గుర్తించలేదు. మార్పు క్రమం నిస్సందేహగా ప్రవేశిస్తోంది. సాధకులవల్లా, శ్రోతలవల్లా ఒకేరంగా సంగీతపు ధోరణి ప్రభావితమవుతూ వస్తోంది.

ఈ మార్పు 1960వ దశాబ్దంలోనే మొదలయింది. ఆ దశాబ్దంలో హఠాత్తుగానే ప్రజాభిరుచుల ధోరణిలో మౌలికమైన మార్పులు చోటుచేసుకున్నాయి. అలాగే సాంఘిక సంబంధాలలో, సంప్రదాయిక విలువలలో జీవితాన్ని గురించిన సాధారణ ఆలోచనలలో, జీవించటంలో ప్రధానమైన మార్పులు రావటం మొదలయింది. ఈ క్రమం ప్రపంచవ్యాప్తంగా వుంది. దాని ప్రభావం అనివార్యంగా కొత్తతరం భారతీయుల మీద పడింది. మౌలికంగా యిది నాగరికతలో వచ్చిన కల్లోలం. ఈ కల్లోలపు కేంద్ర బిందువులు వ్యతిరేకించటం, తిరస్కరణ. ఈ కల్లోలాన్ని తీసుకురావటంలో అనేక రకాల అసంతృప్తులు కలిసి ఒకటిగా మారాయి. అమెరికాలో నల్లవారి పౌరహక్కుల ఉద్యమ నినాదాలు ప్రపంచమంతా ప్రతిధ్వనించి 1960లో ప్రముఖ బాక్సింగ్ వీరుడు కాషియస్ క్లే, మహమ్మదాలిగా మారటంతో ప్రజాకర్షణ, ఉత్సాహం పెల్లుబికాయి. 1960వ దశాబ్దపు చివరలో 1970వ దశాబ్దపు

తొలి సంవత్సరాలలో వియత్నాం యుద్ధం యెంతో అసంతృప్తిని, అసహిష్టతను పెద్ద యెత్తున కలిగించి, విద్యార్థులు రాడికలిజంతో విశ్వవిద్యాలయ ఆవరణల్లోంచి బైటికొచ్చారు. 1966 నుంచీ మావోజెడాంగ్ చైనాను తన సాంస్కృతిక విప్లవంతో తల్లకిందులు చేయటం మొదలుపెట్టాడు. దాంతో ప్రజలు తమ స్నేహితులను, యిరుగు పొరుగులను నిందించటం మొదలుపెట్టారు. 1968లో 10 మిలియన్ల కార్మికులు తమ సమ్మెతో, హింసాత్మక దాడులతో పారిస్ నగరాన్ని వణికించారు.

ఆందోళనలు, పెద్ద ఉద్యమాలు, అలజడులు 1960వ దశాబ్దపు గుర్తులు. యువతీ యువకులు ఆ అలజడుల మధ్యలో వున్నారు. వాళ్ళు వ్యవస్థపై తిరగబడటమే కాదు తల్లిదండ్రులపై కూడా తిరగబడుతున్నారు. అందరూ ఆమోదించి అమలులోవున్న ప్రవర్తనా సరళులను వాళ్ళు తిరస్కరించారు. ఈ కొత్తతరం యువ సంస్కృతిలో అజ్ఞాతంగా వున్నవన్నీ బైటికి వచ్చేశాయి; నీతి అనేది బూతుమాట అయింది. జుట్టు పొడవుగా పెంచుకున్న యవకులు, పొట్టి పరికిణీలు ధరించిన అమ్మాయిలు మామూలయ్యారు. పిల్, పాట్, ఫ్రీడమ్ (మొదటి రెండూ మత్తు కలిగించేవి, మూడవది వాటికి అనుమతి నిచ్చేదనే అర్థం కావచ్చు) అనే పదాలు ప్రపంచవ్యాప్తంగా వున్న, హిప్పీలుగా పిలవబడే వారికి ఇంద్రజాలపు మార్మిక ప్రవేశిక పదాలైనాయి. వీటన్నిటినీ రెండు పరిణామాలు సారాంశంలో ఇముడ్చు కున్నాయి. ఇంగ్లండులో "మార్కెట్ శక్తులు"గా ఈ కొత్త యూనిసెక్స్ ప్రపంచంచే పిలవబడే శక్తులు, 1967లో బాయ్స్ వోన్ పేపర్" అనే పత్రికను, 88 సంవత్సరాల నుండి నిరంత రాయంగా నడపబడే పత్రికను, ఆర్థర్ కానన్ డైల్ వంటి ప్రసిద్ధ రచయితల రచనలు ప్రచురించే పత్రికను మూతపడేలా చేశాయి. కోపెన్‌హాగన్‌లో 1969లో ఆరు రోజులపాటు "సెక్స్‌ఫెయిర్" జరిగింది. డెన్మార్క్‌లో అన్నిరకాలైన పోర్నొగ్రఫీ మీద సమస్త నిషేధాలు తొలగించిన సందర్భంలో జరిగిన వుత్సవం అది. ఆల్డస్ హక్స్లే రాసిన బ్లాక్ కామెడి "బ్రేవ్ న్యూ వరల్డ్" యెన్నటికీ సాకారం కాలేదు గానీ, ఒక అభిరుచులు లేనిదేనినీ లెక్కజేయని కొత్త ప్రపంచం వచ్చేసింది.

❖ ❖ ❖ ❖

ఇలాంటి పెనుమార్పు ఇండియాను ప్రభావితం చేయలేదంటే అది అసహజమవుతుంది. దేశంలో జరుగుతున్న పరిణామాలు ప్రజలలో అసంతృప్తినీ, అశాంతినీ వ్యాపింపజేస్తున్నాయి. పాలకులలో పెరుగుతున్న అవినీతి, పాలితులు అనుభవిస్తున్న ఆర్థిక యిబ్బందులూ సమాంతరంగా పరుగుతీస్తున్నాయి. స్థిరమైన ప్రజాభిమానానికి కేంద్ర బిందువైన జవహర్‌లాల్ నెహ్రూ, 1962లో చైనాతో జరిగిన యుద్ధంలో సంభవించిన ఓటమితో తన ప్రతిష్టను పోగొట్టుకున్నాడు. రెండు సంవత్సరాల తర్వాత నెహ్రూ మరణం రాజకీయ శుత్రుత్వాల ప్రదర్శనకు దారితీసింది. సంపన్నులు మరింత సంపన్నులయ్యారు. సమాజపు అంచుల్లో

బతికేవారు మరింత చివరకు నెట్టివేయబడ్డారు. ఆందోళనోద్యమాలకూ, అసంతృప్త ధోరణుల ప్రదర్శనలకు కాలం అనుకూలంగా ఉంది. అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలలో ఈ ధోరణి ఫాషనబుల్ అయింది.

పాశ్చాత్య ప్రపంచంలో తిరుగుబాటుదారులు తమ వుద్యమాలలో సృజనాత్మకతను ప్రవేశపెట్టారు. మాదక ద్రవ్యాల పొగలగుండా, స్వేచ్ఛా ప్రణయాల మధ్య నుండీ కొత్త సంగీతం, కొత్త పుస్తకాలు, కొత్త కళలు పుట్టుకొచ్చాయి. ఇండియాలోని తిరుగుబాటుదారులు అంత సృజనాత్మకతను తీసుకురాలేక పోయారు. కానీ బైటికి కనిపించే సంకేతాలనే వుత్సాహంగా అనుసరించారు. మత్తు పదార్థాల వాడకం, వేషధారణలో, ప్రవర్తనలో అసాధారణత, అతిశయంతో కూడిన పిచ్చి ధోరణులు, స్వేచ్ఛా ప్రణయాన్ని ప్రదర్శించే తీరు యివన్నీ యిక్కడి యువతలోనూ చోటు చేసుకున్నాయి. ఇండియాలోని హిప్పీ సంస్కృతి గురించి అతిశయంగా చెప్పే మసక తెరవెనుక, ఒక తరం నెమ్మదిగా మార్పు వచ్చింది. 1947లో లేదా తర్వాత పుట్టిన, "అర్థరాత్రి పిల్లలు" తరంలో 1960 దశాబ్దపు రెండవ దశకు యువతీ యువకులయ్యారు. స్వతంత్రోద్యమపు ఉద్రేకాల ప్రభావం పడని, భౌతిక సంపదల ప్రపంచంగా మారిన ప్రపంచంలోని పోటీతత్వాన్ని వొంటబట్టించుకుని, ఆ తరం యువత అవకాశాల కోసం, సౌఖ్యాల కోసం చూడసాగారు. వాళ్ళకు వారి హక్కులేమిటో తెలుసు. వాళ్ళు పెద్దలను గౌరవించడం, కుటుంబ విలువలను కలిగివుండటంలో భారతీయతను నిలుపుకున్నా, సంప్రదాయాలు కాలానుగుణంగా మారితీరాలనుకునే విషయం యేదైనా దాని ప్రాచీనత్వం వల్లనే మంచిదైపోదు.

ఈ విధమైన ఆలోచనా సరళి, దాని లౌకిక వ్యవహార పై పూతలతో జీవితంలోని అన్ని కోణాలపైనా ప్రభావం చూపింది. శాస్త్రీయ సంగీతం దానికి మినహాయింపు కాదు. అది గురుకుల పద్ధతిని సమకాలీనానికి పనికిరాని పాత పద్ధతిగా తీసేసింది. దానివల్ల పాతశైలి శాస్త్రీయ సంగీతానికి బలాన్నిచ్చి సహకరించిన అనేక అలవాట్లు, పద్ధతులు అదృశ్యమైపోయాయి. సినిమా సంగీతం కూడా పాపనాశం శివం నుంచి ఎ.ఆర్. రెహమాన్‌ను చేరింది. శాస్త్రీయ ధోరణి నుంచి, బీట్ ప్రధానమైన రీతిలోకి వెళ్ళింది. శ్రవణ మాధ్యమం నుంచి సంగీతం దృశ్య మాధ్యమానికి మారి కొత్త సాంస్కృతిక రూపమైంది. సంగీతపు వీడియో సాంస్కృతిక క్రమాన్ని వెనక్కు తిప్పింది. సంగీతాన్ని వీడియో నియంత్రించేలా చేసింది. ఆధునిక యుగంలో దృశ్యం, ధ్వనిని ఓడించింది.

సంగీత సభల సంస్కృతి కూడా చాలా మార్పులకు గురైంది. ప్రధాన కారణం సంఖ్యాపరమైన పెరుగుదల అని చెప్పవచ్చు. 1940లలో మద్రాసులో ఆరు కంటే తక్కువ సభలుండేవి. ఇరవయ్యవ శతాబ్ది చివరకు యాభై సభలున్నాయి. ఈ సభల మధ్య పోటీ తరచు అనారోగ్యకరంగానే నడిచేది. ప్రతి నెలా ఒక కచేరీ ఏర్పాటుచేసే ఒప్పందం వల్ల

ఈ సభలు మంచి నైపుణ్యాన్ని ఎంచుకునే సౌలభ్యాన్ని కోల్పోయాయి. కచేరీలు క్రమం తప్పకుండా జరగాలంటే దొరికిన కళాకారుడు ఎవరైనా ఫరవాలేదనుకునేవారు. డిసెంబర్ – జనవరి నెలల్లోని 'సీజన్'లో జరిగేది ఒక ఉత్సవం తప్ప, గొప్ప గంభీరమైన సంగీత ప్రదర్శనలిచ్చే విశ్లేషణలు, అంచనాలు వేసే సందర్భం కాకుండా పోయింది. సభా స్థలాలు ఎగ్జిబిషన్ మైదానాలుగా మారి, కాసెట్ దుకాణాలు, కంచిపట్టు చీరెలతో, వజ్రాల నగల దుకాణాలతో పోటీపడాల్సి వచ్చింది. క్యాంటీన్‌లో లభించే దోసెల వడల నాణ్యతల గురించిన చర్చలు, సంగీతపు నాణ్యత గురించిన చర్చలంత ఆవేశపూరితంగా జరిగే స్థితి వచ్చింది. లభ్యమయ్యే సంగీతం యెలాగూ చాలానే వుంది. 1992లో శృతి పత్రిక పది వారాల 'సీజన్'లో 1,141 పూర్తిస్థాయి కచేరీలు జరిగాయని రాసింది. శ్రోతలు ఒక కచేరీ పూర్తి కాకుండానే యింకో కచేరీకి అది మొదలవుతోందని ఎగిరిపోయేవారు. 'సీజన్'లో మద్రాసులో వుండటమనేది ఒక కళారాధన కోరిక కాకుండా సాంఘిక అవసరంగా కనిపించింది.

❖ ❖ ❖ ❖

ఈ కొత్త యుగంలో శ్రోతల వైఖరుల్లో, వారి వుత్సాహంలో ఆసక్తుల్లో కూడా మార్పులు చోటు చేసుకున్నాయి. ఇది పరిగణనలోకి తీసుకోవాల్సినంత ముఖ్యమైన విషయమే. సాహిత్యం, చిత్రకళల కంటే సంగీతానికి అందులో విజ్ఞులైన ప్రేక్షకులు కావాలి. సంగీతాన్ని ఆనందించాలనుకునే వాళ్ళు ముందు యేది వినాలో నేర్చుకోవాలి. ఇరవయ్యవ శతాబ్దపు చివరి దశాబ్దాలలో శ్రోతలు విజ్ఞులైన రసికులుగా తయారయేందుకు కష్టపడటానికి అంత సుముఖంగా లేరు. సంగీత కళాకారులకు, రసికులకు మధ్య జరిగే పరస్పర సంభాషణ, శాస్త్రీయ సంగీతపు ఉచ్ఛ స్థితిలో యెప్పుడూ సహాయపడింది. అది యింక ఆధారపడేదిగా లేకుండా పోతుంది.

శ్రోతల అభిరుచులలో వచ్చిన మార్పు వెనకాల కనిపించని "సాంకేతికత" కారణంగా వుందా? సంగీత శాస్త్రవేత్తలలో నిశిత విమర్శకుడైన థియొడర్ అడొర్నో యిలాంటి పరిణామాన్ని గురించి 1930లలోనే వూహించాడు. 1938లో రాసిన ప్రసిద్ధ వ్యాసంలో, సగటు శ్రోతల సంగీత ప్రావీణ్యాలు సంగీతపు నాణ్యతకు ముఖ్యమైన సాధనాలనే వాస్తవాన్ని గమనించేలా రాశాడు. ఆ తర్వాత ఆయన రేడియో, రికార్డులు కచేరీలకు వెళ్ళేవారికి సంగీతమో, సంగీతవాయిద్యమో నేర్చుకోవాలని కలిగే ఆసక్తిని తగ్గించివేస్తున్నాయని వాదించాడు. ఇలా ఆసక్తి తగ్గిపోవటంవల్ల శ్రవణంలోని సున్నితత్వాన్ని తగ్గించటానికి దారితీస్తుందనీ, క్రమంగా సంగీతాన్ని పూర్తిగా మనసు లగ్నంచేసి వినే శక్తి తగ్గుతుందనీ, దానితోపాటు సాధారణ ప్రమాణాలు పడిపోయి, సంగీతాన్ని యెంత శ్రద్ధపెట్టి వినటం అవసరమో అంత శ్రద్ధ పెట్టటం శ్రోతలకు అసాధ్యమైపోతుందని నిర్ధారించాడు.

చిన్న రేడియోకో, గ్రామఫోనుకో అంత గొప్ప ప్రభావముంటే, యిక అడోర్నో క్యాసెట్లకు, సినిమాలకు, టెలివిజన్లకు యెలా స్పందించి వుండేవాడు? ఆధునిక సాంకేతికత గురించి అడర్నో అనుకున్నట్లుగానే అనుకున్న భారతీయ పండితులు వున్నారు. కానీ వాస్తవం యేమిటంటే, శాస్త్రీయమైన సాంకేతికత అభివృద్ధివల్ల ధ్వనిని చాలా స్వచ్ఛంగా, వున్నతమైన రీతిలో పునరుత్పత్తి చేయటం సాధ్యం చేయకపోయినట్లయితే సంగీతం యెన్నటికీ యిప్పటిలా ప్రపంచాన్ని జయించలేక పోయేది. కానీ ఆ విషయం సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్ వంటి విద్వాంసులను మైక్రోఫోన్ "సంగీతానికి శత్రువు" అని వర్ణించకుండా ఆపలేకపోయింది. ఆ మైక్రోఫోను ముఖ్యంగా మృదంగం ధ్వనిని పెంచటానికి వాడిన పద్ధతిని తెగనాడుతూ ఆయనిలా అన్నాడు: "సంగీతం బాగుంది. కానీ సంగీతపు చప్పుడు కర్ణ కఠోరంగా వుంది. రికార్డు చేయడం మొదలుపెట్టినప్పటి నుంచీ సంగీతం వెనక్కు తగ్గిపోతోంది."

దురదృష్టవశాత్తూ వాళ్ళు సంగీతాన్ని రికార్డు చేయటంతోనే ఆగలేదు. తర్వాత దాన్ని చిత్రీకరించటం మొదలుపెట్టారు. దాని ఫలితం విషాదకరం. మైక్రోఫోన్ ధ్వనిని మాత్రమే చెడగొడితే, కెమెరా ఒక సమూహ స్వరూపాన్నే తన చేతుల్లోకి తీసుకుని, తన ప్రాధాన్యతలకు తగినట్లుగా శ్రోతల శ్రద్ధాసక్తులను హాయిగా పక్కదారిపట్టించేసింది. గాయకులు తమ మనోధర్మాన్ని గొప్పగా పాడుతున్నప్పుడు కూడా, తన ఫోకస్‌ని తంబూర వెనకనున్న అందమైన ముఖంపై వుంచటానికి కెమెరా ఏమాత్రం సందేహించదు. గ్రామఫోను నిర్దాక్షిణ్యంగా కాలపరిమితికి లోబటమనేది, టెలివిజన్‌లోని వ్యాపార ప్రకటనలతో పోలిస్తే అంత ఘోరమనిపించదు. వినికిడిలో వచ్చిన స్థాయిలోపం, చూడటంలో వచ్చిన స్థాయిలోపంతో కలిసి మరింత పెరిగింది. సంస్కృతికి టెలివిజన్ సమకూర్చిన కీర్తితో పదబంధంలోనే ఒక వైరుధ్యం వుంది – సంగీతాన్ని చూడటం.

భారతీయ శాస్త్రీయ సంగీతం టెలివిజన్, శ్రోతల ప్రాధాన్యతలలో వచ్చిన పెను మార్పులు, కొత్తకాలపు కళాకారుల ఆశలలో వచ్చిన మార్పులు, వీటన్నిటిని తట్టుకుని నిలబడిందంటే దానికొక కారణం వుంది. ఆ స్వరయుగపు చివరిదశలో ఆ గొప్ప సంగీతాభ్యాసకులు యింకా ఆ రంగంలో వుండి 1960లకు ఈ కొత్త యుగానికి మధ్య వారధిని నిర్మించారు. తమ చుట్టూ జరుగుతున్న మార్పుల గురించి ఎరుక కలిగి వుండి, అప్పుడప్పుడూ 'జాగ్రత్త' అనే హెచ్చరికలు చేస్తున్నారు.

డి.కె. పట్టమ్మాళ్ 1977లో ఫోలియో పత్రికలో యిలా చెప్పింది: మేము సంగీతాన్ని నేర్చుకుని, అభ్యసించాము. సంగీతం మాకు ఆత్మీయం. మిగిలినవన్నీ తరువాత వచ్చాయి. ఇవాళ ప్రేరణలన్నీ వ్యాపారపరమైనవే. కాబట్టి యువ కళాకారులు అధిక సంఖ్యాకులైన శ్రోతలను ఆకర్షించే సంగీతాన్నందించే ప్రయత్నం చేస్తున్నారు". సంగీతకారుడు గురు

కె.వి. నారాయణ స్వామి ఒకసారిలా అన్నారు: "పూర్వం రోజుల్లో యువకళాకారులకు నేర్పటానికి పెద్ద విద్వాంసులు దొరకటం కష్టంగా ఉండేది. ఇప్పుడలా కాదు. ఈ రోజుల్లో పెద్ద విద్వాంసులు తమ జ్ఞానాన్ని పంచుతామని స్వయంగా ముందుకొచ్చినా, ఆ పిలుపు నందుకోటానికి యువ సంగీతకారులు అంత ఆసక్తి చూపించటం లేదు." వయొలిన్ విద్వాంసుడు టి.యన్. కృష్ణన్ 2002 ఫిబ్రవరిలలో 'స్వాతి' పురస్కారాన్ని అందుకుంటూ ఒక్క అరగంటలోనే కీర్తి సంపాదించాలనుకునే వారే, సంగీతపు ప్రమాణాలను కిందకు దిగజారుస్తున్నారని వాపోయాడు. యువతరం యొక్క ధోరణుల గురించి ఆయన రెండు ప్రత్యేకమైన ఆరోపణలు చేశారు. మొదటిది, టెలివిజన్‌లో కనిపించటం అనేది మరింత అధ్యయనం చేయటానికి అవరోధంగా మారింది. రెండవది ఆయన మాటల్లోనే చెప్పాలంటే "మేము సంగీతాన్ని అధ్యయనం చేసే రోజుల్లో మా తప్పులు ఎత్తి చూపటానికి గురువులు ఉండేవారు. ఇవాళ తప్పులేమైనా చేశానా అని అడిగే శ్రద్ధ కూడా యెవరికీ లేదు."

యువతరంలలో యిలాంటి లోపాలున్నాయని యమ్మెస్ గమనిస్తే, వాటి గురించి ఆమె తేలికపాటి మాటలతో వాటిని గురించి మాట్లాడేది, అది కూడా ఆంతరంగికుల సంభాషణలో. బహిరంగంగా అయితే ఆమె సినిమా టెలివిజన్, చుట్టుముడుతున్న వ్యాపార ధోరణులు తనను నిలబెట్టిన సంస్కృతిని యేంచేస్తున్నాయనేది యేమాత్రం పట్టించుకోకుండా తన సంగీత లోకంలో తను ప్రయాణం చేసింది. అభిరుచులలో, అభ్యాసాలలో కొత్త తరంలో వచ్చిన మార్పులు ఆమె సురక్షిత జీవితాన్ని ప్రభావితం చేయలేదు. ఆమె 60లలో, తర్వాత 70వ దశాబ్దంలో, 80వ దశాబ్దంలో కూడా అలాగే ప్రయాణం చేసింది. 1977లో న్యూయార్క్‌లోని కార్నేజ్‌హాల్‌లో కచేరీ చేసినప్పుడు ఆమె వయసు అరవైయ్యొక్క సంవత్సరాలు. పదేళ్ళ తర్వాత డెబ్భైయ్యేళ్ళు దాటాక సోవియట్ యూనియన్‌లో జరిగిన ఫెస్టివల్ ఆఫ్ ఇండియాలో ఆమె పాడింది. 1980వ దశాబ్దంలో ప్రభుత్వం యేర్పాటుచేసిన ఉత్సవాలు జాతీయ ప్రాముఖ్యత, ప్రభుత్వ ప్రాముఖ్యత గల ప్రత్యేక సందర్భాలనటంలో సందేహం లేదు. ఐనప్పటికీ, వాటికి తన కార్యక్రమాలలో చోటివ్వటంవల్ల యమ్మెస్ తన కళను ఉత్సవంలా జరుపుకోటానికి వయసుని జయించింది. సెమ్మంగుడి, రవిశంకర్, బిస్మిల్లా ఖాన్‌లతో కలసి ఆమె "ఆర్డర్ ఆఫ్ అక్టోజనేరియన్స్"గా యేర్పడి కొత్తతరానికి అనన్య సామాన్య సంపన్నమైన శాస్త్రీయ సంగీతాన్ని గుర్తుచేస్తూ వుంది.

పాతతరం సంగీత కాళాకారులకు సమాజం యిచ్చే గౌరవం ఆధునికతా యాత్ర శాస్త్రీయ వారసత్వానికి యిచ్చే చోటుని గుర్తుచేస్తూ వుంది. బ్యాంక్, మొజార్టులను, ఆండ్రూ లాయిడ్ వెబ్బర్ దాటిపోలేదు గదా. అలాగే మడొన్నా త్రీ టెనర్స్‌ను దాటి వెళ్ళలేదు గదా. జి.యన్. బాలసుబ్రమణ్యమ్ స్వాతి తిరునాళ్ మ్యూజిక్ అకాడమీకి ప్రిన్స్‌పాల్‌గా వున్నప్పుడు కొందరు యువ విద్యార్థులు కర్ణాటక సంగీత భవిష్యత్తు గురించి ఆయనేం ఆలోచిస్తున్నాడని

అడిగారు. వాళ్ళా ప్రశ్నను సీరియస్‌గా అడిగారో లేదో తేల్చుకోలేక జి.యన్.బి. యేదో ఒక ముక్కలో సమాధానం చెప్పి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. కాని ఒక నిముషంలో తిరిగివచ్చి వాళ్ళతో యిలా చెప్పాడు: "కర్ణాటక సంగీతపు ముఖం మారిపోవచ్చు. కానీ ఆ సంగీతపు ఎనాటమీ స్థిరంగా ఉండిపోతుంది." వ్యాపార ధోరణులు విజృంభించినప్పుడు ప్రమాణాలు పడిపోవటం, అలాగే క్యాసెట్లు విరివిగా దొరకటం, వీటితో శాస్త్రీయ సంగీతపు సుపరిచిత ముఖం మారినట్లు అనిపించవచ్చు. కానీ ఆ సంగీత సారాంశం గౌరవాన్నీ, ప్రజాదరణనూ పొందుతూనే వుంది. శ్రోతలు ఎంత తగ్గినా ఆ గౌరవం కొనసాగుతూనే వుంది.

❖ ❖ ❖ ❖

1960వ దశాబ్దం అనంతరం వచ్చిన యెన్నో బైటి వొత్తిడిలు పనిచేస్తున్నప్పటికీ సినిమా శాస్త్రీయ సంప్రదాయపు నిరంతరం ఆకర్షణను పైకెత్తి చూపింది. 1979వ సంవత్సరంలో పెద్ద అట్టహాసాలేమీ లేకుండా విడుదలయిన ప్రాంతీయ సినిమా "శంకరాభరణం" ఎంత గొప్ప విజయాన్నో సాధించింది. ఆ సినిమా కీర్తి ఆ నోటి నుంచి ఆ నోటకి వ్యాపించి, తెలుగులో నిర్మించినప్పటికీ దక్షిణాదంతా విరగబడి చూసింది. అందులోని కథాబలం, లైంగిక ఆకర్షణలు థియేటర్లు కిక్కిరిసిపోవటానికి కారణమని ఒప్పుకున్నప్పటికీ, సంగీతం ఆ సినిమాలో ప్రధాన ఆకర్షణ. ఆ సినిమా ఆసాంతం కర్ణాటక సంగీతశైలి చుట్టూ తిరుగుతుంది. అందులోని చాలా పాటలు శంకరాభరణం రాగంలో వుంటాయి. ఐతే అవి జనరంజక శైలిలో మార్చారు. ఆ పాటల్లో యే ఒక్కటీ పూర్తిగా కచ్చితంగా ఆ రాగానికి కట్టుబడదు. ఆ సినిమ కర్ణాటక సంగీతానికి మళ్ళీ సామాన్యజనామోదం దొరికిందనటానికి ఒక గుర్తు. ఈ సినిమాకు నకళ్ళు అదే ధోరణిలో చాలా వచ్చాయి గానీ, మరీ యే సినిమా మొదటి దానిలా సమ్మోహపరచలేకపోయింది.

శంకరాభరణం శాస్త్రీయతకంటే పాట జనాకర్షణనే యెంచుకున్నందువల్లా, తద్వారా తక్కువ ప్రమాణాలు యిష్టపడేవారి అభిరుచిని మెప్పించటం వల్లా మాత్రమే విజయం సాధించిందని వాదించవచ్చు. ఆ కొలతతో చూస్తే జి.యన్.బి.కున్న జనాకర్షణను శుద్ధ శాస్త్రీయతతో వుండే టైగర్ వరదాచారితో పోలిస్తే తక్కువస్థాయి అవుతుంది కదా. శంకరాభరణంలో గమనించాల్సిన ముఖ్యమైన అంశం యేమిటంటే కర్ణాటక సంగీతపు పతనదశలో ఆ సినిమా ఆ సంగీతంపై ఒక కిరీటాన్ని అలంకరించింది. ప్రజాకళగా కర్ణాటక సంగీత స్థాయి దక్షిణాదిలో యేమాత్రం పోలేదనీ, ఆ సంగీతం యే కాలంలోనైనా నిలిచి వుండేంత లోతుగా వ్యాపించి వుందనీ ఆ సినిమా చూపించింది. ఆ సినిమాలో ఒక హాస్య సన్నివేశంలో సంగీత గురువు నగరాల్లోని యువత అనుకరించే పాశ్చాత్య సంకర సంగీత సంస్కృతిలోని వికృత పక్షాన్ని ఉదహరించి చూపిస్తాడు. ఆ సన్నివేశం శాస్త్రీయ

శైలిని దాని గొప్పదనాన్నీ యెత్తి చూపిన తీరు అన్ని చోట్లా ప్రేక్షకుల మన్ననలను, చప్పట్లను పొందింది.

రాబోయే పరిణామాన్ని సమయానికి ముందే చూపిన సినిమా అయింది శంకరాభరణం. 1980వ దశాబ్దపు చివరి సంవత్సరాలలో, 1990వ దశాబ్దంలో కర్ణాటక సంగీతంలో పునరుజ్జీవనమని పిలువదగిన ఘట్టాన్ని పరిశీలకులు గుర్తించారు. మళ్ళీ గురుకులాలకు వెళ్ళటం, హింసాత్మకము, కఠినతరమూ అయిన సాధనలోకి నూతన సంగీతకారులు వెళ్ళే పరిస్థితి లేదు. జరుగుతున్నదేమిటంటే, ఇరవయ్యొకటవ శతాబ్దపు చివరిలో వున్న తరంయొక్క ఆలోచనలపట్లా, ప్రమాణాలపట్లా మళ్ళీ ఆసక్తి కలిగింది. పెరిగింది. గానసభలలో యువకులూ, కళాశాల్లో చదువుకున్న సంగీత కళాకారులు నిండిపోసాగారు. వాళ్ళు తమ తమ వృత్తులలో మునిగిన వ్యక్తులు, చార్టెడ్ ఎక్కౌంటెంట్స్‌గా, బ్యాంకర్లుగా, న్యాయ సలహాదారులుగా పనిచేసుకునేవారు. వాళ్ళు సంగీతంలో నిజమైన ఆసక్తిగల సంగీత కళాకారులుగా దర్శనమివ్వటం అంటే సాంస్కృతిపరంగా పెద్దమార్పు కిందే లెక్క. జి.యన్. బాలసుబ్రహ్మణ్యం తన బ్రహ్మాండమైన సంగీత జీవితాన్ని మొదలు పెట్టినప్పుడు, పెద్దవారైన వయొలిన్ వాద్యకారులు, మృదంగ కళాకారులూ ఆయనకు వాద్య సహకారం అందించటానికి యిష్టపడలేదు. ఎందుకంటే ఆయన విశ్వవిద్యాలయ పట్టభద్రుడు. అంటే ఆయనకు సంప్రదాయకమైన కఠిన శిక్షణలేదు. ఒక్కతరం గడిచేటప్పటికి మానసిక ధోరణులలో మార్పువచ్చింది. 1999లో ఒక విదేశీ పరిశీలకుడు యిట్లా రాశారు: "కర్ణాటక శాస్త్రీయ సంగీతం యువజనుల అభిమానాన్నీ, ఆదరణనూ కోల్పోలేదు సరిగదా, ఆధునిక భారతీయులు సెక్టేరియన్ దృష్టితో కాకుండా సెక్యులర్ దృక్కోణంతో ఆ సంగీతాన్ని పోషిస్తున్నారు. ఆధునిక జీవితంలో అశాంతి, మార్పులేని రొడ్డకొట్టుడుతనం, శూన్యత వారినెంతో అణచివేతకు గురిచేయటంవల్ల, ఈ కళలోని సార్వకాలీన సౌందర్యం తిరిగి కనుగొనబడింది."

ఆధునిక భారతీయులుగా, కొత్త సంగీతకళాకారులుగా భిన్నంగా ఆలోచించటమే కాదు భిన్నంగా కనిపించారు కూడా. సెమ్మంగుడి ఒకప్పుడు కర్ణాటక సంగీతకారులు వస్త్రధారణగా వర్ణించిన వేషాన్ని వారు అనుసరించలేదు. ఆయన చెప్పిన పంచకచమ్, అంగవస్త్రం, గుండెలపైనా, నుదుటిపైనా నామం – విభూతి, వెనకజుట్టు ముడి – వీటిని అనుసరించాలనుకోలేదు. ఇవాళ్టి సంగీత కళాకారులు జీన్సు, బుష్‌షర్టులు ధరించి కనిపిస్తున్నారు. వాళ్ళు పాత సంప్రదాయపు పేర్లతో కూడా లేరు. ఈ సహస్రాబ్దపు పిల్లలలో అయ్యర్లు, అయ్యంగార్లు, భాగవతార్లూ వెదికినా కనిపించరు. సాధారణమైన పేర్లు విజయ శివ, సంజయ్ సుబ్రహ్మణ్యం, ఉన్ని కృష్ణన్, బి.యమ్. కృష్ణ, సుధా రఘునాధన్, సౌమ్య, బాంబే జయశ్రీ యిట్లా –

వాళ్ళ సామర్థ్యాల గురించి ప్రశ్నించే అవసరమే లేదు. వాళ్ళు సంగీతానికి అంకితమై పోయారు. శాస్త్రీయతపై వారికి సంపూర్ణ గౌరవం వుంది. చాలామంది వాద్య సంగీతంలోనూ, గాత్ర సంగీతంలోనూ కూడా నైపుణ్యతను సంపాదించారు. వాళ్ళు తమ కళను ఆ సందర్భాన్నీ సాంకేతికతలనూ, మేధోపరమైన అవగాహనతో అభివృద్ధి చేసుకున్నారు. వాళ్ళు కేవలం సంగీతాన్ని వినిపించి వూరుకోలేదు. సంగీత సిద్ధాంతకర్తల భాషలో ఆ సంగీతపు అతి సున్నిత భిన్న వైవిధ్యాలను విశ్లేషించారు. కానీ తమ పూర్వీకుల ప్రత్యేకత అయిన మానవాతీత అలౌకిక ఆధ్యాత్మిక గుణం వారిలో లోపించింది. సాధనలేనితనం కనిపించింది. వాళ్ళలో కొందరు తమ గాత్ర పరిధిని పెంచుకునేంత కష్టం కూడా పడలేదు. కొందరు వేగాన్ని నైపుణ్యాన్ని సాధించారు. వారు తమ తెలివిని ప్రదర్శించి ఆ ముద్రను వేయగలిగారు గానీ ఒక స్వచ్ఛ సుగుణతను సాధించలేకపోయారు. చివరికి వారందరి సంగీతం ఒక రకంగా వుందనిపించుకుంది. తొలి గురువులు తమ వ్యక్తిగత ముద్ర కోసం పోటీపడి సాధించుకున్న దానికి, వీరి సంగీతం ఎంతో భిన్నం. దానికొక కారణం యేమైవుండవచ్చునంటే సి.డి. యుగంలోని శ్రోతలు యమ్.డి. రామనాథన్, బాల మురళీకృష్ణల మధ్యనున్న భిన్నత్వాన్ని ఆనందించగలిగిన జ్ఞానాన్ని కలిగివుండేవారు. కారణమేమైనా, సంగీతపు నాణ్యత విషయానికివస్తే, ఈ పునరుజ్జీవన తరం తమ పూర్వీకుల కంటే భిన్నం. ఒక టెలివిజన్ కచేరీకీ, వేదికమీద జరిగే కచేరీకి మధ్య వుండే తేడా వీరి మధ్య వుంది.

❖ ❖ ❖ ❖

యమ్మెస్ ఈ అభిరుచులలో, ఆలోచనలలో, ఆశించిన దానిలో, అభ్యాసాలలో వచ్చిన పెనుమార్పులకు నిశ్శబ్ద సాక్షి. సదాశివం రక్షణలో, ఆమె తనదైన లోకంలో జీవిస్తోంది. ఈ కొత్త ధోరణులు ఆమెకంత పరిచయం కూడా లేవు. 60వ దశాబ్దపు మార్పులైనా 90వ దశాబ్దపు మార్పులైనా వాటి పరిచయం పరిమితమే. కానీ సంగీత ప్రపంచంతో ఆమె సంబంధ బాంధవ్యాలు బలంగానే ఉన్నాయి. ఈ కొత్తతరపు నాయకులు ఆమె దేనికి ప్రాతినిధ్యం వహించినా దానికి విలువనిచ్చారు. ముఖ్యంగా ఆమె మూడు విషయాలకు ప్రాతినిధ్యం వహించింది: గాత్రంలో నాణ్యత, ఆధ్యాత్మికత యొక్క బలం, పాటను సుసంపన్నం చేసేందుకు గాయకులు దానిని వ్యాఖ్యానించటంలో చూపే సృజనాత్మకత. సంగీత కళాకారులందరూ తమ వ్యక్తిగత సృజనాత్మకతను అభివృద్ధి చేసుకునే ప్రయత్నం చేస్తారు గానీ, గాత్రం, ఆధ్యాత్మికత, ఈ రెంటిలో ఒక పరిమితి ప్రత్యేకత వుంటాయి. ఒకటి దైవమిచ్చినది. రెండవది ఆ కాలానికి ప్రత్యేకమైనది. ఈ ప్రాంతాలలో యమ్మెస్‌కున్న అనితర సాధ్యత ఆమెను యితరులెవరూ అందుకోలేని ప్రత్యేక సంగీతజ్ఞురాలిగా మలిచింది.

వాస్తవానికి శాస్త్రీయ కర్ణాటక సంగీతంలో గాత్ర లక్షణం మరీ అంత ముఖ్యమైన దేమీకాదు. టైగర్ వరదాచారి వంటి నిష్ణాతుల గాత్రం గరుకుగానే వుండేది. సెమ్మంగుడి

గాత్రం యేమీ బాగుండేది కాదు. అందుకే దక్షిణామూర్తి పిళ్ళై, సెమ్మంగుడి గాత్ర సంగీతం నుంచి వయొలిన్ వాదనకు మళ్ళమన్నాడు. రాజగోపాలాచారి సెమ్మంగుడికి నశ్యం వాడమనీ, దానివల్ల గొంతు బాగుపడుతుందని సలహా యిచ్చాడు (అదేమీ పనిచెయ్యలేదు) సెమ్మంగుడి మైక్రోఫోన్‌ను సంగీతానికి శత్రువుగా నిందించటానికి ఒక కారణం ఆయన గొంతులోని ప్రతి చిన్న లోపాన్నీ బైటకు వినిపించేలా చేయటం కావచ్చు. అలాగే మైక్రోఫోన్ మంచి కంఠస్వరాన్ని వరంగా పొందినవారి గాత్రం నాణ్యతను పెంచే పని కూడా చేస్తుంది. గ్రామఫోను, రేడియో యమ్మెస్‌కు పెద్ద వరాలు. ఎందుకంటే ఆమె కంఠస్వరం, అందులోని నిపుణమైన ఒంపుసొంపులు మైక్రోఫోను నుంచి గరిష్టంగా ప్రయోజనాన్ని పొందుతాయి.

మకరంద మధురమైన యమ్మెస్ కంఠస్వరం గురించి ఎన్నో రకాల వివరణలు వెల్లువెత్తాయి. ఒక్క పక్క ఇ.ఎన్.టి. మెడికల్ విభాగం వారి ప్రకారం కంఠ నాళాల అసాధారణ అమరికవల్ల ఆ మాధుర్యం వచ్చిందంటారు. ఇంకోపక్క ఆమె పూర్వజన్మలో దేవుళ్ళకు తేనేతో పూజలు చేసివుండటంవల్ల ఆ దైవానుగ్రహంవల్లనే ఆ గాత్ర మాధుర్యం వచ్చిందంటారు. బహుశా ఆమె కంఠస్వరం విషయంలో దేవతల ప్రమేయమే వుందని పిస్తుంది. ఎందుకంటే 1930లలో యమ్మెస్‌కు టాన్సిల్స్ సమస్య వచ్చినప్పుడు ఆమెను వారే రక్షించారు. ఆమెను ఆ కాలంలో పేరున్న ఇ.ఎన్.టి. స్పెషలిస్టు డాక్టర్ పి.వి. చెరియన్ వద్దకు తీసుకెళ్ళారు. చెరియన్ సమస్య వుందని అంగీకరించాడు గాని ఆపరేషన్ చేయటానికి నిరాకరించాడు. యమ్మెస్ గొంతుమీద కత్తిపెట్టటమంటే ఎంతో పవిత్రమైన దానిని అవమానించటమేనన్నాడు. క్రమంగా చెరియన్ కూడా ఆశ్చర్యపడేలా ఆ సమస్య తొలగి పోయింది.

యమ్మెస్ తన గొంతుని, కంఠస్వరాన్ని రక్షించుకోవటానికి ఏ ప్రత్యేకమైన పద్ధతులూ జాగ్రత్తలూ పాటించలేదు. మరీ మంచులా చల్లగా వుండే పదార్థాలూ, పానీయాలు తీసుకోకుండా వుండడం వంటి సాధారణమైన జాగ్రత్తలే తీసుకుంది. స్టీమ్ ఇంజన్ల కాలంలో తరచు చేసే రైలు ప్రయాణాలలో ఆమెకు బొగ్గుపొడి, పొగ యెదురవుతూ, గొంతుకు సంబంధించిన సమస్యలొచ్చాయి. ఆమె వాటిని సంప్రదాయ వైద్యంతోనే ఉప్పునీటితో పుక్కిలించటం వంటి వాటితోనే పోగొట్టుకునేది. 1990వ దశాబ్దపు మధ్యకాలం నుంచీ ఆమె హోమియోపతి తీసుకోవటం మొదలుపెట్టింది. అది ఆమె గొంతుకు మంచి చేసిందని నిరూపితమైంది. అయినప్పటికీ ఆమెకు సామాన్యంగా జలుబు, దగ్గు వంటి అంటువ్యాధుల నుండి స్వేచ్ఛ దొరకటాన్ని దైవకృపగానే భావించేది. ఆమె పదమూడో యేట నుంచి యెనభయ్యవపడి వరకూ ఆమె గొంతులో కంపం గానీ, బొంగురుతరం గానీ రాలేదనటం మాత్రం వాస్తవం. 2000 సంవత్సరం తర్వాతనే ఆమె నెమ్మదిగా తన కోసం తను పాడుకునే రోజువారీ అభ్యాసాన్ని మానివేసింది. ఆమె కీర్తనలలో పాదాలను మర్చిపోవటం కారణం.

కంఠస్వరం మరి ఒక వరమే – నిపుణత కాదు. ఆ కారణంగా యమ్మెస్‌ని తగ్గించిన విమర్శకులున్నారు. అది చాలా వింతగా అనిపిస్తుంది. సానుకూలమైన వనరు దేవుడి నుంచి రావటంవల్ల వ్యతిరేకంగా మారిపోదు కదా. నటుడు – గాయకుడు కె.యల్. సైగల్ విషయంలో కూడా అంతే అంటారు. అతను మంచి కంఠస్వరంతో పుట్టాడు కాబట్టి సంగీతంలోకి వచ్చాడు అంటారు. యమ్మెస్ లాగానే సైగల్ కూడా ఆయన సంగీతానికి నిజమైన కీర్తికి అర్హుడు కాదనటం వెర్రితనం. ఉస్తాద్ ఫయజ్‌ఖాన్‌కి ఈ విషయంలో యెక్కువ తెలుసు – ఆయనకు సైగల్ బాగా దగ్గరగా తెలుసు. ఉస్తాద్ స్పష్టంగా చెప్పాడు: ఈ విషయాలలో ఖుదా గురించి మాట్లాడి తేలికగా తీసివేయకండి. ఖుదా తను సహాయం చేయాలనుకున్న మనిషి లేకుండా అవసరమైన పనంతా చేయలేడు. ఔను. ఘనత అంతా ఆయనే తీసుకుంటాడు." యమ్మెస్ తనకు జన్మతో వచ్చిన దానిని స్థిరపరుచుకునేందుకు యెంతో కష్టపడింది. సాధనతో, అభ్యాసంతో కంఠస్వరాన్ని తీర్చిదిద్దుకుంది. ఆ స్వరాన్ని కావలసినట్లు తిప్పుకోగలిగిన నైపుణ్యాన్ని సంపాదించింది. మనసుపెట్టి ప్రయత్నించి ఆ కంఠస్వరపు స్థాయిని, అవకాశాన్నీ విస్తృతపరుచుకుంది. తన ఆత్మనంతా పాటలోపెట్టి పాడి ఆ గాత్ర ప్రభావాన్ని పెంచుకుంది. తన తల్లి యింట్లో బాల్యంలో గంటలకొద్దీ తంబురతో ఆడుతూ పాడుతూ గడిపిన రోజులలోనే ఆమె తన గాత్రంతో ఏకాంత తపస్సు మొదలయింది. తనకున్న ఆ వరాన్ని ఆమె గాత్ర శిక్షణను నిర్లక్ష్యం చేయటానికి ఒక కారణంగానో, విశ్రాంతి తీసుకునే తెప్పగానో వాడుకోలేదు.

ఆమె కంఠస్వరంలోని సంపూర్ణత్వం ఆమె ఆధ్యాత్మికంగా మారినప్పుడు ఆమె సంగీతానికి కావలసిన అందాన్ని యిచ్చింది. సాధారణంగా సంగీతంలో భక్తి – ముఖ్యంగా అది వినోదంతో కూడినప్పుడు – పాటక జనాన్ని వెంటనే ఆకర్షించదు. కానీ యమ్మెస్ వేరే విధంగా నిరూపించింది – మీరా భజనల రోజుల నుంచీ ఆమె సంస్కృత భాషలో ఒకే ధోరణిలో చెప్పిన సుప్రభాతాల వరకూ! సంగీతంపట్ల ఆమెకున్న సహానుభూతే దానికి కారణం. లోపలి సౌహార్ద్రతకు బాహ్యరూపమే సంగీతం అనే కర్ణాటక సంగీత భావన యమ్మెస్‌లో అత్యుత్తమంగా వికసించింది. పాటలలోని ఆధ్యాత్మిక అంతరార్థాలను ఆమె ఒక విశ్వాసంతో ఆమె తనలోకి యింకించుకుంటుంది. ఆమె భక్తి సంగీతపు వెల్లువ, ప్రదర్శనకు ప్రేక్షకుల మీద ఆధారపడే కొత్తతరం సంగీతకారులకు పూర్తి భిన్నంగా వుంటుంది. విమర్శకుడైన బి.వి.కె. శాస్త్రి సిద్ధాంతానికి బలాన్ని చేకూరుస్తుంది యమ్మెస్. ఒక సంగీతకారుడు తన సంగీతంపై వేసే వ్యక్తిగత ముద్ర ఆతని స్వంతదైన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తుంది అంటాడాయన. శాస్త్రి విశ్లేషణ ప్రకారం: డి.కె. పట్టమ్మాళ్, ఆమె సంభాషించేటప్పటివలె, మంద్రస్థాయిలో వున్న సంగీతానికి బాగా సరిపోతుంది. ఆమె పల్లవులలో బాగా రాణిస్తుంది. యమ్.ఎల్. వసంతకుమారి వ్యక్తిగా ఆవేశపరురాలు గనుక

ఆమె గాత్రం నాదస్వరంవలే వుంటుంది. సుబ్బులక్ష్మికి వేగమూ నిదానమూ రెండింటినీ సమతుల్యం చేసుకోగలిగిన సామర్థ్యం వుంది. ఆమె వ్యక్తిత్వం వలే, పాడటంలో లోతుగా, సంగీతంలో మునిగిపోయి తనను తాను మర్చిపోతుంది. ఈ గుణమే ఒకసారి చెంబై వైద్యనాథ భాగవతార్‌ను కదిలించి, కన్నీరు పెట్టించింది. సుబ్బులక్ష్మి కచేరీ వింటూ ఆయన "మేమందరం డబ్బు కోసం పాడుతాం, సంగీతం కోసం పాడేది ఒక్క సుబ్బులక్ష్మే అన్నాడు.

❖ ❖ ❖ ❖

సంగీతం అంటే ఒక రాగం బాగుందని సంతోషపడటమో, ఒక మాధుర్యాన్ని ఆనందించటమో కాదనేది స్పష్టం. సంగీతం ఒక భావోద్వేగం – ఆ భావోద్వేగం సంగీత కళాకారులు లోతుగా అనుభవించి పలవరించినపుడు అది శ్రోత లోపలికి ప్రసారమవుతుంది. ప్రత్యేకమైన 'మూడ్స్'ని కలిగించటానికి ప్రత్యేక రాగాలకు శక్తి వుంటుందనేది జగమెరిగిన సత్యమే. కళ్యాణి రాగం గానీ పంతువరాళి రాగం గానీ, మంచిగా ఆలాపన చేస్తే, ఆ ఆలాపన ఉదయసంధ్యలో చేసినా సాయంసంధ్య అనే స్పృహను కలిగిస్తుందనీ అలాగే భూపాలం గానీ బౌలి గానీ సాయం సమయంలో పాడినా ప్రభాతవేళ అనిపించగలవనీ పండిత విద్వాంసులు ప్రమాణ పూర్వకంగా చెబుతారు. 'శ్రుతి' పత్రికలో కార్టూనిస్టు సత్య బొమ్మ (అక్టోబర్ 1983)లో ఒక పాత్ర చేసిన వ్యాఖ్యానంలో విషయముంది: "అమృతవర్షిణి వర్షాల్ని కురిపిస్తుంది, పున్నాగవరాళి పాములను ఆకర్షిస్తుంది. కానీ రాజకీయ సభలకు జనాల్ని ఆకర్షించటానికి ఒక్క రాగమూ లేకపోవటం ఎంత విషాదమో కదా". తాన్‌సేన్ మల్హార్ రాగంతో వర్షాన్ని కురిపించటం, ముత్తుస్వామి దీక్షితార్ మదపుటేనుగు కోపాన్ని శాంతింపజేయటం, అనయ నాయనార్ తన వేణువాదనతో మనుషులను, పశువులను నిశ్చలంగా నిలబెట్టటం యివన్నీ కథలూ, గాథలే కావచ్చు. కానీ వాటిని జానపదుల వూహాలోకాల కథలుగా తీసిపారేసేముందు, ఇవాళ పాశ్చాత్య ప్రపంచం ఆసుపత్రులలో, విద్యాలయాల్లో సంగీతాన్ని భాగం చేసిందనీ, సంగీతం ద్వారా చేసే చికిత్స ఆధునిక వైద్యంలో భాగమైందని గుర్తుంచుకోవటం మంచిది. వీటిలో కొన్ని పద్ధతులు యివాల్టి ఆరోగ్య తపనలో పడిన కొందరి బలహీనతను అవకాశంగా తీసుకుని వ్యాపార శక్తులు చేసే హంగామా కావచ్చు. కానీ సంగీతానికున్న బాధానివారణ శక్తి మాత్రం కల్పన కాదు. మాయకాదు. చాలా సంవత్సరాలనుంచీ బాలమురళీకృష్ణ దీని గురించి పరిశోధనలు చేస్తున్నాడు. ఈ మౌలిక భావనకున్న ఆవరణ యొక్క విలువను, గంభీరతనూ పరీక్షిస్తున్నాడు. ప్రాధమికమైన విషయమేమిటంటే రాగాలన్నీ మానసిక ప్రశాంతతను యిచ్చేందుకే వుద్దేశించబడ్డాయి. మంచి భావావేశాలను కల్పించి చివరకు అశాంతిని పోగొడతాయి.

యమ్మెస్‌కు సంగీతం ఆత్మ చికిత్స. సంగీతంలో ఆమె బలాన్ని, ఓదార్పుని, చైతన్యాన్ని పొందింది. ఆమె తన సర్వస్వాన్నీ సంగీతానికి అర్పించి, బదులుగా తనకు యే శక్తీ యివ్వలేని బ్రహ్మానందాన్ని తిరిగి పొందింది. ఆమె దృక్కోణం, ధోరణి మరి కొందరికంటే భిన్నంగా వుంటుంది. బేగం అఖ్తర్ ఎప్పుడూ పాటలకు ప్రాణం పోస్తుంది. గజల్స్ పాడినా, ఠుమ్రీ పాడినా, కొన్నిసార్లు చాలా సరళమైన గజల్స్ పాడటానికి ఎంచుకున్న – ఆమె పాటలోని అర్థంతో సంగీత ధ్వని సౌందర్యం మరుగున పడకుండా చూస్తుంది. యమ్మెస్ ఆ పని ఎన్నటికీ చేయదు. ఒక కచేరీ తర్వాత మరొక కచేరికీ కీర్తనలోని అర్థం మరింత కాంతివంతమయ్యేలా తన సంగీత స్వర మాధుర్యాన్ని కలగలుపుకు పోతుంది. పాట, సంగీతం ఈ రెండూ ఒకదాని నుంచి మరొకటి వేరు కాదు. ఆమె పాడిన సుప్రభాతాలు, సహస్రనామాలు విశేషంగా, విశిష్టంగా విజయం సాధించటానికి యిదే కారణం కావొచ్చు. ఇతరుల చేతుల్లో పడినప్పుడు రోజువారీ విధి విధానాల్లో ఒకటైపోయిన పని, యమ్మెస్ దగ్గరికి చేరేసరికి, ఆమె చేతుల్లో పడేసరికి అది విశ్వజనీన ఆకర్షణను సంతరించుకుంది.

కర్ణాటక సంగీతంలోని కల్పిత సంగీతం, మనోధర్మ సంగీతం ఈ రెండింటి కలయికవల్ల యమ్మెస్ లబ్ధి పొందింది. ఆశ్చర్యకరంగా, రాఘవ ఆర్. మీనన్ వంటి పండితుడు దక్షిణ భారతీయ సంప్రదాయంలో మనోధర్మం కేంద్రంగా వుండటాన్ని పట్టించుకోలేదు. ఆయన వాదన ఏమిటంటే హిందూస్తానీ శాస్త్రీయ సంగీతంలో సంగీతాన్ని సమకూర్చిన వారెవరూ లేకపోవటంతో, గాయకులు రాగాన్ని ఆ క్షణంలో తాము విస్తరించుకుంటూ పోయారు గనుక వారే దానంతటినీ సృజించిన సృజనకారులు అయ్యారు. ఇంకోవైపు కర్ణాటక సంగీతంలో "సంగీతాన్ని తమ చేతుల్లోకి తీసుకుని దానిని సంపూర్ణమైన స్వభావ స్వరూపాలనూ, దార్శనిక సౌందర్యాన్ని, అన్ని వివరణలతో సమకూర్చి, తెలివైన చమత్కార పూరితమైన నిర్మాణాలతో మన జీవితాలకు సరిపడా పాడేశారు. అందువల్ల వాటినలాగే వప్పజెప్పేస్తే చాలు ఒక జీవితకాలం సంగీతంతో గడిపేయటానికి.... మనమింకేమీ చేయనవసరం లేదు." ఇంతకంటే సత్యదూరమైన విషయం మరొకటి వుండదు. త్రిమూర్తుల కీర్తనలను కేవలం వప్పజెప్పి కర్ణాటక గాయకుడు సాధించేదేమీ వుండదు. ఆ కీర్తనను తనదైన శైలిలో వ్యాఖ్యానించుకుంటూ, మెరుగుపరుచుకుంటూ పాడటమనేదే గాయకులు సంగీతానికిచ్చే కీలకమైన వనరులు. కర్ణాటక సంగీతంలో యమ్మెస్, డి.కె. పట్టమ్మళ్ కేవలం వల్లివేయటాన్ని ఆపేసి కృతులను తమ అవగాహన మేరకు వ్యాఖ్యానించటం మొదలుపెట్టిన తర్వాతనే మహిళాగాయకులను గౌరవంతో పట్టించుకోవటం మొదలైంది. ఒకే త్యాగరాజు కృతిని మదురై మణి, సెమ్మంగుడి, జియన్‌బి, బాలమురళీకృష్ణ ఈ నలుగురూ పాడినపుడు ఆ కృతి నాలుగు భిన్నమైన కృతులుగా

వినిపిస్తుంది. ఇంకోచోట, మీనన్, కొంత తగ్గి కర్ణాటక సంగీత కృతికి గాయకులు కొంత చేర్చవచ్చు, తీసివేయవచ్చు. – "దానిలో మౌలికమైన మార్పులు చేయలేము" అన్నాడు. ఆ మాటతో ఆయన ఒక మౌలిక సజీవ నిర్మాణం లేకపోవటం వల్ల హిందూస్తానీ గాయకులకు మేలు జరిగిందని సూచించటమంటే సంగీతపు బాగోగుల తీర్పరితనంలో కొంత అసమతుల్యతను ప్రవేశపెట్టడమే. వాస్తవానికి, మరింత తార్కికంగా వాదించవచ్చు– కర్ణాటక సంగీత కళాకారులకు ఒక వూతం వుండటం వల్ల మేలు పొందారు. అదేమిటంటే వారికి వెంకటమఖి, త్యాగరాజస్వామి వంటి జీనియస్‌లు ఒక నిర్మాణాన్ని ఏర్పరచి వుంచారు. ఐనప్పటికి వారి కాల్పనిక ప్రపంచం వారిని ఎక్కడికి తీసికెళితే అక్కడికి వెళ్ళే స్వేచ్ఛ కూడా వారికి వుంది – సంగీతంలో – మన చేతిలో లడ్డూ వుండటం, దానిని తినే అవకాశం వుండటం అనే అవకాశమన్నమాట.

నిజానికి ఒక సంగీత సంప్రదాయంలోని సుగుణాలను మరొక సంప్రదాయంతో పోల్చి చీల్చి చూడటం వల్ల ప్రయోజనం లేదు. సంగీత కళాకారులు కొన్నిసార్లు అలా చేస్తారు. చాలామంది హిందూస్తానీ కళాకారులు కర్ణాటక సంగీతాన్ని చిన్నచూపు చూస్తారు. అనూచానంగా ఉత్తర భారతీయులకు దక్షిణ భారతం గురించి వస్తున్న అజ్ఞానం వల్ల వాళ్లు కర్ణాటక సంగీతంలో "సంగీతం కంటే పదాలెక్కువ" అనుకుంటారు. వారి హ్రస్వదృష్టివల్ల వారు త్యాగరాజు, దీక్షితార్‌ల వంటివారి అసలైన విలువను అర్థం చేసుకోలేకపోతున్నారు. కానీ ఈ మందపు చూపు మధ్యరకం కళాకారులకే పరిమితం. నిజమైన సంగీతజ్ఞులు, గురువులు, కర్ణాటక సంగీతాన్ని గౌరవించటమే కాదు, వారికి ఉత్తర భారత, దక్షిణ భారత సంగీత విధానాలు రాగం అనే కారణంతో కలిసి వుంటాయని కూడా వారికి తెలుసు. కర్ణాటక, హిందుస్తానీ సంగీతాలలో అనేక సామాన్య రాగాలున్నాయి. రెండు సంప్రదాయాల్లోనూ రాగం గాయకుని వ్యక్తిగత ప్రకటన. కేవలం దాని మౌలిక తత్వాలతో చూస్తే రాగం కొన్ని కొలతల మేళవింపు. ఆ కొలతల మేళవింపే అయితే ఆ రాగం నిర్జీవం. భావం, అనుభూతి యివి ఆ రాగంలో ఊపిరులూది ప్రాణం పోస్తాయి. దీనిని ఉత్తర, దక్షిణ భారతీయ గురువులందరూ గుర్తించారు. బిస్మిల్లాఖాన్ ఒక వుపన్యాసంలో యిలా అన్నారు: రాగాలపై మనం దౌర్జన్యం చేయలేము. మనం వాటిని బలవంతంగా ఒత్తిడి చేస్తే అవి ఒక్కసారిగా కొలతలుగా మారిపోతాయి. ఆ కొలతలను వినాలని ఎవరు కోరుకుంటారు? నువ్వు పాడే రాగాలకు నువ్వెంత జీవం పోస్తున్నావనేదే నీ సంగీతానికి కొలబద్ద" మైసూరు వాసుదేవాచార్య ఒకసారి 'సునాద వినోదిని' అనే రాగాన్ని సృష్టించాడు. ఆ రాగంలో 'దేవాదిదేవ' అనే కీర్తన రచించాడు. ఆ కీర్తన సంగీత కళాకారులకు కూడా తెలియకుండా పడివుంది బాలమురళీకృష్ణ పాడే వరకూ. ఆయన పాడాక అది ఇరవయ్యవ శతాబ్దంలో అత్యంత కీర్తి సంపాదించుకున్న కీర్తన అయింది.

వాసుదేవాచార్య తన మాటలుగా చెప్పాడు – తాను కేవలం ఒక నిర్మాణాన్ని ఏర్పరచానని బాలమురళి పాడిన తర్వాతనే అది సంగీతంలో చిరకాలం నిలిచే కృతిగా ఎదిగిందని. మూల సృష్టికర్త ఒకడే కావచ్చు, కానీ రిచర్డ్ బర్టన్ హామ్లెట్‌గా నటించిన తీరు లారెన్స్ అలివియర్స్ నటనకు పూర్తి భిన్నంగా ఉంటుంది. ఉత్తర భారతదేశపు కూర్చని మధురరాగాలు తియ్యనివే; దక్షిణాదిలో సంగీతం సమకూర్చిన మధుర గీతాలు మరింత తియ్యనివా?

❖ ❖ ❖ ❖

మనం ఆపగలిగిన వివాదాలను అర్థం శూన్యతను ప్రయోగశీల సంగీతాన్ని చూసినపుడు బాగా ఆనందించగలుగుతాం. పాశ్చాత్య ప్రపంచంలో కొన్ని కేంద్రాలలో జరుగుతున్న వికృతాలను చూసినపుడు 'ప్రయోగశీలత" అనేది చాలా సున్నితమైన పదమవుతుంది. 1990లోని "పునర్ వికాసం" తీసుకొచ్చిన కొన్ని గట్టి మార్పులు కొన్ని కొత్త దారులను వేసి చివరకు జి.యస్.బి. చెప్పిన కర్ణాటక సంగీతపు "అనాటమి"ని మార్చేసి ఆయన చెప్పినది తప్పని నిరూపించటం అసాధ్యం కాదనిపించవచ్చు. రవిశంకర్ బీటిల్స్‌తో చేయి కలిపినప్పటినుంచీ గాలిలో మార్పులు కనపడుతూనే ఉన్నాయి. యమ్.ఎఫ్. హుస్సేన్ తబలా ధ్వనుల చప్పుడును వర్ణచిత్రంగా వేసి చేసిన జిమ్మిక్కు – జిమ్మిక్కుగానే మిగిలిపోవచ్చు. లేదా సంగీత వర్ణచిత్రం భవిష్యత్తులో ఒక శైలిగా మారుతుందా? పాశ్చాత్య పోకడలను అనుకరించటమనేది భారతదేశం బాగా అలవాటుచేసుకుంది. పాశ్చాత్య ప్రపంచంలోని కొన్ని వింత ప్రయోగాలు హుస్సేన్‌ని మరుగునపడెయ్యటానికి సరిపోనూ వచ్చు.

రెండవ ప్రపంచ యుద్ధ సమయం నుండీ యూరోపియన్లు ఇలాంటివి చేస్తూనే వున్నారు. వాళ్ళ విడ్డూరపు పోకడలు ఎంత అతిగా వుంటాయో 1912లో జన్మించిన జాన్ కేజ్ ఒక సంగీతాన్ని 433 అనే పేరుతో ముందుకి తెచ్చాడు. 1952లో వచ్చిన ఈ "మాస్టర్‌పీస్" పూర్తిగా నిశ్శబ్దంగా వుంటుంది. ఒక స్వరం కూడా ఆలపించబడదు. దీనిని సమకూర్చిన జాన్‌కేజ్ ఆదేశాల ప్రకారం శ్రోతలు నిశ్శబ్దంగా కూర్చుని తమ చుట్టుపక్కల నుంచి వినవచ్చే ధ్వనులను ప్రశాంతంగా వినాలి. మరి అలాంటప్పుడు ఈ సంగీతాన్ని పియానోలోని కదలికల పేరుతో ఎందుకు పిలిచారనే ప్రశ్నను అడగాలికదా – సమాధానం వచ్చింది – నిశ్శబ్దమే. చిత్రకళలో (డాడాయిజం) వలే సంగీతంలో కూడా ప్రయోగశీలతను పాశ్చాత్య ప్రపంచం చాలా గంభీరమైన వ్యవహారంగా పరిగణిస్తుంది. ఆలోచనల్లో కూడా ఆ ప్రయోగశీలత ఉంటుంది (యనార్కోసిండికలిజం) పారిస్ మధ్యభాగంలోని పాంపిడో సెంటర్‌లో చాలా ప్రధానమైంది. 1977 లో ప్రారంభమైన ఆ సెంటర్ పారిస్ న్యూయార్క్ చేతిలో పోగొట్టుకున్న కళా రాజధాని హోదాని తిరిగి పొందాలనే

వుద్దేశంతో నిర్మించబడింది. ఈ భవన సముదాయంలోని ఒక కీలకమైన విషయం ఐఆర్‌సిఎయం. దీని వుద్దేశం చాలా స్పష్టం : ప్రయోగవాద సంగీతానికి అది ప్రపంచ కేంద్రం కావాలి. ఈ పనిని పెర్రీ బేజ్‌కి అప్పగించారు. ఆయన 1925లో జన్మించిన సంగీతవేత్త. పాశ్చాత్య ప్రపంచంలో పేరెన్నికగన్న ముగ్గురు నలుగురు సంగీత వేత్తల జాబితాలో తన పేరున్నవాడు. ఒక పండితుని మాటల్లో ఆయన గురించి చెప్పాలంటే: బౌజ్ సంగీతవేత్తల రాడికల్ స్వభావానికి పతాకం వంటివాడు. సంగీతాన్ని గురించిన ప్రతిదానిని ఆయన ప్రశ్నించాడు– కచేరీల స్వభావాన్ని, ఆర్కెస్ట్రాల అమరికను, కచేరీ హాళ్ళ నిర్మాణ పద్ధతులను, ప్రస్తుతం వునికిలోవున్న వాయిద్యాలు విధించే పరిమితులను – అన్నిటినీ ప్రశ్నించాడు. 1977లో సెంటర్ బాధ్యత తీసుకుంటూ ఆయన చేసిన వ్యాఖ్య చాలా విషయాలను చెబుతుంది. ఆయనిలా ప్రకటించాడు. "చివరకు సంగీత అన్వేషణ ఎలాగోలా సాంకేతిక భాష నేర్చుకుంటుంది, దానిని ఆక్రమించుకుంటుంది."

పెద్ద ప్రశ్న ఏమిటంటే సంగీతంపై పని చేసి సంగీతంగా, సౌండ్ ఇంజనీరింగ్ భిన్నంగా వుండగలుగుతుందా? ఇరవయ్యవ శతాబ్దపు రెండవ భాగంలో ఎలక్ట్రానిక్ సింథసైజింగు, కంప్యూటర్ టెక్నిక్కులు సంగీత శాఖలుగా ఆమోదాన్ని పొందాయి. ఇది అన్ని కళలకూ వర్తించే మార్పు. దీనిని గురించి ప్రముఖ సాహితీ విమర్శకుడు జార్జ్ స్టెయినర్ యిలా అన్నాడు : "ప్రపంచం క్రమంగా పుస్తకాలను చదివే క్లాసికల్ కాలపు చివరిదశను చూస్తున్నది". ఆందోళనను, కలకలాన్నీ రేపే శీర్షిక కలిగిన పుస్తకం "సాహిత్యపు మృతి" (డెత్ ఆఫ్ లిటరేచర్) రచయిత అల్విన్ కెర్నన్ పై అభిప్రాయాన్నే తానూ ప్రతిధ్వనిస్తూ టెలివిజన్ ప్రతి విషయాన్నీ ఎలా చూడాలి, ఎలా వ్యాఖ్యానించుకోవాలి అనే పద్ధతులనన్నీ మార్చేసిందంటాడు. ఇప్పటి నిర్ణయాత్మక శక్తులు 'పదాలు కాదు దృశ్యాలు, సంక్లిష్ట, ధ్వని భూయిష్టమైనవి కావు, సాదా సీదాగా, సూటిగా అర్థమయ్యేవి, శాశ్వతం కాదు చాలా తాత్కాలికం, నిర్మాణాలు కావు ఎపిసోడ్లు, సత్యం కాదు నాటకం" అంటాడాయన. ఇది 1930 వ దశాబ్దంలో భయపడిన శ్రవణం యొక్క వెనుకంజ లాగా అనిపించవచ్చు. పాఠకులను, శ్రోతలను చూసి దృశ్యమాలిక ఈ ప్రపంచం నుంచి చాలా వేగంగా అదృశ్యమై పోతోంది. వారి స్థానంలో మోనోలిథిక్ జీవులైన ప్రేక్షకులు వస్తున్నారు.

భారతదేశం 4'33 తరహా సంగీతాన్ని తప్పించుకున్నా, ప్రజలకు టెలివిజన్ గుప్పిటిలో నుంచి బైటపడే అవకాశం లేదు. కళా సౌందర్య శాస్త్ర సంప్రదాయాలే కాదు జీవితపు కొలతలు కూడా ప్రమాదంలో పడి తమ స్వరూపాన్ని కోల్పోతున్నాయి. పాటలను సంగీతం కూర్చటంలో, అపసవ్యపు రాగాలాపనలలోని సాపేక్షక సుగుణాల గురించిన వాదనలు, వ్యాపార ప్రకటనల మధ్య చిక్కుబడిన సంగీతం ముందు ఎంత వ్యర్థమైపోతాయి. శాస్త్రీయ సంగీతపు జీవధాతువు సంప్రదాయం. కానీ అది ఎంతకాలం అలాగే నిలిచి

వుంటుంది? కాలానికి అనుగుణంగా సంప్రదాయాన్ని మార్చినవారు కూడా దాని ప్రాముఖ్యతను గుర్తించినవారే. అరియకుడి రామానుజ అయ్యంగార్ కచేరీ స్వరూపాన్ని మార్చినపుడు, మైసూరు చౌడయ్య ఏడు తీగల వయొలిన్‌ని కనుగొన్నపుడు, వాళ్ళు వాటిని శాస్త్రీయితా పరిమితులకు లోబడే వాడుకున్నారు. బాలమురళీకృష్ణ సంప్రదాయపు నిర్వచనాన్నే సవాలు చేసినపుడు, ఆయన ఒక మేధోస్థాయిలో వుండి మాట్లాడాడు గానీ, తన కళతో యిష్టమొచ్చిన స్వతంత్రాన్ని తీసుకోలేదు. సంప్రదాయం కదలకుండా అలాగే నిల్చిపోతే దాని ప్రయోజనమే ఓడిపోతుందనేది ఆయన వాదన. 1984వ సంవత్సరంలో శృతి పత్రికకు యిచ్చిన ఇంటర్వ్యూలో ఆయన సంప్రదాయమంటే సజీవంగా వుండేదే గాని మరణించింది కాదని గట్టిగా నొక్కి చెప్పాడు. "వేదికల గానం – కచేరీ గానం – దాన్ని సంప్రదాయం అంటామా?" అని ప్రశ్నించాడాయన. ఇంకా ఆయనిలా అన్నాడు "ఇతరుల కోసం పాడేవారు క్షమించరానంత పాపులని త్యాగరాజస్వామి అన్నారు... ఈ వేదికల మీద నుంచి పాడే అలవాటు యిటీవలి కాలానిది, బహుశా ఒక 75 సంవత్సరాలనుంచీ వుంది. అది సంప్రదాయం ఎలాగవుతుంది? అది అయితే గియితే పూర్తిగా అసంప్రదాయం అవుతుంది. మనమంతా పాపాత్ములం, ఇతరుల కోసం పాడే మేము... నాకు సంప్రదాయమంటే కేవలం సంగీతపు వ్యాకరణం – సప్తస్వరాలు, లయ పద్ధతులు." సంప్రదాయంతో కట్టివేయబడిన కళగా కీర్తి పొందిన కర్ణాటక సంగీత ప్రపంచంలో, కొత్తవి కొనుగొనటం కోసం, స్వతంత్రం కోసం యింత శక్తివంతమైన అభ్యర్థన చాలా అరుదుగా వినబడుతుంది. కానీ బాలమురళీకృష్ణ రాడికల్‌గా మారిపోయి కేవలం విచ్ఛిన్నం చేయటం కోసమే సంప్రదాయాన్ని విచ్ఛిన్నం చేయటం మొదలు పెట్టలేదు. ఇరవయ్యొకటవ శతాబ్ది ఉదయంలో శాస్త్రీయ కళల మౌలిక లక్షణాల గౌరవాన్ని గురించి ఎవరూ హామీ యివ్వలేరు. ఆ కళలు నిర్విరామంగా దూసుకుపోతున్న ""బాక్స్ సివిలిజేషన్" దండయాత్రను తట్టుకుంటాయనే హామీనీ యివ్వలేము.

❖ ❖ ❖ ❖

పునరుజ్జీవనానంతర, ఆధునికానంతర యుగపు యిదమిద్ధంగా ఏమీ చెప్పలేని కాలంలో మధురై షణ్ముగవదివు సుబ్బులక్ష్మి ఎక్కడ నిలబడుతుంది? తన కళలోని అంతర్గత విషయాల గురించి ఆమె తన ఆలోచనలను, అనుభూతులను నోరువిప్పి చెప్పలేదు. ఒక సంగీత కళాకారిణిగా వేదికల మీదనుంచి పాడటంలోని "పాపం" గురించి, అలాంటి విషయాల గురించి చర్చించే సామర్థ్యం ఆమెకు లేదు. కానీ ఆమె గుంపులో కనపడే ఒక ముఖం కాదు. ఆమె అసాధారణ సంగీతం వలె ఆమె జీవిత సారం కూడా అసాధారణమైనది. రెండూ కలిసి ఆమెను తన కాలానికి ఒక సంకేతంగా నిలిపాయి. ఆమె కృతజ్ఞురాలై వుండేందుకు కావలసినన్ని దీవెనలు ఆమెకున్నాయి. అలాగే ఆమె

ఎదుర్కొనేందుకు కావలసినన్ని శాపాలు కూడా వున్నాయి. ఆమె సాధించిన ఒకే ఒక్కటి ఏమిటంటే, ఆమె తన అదృష్టాన్ని చూసి మురిసిపోకుండా, తన దురదృష్టాలను బాధపడకుండా ముందుకు సాగిపోయేలా జీవితాన్ని నడుపుకుంది. ఇతరులనుంచి ఆమెకు లభించిన సహాయసహకారాలు చాలా తోడ్పడ్డాయి. కానీ, ప్రాథమికంగా, ఆమెలో అంతర్గతంగా వున్న మంచి లక్షణాలవల్లే, ఆమె సాదాసీదాతనం, నిరాడంబరత వల్లే ఆమె తన తరువువారందరికీ ప్రియమైన వ్యక్తిగా నిలబడింది. వాళ్ళు ఆమెను మరింత కీర్తిమంతురాలు కావటానికీ, మరింత ప్రసిద్ధగాయని కావటానికీ సహాయపడ్డారు.

యమ్మెస్ మంచితనంలోని గొప్ప కోణం యేమిటంటే అది సంపూర్ణంగా సహజమైంది. ఏమాత్రం తెచ్చిపెట్టుకున్నది కాదు. ఇతరుల గురించిన కఠినమైన ఆలోచనలు, అసూయ వంటి భావాలు ఆమెకు పూర్తిగా అపరిచితమైనవి. సదాశివం గురించి సాధారణంగా వినబడే మాట యేమిటంటే, అతన్ని ఒకళ్ళు మెచ్చుకుంటే, యిద్దరు ద్వేషించేవాళ్ళుంటారు. యమ్మెస్‌కి సంబంధించిన యే విషయాన్ని గానీ ద్వేషించే వాళ్ళుండటం మనకు తెలిసి యెక్కడా యే వుదాహరణా లేదు. పోటీ తత్త్వం ఒకరి మీద ఒకరు కొట్లాడుకునే తత్త్వం గల వృత్తిలా ఆమె అజాత శత్రువుగా నిలబడింది. ఆమెకు పోటీదారులు కాగలినవారు ఆమె సహాయాన్ని అందుకున్నారు. యమ్. యల్. వసంత కుమారి యమ్మెస్ ఉదారత్వాన్ని గురించి చాలా అందంగా గుర్తించి, ఆనంద వికటన్ (జనవరి 1967) పత్రికకు యిలా చెప్పింది : "యమ్మెస్ తన స్వభావానికి సహజంగా, సంగీతంలో ప్రతి వొక్కరూ పరిపూర్ణత సాధించాలని, మంచి స్థాయికి యెదగాలని కోరుకుంటుంది. ఇతరుల సంగీత కచేరీలను యే మినహాయింపులూ లేకుండా పొగుడుతుంది. వాళ్ళు చాలా సామాన్య గాయకులైనాసరే. నిరాడంబరత, దైవభక్తి, పతిభక్తి, పెద్దల యెడల గౌరవం, కొత్త విషయాలు నేర్చుకోవాలనే ఆతృత – యివి యమ్మెస్‌ను గొప్పదాన్ని చేశాయి."

సదాశివం కున్న పరిచయాల వల్ల, వాటిని వినియోగించుకోవటం వల్లా యమ్మెస్ వాస్తవంగా తనేమిటో అంతకంటే పెద్ద స్థాయికి యెదిగిందని అనుకునేవాళ్ళు చాలామంది వుంటారు. ఇది విమర్శకు అంచు. హద్దు. కర్ణాటక సంగీత సంస్కృతిలో విమర్శ శ్రోతలలో పెద్ద స్థాయిలో సంగీత జ్ఞానం వున్నవాళ్ళ నుంచి వస్తుంది. ప్రతికూలంగా విమర్శకు గురైన కళాకారిణిని అభిమానించేవాళ్ళు ఆ విమర్శనంతగా లెక్కచేయరు. ఎందుకంటే అది కూడా వారి కళారాధనలో భాగమే. యమ్మెస్ మీద విమర్శను సంగీత పరంగా కాకుండా యితర విషయాలు – తన తల్లిని శ్రద్ధగా చూడలేదనేలాంటివి కూడా ఆ వెలుగులో చూడాలి. కానీ అలాంటి విమర్శలు ఆమె వ్యక్తిత్వ మౌలిక సారాంశంపైన యే చిన్న గీటునూ పెట్టలేకపోయాయి. ఆమె సూనృతత్వాన్ని యెవరూ సందేహించలేదు. ఆమె నైపుణ్యాన్ని సంగీతం యెడల ఆమెకున్న భక్తినీ యెవరూ సందేహించలేదు. ఆమె పూర్తిగా

“బోనఫైడ్”. ఆలోచించగల రాజకీయ వేత్త అయిన రామకృష్ణ హెగ్డే “ఆమె ఒక దేవి” అన్నాడు. ఆయనకు వారి కుటుంబంతో కొన్ని దశాబ్దాల పరిచయం వుంది. “ఆమెను వివాహం చేసుకున్న తర్వాత సదాశివం కూడా మారిన మనిషయ్యాడు. ఆమెకు నిశ్శబ్దంగానే యితరులను ప్రభావితం చేయగల ఆత్మశక్తి వుంది.” అన్నాడాయన.

తక్కువ స్థాయి అవార్డు అయిన పద్మశ్రీ వచ్చిందని తెలియగానే యిక ఆ వ్యక్తి తనకు అందుబాటులోని వున్నత స్థాయి ప్రచార సభలకు వెళ్ళటానికి వుపయోగించుకునే దేశంలో, భారతదేశపు అత్యున్నత గౌరవ పురస్కారమైన “భారతరత్న” వల్ల కూడా ఆమెలో మార్పులేదు. అంతకుముందటి రామన్ మెగసేసే అవార్డు రాగానే – 1940లో కుంభకోణంలో కచేరీ యిచ్చిన తర్వాత ఆమె కంటే పెద్ద సంగీత కళాకారులందరూ కలిసి యిచ్చిన “ఇసైవాణి” బిరుదు ఆమెకు చాలా ఆనందాన్ని యిచ్చి వుంటుంది. ఎందుకంటే ఆమె దానిని సంగీతపరమైన గౌరవంగా భావించివుండే అవకాశముంది. గౌరవ పురస్కారాలు, బిరుదులు వీటిని ఆమె ప్రాముఖ్యం కలవిగా భావించలేదు గానీ సదాశివంకు అవి చాలా విలువైనవి. ఆమెకు విశ్వజనీన దృక్పథం లేదు గానీ, ఆమె కళకున్న విశ్వజనీనతతో ఆమె ఐక్యమైన తీరు గమనించదగినది. ఆమె కళ మైలాపూర్ సందర్భంలో యిమిడిపోయినంత సులువుగా కర్నిజ్‌హాల్ లేదా ఎడింబరో సందర్భంలో యిమిడిపోగలదు. ఇంత అద్వితీయ లక్షణం యెలా వచ్చిందంటే, ఆమె అన్ని సమయాలలో, అన్ని విధాలుగా ఆమె సంగీతమే అయిపోగలగటం వల్లనే. ఆమెలో తను చాలా ప్రముఖురాలిననే భావన బొత్తిగా లేదు. అందువల్ల ఆమె తన చుట్టూ వున్న చిన్న చిన్న అందాలను, ఆనందాలను హాయిగా ఆనందించగలదు. మల్లెపూల సువాసన ఆమెనెప్పుడూ సంతోషపెడుతుంది. సంగీతంలో కూడా, సామాన్యమైన అందం కలిగిన పాటలు ఆమె హృదయంలోకి సూటిగా ప్రవేశిస్తాయి. గాయకురాలిగా తను పాడే ప్రతి పదానికున్న అర్థాన్నీ హృదయంలో యింకించుకునే ఆమెకు కర్ణాటక సాహిత్య సంపదంతా ముంగిల్లోనే వుంది. ఐనా ఆమెకు యిష్టమైన పాట “వెళ్లై తామరై” “తెల్ల తామర” – సుబ్రహ్మణ్య భారతి రాసినది. ఆ పాటలో సరళమైన చరణాలలో కవి సరస్వతి యెక్కడెక్కడ వుంటుందో కళ్ళకు కట్టినట్టు చెబుతాడు. “తెల్ల తామరపూవులో, వీణానాదంలో, చిలుక పలుకులో, కోయిల కూతలో, పసిపాప తొక్కు పలుకులలో, స్త్రీల తీయని పాటలలో” సరస్వతి వుంటుందట. పాటను యమ్మెస్ యెంత అంకిత భావంతో, నిబద్ధతతో పాడుతుందంటే ఆమె కచేరీ పాటల పెన్నిధిలో యిది యెంతో హృదయానందాన్ని కలిగించే పాటగా మిగిలింది.

ఐతే యమ్మెస్‌ను కేవలం మంచి, సామాన్యమైన స్త్రీగా, “వెళ్లై తామరై” పాటను ప్రేమిస్తూ కొన్ని వైభవోపేత సాయంత్రాలను శ్రోతలకు అందించినదానిగా మాత్రమే

చూస్తే అది సరికాదు. ఆకర్షణ వెళ్ళిపోతుంది. నైపుణ్యం మిగిలిపోతుంది. సరిగా విలువ కట్టే దృష్టిలో గనుక సరితూచితే యమ్మెస్‌కు ఆమె జీవితకాలంలో ఆకర్షణను కల్పించిన యెన్నో విశేషాలు, విశేషణాలు, ఆమె వెళ్ళిపోయిన తర్వాత అర్థంలేనివవుతాయి. ఆమె ధార్మిక సేవలు, ఐక్యరాజ్య సమితిలో ఆమె ప్రదర్శన యివన్నీ కొత్త తరానికి ఏమీ పట్టవు. ఆమె సినిమాలు ఆర్కైవ్స్‌లో దుమ్ముపట్టి వుంటాయి. ఆమె భారతరత్న బిరుదు రికార్డు పుస్తకంలో ఒక వాక్యంగా మిగులుతుంది. ఆమె కాలపు విలువలన్నీ కొత్త కాలపు వర్చ్యుయల్ రియాలిటితో తుడిచిపెట్టుకుపోతాయి. అలాంటి దారుణమైన సంఘటనలను దృష్టిలో పెట్టుకోకపోయినా, మదురైకి చెందిన యమ్.డి. రామసుబ్రమణియమ్ 1990 లోనే మాటలు మింగకుండా చాలా స్పష్టంగా చెప్పాడు "చరిత్రలో యమ్మెస్ చేసిన సేవలకు శాశ్వత స్థాన వుండక పోవచ్చు. ఆమె రికార్డుల  మీద ఆధారపడని ఒక జ్ఞాపకంగా మారిపోవచ్చు." అది నిజానికి సత్యమే కావచ్చు. ఆమె రికార్డుల మీద ఆధారపడిన ఒక జ్ఞాపకంగా మారిపోవచ్చు." అది నిజానికి సత్యమే కావచ్చు. ఐతే, ఇంకోవైపు, యమ్మెస్ కథలో కొంత ప్రాధాన్యత మిగిలేవుంటుంది. అది ఆమె వ్యక్తిగత జీవితపు విజయం చుట్టూ తిరిగినంతగా, లేదా అంతకంటే ఎక్కువగా, ఆమె సంగీతం చుట్టూ తిరుగుతుంది. భారతదేశపు సాంఘిక నిర్మాణంలో పురుష దోపిడి, ఆధిపత్యాల మచ్చ అలాగే వున్నంతకాలం యమ్మెస్ జీవిత కథకు ఒక సందర్భం, విలువ వుంటుంది. అలాగే సంగీతానికి ఆమె అందించిన సేవలు కొన్ని ఎంత పరిమితంగానైనా ఒక ప్రమాణంగా, చారిత్రక విలువతో మిగులుతాయి. ఏ కమ్యూనిటిని నిందించటం ఒక ఫ్యాషన్‌గా సమాజం భావిస్తుందో ఆ కమ్యూనిటీని నుంచి వచ్చి, ఆమె యెదిగిన ఎత్తులకు చేరటం వ్యక్తిగతంగా యమ్మెస్ సాధించిన విజయం. ఆమె పుట్టి పెరిగిన వాతావరణం తన కళను అమ్మ, అమ్మమ్మల జీవితాలను శాసించిన సంప్రదాయంలోనే ఒదిగేలా ఆమెనూ నిర్దేశించింది. స్త్రీగా పుట్టటమనేదే వాస్తవానికి యమ్మెస్ జీవితానికి, వృత్తికి కీలకమైన విషయం. ఆమె తన అన్న శక్తివేల్ యేం చెయ్యాలనుకుంటే అది చేసే స్వేచ్ఛ కలిగివుండటాన్ని చూసింది. అతను తాననుకున్నది సాధించలేకపోయినపుడు కూడా యెవరూ ప్రశ్నించలేదు. వదివంబాల్ తన జీవితానికి సంబంధించిన యే విషయాన్నీ నిర్ణయించుకోలేకపోయింది. చివరకు ఆమె ఒకే నిర్ణయాన్ని తీసుకోగలిగింది – ప్రయత్నించటం మానుకోవాలని. యమ్మెస్ అంత తేలికగా లొంగిపోలేదు. ఒక స్త్రీగా పొందగలిగిన, పోగొట్టుకోగలిగిన అవకాశాన్ని ఆమె యెదుర్కొంది. తన జీవితంలోని సంక్లిష్ట సమయంలో పట్టుదల కావాల్సినపుడు పట్టుదలను ప్రదర్శించింది. ఆమె విషయంలో ఆ పట్టుదల చాలా యెన్నదగినది. ఎందుకంటే ఆమె విశ్వాసం, ఆమె మనస్తత్వం వీటి ప్రకారం ఆమె అణుకువ గలిగిన సంప్రదాయపరురాలు. సదాశివం ఆమె జీవితాన్ని తన కంట్రోలులోకి తీసుకున్న

తర్వాతనే, తాను 'సురక్షితంగా' వున్నానని అనుకున్న తర్వాతనే ఆమె తన సహజమైన, మౌలికమైన స్వభావాలలోకి తిరిగివచ్చి, తనను తాను యెంతో కాలంగా గౌరవింపబడుతున్న తమిళ భార్యాత్వపు సంప్రదాయాలలో ఒదిగిపోయి, తనను తాను కండిషన్ చేసుకుంది. తనకున్న లొంగిపోగల శక్తిని చాలా బాగా వినియోగించుకుంది. బెంగుళూరు నాగరత్నమ్మ, బాల సరస్వతి వంటి వుద్దండులు సాంఘికమైన గుర్తింపు నిరాకరించబడటంతో విరక్తి చెందితే, యమ్మెస్ చాలా అందంగా ఆమోదం, హోదాల ఆవరణలోకి ఎగిరివెళ్ళగలిగింది.

సదాశివాన్ని అందరూ నగలవర్తకుడంటారు. "తనకు వజ్రాన్ని సానబెట్టినవాడు"గా గుర్తిస్తారు. ఐతే యింత యెక్కువగా ప్రచారం కాబడిన దానిని యధాతధంగా తీసుకోవటం తప్పవుతుంది. నిజానికి యమ్మెస్ తన జీవితంలో చాలా ముందుగానే గ్రహించింది – తాను ఈ చెట్టియార్‌కో ఆ జమిందారుకో ఆటబొమ్మగా జీవితాన్ని ముగించాల్సి వుంటుందని. తన కిశోరప్రాయపు అమాయకత్వంతో, తన తలరాతను తాను భిన్నంగా మార్చుకోవచ్చుని, మార్చుకోవాలనీ నిర్ణయించుకున్నది యమ్మెస్సే. తనంతట తాను ధైర్యంగా యిల్లు వొదిలి మద్రాసు శరణుజొచ్చింది యమ్మెస్సే. సదాశివం గురించి తెలిసి తెలిసి అతనిని తన సంరక్షకుడిగా, మార్గదర్శిగా యెంచుకున్నది యమ్మెస్సే. ఎంత జ్ఞానవంతురాలు కాకపోయినా, యమ్మెస్ చేసిన పని విలువను, గొప్పదనాన్ని మనం యెన్నడూ తక్కువ అంచనా వేయలేము. వాస్తవానికి అప్పుడున్న సాంఘిక పరిస్థితులలో ఆ నేపథ్యంలో ఆమె చేసింది అద్భుతానికంటే తక్కువేమీ కాదు. ఒక నది తన ఆధారానికి మించిన యెత్తుకు యెదిగేలా ఆమె చేసింది.

సంగీతపరంగా మాత్రమే చెప్పాలంటే ఆమె మొదటి వరుసలో వుండే సంగీత గురువులలో చేరదు. అరియకుడి రామానుజ అయ్యంగార్ చేసినట్లు ఆమె తన కళా పరిణామ క్రమాన్ని ప్రభావితం చేసే కొత్త ఆలోచనల మీద పనిచేయలేదు. జి.యన్. బాలసుబ్రహ్మణ్యం వలే ఆమె తనదంటూ స్వంత బాణిని అభివృద్ధి చేసుకోలేదు. యల్. వసంత కుమారిలా తనకో శిష్య బృందాన్ని తయారు చేసుకోలేదు. వసంత కుమారి జి.యన్.బి సంప్రదాయాన్ని, డి.కె. పట్టమ్మాళ్ పాపనాశం శివం మార్గాన్ని అనుసరించి దానిని పోషించినట్లుగా యమ్మెస్ యే ఒక్క సంప్రదాయాన్నో సుసంపన్నం చేయలేదు. ఆమె శైలిలో యేదైనా ప్రత్యేకత వుందంటే, అది ఆమె హృదయాన్నించి హృదయానికి తాకేలా సంగీతాన్ని పాడే పద్ధతే. అలత్తూర్ సోదరులూ, సెమ్మంగుడులు, రామనాథన్‌లూ మెదడునుంచి మెదడుకి తాకేలా పాడుతారు. ఆమె మరికొన్ని విశేషాలను కూడా చేసి చూపింది. అవి రికార్డులలో స్థానం సంపాదించుకోవచ్చు. కర్ణాటక సంగీతంలో స్త్రీల పట్ల వున్న వివక్ష అనే గోడను పగులగొట్టింది. మద్రాసు మ్యూజిక్ అకాడమీ నుంచి సంగీత కళానిధి అనే బిరుదు పొందిన మొదటి స్త్రీగా నిలిచినపుడు, ఆమె జెండర్‌తో

సంబంధం లేకుండా నైపుణ్యాన్ని గుర్తించేలా వ్యవస్థను ఒత్తిడి చేసింది. ఆమె కర్ణాటక సంగీతాన్ని దక్షిణ భారతదేశపు యెల్లలు దాటించింది. భక్తి అనేది త్యాగరాజు కాలంలోవలె తన కాలంలోనూ సంగీతానికి ఆమోదయోగ్యమైనదని చూపించింది. సంగీతపు సులక్షణాలనేమీ కోల్పోనవసరం లేకుండా భక్తిని అందుకోవచ్చని నిరూపించింది. మిగిలిన వారందరికంటే చాలా ప్రముఖంగా యమ్మెస్ తెరచిన పరచిన దారులు, ప్రయోజన కరమైన దారులు యివే. ఇవి తెలుసుకున్నప్పుడు కర్ణాటక సంగీత ప్రధానాధ్యాపకులుండే రెండవ వరుసలో ఆమె స్థానం పదిలంగా వుంటుంది. అక్కడ ఆమె స్థానం అద్వితీయమైనది. యమ్మెస్‌ని ముందువరుసలోకి జరపమని చరిత్రను అది ఒత్తిడి చేస్తూనే వుంటుంది.

మిగిలిన అన్ని విషయాలనూ పక్కన బెడితే, యమ్మెస్‌కున్న మానవతా దృక్పథం ఆమెను యితరులనుంచి ప్రేత్యేకంగా నిలబెడుతుంది. అంతటా వ్యాపించిన మానవత్వం, ప్రత్యేకమైన విజయాలకంటే, ఆ మానవతా మూర్తులను ప్రత్యేకంగా ఎత్తి చూపుతుంది. 1936లో రవీంద్రనాధ ఠాగూర్ జవహర్‌లాల్ నెహ్రూ ఆత్మకథను చదివి యిలా రాశాడు : ఇందులోని వివరాలన్నిటితోపాటు ఒక మావనవతా శక్తి వాస్తవాల చిక్కుముడులలోనుంచి ప్రవహించి, మనల్ని యే వ్యక్తి తను చేసిన పనులకంటే గొప్పవాడో, తన పరిసరాలకంటే సత్యమైనవాడో ఆ వ్యక్తి వద్దకు మనలను తీసుకెళుతుంది" భారతీయుడైన సత్యజిత్‌రే లో జపాన్‌కి చెందిన అకిరా కురసోవా కనుగొన్నది యిదే. "మానవజాతి యొక్క ప్రేమ తత్వాన్ని అర్థం చేసుకోవటం." కర్ణాటక సంగీత రంగంలో యమ్మెస్ ప్రేమించినంతగా మానవజాతిని మరెవరూ ప్రేమించలేదు. ఆమె తన జీవితాన్ని యే విధమైన వుచితమైన చట్రంలో జీవించాలనుకుందో ఆ జీవితం యితరులు కూడా అలాగే జీవించాలని ఆమె కోరుకుంది. ఆ వుచితమైన చట్రాన్ని అందించేందుకు జీవించింది. ఆమె రంగస్థలంపై ఆమె ప్రదర్శనకంటే గొప్పది; ఆమె తన కుటుంబ, వృత్తి పరమైన పరిస్థితులకంటే సూనృతమైనది. చివరకు, బహుశా, సంగీత కళాకారిణి అయిన యమ్.యస్. సుబ్బులక్ష్మిని, వ్యక్తిగా సుబ్బులక్ష్మితో సరిపోల్చి చూసుకోవాలేమో.

## అనుబంధం

# ప్రేమతో యమ్మెస్

ఆమె జీవితంలోని గొప్ప ప్రేమ గనుక ఫలించివుంటే యమ్.యస్. సుబ్బులక్ష్మి జీవిత కథ నాటకీయమైన, భిన్నమైన మలుపు తిరిగివుండేది. 1940 జులైలో వివాహమైనప్పటి నుంచీ ఆమె సదాశివంకు మొక్కవోని నిబద్ధతతో అంకితమైంది. కానీ ఆమె నిజంగా మొదటిసారి ప్రేమించినది జి.యస్. బాలసుబ్రహ్మణ్యంని. కర్ణాటక సంగీతాభిమానులందరి వలే ఆమె కూడా జి.యన్.బి. అనన్యసామాన్యమైన గానశైలికి సమ్మోహితురాలయింది. 'శకుంతులై' సినిమాలో వారిద్దరూ కలిసి పనిచేసేనాటికి, ఆ సంగీతకారుడి మీద యమ్మెస్‌కున్న గౌరవం హృదయ సంబంధమైన అనుబంధంగా వికసించింది. తన తల్లిగారింటినుంచి వచ్చేసిన రాజులనాటి సాహసం మళ్ళీ అతనికి ఉత్తరాలు రాయటానికి కూర్చున్నప్పుడు బైటికి వచ్చింది. రాయబారుల ద్వారా, మధ్యవర్తుల ద్వారా పంపిన ఉత్తరాలలో ఆమె నిజాయితీ, సూటిదనంతోపాటు పట్టుదల కూడా ఆ నిర్ణయాన్ని స్పష్టంగా వ్యక్తం చేసింది. "ఇప్పటి నుంచి ఒక్క క్షణం కూడా మీ నుంచి వేరుగా వుండను" ఐతే అలా జరగలేదు. సదాశివం హడావుడిగా యమ్మెస్‌ను పెళ్ళాడాడు. మొదటి భార్య చనిపోయిన వెంటనే జరిగిన వివాహం చాలామందికి "విచక్షణలేని ఆత్రుత"గా అనిపించింది. ఆ వివాహంతో యమ్మెస్‌మీద సదాశివం అధికారానికి అనుమతి దొరకటంతో, జి.యన్.బి.తో జీవితం గురించిన ఆమె ఆశలు మొగ్గలోనే తుంచివేసినట్లయింది.

ఐనప్పటికీ ఆ కొద్దికాలపు జ్ఞాపకాలు మిగిలివుంటాయి. చాలా నలిగిపోయి వున్నప్పటికీ, జీవితపు తొలి రోజులలో యమ్మెస్‌పైన ఆలోచనలు, ఆమె కుటుంబ పరిస్థితి, జి.యన్.బి.తో కలిసి సంగీత భాగస్వామ్యం వీటన్నిటికీ రికార్డుగా ఉత్తరాలు వున్నాయి. ఈ కోణాలన్నీ చాలా క్లుప్తంగా, యాధాలాపంగా చెప్పబడినప్పటికీ, ఆమె మనసులోపలి తొంగి చూసే ఈ వెసులుబాటు మొత్తం దృశ్యాన్ని ప్రకాశవంతం చేస్తున్నది. జి.యన్.బి. ఈ వుత్తరాలను దాచివుంచాడు. అతనిలోని రచయిత వాటి అసలు విలువను గ్రహించివుంటాడు. వాటి భద్రత గురించి ఒకటికి రెండుసార్లు జాగ్రత్త పడి వాటిని మూడు రాష్ట్రాలలో వున్న కుటుంబ మిత్రుల దగ్గర భద్రపరిచాడు: తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన మిత్రులువారు. వాళ్ళు తమ వంతు కర్తవ్యంగా ఈ ఉత్తరాలను అతి జాగ్రత్తగా, అనేక దశాబ్దాలుగా వాటిని కాపలా కాశారు. సంచలనాలు సృష్టించేవారికి ఈ ఉత్తరాల వునికి తెలియన్వికూడదనే స్థిరనిశ్చయంతో భద్రపరిచారు. ఇక వాటిని అందనిచ్చే పరిస్థితే లేదు. ఈ రచయితకు ఆ ఉత్తరాల ఉనికి గురించి

బొత్తిగా వూహాతీమైన పరిస్థితులలో తెలిసింది. ( ఆ ఉత్తరాలను పరిక్షించటానికి నన్ను అనుమతించేంత నమ్మకం నామీద వుంచిన వ్యక్తులకు నేను కృతజ్ఞుడనై వున్నాను).

నేను ఇరవై ఉత్తరాల వరకూ చూశాను. వాటిలో ఒకదాని మీదే రాసిన తేదీ వేసి వుంది. (జనవరి 8 1940) మళ్ళీ పరిశీలిస్తే అవన్నీ 1939-40 సంవత్సరాలలో 'శకుంతలై' సినీ నిర్మాణ కాలంలో రాసినట్లుగా తెలుస్తున్నది. నోటు పుస్తకాలనుంచి చించిన కాగితాల మీద తమిళంలో రాసిన ఆ ఉత్తరాలను వూరికే చదివినపుడు, పదాలను వాక్యాలను, ఆలోచనలను సరిగా కూర్చకుండానే సమాహారం చేసినట్లు, మేధోపరమైన విశేషాంశం బొత్తిగా లేనట్లు అనిపిస్తుంది. కానీ అనురాగపు లోతు గురించి మాత్రం సందేహం కలగదు. ఒక ఉత్తరం పద్ధతిగల సంబోధనతో మొదలవుతుంది. మాన్య జి.యన్.బి అవర్‌గళ్ అంటూ. రెండు ఉత్తరాలు "మై డియర్" అంటూ ఇంగ్లీషులో మొదలవుతాయి. అనేక ఉత్తరాలు అపేక్షనూ కోరికనూ ప్రకటిస్తాయి. "నా జీవితాన్ని, శరీరాన్ని, ఆత్మను స్వాధీనం చేసుకున్న నా ప్రేమకు రాస్తున్నది" – "నా జీవితపు ప్రేమకు" "నా జీవితాన్ని తన చేతుల్లోకి తీసుకుని నన్నింకా వేదనను పడనిస్తున్న వ్యక్తికి". ఉత్తరాలలో సంతకం కూడా అంత సూటిగా వుంది. "మిమ్మల్ని పూజించే కుంజు నుంచి" "నా ప్రేమ, నా జీవిత సర్వస్వం, మీ చేతివ్రాతనూ మీ సంగీతాన్నీ ముద్దాడుతూ. ప్రేమను, దగ్గరితనాన్ని తెలిపే పదాలు, ముఖ్యంగా "కన్నా" "అన్బే" అనేవి తరచూ కనిపిస్తాయి. ప్రతి ఉత్తరంలో, ప్రతివాక్యంలో యమ్మెస్ కనిపిస్తుంది. ఇరవైమూడు, ఇరవైనాలుగేళ్ళ వయసులో పూర్తిగా ప్రేమలో మునిగిన స్త్రీ అప్పటి యమ్మెస్.

వారిద్దరిమధ్యా యెవరి పర్యవేక్షణా లేకుండా జరిగిన సమావేశాల గురించిన ప్రత్యేక ప్రస్తావనలున్నాయి. అలాగే జి.యన్.బి ఆమెకు రాసిన ఉత్తరాల ప్రస్తావనలూ వున్నాయి. ఐతే యమ్మెస్ నివసించిన బంగారు పంజరంలో ఆ ఉత్తరాలు మిగిలివుండే అవకాశే లేదు. యమ్మెస్ తనుగా రాసిన ఉత్తరాల ఆధారంగానే జి.యన్.బి. ఆమె వెలిబుచ్చినంత సూటిగా తన ప్రేమను వ్యక్తం చేయలేదనిపిస్తుంది. అతను తరచు తనవంక చూడటం లేదని తనతో యెక్కువ సమయం మాట్లాడటం లేదనీ, తనను స్పృశించవలసినంతగా స్పృశించటం లేదని, తనతో గడపవలసినంత సమయాన్ని గడపటం లేదని ఆమె ఆరోపణలు వుత్తరాలలో వున్నాయి. కానీ ఆమె ప్రేమకు యెలాంటి షరతులూ లేవనే విషయంలో ఆమె సందేహానికి తావివ్వలేదు. ఆమె యిలా రాసింది: "నేను కోరేది కన్నుల పండుగగా మిమ్మల్ని చూడటం. ఐతే మీరు నా వైపు చూడటానికి తలకూడా యెత్తరు. ఇది నా మనస్సుని ఎంతగా బాధిస్తుందో మీరు వూహించగలరా? నేనిలాగే రాలిపోతాను." అనేక సందర్భాలలో ఆమె అతని మాటలవల్లా, చూపులవల్లా, ఉత్తరాల వల్లా యెలా ప్రభావితమైందో వివరంగా రాసింది. "నేను మీ ఫోటోను కౌగలించుకుని యేడ్చాను." అని ఒకసారి రాసింది. "ఆ ఫోటో నాతో మాట్లాడగలదంటావా నా కన్నా?"

కొన్ని వుత్తరాలలో ఆమె కుటుంబం గురించి చారిత్రకంగా ఆసక్తిని కలిగించే ప్రస్తావనలున్నాయి. ఒక సందర్భంలో ఆమె రాసింది: "మా ఇంట్లో నాకు సంతోషం లేదు. కేవలం సమస్యలే వున్నాయి.... మా అమ్మ యింకొన్ని సంవత్సరాలే జీవిస్తుంది. మా అన్న నా శత్రువు. నా చెల్లెలు నాతో బాగుంటుంది... నేను మీ దగ్గర యేదీ దాచను. నేనింత వరకూ సంతోషంగా లేను. నేను జీవించివున్నానంటే యిక్కడుండటం వల్లనే. కన్నా, ఇదంతా రాయటానికి యివాళ కొంచెం సమయం దొరికింది. ఒక విషయం మాత్రం పరమ సత్యం. నీ ఆనందమే నా ఆనందం, కన్నా.... నువ్వు యింతకుముందు ఏం చేస్తున్నావని నన్నగడవచ్చు. నేను బాధపడుతూ వున్నాను." ఆమె యిలా రాసింది: "నేను నేనుంచి వేరు కాను. అనవసరంగా నన్ను పరీక్షించవద్దు. ఈ ఫిలిం పూర్తయ్యాక మనిద్దరం కలిసివుందాం.... మీ మీద నాకున్న ప్రేమ యెన్నటికీ మారదు. నేను చనిపోయాక మీరది తెలుసుకుంటారు. పుట్టినప్పటి నుంచి నా జీవితంలో కష్టాలే... నేను పాపాత్మురాలిని. ఇలా బాధపడటానికి నేనెన్నో పాపాలు చేసి వుంటాను. నేను మధురైలో వున్నట్లయితే యెప్పుడో చచ్చిపోయేదాన్ని... నాకు చెప్పుకుని యేడ్చేందుకు కూడా యెవరూ లేరు... రోజూ నీ గురించి కలలు కంటాను మరి మీరో?... కలిసి నటించేటపుడు మీ స్పర్శ తగిలినపుడు నాలో నేననుకుంటాను. "ఈయనే నా దేవుడు" అనుకుని ఉప్పొంగిపోతాను." ఒకటి కంటే యెక్కువసార్లే ఆమె స్పష్టం చేసింది. "నాకు డబ్బు అవసరం లేదు. మీ ప్రేమ మాత్రమే కావాలి."

తాను మధురైలో కాకుండా మద్రాసులో వుండటం వల్లనే జీవించివన్నానని ఒప్పుకున్నప్పటికీ, సదాశివం యింట్లో అనేక విధినిషేదాల కింద బ్రతుకుతున్నాననే విషయం ఆమెకు ఎరుకలో వుంది. ఒక సందర్భంలో ఈ కింది విషయం చెబుతూ "మీరు నాతో సాధారణంగా సంతోషంగా వున్నా చాలు అది నాకు గొప్ప సౌఖ్యాన్ని కలిగిస్తుంది" అంటూ ఆమె యింకా యిలా అన్నది" ఇంట్లో వున్న మనుషులు నన్నేం చేస్తారో నాకు తెలియదు." ఆ తర్వాత ఆమె నిరాశలోకి జారిపోతూ:"అమరుడైన పుష్పవనం అయ్యర్ చిరకాలం జీవిస్తాడని జ్యోతిష్కుడు జోస్యం చెప్పాడు. ఐనా ఆయన చిన్న వయసులోనే చనిపోయాడు. నేనూ అలాగే పోతాను. నేను చచ్చిపోవటమే మంచిది." పుష్పవనం గురించి ఆమెకంత బాగా తెలుసు? ఆయనను తీసుకుపోయినట్లే విధి తనను తీసుకుపోతుందని యెందుకు భావించింది? పుష్పవనంకు తన తల్లికి వున్న సంబంధం గురించి వచ్చిన మాటలవల్ల ఆమె ప్రభావితమై వుంటుంది.

జి.యన్.బిలో ఆమె తన స్వంత విముక్తిని, దానితోపాటు సంగీతపరమైన ప్రేరణకు ఒక ఆధారాన్ని చూచి వుండవచ్చు. సంగీతం తప్పనిసరిగా ఆమె ప్రేమకు ఆహారం. జి.యన్.బి. సంగీతం మీద ఆమెకున్న ప్రేమను పదే పదే నొక్కి చెప్పటం, 'శకుంతలై'లో వీరిద్దరూ కలిసి పాడిన యుగళగీతాన్ని ఎత్తి చూపుతూ ప్రస్తావించటం చేసింది. ఈ పాట "ప్రేమలో మనం సర్వం మర్చిపోతాం" అనేది దక్షిణాదిలో ఎప్పటికీ నిలిచివుండే మంచి

పాటగా మిగిలింది. "చివరికి ఇప్పుడైనా" ఆమె పరిహాసంగా అన్నట్లు రాసింది. "ఈ యుగళగీతాన్ని చిత్రీకరించేటపుడు మీరు సహజమైన కోరికను నిరోధిస్తారా?" శాస్త్రీయ సంగీతానికి ఆమె మనసులో సుస్థిర స్థానం వుంది. పట్టణంలో ఒక కచేరీకి వెళ్ళి వచ్చిన సంగతి రాస్తూ "ఆ కచేరీ యేమీ బాగోలేదు. మీ సంగీతం తప్ప నా చెవులకు మరొకటి యెక్కదు. ఇది వెల్లవేయని నిజం. నేను అచ్చు మీలాగే పాడాలి. ఈ ఫిలిం పూర్తయిన తర్వాత కూడా మీరు నాకు సంగీతం నేర్పటం కొనసాగిస్తారని నాకు తెలుసు."

జి.యన్.బి. యెంతోమంది కావాలనుకునే కర్ణాటక సంగీత గురువు. ఆయన అభివృద్ధి చేసిన ప్రత్యేకమైన శైలి జి.యన్.బి. బాణి, అనేకమంది శిష్యులను ఆకర్షించింది. "శకుంతలై" షూటింగు సమయంలో కథానాయకుడు, నాయకి కలిసి రిహార్సల్స్ చేసిన సందర్భాలు అనేకం వుండి వుంటాయి. అప్పుడు యమ్మెస్, జి.యన్.బి. బాణిలోని మెలకువలు నేర్చుకోవాలని చాలా ఆతృతతో ప్రయత్నించి వుండవచ్చు. ఈ అనుభవం వల్ల యమ్మెస్ జి.యన్.బితో కలిసి 'ప్రేమయిల్' అనే పాట సృష్టించిన ఇంద్రజాలాన్ని పెంచాలని కలగని వుండవచ్చు. ఒక వుత్తరంలో ఆమె యిలా రాసింది : "మనిద్దరం కలిసి తప్పకుండా పాడాలి. ఆ సమయంలో మీరు కాదనకూడదు. హెచ్‌యమ్‌వి ఆ రికార్డుని ఆవిష్కరించే అవకాశాలు చాలానే వున్నాయి ( వారి పాటల రికార్డుని) కానీ అది కూడా జరగలేదు. సంగీత సృజనలో కొత్త కోణం వెలికిరాకుండా సదాశివం వేసిన పెద్ద వ్యూహం అడ్డుకుంది. యమ్మెస్ ఆయన చెప్పిన రీతులలో వజ్రంగా మారింది – ఆయన ఒక్కడికే.

ఇప్పుడు "అలాగయితే యేం జరిగివుండేదని" వూహించబోవటం పూర్తిగా అకడమిక్ వ్యవహారం అవుతుంది. యమ్మెస్ మనస్ఫూర్తిగా జి.యన్.బి.ని ప్రేమించిందనేది స్పష్టం. దుర్మార్గులు, మొరటువాళ్ళు, అజ్ఞానులు అయిన మగవాళ్ళతో నిండిన రంగంలో ఆయన ఆమెకు మంచి అభిరుచులు కలిగిన మనిషిగా, కనిపించి వుండవచ్చు. పైగా అతని సంగీతం ఆమెకెంతో ప్రీతిపాత్రం. జి.యన్.బితో భాగస్వామ్యం యమ్మెస్ సంగీతానికి తీరని లోటు. ఒక సంగీత కళాకారిణిగా ఆమె బందీ కావటం సంగీతానికి తీరని లోటు. ఇంకోవైపు జి.యన్.బితో జీవితం ఆమె కోరుకున్న భద్రత, వ్యక్తిగతంగా ఆమెకెంతో అవసరమైన భద్రత దొరికివుండకపోవచ్చు. దానితోపాటు ప్రపంచంలో ఒక రీతికి ప్రతినిధిగా హోదాను యిచ్చి ఉన్నతస్థానానికి చేర్చిన నాయకత్వ నైపుణ్యం ఆమెకు దొరికి వుండకపోవచ్చు. భావోద్వేగపరంగా ఆమె కోల్పోయివుండవచ్చు. వృత్తిపరంగా ఆమె యెంతో పొందింది. ఆమె ప్రేమించే సాహసం చేయటం ఆమె స్వభావిక బలానికి, శక్తికి ఒక నిదర్శనం. ఆ అధ్యాయాన్ని మూసివేసే సాహసం చేయటం, తను వివాహమాడిన వ్యక్తితో స్థిరపడటం కూడా అంతే. ఈమె ఒక నోరులేని 'సాధుజీవి' కాదు. ఈమె నిర్ణయాలు తీసుకోగలదు. తనకేం కావాలో ఆమెకు తెలుసు. ఈ వుత్తరాలు మనకు – సంపూర్ణ మానవి, సంపూర్ణ స్త్రీ అయిన యమ్.యస్. సుబ్బులక్ష్మిని ఆవిష్కరిస్తున్నాయి.



**రచయిత గురించి :**

**టి.జె.యస్. జార్జ్** ప్రసిద్ధ జర్నలిస్టు. 1950వ సంవత్సరంలో 'ఫ్రీ ప్రెస్ జర్నల్'లో పత్రికా విలేఖరిగా తన వృత్తిని ప్రారంభించాడు. 'ఏషియా వీక్' పత్రిక ప్రారంభ సంపాదకుడు. రాజకీయ రచయితగా జీవిత చరిత్రల రచయితగా స్థిరమైన స్థానం సంపాదించుకున్నాడు. ఆయన ప్రసిద్ధ గ్రంథాలలో "లీకున్ యూస్ సింగపూర్" "ది లైఫ్ అండ్ టైమ్స్ ఆఫ్ నర్గీస్ అండ్ కృష్ణ మీనన్ : ఎ బయోగ్రఫీ. "న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్"కు సంపాదక సలహాదారుగా వుంటున్నారు. ఆయన, భార్య అమ్ము, బెంగుళూరులో నివసిస్తున్నారు.

**అనువాదకురాలి గురించి :**

**'ఓల్గా'**గా అందరికీ సుపరిచితురాలైన **పోపూరి లలితకుమారి** తన స్త్రీవాద రచనలతో తెలుగు సాహిత్యంలో కొత్తదారులు వేసింది. ఆమె జన్మస్థలం గుంటూరు. 35 సంవత్సరాలుగా హైదరాబాద్ నివాసి. 2015లో ఆమె కథా సంపుటి "విముక్తి" కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారాన్ని పొందింది. కథ, నవల, కవిత్వం వాటితోపాటు సినిమా, టెలివిజన్, నాటకం నృత్యరూపకాలు, చరిత్ర, స్త్రీవాద సిద్ధాంతం, అనువాదాలు సంపాద కత్వం, సాహిత్య విమర్శ వంటి అనేక ప్రక్రియలలో స్త్రీ దృష్టికోణాన్ని ప్రవేశపెట్టేందుకు కృషిచేసింది. 1984 మొదటి అనువాదం ఎగ్నెస్ స్మెడ్లీ సామాన్యుల సాహసం 1986లో మొదటి నవల సహజ నుంచి ఆమె వివిధ పక్రియలలో అనేక రచనలు చేశారు.